ప్రజా సేవలో

# నా జీవన ప్రస్థానం



వడ్డే శోభనాద్రీశ్వర రావు

# Praja Sevalo Na Jeevana Prasthanam


*Auto Biography by Vadde Sobhanadreswara Rao*

*First Edition :* April 2014

Publisher : **V.V.A. Prasad**
2-48, Shivalayam Street, Vuyyuru - 521 165,
Krishna Dist. (A.P.)
Cell: 9392275777

Printed at : **Sai Likhita Printers**
D.B. Hindi Prachar Sabha Complex,
Khairatabad, Hyderabad - 500 004.
Ph: 040-6554 5979


# అంకితం





నా తల్లితండ్రులు

వడ్డే అంకయ్య మరియు అన్నపూర్ణమ్మ గార్లకు





రాజకీయంగా నాకు స్ఫూర్తిని, ప్రేరణను కలిగించిన

శ్రీ నందమూరి తారక రామారావు గారు, శ్రీ గౌతు లచ్చన్న గార్లకు

# విషయసూచిక


1. స్వగతం .................. 06

2. నా బాల్య జీవితం .................. 10

3. ఎన్నికల రంగంలోకి అడుగు .................. 30

4. 1977 ఎనిమిదవ లోక్ సభ ఎన్నికల్లో బందరు నుండి పోటీ .................. 42

5. ఉయ్యూరు శాసన సభ్యునిగా .................. 49

6. ఎనిమిదవ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక .................. 80

7. పదవ లోక్‌సభలో సభ్యునిగా .................. 124

8. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా.. .................. 160

9. మైలవరం శాసన సభ్యునిగా - వ్యవసాయ మంత్రిగా .................. 176

10. సహకరించిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు .................. 220

11. విదేశీ పర్యటనలు .................. 226

12. సామాజిక సేవ .................. 235

13. ప్రచురించిన పుస్తకములు .................. 243

14. నేను - నా కుటుంబం .................. 298



నా జీవన గమనంలో ఎదురైన
వేలాది పరిచయాలు, విస్తృత
అనుభవాలు, భిన్న ప్రవృత్తులు,
మంత్ర ముగ్ధుడిని చేసిన
ఆత్మీయతలు, ఎక్కడెక్కడో వున్న
వారి ప్రేమానురాగాలు, నేను
జీవితంలోని ప్రతిరోజునూ ఒక
అనిర్వచనీయ అనుభవంగా
మలచుకొన్న విధానం, సమాజ
గమనాన్ని సామాన్య ప్రజలకు
అనుగుణంగా మార్చితీరాలన్న
నా దృఢ సంకల్పం నిరంతర
పోరాటానికి అక్షర రూపం
నా ఈ జీవన ప్రస్థానం

# స్వగతం

ఇంజనీరింగు విద్య పూర్తి చేసి నిజ సమాజంలోకి అడుగిడే సమయంలో, ఆనాటి యువకులందరూ ఎదుర్కొనే సందిగ్ధాన్నే నేనూ ఎదుర్కొన్నాను. ఇప్పుడేం చేయాలి? ఏదైనా మంచి పరిశ్రమను ప్రారంభించాలా? వ్యాపారాన్ని చేపట్టాలా? పెద్ద ఎత్తున వ్యవసాయం చేయాలా? సంపన్న కుటుంబానికి చెందిన నాకు ఏదైనా సులభ సాధ్యమే. మన సమాజంలో 99 శాతం మంది తమకు మంచి భవిష్యత్తు లభించాలని, తమ సంపదను అనేక రెట్లు పెంచుకోవాలని, తమ కుటుంబానికి పూర్తి భద్రత కలిపించాలని మాత్రమే ఆలోచిస్తారు. అందుకు అనుగుణమైన జీవన వ్యాసంగాన్ని ఎంచుకొంటారు.

కాని నేను ఈ 99 శాతానికి చెందిన వ్యక్తిని కాను. మిగిలిన ఒక శాతం వారి లాగా ఈ సమాజానికి నేనేం చేయాలి? చుట్టూ ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి నేనెలా కృషి చేయాలి? నా ప్రయత్నం ద్వారా నేటి సమాజంలో మంచి మార్పు ఎలా తేవాలి? జీవితంలో అనేక ఒడిదుడుకులు, అనిశ్చితి, ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా తోటి వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయడమే నా జీవన పథ నిర్దేశనగా నేను అప్పుడు ఎంచుకొన్నాను. అప్పటి నుండి నేను దశాబ్దం క్రితం రాజకీయాల నుండి విరమించాలని నిర్ణయించుకొనే వరకూ నా జీవన గమనాన్ని నేను అభిలషించిన రీతిలోనే కొనసాగించాను.

1970 దశకం మొదటి భాగంలో అధికారం కోసం ఇందిరాగాంధీ దేశంలో అనేక అవకతవక విధానాలకు అంకురార్పణ చేసి, దేశ ప్రగతికి తీవ్ర విఘాతాన్ని కలిగించడాన్ని, దేశ ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చడాన్ని నేను జీర్ణించుకోలేకపోయాను. ఖచ్చితంగా ఆ సమయంలోనే, నా భావాలతో పూర్తిగా ఏకీభవించే, నా ఆలోచనా ధోరణకి అనుగుణమైన సైద్ధాంతిక ప్రతిపత్తిని కలిగి ఉన్న స్వతంత్ర పార్టీ వైపుకు నేను సహజంగానే ఆకర్షితుడనయ్యాను.

రాజకీయ పార్టీలో పనిచేయడమంటే విధానాలు, సిద్ధాంతాల మంచి చెడులను గురించి చర్చించడమే కాదు. ఎక్కువమంది ప్రజలకు సన్నిహితం కావడం, వారిని కూడా మనతో నడిపించడమనే అంశం త్వరలోనే నాకు అర్థమయ్యింది. తరువాత ఉయ్యూరులో పోటీ చేసినప్పుడు ప్రజాభిమానం పొంది ఎన్నికలలో గెలుపొందడమే రాజకీయాలలో రాణించడానికి గీటు రాయి అని, విధానాలు, సిద్ధాంతాలకు దైనందిన

ప్రజాజీవితంలోఅంతటి ప్రాధాన్యత లేదని అవగతమయ్యింది. నా భావాలు, అభిప్రాయాలు, విధానాలు, సిద్ధాంతాల విషయంలో ప్రజల ఆలోచనల్లో మార్పు తెచ్చి నూతన సమాజాన్ని ఏర్పరచుకోవచ్చున్న నా అవగాహన మౌలిక మార్పుకు లోనయ్యింది.

సమాజంలో మార్పుకు రాజకీయ పార్టీని సాధనంగా వినియోగించుకోవడమే తప్ప మరో మార్గం లేదని, రాజకీయ పార్టీ విధానాలను పెద్దగా పట్టించుకోకుండా, స్థానిక నాయకత్వం కృషితోనే ప్రజలు ఆయా పార్టీల పట్ల అభిమానం కలిగి ఉంటారని, 1978లో శాసన సభ్యునిగా ఎంపికయిన తరువాత నాకు పూర్తిగా అవగతమయ్యింది. ఇక ప్రజల వ్యక్తిగత అవసరాలలో, సామాజిక అవసరాలలో పాలు పంచుకోవడం, అవి తీర్చడానికి అన్ని విధాలా ప్రయత్నించడం నా రాజకీయ జీవితంగా మారిపోయింది. ప్రతి గ్రామంలో, ప్రజలతో మమేకం కావడం, వారికి అధికార యంత్రాంగానికి మధ్య వారధిలా నిలవడం నాకు నిత్యకృత్యమైపోయింది.

ఒక పని కాదు. ఒకరి పనికాదు. వందలాదిమంది, వేలాది పనులు. అసలు నేనేం చేస్తున్నానని సింహావలోకనం చేసుకోవడానికి కూడా తీరిక లభించని స్థితి. శాసనసభ్యునిగా, లోక్‌సభ సభ్యునిగా, మంత్రిగా బాధ్యతలను నెరవేర్చడానికి, నేను విశ్వసించే సిద్ధాంతాలను అన్ని కోణాల నుండి వ్యాపింపచేయడానికి, అందరితో అంగీకరింపజేయడానికి నిరంతరం కృషి కొనసాగాలి. నేను ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలలో మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వ అధికారులను ఒప్పించాలి. అంగీకరింపజేయాలి. ప్రజల నుండి వచ్చే విజ్ఞప్తుల అమలు కోసం కృషి చేయాలి.


ప్రజా సేవలోనే నా జీవితాన్ని గడపాలని యవ్వనప్రాయంలో నిర్ణయించుకొన్నప్పుడు, రాజకీయాలలో పూర్తిగా నిమగ్నమైపోయి, సమాజ శ్రేయస్సుకు మొత్తం జీవితాన్ని ఇలా అంకితం చేయాల్సి ఉంటుందని నేను ఊహించలేదు. ఒకసారి వెనుతిరిగి, నా 30 సంవత్సరాల రాజకీయ జీవితం ఎలా సాగిందని సమీక్షించుకొంటే, ఎంతో ఆశ్చర్యం, భయం కలుగుతాయి.

రోజూ నిద్రించే అయిదారుగంటల సమయం తప్ప మరెప్పుడూ తీరిక వుండేది కాదు. ఎవరో ఒకరు లేకుండా ఖాళీ అసలు దొరికేది కాదు. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడానికి, వారికేం కావాలో ఆలోచించడానికి అసలు వీలుపడేదికాదు.

అతివేగంతో పయనించే రైలులా ఆ సమయమంతా గడిచిపోయింది. ఒక్కో స్టేషన్‌లో ఆగడం, వెంటనే బయల్దేరడం, గమ్యానికి జేరినా కొద్దిసేపట్లో వెంటనే తిరిగి బయల్దేరడం, తిరిగి అదే వేగం. నేను నడిపిన జీవితాన్ని అభివర్ణించడానికి అంతకుమించిన ఉదాహరణ మరొకటి లభించడం లేదు. ఇలా గడపడం ఆదర్శప్రాయమనిగాని, అందరూ అలా వుండాలనిగాని నేను చెప్పబోను. కేవలం నా పయనం అలా సాగిందనిమాత్రమే వివరిస్తున్నాను. నా గుండెలోని రక్తనాళాల్లో 60 శాతం పూడికలు ఉన్నాయని, వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్యనిపుణులు అనేకసార్లు హెచ్చరించినా, ఆ వైద్యం చేయించుకునే తీరిక నాకు రాజకీయాల నుండి విరమించిన తరువాత మాత్రమే లభ్యమయ్యిందని గుర్తు చేసుకుంటే నాక్కూడా ఆశ్చర్యం అనిపిస్తుంది. భయంగొల్పుతుంది.

నా రాజకీయ జీవితం నాకేం మిగిల్చిందని ఒక్కసారి బేరీజు వేసుకొంటే అన్నీ అత్యంత విభ్రాంతికరమైన మహాసంతోషదాయకమైన అంశాలే. నాకు వారసత్వంగా లభించిన ఆస్తిలొ సగభాగం కూడా నా పిల్లలకు వారసత్వ సంపదగా అందించలేకపోయాను. అసలా అంశాన్ని గురించి నేనేనాడూ ఆలోచించలేదు. నాభార్య, పిల్లలతో ఎక్కువ సమయం గడపలేకపోయాను. అందుకు చింతించిందిలేదు. నా కుటుంబ సభ్యులు గాని, ఇతర సన్నిహితులుగాని, నా వలన వారు ఆశించిన ప్రయోజనం కలగలేదని చెబుతారు. అది వాస్తవం. అందుకు వారు నన్ను మన్నించాలి. ఈ సుదీర్ఘ పయనంలో వేలాది మందితో నాకు ఆత్మీయతానుబంధం ఏర్పడింది. నా ఎన్నికలను తమ స్వంత ఎన్నికలుగా భావించి, తమ శక్తిసామర్థ్యాలు ధారపోసి నన్ను గెలిపించడానికి వేలాదిమంది కృషి చేసేవారు. ఎక్కడకు వెళ్ళినా ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలతో పలుకరించేవారు. అందరూ నన్నొక కుటుంబ సభ్యునిగా అభిమానించేవారు. ఆదరించేవారు. ప్రజలతో పెనవేసుకొన్న ఈ ఆత్మీయానుబంధమే నా స్వీయ అవసరాలు మరచిపోయేలా చేసింది. అనేక పుస్తకాలు, ప్రసంగాలు, చట్టసభలలో చర్చల ద్వారా నేను విశ్వసించే సిద్ధాంతాలకు అమిత ప్రాచుర్యం కలిగించగలిగాను. చరిత్ర పరిణామ క్రమంలో నేను సైతం అర్థవంతమైన పాత్ర పోషించానని, సమాజ ఉన్నతికి నేను చేయదగిన కృషి నేను చేశానని, పరిపూర్ణంగా విశ్వసిస్తూ నిండు మనస్సుతో, పూర్తి సంతృప్తితో, సవినయంగా ఈ పుస్తకాన్ని మీకు అందిస్తున్నాను.

❖❖❖



# ప్రజాసేవలో నా జీవన ప్రస్థానం

ఎవరైనా ఎప్పుడైనా జీవితంలో ఎన్నో పనులు చెయ్యాలనుకుంటారు. ఏదేదో సాధించాలనుకుంటారు. ఎన్ని చేసినా అవి వ్యక్తిగతంగా కంటే మన చుట్టూ ఉన్న సమాజానికి ఉపయోగపడితే అదే అసలైన విజయంగా భావించాలి. మన కోసం మాత్రమేగాక మనతోపాటున్న ప్రజలందరికీ ఏదోవిధంగా సాయపడడం ప్రతి మనిషి కర్తవ్యం. ప్రజా జీవితంలో చేసిన సామాజిక సేవే ఆత్మసంతృప్తినిస్తుంది.

ఒక్కోసారి గతంలోకి చూస్తే జీవితంలో కలిగిన అనుభవాలు, సంఘటనలు మనల్ని పలకరిస్తాయి. మనమేం చెయ్యాలనుకున్నామో, మనమేం చేశామో ఒక్కసారి గుర్తుకుతెస్తాయి. ఆ రకమైన భావనలు కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తాయి. అవన్నీ మధురస్మృతులే. ఆ రోజుల్ని తలచుకుంటే ఎంతో ఉత్సాహం కలుగుతుంది. అందుకే నా జీవితంలో జరిగిన విషయాల్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకోవాలని భావించి ప్రారంభించిందే ఈ కథనం... గతం నుంచి ఇప్పటి వరకు ఈ జీవిత ప్రయాణం ...

# నా బాల్య జీవితం

***కృష్ణా జిల్లా ప్రాశస్త్యత :***

**నా** బాల్యమంతా కృష్ణాజిల్లాలోనే గడిచింది. రాష్ట్రంలో అన్నపూర్ణగా పేరుగాంచిన కృష్ణాజిల్లా తరతరాలుగా ఎంతగానో ప్రశస్తి పొందింది. కృష్ణమ్మ ఒడిలో... గలగలల సవ్వడిలో పచ్చని పంట పొలాల మధ్య జనజీవితం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. అన్ని రంగాల్లోనూ అనేకమంది ప్రముఖులు ప్రఖ్యాతి పొందారు. కళ, సాంస్కృతిక రంగాల్లో పేరెన్నికగన్న వారిలో నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కైకాల సత్యనారాయణ, గూడవల్లి రామబ్రహ్మం, ఎస్.వి. రంగారావు, సావిత్రి, కన్నాంబ, పరుచూరి బ్రదర్స్, చంద్రమోహన్, గుమ్మడి గోపాలకృష్ణ, కనగాల కుటుంబరావు, మున్నగువారు సినిమారంగంలోను, వేదాంతం జగన్నాథశర్మ, వేదాంతం సత్యనారాయణశర్మ మున్నగువారు కూచిపూడి నాట్యరంగంలోను, ఇంకా చిత్రలేఖనం, పౌరాణిక నాటక రంగం వంటి విషయాల్లో ఎందరో ప్రముఖులు పేరుగాంచారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యగారు, అయ్యదేవర కాళేశ్వరరావు, కోపల్లె హనుమంతరావు, గొట్టిపాటి వెంకటసుబ్బయ్య, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, మండలి వెంకట కృష్ణారావు, ఎం.ఆర్. అప్పారావు, రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్, ముక్త్యాల రాజా, ఎస్.వి.ఆర్.జి.కె.ఎమ్. ప్రసాద్, ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, కాకాని వెంకటరత్నం, పిన్నమనేని కోటేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని రామస్వామి చౌదరి, డాక్టర్ కె.ఎల్. రావు, నార్ల తాతారావు, నార్ల వెంకటేశ్వరరావు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, చంద్ర రాజేశ్వరరావు, సుంకర సత్యనారాయణ మున్నగువారంతా కృష్ణాజిల్లా వారే. భారతదేశంలో అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టులో కృష్ణాజిల్లాకు చెందిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ గారు, జస్టిస్ నూతలపాటి వెంకటరమణ గార్లు న్యాయమూర్తులుగా ఉండటం ఎంతో గర్వకారణం.

ఉయ్యూరులోని సి.బి.ఎం. ఆస్పత్రిలో 1943 అక్టోబర్ 21న వడ్డే అంకయ్య, శ్రీమతి అన్నపూర్ణమ్మల మొదటి సంతానంగా జన్మించాను. మా పితామహులు వడ్డే శోభనాద్రిగారు, నాయనమ్మ శ్రీరామమ్మ. స్వగ్రామం యలమర్రు. మాతామహులు వెల్లంకి కుటుంబయ్యగారు, అమ్మమ్మ నాగేశ్వరమ్మ. వారిది కలువపాముల గ్రామం. శోభనాద్రిగారి తండ్రి శ్రీరాములుగారు, తల్లి పున్నమ్మగారు. ఆయన యలమర్రు గ్రామ పెత్తందారు. శోభనాద్రిగారి చిన్నవయస్సులోనే ఆయన తండ్రిగారు కాలధర్మం చెందడంతో

గ్రామ బాధ్యతలు మా తాతగారి భుజస్కందాలపై పడ్డాయి. యలమర్రులో వడ్డే ఇంటిపేరు గలవారి కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. కొడాలి, సిరిపురపు, అన్నే, మన్నే, అట్లూరి, సుంకర, బొప్పన, చెరుకూరి, గుమ్మడి, కాజ మున్నగు ఇంటిపేర్లుగల వారి కుటుంబాలు కూడా చాలా ఉన్నాయి. బొప్పన హనుమంతరావు, డా॥ కాజ కృష్ణమూర్తి, అన్నే బాబూరావు, కె.వి.నారాయణరావు గార్లు శాసనసభ్యులుగా పనిచేశారు. డా॥ సిరిపురపు వినయ్‌బాబు, డా॥ వెనిగళ్ల చంద్రమోహన్, డా॥ సి.వి. రత్నం, సి.వి.ఆంజనేయులు, డా॥ కె.ఎన్.రావు, మండవ బోస్, సిరిపురపు కుటుంబరావు, సుంకర చంద్రమౌళీశ్వర రావు, కొడాలి వెంకటరత్నం, అన్నే నరసింహారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు మున్నగు వారే కాక అమెరికాలో డా॥ కాజ రామారావు గారితో పాటు మరెందరో ఉన్నత విద్యావంతులు ఈ గ్రామానికి చెందినవారే. ప్రముఖ సినీనటుడు శ్రీహరి గారిది కూడా యలమర్రే. కృష్ణాజిల్లాలో పళనియప్పన్ అనే పోలీసు సూపరింటెండెంట్ సూచనల మేరకు మాధవరావు అనే పోలీసు అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో యలమర్రు, కాటూరు గ్రామాల్లో కమ్యూనిస్టు నాయకులు, సానుభూతి పరులనే గాక వారికి అనుమానం వచ్చిన వ్యక్తులను కూడా నగ్నంగా ఆ రెండు గ్రామాల్లో నడిపించిన బాధాకరమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గరికపాటి కృష్ణారావు, మోటూరి సీతారామబ్రహ్మం, సుంకర చంద్రమౌళీశ్వరరావు మున్నగు కమ్యూనిస్టుపార్టీ నాయకులు ఉండేవారు.

## ***బల్లిపర్రు లాకు నిర్మింపచేసిన వడ్డే శోభనాద్రిగారు***

శోభనాద్రిగారికి ఇరిగేషన్‌శాఖ, రెవెన్యూ శాఖల్లోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలుండేవి. యలమర్రు సమీప గ్రామాల్లో వేలాది ఎకరాలకు పంటకాలువలు లేవు. ఆ పరిస్థితుల్లో ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడి పామర్రు సమీపంలోని బల్లిపర్రు గ్రామం వద్ద పుల్లేరు కాలువపై రెగ్యులేటర్ నిర్మాణం చేయించారు. యలమర్రు, జమీబల్లేపల్లి, పెద్దమద్దాలి, మర్రివాడ, గోపువానిపాలెం, పామర్రు మున్నగు గ్రామాలలో 70 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సదుపాయం ఏర్పడింది.

అప్పట్లో యలమర్రు జమీందారీ గ్రామం. బల్లిపర్రు లాకు కట్టడంవల్ల యలమర్రు గ్రామానికి కూడా కాలువనీటి సదుపాయం కల్పించే అవకాశం ఏర్పడింది. “శోభనాద్రిగారూ! మన గ్రామ భూములకు ఉపయోగపడే విధంగా పుల్లేరు నుంచి కాలువ తవ్వించండి. అందుకయ్యే ఖర్చు నేనిస్తాను” అని జమీందారుగారు అన్నారట. శోభనాద్రిగారు ఈ తవ్వకం పనుల గురించి శ్రీకాకుళంజిల్లా ప్రాంతంవారిని రప్పించి యలమర్రు గ్రామంలో మా తాతగారి మెట్టభూమిలో వారు ఇళ్ళు నిర్మించుకునే అవకాశం



*పుల్లేరు కాల్వపై బ్రిటీష్ వారిచే వడ్డే శోభనాద్రి గారు నిర్మింప చేసిన బల్లిపర్రు లాకు*

కల్పించి కాలువలు తవ్వించారు. జమీందారుగారిని ఖర్చయిన మొత్తాన్ని ఇవ్వమని అడగ్గా, ఆయన "శోభనాద్రిగారూ! యలమర్రులో మా భూములున్నాయిగదా! భూములిస్తాను, రాయించుకోండి!" అన్నారట. అప్పటికే మా తాతగారు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, కోగంటి వెంకట్రామయ్యగార్లతో కలసి రంగాపురం ఎస్టేట్ భూముల్ని కొనివున్నారు. ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీని స్థాపించారు. "ఉన్నప్పుడు డబ్బే ఇద్దురుగాని, నాకు భూములు వద్దులెండి" అని శోభనాద్రిగారు చెప్పారట. ఎన్నో సంవత్సరాలు గడచిపోయినా జమీందారుగారు శోభనాద్రిగారికి డబ్బు ఇవ్వలేదు. ఈయన గట్టిగా అడిగే మనిషికాదు.

శోభనాద్రిగారికి రైతు సమస్యలమీద చక్కటి అవగాహన, ఆసక్తి ఉండేవి. కృష్ణాజిల్లాలోనేగాక అటు పశ్చిమ గోదావరి జిల్లాలో ముళ్ళపూడి తిమ్మరాజు (హరిశ్చంద్రప్రసాద్ గారి తండ్రి) మున్నగు పెద్ద రైతు కుటుంబాలతోను, గుంటూరు జిల్లాలో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి వంటి పెద్ద రైతులతోను పరిచయాలున్నాయి. ఆచార్య రంగాజీ స్థాపించిన రైతుసంఘానికి కొంతకాలం శోభనాద్రిగారు అధ్యక్షుడుగాను, ముక్కామల నాగభూషణంగారు కార్యదర్శిగాను కృషిచేశారు. ఆరోజుల్లో ఒకానొక సమయంలో జనప విత్తనాలను కృత్రిమంగా దాచిపెట్టి అధిక ధరలకు అమ్ముతూ విజయవాడలో ఆలపాటి వెంకటేశ్వరరావు అనే హోల్‌సేల్ వ్యాపారి రైతులకు ఇబ్బంది కలుగజేస్తూవుంటే శోభనాద్రిగారు పోలీసుశాఖతో చెప్పి పట్టించారు. చేతి గడియారాన్ని మా తాతగారికి బహూకరించారు.

ఆరోజుల్లో ఉయ్యూరు నుంచి యలమర్రు మీదుగా గుడివాడకు పడవ ప్రయాణం జరుగుతుండేది. అప్పుడు సిబిఎం హాస్పిటల్ ఉయ్యూరు ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చాలా చక్కని వైద్యసేవల్ని అందిస్తూండేది. ఆ హాస్పిటల్‌లో రోగుల సౌకర్యార్థం మా పితామహులు వడ్డే శోభనాద్రిగారు ఒక గదిని నిర్మించి ఇచ్చారు.

మా పెదనాన్నగారు శ్రీరాములుగారు, మేనత్తగారు అనసూయమ్మగారు. మేనత్తగారి భర్త కొడాలి గోపాలరావుగారు. మాతామహులు వెల్లంకి కుటుంబయ్య గారికి నా మాతృమూర్తి అన్నపూర్ణమ్మగారు ఏకైక కుమార్తె. మా తండ్రిగారైన అంకయ్యగారు చాలా చిన్న వయసులోనే మరణించారు. అందువల్ల నేను, నా సోదరుడు కుటుంబ భాస్కరరావు కలవపాముల గ్రామంలోనే పెరిగాం. మా కుమారుడు వడ్డే వెంకట అంకినీడు ప్రసాద్, కోడలు శ్రీవిద్య. మా కుమార్తె కొడాలి వెంకటలక్ష్మి అన్నపూర్ణ, అల్లుడు మల్లిఖార్జునరావు. మా తమ్ముడి కుమారుడు అంకయ్యచౌదరి ఇంజనీరింగ్ చదివి అమెరికాలో పనిచేస్తున్నాడు. కుమార్తె రాజేశ్వరి, అల్లుడు గారపాటి ప్రసాద్.

శ్రీమతి యలమంచిలి భగవన్నామం, జానకిరామమ్మ, దోనేపూడి సంపూర్ణమ్మ, తులసమ్మ, మా అమ్మ గారు మున్నగు వారు జియ్యర్ స్వామి వారి భక్తులు. చాలా కాలం క్రిందటే కలువపాముల గ్రామంలో రామ కోటి మంటపాన్ని నిర్మాణం చేయించారు. మా అమ్మగారు ఎక్కువ సమయం ఆధ్యాత్మిక చింతనలో గడుపుతూ ఉండేది. ఆవిడ కొంతకాలం క్రితం బాగా అస్వస్థతగా ఉన్నప్పుడు చినజియ్యర్ స్వామి వారు వచ్చి ఆశీర్వదించి వెళ్ళారు. 2013 డిసెంబర్, 22 వ తేదిన కాలం చేసింది. ఆవిడ తరచుగా భావిస్తూ ఉన్నట్లే ధనుర్మాసంలో చనిపోవడం యాధృచ్ఛికం. చినజీయర్‌స్వామి గారి చేతులమీదుగా 30 జనవరి 2014న ఆవిడ పరమపదం కార్యక్రమం నిర్వహించబడటం ఆవిడ చేసుకున్న పూర్వజన్మ సుకృతం.

## ప్రాథమిక విద్య

మా ఇంటి ప్రక్కనే ప్రాథమిక పాఠశాల ఉంది. ఆ స్థలాన్ని ఉయ్యూరు జమీందారుగారు పాఠశాలకోసం ఇచ్చారు. అందులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశాను. 7వ తరగతి వరకు కలువపాములలోని మిడిల్ స్కూలులో చదివాను. ప్రక్కనే కాటూరు గ్రామంలో హైస్కూల్ ఉండుట వలన కలువపాములలో పెద్ద సంఖ్యలో ఉన్నత విద్యను అభ్యసించి మన దేశం లోపల, విదేశాలలో 100 కుటుంబములకు పైగా ఉద్యోగ, వ్యాపార వ్యాపకాలలో స్థిరపడ్డారు. వెల్లంకి రామారావు గారు ఆర్. అండ్. బి చీఫ్ ఇంజనీర్

గా పనిచేశారు. ప్రొ॥ వి.వి.సుబ్బారావు ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా చేశారు. డా॥ యలమంచిలి నరసింహారావు, భారతి విజయకుమారి పలువురు డాక్టర్లు, వెల్లంకి సీతారామదాస్, కొడాలి సుబ్బారావు, వెల్లంకి బసవ కుటుంబరావు పలువురు ఇంజనీర్లు ఈ గ్రామం వారే. 8వ తరగతి ఉయ్యూరు జిల్లాపరిషత్ హైస్కూలులోనూ, 9వ తరగతి విజయవాడలోని సి.వి.ఆర్.జి.యమ్.హెచ్. స్కూలులోనూ, 10వ తరగతి ఉయ్యూరు జిల్లాపరిషత్ హైస్కూలులోనూ చదివాను. విజయవాడలో ఉండగా పావురాళ్లను పెంచాను. మేము ఉన్న మేడపైకి పావురాళ్ల గురించి తరచుగా ఎక్కి దిగుతుండేవాణ్ణి. నేను ఎక్కడ పడతానోనని మా తాతగారు భయపడి “ఒరేయ్! పావురాళ్లను తీసివేయ్” అని అంటే నాకు కెమేరా కొనిస్తావా, తీసేస్తానన్నాను. అప్పుడు నన్ను వెంటబెట్టుకుని మూర్తి స్టుడియోకి వెళ్ళి 40రూపాయలతో ఒక ఆగ్ఫా డబ్బా కెమేరాను కొనిచ్చారు. 14 సంవత్సరాల వయసులో యస్.యస్.యల్.సి. పాసయ్యాను.

***<u>కళాశాల విద్య</u>***


1958లో ప్రీ యూనివర్శిటీ మొదటి బ్యాచ్‌లో ఆంధ్రా లయోలా కాలేజీ నుంచి సెకండ్ క్లాస్‌లో పాసయ్యాను. లయోలా కాలేజీ స్థాపన తర్వాత విజయవాడ ఉన్నత విద్యారంగంలో గణనీయమైన పురోగతిని సాధించింది. కాట్రగడ్డ రఘురామయ్యగారు, సూర్యదేవర రామచంద్రరావుగారు, ఫాదర్ దేవయ్య మున్నగు ప్రముఖుల దార్శనికత



వల్ల ఇది సాధ్యమయ్యింది. ఆంధ్ర లయోలా కాలేజీలో చదువుతున్న రోజుల్లో అందంగా, ఆకర్షణీయంగా, ఆరడుగుల ఎత్తుగా ఉండే ఫాదర్ మత్తయ్యాస్ చక్కని క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడానికి అవసరమైన గట్టి పునాదిని ఏర్పరిచారు. ఫాదర్ బాలయ్య, వి.వి.కృష్ణారావు, బసవపున్నయ్య, యార్లగడ్డ రాజగోపాలరావుగార్లతో సన్నిహితంగా మెలిగే అవకాశం కలిగింది. ఆ సంవత్సరమే మా తాతగారు వెల్లంకి కుటుంబయ్యగారు విజయవాడ గుణదలలో మాకోసం ఒక ఇల్లుకూడా నిర్మించారు.

ఇంజనీరింగ్ చదవాలనే కోరిక వ్యక్తం చేసిన నేపథ్యంలో మా తాత గారు నన్ను వెంటబెట్టుకుని కోయంబత్తూరులో వెలగపూడి రామకృష్ణగారి అల్లుడు పి.ఆర్. రామకృష్ణన్ గారి వద్దకు వెంటబెట్టుకుని తీసుకువెళ్ళారు. వారు కోయంబత్తూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థను నడుపుతూ ఉన్నారు. అయితే అప్పట్లో తమిళనాడులోని విద్యార్థులకు మాత్రమే ప్రైవేటు కాలేజీలలో ప్రవేశం పరిమితం చేయబడింది. అందువల్ల గుల్బర్గాలోని శరణ బసవప్ప కాలేజీలో ప్రీ ఇంజనీరింగ్‌లో చేరాను. అప్పట్లో గుల్బర్గా చాలా సాధారణమైన పట్టణం. వెనుకబడిన ప్రాంతం. నేను మరి ముగ్గురు మిత్రులం కలువపాముల నుండి మా వంటవాడిని తీసుకువెళ్ళి వండించుకుంటూ చదువు మీద పెద్దగా దృష్టి సారించలేదు. అప్పటి వరకు ఎక్కడా తప్పని నేను మరుసటి సంవత్సరం మళ్ళీ అదే క్లాసులో చదవ వలసి వస్తుంది అనే న్యూనతా భావంతో నేను ఇక్కడ చదవను, గుడివాడలో బి.యస్.సి. లో చేరతానంటే సరే మంచిది అని నన్ను ఎ.ఎన్.ఆర్. కళాశాలలో బి.ఎస్‌సి.లో చేర్చారు.

ఏ.యఫ్. త్యాగరాజుగారు మా ప్రిన్సిపాల్. ఆయన ఇంగ్లీష్ 'మిల్టన్ ప్యారడైజ్ లాస్ట్' చెబుతూ ఉంటే ఎంతో శ్రావ్యానందముగా ఉండేది. తెలుగు లెక్చరర్ పి. వి. సత్యనారాయణగారి పద్యపఠనం ఎంతో మధురంగా ఉండేది. వి.యస్. కృష్ణగారు ఆంధ్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా ఉండగా గుడివాడ కాలేజీ ప్రారంభించే సమయంలో రూ.50,000 కార్పస్ ఫండ్‌గా డిపాజిట్ చేయవలసిన సందర్భంలో రూ. 17,000 తగ్గితే మా తాత గారు కోలవెన్నులో అడుసుమిల్లి వారి వద్ద అప్పుగా తీసుకుని కాలేజీకి ఇచ్చి ఉన్నారు. కాలేజీని భూషణగుళ్ళ సమీపంలో ఏర్పరిచినందున భూషణగుళ్ళ మరియు పెదపారుపూడి గ్రామస్తులు ఆ మొత్తాన్ని మా తాతగారికి ఇవ్వవలసివున్నప్పటికీ ఇవ్వలేదు.



*గుడివాడ కాలేజీ వ్యవస్థాపకులు శ్రీయుతులు పర్వతనేని వెంకటరత్నం, కాజా వెంకట్రామయ్య, వడ్డే శోభనాద్రి, ఉపద్రష్ట పాపన్న శాస్త్రి, వేములపల్లి రామబ్రహ్మం, ఉప్పలపాటి వీరభద్రరావు, లింగం వెంకట కృష్ణయ్య గార్లు*

అప్పట్లో ఏ.యన్.ఆర్. కళాశాల కమిటీ అధ్యక్షునిగా పర్వతనేని వెంకటరత్నంగారు కార్యదర్శిగా కాజా వెంకటరామయ్య గారు, కోశాధికారిగా అడుసుమిల్లి వీరభద్రరావుగారు చక్కని సేవలందించారు. ఆయన జీవితకాల కమిటీ మెంబరు అందువల్ల నేను నా మిత్రులతో కలసి గేమ్స్ ఫీజు కట్టించుకుంటున్నా కోర్టులు సరిగాలేవు. లైబ్రరీ ఫీజు



*గుడివాడ పాత కాలేజీ భవనము*



*భూషణగుళ్ల వద్ద ఎ.ఎన్.ఆర్. కాలేజీ నూతన భవనము*

కట్టించుకుంటున్నా లైబ్రరీలో సరైన పుస్తకాలు లేవు అని డిమాండ్లు పెట్టినా, సమ్మె నిర్వహించినా, నా విషయంలో ప్రిన్సిపాల్‌గారు ఉదాసీనంగానే వ్యవహరించారు. రెండు సంవత్సరాలు వరుసగా జనరల్ క్యాప్టెన్‌గా ఎన్నికైనాను. ఫైనల్ ఇయర్‌లో అడుసుమిల్లి విశ్వేశ్వరరావుగారి కుమారుడు వేణుగోపాల్ పైన నా మిత్రుడు యలమంచిలి



*యర్లగడ్డ చలమయ్య ఆడిటోరియం*



*కొల్లి లింగయ్య జిమ్నేషియం*



*లైబ్రరీ భవనము*



*ఎ.ఎఫ్. త్యాగరాజు*



*డా॥ వై. వెంకటేశ్వర రావు*

శ్రీరాములును నిలబెట్టి ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆ ఎన్నికలో గెలిపించాను. కె.బి.యస్.కుమార్, గుత్తా గోపాల్‌రావు, వెనిగళ్ళ చంద్రమోహన్, సూరపనేని రాంమోహన్, రంగదాస్ మున్నగువారు నాకు అత్యంత సన్నిహితంగా ఉంటూండేవారు. బి.ఎస్‌సి.చదువుతున్న సమయంలో నేను చదువుకన్నా ఇతర వ్యాపకాలమీద ఎక్కువగా శ్రద్ధ చూపాను. కాలేజీలో రెండు పర్యాయాలు విజయవంతంగా సమ్మెను నిర్వహించాం. మా తాతగారి మరణానంతరం నేను అంగీకరించనప్పటికీ, కళాశాల కమిటీ కార్యదర్శి పర్వతనేని నాగేశ్వరరావుగారి అభ్యర్థన మేరకు పాలకవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నాను.

ఫైనలియర్‌లో తెలుగు, ఇంగ్లీషులలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ, గ్రూపు సబ్జెక్టుల్లో పాస్ కాలేదు. మద్రాసులోని జయంతి ట్యుటోరియల్ కాలేజీలో గ్రూపు సబ్జెక్టుల కోసం చేరాను. గుడివాడ కాలేజీలో ఒక గంట క్లాసుకు వెళ్తే మరొక గంట బయట కాలక్షేపం చేసేవాణ్ని. అలాంటిది జయంతి ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్ జయంతి లక్ష్మీనారాయణగారు వరుసగా నాలుగు గంటలపాటు క్లాసులు నడిపినప్పటికీ నేను శ్రద్ధగా కూర్చుని విని సప్లిమెంటరీ పరీక్షల్లో మూడు సబ్జెక్టుల్లో పాసయ్యాను. జయంతి ట్యుటోరియల్ కాలేజీ నా జీవితాన్ని ఒక మలుపు తిప్పింది.

### ***బెంగళూరు ఎమ్.యస్. రామయ్య ఇంజనీరింగ్ కాలేజీలో విద్యాభ్యాసం***

1962 మే 17 వ తేదీన వేసవికాలంలో నాకు మానికొండ వాస్తవ్యులు గోగినేని వెంకటరత్నంగారి కుమారుడైన రామమోహనరావుగారి కుమార్తె బసవరాజ్యంతో వివాహం జరిగింది. గోగినేని వెంకటరత్నంగారు రంగాజీ అభిమాని. నేను ఇంజనీరింగ్ కాలేజీలో చేరతానని మా తాతగారు వడ్డే శోభనాద్రిగారితో చెప్పాను. “ఇదివరకే ఒకసారి గుల్బర్గాలో ఇంజనీరింగ్ కాలేజీలో చేరి మానేసివచ్చావు. ఇప్పుడు పెళ్లి కూడా అయిన తర్వాత మళ్ళీ ఇంజనీరింగ్ చదువుతానంటున్నావు. ఇది అర్థంలేని విషయం” అన్నారు. “కాదు తాతయ్యా! నాకు చదవాలని గట్టిగా అభిప్రాయం కలిగింది, చదువుతాను” అని చెప్పినప్పుడు, నన్ను వెంటబెట్టుకుని బెంగుళూరులోని ఎం.ఎస్.రామయ్య ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించారు. రాజాజీనగర్ నాల్గవ బ్లాకులో ఇండిపెండెంట్ హౌస్ తీసుకుని నాలుగు సంవత్సరాలు కాలేజీకి రెగ్యులర్‌గా అటెండవుతూ ఏ సంవత్సరంలోనూ ఒక్క సబ్జెక్టులో కూడా తప్పకుండా చివరి సంవత్సరం 1967లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. యం. నారాయణ ప్రసాద్, వై. బుచ్చిబాబు, వై. నారాయణరావు, కె. జగన్మోహనరావు, శరత్‌చంద్ర, సి.కె.ఆర్. ప్రసాద్, కె.యస్.డి. నాగేశ్వరరావు, గోపీచంద్ మున్నగు వారు కూడా రాజాజి నగర్‌లో వుంటూవుండేవారు.



*బెంగుళూరులోని ఎమ్.ఎస్. రామయ్య ఇంజనీరింగ్ కాలేజీ*

ఎమ్.యస్.రామయ్య శరావతి ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టర్‌గా పనిచేసి బాగా ఆర్జించారు. బెంగుళూరులో టాటా ఇన్‌స్టిట్యూట్‌కు వెనుక పక్కన చాలా పెద్ద వైశాల్యంగల భూమిని కొని అందులో ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించారు. దానికి సమీపంలో 'గోకుల' అనే రెసిడెన్షియల్ కాలనీని నిర్మించారు. ఆయన జీవించినంతకాలం ఆయన సంస్థల్లో తాపీపని జరుగుతూనే ఉండేది. అనంతర కాలంలో ఒక మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్, ఫార్మసీ, లా కాలేజీల వంటి అనేక సంస్థలు ఇక్కడ ప్రారంభించబడ్డాయి. నా సహాధ్యాయి ఎం.యస్.సి. బోస్ దీర్ఘకాలం బొంబాయిలోని ఐ.ఐ.టి.లో పనిచేసి ఇటీవలే విజ్ఞాన్ యూనివర్శిటీకి వైస్ చాన్సలర్‌గా నియమితులయ్యారు. నా సోదరుడు మలినేని నారాయణ ప్రసాద్ విజయవాడలో ప్రముఖ ఎలక్ట్రికల్ వ్యాపార సంస్థను నిర్వహిస్తున్నారు. మరొక సహాధ్యాయి వై. గోపీచంద్ గుడ్లవల్లేరులో పాలిటెక్నిక్‌ను బాగా అభివృద్ధి చేశారు. రామయ్య కాలేజీలో ఎన్. వెంకటకృష్ణయ్యగారు సివిల్ శాఖాధిపతిగా ఉన్నారు. చాలా చక్కగా బోధిస్తూండేవారు. ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.యల్.రావుగారు రచించిన "రిఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ " గ్రంథం మాకెంతో ఉపయోగపడింది. ఫైనల్ ఇయర్‌లో ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌ను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా ఎంచుకున్నాను. ప్రీ ఫైనల్‌లో దక్షిణ భారతదేశ పర్యటనకు వెళ్లాం. అనేక చారిత్రక పట్టణాలు, పుణ్యక్షేత్రాలతోపాటు కోయంబత్తూరు నగరాన్నికూడా సందర్శించాం. జి.డి. నాయుడుగారి టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా

సందర్శించాం. జి.డి. నాయుడుగారు గొప్ప మేధావి. యు.యమ్.యస్. రేడియోల తయారీతోపాటు పెద్దసంఖ్యలో బస్సులుకూడా నడిపిస్తూండేవారు. అప్పట్లోనే అతి తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో గృహనిర్మాణం చేపట్టవచ్చునని కేంద్ర ప్రభుత్వానికి ఎంతో విలువైన సూచనను చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరం. ఫైనలియర్‌లో ఉత్తర భారతదేశ పర్యటనకు తీసుకువెళ్లారు. అనేక ముఖ్య పట్టణాల్ని సందర్శించాం.

మా తండ్రిగారు అంకయ్యగారికి చదువుపట్ల ఎంతమాత్రం ఆసక్తి ఉండేదికాదట. కానీ వ్యవసాయమంటే విపరీతమైన శ్రద్ధాసక్తులు ఉండేవి. బీహార్‌లోని సోనేపూర్ సంతనుంచి మంచి గుర్రాన్ని కొనితీసుకొచ్చారు. ఆరోజుల్లో ఇంకా పెద్దగా చిన్నకార్లు వాడుకలో లేవు. దాదాపు 27 సంవత్సరాల వయసులోపే టి.బి.తో వారు స్వర్గస్తులయ్యారు. నాకు అప్పటికి నాలుగు సంవత్సరాలు. మా తమ్ముడికి రెండు సంవత్సరాలు. మా అమ్మగారు మా మాతామహులకు ఒక్కతే కుమార్తె అయినందువల్ల నా బాల్యమంతా కలువపాముల గ్రామంలోనే గడిచింది. మా తాతగారు వెల్లంకి కుటుంబయ్యగారు మంచి వ్యవసాయదారుడు. కలవపాముల గ్రామంలో మిడిల్ స్కూల్, ప్రక్క గ్రామమైన కాటూరులో హైస్కూలు ఉండడంవల్ల మా గ్రామంలో చాలామంది ఉన్నత విద్యను అభ్యసించి గణనీయమైన ప్రగతిని సాధించారు. చాలా పెద్దసంఖ్యలో అమెరికాలో వివిధ రంగాల్లో పనిచేస్తూవున్నారు. వెల్లంకి పూర్ణచంద్రరావుగారు స్వాతంత్ర్య సమరయోధులు. అఖిల భారత చార్టర్డ్ ఎకౌంటెంట్స్ సంఘం అధ్యక్షుడిగా కొన్ని సంవత్సరాలు పనిచేసిన ప్రముఖులు, బ్రహ్మయ్య&కో సంస్థను స్థాపించిన పర్వతనేని బ్రహ్మయ్యగారి అత్తవారిది మా కలువపాముల గ్రామం. ఆయన స్వగ్రామం గుడివాడ సమీపంలోని నూజెళ్ళ గ్రామం.

నా తమ్ముడు కుటుంబ భాస్కరరావును మా మాతామహులు దత్తత తీసుకున్నారు. మా పెదనాన్నగారికి ముగ్గురూ మగపిల్లలే. పెద్దవాడు డాక్టర్ సత్యసాయిప్రసాద్, రెండవవాడు శివరామప్రసాద్, మూడోవాడు హరిబాబు.

బెంగుళూరులో ఉన్నప్పుడే మా అమ్మాయి వెంకటలక్ష్మీ అన్నపూర్ణ సెయింట్ మార్త ఆసుపత్రిలో 1965 జూన్ 11న జన్మించింది. నా కుమారుడు వెంకట అంకినీడుప్రసాద్ 1967 జనవరి 14న ఉయ్యూరు సి.బి.ఎం. ఆసుపత్రిలో జన్మించాడు. మా మాతామహులు కుటుంబయ్యగారు మంచి శ్రద్ధతో వ్యవసాయం చేయించేవారు. మా అమ్మమ్మ నాగేశ్వరమ్మగారు కష్టజీవి. ఉయ్యూరులో నా వాటాకు వచ్చిన వ్యవసాయ

భూమిని కొద్దికాలంపాటు సాగుచేసి, ఆ తర్వాత ఏదైనా ఉద్యోగానికో, వ్యాపారానికో వెళ్లాలనే సంకల్పంతో ఉయ్యూరులో కాపురం పెట్టాను.

## ప్రజాబంధు వడ్డే శోభనాద్రి

వడ్డే శోభనాద్రిగారు అత్యంత నిరాడంబరంగా జీవించేవారు. ముతక ఖద్దరు బట్టలు ధరించేవారు. ఎప్పుడూ నడకే. సాధారణంగా రిక్షా ఎక్కేవారుకాదు. అనేక గ్రామాల్లో ప్రజలు తగాదాలు పడకుండా, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని కోరుకునేవారు. ఎక్కడన్నా గ్రామాల్లో తగాదాలు పడితే, కొట్లాటలు జరిగితే ఏదో ఒక పక్షంవారు ఆయన వద్దకు వచ్చి సమాచారం ఇస్తే వెళ్ళి ఉభయులను కూర్చోపెట్టి విషయాలను తెలుసుకుని సాధ్యమైనంతమేరకు తగాదాలను సౌమ్యంగా పరిష్కరిస్తూండేవారు. అలాగే భార్యాభర్తలు విడిపోయినాగానీ, లేక మనస్పర్థలు వచ్చి విడిపోవడానికి సిద్ధంగా ఉన్నాగానీ ఆయనకు తెలిస్తే ఓర్పుగా వారిరువురితో మాట్లాడి వీలైనంతవరకు కలసి జీవించేవిధంగా ప్రయత్నిస్తూండేవారు. వంద ఎకరాల వ్యవసాయంకోసం ఉయ్యూరు, కడవకొల్లు, మద్రివాడ, యలమర్రు గ్రామాల్లో ఎక్కడికక్కడ పనిచేయించే నిగామానులు ఉంటూవుండగా శోభనాద్రిగారు ఎక్కువ సమయం తగాదాల పరిష్కారానికో, భార్యాభర్తల్ని కలపడానికో వెచ్చిస్తూండేవారు. అక్కినేని నాగేశ్వరరావుగారు కొద్దిగా దూరపు బంధువవుతారు. నాగేశ్వరరావుగారిని ప్రముఖ సినీదర్శకులు గూడవల్లి రామబ్రహ్మంగారి సినిమాలో ప్రవేశపెట్టడంలో మా తాతగారి పాత్రకూడా కొంతవుంది.

## పదివేలు యిస్తావా సిగరెట్లు మానేస్తాను

నేను రోజుకు 4 లేదా 5 పెట్టెల సిగరెట్లు కాలుస్తూ ఉండేవాడిని. ఢిల్లీలో మాయాబజార్‌లో సెకండ్‌హ్యాండ్ డీజిల్ ఇంజన్‌ను తెచ్చి నా కారుకు అమర్చేందుకు మా తాతగారిని రూ. పదివేలు ఇవ్వమని అడుగగా, ఇస్తానుకానీ నీవు సిగరెట్లు మానేస్తావా అని అడిగారు. మా తండ్రిగారు అంకయ్య గారు చిన్న వయస్సులోనే క్షయ వ్యాధితో చనిపోయారు. అప్పటికి క్షయ నివారణకు బలమైన మందులు వచ్చి వుండలేదు. అలాగే తాతయ్యా అన్నాను. కానీ మానలేదు. మా తాత గారు వంద సంవత్సరములు జీవిస్తానని గట్టి విశ్వాసంతో ఉండేవారు. అయితే 1980లో దాదాపు 95 సంవత్సరాల వయస్సులో ఆయన చనిపోయిన దరిమిలా అస్తికలను గంగానదిలో కలిపేందుకు అలహాబాద్ వెళ్ళినప్పుడు తాతగారికి ఇచ్చినమాట ఇప్పటినుంచైనా అమలుచేద్దాం అని నిర్ణయించుకుని అప్పటినుంచి సిగరెట్టు పూర్తిగా మానివేయడం జరిగింది.

## ఆసక్తి ప్రేరేపించిన రాజకీయాలు

కళాశాల విద్యాభ్యాసం కాలంలోనే నాకు రాజకీయ విషయాలంటే ఆసక్తి ఉండేది. చిన్నప్పటి నుంచి పత్రికలు చదివేవాణ్ని. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లోని ముఖ్యుల పేర్లను గుర్తుంచుకునేవాణ్ని. అప్పట్లో గుడివాడ కాలేజీలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న మా బంధువు చలసాని వెంకట సుబ్బారావుగారితో అన్ని విషయాలూ చర్చిస్తుండేవాణ్ని.

ఆ రోజుల్లో ప్రముఖ జర్నలిస్టు నార్ల వెంకటేశ్వరరావుగారు ఆంధ్రప్రభ దినపత్రిక నుంచి వైదొలగిన తరుణంలో ఆయనతో ఒక దినపత్రికను నడిపించాలనే భావనతో చల్లపల్లి రాజాగారు, ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్‌గారు, జాగర్లమూడి చంద్రమౌళి గారు, వడ్డే శోభనాద్రిగారు లాంటి మరెందరో ప్రముఖులు కలసి కె.ఎల్.ఎన్.ప్రసాద్‌గారి సారథ్యంలో ఆంధ్ర ప్రింటర్స్ సంస్థను నెలకొల్పి ఆంధ్రజ్యోతి దినపత్రికను ప్రచురించడం ప్రారంభించారు. ఆ పత్రిక ఆనాడు గ్రామీణ ప్రాంతాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చే ప్రముఖుల ప్రసంగాల్ని, సంఘటనల్ని చదివేవాణ్ని. జవహర్‌లాల్ నెహ్రూగారి హయాంలో ఆవడిలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో భారతదేశంలో సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని తీర్మానించిన సందర్భంగా రైతాంగ నాయకులు ఆచార్య ఎన్.జి.రంగా వ్యతిరేకించిన ఉదంతాన్ని, ఆ తర్వాత సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తూ, సోవియట్ రష్యాలో సహకార వ్యవసాయం వైఫల్యం చెందిన విషయాన్ని, స్టాలిన్ హయాంలో లక్షలాది మంది రైతులను అమానుషంగా చంపించిన ఉదంతాలను తెలియపరుస్తూ చేసిన ఆయన ప్రసంగాల్ని ఆ పత్రికలో చదవడంవల్ల రంగాగారి పట్ల అభిమానం పెరిగింది.

ఉత్తర భారతదేశంలో ప్రముఖ రైతాంగనేత చౌధురి చరణ్‌సింగ్‌గారు కూడా సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకించారు. మన రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండికూడా రైతు నాయకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు వ్యతిరేకించారు. వెనుకబడిన వర్గాల నాయకుడు గౌతు లచ్చన్నగారు, పి. రాజగోపాలనాయుడుగారు, మంచి వక్తలైన సుంకర సత్యనారాయణ, పసుపులేటి కోటేశ్వరరావు, ఎన్. వీరాచారి మున్నగువారంతా రంగాజీ నాయకత్వంలో సహకార వ్యవసాయానికి వ్యతిరేకంగా బలమైన స్థాయిలో ప్రచారం చేశారు.

## స్వతంత్ర పార్టీ ఆవిర్భావం

జవహర్ లాల్ నెహ్రూగారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ధనికులు, పేదల మధ్య అంతరాలు పెంచుతాయని, లైసెన్స్–పర్మిట్–కోటా



*స్వతంత్ర పార్టీ అవిర్భావం సందర్భంగా చెన్నైలో రాజాజీ, ఎన్.జి. రంగా, కె.యమ్. మున్షీ యమ్.ఆర్. మసానీ, లచ్చన్న, ఆర్.ఎన్. సింగ్‌దేవ్, బెజవాడ రామచంద్ర రెడ్డి, దహ్యాబాయ్ పటేల్, బానుప్రతాప్ సింగ్, పి.కె. దేవ్ ప్రభృతులు*

విధానాల వల్ల అవినీతి పెరిగిపోతూవుందని, కనుక కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పరచాలనే ఉద్దేశంతో రాజగోపాలాచారిగారి సలహాతో ఆచార్య ఎన్.జి. రంగా అధ్యక్షులుగా, మినూ మసాని ప్రధాన కార్యదర్శిగా స్వతంత్ర పార్టీ ఏర్పడింది. రాజాజీ నిష్కలంక దేశభక్తుడు హెూసూరులో లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తూ ఉండేవారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు ఆర్జించారు. 1920 ప్రాంతంలోనే నెలకు 1000 రూపాయలు ఆదాయం వస్తూ ఉండేదట. దేశ స్వాతంత్ర పోరాట సమయంలో గాంధీజీ పిలుపును అనుసరించి ప్రజలనుండి విరాళములు సేకరించు సందర్భంలో తాను నివాసముంటున్న పెద్ద బంగళాను దాన పత్రం వ్రాసి ఇచ్చివేసిన త్యాగి. రాజాజీ భార్య తన వంటి మీద నగలంటినీ స్వరాజ్య నిధికి ఇచ్చి వేసింది. అస్ప్రుశ్యత నివారణకు, హరిజనుల దేవాలయ ప్రవేశం కొరకు, మద్యపాన నిషేదం కొరకు రాజాజి తీవ్రంగా కృషి చేసారు. రైతులపై అధిక వడ్డీని నిషేధిస్తూ చట్టాన్ని తేవడమే కాక రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం నెలకొని మనదేశంలో ధాన్యం ధరలు దారుణంగా పడిపోయిన పరిస్థితిలో రైతులకు ఋణమారిటోరియంను ప్రకటించారు. రాష్ట్రంలో గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, పి. రాజ గోపాలనాయుడు, ధనేకుల నరసింహం, బెజవాడ రామచంద్రారెడ్డి, సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, బి. రత్నసభాపతి, జాగర్లమూడి చంద్రమౌళి, కొమ్మారెడ్డి బాపయ్య చౌదరి, యడ్లపాటి వెంకటరావు, కొణిజేటి రోశయ్య, బి.వి. శివయ్య, కందిమళ్ల బుచ్చయ్య,

నాగినేని వెంకయ్య, కొత్తూరి వెంకటేశ్వర్లు మున్నగు ప్రముఖులు స్వతంత్రపార్టీలో చురుకైన పాత్రను నిర్వర్తించారు.

జాతీయస్థాయిలో భారతీయ విద్యాభవన్ వ్యవస్థాపకులు కె.యం. మున్షీగారు, ఒరిస్సాలో ఆర్.యన్. సింగ్‌దేవ్, రాజస్థాన్‌లో మహారాణి గాయత్రీదేవి, గుజరాత్‌లో వల్లభాయ్ పటేల్ గారి కుమారుడు దహియాభాయ్ పటేల్ మున్నగు పెద్దలు స్వతంత్ర పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేశారు. స్వతంత్రపార్టీ రాజాల పార్టీ అని, పెద్ద పెద్ద కోటీశ్వరుల పార్టీ అని నెహ్రూగారు ముద్రవేశారు. సహజంగానే కమ్యూనిష్టు పార్టీలకు స్వతంత్ర పార్టీ ఆర్థిక విధానాలతో ఎంతమాత్రమూ పొసగదు. 1962 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో స్వతంత్ర పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఆచార్య రంగా గారి నేతృత్వంలో వ్యవహరించింది. పార్లమెంటులో చాలా నిర్మాణాత్మకంగా, బాధ్యతాయుతంగా ప్రతిపక్ష పాత్రను పోషించింది. ఒరిస్సాలో ఆర్.యన్. సింగ్‌దేవ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది.

***<u>వీగిపోయిన 17 వ రాజ్యాంగ సవరణ</u>***

నెహ్రూగారు కొద్దిపాటి వ్యవసాయ భూమిని కూడా 'ఎస్టేట్' అనే నిర్వచనంలోకి తీసుకువచ్చి భూమిపై రైతు హక్కును హరించి ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి, వీలుగా 17వ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టారు. రైతులు కోర్టుకు వెళ్ళడానికి వీలు లేకుండా రాజ్యాంగం 9వ షెడ్యూలులో చేర్చాలని కూడా ఇందులో ప్రతిపాదించబడింది. దీనిని స్వతంత్ర పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. రంగాగారు, ఇతర నాయకులు దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి 17వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రైతాంగ శ్రేయస్సుకు విఘాతం కలిగిస్తుందని పెద్దయెత్తున ప్రచారం నిర్వహించారు. మన రాష్ట్రంలో గౌతు లచ్చన్న, కందుల ఓబుల్‌రెడ్డి, సుంకర సత్యనారాయణ మున్నగు నాయకులంతా బహిరంగసభలు, పత్రికల్లో వ్యాసాలద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి ప్రయత్నించారు. పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి చాలా మెజారిటీ ఉంది. అయినప్పటికీ రంగాగారు తనదైన శైలిలో ఈ రాజ్యాంగ సవరణను ఎందుకు వ్యతిరేకించాలో వివరిస్తూ ప్రసంగించారు. పలువురు సభ్యులు పార్లమెంటులో ఓటింగ్‌కు ముందు బయటకు వెళ్ళిపోయారు. 17వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. మరుసటి రోజు పార్లమెంటరీ పార్టీ మీటింగ్‌లో నెహ్రూగారు ఆవేదనతో "కాంగ్రెస్ పార్టీకి నేనా రంగాజీనా నాయకుడు?" అని తన ఆగ్రహాన్ని, బాధను వ్యక్తంచేశారు. అదేసమయంలో నెహ్రూగారి ఊహలకు భిన్నంగా చైనా మనదేశ

సరిహద్దుల్ని అతిక్రమించి గణనీయమైన భూభాగాన్ని ఆక్రమించుకోవడం ఆయనను కలచివేసింది. ఆయనకు ఎంతో ఇష్టుడైన రక్షణ శాఖ మంత్రి వి.కె. కృష్ణమీనన్ రాజీనామా చెయ్యాల్సివచ్చింది. ఈ రెండు అంశాలతో తీవ్రంగా ఆందోళనకు గురైన నెహ్రూగారు 1964 మే 27న మరణించారు.

## *శ్రీకాకుళం బై ఎలక్షన్‌లో రంగాగారి విజయం*

1967 సాధారణ ఎన్నికల్లో ఆచార్య రంగాగారు చిత్తూరు పార్లమెంటు స్థానానికి పోటీచేశారు. ఆ సందర్భంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూగారు రంగాగారిని ఓడించడానికి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని, కేంద్ర మంత్రుల్ని మోహరింపజేశారు. వారు బాగా డబ్బు ఖర్చుపెట్టడం ఫలితంగా రంగాగారు ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో రాష్ట్ర స్వతంత్రపార్టీ ప్రధాన కార్యదర్శి సుంకర సత్యనారాయణగారు రంగాజీ ఎన్నికల నిర్వహణకోసం నిధులు సమీకరించారు. ఆ సందర్భంగా మా కలవపాముల గ్రామంలోని స్వాతంత్ర్య సమరయోధులు వెల్లంకి పూర్ణచంద్రరావుగారు నేను స్వతంత్ర పార్టీ అభిమానినని సుంకర సత్యనారాయణగారికి తెలియపరిచారు. అందువల్ల సుంకర సత్యనారాయణగారు నాకు ఉత్తరం రాసి పంపగా కొద్దిపాటి సహకారం అందించాను. శ్రీకాకుళంలో గౌతు లచ్చన్నగారు పార్లమెంటుకు, అసెంబ్లీకి రెండింటికీ గెలిచారు. తన రాజకీయ గురువైన రంగాజీ పోటీచేయడానికి వీలుగా పార్లమెంటు స్థానానికి రాజీనామా చేసినందువల్ల ఉప ఎన్నిక జరిగింది. ఆ సందర్భంగా ఆ ఉప ఎన్నికల్లో ఉపయోగపడే నిమిత్తం నెలరోజుల కోసం అద్దెకారును గుడివాడలో మాట్లాడి, కృష్ణాజిల్లా స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు పర్వతనేని లక్ష్మణరావుగారి ద్వారా పంపించాను. రంగాగారు ఆ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించారు.

పీలూమోడి స్వతంత్రపార్టీ అధ్యక్షునిగా ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో బలమైన రైతునేత, గ్రామీణ ప్రజల నాయకుడు చౌధురి చరణ్‌సింగ్ నాయకత్వంలోని భారతీయ క్రాంతిదళ్ పార్టీతో కలసి భారతీయ లోక్‌దళ్ పార్టీగా ఏర్పడింది. పీలూమోడి మంచి పార్లమెంటేరియన్. చక్కని హాస్యాన్ని కలబోస్తూ పార్లమెంటులో చక్కని ప్రసంగాలు చేసేవారు. భారతీయ లోక్‌దళ్ ఎన్నికల ప్రణాళిక కాంగ్రెస్‌కు భిన్నంగా, స్పష్టమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలతో రూపొందించబడింది. దీనిని నా మిత్రుడు సి. నరసింహారావు ఇంగ్లీషు వెర్షన్‌ను తెలుగులోకి తర్జుమా చేయగా "భారతదేశపు



ఏకైక ఆశాకిరణం భారతీయ లోక్‌దళ్" పేరుతో నేను చిన్న పుస్తకాన్ని ప్రచురించాను.


1962 ఎన్నికల్లో ఉయ్యూరు నియోజకవర్గం నుంచి జబర్లపూడి మునసబుగారైన కొడాలి ఉమామహేశ్వరరావుగారు స్వతంత్రపార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించడానికి ఉయ్యూరు పాలిటెక్నిక్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఆచార్య రంగాగారు, గౌతు లచ్చన్నగారు, సుంకర సత్యనారాయణగారు వచ్చారు. రంగాగారిని చూడడం అదే మొదటిసారి. ఆ ఎన్నికల్లో కాకాని వెంకటరత్నంగారు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.

## కడియాల వెంకటేశ్వరరావు విజయం

1967లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉయ్యూరు నియోజకవర్గం నుంచి కాకాని వెంకటరత్నంగారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగాను, కడియాల వెంకటేశ్వరరావుగారు మిత్రపక్షాలు బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థిగాను పోటీచేశారు. కొద్దిరోజుల్లో ఫైనలియర్ పరీక్షలకు హాజరు కావాల్సివున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీపైన ఉన్న వ్యతిరేకభావంతో నేను కలువపాముల గ్రామంలో వారం రోజులపాటు ప్రచారాన్ని నిర్వహించాను. అక్కడ జరిగిన ప్రచారసభకు అధ్యక్షత వహించాను. యలమంచిలి వెంకట నరసింహారావు, వెల్లంకి సీతారామయ్య మున్నగువారు బాగా కృషిచేశారు. ఎన్నికల్లో ఓటువేసి బెంగుళూరు వెళ్ళాను. అక్కడ ఉండగా రెండు రోజుల తర్వాత కడియాల వెంకటేశ్వరరావు గారు గెలిచారన్న వార్త తెలిసింది.

## ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీ స్థాపన


మా తాతగారు వడ్డే శోభనాద్రిగారు, అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, కోగంటి వెంకట్రామయ్యగారు జస్టిస్ పార్టీలో ఉండేవారు. వీరు, చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరాంప్రసాద్‌గారితో ఎంతో సన్నిహితంగా మెలిగేవారు. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ డెరెక్టర్‌గా ఉన్న వెలగపూడి రామకృష్ణ ఐ.సి.ఎస్. గారి సలహాతో అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, మా తాతగారు, కోగంటి వెంకట్రామయ్యగారు, వల్లభనేని వెంకట కృష్ణయ్యగారు మున్నగు ప్రముఖుల తోడ్పాటుతో ఉయ్యూరులో మొదట్లో సహకార రంగంలో షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యింది. కారణాంతరముల వలన ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా చల్లపల్లి రాజాగారి తోడ్పాటుతో రూపు దిద్దుకుంది. ఉయ్యూరు పరిసర గ్రామాలలో ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ షుగర్ ఫ్యాక్టరీ ఎంతో దోహదం చేసింది. నేను ఉయ్యూరులో ఉంటూవుండగా వి.యల్. దత్తుగారు



*బెంగుళూరులోని ఎమ్.ఎస్. రామయ్య ఇంజనీరింగ్ కాలేజీ*

చైర్మన్ & ఎం.డి.గా ఉన్నారు. ఇంజేటి జగన్నాధరావు ప్లాంట్ మేనేజర్‌గా ఉండగా ఉయ్యూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పలు గ్రామాలలో సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడ్డాయి.

## మూడు టన్నుల క్లబ్



1960వ దశకంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గూడూరు వెంకటచలంగారి ఆధ్వర్యంలో 'మూడు టన్నుల క్లబ్'ను ఏర్పాటుచేసి, తైచుంగ్ నేటివ్-1, ఐ.ఆర్.-8 వంటి అధిక దిగుబడి వరివంగడాల్ని విరివిగా రైతులు వినియోగించుకోవడంకోసం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మా తాతగారు శోభనాద్రిగారు ఈ క్లబ్‌కు అధ్యక్షులు. వ్యవసాయ సమస్యలపైన తరచుగా శోభనాద్రిగారు ప్రకటనలు చేస్తూ వుండేవారు. ఈ కార్యకలాపాలన్నింటికీ ఆంధ్రజ్యోతి కార్యాలయం ఒక కేంద్రబిందువుగా ఉండేది. పలు విషయాలు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం కావడంవల్ల రైతులకు ఎంతగానో అవగాహన పెంపొందింది.

## ఉయ్యూరు ఎ.జి.టి.ఐ.

ఉయ్యూరు పరగణా నూజివీడు ఎస్టేట్‌లో ఒక భాగం. స్వాతంత్ర్యానికి పూర్వమే అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య గారి అభ్యర్థన మేరకు ఉయ్యూరులో ఐ.టి.ఐ. ఏర్పాటు చేయుటకు యం.ఆర్.అప్పారావు గారి తండ్రి గారు 6 ఎకరముల భూమిని అందజేశారు.

ఈ అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో వందలాది మంది సాంకేతిక కోర్సులలో ఉత్తీర్ణులై పారిశ్రామిక ప్రగతికి దోహదపడ్డారు. కొంతకాలం తర్వాత విజయవాడ పట్టణంలో ఐతే కృష్ణాజిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉంటుంది అనే ఉద్దేశంతో కాకాని వెంకటరత్నం గారు దీనిని విజయవాడకు మార్పించారు. ఉయ్యూరులో ప్రసిద్ధిచెందిన వీరమ్మగుడి ఉంది. వీరమ్మ తిరునాళ్ళ సమయంలో వేలాది మంది ప్రజలు పాల్గొంటూ ఉంటారు. గోవా విమోచన ఉద్యమంలో సూరి సీతారామ్ గారు తుపాకీ కాల్పులకు బలయ్యారు. కొలచల సీతారామయ్య గారు పలు దశాబ్దముల క్రితమే ఉద్యోగరీత్యా సోవియట్ రష్యాలో స్థిరపడ్డారు. చోడవరపు గోపాలకృష్ణమూర్తి గారు నీతి, నిజాయితీలతో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటులో పనిచేసారు. చోడవరపు లక్ష్మణ్‌బాబు, ధాము అమెరికాలో ఉంటున్నారు. గోవిందరాజుల భాస్కరరావు, చార్టెర్డ్ అకౌంటెన్సీ రంగంలో ప్రముఖుడైనారు.

ఉయ్యూరు హైస్కూల్‌లో ప్రయాగ కృష్ణవేణి బ్లాక్ భవనమునకు వంగల దత్తు గారు విరాళం అందించారు. తరచుగా వేసవిలో పాఠశాల పాకలు అగ్ని ప్రమాదానికి గురవుతూ ఉండేవి. పాఠశాల అభివృద్ధి కమిటీకి డా॥ కనకమేడల రంగారావు గారు అధ్యక్షులు, నేను కార్యదర్శి. 1977 నవంబర్ తుఫాను దరిమిలా ఏ.వి.యస్.రెడ్డి గారు కలెక్టర్‌గా ఉండగా కె.సి.పి. వి.ఎల్. దత్తు గారు అందించిన సహకారమునకు తుఫాను సహాయనిధుల నుండి పెద్ద మొత్తమును అందించగా పక్కా బిల్డింగ్ నిర్మాణం చేయడం జరిగింది. డా॥ పండా ద్విజేంద్రబాబు సహకారంతో మంచినీటి సౌకర్యం, డైనింగ్ హాల్ ఏర్పాటయ్యాయి.

ఆ తర్వాత ఉయ్యూరులో వ్యవసాయం చేసుకుంటూ, విజయవాడలో జరిగే స్వతంత్ర పార్టీ సమావేశాలకు హాజరవుతూ వుండేవాణ్ని. జస్టిస్ ఆవుల సాంబశివరావుగారు రచించిన 'మనము-మన రాజ్యాంగము', జి.ఆర్. కృష్ణ రచించిన 'డెమాక్రసీ ఇన్ యాక్షన్' అనే పుస్తకాల కాపీలను కొని, స్వతంత్రపార్టీ సభ్యుల్లో అవగాహన పెంపొందించడంకోసం అందజేసేవాణ్ని.

1971లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో మచ్చలేని ప్రముఖ ఇంజనీర్ హెచ్.ఆర్.శాయోజీరావుగారు స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా గుడివాడ పార్లమెంటరీ స్థానానికి పోటీచేశారు. ఆ సందర్భంలో ఉయ్యూరు నియోజకవర్గంలో ఉయ్యూరు నుంచి ఇందుపల్లి వరకు నేను, మంటాడ నుంచి లంకపల్లి వరకు పుట్టగుంట శివరామకృష్ణారావు ప్రచార

బాధ్యతల్ని నిర్వహించాం. ఆ ఎన్నికల్లో సంస్థాగత కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ, భారతీయ జనసంఘ్, సోషలిస్టు పార్టీలు కలసి పోటీచేయగా, ఇందిరా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలసి పోటీచేశారు. పత్రికల్లో ఎక్కువ భాగం సంయుక్త కూటమికి మద్దతు ఇచ్చినప్పటికీ, శ్రీమతి ఇందిరాగాంధీ ట్రాన్సిస్టర్లను విస్మృతంగా వినియోగంలోకి తేవడం, ఆకాశవాణిని వినియోగించుకోవడం, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల



రద్దుకోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు, గరీబి హఠావో నినాదం సామాన్య ప్రజానీకాన్ని ఆకర్షించి, ఆమెకు అఖండ విజయాన్ని చేకూర్చాయి.

❖❖❖

# ఎన్నికల రంగంలోకి అడుగు

***ఉయ్యూరు నుండి శాసన సభకు పోటీ:***

1972లో సాధారణ ఎన్నికలొచ్చాయి. 1967 ఎన్నికల్లో విజయం సాధించిన కడియాల వెంకటేశ్వరరావుగారు మంచి రైతు. అయితే నియోజకవర్గంలో ఆయన ప్రజాసమస్యల్ని పెద్దగా పట్టించుకోలేదు. గన్నవరం నియోజకవర్గంలో శాసనసభ్యుడిగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు, త్యాగశీలి వెలివోలు సీతారామయ్యగారి మృతి వల్ల వచ్చిన ఉప ఎన్నికల్లో కాకాని వెంకటరత్నంగారు విజయం సాధించారు. హోరాహోరీగా పి.సి.సి. 11వ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కూడా గెలవడం వల్ల వారి ప్రతిష్ట మరింతగా ఇనుమడించింది. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామాత్యులుగా ఉన్న వెంకటరత్నంగారు విజయవాడలో పాల ఉత్పత్తుల కర్మాగారాన్ని నెలకొల్పి రాష్ట్రంలో అధిక పాల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. వందలాదిమందికి ఉపాధి అవకాశాల్ని కల్పించారు. గతంలోనే జిల్లా బోర్డు అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కొత్తగా పెద్ద యెత్తున ఉన్నత పాఠశాలలు ప్రారంభించడంతోపాటు, వందలాదిమందికి టీచర్లుగాను, ఇతర బాధ్యతల్లోను ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కడియాల వెంకటేశ్వరరావుగారు చురుకైన పాత్ర పోషించలేకపోవడం, కాకాని వెంకటరత్నంగారు మంత్రిగా ఉంటూ ఎంతోమందికి సహాయపడడం కారణంగా 1972 ఎన్నికల్లో ఆయన సునాయాసంగా, ఏకగ్రీవంగా విజయం సాధించగలరనే వాతావరణం ఏర్పడింది. దానికితోడు వెంకటరత్నంగారి వ్యవహారశైలిలో కూడా కొంతమార్పు వచ్చింది. అంతకుముందు గ్రామాల్లో తనకు అనుకూలంగాలేని వ్యక్తుల్ని దూరంగా ఉంచేవారు. మంత్రి అయిన తర్వాత అటువంటివారిని కూడా కలుపుకుని వెళ్ళాలనే భావన కలిగింది. దానికితోడు 1967 ఎన్నికల్లో ఆయనకు వ్యతిరేకంగా పనిచేసిన మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి రైతు కుటుంబాల్లోని వారి పిల్లలకు ఉద్యోగాలు, ట్రాన్స్‌ఫర్లు వంటి అవసరాలు పెరగడం వల్ల వెంకటరత్నంగారికి వ్యతిరేకంగా ఎందుకు ఉండాలనే భావన కలిగింది. అందువల్ల దాదాపు ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ నామినేషన్ వేయరనే వాతావరణం నెలకొంది. నామినేషన్ దాఖలు చేయడానికి ముందురోజు రాత్రి ఉయ్యూరు సెంటర్లో సి.పి.ఐ. కార్యకర్త వెంకటేశ్వరరావు గడియారాలు రిపేరు చేసే దుకాణంలో సి.పి.ఐ.నాయకులు బండి వెంకటకృష్ణయ్య, గుంటక పేరిరెడ్డి, సి.పి.ఎం.నాయకులు మర్రెడ్డి రామకోటిరెడ్డి, కోన గురవయ్య, సోషలిస్టు

పార్టీ నాయకుడు తుమ్మల చౌదరి, స్వతంత్ర పార్టీ తరఫున నేను, యార్లగడ్డ సత్యనారాయణ తదితరులం సమావేశమయ్యాం. చిన ఓగిరాల గ్రామానికి దాదాపు రెండు దశాబ్దాలపాటు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికవుతూ వచ్చిన బండి వెంకటకృష్ణయ్యగారిని నామినేషన్ వేయమని మేం కోరినప్పటికీ ఆయన అందుకు అంగీకరించకుండా, నన్ను నామినేషన్ వేయమని పట్టుబట్టారు.



మా తాతగారు వడ్డే శోభనాద్రిగారు, కాకాని వెంకటరత్నంగారు అంతకుముందు లోకల్ బోర్డు ఎన్నికల్లో పోటీచేసినందువల్ల, కాకాని వెంకటరత్నంగారు నిస్వార్థ ప్రజాసేవకుడని తెలిసినాగానీ ఆయన పట్ల, తద్వారా కాంగ్రెస్ పార్టీపట్ల వ్యతిరేకభావం నాలో చిన్నప్పటి నుంచే నాటుకుంది. నేను అప్పటికే ఉయ్యూరులో ఇల్లు నిర్మించివున్నాను. అందువల్ల నేను పోటీ చేయనని చెప్పాను. కేవలం పోటీ కోసం నామినేషన్ వేద్దాం, డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టనవసరంలేదని చెప్పారు. చర్చలు పూర్తయ్యేసరికి దాదాపు తెల్లవారింది. మేం నూజివీడులో నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్ళేటప్పటికి కాకానిగారి మద్దతుదార్లు ఇక ఎవరూ నామినేషన్ వెయ్యరు, ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయినట్లేనన్న ఉత్సాహంతో నూజివీడు నుంచి గన్నవరం, కంకిపాడు మీదుగా ఉయ్యూరుకు కోలాహలంగా ఊరేగింపుగా వచ్చేందుకు సన్నద్ధులయ్యారు. అనూహ్యంగా ఆ సమయంలో


నేను మిత్రపక్షాలు బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేశాను. కలవపాముల గ్రామం నుంచి బంధువులు, ఇంకా హెచ్.ఆర్. శాయోజీరావుగారు ఉయ్యూరు వచ్చి, "బాబూ! నీది చిన్న వయసు, ఇంకా చాలా వయసు ముందుంది. ఇప్పుడు పోటీచేస్తే ఆర్థికంగా దెబ్బతింటావు. కాబట్టి ఉపసంహరించుకో" అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. అందుకు నేను అంగీకరించలేదు. నాపై ఇతర పక్షాలవారు ఉంచిన నమ్మకాన్ని వమ్ముచెయ్యలేను. నేను ఎక్కువగా ఖర్చుపెట్టను, పెట్టలేనని చెప్పి వారిని పంపించివేశాను.

గ్రామాల్లో విస్తృతంగా తిరుగుతూ, అత్యంత నిరుపేద గుడిసెను కూడా వదిలిపెట్టకుండా ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించాను. బహిరంగసభల్లో మాట్లాడటం కొద్దిగా అలవాటయ్యింది. అప్పటికింకా ఎన్నికల ప్రచార వ్యయం చాలా స్వల్పమే. జెండాలు, తోరణాలు, బ్యానర్లు, గోడలమీద రాతలు, మైకు ప్రచారం, సినిమా హాళ్ళలో స్లైడ్ల వరకే ప్రచారం పరిమితం. గన్నవరంలో ఓట్ల లెక్కింపు జరిగింది. 1971 ఎన్నికల సందర్భంగా ఓట్లను మొత్తం కలిపి డ్రమ్ముల్లో వేసి లెక్కించే విధానాన్ని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో పెత్తందార్ల ప్రాబల్యాన్ని అరికట్టడానికి, ఏ ఊళ్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలియకుండా ఉండడానికి ఆమె ఈ విధానాన్ని అమలుచేశారు. మొదటి రౌండ్‌లో కాకానిగారికి ఆధిక్యత, రెండోరౌండ్‌లో కూడా వారికే ఆధిక్యత. దానితో ఆయన గెలుపు ఖాయమని తేలిపోయింది. పెద ఓగిరాల సర్పంచ్, సి.పి.ఐ.నాయకులు పేరిరెడ్డిగారు మనం ఓడిపోతున్నాం కాబట్టి కౌంటింగ్ నుంచి వెళ్ళిపోదామన్నారు. మనం గెలుస్తామని వెయ్యలేదుకదా, పోటీకోసం పోటీ చేశాం, కాబట్టి కౌంటింగ్ నుంచి వెళ్ళిపోవడం భావ్యంకాదని నేనన్నాను. ఆయన వెళ్ళిపోయారు. ఏడువేల ఓట్లతేడాతో ఓడిపోయాను. కౌంటింగ్‌లో ఉన్న మా బృందం చివరివరకు ఉన్నాం. కాకానిగారి తరఫున కౌంటింగ్‌కు వచ్చిన వారి కుమారుడు కాకాని రామమోహనరావుతో "మీ తండ్రిగారికి నా అభినందనలు చెప్పండి" అని అభినందించి కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న అధికార యంత్రాంగం మొత్తానికి కృతజ్ఞతలు చెప్పి బయటకు వచ్చేశాం.

***ఎవరికీ లేని సీలింగ్ రైతు మీదే ఎందుకు?***

పి.వి.నరసింహారావుగారు ముఖ్యమంత్రిగా భూసంస్కరణల ఆర్డినెన్స్‌ను ప్రకటించారు. వివిధ రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రాబల్యాన్ని పెంచుకుంటున్న వ్యవసాయ ఆధారవర్గాల్ని

దెబ్బతీయడానికి శ్రీమతి ఇందిరాగాంధీ భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రులకు సూచించారు. అంతకుముందే 1959లోనే నీలం సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక పర్యాయం భూపరిమితుల చట్టాన్ని అమలుచేశారు. పట్టణాల్లో ఎన్ని మేడలైనా ఉండొచ్చు, ఎంతైనా ఆస్తులు ఉండొచ్చు, ఎన్ని పరిశ్రమలైనా ఉండొచ్చు. వాటిలో దేనికీ లేని పరిమితిని వ్యవసాయభూములకే పెట్టడం ఎంత వరకు సమంజసమని భావించిన కొందరం కలసి హైదరాబాదులోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని సమావేశమందిరంలో సమావేశమయ్యాం. నేను, తుమ్మల చౌదరి, బొజ్జా వెంకటరెడ్డి, మాగంటి భూపతిరావు, తూర్పు గోదావరికి చెందిన నారాయణమూర్తిగారు తదితరులం కలసి చర్చించాం. ఈ అన్యాయం గురించి మనం ఎవరి నియోజకవర్గంలో వారు వారి శాసనసభ్యుడిని కలసి ఇది కూడదు, రైతులకు అన్యాయం చేయడం తగదని చెప్పాలని అభిప్రాయపడ్డాం. ఆ రోజు రాత్రి మా కలవపాముల గ్రామంలో నా చిన్ననాటి సన్నిహిత మిత్రుడు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న వెల్లంకి సుబ్రహ్మణ్యంగారి ఇంట్లో నిద్రించి, మరుసటిరోజు ఉదయం కాకాని గారింటికి వెళ్ళాను. కాకానిగారిని కలవాలని చెప్పగా, ఆయన ఉన్న గదిని చూపించారు. వెళ్ళి కలవగా, ఆయన ఆశ్చర్యపడి "ఏమిటి శోభనాద్రీశ్వర్రావ్, ఇలా వచ్చావని" అడిగారు. ఆ ఆర్డినెన్స్ గురించి చెప్పి, ఇతరులకెవరికీ లేని సీలింగ్ రైతుల మీద రెండో పర్యాయం విధించడం అన్యాయమని చెప్పాను. అందుకు ఆయన ఏకీభవిస్తూ, ఇందిరాగాంధీ ఒత్తిడి మేరకు ఇక్కడ పి.వి.నరసింహారావుగారు అత్యుత్సాహంతో ఆర్డినెన్స్ తెచ్చారని, అయినా వీలైనంతవరకు మన రైతులకు సహాయం చేస్తానని చెప్పారు. మరికొన్ని రోజుల తర్వాత, ఇంకా అనేకమంది రైతులతోపాటు చనుమోలు వెంకట్రావు, పిన్నమనేని కోటేశ్వరరావుగార్లను కూడా కలుపుకుని, చెరకు పంటవేసిన భూమిని డబుల్ క్రాప్‌గా వర్గీకరించడం సమంజసం కాదని చెప్పాం. కాకానిగారు ముఖ్యమంత్రి, ఇతర అధికారులతో మాట్లాడి సింగిల్ క్రాప్‌గానే నిర్ణయింపజేసి, రైతాంగం పట్ల తన అభిమానాన్ని చూపారు. 'భూపరిమితుల చట్టం ప్రభుత్వ కుట్ర' అనే చిన్న బుక్‌లెట్‌ను ప్రచురించి



పంపిణీ చేశాం. వ్యవసాయ కమతాలపైన పరిమితిని విధించడం ద్వారా రైతుల ఆదాయాల పైనకూడా పరిమితి విధించబడినట్లయిందని, ఇతర ఏ వర్గాల వారికి లేని ఆదాయ పరిమితిని రైతులకు మాత్రమే వర్తింపచేయాలనడం ఎంతమాత్రమూ సమర్థనీయం కాదని అందులో వివరించడం జరిగింది.

## జై ఆంధ్రా ఉద్యమం



ఇంతలో ముల్కీ నిబంధనలు చెల్లుతాయనే కోర్టు తీర్పు వెలువడింది. దాని పర్యవసానంగా రాష్ట్ర రాజధాని నగరంలో ఆంధ్రప్రాంతానికి చెందిన పౌరులు ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించబడే పరిస్థితులు, ఆంధ్రప్రాంత ఉద్యోగులకు జరగనున్న అన్యాయం, విద్యావంతులకు రాజధానిలో ఉద్యోగావకాశాలు దక్కవనే కారణాల వల్లను, ఆంధ్ర ప్రాంతంలో 'జై ఆంధ్ర' ఉద్యమం ఉవ్వెత్తున ప్రారంభమయ్యింది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు తెన్నేటి విశ్వనాథం, సర్దార్ గౌతు లచ్చన్న గార్ల నేతృత్వంలో ఉధృతంగా కొనసాగింది. కొద్దికాలం తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బి.వి.సుబ్బారెడ్డిగారు, కాకాని వెంకటరత్నంగారు ప్రభృతులందరూ జై ఆంధ్ర ఉద్యమానికి బాసటగా నిలిచారు. భారతీయ జనసంఘ్ పార్టీకి చెందిన జూపూడి యజ్ఞనారాయణగారు, కొమరగిరి కృష్ణమోహనరావుగారు ప్రభృతులు, సోషలిస్టు పార్టీ నాయకులు తుమ్మల చౌదరిగారు, తూమాటి బాలకోటేశ్వరరావుగారు ప్రభృతులందరూ ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉయ్యూరులో రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ఏర్పాటుచేసి ఉద్యమం కొనసాగినన్నాళ్లూ క్రమశిక్షణాయుతంగా సరైన రీతిలో నిర్వహించడంలో ప్రధాన భూమికను పోషించాను. వల్లభనేని సాయి ప్రసాద్ తోడ్పాటును ఇచ్చాడు. ఆ ఉద్యమం సందర్భంగా పలుచోట్ల ప్రసంగించడం వల్ల అంకెలతో కూడిన వివరాలతో ఉపన్యాసం చేసే పద్ధతి అలవాటయ్యింది. సుంకర సత్యనారాయణగారి ప్రసంగాలు ప్రజల్ని, ముఖ్యంగా యువకుల్ని, విద్యార్థుల్ని ఎంతగానో ఆకట్టుకొనేవి. జై ఆంధ్ర ఉద్యమ నాయకుల్ని 'మీసా' చట్టం కింద అరెస్టు చేసి నిర్బంధించారు. నన్ను విశాఖపట్నం సెంట్రల్ జైలుకు పంపారు. అక్కడ నెలరోజుల తర్వాత విడుదల చేశారు. పిన్నమనేని కోటేశ్వరరావుగారిని కూడా ఆ జైల్లోనే ఉంచి వారం రోజుల తర్వాత విడిచిపెట్టారు. రాజమండ్రి లోక్‌సభ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్‌గారిని అప్పట్లో విద్యార్థి నాయకుడిగా విశాఖ సెంట్రల్ జైల్లోనే నెలరోజులపాటు ఉంచారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు శ్రీమతి ఇందిరాగాంధీ అంగీకరించలేదు. రెండు ప్రాంతాల్లోని నాయకులతో చర్చించి ఆరుసూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమయంలో సమైక్యవాదులుగా ఉన్న రాష్ట్ర మంత్రులు మండలి వెంకటకృష్ణారావు, భాట్టం శ్రీరామమూర్తి, మజ్జి తులసీదాస్ ప్రభృతులు గన్నవరం విమానాశ్రయానికి రానున్నారని తెలిసి, కాకాని వెంకటరత్నంగారు ప్రజల్ని సమీకరించారు. ఆరోజు సాయంత్రం విజయవాడలోని సంగ్రామ్‌చౌక్ వద్ద (ఏలూరురోడ్డులోని అజంతా హోటల్ సమీపంలో) జై ఆంధ్ర ఉద్యమకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు యువకులు మరణించారు. ఆ వార్తను విన్న కాకాని వెంకటరత్నంగారు తీవ్రమైన ఆవేదనతో గుండెపోటుకు గురై స్వర్గస్తులయ్యారు. విజయవాడలోని పవిత్ర కృష్ణానది విశాల ఇసుకతిన్నెలపై కాకానిగారి అంత్యక్రియలు జరిగాయి. సంతాపసభకు లక్షలాదిమంది ప్రజలు హాజరైన సంఘటన అపురూపం.

జై ఆంధ్ర ఉద్యమం సందర్భంగా నేను మరచిపోలేని మరో సంఘటన జరిగింది. ఆంధ్రప్రాంత కాంగ్రెస్ నాయకులు జై ఆంధ్ర ఉద్యమంలోకి చేరడానికి తటపటాయిస్తూ, సమావేశాల పేరిట కాలయాపన చేస్తూండడం ప్రజానీకానికి, ముఖ్యంగా యువకులకు ఆగ్రహం కలిగించింది. ఆ సమయంలో ఆంధ్రప్రాంత కాంగ్రెస్ నాయకులు కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశమందిరంలో సమావేశాన్ని ఏర్పాటుచేసుకున్నారు. అనేక ప్రాంతాల నుంచి పెద్దయెత్తున ప్రజలు అక్కడికి చేరుకున్నారు. మేం ఉయ్యూరు నుంచి రెండు బస్సుల్లో కాకినాడ వెళ్ళాం. సమావేశమందిరానికి ఎదురుగా మా బస్సులు నిలిపాం. మా ఉయ్యూరు గ్రామ మునసబు వల్లూరుపల్లి గోవర్ధనరావుగారు మీసాలతో గంభీరంగా కనిపించేవారు. ఆయన తన తుపాకీ పట్టుకుని బస్సుపైకి ఎక్కి కూర్చున్నారు. కాంగ్రెస్ నాయకులు జై ఆంధ్ర ఉద్యమంలో చేరే అంశంపై నిర్ణయ ప్రకటనపై జాప్యం చేస్తూవుండడాన్ని సహించలేక నేను మా బస్సుకు బిగించి వున్న మైకులో చాలా ఆవేశపూరితంగా ప్రసంగించాను. దానితో మీటింగ్‌హాలు బయట గుమికూడివున్న వందలాదిమంది యువకులు ఆవేశంతో తలుపులు విరగ్గొట్టి, నినాదాలు చేస్తూ లోపలికి వెళ్ళారు. దానితో లోపల ఉన్న కాంగ్రెస్ నాయకులు వెనుక మార్గం గుండా పరుగులు తీస్తూ పారిపోయారు.

***<u>ఉప ఎన్నికలో డా॥ కనకమేడల రంగారావు విజయం</u>***

ఇంతలో జై ఆంధ్ర ఉద్యమం చల్లబడిన తరుణంలో రాష్ట్ర శాసనసభలో ఖాళీలు ఉన్న స్థానాలకు ఉప ఎన్నికల నిర్వహణకోసం రంగం సిద్ధమయ్యింది. కాకానిగారి

మరణంతో ఉయ్యూరు అసెంబ్లీ స్థానానికికూడా ఉప ఎన్నిక వచ్చింది. 1972లో కాకానిగారికి వ్యతిరేకంగా పోటీ చేయడానికి ఎవరూ ముందుకురాని సందర్భంలో పోటీ చేసిన నేను ఈ ఉప ఎన్నికలో పోటీ చేస్తానంటే ఎవరూ కాదనలేరు. ఎంతో ఉధృతంగా దీర్ఘకాలంపాటు కొనసాగి, కాకానిగారితోపాటు అనేకమంది యువకులు అమరులైన ఉద్యమం సజీవంగా ఉందని, ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల్ని ఓడించడం ద్వారా ప్రజలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని కోరుకుంటున్నారని తెలియచెప్పడంకోసం ఉప ఎన్నికలో ప్రతిపక్ష అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందని కాంగ్రెసేతర పక్షాలవాళ్లం భావించాం. శాసనమండలిలో అప్పుడు సభ్యుడుగా ఉన్న గౌతు లచ్చన్నగారు శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసి, శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి పోటీచేశారు. కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా ధనాన్ని, కులాన్ని, అధికారాల్ని అడ్డుపెట్టుకుని విజయం సాధించింది. ఉయ్యూరు స్థానానికి నేను పోటీ చేసిన పక్షంలో నియోజకవర్గంలో కొంతమేరకు ప్రాబల్యం ఉన్న సి.పి.ఐ. పార్టీ మద్దతు ఇవ్వదు. ఎందుకంటే ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో సి.పి.ఐ.పార్టీ సమైక్య ఆంధ్రప్రదేశ్‌నే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా జై ఆంధ్ర ఉద్యమాన్ని బహిరంగంగా వ్యతిరేకించిన నేపథ్యం ఉంది. సి.పి.యం పార్టీ కూడా ఆంధ్రప్రదేశ్ సమైక్య రాష్ట్రంగానే కొనసాగాలనే ఆనాడు ఈనాడు కూడా భావిస్తూ ఉంది. కానీ సి.పి.ఐ. పార్టీ ఇప్పుడు ప్రత్యేక తెలంగాణా వాదాన్ని సమర్థిస్తూ ఉండడం విడ్డూరం! జై ఆంధ్ర ఉద్యమంలో నేను చురుకైన పాత్ర పోషించడం వల్ల ఆ పార్టీ నాయకులకు నాపైన ద్వేషభావం కలిగింది. అందువల్ల వారు తీవ్రంగా వ్యతిరేకంగా పనిచేస్తారు. ఈ రకంగా విజయావకాశాలు దెబ్బతింటాయన్న భావంతో మృదుస్వభావి, వివాదరహితుడు, ఉయ్యూరు గ్రామంలో సర్పంచ్‌గా నిస్వార్థంగా అనేక దశాబ్దాలుగా వైద్యసేవలు అందించిన డాక్టర్ కనకమేడల రంగారావుగారి పేరును ట్రావెలర్స్ బంగ్లాలో జరిగిన సమావేశంలో నేనే ప్రతిపాదించాను. అనుకున్న విధంగానే రంగారావుగారికి అన్ని ప్రతిపక్ష పార్టీలు సహకారం అందించాయి. జలగం వెంగళరావుగారు ముఖ్యమంత్రిగా వుండి, పదిమందికి పైగా మంత్రులు వచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, కాకానిగారి కుమారుడు రామమోహనరావుగారి తరఫున ప్రచారం చేసినప్పటికీ రంగారావు గారు విజయం సాధించారు. ఆ సమయంలో అయిదు ఉప ఎన్నికలు జరిగాయి. అయితే ఒక్క ఉయ్యూరు స్థానంలోనే ప్రతిపక్షాలు విజయం సాధించాయి. పదవీకాలం పూర్తి కాకుండానే అనారోగ్యంతో డాక్టర్ రంగారావుగారు స్వర్గస్తులయ్యారు.

***జయప్రకాష్ ఉద్యమం - అత్యవసర పరిస్థితి విధింపు***

దేశంలో పెరిగిపోతూవున్న అవినీతికి వ్యతిరేకంగా బీహార్, గుజరాత్ రాష్ట్రాలలో ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు బాబూ జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన ఉద్యమం యువతలో ఆలోచనను ఆవేశాన్ని రేకెత్తించింది. 1975 జూన్ 6న లక్షలాదిమంది ప్రజల సంతకాలతో కూడిన ప్రజా విజ్ఞప్తి పత్రాలతో న్యూ ఢిల్లీలో జరిగిన గొప్ప ప్రదర్శనలో పాల్గొన్నాను. రాయ్‌బరేలీ ఎన్నికలో జరిగిన అక్రమానికి వ్యతిరేకంగా సోషలిస్ట్ పార్టీ నాయకుడు రాజ్‌నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో వేసిన దావా కారణంగా శ్రీమతి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు వచ్చింది. పర్యవసానంగా దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లింది. పత్రికల్లో వార్తలు సెన్సార్ చేయడం వల్ల వాస్తవాలేమిటో ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. జయప్రకాష్ నారాయణ్, మురార్జీ దేశాయ్, చౌదరి చరణ్‌సింగ్, వాజ్‌పాయ్, అద్వానీ మొదలైన నాయకులందర్నీ జైళ్లలో నిర్బంధించారు. మన రాష్ట్రంలో గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, తుమ్మల చౌదరి, యలమంచిలి శివాజీ, జూపూడి యజ్ఞనారాయణ, ఆలె నరేంద్ర, పి.జనార్ధన్‌రెడ్డి మొదలైన నాయకులందర్నీ కూడా జైళ్లలో పెట్టారు.

***అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య మరియు చెఱకు రైతుల కళాశాల***

దీనికి కొద్దికాలం ముందు కె.సి.పి.బోర్డు ఎన్నికల్లో నేను, కాంగ్రెస్ నాయకుడు పిన్నమనేని కోటేశ్వరరావుగారు కలసి కె.సి.పి. డైరెక్టర్ల బోర్డు ఎన్నికల్లో వి.ఎల్. దత్తుగారికి మద్దతు ప్రకటించాం. అనంతరం ఉయ్యూరులో మూతబడివున్న పాలిటెక్నిక్ భవనాల సముదాయంలో స్థానిక విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో కాలేజీని ప్రారంభించాలనే నిర్ణయం జరిగింది. ఇందుకు కె.సి.పి.సంస్థ తరఫున, ఇంకా చెరకు రైతుల తరఫున సహకారం అందచేయాలని నిర్ణయం తీసుకున్నారు. చెరకు రైతుల సహకారం కూడా పెద్ద మొత్తంలో ఉంటుంది కాబట్టి అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారి పేరుతోపాటు 'చెరకు రైతులు' అని కూడా కళాశాల పేరులో ఉండాలని నేను పట్టుబట్టాను. ఇది కాలేజీ కమిటీ ఛైర్మన్ అడుసుమిల్లి విశ్వేశ్వరరావుగారికి ఏమాత్రం ఇష్టంలేదు. అందువల్ల నన్ను కాలేజీ పాలకవర్గంలోకి చెరకు రైతుల ప్రతినిధిగా రానివ్వకుండా ఉండడం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. నాకు అత్యంత సన్నిహితముగా ఉండే, నేను బాబాయి అని పిలిచే నాదెళ్ళ నారాయణ ప్రసాదరావుగారిని నాపై పోటీకి నిలిపారు. అయినప్పటికీ ఉయ్యూరు కె.సి.పి.క్రేన్ గ్రోయర్స్ అసోసియేషన్ పక్షాన కాలేజీ

కమిటీలోకి ప్రతినిధిగా ఎన్నికయ్యాను. మేము ఇద్దరమూ పోటీ పడినప్పటికీ చిట్టచివరి వరకు మా ఇద్దరి మధ్యన ఆత్మీయత, అనుబంధాలు కొనసాగాయి. కాలేజీకి 'అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరకు రైతుల కళాశాల' అనే పేరును సాధించడంలో కృతకృత్యుడనయ్యాననే సంతృప్తి ఎప్పుడూ ఉంటుంది.

***<u>విశాల హృదయుడు వి.ఎల్.దత్తు గారు</u>***

వేలాదిమంది రైతులు, ఇంకా ఉదాత్తమైన మనసున్న వి.ఎల్.దత్తుగారి సహకారం ఉన్నందువల్ల కాలేజీలో ప్రారంభం నుంచి యు.జి.సి. స్కేల్స్ ఇస్తూ, నాణ్యమైన విద్యను అందించడంతో ఈ ప్రాంతంలోని చెరకు రైతులు, కార్మికులు, ఇంకా సామాన్య ప్రజానీకం తమ బిడ్డలకు స్వల్పవ్యయంతో ఉన్నత విద్యను పొందడానికి అవకాశం కలిగింది. కాలేజీ ప్రారంభ సమయంలో కేంద్రములో కార్మిక శాఖా మంత్రిగా ఉన్న టంగుటూరి అంజయ్యగారిని ఆహ్వానించి టెక్నికల్ కోర్సును కూడా ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేసారు. కె.సి.పి. సంస్థ నుండి వర్క్‌షాపునకు కావలసిన పలు యంత్రములను అందించినా టెక్నికల్ కోర్సు ప్రారంభించలేదు. ఈ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని యం.యస్. అప్పారావు గారు కాలేజీకి నూజివీడు జమిందారుగారు ఇచ్చిన ఆరు ఎకరముల స్థలమును వెనుకకు ఇచ్చి వేయవలెనని కోర్టులో దావా వేశారు. వారికే అనుకూలంగా తీర్పు వచ్చి



*వెలగపూడి రామకృష్ణ గారు*



*వి. లక్ష్మణ్ దత్ గారు*



*అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య గారు*

కాలేజీ మనుగడకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉన్నందున కె.సి.పి. చైర్మన్ మరియు ఎం.డి. వి.యల్. దత్తుగారు పది లక్షల రూపాయలను జమీందారు గారి కుటుంబమునకు ఇచ్చి రాజీ పరచి కాలేజీ కొనసాగడానికి కారకులయ్యారు. వాస్తవానికి ఈ కాలేజీకి ఆనుకుని ఉన్న పది ఎకరముల భూమిని కూడా ఇవ్వాలని ఆయన అనుకున్నారు. కానీ కాలేజీ కమిటీ ప్రసిడెంట్, మరియు దత్తుగారికి మేనమామ అయిన అడుసుమిల్లి విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యుడు గుంటక పేరిరెడ్డి ఇచ్చిన తప్పుడు సలహా వలన దత్తుగారిని

అడగకపోవడం వలన ఆ భూమి ఫ్యాక్టరీ కిందే ఉండి పోయింది. వి.యల్. దత్తుగారు కానూరులో బందరురోడ్డుకు ఆనుకొనివున్న కోట్ల రూపాయల విలువైన భూమిని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీకి ఇచ్చారు. సిద్ధార్థ ఆదర్శ్ పబ్లిక్ స్కూల్‌కు కూడా పెద్ద మొత్తంలో ఆర్థిక సహకారాన్ని అందించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి ముమ్మనేని సుబ్బారావుగారంటే చాలా అభిమానంతో, గౌరవంతో ఉండేవారు. మద్రాసు సమీపంలో తిరువత్తియూర్ లో పాలిటెక్నిక్ ను స్థాపించి కార్మికుల పిల్లలతో సహా పలువురు టెక్నికల్ కోర్సును అభ్యసించే వీలు కల్పించారు.

వి.యం. రావుగారు ఉయ్యూరు, చల్లపల్లి షుగర్ ఫ్యాకరీలను తీసుకున్న దరిమిలా ఏ.జి.యస్.జి. కళాశాలను సిద్ధార్థ అకాడమీవారికి అప్పగించారు. ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీవారు ఎంతోకాలంగా నిర్వహిస్తూవచ్చిన బంక్‌ను వి. ఎం.రావుగారు మూసివేసే తలంపుతో ఉన్నారని తెలిసి మద్రాసు వెళ్లి, చక్కని పేరుగాంచి, వందలాది లారీలకు, ట్రాక్టర్లకు డీజెల్‌ను అందిస్తూవున్న బంక్‌ను మూయవద్దని చెప్పగా, ఆయన చెరకు తీసుకుని పంచదార చెయ్యడం మినహా ఇంకేమీ అవసరం లేదన్నారు. ఉయ్యూరు ప్రాంత ప్రజల అవసరాలపట్ల ఆయన నిర్లక్ష్యధోరణికి ఇది ఒక తార్కాణం.

***<u>ఎడ్లపందాలు</u>***


రాయచూర్ జిల్లాలో మ్యాసేఫెర్గూసన్ ట్రాక్టర్ కొత్తది వెంటనే దొరుకుతుందని ఎవరో చెప్పడంవల్ల అక్కడికి వెళ్లాను. అక్కడ లభించకపోవడంతో బెంగుళూరు వెళ్లి అక్కడ కూడా ప్రయత్నిస్తే ఫెర్గూసన్ ట్రాక్టర్ దొరకలేదు. ఇంటర్నేషనల్ ట్రాక్టర్ లభించింది. ఎలాగో ట్రాక్టర్ తీసుకువెళ్ళడానికి లారీ అవసరమవుతుంది కాబట్టి, ఉయ్యూరులో వ్యవసాయానికి ఎడ్లుకూడా అవసరం కనుక ఒక జత మైసూర్ ఎడ్లను కూడా కొని ఉయ్యూరు తీసుకువచ్చాను. ఉయ్యూరులోని కాటూరురోడ్డులో ఎలక్ట్రికల్, ఆటోమొబైల్స్ సామాన్ల షాపును ప్రారంభించాను. విజయవాడ రేట్లకే ఉయ్యూరులో సామాన్లు అందించాలని నా ఆకాంక్ష. హౌస్ వైరింగ్ ఎలక్ట్రీషియన్లకు కమీషన్ ఇస్తూ విజయవాడ రేట్లకు ఉయ్యూరులో ఎలక్ట్రికల్ సామగ్రి అమ్మడం అసాధ్యమని గ్రహించి ఆ వ్యాపారాన్ని మరొకరికి అప్పగించాను.

మండపేట సమీపంలో ఒక మైసూరు ఎడ్ల జతను కొని తీసుకొచ్చాను. అందులో ఒకదాన్ని బెంగుళూరు నుంచి తెచ్చిన వాటిలో ఒకదాన్ని జతచేసి వాటితో స్వారీ ఎడ్ల పందానికి తర్ఫీదునిచ్చి కోలవెన్నులో జరిగిన పోటీల్లో రెండవ జతగా బహుమతి పొందడం జరిగింది. తర్వాత యలమర్రులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాం. గన్నవరానికి సమీపంలోని

ఆత్మూరుకు చెందిన సూర్యనారాయణ, ప్రకాష్‌రెడ్డిగార్లు మా ఎడ్లను తోలేవారు. నేను వద్దని చెప్పినప్పటికీ పోటీలో గెలవాలనే తాపత్రయంతో వారు చేసిన పని వల్ల ఒక ఎద్దు తోక చక్కగా చెర్నాకోలలాగా ఉండేది కొద్దిగా రూపు మారింది. నేను చాలా బాధపడ్డాను. ఆపైన ఇక స్వారీ ఎడ్ల పోటీల్లో పాల్గొనలేదు. నా అర్ధాంగి బసవరాజ్యం పశువుల పట్ల చాలా ఆదరాభిమానాలు చూపుతూ వాటికి దాణా, గ్రాసం విషయంలో తగిన శ్రద్ధ తీసుకునేది. నేను సాధారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు వాటి విషయం ఆమె శ్రద్ధగా చూసుకునేది. మా మామగారు గోగినేని రామమోహనరావు (రాంపండు) గారికి వ్యవసాయం అంటే చాలా ఆసక్తి. ఆయన దగ్గర తేలిక బరువుతో కూడిన ఎడ్లబండి, మైసూర్ ఎడ్లు ఉండేవి. ఆమె తండ్రిగారికి వ్యవసాయం విషయంలో గల శ్రద్ధ నా భార్యకు కూడా వచ్చింది.

## *జె.పి. నాయకత్వంలో యువకులు - విద్యార్థుల ఉద్యమం*

దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ఎనలేని త్యాగాలు చేశారు. వారి సౌఖ్యంగానీ, కుటుంబ శ్రేయస్సుగానీ దృష్టిలో పెట్టుకోకుండా మాతృదేశం దాస్య శృంఖలాలు తెగిపోతే చాలనే భావనతో చివరిశ్వాస వరకు పోరాడారు. దేశం స్వాతంత్ర్యం సంపాదిస్తే, శీఘ్రగతిన పురోగతిని సాధిస్తూ పూర్వపు ఔన్నత్యాన్ని పొందగలదని ఆశించారు. కానీ నానాటికీ నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతూ, అంతరాలు పెరుగుతూ, అవినీతి వేళ్ళూనుకోవడంపట్ల ఆగ్రహంతో గుజరాత్, బీహార్ రాష్ట్రాలలో యువత, విద్యార్థులు, సామాన్య ప్రజానీకం ప్రారంభించిన ఉద్యమానికి బాబూ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వం వహించారు. జయప్రకాష్ అధ్యక్షునిగా ఏర్పడిన సారథ్య సంఘంలో మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, చరణ్ సింగ్, మధు దండావతే, పీలు మోడి మున్నగు వారు సభ్యులు. అవినీతిని అంతమొందించాలని పరిపాలనలో ప్రభుత్వ జవాబుదారీతనం పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ లక్షలాదిమంది ప్రజల సంతకాలతో కూడిన విజ్ఞప్తి పత్రాలను ఢిల్లీలో 1975 మార్చి 6న భారీప్రదర్శన నిర్వహించి లోక్‌సభ స్పీకర్‌కు, రాజ్యసభ చైర్మెన్‌లకు అందించారు. ఆ ప్రదర్శనలో నేనుకూడా పాల్గొన్నాను.



దేశంలో అత్యవసర పరిస్థితి విధించబడి, భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ శ్రీమతి ఇందిరాగాంధీ నియంతృత్వ పాలన

దాదాపు 30 నెలలపాటు కొనసాగింది. ఎమర్జెన్సీ కాలంలో విజయవాడలోని ఫిలిం ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ ధాన్యోత్పత్తిదారుల మహాసభను నిర్వహించాం. మాజీ శాసనసభ్యులు నాగినేని వెంకయ్యగారు అధ్యక్షత వహించారు. యార్లగడ్డ సత్యనారాయణ, చిగురుపాటి కృష్ణారావు, బి. వెంకటేశ్వరరెడ్డి, చెరుకూరి వెంకట్రామయ్య మున్నగు మిత్రులు అండగా నిలబడ్డారు. ప్రముఖ రైతు నాయకులు భాను ప్రతాప్‌సింగ్ (జనతా ప్రభుత్వంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీమతి గాంధీ చిన్నకుమారుడు సంజయ్‌గాంధీ చేపట్టిన కుటుంబ నియంత్రణ కార్యక్రమం హద్దులుమీరి కొనసాగడం, ఢిల్లీ నగరంలో తుర్క్‌మెన్ గేటు సమీపంలో వందలాది నిరుపేదల ఇళ్ళను బుల్‌డోజర్లతో తొలగించడం వంటి చర్యల గురించి సమాచారాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖల ద్వారా ప్రజలకు చేరుస్తూ ఉండేవారు. అవినీతికి, కాంగ్రెస్ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా ప్రముఖ గాంధేయవాది, సర్వోదయ నాయకుడు జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన సంపూర్ణ విప్లవం, యువతకు పిలుపు, "ఏవ్విరి మేన్స్" సాహిత్యాన్ని ప్రజలకు, ముఖ్యంగా యువకులకు అందచేసే కార్యక్రమం ఎమర్జన్సీ కాలంలో కూడా కొనసాగింది. ఆర్.ఎస్.ఎస్. ప్రాంతీయ నాయకుడు భాగయ్యగారు, తదితరులు ఉయ్యూరులో మా ఇంటి వద్ద పలుమార్లు సమావేశమై ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట కార్యక్రమాల గురించి చర్చించుకోవడం జరిగింది.

శ్రీమతి ఇందిరాగాంధీ అకస్మాత్తుగా ఎమర్జెన్సీని ఎత్తివేసి భారత పార్లమెంటుకు 1977లో ఎన్నికలు ప్రకటించారు. జైళ్ళలో ఉన్న నాయకులు విడుదలయ్యారు. మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్, చరణ్‌సింగ్ నాయకత్వంలోని భారతీయ లోక్‌దళ్, భారతీయ జనసంఘ్, సోషలిస్టు పార్టీలు అన్నీ కలసి జనతాపార్టీగా ఏర్పడి ఇందిరా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించాయి. శ్రీమతి ఇందిరాగాంధీ నియంతృత్వ వైఖరితో విసుగుచెంది, శ్రీమతి గాంధీ కుటుంబం పట్ల ప్రజల్లో పెరిగిన నిరసనను పసిగట్టిన బాబూ జగజ్జీవన్‌రామ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి హెచ్.ఎన్.బహుగుణ నేతృత్వంలో ఏర్పడిన 'కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ' కూడా జనతాపార్టీతో కలసి పనిచేసింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు మినహా, మిగతా రాష్ట్రాలన్నింటిలోనూ ఇందిరా కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయ్యింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన స్థాయిలో అత్యవసర పరిస్థితి కాలంలో బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కార్యక్రమంగానీ, పేద ప్రజలకు హాని కలిగించే కార్యక్రమాలుగానీ దక్షిణాది రాష్ట్రాల్లో జరిగివుండని కారణంగా ఇక్కడ ఇందిరా కాంగ్రెస్ విజయం సాధించింది.

# 1977 ఎనిమిదవ లోక్‌సభ ఎన్నికల్లో బందరు నుండి పోటీ

గుంటూరులో జనతాపార్టీ నాయకులు తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్నగార్ల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ జనతా పార్టీ సమావేశమై, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి నన్ను పోటీ చేయమని ఆదేశించారు. ఆ ఎన్నిక సందర్భంగా ఉయ్యూరు, గుడివాడ, బందరు, మల్లేశ్వరం, ముదినేపల్లి, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో దాదాపు ప్రతిగ్రామం వెళ్ళాను. బందరు నియోజక వర్గంలో వడ్డి రంగారావు, తూమాటి బాల కోటేశ్వరరావు, కొనకళ్ళ గణపతి, అంకెం వెంకటపతి , బొర్రా వెంకటస్వామి, గోవాడ వెంకటేశ్వరరావు మున్నగువారు, గుడివాడ నియోజక వర్గంలో పిన్నమనేని భూపతిరాయుడు, డాక్టర్ రావెళ్ళ సీతారామస్వామి, పుట్టగుంట సుబ్బారావు, తుమ్మల చౌదరి, టి.కె. మూర్తి, మోహనరావు, సూరపనేని వెంకటేశ్వరరావు, యస్.కె.టి. పద్మనాభం, సోమిరెడ్డి ప్రభృతులు, మల్లేశ్వరం నియోజకవర్గంలో కానూరి వెంకట రంగదాస్, ఇల్లూరి రాఘవయ్య, ముదినేపల్లి నియోజకవర్గంలో స్వాతంత్ర్య సమర యోధుడు ఉప్పలపాటి వీరభద్రరావు, కానూరి గంగాధరరావు, ఉప్పలపాటి దయానిధి, చలసాని రాఘవయ్య, గన్నవరం నియోజకవర్గంలో అట్లూరి శ్రీమన్నారాయణ, మూల్పూరి బాలకృష్ణారావు, మొవ్వా హనుమంతరావు, కాసరనేని సుబ్బారావు, జాస్తి విజయభూషణ కుమార్ గోగినేని రంగాబాబు ప్రభృతులు, నూజివీడు నియోజకవర్గంలో దేవినేని రాజారామ్, మల్లిపెద్ది దశరథరామయ్య, కాకాని పూర్ణచంద్రరావు, కాకాని బాబు, డాక్టర్ తిరువూరు మధుసూదనరావు, చలసాని గోపాల కృష్ణమూర్తి, హనుమాన్ జంక్షన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు ఆలపాటి లక్ష్మయ్య, యలమంచిలి వెంకటేశ్వరరావు (పి.పి.), తుమ్మల సత్యనారాయణ, మూల్పూరి శోభనం, గుండపనేని ఉమావరప్రసాద్, మున్నగువారు చాలా కృషిచేశారు. జీపునకు మైకు, లైటింగ్ ఏర్పాటుచేసుకుని పొద్దుపోయేదాకా పర్యటించేవాణ్ని. వందలాది ఉపన్యాసాలు చెయ్యాల్సి రావడంతో ఉపన్యాసధోరణి బాగా అలవాటయ్యింది. బాబూ జగజ్జీవన్‌రామ్ గన్నవరంలో బహిరంగ సభలోనూ రాజ్‌నారాయణ్ విజయవాడ బహిరంగసభ లోనూ ప్రసంగించారు. గుడివాడలోని సంగ్రామ్ చౌక్‌లో జరిగిన పెద్ద బహిరంగసభలో ప్రముఖ సోషలిస్టు నాయకుడు అశోక్ మెహతా జనతాపార్టీ ఘనవిజయాన్ని సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని ఘంటాపథంగా చెప్పినా ఇక్కడి ప్రజలు విశ్వసించలేదు. మేధావులు, ఉద్యోగులు, విద్యావంతులు, యువకులు, మధ్యతరగతి రైతాంగం జనతాపార్టీకి మద్దతివ్వగా, బలహీనవర్గాలు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇంకా సన్నకారు,



*1977లో గన్నవరం విమానాశ్రయం వద్ద బాబుజగజ్జీవన్ రామ్ ప్రభృతులు*

చిన్నకారు రైతులు ఇందిరా కాంగ్రెస్‌కు బాసటగా నిలిచారు. పోటీ రసవత్తరంగా, హోరాహోరీగా జరిగింది. ఆ ఎన్నికల్లోనూ ఓట్ల లెక్కింపు పోలింగ్ బూత్‌ల వారీగా కాకుండా మొత్తం ఓట్ల కట్టల్ని కలిపి లెక్కించే విధానాన్ని అనుసరించారు. ఏడు నియోజక వర్గాల లెక్కింపును గుడివాడలో నిర్వహించారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారి ప్రభావం ఎక్కువగా ఉండే గన్నవరం నియోజకవర్గంలో కూడా ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి మాగంటి అంకినీడుగారికి నాకంటే మొదటి రౌండులోనే సుమారు వెయ్యి ఓట్లకు పైగా మెజారిటీ లభించింది. నేను ఓడిపోవడం ఖాయమని నాకర్థమైపోయింది. నేను పోటీకి నిలబడినప్పుడు గెలుస్తాననే ఆశ ఏ మాత్రం లేదు. పార్టీ ఆదేశించింది కాబట్టి పోటీచేశాను. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తయ్యేవరకూ ఉండి విజయాన్ని సాధించిన మాగంటి అంకినీడుగారికి అభినందనలు తెలిపాను. ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపి, బయటకు వచ్చినప్పుడు అనేకమంది యువకుల కళ్ళలో దుఃఖంతో జలజలా నీళ్ళు కారడం గమనించి ఓదార్చాను.

మన రాష్ట్రం నుంచి ఒక్క నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి నీలం సంజీవరెడ్డిగారు గెలుపొందారు. బలహీనవర్గాల ఓట్లను పోలుకానివ్వకుండా కొంతమేరకు నిలువరించడం వల్ల ఆయన విజయం సాధ్యమయ్యింది. ఆరోజు పొద్దుపోయేవరకు మన రాష్ట్రంలో వెలువడుతున్న ఎన్నికల ఫలితాల్ని ఆకాశవాణిలో వింటున్న ఇందిరా కాంగ్రెస్ మద్దతుదారులు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలవారు ఆయా గ్రామాల్లో జనతాపార్టీకి కృషి చేసినవారిని గ్రామ కూడలి ప్రదేశాల్లో దుర్భాషలాడారు. ఎమర్జెన్సీ కాలంలోనే

శ్రీమతి గాంధీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తెచ్చారు. అందువల్ల జనతా పార్టీవారు ఎదురు మాట్లాడటానికి సాహసించలేదు. అర్ధరాత్రి సమయం అయ్యేటప్పటికి రాయ్‌బరేలీలో శ్రీమతి గాంధీ ఓడిపోయారని, ఇందిరా కాంగ్రెస్ ఘోరపరాజయం పాలవుతున్నదనే విషయాన్ని విన్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన అనేక కుటుంబాల్లో విషాదంతో వంటలు చేసుకోలేదని వినడం జరిగింది. మన రాష్ట్రంలో జనతాపార్టీ ఓడిపోయినా, కేంద్రంలో జనతాపార్టీ విజయాన్ని సాధిస్తుండడంతో జనతాపార్టీ అభిమానులు హడావిడి చేశారు.

***ప్రజారంజకంగా జనతా పాలన***

మొరార్జీ దేశాయ్ ప్రధానిగా, బాబూ జగజ్జీవన్‌రామ్, చరణ్‌సింగ్, వాజ్‌పేయి, అద్వానీ, మధు దండావతే, జార్జి ఫెర్నాండెజ్, బిజూ పట్నాయక్, రాజ్‌నారాయణ్, రామకృష్ణ హెగ్డే వంటి హేమాహేమీలతో దేశంలో మొట్టమొదటిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. అత్యవసర పరిస్థితి కాలంలో పౌరుల హక్కులకు భంగం కలిగిస్తూ, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించిన చట్టాల్ని రద్దుచేసి జనతా ప్రభుత్వం ప్రజలకు మంచి పాలనను అందించింది. ఆకాశవాణి, దూరదర్శన్ ప్రసారాలలో అన్ని రాజకీయ పక్షాలకు సముచితమైన సమయాన్ని కేటాయించింది. ఉన్నత విలువలు పాటిస్తూ, నిత్యావసర వస్తువుల ధరల్ని అదుపులో ఉంచగలిగింది. పనికి ఆహారం పథకాన్ని ప్రవేశపెట్టి పనిలేని రోజుల్లో గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు ఉపాధి అవకాశాల్ని, మౌలిక వసతుల్ని కల్పించారు. వ్యవసాయం గ్రామీణాభి వృద్ధి రంగాలకు నిధుల కేటాయింపును పెంచారు. చరణ్‌సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండగా పొగాకు పంటపైన ఎక్సైజ్ డ్యూటీని ఎత్తివేసి సిగరేట్ల పైన పన్ను విధించారు. ఫలితంగా పొగాకు రైతులను ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ వారు పీడించే పరిస్థితి తొలగింది. పుగాకు రైతులు ఎంతో ఆనందించారు. ఎరువుల సబ్సిడిని పెంచారు. ఎన్నికల సంస్కరణలకు, రేడియో టి.వి.లకు స్వయం ప్రతిపత్తి ఉండాలనే ఆలోచనలను ప్రవేశపెట్టింది.

***జనతా ప్రభుత్వ పతనం***

నాయకుల మధ్య ఈర్ష్య, ఎవరికి వారు తామే అధికులమనే భావనల వల్ల అభిప్రాయభేదాలు మొదలయ్యాయి. ఇంతలో జనతాపార్టీలో సభ్యత్వం కలిగిన వారికి ఆర్.ఎస్.ఎస్.లో సభ్యత్వం ఉండకూడదనే అంశంపైన (ద్వంద్వ సభ్యత్వం అంశంపైన) పూర్వపు జనసంఘ్ వర్గీయులు, సోషలిస్టుల మధ్య తీవ్ర విభేదాలు మొదలయ్యాయి.

జనసంఘ్ వర్గీయులకు మొరార్జీదేశాయ్ గారి మద్దతుండగా, సోషలిస్టులకు చరణ్‌సింగ్ మద్దతిచ్చారు. ఈ క్రమంలో చరణ్‌సింగ్ ప్రాబల్యాన్ని దెబ్బతీయడానికి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న రామ్‌నరేష్ యాదవ్, బీహార్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న కర్పూరీ ఠాకూర్‌లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగి సఫలమయ్యాయి. హర్యానాలో చరణ్‌సింగ్ అనుయాయి అయిన దేవీలాల్‌ను గద్దె దించడానికి రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. మూడోసారి సాక్షాత్తూ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఇంట్లో హర్యానా జనతా లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని నిర్వహింపచేసి, ముఖ్యమంత్రి దేవీలాల్‌ను తప్పించి, భజన్‌లాల్‌కు పీఠాన్ని కట్టబెట్టారు. కేంద్రంలో జనతాప్రభుత్వం పడిపోగానే భజన్‌లాల్ తన అనుయాయులతో సహా కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు.

***<u>ఢిల్లీ బోట్ క్లబ్ లాన్స్ చారిత్రాత్మక కిసాన్ ర్యాలీ</u>***

జనతాపార్టీ నాయకుల మధ్య విభేదాలు పెరిగాయి. ప్రధాని మొరార్జీదేశాయ్ ఆర్థిక మంత్రిగా ఉన్న చరణ్‌సింగ్‌ను, ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న రాజ్‌నారాయణ్‌ను మంత్రివర్గం నుంచి తప్పించారు. దీనిపై పలురాష్ట్రాల్లోని రైతాంగంలో తీవ్రమైన నిరసన వ్యక్తమయ్యింది. ప్రధాని నిర్ణయాన్ని నిరసిస్తూ, చౌదరి చరణ్‌సింగ్‌కు మద్దతు ప్రకటిస్తూ ఢిల్లీలోని బోట్ క్లబ్ లాన్స్‌లో పదిలక్షల మందికి పైగా భారీ సంఖ్యలో రైతులతో కూడిన చారిత్రాత్మకమైన బహిరంగసభ జరిగింది. విజయవాడ ప్రాంతం నుంచి కూడా ఒక ప్రత్యేక రైలును ఆ కిసాన్ ర్యాలీకి ఏర్పాటుచేశాం. యాత్రా నిర్వహణలో చిరకాల అనుభవమున్న రంగాగారి శిష్యుడు ఎన్. వీరాచారిగారు, ఆయన తమ్ముడు రత్నాచారిగారు ఈ యాత్ర నిర్వహణలో ఎంతగానో తోడ్పడ్డారు. కృష్ణ, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి పెద్దయెత్తున రైతులు ఈ కిసాన్ ర్యాలీలో పాల్గొనేటట్లు చేశాం. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్ మొదలైన రాష్ట్రాల నుంచి కనీవినీ ఎరుగని రీతిలో రైతులు పాల్గొన్నారు. చరణ్‌సింగ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించడంపై ఆగ్రహంతో ఉన్న జాట్ రైతాంగం ఢిల్లీ నగరంలో ఏ విధంగా విధ్వంసానికి పాల్పడతారోనని ఢిల్లీ నగరవాసుల్లో ఆందోళన చెలరేగింది. అయితే ఎటువంటి సంఘటనలు జరగకుండా అత్యంత ప్రశాంతంగా లక్షలాది రైతాంగం వెనుకకు మరలడం ఢిల్లీ వాసులను విస్మయానికి గురిచేసింది. దేశవ్యాప్తంగా జనతాపార్టీకి మద్దతుగా నిలిచిన గ్రామీణ ప్రజానీకం, ముఖ్యంగా రైతాంగంలో పెల్లుబికిన నిరసనను అర్థం చేసుకుని మొరార్జీదేశాయ్ చరణ్‌సింగ్‌ను ఉపప్రధానిగా హోం శాఖను ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. చరణ్‌సింగ్ ప్రాధాన్యతను తగ్గించాలనే భావనతో బాబూ జగజ్జీవన్‌రామ్‌కు కూడా

ఉపప్రధాని పదవిని ఇచ్చారు. తనమీద అనుచితమైన వ్యాఖ్యలు చేసిన రాజ్‌నారాయణ్‌ను మాత్రం తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడానికి ఏమాత్రం అంగీకరించలేదు. జనతా ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసంఘ్ వర్గం ప్రాబల్యం పెరిగిపోతుందని అతిగా అంచనాలు వేసి, ద్వంద్వ సభ్యత్వం పేరుతో, దీనిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో మధు లిమాయే వంటి సోషలిస్టు నాయకులు తీసుకున్న వైఖరి పార్టీలో విభేదాలు పెరగడానికి కారణమయ్యింది.

***<u>ఇందిరాగాంధీని కలవని ప్రధాని చరణ్ సింగ్</u>***

శ్రీమతి ఇందిరాగాంధీపై పోటీచేయడమేగాక, ఎన్నికల పిటీషన్ వేసి పోరాడి, ఆమె ఎన్నిక రద్దయ్యేటట్లు నిరూపణ చేశారు రాజ్‌నారాయణ్. పర్యవసానంగా ఎమర్జెన్సీ విధించబడడం, దానిపై పెల్లుబికిన ప్రజాగ్రహం జనతాపార్టీ విజయానికి దారితీసింది. వీటన్నిటికీ ముఖ్య కారకుడైన తనను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోకపోవడంవల్ల తీవ్రంగా ఆగ్రహించిన రాజ్‌నారాయణ్ ఇందిరాగాంధీ రెండో కుమారుడు సంజయ్‌గాంధీ ద్వారా కాంగ్రెస్ పార్టీతో మంతనాలు సాగించారు. జనతాపార్టీ నిట్టనిలువుగా చీలింది. మొరార్జీదేశాయ్ సంస్థా కాంగ్రెస్, పూర్వపు జనసంఘ్ అభిమానులు ఒక వర్గంగాను, చౌదరి చరణ్‌సింగ్ మద్దతుదారులైన పూర్వపు భారతీయ లోక్‌దళ్, సోషలిస్టు సభ్యులు కలసి ఒక వర్గంగాను చీలిక ఏర్పడింది. భారత రాజ్యాంగం ప్రకారం కేంద్రంలో తప్పనిసరిగా ప్రధానమంత్రి, మంత్రివర్గం ఉండితీరాలి. రాష్ట్రాల్లో మాదిరిగా మంత్రివర్గం లేకుండా గవర్నర్ పాలన జరగడానికి వీల్లేదు. ఆనాడు భారత రాష్ట్రపతిగా ఉన్న నీలం సంజీవరెడ్డిగారు గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు బాబూ జగజ్జీవన్‌రామ్‌తో ఉన్న వైరుధ్యాన్ని మనసులో పెట్టుకుని చౌదరి చరణ్‌సింగ్‌ను ప్రధానిగా మంత్రివర్గం ఏర్పరచడానికి అవకాశమిచ్చారు. 21 రోజుల్లోపల లోక్‌సభలో మెజారిటీని నిరూపించుకోవాలని ఆదేశించారు. చరణ్‌సింగ్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కాంగ్రెస్ మద్దతు కూడా అవసరం కనుక తన ఇంటికి వచ్చి కలసి వెళ్తారని శ్రీమతి గాంధీ భావించినప్పటికీ, చరణ్‌సింగ్ ఆమె వద్దకు వెళ్లలేదు. ఆమెపై ఉన్న కేసులను ఉపసంహరించడానికి చరణ్‌సింగ్ సుముఖత చూపలేదు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధి చరణ్‌సింగ్ ప్రభుత్వానికి తాము మద్దతు నివ్వడంలేదని రాష్ట్రపతికి తెలియజేశారు. దానిపైన చరణ్‌సింగ్ రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. రాష్ట్రపతి బాబూ జగన్‌జ్జీవనరామ్‌ను పిలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఇచ్చి వుండాల్సింది. కానీ అలా జరగలేదు. ఇచ్చివుంటే తన సుదీర్ఘ రాజకీయ అనుభవ చతురతతో జనతాపార్టీని

మరికొంతకాలం కొనసాగించగలిగేవారు. కానీ ఆయనను ప్రధానిగా చేయడానికి ఏమాత్రం ఇష్టపడని సంజీవరెడ్డి లోక్‌సభను రద్దుచేసి, ఆపద్ధర్మ ప్రధానిగా చరణ్‌సింగ్‌ను కొనసాగించారు. ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో దేశంలో ప్రప్రథమంగా బలమైన రెండు రాజకీయ పక్షాల వ్యవస్థ ఏర్పడి, ఆరోగ్యకరమైన, పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పరచగలిగే సువర్ణ అవకాశం చేజారిపోయింది.

జనతాపార్టీలో బలమైన చీలిక వల్ల ఇందిరా కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. జనతాపార్టీ విజయానికి ప్రధాన కారకుడైన లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ జీవించి ఉండగానే జనతాపార్టీ చీలిపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామం. అంతకు పూర్వం అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీకి ధీటుగా సవాల్ చేయగలిగిన ప్రతిపక్షం లేదు. జనతా పార్టీ వలన ఆ లోపం పూరించబడింది. ఎప్పుడైనా ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షం కూడా బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం సక్రమమైన పంథాలో నడుస్తుంది.

## ***జనతా పార్టీ చీలిక - లోక్‌దళ్ పార్టీ అవిర్భావం***

జనతా పార్టీ నిలువుగా చీలిపోయి, జనతా పార్టీ, లోక్‌దళ్ పార్టీలుగా చీలడం వల్ల కాంగ్రెస్ పార్టీకి లాభించింది. 1980 మధ్యంతర ఎన్నికల్లో మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి లోక్‌దళ్ పార్టీ తరఫున పరింకాయల కనకదుర్గాప్రసాద్‌ను అభ్యర్థిగా నిలిపారు. ఈ ఎన్నికల ప్రచార భారం నా భుజస్కందాలమీద పడింది. ఆ సంవత్సరం నాకు వచ్చిన కె.సి.పి. డివిడెండ్ మొత్తం ఈ ఎన్నికల్లో అద్దెకు తీసుకున్న చిన్నకార్ల బాడుగకు, మైక్ సెట్లకు ఖర్చయిపోయింది. బూరగడ్డ నిరంజనరావుగారు జనతాపార్టీ అభ్యర్థిగాను, మాగంటి అంకినీడుగారు ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగాను పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మాగంటి అంకినీడుగారు విజయం సాధించారు.

1980 మధ్యంతర ఎన్నికల్లో జనతా పార్టీ రెండుగా చీలటం వల్ల ప్రతిపక్షం కొంత బలహీన పడింది. ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని నా నాయకత్వంలోవున్న లోక్‌దళ్ పార్టీ కార్యకర్తలపైన దాడి చెయ్యాలని కాకాని రామమోహనరావు, ఆయన అనుచరులకు అభిప్రాయం కలిగింది. ఉయ్యూరు జిల్లా పరిషత్ హైస్కూలు సమీపంలో కాంగ్రెస్ కార్యకర్తలు మోహరించారు. ఈ సమాచారం ఇతర బూత్‌ల దగ్గరవున్న లోక్‌దళ్ పార్టీ కార్యకర్తలకు తెలిసి, వారు కూడా హైస్కూలు దగ్గరకు చేరుకున్నారు.

బ్యాలెట్ బాక్సులకు సీళ్ళు వేసిన అనంతరం మేం సెంటర్ వైపునకు నడుస్తూ వుండగా, కాంగ్రెస్‌వారు కవ్విస్తూ కయ్యానికి కాలుదువ్వుతూ వున్నారు. నేను మా కార్యకర్తలతో ఘర్షణ వద్దు, ప్రశాంతంగా వెళదామని ఆవేశ పరులకు నచ్చజెబుతూ నడుస్తూవున్నాం. మా వెనుకనే విజయవాడ తూర్పు ఎ.సి.పి. అయిన పి. గౌతంకుమార్‌గారు నడుస్తూ వస్తూ కాంగ్రెస్ వారి ధోరణిని, నేను మా వాళ్ళకు సర్ది చెబుతూవున్న వైనాన్ని గమనిస్తూన్నారు. సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి కాంగ్రెస్‌వారి కవ్వింపు హద్దుమీరడంతో మా కార్యకర్తలు "బాబుగారూ! ఈ ఒక్కసారి మీరు వెళ్ళిపొండి. వీళ్ళ వ్యవహారం మేం చూసుకుంటాం" అని అన్నారు. నేను స్కూటరెక్కి ఇంటికెళ్ళాను. ఘర్షణ జరిగింది. ఉయ్యూరులో నాకు యాదవులు, గౌడ కులస్తులు, తూర్పు కాపులు మున్నగు వెనుక బడిన వర్గాల్లో గట్టి మద్దతుదారులున్నారు. మా వాళ్ళు కాంగ్రెస్‌వారిని తరిమికొట్టడం జరిగింది. కాంగ్రెస్ వారిచ్చిన కంప్లెయింట్‌లో నాపేరు కూడా పెట్టారు. ఎ.సి.పి. గౌతంకుమార్ జరిగిన వాస్తవాన్ని హైదరాబాద్‌లో హోం డిపార్ట్‌మెంట్‌కు తెలియజేశారు. దానితో నా పేరును తొలగించడం జరిగింది. ఆ ఒక్క సంఘటన తప్ప మూడు దశాబ్ధాల రాజకీయ జీవితంలో ఏనాడూ ఘర్షణకు తావివ్వలేదు.

జనతాపార్టీలో చీలిక సంభవించినప్పుడు సర్దార్ గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణగార్లతో పాటు నేను కూడా లోక్‌దళ్ పార్టీలోకి రావడం జరిగింది.

❖❖❖

# ఉయ్యూరు శాసనసభ్యునిగా ఎన్నిక

1972 ఎన్నికల్లో నేను ఉయ్యూరు నియోజకవర్గంలో కాకాని వెంకటరత్నంగారికి వ్యతిరేకంగా పోటీచేసి ఓడిపోయినా నిరుత్సాహం చెందక గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజాసమస్యలమీద స్పందిస్తూ అధికారుల దృష్టిలోకి తీసుకువెళ్ళి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తూ వచ్చాను. ఉయ్యూరు సెంటర్లో ఒక చిన్న ఆఫీసురూమ్ కూడా అద్దెకు తీసుకుని జనతాపార్టీ కార్యాలయాన్ని నిర్వహిస్తూ వచ్చాను. ఉయ్యూరు ప్రాంతంలో కాకాని వెంకటరత్నం గారికి అత్యంత సన్నిహితంగా మెలిగిన త్యాగశీలి మేడూరి వాస్తవ్యులు యలమంచిలి రామమోహనరావు గారు, గోపువాని పాలెం వాస్తవ్యులు పుట్టగుంట ఆంజనేయులుగారు, పెనుమత్స వాస్తవ్యులు దండమూడి పాపయ్య, పైడిముక్కల వాస్తవ్యులు యార్లగడ్డ నాగేశ్వరరావు గార్లకు కాకాని రామమోహనరావుగారి వ్యవహారసరళి నచ్చక, వారు నాకు తమ మద్దతునిచ్చారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో కూడా గతంలో కాకాని గారిని, కాంగ్రెస్‌ను అభిమానించిన వారు కూడా నేను పార్టీల ప్రమేయంలేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూవున్నందువల్ల నాకు సహకారాన్ని అందిస్తూ వచ్చారు.

1978లో ఆంధ్రప్రదేశ్ విధానసభకు జరిగిన ఎన్నికల్లో ఉయ్యూరు నియోజకవర్గం నుంచి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి కాకాని రామమోహనరావు గారిపై ఆరువేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందాను. రాష్ట్ర శాసనసభలో సర్దార్ గౌతు లచ్చన్న, సి.పి.ఎం.నాయకులు పుచ్చలపల్లి సుందరయ్యగార్ల నేతృత్వంలో ప్రజాసమస్యల పైన, ముఖ్యంగా రైతాంగానికి, రైతాంగం పండించే వరి, చెరకు, పొగాకు, పసుపు మొదలైన పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల వాటిల్లే నష్టాలకు ప్రభుత్వ సహాయం వంటి అనేక అంశాలపై ప్రశ్నల రూపంలోను, వివిధ అంశాలపై జరిగిన చర్చల్లోనూ చురుగ్గా పాల్గొన్నాను. అదేసమయంలో ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షుడిగా వ్యవహరించాను. చిలకలూరిపేటలో డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ కాజా కృష్ణమూర్తి మున్నగువారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మహాసభలోను, ఏలూరులో డాక్టర్ మాగంటి సీతారామస్వామి, డాక్టర్ వి.వి. గోపాలకృష్ణ, కొమ్మన రత్నాకరరావు, కాసరనేని గోపాలకృష్ణ మున్నగువారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ధాన్యోత్పత్తిదారుల మహాసభల్లోనూ చరణ్‌సింగ్ పాల్గొన్నారు.


## పట్టణ భూపరిమితి చట్టం పరిధిలోని పశుగ్రాస భూములను మినహాయించాలి

అప్పట్లో నగరాలకు సమీపంలో పశుగ్రాసం పెంచిన వ్యవసాయభూములు పట్టణ భూపరిమితి చట్టం పరిధిలోకి రావడంవల్ల అక్కడి రైతులు పడుతున్న ఇబ్బందిని పటమటలో నల్లూరు వెంకటరత్నం, రామినేని నాగేంద్రబాబు, కోనేరు మధుసూధనరావు ప్రభృతులు నాకు తెలియపరిచారు. ఈ విషయాన్ని ఢిల్లీ వెళ్లి ప్రధానిగా ఉన్న చరణ్‌సింగ్‌గారి దృష్టికి తెచ్చాం. నేపియర్ గ్రాస్, పారాగ్రాస్ వంటి పశుగ్రాసాలు పెంచిన వ్యవసాయభూముల్ని ఖాళీ జాగాలుగా కాకుండా వ్యవసాయ భూములుగా పరిగణించాలని చేసిన అభ్యర్థనను ఆయన అర్థం చేసుకున్నారు. అందుకు అనుగుణంగా చట్టంలో మార్పులు చెయ్యాలని నిర్దేశించి ఆ రైతాంగానికి ఊరట కలిగించారు.

ఉయ్యూరు శాసనసభ సభ్యుడిగా ఉన్న సమయంలో నేను జిల్లా జనతాపార్టీ అధ్యక్షుడిగాకూడా ఉన్నాను. ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్‌కు కొంతకాలంపాటు ప్రముఖ రైతునాయకులు, ఆచార్య రంగాగారి శిష్యులు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు అధ్యక్షుడుగాను, నేను ప్రధాన కార్యదర్శిగాను పనిచేస్తూ, అనేక రైతాంగ సమస్యలపై కృషిచేశాం. వారికి మా తాతగారు వడ్డే శోభనాద్రిగారితో కూడా సత్సంబంధాలుండేవి. నన్ను ఎంతో ఆప్యాయతతో నోరారా "శోభనాద్రీ!" అని పిలిచేవారు. ఆయన కుమారుడు పెద్దిరెడ్డి చెంగలరెడ్డిగారు తండ్రి బాటలో తనదైన శైలిలో రైతాంగ సమాఖ్యను ఏర్పాటుచేసి భారత వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూవుండడం ఎంతో గర్వించదగిన విషయం. తిమ్మారెడ్డిగారి అల్లుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డిగారు తెలుగుదేశం పార్టీలో ప్రముఖ నాయకుడిగానూ, మంత్రిగానూ పనిచేశారు. ఆయనకు కూడా రైతు సమస్యలన్నా, రైతు నాయకులన్నా ఎంతో అభిమానం.

## కృష్ణా ప్రజలు మరువలేని ఎ.వి.యస్.రెడ్డి

అప్పట్లో ఎ.వి.యస్.రెడ్డిగారు ట్రైనింగ్ కలెక్టర్‌గా కృష్ణాజిల్లాకు వచ్చారు. మొట్టమొదటిసారి ఉయ్యూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద తుఫాన్ బాధితులకు సహాయాన్ని అందజేస్తున్న సందర్భంలో కలుసుకున్నాం. ఆ తర్వాత కృష్ణాజిల్లా కలెక్టర్‌గా జిల్లాకు ఎనలేని సేవచేశారు. జిల్లాలోని అనేక ప్రదేశాల్లో పేదలకు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనకు దోహదం చేసే ముందడుగు పథకాన్ని అమలు చేశారు. విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం భవనాన్ని, దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం భవనాల్ని పూర్తి చేయించారు. ఎంతో ధైర్యంగా, నీతి నిజాయితీలతో త్వరగా



ఎ.వి.యస్. రెడ్డి

నిర్ణయాలు తీసుకుంటూ జిల్లా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించారు. ముక్కు సూటిగా మాట్లాడేవారు. నేను ఆయన దృష్టికి తీసుకెళ్లిన వాటిలో నూటికి 95 శాతం గ్రామాల్లో అత్యధిక ప్రజానీకానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన విజ్ఞప్తులు ఉంటూవుండేవి. అలాగే రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, మంత్రులుగా ఉన్నప్పటికీ నాపట్ల సాదరమైన గౌరవాభిమానాలు చూపిస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో సహకారాన్నందిస్తుండేవారు. జిల్లా పరిషత్ సమావేశాలు, జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశాలు, జిల్లా ఇరిగేషన్, డ్రైనేజీ బోర్డు సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతూండేవాణ్ని. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనల్ని ఆయా సమావేశాల్లో లేవనెత్తుతూ అవి ఆమోదించబడేటట్లుగా కృషి చేస్తూండేవాణ్ని. నాకు తెలిసినంతవరకు ప్రభుత్వ పథకాల అమల్లో లోపం జరుగుతున్నదని గ్రహించినప్పుడు ఆయా సమావేశాల్లో ప్రస్తావిస్తూండేవాణ్ని. అందువల్ల అధికారులు కూడా నాతో జాగ్రత్తగా వీలైనంతవరకు సానుకూలంగా వ్యవహరిస్తూండేవారు. ఫలితంగా నేను ప్రతిపక్ష శాసనసభ్యుడిగా ఉన్నప్పటికీ నా అనుయాయుల్లో "మన శోభనాద్రీశ్వరరావుగారికి ఏదైనా సమస్య గురించి చెబితే తప్పనిసరిగా అయితీరుతుంది" అనే భావన ఉంటూవుండేది.

ఎ.వి.యస్ రెడ్డిగారికి కృష్ణా జిల్లా అంటే అపారమైన ప్రేమ కలదు. తన కుమారునికి విజయకృష్ణ అని పేరు పెట్టారు. కొద్ది కాలం క్రితం ఆయన మరణించి నప్పుడు వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశాను.

ఎ.వి.యస్.రెడ్డిగారు జిల్లా అభివృద్ధికి అంకిత భావంతో కృషిచేశారు. సుందరయ్య గారు, కోటేశ్వరరావు గారు, చనుమోలు వెంకట్రావుగారు, నేను, కనుమూరి బాపిరాజు మున్నగువారి పట్ల చాలా అభిమానంతో ఉండేవారు. మేము ఆయన దృష్టికి తీసుకువెళ్ళిన

సమస్యలపట్ల సానుకూలంగా స్పందిస్తూవుండేవారు. ఆ సమయంలో పాలడుగు వెంకట్రావుగారు నూజివీడునుంచి శాసనసభ్యులుగా ఉండేవారు. కొంతకాలం గ్రామీణ నీటిసరఫరా శాఖామాత్యులుగా కూడా పనిచేశారు. సాధారణంగా పాలడుగు వెంకట్రావుగారు ఉద్యోగస్తుల మీద అవకాశం చిక్కినప్పుడల్లా విరుచుకు పడుతూవుండేవారు.

***<u>పిన్నమనేనికి ప్రతిపక్షాల మద్దతు</u>***

కోటేశ్వరరావుగారిని కాకుండా వేరే వారిని చైర్మన్ చెయ్యాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం ప్రయత్నించింది. అయితే నేను, వడ్డి రంగారావు, సుందరయ్యగారు, ధనసూర్యావతిగారు, అంబటి బ్రహ్మణయ్యగారు, అట్లూరి శ్రీమన్నారాయణ, మండవ వెంకట నారాయణ గార్లము కోటేశ్వరరావుగారికి మద్దతు ఇచ్చే పరిస్థితిని గమనించి కాంగ్రెస్ హైకమాండ్ కోటేశ్వరరావుగారిని చైర్మన్‌గా ప్రకటించింది. ఆయనకు కృష్ణాజిల్లాపైన సమగ్రమైన అవగాహన, అభివృద్ధిపట్ల ఆకాంక్ష ఉంటూవుండేవి. నిత్యం ఉదయం పొలాలు చుట్టూ తిరుగుతూ వుండేవారు. నేను ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఉయ్యూరు, లేక ఇతర ప్రాంతాల్లోని గ్రామాలకు కావలసిన సౌకర్యాల విషయంలో ఆయన దృష్టికి తీసుకువెళ్ళినప్పుడు సానుకూలంగా సహకారాన్నిస్తుండేవారు. నేను శాసనసభ్యుడిగా ఉన్న కాలంలోనే చనుమోలు వెంకట్రావుగారు కొంతకాలం వ్యవసాయమంత్రిగా పనిచేశారు. వెంకట్రావుగారికి కూడా వ్యవసాయమంటే చాలా ఆసక్తి. మామిడి తోటలతోపాటు ఆయిల్‌పామ్ తోటల్ని కూడా సాగుచేస్తుండేవారు.

1978 శాసనసభ ఎన్నికల్లో దాదాపు 60మంది శాసనసభ్యులం జనతాపార్టీ తరఫున గెలుపొందాం. గౌతు లచ్చన్నగారు శాసనసభాపక్ష నాయకుడుగా ఉన్నారు. జైపాల్‌రెడ్డిగారు డిప్యూటీ లీడర్. వెంకయ్యనాయుడు, అశోక్ గజపతిరాజు, తూర్పుగోదావరిజిల్లా నుంచి ఎం.వి.యస్.సుబ్బరాజు, ముద్రగడ పద్మనాభం, గుంటూరు జిల్లా నుంచి ఈపూరు సుబ్బారావు, జాగర్లమూడి చంద్రమౌళి, కరీంనగర్ జిల్లా నుంచి పి. జనార్ధనరెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి కె.బి. సిద్ధయ్యనాయుడు కృష్ణాజిల్లా నుంచి నేను, వడ్డి రంగారావు, బూరగడ్డ నిరంజనరావు, మొక్కపాటి వెంకటేశ్వరరావు శాసనసభ్యులుగా ఉన్నాం. మార్క్సిస్టుపార్టీ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్యగారు, శ్రీమతి గుంటూరు ధనసూర్యావతిగారు సి.పి.యం.పార్టీ తరఫున ఉన్నారు. జాతీయ కాంగ్రెస్ తరఫున పిన్నమనేని కోటేశ్వరరావుగారు, మండలి వెంకట కృష్ణారావుగారు,



*నెల్లూరులో కిసాన్ సమ్మేళన్ మహాసభలలో గౌతు లచ్చన్న, తిమ్మారెడ్డి, వడ్డే ప్రభృతులు*

చనుమోలు వెంకట్రావుగారు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. మన రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ మెజార్టీని సాధించి, మర్రి చెన్నారెడ్డిగారి నాయకత్వంలో మంత్రివర్గం ఏర్పడింది. శాసనసభ ఎన్నికలు జరిగిన కొద్దిరోజులకే జాతీయ కాంగ్రెస్ తరఫున ఎన్నికైన ముగ్గురు పెద్దలు ఇందిరా కాంగ్రెస్‌లో చేరిపోయారు. గౌతు లచ్చన్నగారు అతిపిన్న వయసులోనే స్వాతంత్ర్య సంగ్రామంలోకి దుమికి, అనేక ఉద్యమాలు నడిపి, అనేకసార్లు కారాగారశిక్షను అనుభవించినవారు. ఆచార్య రంగాగారిని ఆరాధించారు. శాసనసభలో ప్రజాసమస్యల్ని సమర్థవంతంగా వినిపిస్తూ ప్రభుత్వ అవినీతిని, అసమర్థ పాలనను దుయ్యపడుతు లచ్చన్నగారు, సుందరయ్యగారు ప్రజావాణిని ప్రతిధ్వనిస్తూండే వారు. జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, ఓంకార్, కొరటాల సత్యనారాయణ, చెన్నమనేని రాజేశ్వరరావు, నేను ఎక్కువగా చర్చల్లో పాల్గొంటూవుండేవాళ్లం. వడ్డి రంగారావుగారు గాంధేయవాది. ముక్కుసూటిగా మాట్లాడే మనస్తత్వం. ఆయన అకాలమరణం వరకు నాకు ఆయనతో సత్సంబంధాలు కొనసాగుతూవచ్చాయి. 1988 డిసెంబరు అల్లర్లలో రంగారావుగారి షాపుకూడా విధ్వంసానికి గురై తీవ్రమైన నష్టానికి లోనైయ్యారు. దాని నుంచి కోలుకోలేకపోయారు. బందరులో ప్రముఖులు బాల కోటేశ్వరరావుగారు ప్రముఖ సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియా, అశోక్ మెహతా, జయప్రకాష్ నారాయణ్ మున్నగువారి సారథ్యంలో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తి. ముక్కు సూటిగా మనసులో

మాట మాట్లాడేవారు. కొనకళ్ళ గణపతిగారు కృష్ణాజిల్లాలో లచ్చన్నగారి నాయకత్వంలో గీత కార్మికుల ఉద్యమాల్లో భాగస్వామి కావడమే కాకుండా బందరులో ధాన్యోత్పత్తిదారుల మహాసభను కూడా నిర్వహించడంలో ప్రముఖపాత్ర వహించారు. జనతాపార్టీలో చీలిక తర్వాత రంగారావుగారు, బూరగడ్డ నిరంజనరావుగారు జనతాపార్టీలో ఉండగా, నేను, మొక్కపాటి వెంకటేశ్వరరావుగారు లోక్‌దళ్ పార్టీలో ఉన్నాం. మొక్కపాటి వెంకటేశ్వరరావు మంచి స్నేహపాత్రుడు. తన అనుయాయులకు ఏ విధంగానైనా సహాయం చెయ్యాలనే భావన ఉండే వ్యక్తి. శాసనసభ్యుడిగా ఉన్నా వ్యవసాయమంటే అమితమైన ఆసక్తి ఉండేది. శాసనసభ సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లో ఉన్నా ప్రతిరోజూ ఇంటికి ఫోన్‌చేసి వ్యవసాయపనులు ఏంచేశారు, ఎంతవరకు వచ్చాయని అడుగుతూవుండేవారు. కేంద్రంలో జనతాపార్టీ ప్రభుత్వం, అనంతరం లోక్‌దళ్ ప్రభుత్వం పతనమైన తర్వాత 1980 పార్లమెంటు ఎన్నికల్లో ఇందిరాగాంధీగారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాంగ్రెస్‌లో చేరిపోయారు.

నియోజకవర్గ సమస్యల్నిగానీ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఇతర ప్రాంతాల సమస్యల్నిగానీ అవసరమని భావించినప్పుడు మా నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్నగారి దృష్టికి తీసుకువెళ్లేవాణ్ని. విద్యార్థి దశనుంచి ఆచార్య రంగాగారి ఆశయాలకు అంకితమైన వ్యక్తి సుంకర సత్యనారాయణగారు. బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్య గారి తర్వాత అంతటి వాక్పటిమ గలవారు సుంకర సత్యనారాయణ గారే! తెలుగుభాషపైన పట్టు ఉండడంతో పర్యాయ పదాలతోనూ, ఉపమానాలతోనూ అనర్గళంగా ఉపన్యసిస్తూ, శ్రోతల్లో ఆనందోత్సాహాలు నింపేవారు. 'జై ఆంధ్ర' ఉద్యమంలో ఆయన చేసిన ప్రసంగాలు విద్యార్థుల్లోనూ, యువకుల్లోనూ ఎంతో ఆవేశాన్ని రగిలించి, అక్కడ తర్వాతి రోజు లాఠీఛార్జి, గాలిలో కాల్పుల వరకు దారితీసేవి. ఆ 'జై ఆంధ్ర' ఉద్యమంలోనే ఆనాడు యువకులుగా ఉన్న నేను, ముప్పవరపు వెంకయ్యనాయుడు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కంభంపాటి హరిబాబు, డాక్టర్ యలమంచిలి శివాజీ మున్నగు వారందరం అనంతరకాలంలో రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూవచ్చాం.

సుంకర సత్యనారాయణ గారికి జిల్లా నలుమూలలోని పెద్దలందరితో పరిచయాలు ఉన్నాయి. కృష్ణా జిల్లా స్థానిక సంస్థల నుండి ఇద్దరిని శాసన మండలికి ఎన్నుకోవలసి ఉంది. ప్రతి పక్షాల సంయుక్త అభ్యర్థిగా సుంకర సత్యనారాయణ గారిని నిలబెట్టి విజయం సాధించాము. శాసన మండలిలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని దుర్‌నడతను చీల్చి

చెండాడుతు ప్రసంగాలు చేస్తూ ఉండేవారు. రామారావు గారి ప్రభుత్వం శాసన మండలిని రద్దు చేసిన దర్మిలా ఆయన జిల్లా పరిషత్ ఛైర్మన్ అయ్యారు.

## ***ఉయ్యూరు తాలూకా ఏర్పాటు***

చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉయ్యూరు కూడా గన్నవరం తాలూకాలో భాగంగా ఉండేది. పరిపాలనా సౌలభ్యరీత్యా ఉయ్యూరు, మేడూరు, కపిలేశ్వరపురం, కాటూరు ఫిర్కాలను కలిపి ఉయ్యూరు తాలూకాగా ఏర్పాటు చెయ్యమని కోరినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారు. దానితో ఉయ్యూరు తాలుకా ఏర్పడింది. అంతకుముందు కపిలేశ్వరపురం, మేడూరు ఫిర్కాలకు సంబంధించి భూముల రిజిస్ట్రేషన్ ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కాకుండా పామర్రు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉండేది. దీనివల్ల ఆ రెండు ఫిర్కాల్లోని గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు గనుక ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రిగా ఉన్న నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారిని 1982 ఆగస్టు 25న కోరి అందుకు అనుకూలంగా ఏర్పాటు చేయించాను.

## ***ఉయ్యూరులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు***

అప్పట్లో ఉయ్యూరులో ఫైర్‌స్టేషన్ లేదు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే విజయవాడనుంచిగానీ, మచిలీపట్నంనుంచి గానీ రావాల్సిన పరిస్థితి ఉండేది. అక్కడనుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చేటప్పటికే చాలా నష్టం జరిగిపోతూ వుండేది. దీన్ని నివారించాలనే సంకల్పంతో ఉయ్యూరులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకోసం 1981 నుండి ప్రయత్నం కొనసాగించితే 1982-83లో ఏర్పాటయ్యింది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ఎ.వి.యస్. రెడ్డి, ఎ.పి. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ సి.కె.రెడ్డి అనంతరం కె.వి.వి.సుబ్రహ్మణ్యం, అడిషనల్ హోమ్ సెక్రటరీ జి.యస్.రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ కృష్ణమూర్తి ఎంతో సహకారాన్ని అందించారు. కె.సి.పి. జనరల్ మేనేజరుగా ఉన్న ఇంజేటి జగన్నాథరావుగారితోనూ, ఉయ్యూరు, పరిసర గ్రామాల సర్పంచ్‌లతో కలసి సమావేశాన్ని ఏర్పాటుచేశాం. వారినుంచి సహకారాన్ని సమకూర్చి ఉయ్యూరు, మంటాడ పొలిమేరలో ఒక ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయించే విధంగా కృషిచేశాం. ఉయ్యూరు కె.సి.పి.సంస్థ రూ.75 వేలు విరాళంగా ఇచ్చింది. 1983 మార్చి 2న నేను శంకుస్థాపన చేయగా, 1983 మార్చి 31న ఎ.పి.ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ బి.కృష్ణమూర్తి ప్రారంభించారు.

## వైద్య సౌకర్యాల మెరుగుదలకు కృషి


ఆరోజుల్లో కాకాని వెంకటరత్నంగారు కాటూరులో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, వీరంకిలాకులో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటుచేయించారు. శ్రీ సూరెడ్డి వెంకట్రామయ్యగారి చొరవతో కాటూరులో పి.హెచ్.సి. పనులు అన్నీ పూర్తయ్యినా వీరంకిలాకు పి.హెచ్.సి. నిర్మాణం పనులు పూర్తయి వుండలేదు. ఫలితంగా అక్కడకు వెళ్ళే రోగులకు చాలా ఇబ్బందిగా ఉండేది. టైప్ డిజైన్ ప్రకారం భవనముల నిర్మాణం పూర్తి చెయ్యాలని ఫ్యామిలీ ప్లానింగ్ ఎన్క్సి మరియు 6పడకల వార్డు భవనములను నిర్మించవలెనని ఆర్ & బి డిపార్ట్మెంట్ ఛీఫ్ ఇంజనీర్ వెల్లంకి రామారావుగారిని 1982 ఏప్రిల్ 26న కోరాను. 1982 జనవరి 5న మినిమం నీడ్స్ ప్రోగ్రాం క్రింద ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చెయ్యాలని పంచాయితీ రాజ్ శాఖామంత్రిని కోరాను. తాలూకా హెడ్క్వార్టర్స్ అయిన ఉయ్యూరులో ప్రభుత్వ ఆసుపత్రి లేదు. ఉయ్యూరు గ్రామపంచాయతీ సర్పంచ్ అన్నే బాబూరావుగారితో సంప్రదించి 5 పడకల ప్రభుత్వాసుపత్రిని ఏర్పాటు చెయ్యడానికి అవసరమైన భవన వసతిని, సంవత్సరానికి 25వేల రూపాయలు మందుల నిమిత్తం ఇవ్వడానికి ఉయ్యూరు గ్రామ పంచాయతీతో తీర్మానం చేయించాం. నాడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సరోజిని పుల్లారెడ్డి గారికి అనంతరం మదన్ మోహన్గారికి తర్వాత రామమునిరెడ్డిగారికి ఈ విషయాల్ని ప్రతిపాదించగా సానుకూలంగా స్పందించారు. ముందుగా ఉయ్యూరు పాత పంచాయతీ కార్యాలయ సముదాయ ప్రాంగణంలో కొద్దిస్థాయిలో ప్రారంభించిన ఈ ఆసుపత్రి అనంతరకాలంలో కాటూరు రోడ్డులో పలువురు స్థానిక పెద్దలు, కె.సి.పి. సంస్థ సహకారంతో 30 పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకుంది.

ఉయ్యూరుకు సమీపంలో ఉన్న కనుమూరు గ్రామం చాలా ప్రసిద్ధి చెందిన గ్రామం. ఈ గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రామ్కుమార్వర్మ, రాజ్యసభ సభ్యుడు, రంగాజీ శిష్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ వంటి ఎందరో ప్రముఖులు ఈ గ్రామంలో జన్మించారు. చెడుగుడు, కబాడీ ఆటలకు కనుమూరి సత్యంగారు, వారి టీం ఎంతగానో పేరుగాంచింది. ఈ గ్రామం నుంచి వందలాదిమంది విజయవాడ, హైదరాబాద్, రాయచూర్, బళ్ళారి వంటి ప్రాంతాలకు వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ పనుల్ని చేపట్టడానికి వెళ్ళారు. ఆ గ్రామంలో యలమంచిలి తిరుమలరావుగారు మొదటినుంచి స్వతంత్ర పార్టీ అభిమాని. ఆయన కుమారుడు చిదంబర సీతారామారావు మొదలైనవారు కనుమూరులో రూరల్ డిస్పెన్సరీని ఏర్పాటు చేయడానికి ఒక భవనాన్ని సమకూర్చడానికి

ముందుకువచ్చారు. ఈ విషయాన్ని 1981 నవంబర్ 2న జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా దాన్ని ఏర్పాటుచేశారు.

## ఎదురు మొండి స్కీం - దేవీలాల్ గారిచే ప్రారంభం

నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ గ్రామాలు కృష్ణానది గర్భంలో ఉన్నాయి. చాలా సారవంతమైన భూములు. అయితే సముద్రానికి అతి సమీపంలో ఉండడం వల్ల మంచినీటి సౌకర్యం, సాగునీటి సౌకర్యం లేవు. మండలి వెంకటకృష్ణారావుగారు, సైకం అర్జునరావుగారు, ఇంకా ఆ గ్రామాల ప్రజల అభ్యర్థనను దృష్టిలో పెట్టుకుని ముక్కామల నాగభూషణంగారు కెనడాకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో కృష్ణా వెస్ట్ బ్యాంకు కెనాల్ నుంచి పంపుల ద్వారా నది దిగువ భాగం నుంచి పైపులు వేసి ఈ రెండు గ్రామాలకు తాగునీరు, సాగునీరు లభించే వసతిని



*ఎదురుమొండి స్కీంను ప్రారంభిస్తున్న ఉప ప్రధాని దేవీలాల్, ముక్కమల నాగభూషణం, వడ్డే*

ఏర్పరిచారు. పథకం పూర్తయిన అనంతరం భారత ఉపప్రధాని చౌదరి దేవీలాల్‌గారిని ఆహ్వానించడానికి నేను, నాగభూషణంగారు రెండుసార్లు ఢిల్లీ వెళ్ళాం. ఈ కార్యక్రమానికి అప్పటి భారత ఉపప్రధాని చౌదరి దేవీలాల్‌గారు వచ్చిన సందర్భంలో యలమంచిలి శివాజీగారు ఆయనను ఆ గ్రామానికి ఆహ్వానించారు. ఆ ఆస్పత్రి ప్రాంగణంలో చక్కని

కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల ఆ ఆస్పత్రికి అదనపు నిధులు మంజూరై, భవన విస్తరణ జరుగుతున్నదని తెలిసి ఎంతగానో సంతోషించాను.

***పలు గ్రామాలకు ఆర్.టి.సి. బస్ సౌకర్యం***

అప్పటికి ఉయ్యూరు నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. యార్లగడ్డ రామశేషగిరిరావు (బుజ్జి)గారి నాయకత్వంలో గ్రామస్తుల కోరిక మేరకు పెనుమత్స గ్రామానికి, కొల్లి వెంకటేశ్వరరావుగారు, ఇతర గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు అయినపూరు గ్రామానికి, గూడపాటి బుచ్చిబాబు, కాట్రగడ్డ చినవీరరాఘవయ్య, సూరపనేని నాగేశ్వరరావు మొదలైనవారి సూచన మేరకు ఉయ్యూరు–అయిలూరు బస్సును గరికపర్రు మీదుగా నడపడానికి, పుచ్చకాయల సర్వారెడ్డిగారు ప్రభృతుల సూచన మేరకు భద్రిరాజుపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని విస్తరింపజేయడం జరిగింది. గొంది వెంకట్రాయుడు, రావి రాజారావు, యనమదల సుబ్బారావు మున్నగు మద్దూరు గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఆ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయించాం. తాలూకా కేంద్రం, బందరు బెజవాడల మధ్యలో ఉన్న ఉయ్యూరులో బస్సు స్టేషన్ ఆవశ్యకత ఉన్నదని, ఆర్.అండ్.బి. డిపార్ట్‌మెంట్‌వారు ఉయ్యూరులోని ఇన్‌స్పెక్షన్ బంగళాను ఆర్.టి.సి. బస్టాండ్‌కు ఇచ్చుటకు 1977 ఆగస్టు 3న నిర్ణయం జరిగినదని, అయితే ఆర్.టి.సి. వైస్ చైర్మన్ నుండి 1981 జూన్ 15న వ్రాసిన లేఖ వలన ఆ నిర్ణయము ఉపసంహరించుకొనబడినదని, అది సరికాదని, తిరిగి బంగళాలోనే బస్‌స్టేషన్ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా ఆర్.టి.సి. వైస్ చైర్మన్ & ఎం.డి. పి.యస్. రాంమోహనరావుగారిని కోరటం జరిగింది. అనంతర కాలంలో పెద్దవంతెన సమీపంలో దేవస్థాన భూమిలో బస్సుస్టేషన్, డిపోలు నిర్మించడ్డాయి.

***రామాలయాల నిర్మాణం***

అప్పట్లో రాష్ట్రప్రభుత్వం హరిజనవాడల్లో రామాలయాలు నిర్మించడానికి ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామస్తులు వెయ్యి రూపాయల సహకారం, ఒక వెయ్యిరూపాయిల విలువైన శ్రమదానం చెయ్యడానికి ముందుకు వస్తే ప్రభుత్వం ఎనిమిదివేల రూపాయల సహకారాన్ని అందించే విధంగా ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. అమీనాపురం హరిజనవాడలోనూ, లంకపల్లి గ్రామశివారు వెట్టివానిగూడెం హరిజనవాడ, చాగంటిపాడు కొత్తహరిజనవాడలోనూ, కలవపాముల గ్రామంలోని పెదమాలపల్లిలోనూ ఆ పథకం కింద రామాలయాల్ని నిర్మింపజేశాం. తెల్లాకుల పాలెంలోని రామాలయాన్ని పునరుద్ధరింపజేశాం. ఇవేకాకుండా కృష్ణాపురం శివారు నారాయణపురం గ్రామంలో

కూచిభొట్ల చలమయ్య చొరవతో చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయాన్ని, వల్లూరుపాలెం గ్రామంలోని గౌడ రామాలయాన్ని అచ్చంపాలెం గ్రామంలోని దేవాలయంలను అభివృద్ధి చెయ్యడానికి నావంతు కృషిచేశాను.

అమీనాపురం హరిజనవాడ రామాలయం ప్రారంభోత్సవానికి దేవాదాయశాఖా మంత్రి పి.వి. చౌదరిగారిని ఆహ్వానించాను. ఆయన విజయవాడ వచ్చి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వుండగా కాకాని రామమోహనరావుగారు ప్రతిపక్షాల వారి కార్యక్రమంలో మీరు పాల్గొనడమేమిటని తాను అడగడమే కాకుండా పిన్నమనేని కోటేశ్వరరావు, చనుమోలు గార్లకు కూడా ఫోన్‌చేసి వారితో మాట్లాడించారు. అయితే పి.వి. చౌదరిగారు ఇది మన ప్రభుత్వ కార్యక్రమం. ఈ ప్రాంతంలో ఇదే మొట్టమొదటగా నిర్మాణమైన రామాలయం అని, విజయవాడ వరకు వచ్చిన తర్వాత కార్యక్రమంలో పాల్గొనకపోవడం సమంజసంగా ఉండదని చెప్పి వచ్చి ఆయన దేవాలయాన్ని ప్రారంభించారు.

ఉయ్యూరు గ్రామంలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయానికి ఆనుకునివున్న 1200 చదరపు గజాల భూమిని ఆనాటి కాంగ్రెస్ పెద్దలు అడ్డుపడినప్పటికీ, కలెక్టర్ ఎ.వి.ఎస్. రెడ్డి, జాయింట్ కలెక్టర్ చెంగప్ప, ఆనాటి ఆంధ్రప్రదేశ్ టెలీకమ్యూనికేషన్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌గావున్న త్రిపురనేని హనుమాన్‌చౌదరిగారు, దేవాదాయశాఖ మంత్రి పి.వి.చౌదరిగారు అందించిన సహకారంతో ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరింపజేశాను.

## <u>*పలు వంతెనల నిర్మాణం*</u>

చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెం గ్రామం వద్ద కె.ఇ.బి.కెనాల్‌పై వంతెనను నిర్మింపజేయాలని మర్రెడ్డి గోవిందరెడ్డిగారు, కళ్లం వెంకటప్పారెడ్డి, కళ్లం రామిరెడ్డి, కళ్లం కోటిరెడ్డి, మున్నగువారు కోరిన మీదట ఆ వంతెనను నిర్మింపజేశాం. అలాగే మద్దూరు గ్రామంవద్ద కె.ఇ.బి. కెనాల్‌పై నాటి గ్రామ మున్సిఫ్ రావి కోటేశ్వరరావు, గొంది రామబ్రహ్మం, సర్పంచ్ గొంది వెంకట్రాయుడు, రావి రాజారావు, మాదల సుబ్బారావు, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు వల్లభుని కోటయ్య, ఈడే రాధాకృష్ణమూర్తి మున్నగువారు కోరిన మీదట వంతెనను నిర్మింపజేశాం. ఆ గ్రామంలో శ్రీమతి స్నేహలతా రామారావుగారు పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని ఇవ్వడమేగాక 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి చక్కని భవన నిర్మాణానికి వీలు కల్పించారు.

దేవరపల్లిలో కె.ఇ.బి. కెనాల్‌పైన షుగర్‌కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, గ్రామస్తులు, జిల్లా పరిషత్ సహకారంతో నిర్మించిన వంతెనను నాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి బాగారెడ్డిగారితో ప్రారంభం చేయించాను. దేవరపల్లి గ్రామంలో బొంతు అంజిరెడ్డి, కళ్ళం పూర్ణారెడ్డి, పున్నారెడ్డి, సిరిసైన బసివిరెడ్డి మున్నగువారు చక్కని సహకారాన్ని అందిస్తూండేవారు.

ఉయ్యూరు శివారులోని ఎగినపాడు, నాగన్నగూడెంలు రైవస్ కాలువకు అవతల పక్కన ఉండేవి. రెండు గ్రామాలవారు వెనుకబడిన వర్గాలవారు, షెడ్యూల్డ్ కులాలవారు. వృద్ధులు అనారోగ్యంపాలైనప్పుడు, మహిళలు ప్రసూతి సమయంలో ఉయ్యూరు వచ్చేందుకు చేలగట్టుపైన నడుస్తూ చాలా ఇబ్బంది పడుతూఉండేవారు. గొర్ల సుబ్బారావు, చక్రవర్తి, కట్టా బిక్షాలు, నారగాని అర్జునరావు మున్నగువారి సూచనపై ఎ.వి.యస్. రెడ్డిగారు, అడుసుమిల్లి సుబ్రహ్మణేశ్వరరావు, వల్లూరి పూర్ణచంద్రరావు, యలమంచిలి వెంకటకృష్ణారావు, ప్రభృతుల సహకారంతో ఉయ్యూరు వైపు నుంచి ముందుగా రహదారిని ఏర్పాటుచేయించాను. నాగన్నగూడెం పక్కనే చంద్రయ్య డ్రెయిన్‌పైన వంతెన నిర్మాణానికి ఉయ్యూరు పంచాయతీ నిధులేగాక ఉయ్యూరు పంచాయతీ సమితి తరఫున కూడా ఉయ్యూరు పంచాయతీ నిధులు సర్పంచ్ అన్నే బాబూరావు సహకారంతో జతచేసి జిల్లా పరిషత్ సహకారంతో వంతెన నిర్మాణం చేయించడానికి మంజూరు ఇప్పించినప్పటికీ ఈ నిర్మాణం పనుల్లో చాలా ఆలస్యం జరిగింది. కొద్ది సంవత్సరాల క్రితమే ఈ వంతెన నిర్మాణం జరిగింది. అనంతర కాలంలో రైవస్ కాలువ మీద గ్రామ ప్రజలు సుమారు రూ. 3లక్షలు, కె.సి.పి. సంస్థ రూ. 4లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వంతెనను నిర్మింపజేశాను. ఈ విషయంలో శాసనసభ్యులు అన్నే బాబూరావు, గ్రామాధికారి మోటూరు వెంకటేశ్వరరావు, కె.సి.పి. సంస్థవారు, గొర్ల కృష్ణారావు ప్రభృతుల కృషి వుంది.

ఉయ్యూరు-అయిలూరు రోడ్డులో బందరు కాలువపైన ఉన్న వంతెన సమీపంలో కనకవల్లి డ్రెయిన్‌పైన వున్న వంతెన పురాతనమైనది కావడంవల్ల అక్కడ అయిలూరు వైపునుంచి చెరకు బళ్లు వంతెన దిగి వెంటనే ఎడమవైపునకు తిరిగి, కొద్ది దూరంలోనే కుడివైపునకు తిరగాల్సిన అవసరం ఉంది. దీని కారణంగా అనేకసార్లు బళ్లు బోల్తాపడి, ఎడ్లు, బళ్లుకూడా దెబ్బతినేవి. అనేక సందర్భాల్లో జరుగుతున్న ఈ సంఘటనల్ని దేవరపల్లి, కలవారిపాలెం, చాగంటిపాడు, పెనమకూరు గ్రామాల్లోని ముఖ్యులు నాదృష్టికి తీసుకురాగా, అక్కడ కనకవల్లి డ్రెయిన్‌పైన అయిదవ కిలోమీటరువద్ద నూతనంగా

వంతెనను నిర్మించాల్సిన ఆవశ్యకతను రోడ్లు భవనాలశాఖ ఛీఫ్ ఇంజనీర్ టి. కృష్ణమూర్తి గారి దృష్టికి 1982 ఫిబ్రవరి 18న తీసుకువెళ్లి దాన్ని నిర్మింపజేశాను.

రైవస్ కాలువపై కడవకొల్లు వద్దవున్న వంతెన దాదాపు 130సంవత్సరాలక్రితం నిర్మించబడింది. అది పాక్షికంగా దెబ్బతిన్న సందర్భంలో అనేక గ్రామాలనుంచి చెరకు, ధాన్యం, అపరాలవంటి వ్యవసాయోత్పత్తుల రవాణాతో పాటు బస్సుల నిర్వహణకు ఆటంకం కలుగకుండా తక్షణ చర్యలు తీసుకునేటట్లు చేయవలసినదిగా శాసన సభలో ప్రస్తావించడమేగాక నాటి ఆర్.అండ్.బి. మినిష్టర్. కె. రోశయ్య గారికి 1980 ఫిబ్రవరి 22న విజ్ఞప్తి చేసి అక్కడ పక్కా వంతెన నిర్మాణం చేయించడం జరిగింది.

వీరంకిలాకువద్ద పురాతనకాలంలో నిర్మించబడిన వంతెన ఇరుకుగా వుండి, చెరకు తోలకం సమయంలో రైతులకు ఇబ్బందికరంగావున్న పరిస్థితిని వివరిస్తూ, వెడల్పుగా పక్కనే వంతెనను నిర్మించవలసిన ఆవశ్యకతతో ప్రతిపాదనను ఆర్&బి వారికి అందించడం జరిగింది. అనంతరకాలంలో కె.పి.రెడ్డయ్య శాసనసభ్యుడుగా ఉండగా ఎన్.టి. రామారావు గారి ప్రభుత్వ హయాంలో నూతనంగా వంతెన నిర్మాణం జరిగింది.

***<u>రహదారుల అభివృద్ధి</u>***

నియోజకవర్గంలో ప్రధానమైన మంటాడ–లంకపల్లి, ఉయ్యూరు–అయిలూరు, తేలప్రోలు–ఉయ్యూరు– తోట్లవల్లూరు ప్రధాన రహదారుల్ని సక్రమంగా నిర్వహించేటట్లు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకునేవాణ్ని.

ఉయ్యూరు–అయిలూరు రోడ్డులో అయిలూరు గ్రామంలో మాజీ శాసనసభ్యులు కడియాల వెంకటేశ్వరరావు గారి ఇంటి సమీపంవరకు వచ్చి రోడ్డు ఆగిపోయింది. అక్కడనుంచి అయిలూరు గ్రామంలోకి రహదారిని అభివృద్ధి చేయించడం జరిగింది. చోడవరం, కాసరనేనివారిపాలెం జిల్లా పరిషత్ రోడ్డులో ఒక ఫర్లాంగు రోడ్డు వారి లెక్కల్లోకి రాలేదు. అంతవరకు దాన్ని వారు బాగు చేయించకపోవడంతో అక్కడ అధ్వాన్న స్థితిలో ఉండేది. జిల్లా పరిషత్ అధికారులతో మాట్లాడి, దాన్ని చేర్పించి అభివృద్ధి చేయించాను. ములకలపల్లి లంకనుంచి కనిగిరిలంకకు రోడ్డు అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయించాను. ముళ్ళపూడి నుంచి వేల్పూరుకు పనికి ఆహారం పథకం కింద గ్రాంటు వచ్చేలా చేసి రహదారిని అభివృద్ధి చేయించాను.

మంటాడ–లంకపల్లి రహదారిలో పైడిముక్కల చెరువువద్ద, చోరగుడిలో చెరువువద్ద మంటాడ లంకపల్లి రహదారి కోతకు గురౌతూ ఉన్నందున, ఉయ్యూరు–అయిలూరు

రోడ్డులో గురివిందపల్లి సమీపంలోనూ  రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని ఆర్ & బి ఎస్.ఇ. విష్ణురావుకు 1982 జూన్ 28న తెలియపరచి రిటైనింగ్‌వాల్స్ నిర్మాణం జరిగేటట్లు చేశాను.

ముసునూరు సాంబశివరావు, గరికిపాటి కృష్ణారావు మున్నగు కాసరనేనివారిపాలెం గ్రామస్తులు, వణుకూరు-మద్దూరు రోడ్డులో పాపయ్య చెరువువద్ద నుంచి కాసరనేనివారి పాలెం గ్రామానికి గల మట్టిడొంకను పక్కా రహదారిగా అభివృద్ధి పరిస్తే రైతులు తమ వ్యవసాయోత్పత్తుల్ని, ముఖ్యంగా చెరకు పంటను సులభంగా తోలడానికి వీలుంటుందని చెప్పారు. దీనికి గ్రామస్తులు రూ.11,000, కలెక్టర్ ఎ.వి.యస్.రెడ్డిగారి సహకారంతో రూ. 19,000 విలువైన ఆహార ధాన్యాలను పనికి ఆహారం పథకం క్రింద వినియోగించి ఈ రహదారిని చక్కగా అభివృద్ధి చేయడం జరిగింది.

పైడికొండలపాలెం గ్రామంనుంచి చెరకుబళ్లు బందరుకాలువ కుడిగట్టు ఎక్కవలసివస్తూ, ఎద్దులకు చాలా ఇబ్బంది కలుగుతూ ఉండేది. ఆ గ్రామస్తులు ఈ విషయాన్ని నా దృష్టికి తెచ్చినప్పుడు వీరంకిలాకు సమీపంలోగల ప్రభుత్వ భూమిలో నుంచి పైడికొండలపాలెం గ్రామ రహదారికి కలిపించాను. ఈ రోడ్డును గ్రామస్తులు జనతారోడ్డుగా పిలిచేవారు.

గండిగుంట శివారు మూర్తిరాజుగూడెం, మేడూరు శివారు జువ్వలపాలెం, ములకలపల్లి, గురివిందపల్లి, కపిలేశ్వరపురం శివారు ముత్తరాశిపాలెం, ఉయ్యూరు మొదటి వార్డు గిరిజనవాడ, చాగంటిపాడు శివారు పిల్లివాని లంక గ్రామాలకు గ్రామీణ విద్యుదీకరణ పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది. రత్నం నరసింహారావు మున్నగు గ్రామస్తుల కోర్కెపై వేల్పూరు గ్రామానికి రహదారి సౌకర్యము కల్పించడమే గాక త్రాగునీటి సౌకర్యమును కల్పించాను.  పెద్దు వెంకటనారాయణ మరియు గ్రామస్తుల కోర్కెపై కాసరనేనివారి పాలెం గ్రామానికి మినీ పి.డబ్ల్యు.యస్. మంచినీటి పథకాన్ని మంజూరు చేయించాను.

***<u>బలహీన వర్గాలకు సాగుభూమి, ఇళ్ళస్థలాలు</u>***

చాగంటిపాడు గ్రామంలో వెనుకబడిన వర్గాలవారికి లంక భూమిని లీజుకు ఇప్పించాను. చాగంటిపాడు 'బ్యాక్‌వర్డ్ క్లాసెస్, లేబర్ కోఆపరేటివ్ సొసైటీ' ద్వారా ఈ ఏర్పాటు జరిగింది.

మద్దూరుగ్రామంలో రెండు దశాబ్దాలుగా వివాదంలో ఉన్న లంకభూమిని రైతుల్ని

ఒప్పించి పల్లెకారులు, గౌడకులస్తులు సభ్యులుగా ఉన్న బి.సి. సొసైటీకి ఇప్పించడమేగాక కృష్ణానది మీదుగా విద్యుత్ సదుపాయాన్ని కల్పించాను. ఫలితంగా చెరకు, పసుపువంటి అనేకపంటల్ని పండించుకుంటూ వారంతా ఈనాడు ఆర్థికంగా ప్రగతిని సాధించారు.

భద్రిరాజుపాలెం హరిజనులకు, పాముల్లంక హరిజనులకు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న లంకభూమి వ్యవహారాన్ని సరిచేయించాను. చాగంటిపాడులోని వెనుకబడిన కులాలవారికి, హరిజనులకు, కళ్లంవారిపాలెం హరిజనులకు మధ్య నూతనంగా తేలిన లంకను న్యాయంగా విభజించి, రెవిన్యూవారితో అంగీకరింపజేశాను. అప్పట్లో విజయవాడ తహసీల్దార్‌గా ఉన్న యస్.వెంకటేశ్వరరావుగారు చక్కని సహకారాన్ని ఇచ్చారు. లంకపల్లి గ్రామంలో గండ్రపు రాఘవులు, మోటూరు సుబ్బయ్య మున్నగు హరిజనులకు లంకభూమిని ఇప్పించాను.

ఉయ్యూరు గ్రామంలో చాలాకాలంగా వీరమ్మచెరువు గట్టుపై నివసిస్తున్న హరిజనులకు, పాముల్లంక, శ్రీరంగాపురం, గురివిందపల్లి, కృష్ణాపురం, దేశన్నపాలెం, కూడేరు, వీరంకిలాకు, వల్లూరు పాలెం, రొయ్యూరు, శాయిపురం గ్రామాల్లో హరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం జరిగింది. కృష్ణాపురం శివారు మగ్గాన మాలపల్లికి డొక్కుమాల బ్రహ్మం, ఇంకా ఇతరుల అభ్యర్థన మేరకు అగినపర్రు, మామిళ్ళపల్లి రైతులనుంచి రహదారికి భూసేకరణ జరిపించి రహదారిని ఏర్పాటు చేయించాను.

గురజాడ, పెద ఓగిరాల గ్రామాల్లోని వడ్రంగులకు, చర్మకారులకు, గండిగుంట, వెంకటాపురం గ్రామాల్లోని నూనెగానుగలవారికి ఖాదీబోర్డు నుంచి, శ్రీరంగాపురంలోని యాదవులకు గొర్రెలను ఎస్.ఎఫ్.డి.ఏ.నుంచి ఆర్థిక సహకారాన్ని అందింపజేశాను.


### <u>*జమీందారీ కాల్వలను కూడ ప్రభుత్వం బాగుచేయాలి*</u>

అప్పట్లో ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ కాలువలే కాకుండా జమీందారు కాలువలనేవి ఉండేవి. నీటిపారుదలశాఖ వారు ప్రభుత్వ కాలువలకు మాత్రమే వార్షిక మరమ్మతులను చేస్తుండేవారు. ఫలితంగా ఆ కాలువలు అధ్వాన్న స్థితిలో ఉండి, ఆ కాలువల కింద ఉన్న రైతులకు నీరు రావడానికి ఇబ్బంది కలిగేది. స్వాతంత్ర్యానికి పూర్వం యలమర్రు గ్రామం యలమర్రు జమీందారుగారి ఇలాకాలో ఉండేది. యలమర్రు గ్రామస్తులు జమీందారీ కాలువల అంశాన్ని నా దృష్టిలోకి తెచ్చినప్పుడు ఆనాడు మీడియం ఇరిగేషన్

మంత్రిగా ఉన్న ఓబుల్‌రెడ్డిగారు, మేజర్ ఇరిగేషన్ మంత్రిగా ఉన్న జి.వి. సుధాకర్‌రావుల దృష్టికి తీసుకెళ్ళాను. జమీందారీ కాలువల కింద రైతులు కూడా గవర్నమెంట్ కాలువల కింద ఉన్న రైతుల మాదిరిగానే నీటి తీరువా, భూమిశిస్తు వగైరాలు చెల్లిస్తూ వున్నారు. ఇందువల్ల క్లాసిఫికేషన్ మార్పు చేసి ఆ కాలువలకు కూడా గవర్నమెంట్ మరమ్మతులు నిర్వహించాలని కోరి అంగీకరింపజేశాను. ఈ విషయంలో ఆనాడు డ్రెయినేజ్ బోర్డ్ అధ్యక్షులుగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్యగారు కూడా ఎంతగానో సహకారాన్ని అందించారు.

**_క్రింది నుండి సాగు పద్ధతిని ఉపసంహరించాలి_**

నేను శాసన సభ్యుడుగా ఎన్నికైయ్యే నాటికి 3 సంవత్సరముల ముందునుండి కృష్ణా డెల్టాలో క్రింది నుండి సాగు పద్ధతి అనుసరించబడుతూంది. విజయవాడ నుండి పామర్రు వరకు మాత్రమే బోర్లు సౌకర్యం ఉంది. ఎగువ ప్రాంతంలో బోర్లు క్రింద నారుమళ్ళు పెంచుకునే సౌకర్యం ఉన్నా నాట్లు వేసుకునేందుకు అనుమతి లేదు. దిగువున నారు మళ్ళు పెంచి నాట్లు వేసే లోపల చాలా నీరు సముద్రములోకి వృధాగా పోతూ ఉంది. ఈ అంశాన్ని 1987 ఏప్రియల్ 17న ఇరిగేషన్ శాఖా మంత్రికి, కలెక్టర్‌కు ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. ప్రముఖ ఇంజనీరు కె. శ్రీరామ కృష్ణయ్యగారిని



*ప్రముఖ ఇంజనీర్ కె. శ్రీరామకృష్ణయ్య గారితో*

విజయవాడలో డ్రైనేజ్ గెస్ట్‌హౌస్‌లో కలిసినప్పుడు అడుగగా కృష్ణా డెల్టాలో పై నుంచి సాగు అవుతూ దిగువున నారుమళ్ళు పెంచుకుంటూ తదుపరి నాట్లు వేసే విధానం ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కె.యల్. రావుగారి తర్వాత శ్రీరామకృష్ణయ్యగారు మన రాష్ట్రంలో ఇరిగేషన్ అభివృద్ధికి ఎంతో దోహదం చేశారు. తెలుగుగంగ, గాలేరు–నగరి, హంద్రీ–నివా, వెలుగొండ మున్నగు పలు పథకాలకు ఆయన రూపకర్త. ఇందుకు ప్రభుత్వాన్ని అంగీకరింపచేయడంలో సుందరయ్యగారు, పిన్నమనేని కోటేశ్వరరావుగారు కూడా సహకరించారు.

కంకిపాడు లాకుల వద్ద నుంచి బందరు కాలువ పక్కగా 'వెస్ట్ సైడ్ ఛానల్' నడుస్తోంది. మధ్యలో ఏనుగులకోడు డ్రెయిన్ ఉంది. తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం గ్రామాల రైతులకు సాగునీరు ఈ కాలువల ద్వారా అందించడం చాలా ఆలస్యమవుతూ ఇబ్బంది కలుగుతోంది. ఈ రెండు గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు బందరు కాలువ నుంచి సరాసరి పైపుద్వారా నీరు తీసుకునేందుకు సూపరింటెండింగ్ ఇంజనీరుగా ఉన్న వై.పి.సి.చౌదరిగారితో మాట్లాడి ఏర్పాటు చేయించాను. ఆర్.సి.సి. ట్రఫ్ ద్వారా ఆ పొలాలకు నీరు అందుతూవుంది.

ఇదేవిధంగా ధూళిపూడిపాలెం గ్రామ రైతులకు కూడా మేడూరు ఛానల్ నుంచి డైరెక్ట్ పైపుద్వారా నీరు తీసుకురావడానికి అనుమతినిప్పించినా వారు ఉపయోగించుకోలేకపోయారు. వల్లూరుపాలెం వద్ద ఏనుగులకోడులోకి పెద్దయెత్తున వర్షపు నీరు వచ్చినప్పుడు బందరు కాలువలోకి ఆ నీరు ప్రవహించేటట్లు ఇన్‌ఫాల్ షట్టర్లు ఏర్పాటు చేయించాను. ఫతేలంక ఛానల్‌ను కూడా అభివృద్ధి చేయించిన పర్యవసానంగా రైతులకు చాలా ప్రయోజనం చేకూరింది.

పెనుమత్స, అయినపూరు, గురివిందపల్లి, దేవరపల్లి, సాయిపురం, పెద ఓగిరాల, మామిళ్లపల్లి గ్రామాల్లోని డ్రెయిన్ల అభివృద్ధికి కృషిచేశాను. వీరంకి గ్రామం వద్ద వీరంకి డ్రెయిన్ పైన కల్వర్టును, కనకవల్లి డ్రెయిన్ పైన పాత బ్రిడ్జీ స్థానములో క్రొత్త బ్రిడ్జిని నిర్మించాలని వీరంకి గ్రామ సర్పంచి కాసాని పూర్ణచంద్రరావు ప్రభృతుల సూచన మేరకు డిపార్ట్‌మెంట్‌ను కోరాను. కె.సి.పి. ఫ్యాక్టరీ నుంచి మంటాడ, కపిలేశ్వరపురం గ్రామాల భూములమీదుగా అయినంపూడి వద్ద కలిసే మలాస్ డ్రెయిన్ కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేసే విషయంలో జరిగిన జాప్యాన్ని నివారించడానికి కృషిచేశాను. బందరు కాలువ కుడిగట్టుపైన అగినపర్రు శివారు బొడ్డువానిగూడెం గ్రామ హరిజనులు కొంతకాలంగా సాగుచేసుకుంటూ వున్నారు. మధ్యలో వీరిని తొలగించడానికి

ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నాన్ని అడ్డుకుని హరిజనులకు అందులో పంటలు వేసుకునే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

రైవస్ కాలువలో కోమటిగుంట లాకులకు ఎగువ వైపున మేట తీయు పనిలో చాలా అవకతవకలు జరుగుతున్నాయని 1982 మే 29న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్‌లో వార్త రాగా నాటి యస్.ఇ. వై.పి.సి. చౌదరి గారికి దృష్టికి తీసువెళ్ళగా 1982 జూన్ 1న ఇన్స్‌స్పెక్షన్ ఏర్పాటు చేయగా నేను, నాడు శాసనమండలి సభ్యుడిగా ఉన్న సుంకర సత్యనారాయణగారు, పుచ్చలపల్లి సుందరయ్యగారు వెళ్ళి పరిశీలించాము. తవ్వింది తక్కువలోతు ఎక్కువ లోతు తవ్వినట్లుగా మట్టి దిమ్మలు ఏర్పాటు చేయబడి ఉన్నాయి. ఎస్.ఇ. వెంటనే సరియైన చర్యలు తీసుకున్నారు. అయిలూరు గ్రామంలో కె.ఇ.బి. కెనాల్‌పై ఫెర్రీ నిర్వహణ బాధ్యతను తీవ్రమైన పోటీమధ్య గ్రామ పంచాయతీకి ఇప్పించాను.

కనకవల్లి గ్రామసమీపములో ఏనుగులకోడు డ్రెయిన్‌పైన కాలిబాట వంతెన నిర్మింపచేయవలెనని 1981 మే 5న యస్.సి. గారిని కోరటం జరిగింది. అలాగే దావులూరు గ్రామంలో చౌకధరల దుకాణం బాధ్యతను గ్రామ పంచాయతీకి వచ్చే విధంగా కృషిచేశాను. దావులూరు గ్రామం హరిజనులు అధికంగావున్న గ్రామం. ఆ గ్రామంలో నత్తా నాంచారయ్య, జాన్, గాలంకి కోటేశ్వరరావు, అంజిరెడ్డి, మున్నగువారు పార్టీకి గట్టి మద్దతునిస్తూండేవారు.

ఉయ్యూరులో కె.సి.పి. షుగర్ ఫ్యాక్టరీకి ఉత్తరం వైపున పేపర్ ప్లాంట్ పెట్టాలని ఉద్దేశ్యంతో 50 ఎకరాలను ఎ.పి. ఐ.ఐ.సి ద్వారా సేకరింపచేసింది. దానిలో 5ఎకరములలో ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌ను ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా పరిశ్రమల శాఖా మంత్రి బాగారెడ్డిగారిని 1981 జూలై 11న కోరాను. ఇదే విషయమై 1981 ఆగస్టు 5న ఏ.పి.ఐ.ఐ.సి. వైస్ చైర్మన్ ఎం.డి. సుషీల్‌కుమార్‌గారిని కూడా కోరాను. కె.సి.పి. సానుకూలముగా స్పందించనందున ఈ ప్రతిపాదన కార్యరూపం ధరించలేదు.

కపిలేశ్వరపురం పెద్ద గ్రామం. స్వాతంత్ర సమరయోధులు కొల్లిపర సూరయ్యగారు శాసనసభ్యునిగా కూడా చేసి ఉన్నారు. కొల్లిపర సత్యనారాయణగారు గ్రామ సర్పంచ్‌గా ఆ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నా సహకారంతో, అన్నే బాబూరావుగారు, సుంకర సత్యనారాయణగారి సహకారంతో అమలు చేశారు. జిల్లా గ్రంధాలయ సంస్థ భవనము వెటర్నరీ ఆస్పత్రి భవనము, మంచినీటి పథకము, ఎలిమెంటరీ స్కూలు భవనము, హరిజనవాడ శ్మశాన అభివృద్ధి మున్నగు అనేక కార్యక్రమాలను అమలు చేశారు.

కొల్లిపర సాంబశివరావు (అబ్బులు), లంకా వెంకటేశ్వరరావు గురవయ్య నాకు ఎంతో సన్నిహితముగా ఉండేవారు.

చిన ఓగిరాల మీదుగా బందరురోడ్డు నుండి బద్రిరాజుపాలెం, ముదునూరు, శాయిపురం మీదుగా వెంటప్రగడ నుండి మంటాడ రహదారులను ఆర్ & బి డిపార్ట్‌మెంటు పరిధిలోకి తీసుకోవాలని రహదారులు మరియు భవనముల శాఖా మంత్రిని కోరడం జరిగింది.

## ఉయ్యూరులో బైపాస్ రోడ్డు అవసరం

ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీ నడుస్తూ ఉండగా విజయవాడవైపు నుండి కాటూరు వైపు నుండి వచ్చు చెరుకు బండ్లు ప్రధాన రహదారిలో సెంటర్ మీదుగా వెళ్లవలసి ఉన్నందున అనేక పర్యాయములు ట్రాఫిక్ జామ్ అవుతూ ఉండేది. దీనిని నివారించుటకు వీరమ్మగుడి సమీపమునుండి వీరమ్మ మాన్యం భూముల మీదుగా ఉయ్యూరు గురజాడ రోడ్డును కలుపుటకు బైపాస్ నిర్మించు ప్రతిపాదన రూ॥ 6 లక్షల అంచనాతో ఉండి ఉన్నది. కె.సి.పి. సంస్థ మూడు లక్షలు చెల్లించింది. ఆర్ & బి డిపార్ట్ మెంట్ ఈ పనిని చేపట్టడంలో జాప్యం జరిగింది. నిర్మాణ వ్యయం పెరిగింది. పెరిగిన దానిని బట్టి సగం చెల్లించమని ఆర్ & బి శాఖ కోరగా కె.సి.పి. సంస్థ 'మేము ఇదివరకే కట్టాము మీ వలన జాప్యం జరిగినది కావున మీరే భరించండి.' అని అనడం వలన బైపాస్ రోడ్డు కార్యరూపం ధరించలేదు. ట్రాఫిక్ జామ్‌లు కొనసాగుతున్నాయి. ఒకసారి నాటి ఆర్ & బి మినిష్టర్ దివి కొండయ్య చౌదరి గారు కూడా ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందిపడ్డారు. అట్టి స్థితిలో నేను ప్లాంట్ మేనేజర్ ఇంజేటి జగన్నాధరావుతో కలెక్టర్ ఎ.వి.యస్ రెడ్డిగారితో మాట్లాడి తాజా నిర్మాణ వ్యయంలో కె.సి.పి. 50శాతం చెల్లించులాగున అంగీకరింపచేశాను. కలెక్టర్ గారు ఎలైన్‌మెంట్ కూడా స్వయంగా పరిశీలించారు. ఇంతలో శాసనసభ ఎన్నికలు రావడం నేను ఓడిపోవడం అనంతరం బైపాస్ ఎలైన్‌మెంట్ మారడం జరిగింది. తాలూకా కేంద్రమైన ఉయ్యూరులో ఆర్ అండ్ బి సబ్ డివిజన్ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను 1979 మార్చి 9న ఆర్ & బి ఛీఫ్ ఇంజనీర్ కృష్ణ మోహన్ గారిని కోరడం జరిగింది.

అప్పట్లో నేను జిల్లా జనతాపార్టీ / లోక్‌దళ్ అధ్యక్షుడుగా ఉంటున్నందువల్ల జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు కూడా నా దృష్టికి వస్తూండేవి. తత్సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తుండేవాణ్ని. అందులో భాగంగానే టంగుటూరు అంజయ్యగారు 1981 జనవరి 9న విజయవాడ వచ్చినప్పుడు


వి.టి.పి.యస్ నుంచి కృష్ణానది లోనికి వెళ్లే నీటిని విజయవాడ, మైలవరం తాలూకాల్లోని అనేక గ్రామాల భూములకు అందజేయడం అవసరమని సూచించాను. కృష్ణాడెల్టా కాలువల ఆధునీకరణ చేపట్టవలసిన ఆవశ్యకత గురించి 1982 అక్టోబరు 152న మేజర్ అండ్ ఇరిగేషన్ మంత్రి చనుమోలు వెంకట్రావు గారిని కోరాను. ఇందుపల్లి, విజయవాడ సమీపంలోని అంపాపురం, కైకలూరు సమీపంలోని పెదతుమ్మిడి రైతుల సమస్యల్ని కూడా నీటిపారుదల శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాను.

గొల్లపూడి గ్రామంలో అనేకమంది ఆచార్య రంగాగారిని అభిమానిస్తూ ఉండేవారు. ముఖ్యంగా చిగురుపాటి కృష్ణారావు, నూతులపాటి నారాయణరావు, భూపయ్య, సాంబశివరావు మున్నగువారు నేను శాసనసభకు పోటీ చేసిన సమయంలో ఉయ్యూరు కూడా వచ్చి కృషి చేశారు. వారి కోరికమేరకు గొల్లపూడి నుంచి జక్కంపూడి రహదారిని అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేశాను. ఆ తర్వాత నేను వ్యవసాయశాఖా మంత్రిగానూ, యలమంచిలి నాగేశ్వరరావుగారు శాసనసభ్యుడిగాను ఉండగా ఈ రహదారి అభివృద్ధి జరిగింది. చిగురుపాటి కృష్ణారావు ఏమాత్రం స్వార్థంలేని వ్యక్తి. ఏ పార్టీలోవున్నా ఆ పార్టీ కొరకు కొవ్వొత్తువలే కరిగిన వ్యక్తి. గ్రామస్థాయి లేక ఏస్థాయిలోనూ ఏ పదవీ ఆశించని వ్యక్తి. నేను అత్యధికముగా ప్రేమించిన వ్యక్తి కృష్ణారావు.

విజయవాడలో పరుచూరి చిన్ని కార్లమెకానిక్ షెడ్ ఉండేది. గౌతులచ్చన్నగారి కారు, నా కారుకు ఏ రిపేరు వచ్చినా ఆయనే చేస్తూ ఉండేవారు. వారిది మా ఉయ్యూరు దగ్గర మేడూరు గ్రామం. నాకు మంచి మిత్రుడు. వారి సోదరలే పరుచూరి వెంకటేశ్వరరావు మరియు గోపాలకృష్ణ గార్లు తరువాత మద్రాసులో నివాసం ఉన్నారు. యార్లగడ్డ శంభుప్రసాద్‌గారితో తిరుపతిలో వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగివస్తూ ప్రమాదానికి గురై ఇద్దరూ దుర్మరణం చెందడం అత్యంత విషాదకరం.

***<u>దివిసీమ త్రిమూర్తులు సింహాద్రి - అంబటి - సైకం</u>***

దివిసీమలో సైకం అర్జునరావుగారు, అంబటి బ్రాహ్మణయ్యగారు, సింహాద్రి సత్యనారాయణగారు ముగ్గురూ జనతా/ లోక్‌దళ్ పార్టీలో సన్నిహితంగా ఉంటూవచ్చారు. సైకం అర్జునరావుగారు ఆ ప్రాంతంలో గణనీయమైన సంఖ్యలో ఉన్న మత్స్యకారుల్లోనే కాకుండా ఇతర బలహీనవర్గాల వారిలో కూడా విశేషమైన ఆదరాభిమానాలు చూరగొన్న వ్యక్తి. 1978 ఎన్నికల్లో సుమారు 223 ఓట్ల తేడాతో అపజయం పాలయ్యారు. ఆ సమయంలో ప్రముఖ జాతీయ నాయకులు బాబూ జగజ్జీవన్‌రామ్‌గారి ఎన్నికల సభ



సింహాద్రి సత్యనారాయణ



అంబటి బ్రాహ్మణయ్య



సైకం అర్జున రావు

ఎన్నికల టూర్ షెడ్యూల్లో ఉన్నప్పటికీ, సమయాభావం కారణంగా ఆయన వెళ్లలేకపోవడం వల్ల అర్జునరావుగారికి నష్టం చేకూరింది. అప్పట్లో తుఫాను బాధితుల సహాయార్థం విజయవాడలో జనతాపార్టీ కార్యాలయానికి వచ్చిన రెండు లారీల వస్త్రాల్ని ఆ ప్రాంతంలో ఒక సోషలిస్టు కార్యకర్త నాగభూషణంగారికిచ్చి మీరు వీటిని సైకం అర్జునరావుగారికి అందించి, వారు ఏవిధంగా ఎక్కడ పంపిణీ చేయమంటే ఆ విధంగా పంపిణీ చేయండని చెప్పి పంపాను. ఆయన అందుకు భిన్నంగా చేయడం కూడా ఆయన ఓటమికి ఒక కారణం. అయినప్పటికీ అర్జునరావుగారు నిరుత్సాహపడకుండా జనం మధ్యలో ఉండి, వారి సంక్షేమం కోసం కృషిచేస్తూండేవారు. ఆ ప్రాంతంలో పార్లమెంటు మాజీ సభ్యులు మండలి వెంకటస్వామిగారు స్వతంత్ర పార్టీకి, ఆ తర్వాత జనతాపార్టీకి మద్దతునిస్తూండేవారు.

అప్పట్లో అవనిగడ్డ భూమి తనఖా బ్యాంకుకు జరిగిన ఎన్నికల్లో అతి తీవ్రమైన పోటీలో జనతాపార్టీ అభ్యర్థిగా మండలి వెంకటస్వామిగారి అబ్బాయి మండలి రాంబాబు గెలుపొందారు. 1980లో టంగుటూరు అంజయ్యగారు ముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. అవనిగడ్డ పంచాయతీ సమితికి అధ్యక్షుడిగా అంబటి బ్రాహ్మణయ్యగారిని లోక్‌దళ్ పార్టీ తరపున పోటీ చేయించాం. బ్రాహ్మణయ్యగారు పట్టభద్రులు, చక్కని వక్త కూడా. నిష్కర్షగా మాట్లాడే వ్యక్తి. కృష్ణాజిల్లాలో అత్యధికమైన మెజారిటీతో విజయం సాధించారు. బ్రాహ్మణయ్యగారు ప్రజాసమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా గ్రామాల అభివృద్ధికి చక్కగా కృషి చేయడం వల్ల అవనిగడ్డ పంచాయితీ సమితి జిల్లాలో ఉత్తమ పంచాయితీ సమితిగా అవార్డును పొందింది. క్రమశిక్షణ, సమయపాలన, నిర్మొహమాటంగా మాట్లాడటం బ్రాహ్మణయ్య గారి ప్రత్యేకత. మచిలీపట్నం

శాసనసభ్యుడిగా , మచిలీపట్నం లోక్‌సభ సభ్యుడిగా, అవనిగడ్డ శాసనసభ్యుడిగా విశేషమైన కృషిచేశారు. అనారోగ్యంతో ఇటీవల ఆయన కాలధర్మం చెందడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు. సింహాద్రి సత్యనారాయణగారు వీరిరువురికీ అండదండగా ఉండేవారు. సింహాద్రి గారు మూడుసార్లు శాసనసభ్యునిగా దేవాదాయ శాఖా మంత్రిగా కృష్ణా జిల్లాకు ముఖ్యంగా దివిసీమకు ఎనలేని సేవ చేసారు. నీతి నిజాయితీతో వ్యవహరించారు. దివిసీమలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో, తుఫాను సహాయక చర్యల అమల్లో, రాజకీయ కక్షలకు గురయ్యే పార్టీ కార్యకర్తలకు ఆ ముగ్గురు నాయకులతోపాటు నేను, సుంకర సత్యనారాయణగారు సహకారాన్ని అందిస్తూండే వాళ్ళం. ఆ సమయంలో గొల్లలమోద గ్రామంలో లోక్‌దళ్ పార్టీ వారిపైన అన్యాయంగా హత్యానేరాన్ని బనాయిస్తే, జరిగిన వాస్తవాల్ని, అక్కడి వాస్తవిక పరిస్థితుల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, కార్యకర్తల మీద బనాయించిన కేసుల్లో వారి పేర్లను తొలగింపజేశాను. మందపాకల, పాటిమీద మున్నగు గ్రామాల్లో గృహ నిర్మాణం, పెదగుడిమోటు గ్రామంలో కమ్యూనిటీ షెల్టర్ మున్నగు అంశాల గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాను.

గుడివాడ పట్టణంలో రైల్వే లైను పైన ఓవర్ బ్రిడ్జిని, గుడివాడ, విజయవాడ రహదారిలో చంద్రయ్య డ్రైయిన్ పైన పాత బ్రిడ్జీ స్థానంలో నూతన బ్రిడ్జీని నిర్మించవలసిన ఆవశ్యకత గురించి 1983 మార్చి 24న ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారికి విజ్ఞప్తి చేయడం జరిగింది. పొనుకుమాడు సమీపములో పట్టయ్యకోడు డ్రెయిన్‌పైన బ్రిడ్జీ నిర్మించవలసిన ఆవశ్యకత గురించి శాసన సభలో 1978 ఆగస్టు 16న కాలింగ్ ఎట్టెన్షన్ నోటీసుకు సమాధానముగా ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ డి.కె, నారాయణరావు 5.39లక్షల వ్యయంతో 1979-80 సంవత్సరములో చేపట్టనున్నామని తెలియపర్చారు. గన్నవరం తాలూకాలో బుడమేరు, వన్నేరు, పట్టయ్యకోడు, పిల్లికోడు డ్రెయిన్‌లలో 1978 జూలై 30 వ తేదీన కురిసిన కుంభవృష్టి ఫలితంగా పరిసర గ్రామాల ప్రజలకు చేకూరిన నష్ట నివారణచర్యల గురించి కృషిచేశాను.

## డ్రైనేజి వ్యవస్థను మెరుగు పరచాలి

1978 సెప్టెంబరు 5న గుడివాడలోని కవిరాజు కళామందిరంలో పుచ్చలపల్లి సుందరయ్యగారి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, రైతులతో కూడిన సమావేశం జరిగింది. కొల్లేరు లోనికి ప్రవహించే డ్రెయిన్లు పొంగడం వల్ల జరిగిన నష్టాన్ని సమీక్షించి భవిష్యత్తులో అటువంటి నష్టం జరగకుండా నివారించడానికిగాను ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని

సమావేశం అభిప్రాయపడింది. పిన్నమనేని కోటేశ్వరరావు, కాజ రామనాధం, వై.వి.కృష్ణారావు, తుమ్మల చౌదరి, మొుక్కపాటి వెంకటేశ్వరరావు, ఎస్.వి.ఆర్.జి.నరసింహారావు, దగ్గుమిల్లి మధుసూధనరావు, సైదు గంగరాజు, తూమాటి బాలకోటేశ్వరరావు, ఉద్దరాజు రామం, నేను, ఇంకా అనేకమంది ఇందులో పాల్గొన్నాం. 56 మందితో ఒక అఖిలపక్ష కమిటీ సుందరయ్యగారు కన్వీనర్‌గా ఏర్పడింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వారిని కలసి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశాం.

1980 సెప్టెంబరు 9న డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు విజయవాడ వచ్చిన సందర్భంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆయన దృష్టికి ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ తీసుకువెళ్లడం జరిగింది. అప్పటికి నాలుగు సంవత్సరాలుగా తుఫాన్లు, అతివృష్టి, అనావృష్టిలకు గురై రైతులు రుణాల్ని తీర్చలేని స్థితిలో ఉన్నందువల్ల బకాయిల్ని రద్దు చెయ్యాలని, ఉత్తరప్రదేశ్, హర్యానాల్లో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం చెరకు ధర సలహా కమిటీని రాష్ట్ర స్థాయిలో ఏర్పాటుచేసి, చెరకు రైతులకు అదనపు ధర ఇవ్వాలని, తమిళనాడులో నిర్ణయించిన ధరల మాదిరిగానే రైతులకు విద్యుత్ సరఫరా చెయ్యాలని, రైవస్, బందరు, బకింగ్‌హామ్ కాలువల్లో పూడిక తీయించాలని విజ్ఞప్తి చేశాం.

రుద్రపాకలో పిన్నమనేని భూపతిరాయుడు, కేసరపల్లిలో మూల్పూరి బాలకృష్ణారావు, చందర్లపాడులో కొఠారు వెంకటేశ్వర్లు, గుడ్లవల్లేరులో ఉప్పలపాటి దయానిధి, జొన్నపాడులో మలిరెడ్డి శ్రీశైలరెడ్డి, గూడపాడులో గుత్తికొండ సీతారామాంజనేయులు, పెదప్రోలులో నాదెళ్ళ భవానీశంకర్, ప్రొద్దుటూరులో బి.వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడిలో చిగురుపాటి కృష్ణారావు, నూతలపాటి నారాయణ రావు, భూపాయ్య, సాంబశివరావు, గుంటుపల్లిలో చెరుకూరి వెంకట రామయ్య, కొండయ్య, నల్లూరి హనుమంతురావు, కాట్రగడ్డ సీతారామయ్య, నందమూరులో కానూరి వెంకట రంగదాసు, కౌతవరంలో కానూరి గంగాధరరావు, తాడిగడపలో కిలారు విద్యాసాగర్ వర్మ, బందర్‌లో కొనకళ్ల గణపతి, ముసునూరి జగన్నాథరావు, శెరికలవపూడిలో చలసాని రాఘవయ్య, పెంజెంద్రలో బొప్పన కుటుంబయ్య, పామర్రులో డా॥ రావెళ్ళ సీతారామస్వామి, సోమిరెడ్డి మున్నగువారు రంగాగారి పట్ల, స్వతంత్ర పార్టీ పట్ల అభిమానంతో ఉండేవారు. ఘంటసాలలో గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు (కిసాన్ వెంకట సుబ్బయ్య) శ్రీరాముడికి హనుమంతుడెలాగో రంగాజీకి ఆయనలా ఉండేవారు. గొర్రెపాటి లీలాకృష్ణయ్య, గొర్రెపాటి చంద్రశేఖరరావు మున్నగువారు కూడా ఉన్నారు.



చిరకాల ఆప్తమిత్రుడు చిగురుపాటి కృష్ణరావుతో

చిగురుపాటి కృష్ణారావు ఏ స్థాయిలోను తనకు పదవి కావాలని కోరిన వ్యక్తి కాదు. రంగా గారు, లచ్చన్న, సుంకర, నేను అందరం అతనికి అత్యంత సన్నిహింతంగా ఉన్నప్పటికీ తన వ్యక్తిగత ప్రయోజనాల గురించి తోడ్పాటును ఆశించిన వ్యక్తికాదు. తాను ఏ పార్టీలో వున్నా ఆ పార్టీ కొరకు కొవ్వత్తిల కరిగిన మనిషి. నేను మిక్కిలిగా అభిమానించిన స్నేహితుడు.

## కృష్ణా ఎడమ కరకట్ట అభివృద్ధి

1977 నవంబర్‌లో తుఫాను, ఉప్పెన కృష్ణాజిల్లా ప్రజలకు, ముఖ్యంగా దివిసీమ ప్రజలకు మరచిపోలేని విషాదాన్ని మిగిల్చింది. వేలాదిమంది దుర్మరణం చెందారు. దివిసీమలోని తీరప్రాంత గ్రామాల్లో గృహాలు ధ్వంసమై నిలువ నీడ లేక పోయింది. జరిగిన ఘోరమైన నష్టాన్ని తెలుసుకుని మానవతా దృక్పధంతో అనేక స్వచ్ఛంద సేవాసంస్థలు విదేశాల్లో ఉన్నవి, మన దేశంలో వున్నవి పెద్దయెత్తున సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చాయి. విజయవాడ, పామర్రు, కూచిపూడి, పులిగడ్డ, అవనిగడ్డ రహదారుల్లో అనేకచోట్ల పెద్ద పెద్ద చెట్లు రోడ్డుకి అడ్డంగా పడిపోయాయి. ఈరోజు అందుబాటులో ఉన్న విధంగా కోతకి ఉపయోగపడే మిషన్లు ఆ రోజుల్లో అందుబాటులో లేవు. మనుషులు పడిపోయిన చెట్లను నరికి విజయవాడ నుంచి సైన్యాన్ని, సహాయాన్ని దివిసీమకు పంపడానికి దాదాపు మూడు రోజులు పట్టింది. నేను శాసనసభ సభ్యునిగా ఉండగా జిల్లా కలెక్టర్ ఎ.వి.యస్. రెడ్డిగారితో మాట్లాడాను. యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు కృష్ణానది ఎడమ కరకట్టను అభివృద్ధి పరచినట్లయితే కొద్ది గంటల్లో కరకట్ట మీదుగా దివిసీమను చేరడానికి వీలుంటుందని, కట్ట వెంబడి గ్రామల్లోని రైతులకు



*కృష్ణ నదిపై విజయవాడ వద్ద ప్రకాశం బ్యారేజ్*

వ్యవసాయ కూలీలకు కూడా వారి అభ్యున్నతికి దోహదం చేస్తుందని చెప్పాను. ఆయన మంచి సూచన, చేద్దామన్నారు. అప్పుడు తోట్లవల్లూరులోని పంచాయతీ కార్యాలయంలో కట్ట వెంబడి గ్రామ సర్పంచ్‌లను, గ్రామ పెద్దలను, కె.సి.పి. మేనేజర్ ఇ. జగన్నాథరావుగారిని సమావేశపరిచాను. కె.సి.పి.సంస్థవారు ఐదు లక్షల రూపాయలు ఇచ్చే విధంగానూ, రైతులు మూడున్నర లక్షల రూపాయలు తమ వంతు విరాళంగా అందజేసే విధంగానూ అంగీకరించారని ఎ.వి.ఎస్. రెడ్డిగారికి చెప్పగా, ఆయన జిల్లా పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా దానికి ఆమోదాన్ని తెలిపి తోట్లవల్లూరు వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ రహదారి చక్కగా అభివృద్ధి చెందింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గానూ, అన్నే బాబూరావు శాసనసభ్యుడిగానూ ఉండగా, కృష్ణానదికి వరదలు వచ్చి ఎడమ కరకట్టకు గండిపడే పరిస్థితి ఏర్పడగా రైతులు రాత్రి పగళ్లు కాపలా కాసి ప్రమాదం జరగకుండా కాపాడారు. నేను గుంటూరు జిల్లాలోని కొల్లూరు వద్ద నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబునాయుడు గారితో వస్తూ ఆయనకు గతంలో కరకట్ట అభివృద్ధికి చేపట్టిన చర్యల గురించి వివరించాను. కరకట్టను అభివృద్ధి పరచడానికి కృష్ణానది ఎడమ కరకట్టకు 27 కోట్ల రూపాయలు, కుడి కరకట్టకు 23 కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించారు. దీని తర్వాత రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా 46 కోట్ల


రూపాయలతో ఈ కరకట్టను రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయడానికి నిర్ణయం తీసుకుని పనులు చేపట్టారు. ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడల్లా గతం గుర్తుకు వచ్చి ఎంతో ఆనందం కలుగుతూవుంటుంది.

***<u>పంచాయితీ సమితి ఎన్నికలు - సి.పి.ఐ. మిత్రద్రోహం</u>***

అంజయ్య గారు ముఖ్యమంత్రిగా ఉండగా 1980 లో పంచాయితీ సమితులకు ఎన్నికలు వచ్చాయి. ప్రతిపక్ష పార్టీల అవగాహనమేరకు ఉయ్యూరులో లోక్‌దళ్ అభ్యర్థి ఉయ్యూరు శామ్యూల్ కంకిపాడులో సి.పి.ఐ. అభ్యర్థి మండవ వెంకటనారాయణ పోటీ చేసారు. ఉయ్యూరులో సి.పి.ఐ. పార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి బహిరంగంగా మద్దతు ఇచ్చింది. కంకిపాడు ఏరియాలో లోక్‌దళ్ అభిమానులు ఉయ్యూరులో సి.పి.ఐ. మనకు చేయటంలేదు కావున మేము ఇక్కడ కాంగ్రెస్‌కు చేస్తాము అని అడిగినప్పుడు ఇది సరికాదు ఇతరులు మనలను వేలెత్తి చూపే అవకాశం ఇవ్వరాదు అని చెప్పి మండవ వెంకటనారాయణ విజయానికి కృషి చేసాం. ఉయ్యూరులో శామ్యూల్ ఓడిపోయారు. కంకిపాడులో మండవ వెంకటనారాయణ గెలిచారు.

***<u>చరణ్‌సింగ్ ప్రభావం</u>***

1982 ఏప్రిల్ 2 మరియు 3 తేదీలలో లోక్‌దళ్ రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించాము. దాంట్లో జార్జి ఫెర్నాండేజ్, సర్దార్ గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, తుమ్మల చౌదరి, ప్రొఫెసర్ సీతారామిరెడ్డి ప్రసంగించారు. 1982లో ప్రముఖ చలనచిత్ర నటులు ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశం పార్టీని స్థాపించి, రాష్ట్రం అంతటా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఎందువల్లోగానీ నాకు తెలుగుదేశంలోకి వెళ్ళాలనే అభిప్రాయం బలంగా కలగలేదు. అప్పటికి చరణ్‌సింగ్‌గారు అనారోగ్యంతో ఇంకా జీవించేవున్నారు. ఆయన రాసిన 'గాంధేయపథం' అనే పుస్తకం, 'ఎకనామిక్ నైట్‌మేర్ ఆఫ్ ఇండియా' పుస్తకాల్లో సస్యశ్యామలమైన భూమి, నీరు, వాతావరణం



రేయింబవళ్లు కష్టపడి పనిచేసే రైతాంగం ఉన్నప్పటికీ మనదేశం ఎందువల్ల గణనీయమైన ప్రగతిని సాధించలేకపోతోంది, అందుకు కారణాలేమిటి, ఏ విధమైన విధానాల్ని చేపట్టినట్లయితే దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందో చాలా వివరంగా గణాంకాలతో

సహా వివరించిన తీరు నన్ను ఆకట్టుకుంది. నా ఆలోచనా విధానంపైన బలమైన ముద్రవేసింది. జాతిపిత 'మహాత్మాగాంధీ' చూపిన బాటలో కాకుండా సోవియట్ రష్యాను ఆదర్శంగా మనసులో పెట్టుకుని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్లనే దేశం వెనుకబడివుందని వాటిలో స్పష్టంగా వివరించారు.

1983-84లో శాసనసభకు ఎన్నికలు సమీపించాయి. సుదీర్ఘ, అవినీతికర, అసమర్థ కాంగ్రెస్ పాలనకు విసుగు చెందిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న తరుణమది. ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశం పార్టీని ఏర్పాటుచేశారు. చెన్నారెడ్డిగారి ప్రభుత్వం అవినీతి పాలన అనంతరం వచ్చిన ముగ్గురు ముఖ్యమంత్రుల కాలంలో కూడా కొనసాగిన అసమర్థ, అవినీతి పాలనపట్ల ప్రజలు విసుగుచెందారు. ఈ నేపథ్యంలో నాటి ప్రతిపక్షాలు జనతా, లోక్‌దళ్, సి.పి.ఐ., సి.పి.యం, బి.జె.పి. మొదలైన పార్టీలన్నీ రైతాంగ సమస్యలతో సహా అనేక ప్రజాసమస్యలపై తీవ్రస్థాయిలో పోరాటం జరిపాయి. విజయవాడలో అఖిలపక్ష రైతు ఉద్యమం సందర్భంగా జరిగిన పోలీస్ కాల్పుల్లో గుర్రం గోవిందు అనే వ్యక్తి మరణించారు.

స్థానికంగా నన్ను అభిమానిస్తూ వచ్చిన ప్రజలు ముఖ్యంగా యువకులు నన్ను తెలుగుదేశం పార్టీలో చేరమని తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఉయ్యూరులోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన నియోజకవర్గ లోక్‌దళ్ కార్యకర్తల సమావేశంలో నడివయసువారు, ఆపై వయసువారు "శోభనాద్రీశ్వరరావే తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటారులే" అని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. యువకుల్లో ఎక్కువమంది తెలుగుదేశం పార్టీలో చేరమని నినదించారు. నేను ఇప్పుడు తొందరేముందిలే, తర్వాత నిర్ణయం తీసుకుందామని దాటవేశాను. అనంతరం కొద్దిరోజుల తర్వాత హైదరాబాద్ లోని విజయనగర్ కాలనీలో రంగాగారి చిరకాల అభిమాని అయిన అడుసుమిల్లి సీతారామారావు గారింట్లో రాత్రి డిన్నర్ అయిన తర్వాత గౌతులచ్చన్నగారు, సుంకర సత్యనారాయణగారు, మా సహచర శాసనసభ్యులు పి.జనార్ధనరెడ్డి, నేను కలసి పెంట్‌హౌస్‌లో కూర్చున్నాం. మా చిరకాల సహచరుడు మలిరెడ్డి శ్రీశైలరెడ్డి, సీతారామారావుగారు, మండవ లోకేశ్వరరావు బి. వెంకటేశ్వరరెడ్డి ప్రభృతులు కూడా మాతోపాటు ఉన్నారు. "మనం ముందునుంచి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. ఇప్పుడు రామారావుగారి ప్రభంజనం బలంగా కనిపిస్తున్నది. అందువల్ల మన లోక్‌దళ్ పార్టీని కూడా తెలుగుదేశం పార్టీలో విలీనం చేస్తే బావుంటుందేమో"

అని సీతారామారావుగారు సమావేశంలో ప్రతిపాదించారు. సుంకర సత్యనారాయణగారు అంతకుముందే విజయవాడలోని కమలేంద్ర ప్రింటింగ్‌ప్రెస్ యజమాని మండవరత్తయ్యగారి ద్వారా కొంతమంది తెలుగుదేశం నాయకులతో చర్చించివున్నారు. మండవ రత్తయ్యగారు కూడా రంగాగారి అభిమాని మేమందరం విజయవాడలో ఉంటే రోజుకు ఒకసారైనా ప్రెస్‌కు వెళ్ళి రత్తయ్యగారితో కొంత సమయం గడుపుతూ ఉండే వాళ్ళం. కరపత్రాలు గానీ చిన్న పుస్తకములు గానీ అక్కడ ప్రచురించితే కాగితపు ఖర్చు తప్ప ప్రింటింగ్ చార్జీలు తీసుకునేవారు కాదు. నా అసెంబ్లీ ప్రసంగములు (ఆంధ్రరైతు ఆవేదన, దగాపడ్డ ఆంధ్రరైతు, భూపరిమితుల చట్టం–ప్రభుత్వ కుట్ర) 8వ లోక్‌సభలో ప్రసంగములు (ప్రజల ఎదురు తెన్నులు–పాలకుల తీరు తెన్నులు) ఆయన ప్రెస్‌లోనే ప్రచురించాము. సుంకరసత్యనారాయణగారు తెలుగుదేశంలో చేరడానికి సుముఖంగా ఉన్నారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, జమీందారీ – ఈనాందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆచార్య రంగా, పుల్లెల శ్యామసుందరరావుల నాయకత్వంలో వీరోచితమైన పోరాటములు నడిపి ప్రజల నుండి “సర్దార్” అను బిరుదును పొందిన లచ్చన్న గారు, తెలుగుదేశంలో చేరితే రామారావుగారు ఏ విధంగా వ్యవహరిస్తారో అనే సంశయంతో ఏ నిర్ణయమూ చెప్పలేదు. అప్పటికి చరణ్‌సింగ్‌గారు అనారోగ్యం పాలైవున్నారు. నాకు చరణ్‌సింగ్‌గారే గుర్తుకు వస్తూ తలవంచుకుని కూర్చున్నాను. తెలుగుదేశంలో చేరమనేవారు మా శ్రేయోభిలాషులు, మా అభివృద్ధిని కాంక్షించేవారు. నాకేమో మనసు అంగీకరించడంలేదు. కొద్దిసేపటికి నా కళ్ళవెంట నీరుకారడం చూసి, మనమిక ఈ విషయంలో శోభనాద్రీశ్వరరావును ఒత్తిడి చేయవద్దు, లోక్‌దళ్ పార్టీగానే పోటీచేద్దాం, ఏదైతే అదే అవుతుందనే నిశ్చయానికి వచ్చారు. పి.జనార్ధనరెడ్డిగారు కూడా మాతోనే ఫాలో అయ్యారు. అప్పటికే లోక్‌దళ్ శాసనసభ్యుడు అశోక్ గజపతిరాజు, డాక్టర్ యలమంచిలి శివాజీ, సోషలిస్టు పార్టీ నాయకుడు తుమ్మల చౌదరి, చక్రధర్, కె. సత్యనారాయణ, జానారెడ్డి, పి. ఇంద్రారెడ్డి తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరివున్నారు. ఏషియన్ గేమ్స్ తదితర కాంట్రాక్టులతో లబ్దిపొందివున్న కె.పి.రెడ్డయ్య ముందు గన్నవరం నియోజక వర్గం నుంచి పోటీ చెయ్యాలనే తలంపుతో ఉన్నారు. నేను లోక్‌దళ్ పార్టీ తరఫున, కాకాని రామమోహనరావు తెలుగుదేశంపార్టీ తరఫున పోటీపడుతుండటంతో తనకు లబ్ది చేకూరడానికి అవకాశం ఉంటుందనే అంచనాతో కె.పి.రెడ్డయ్యగారు ఉయ్యూరు నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. అనుకున్నట్లుగానే నాకు, రామమోహనరావుకు మధ్య బలంగా ఓట్లు చీలడం, దానికితోడు రెడ్డయ్య అధికమొత్తంలో ధనం వ్యయం

చేసిన కారణంగా ఆయన విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో చాలా కుటుంబాల్లో తల్లి, తండ్రి, తాత, ముత్తవ్వ నాకు ఓటు వేస్తే, కొడుకు, కోడలు, మనవడు, మనవరాలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతను ప్రతిపక్ష పార్టీలు పెంపొందించిన పునాదిపై ఎన్.టి.రామారావుగారు బలమైన ప్రత్నామ్నాయంగా ప్రజలు భావించారు. ఆయనకు పట్టం కట్టారు. ప్రతిపక్షాలు సీట్ల సర్దుబాటు విషయమై రామారావుగారితో జరిపిన చర్చలు సఫలం కాలేదు. ప్రతిపక్షాలు కోరినన్ని సీట్లు ఇస్తే తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేయడం కష్టమవుతుందని ఆనాడు తెలుగుదేశం పార్టీలో రామారావుగారి తర్వాత ప్రధాన భూమికను నిర్వహిస్తున్న నాదెండ్ల భాస్కరరావు తదితరులు రామారావుగారికి చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి. నాదెండ్ల భాస్కరరావు కాంగ్రెస్ పార్టీలో చిరకాలంపాటు పనిచేశారు. చెన్నారెడ్డి, టి. అంజయ్య గార్ల ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేస్తూ, పలు జిల్లాల్లోని నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగివున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షాలతో పొత్తులేకుండా మొత్తం సీట్లలో పోటీ చేస్తే తన సన్నిహితులకు అధికసంఖ్యలో సీట్ల ఇప్పించుకోవచ్చునే ఆలోచన ఆయనకు ఉండివుండవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా ప్రజాసమస్యలపై పోరాటాలు చేసి, ప్రజలతో మమేకమై నిలబడిన సిట్టింగ్ శాసనసభ్యులకైనా రామారావుగారు పోటీ పెట్టి ఉండ వలసిందికాదు.


ఆనాడు చరణ్‌సింగ్‌గారు ఉయ్యూరు వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదు. ఆర్థికంగా తోడ్పాటును ఇచ్చే పరిస్థితి లేదు. అయినప్పటికీ  ఆయన ప్రవచించిన సిద్ధాంతము, ఆశయమునకు కట్టుబడి బ్రహ్మాండమైన ఊపుమీద వున్న తెలుగుదేశంలోకి చేరాలనే భావన కలగలేదు. ఈనాడు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కొరకు, మౌలిక సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి వ్యవహరిస్తున్న పరిస్థితులను, చొక్కా మార్చుడంకన్నా తేలికగా పార్టీలు మారుస్తూ వున్న పరిస్థితిని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

కృష్ణా ఎడమ కరకట్ట అభివృద్ధి, కలవారిపాలెం, దేవరపల్లి, కె.ఇ.బి.కెనాల్‌పై వంతెనల నిర్మాణం చేయించినప్పటికీ ఒక సామాజికవర్గంలో కలిగిన అపోహ వల్ల నష్టం జరిగింది. ఉయ్యూరు లాండ్ మార్ట్‌గేజ్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా ఒక్కొక్క డైరెక్టర్ పరిధిలోని కార్యకర్తల మనోభిష్టానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నాము. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, బద్రిరాజుపాలెం గ్రామాల నుంచి ఒక డైరెక్టర్‌ని ఎన్నుకోవాలి. మెజారిటీ సభ్యులు బండి శ్రీమన్నారాయణ పేరు

సూచించడం వలన బద్రిరాజు పాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల సర్వారెడ్డికి అవకాశం లభించలేదు. దీనివలన ఒక సామాజిక వర్గంలో కొంత అపోహ ఏర్పడింది. అంతకు ముందు ఎన్నికల్లో పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో నాకు మద్దతు ఇచ్చిన కొందరు వేరే పార్టీకి సపోర్ట్ చేయడం వలన నాకు ఓటమి సంభవించింది. ఆ విధంగా జరిగివుండకపోయినట్లయితే రామారావుగారి ప్రభంజనంలో కూడా గెలవగలిగివుండేవాడిని. పంటకాలువలు, డ్రెయినేజ్ కాలువలు, కరకట్టల పైన గ్రామ పంచాయితీలుగానీ భూమిలేని పేదవారుగానీ ప్రక్కనే భూమివున్న రైతులకు గానీ, కొబ్బరి, మామిడి, సపోటా మున్నగు చెట్లను పెంచకునే అవకాశం ఇవ్వడం ద్వారా కట్టలు బలపడతాయని లీజుదారులకు కొంత అదనపు ఆదాయం చేకూరుతాయని ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారికి విజ్ఞప్తి చేశాను. గంగూరు వద్ద బందరు కాలువ ఎడమ కట్టపై విజయ స్పిన్నింగ్ మిల్స్ చైర్మన్ ఈడ్పుగంటి బాలవీరరాఘవయ్య గారు వందలాది కొబ్బరి మొక్కలను పెంచిన దృశ్యం ఆ రోడుమీద వెళ్ళినప్పుడల్లా గతాన్ని గుర్తుకు తెస్తూ ఉంటుంది.

నేను ఉయ్యూరు శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నలుగురు ముఖ్యమంత్రులను చూసాను. డా॥ మర్రి చెన్నారెడ్డి సమర్ధత కల వ్యక్తి. టంగుటూరి అంజయ్య హృదయం ఉన్న వ్యక్తి. అంజయ్య గారికి వ్యవసాయ రంగం పట్ల అభిమానం, అవగాహన ఉన్న యు.బి. రాఘవేంద్రరావు పర్సనల్ సెక్రటరీగా ఉండటం వలన చెరకు రైతులకు కొనుగోలు పన్ను నుండి ముదరా లభించింది. విజయభాస్కర రెడ్డి గారికి పెద్దమనిషిగా పేరుంది. ఆ సమయంలోనే గౌతు లచ్చన్న పుచ్చలపల్లి సుందరయ్య, చంద్రబాబునాయుడు, రాజశేఖరరెడ్డి, అశోక్‌గజపతి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు మున్నగు వారు శాసనసభ్యులుగా ఉన్నారు.

ఎన్నికల అనంతరం కొంతకాలం తర్వాత విజయవాడలో ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్ సమావేశం జరిగింది. అందులో తెలుగుదేశం పార్టీలో విలీనం కావాలన్న నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందుకనుగుణంగా విజయవాడ నుంచి లోక్‌దళ్‌కు మద్దతుగా నిలిచిన వందలాదిమంది ముఖ్యులతో హైదరాబాదు వెళ్ళి సర్ధార్ గౌతు లచ్చన్నగారు, సుంకర సత్యనారాయణగార్ల ఆధ్వర్యంలో రామారావుగారి సమక్షంలో సైకం అర్జునరావు, బమ్మిడి నారాయణస్వామి, ఈవూరి సుబ్బారావు, గౌతు శివాజీ మున్నగు వారందరమూ తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది.



*విజయవాడలో ప్రథమ మహానాడు సందర్భంగా అన్నగారితో*

## విజయవాడలో తెలుగుదేశం పార్టీ ప్రథమ మహానాడు

అనంతరం విజయవాడలో జరిగిన ప్రథమ మహానాడు ఏర్పాట్లకు సుంకర సత్యనారాయణగారు ఆహ్వాన సంఘం అధ్యక్షుడుగా, నేను ప్రధాన కార్యదర్శిగా, కె.వి.పి. బసవేశ్వరరావు కోశాధికారిగా దిగ్విజయంగా ఏర్పాట్లు చేశాం. పి.బి.సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో మహానాడు, ఆటోనగర్‌లో భారీ బహిరంగసభ జరిగాయి. వాజ్‌పేయి, చౌదరి దేవీలాల్, బర్నాలా, ఫరూక్ అబ్దుల్లా, మాకినేని బసవపున్నయ్య మొదలైన పలువురు జాతీయ నాయకులు బహిరంగసభలో పాల్గొన్నారు. కొద్దికాలం తర్వాత ఆపరేషన్ నిమిత్తం రామారావుగారు అమెరికా వెళ్ళిన సమయంలో గవర్నర్ రామ్‌లాల్‌తో కుట్ర చేసి నాదెండ్ల భాస్కరరావు అప్రజాస్వామికంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ అనుమతితోనే జరిగిన ఈ రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నిరసించారు. ఆ సమయంలో రామారావుగారికి మద్దతుగా నిలచిన శాసనసభ్యుల్ని నాటి కర్నాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డేగారి సహకారంతో కర్నాటకలో ఉంచి అనంతరం ఢిల్లీలో రాష్ట్రపతి వద్దకు, హైదరాబాద్‌లో శాసనసభలోనూ హాజరుపరచినప్పుడు రామారావుగారికి వారు మద్దతుగా నిలిచిన కారణంగా శ్రీమతి ఇందిరాగాంధీకి తిరిగి రామారావుగారిని ముఖ్యమంత్రిగా ప్రతిష్టించక తప్పలేదు. రామారావుగారిని తిరిగి ముఖ్యమంత్రిగా పున: ప్రతిష్టించడానికి సాగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సుంకర సత్యనారాయణగారు, నేను, తుమ్మల చౌదరి, కొమరిగిరి కృష్ణమోహన్‌రావు, తూమాటి బాలకోటేశ్వరరావు తదితరులం చురుగ్గా పాల్గొన్నాం.

# ఎనిమిదవ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక

1984 డిసెంబరు లో లోక్‌సభ ఎన్నికలొచ్చాయి. రామారావుగారితో నాకు పార్లమెంటుకు పోటీ చెయ్యాలనుందని నా అభిప్రాయాన్ని వ్యక్తంచేశాను. "బ్రదర్! మీ సేవలను ఇక్కడ రాష్ట్రంలో వినియోగించుకోవాలనుకుంటున్నామే" అని అన్నారు. "లోగడ శాసనసభ్యుడిగా నాకున్న అనుభవంతో పార్లమెంటులో మన ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి, ప్రజాసమస్యల గురించి నేను పార్లమెంటులో గట్టిగా మాట్లాడగలనన్నగారూ!" అని చెప్పాను. "సరే బ్రదర్! మీ ఇష్టం. బందరు, విజయవాడ రెండింటిలో మీరు ఏది కోరుకుంటారో చెప్పండి" అని అడిగారు. అప్పటికి బందరు లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, ప్రముఖ కాంట్రాక్టర్ కావూరి సాంబశివరావుగారు పోటీ చేయాలనుకుంటున్నారని బలంగా వినిపిస్తోంది. అంతకుముందు శాసనసభ ఎన్నికల్లో కాంట్రాక్టర్ కె.పి.రెడ్డయ్య విచ్చలవిడిగా ఖర్చుచేయడం వల్ల సంభవించిన ఓటమిని దృష్టిలో ఉంచుకుని, "నేను విజయవాడ స్థానానికి పోటీచేస్తానన్నగారూ!" అని చెప్పాను. ఆయన సరేనన్నారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీమతి చెన్నుపాటి విద్యగారు కూడా నాలాగే పెద్దగా ఖర్చు పెట్టలేరుగనుక నాకు పెద్దగా ఇబ్బంది కలగలేదు. ఎనిమిదవ లోక్‌సభకు ఎన్నికయ్యాను. ప్రథమంగా ఢిల్లీ వెళ్లగానే చరణ్‌సింగ్‌గారి ఇంటికి వెళ్లి ఆయనను చూసిన అనంతరం కొంతసేపు ఆ ఆవరణలో ఉన్నప్పుడు చాలా దుఃఖం వచ్చింది.

అనాడు ముప్పైమంది సభ్యులతో మా తెలుగుదేశం పార్టీయే పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష స్థానం పొందింది. కాంగ్రెస్‌నకు  కేవలం ఆరుగురు సభ్యులే, బి.జె.పి.కి కేవలం ఇద్దరు సభ్యులున్నారు. అందులో ఒకరైన జంగారెడ్డిగారు తెలుగుదేశం మద్దతుతో గెలిచినవారే. సీనియర్ పార్లమెంటు సభ్యులు సి. మాధవరెడ్డిగారిని లోక్‌సభలో టి.డి.పి. నాయకుడిగానూ, పి. ఆనందగజపతిరాజుగారిని ఉపనాయకుడిగానూ, నన్ను చీఫ్ విప్‌గానూ రామారావుగారు నియమించారు. కేంద్రం వద్ద మన రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లోవున్న ప్రాజెక్టులు, ఇంకా అనేక సమస్యల వివరాలతో కూడిన పుస్తకాన్ని అన్నగారు సంతకం చేసి స్వహస్తాలతో నాకు ఇచ్చారు.

ఈ సమస్యలతోపాటు రాష్ట్ర ప్రయోజనాల గురించి, రైతాంగం, ఇంకా ఇతర వర్గాల సమస్యల గురించి నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో జరిగిన బోఫోర్స్ కుంభకోణంతో సహా అనేక అంశాలపై పార్లమెంటులో ప్రజల వాణిని

వినిపించాననే సంతృప్తివుంది. స్పీకర్ బలరామ్ జక్కర్ నాకు, రఘుమారెడ్డికి వ్యవసాయ అనుబంధ అంశాలపైన అనుబంధ ప్రశ్నలు వేయడానికి ఎక్కువ అవకాశాలు ఇస్తూ వుండేవారు.



*న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ భవనం*

***<u>విజయవాడ యం.పిగా కృషి</u>***

విజయవాడ నగరంలోని పటమట ప్రాంతంతో నేను లోక్‌సభ సభ్యుడు కాకముందు నుంచి కూడా సంబంధం ఉంటూవచ్చింది. నల్లూరు వెంకటరత్నం, కోనేరు మధుసూధనరావు, రామినేని నాగేంద్రబాబు, చలపాటి సీతారామయ్య, వల్లూరు కేశవరావు, కొమ్మా రంగారావు మున్నగువారితో సన్నిహిత సంబంధం ఉండేది. విజయవాడ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన తర్వాత మొట్టమొదటసారి జరిగిన ఎన్నికల్లో దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారి కుమారుడు సురేంద్రబాబు మాచవరం ఏరియానుంచి, నల్లూరి వెంకటరత్నం, చలపాటి సీతారామయ్య పటమట ప్రాంతం నుంచి లోక్‌దళ్ పార్టీనుంచి పోటీ చేశారు. సురేంద్రబాబు, వెంకటరత్నంగారు విజయం సాధించగా పాములుగారు స్వల్ప తేడాలో ఓడిపోయారు. పటమటలోని యన్.యస్.యమ్. పబ్లిక్ స్కూలుకు నల్లూరువారి కుటుంబాలు భూమిని సమకూర్చారు. అందుకు సంబంధించిన అర్బన్ సీలింగ్ వ్యవహారాన్ని అప్పట్లో కార్యదర్శి పాల్ బియాన్‌గారి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరింపజేశాం. పటమట జిల్లా పరిషత్ హైస్కూల్ రోడ్‌లో రెవిన్యూ శాఖవారి స్థలాన్ని కూరగాయలు, మాంసం, చేపల మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇప్పించినట్లయితే బాగుంటుందని చెప్పగా కలెక్టర్ భట్టాచార్యగారు ఇతర అధికారులతో మాట్లాడి ఆ భూమిని ఇప్పించడం జరిగింది. ఆ తర్వాత దానిలో రైతుబజారును ఏర్పాటుచేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం కూడా నిర్మాణమయ్యింది.




*విజయవాడ పటమటలో రైతుబజార్*

పటమట కోనేరు బసవయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశాలమైన ప్రాంగణం ఉంది. కోనేరు శ్రీధర్ మున్నగువారి సూచనపై ఆ హైస్కూల్‌కు ఎం.పి.లాడ్స్ నుంచి కొంత మొత్తాన్ని మంజూరు చేయడమేగాక ఆ తర్వాత కాలంలో నారా చంద్రబాబుగారి ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు పలువురు వదాన్యులు అందజేసిన సహకారానికి జిల్లా పరిషత్ చైర్మన్‌గా వున్న సుంకర సత్యనారాయణగారు ప్రత్యేకమైన అభిమానంతో అందించిన సహకారంతో జన్మభూమి నిధులతో అతిసుందరమైన భవనం రూపుదిద్దుకుంది. ఈ విషయంలో కార్పొరేటర్‌గా ఉన్న కోనేరు శ్రీధర్, స్థానిక శాసన సభ్యులు యలమంచిలి నాగేశ్వరరావు ప్రత్యేకమైన శ్రద్ధ చూపారు. జవహర్ ఆటోనగర్ మనదేశంలో చాలా పేరుగాంచింది. ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అధ్యక్షులుగా పర్వతనేని సుభాష్ చంద్రబోస్‌గారు, కార్యదర్శిగా జాలాది రాఘవేంద్రరావుగారు, అజీజ్ ఇంకా వారి సంఘ సభ్యులు ఆటోనగర్ అభివృద్ధికి  విశేషమైన కృషిచేశారు. చాలా చక్కని విశాలమైన కళ్యాణ మండపాన్ని నిర్మించారు. సమీపంలో ఒక వైపు ఇండస్ట్రియల్ ఎస్టేట్, వాయవ్య మూలన ఎ.పి.ఐ.ఐ.సి. హౌసింగ్ కాలనీలున్నాయి. ఆటోనగర్ నుంచి రైవస్ కాలువకు కలిసే గుంటుతిప్ప డ్రెయిన్ చాలా అధ్వాన స్థితిలో ఉన్నందున ఒక పర్యాయం బాగా భారీ వర్షాలు కురిసి ఆ ప్రాంతమంతా మోకాలు నీటిలో మునిగిపోయింది. అప్పుడు కలెక్టర్ భట్టాచార్యగారి దృష్టికి తీసుకెళ్ళాను. 1988 జనవరి 13న మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ యస్.ఇ., ఎ.పి.ఐ.ఐ.సి. రీజినల్ మేనేజర్, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్, ఇండస్ట్రియల్

ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులతో, కలెక్టర్‌గారితో చర్చించి సత్వరమే డ్రెయిన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నాం.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఫార్మ్‌స్టీల్ యలమంచిలి రాధాకృష్ణగారు, వారి సంఘ సభ్యులు పిగ్ ఐరన్ సరఫరావంటి సమస్యలు ఎదురైన సమయంలో నా దృష్టికి తెచ్చినప్పుడు, వాటి గురించి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసేవాడిని. విజయవాడ నగరం, పరిసర ప్రాంతాలకు డిజిల్ అయిల్ తగినంతగా రాని సందర్భములలో మలినేని నారాయణ ప్రసాద్, వారి సహచరులు నాదృష్టిలోకి తెచ్చినప్పుడు ఆ సమస్యల పరిష్కారానికి నావంతు సహకారాన్ని అందిస్తూవుండేవాడిని.

విజయవాడ నగరంలోని అజిత్‌సింగ్ నగర్‌లో బలహీన వర్గాలకు చెందిన వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసి బుడమేరుకు వరదలు వచ్చినప్పుడు నీట మునిగిన ప్రాంతాలనుంచి ప్రజల్ని నగరంలోని కొన్ని పాఠశాలలకు, కళాశాలలకు తరలించి ప్రభుత్వ సహకారాన్ని అందించడం జరుగుతుండేది. ఈ విధంగా అనేకసార్లు అక్కడ నుండి నగరంలోకి తీసుకువెళ్ళడం సరికాదు, సింగ్‌నగర్‌లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో అదనపు తరగతి గదులు నిర్మిస్తే ఈ దుస్థితి తొలగుతుందని మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న ఉర్మిళా సుబ్బారావుకు, ఇంకా జిల్లా కలెక్టర్‌కు తెలియపరిచాను.

విజయవాడ నగరంలో ఉన్న లక్షలాదిమంది ప్రజానీకం అవసరాలు తీర్చడం ద్వారా వందలాది రజక కుటుంబాలవారు జీవనోపాధి పొందుతున్నారు. విజయవాడ పట్టణ రజక అభివృద్ధి సంస్థ కార్యదర్శి దాకమూరి నాగేశ్వరరావు, ఇంకా ఇతర రజక సంఘ సభ్యులు కోరిన మీదట వివిధ ప్రాంతాల్లో కాలువగట్లపైన దోబీఖానాలు ఏర్పాటు చేయడానికి కృషి చేశాను.

## *బహుళ అంతస్తుల యల్.ఐ.సి. బిల్డింగ్*

విజయవాడ బీసెంటురోడ్డులో చాలా సంవత్సరాలకిందటి హిందూస్థాన్ కోఆపరేటివ్ బిల్డింగ్ స్థానంలో లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ వారి ద్వారా బహుళ అంతస్తుల భవనం నిర్మించాల్సిన ఆవశ్యకత గురించి ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి పి.వి.ఎన్ కృష్ణారావుగారు నాకు అందజేసిన వినతి



*విజయవాడ బిసెంట్ రోడ్‌లో ఎల్.ఐ.సి. బహుళ అంతస్తుల భవనం*

పత్రాన్ని జతపరచి, నాటి ఆర్థికశాఖమంత్రి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారికి ఈ విషయం గురించి 1985 మే 24న లేఖ ద్వారా కోరాను.

తిరిగి 1988 జనవరి 23న ఈ అంశం గురించి ఎల్.ఐ.సి మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.కె.షింకర్‌గారికి నేను లేఖ రాస్తూ, విజయవాడ నగరంలో అత్యంత ప్రాముఖ్యత గల బీసెంటు రోడ్డులో ఉన్న 2100 చదరపు గజాల స్థలంలో పురాతన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలని ఆర్థికశాఖ సహాయమంత్రి జనార్దన పూజారిగారికి 1985 ఆగస్టు 9న రాసిన లేఖకు సమాధానంగా ఎల్.ఐ.సి సంస్థ అక్కడ బ్రాంచి ఆఫీస్ కమ్ ఇన్‌వెస్ట్‌మెంటు బిల్డింగ్ నిర్మించబోతున్నదని తెలియపరచివున్నారని, విజయవాడలో ఎస్.బి.ఐ రీజినల్ ఆఫీస్, జనరల్ అండ్ ఫైర్ ఇన్స్యూరెన్సు ఆఫీసు, రీజినల్, బ్రాంచ్ ఆఫీసులు, జిల్లా మేనేజర్, టెలిఫోన్స్ ఆఫీసు మున్నగు సంస్థలు కూడా ఉన్నందువల్ల ఎల్.ఐ.సి ఏడు లేక ఎనిమిది అంతస్తుల భవనాన్ని నిర్మించినట్లయితే వాటికి కూడా అద్దెకు ఇవ్వడానికి వీలుంటుందని రాసిన దానికి సమాధానంగా షింకర్ 1988 మార్చి 9న "మీ లేఖలో తెలియపరచిన అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటామ"ని తెలిపారు. అలాగే ఆర్థికశాఖ సహాయమంత్రి బి.కె.ఘడ్వీగారికి కూడా 1989 ఫిబ్రవరి 24న లేఖ రాశాను. 1989 మార్చి 8న ఇదే విషయం గురించి ఆర్థికశాఖ సహాయమంత్రి ఎడ్వర్డ్ ఫెలిరోగారికి కూడా వినతి పత్రాన్ని పంపించాను. పార్లమెంటులో నేను వేసిన ప్రశ్నకు

సహాయమంత్రి ఫెలిరో 1989 మార్చి 31న సమాధానమిస్తూ కోటి రూపాయల వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్, పైన మరొక అయిదంతస్తుల భవనం నిర్మించబడనున్నదని సమాధానమిచ్చారు. 1989–'90 సంవత్సరంలో మొదటి ఫేజ్‌గ్రౌండ్ ఫ్లోర్, పైన మూడంతస్తులతో నిర్మాణం చేపట్టనున్నట్లు 1989 మే 4న లేఖ ద్వారా తెలియజేశారు.

ఉయ్యూరులో ఎల్.ఐ.సి బ్రాంచి ఆఫీసును ప్రారంభించాల్సిన ఆవశ్యకత గురించి మిత్రుడు ఊకోటి సోమేశ్వరరావు చెప్పగా, 1990 జనవరి 18న నాటి ఆర్థికశాఖమంత్రి మధు దండావతే గారికి విజ్ఞప్తి చేశాం. ఆ తర్వాత, పి.వి.నరసింహారావుగారి ప్రభుత్వంలో ఆర్థికశాఖ సహాయమంత్రిగావున్న దల్బీర్‌సింగ్‌గారికి 1992 ఏప్రిల్ 7న, ఇంకా 1992 మే 11న లేఖలను వ్రాశాను. 1992 జూన్ 11న కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేసి కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఇన్స్యూరెన్స్ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా ఉన్న సి.ఎస్.రావుగారికి లేఖ రాయగా, 1992 జూలై 20న ఉయ్యూరులో ఎల్.ఐ.సి బ్రాంచి ఆఫీసును ప్రారంభించబోతున్నామని తెలియజేశారు.

విజయవాడ నగరంలోను, కొన్ని ఇతర పట్టణాల్లోనూ రాజీవ్‌గాంధీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లలో అనేక దుకాణాలు ధ్వంసమైన నేపథ్యంలో నష్టపోయినవారికి సత్వరమే సహాయం అందించాల్సిన అవసరం గురించి 1991 జూలై 29వ తేదీన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డిగారిని స్వయంగా కలసి విజ్ఞప్తి చేశాను. అలాగే రాష్ట్రస్థాయి విచారణ కమిటీకి 1991 జూన్ 19న వినతిపత్రాన్ని అందజేశాను.

దిగుమతి చేస్తున్న మిర్చి విత్తనాలపైన దిగుమతి సుంకాన్ని తగ్గించాలని ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హాగారికి 2001 మే 22న లేఖ రాయగా, 5 శాతానికి తగ్గించినట్లుగా 2001 జూలై 19న ఆయన తెలియజేశారు.

1986వ సంవత్సరంలో వరదలవల్ల ఉభయగోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో నష్టపోయిన రైతులకు బ్యాంకులు సక్రమంగా సహకారాన్ని అందించని విషయాన్ని 1986 అక్టోబర్ 23న ఆర్థికశాఖమంత్రికి తెలియజేయగా అప్పుడున్న అప్పుల్ని కన్వర్షన్ చేసి రీ–షెడ్యూల్ చేయడానికి కొత్తగా అవసరమైన మేరకు ఋణపరిమితిని సమకూర్చాలని ఉత్తర్వులిచ్చినట్లుగా ఆర్థికశాఖ సహాయమంత్రి జనార్దన్ పూజారి తెలియజేశారు.

విజయవాడ నగరంలోని భవానీపురం వద్ద వాటర్ స్పోర్ట్స్, మరియు రిక్రియేషన్ కాంప్లెక్స్ ఏర్పాటుచెయ్యాలని, తద్వారా టూరిజంను ప్రోత్సహించాలని కేంద్రమంత్రి శివరాజ్ పాటిల్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి వాటి ఏర్పాటు కోసం కృషిచేశాను.

విజయవాడ వన్‌టౌన్‌లోని వస్త్రలత కాంపౌండ్ వాల్ ప్రక్కనే నాలుగు చక్రాల తోపుడు బళ్ళను వరుసగా పెట్టుకుని పండ్లు అమ్ముకుంటూ అనేకమంది జీవిస్తూవుండేవారు. అక్కడ తోపుడు బళ్ళు పెట్టరాదని కమిషనర్‌గా ఉన్న ఊర్మిళా సుబ్బారావు తాఖీదు పంపారు. రాయల్ రిటైల్ పండ్ల వర్తకుల సంఘం అధ్యక్షులు సుంకర సత్యనారాయణ చౌదరి, కార్యదర్శి హనుమంతరావు, బేగ్ మున్నగువారు విజ్ఞప్తి చేయగా అక్కడ వాస్తవ పరిస్థితిని డ్రాయింగ్ పటాన్ని తయారు చేయించి, ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారక రామారావుగారిని కలసి తోపుడు బండ్లు ఉండడం వల్ల ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం ఉండదని వివరించగా, వారిని అక్కడనుంచి కదిలించవద్దని ఉత్తర్వులు పంపించి అన్నగారు వారికెంతో మేలు చేకూర్చారు. నగరంలో అనేకచోట్ల పేద, బలహీనవర్గాల ప్రజలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, డ్రెయినేజ్, పబ్లిక్ లావెటరీలు ఏర్పాటు చేయడం, కొన్ని ప్రదేశాల్లో పట్టాలివ్వడం మున్నగు ప్రజల సమస్యలన్నింటినీ నా దృష్టికి ఎవరు తీసుకొచ్చినా ఆ పార్టీ ఈ పార్టీ అని చూడకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నా వంతు సహకారాన్ని అందిస్తూవచ్చాను.

### ***<u>టి.వి. స్టూడియో కొరకు ప్రారంభమైన కృషి</u>***

1984 మార్చి 23న శ్రీమతి ఇందిరాగాంధీ విజయవాడలో టి.వి. రిలేస్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. వాస్తవానికి టి.వి. రిలేస్టేషన్ కొండపల్లి హిల్‌టాప్ పైన ఏర్పాటు చేయవలసివుంది. కానీ అప్పటికి సరైన రహదారి ఏర్పాటు కానందువల్ల తాత్కాలికంగా గాంధీపర్వతం మీద ప్రారంభించారు. కొండపల్లి కొండమీద టి.వి. రిలేస్టేషన్ నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ గురించి అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లడం, పర్యవసానంగా ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చి 10 కిలోవాట్ల టి.వి. రిలేస్టేషన్ నిర్మాణం నేను ఎం.పి.గా ఉండగా ప్రారంభమయ్యింది.

ఏడో ప్రణాళికలో మొదట్లో విజయవాడలో టి.వి. స్టూడియోను ఏర్పాటుచెయ్యాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ తర్వాత దాన్ని తొలగించడం వల్ల కృష్ణాజిల్లా, ఇంకా పక్క జిల్లాల్లోని ప్రజానీకం అంతా చాలా నిరుత్సాహం చెందుతున్నారని నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. నేను, ఉపేంద్ర, ప్రొఫెసర్ సి. లక్ష్మన్న, రఘుమారెడ్డి, బి.బి. రామయ్యగారు అందరం కలసి ఇన్‌ఫర్ మేషన్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రి వి.యన్. గాడ్గిల్‌ను 1985 ఆగస్టు 28న కలసి 7వ ప్రణాళికలో విజయవాడలో టి.వి. స్టుడియో ప్రతిపాదన ఉపసంహరించబడిందని పత్రికలలో వచ్చిన వార్తలను

ఆయన దృష్టికి తీసుకు వెళ్ళగా ఆయన ఆ వార్తలను ఖండించి తప్పని సరిగా విజయవాడలో టి.వి. స్టూడియో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలిండియా రేడియో స్టేషన్ ప్రక్కనే స్టుడియో నిర్మాణానికి కావలసిన రెండు ఎకరాల స్థలం ఉందని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కూచిపూడి నృత్యానికి కృష్ణాజిల్లా పుట్టినిల్లని, వందలాది మంది జానపద కళాకారులున్న ప్రాంతమని, వ్యవసాయకంగా, విద్యావిషయకంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో టి.వి. స్టుడియో నిర్మాణాన్ని తప్పనిసరిగా మంజూరుచెయ్యాలని రాజీవ్‌గాంధీగారిని కోరడం జరిగింది. ఆ తర్వాత నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిగా ఉన్న పర్వతనేని ఉపేంద్రగారు టి.వి. స్టూడియోకి శంకుస్థాపన చేశారు. కాని నిధులను మంజూరు చేయలేదు. పని ప్రారంభం కాలేదు.

## <u>*పొగాకు రైతుల సమస్యలపై పోరాటం*</u>

1985లో ప్రత్తి, పొగాకు పంటలపైన సింథటిక్ పైరిథ్రాయిడ్స్ మందులు వాడడంవల్ల 'వైట్‌ఫ్లై' విపరీతంగా పెరిగి ఆ పంటలకు తీవ్ర నష్టం కలుగచేసిన అంశాన్ని, కొంతకాలంపాటు ఈ మందుల వినియోగాన్ని నిషేధించాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాను.



కర్నాటకలో 1984లో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో కొనుగోళ్ళు జరిగి, తర్వాత వారు కొన్నదానికన్నా ఎక్కువ ధర వచ్చినందువల్ల ఆ లాభాలను అక్కడి రైతులకు పంచిన విధంగా మన రాష్ట్రంలో పొగాకు బోర్డు ఇవ్వనటువంటి విషయాన్ని, కేంద్రవాణిజ్య శాఖమంత్రి శివశంకర్‌గారికి 1989 జనవరి 21న తెలియపరచగా ఆయన వేర్వేరు ప్లాట్‌ఫారాల వద్ద కొనుగోలు చేసిన పొగాకునకు బోర్డుకు వచ్చిన లాభాన్ని కర్నాటకలో మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినట్లుగా వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ డి.పి. బాగ్జీ 1986 మార్చి 13న తెలియపరిచారు.

వరదలవల్ల దెబ్బతిన్న పొగాకు బ్యారన్ రైతులకు సహకారం, జెటివిస్ జాకెట్లు సరఫరా చేయవలసిన ఆవశ్యకత గురించి లోక్‌సభలో 1986 నవంబరు 4న 377 నిబంధన కింద లేవనెత్తిన అంశంపైన బ్యారన్‌కు 50 వేల రూపాయలు అందించడానికి, టుబాకో బోర్డు ద్వారా తగ్గింపు ధరలకు 690 జె.టి.యస్, జాకెట్లను అందించడానికి నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ సహాయమంత్రి దాస్ మున్షీ 1986 డిసెంబరు19న తెలియపరిచారు.



పొగాకు రైతులు పంటను అమ్ముకునే విషయంలో ఎదుర్కొంటూవున్న సంక్షోభం గురించి 1987 మార్చి 23న పార్లమెంటులో ప్రస్తావించగా, గత సంవత్సరంతో పోలిస్తే పొగాకు ధరలు తగ్గిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూ, ఎక్స్‌పోర్టు డిమాండ్ తగ్గడం, నాణ్యత కొంతమేరకు తగ్గడం అందుకు కారణాలని, యస్.టి.సి.ని వాణిజ్య ప్రాతిపదిక మీద పొగాకు కొనుగోలు చెయ్యాలని ఆదేశించామని, సిగరెట్ ఉత్పత్తిదారులను కూడా కొనుగోళ్ళ పెంచాలని కోరినట్లుగా దాస్‌మున్షీ 1987 ఏప్రియల్ 14న తెలియ పరిచారు.

1987 ఏప్రిల్ 3న గుంటూరులో పొగాకు రైతుల మహాసభలో పొగాకు రైతుల ఎదుర్కోంటున్న సమస్యలను చర్చించి, టుబాకోబోర్డు, యస్.టి.సి. అన్ని గ్రేడ్‌ల పొగాకును గత రెండు సంవత్సరాలలోని సరాసరి ధరలకు తగ్గకుండా కొనుగోలు చేయించాలని కోరిన అంశాన్ని కేంద్ర వాణిజ్య మంత్రి శివశంకర్‌గారికి 1987 ఏప్రిల్ 26న విజ్ఞాప్తి చేశాను. పార్లమెంటులో పొగాకు రైతుల సమస్యలపైన కాలింగ్ అటెన్షన్ మోషన్ పైన 1987 ఏప్రియల్ 23న జరిగిన చర్చలో నేను చేసిన సూచనలను పరిశీలించి రైతులను సంక్షోభం నుంచి గట్టెక్కించాలని కోరడం జరిగింది. దానిపైన తర్వాత వచ్చిన వాణిజ్య మంత్రి నారాయణ్‌దత్ తివారీగారు 1987 నవంబర్ 3న లేఖరాస్తూ టుబాకోబోర్డు ట్రేడింగ్ వింగ్ యమ్.యస్.పి. కనీస మద్దతు ధరకు మాత్రమే కొనుగోలు చేస్తుందని, యస్.టి.సి. వాణిజ్యపరంగా అవకాశం ఉన్న మేరకు ధరలకు కొనుగోళ్ళు చేయడానికి వీలుంటుందని, యస్.టి.సి. 1987 టన్నులు కొనుగోలు చేసిందని 1987 అక్టోబర్ 31న తెలియపరిచారు.

## <u>ప్రత్తి రైతుల సమస్యలపై పోరాటం</u>

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత కాటన్ కార్పొరేషన్‌వారు తగినంతగా పత్తి కొనుగోళు ్ళ చేయకపోవడంవల్ల రైతులు పడుతూవున్న ఇబ్బందులను గురించి 1985 నవంబర్ 18న పార్లమెంటులో 377 నిబంధన కింద లేవనెత్తగా రైతులనుంచి పత్తిని కొనుగోలు చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశామని, దేశంలోని ప్రత్తిరైతులు మెరుగైన ధరను పొందడానికి దోహదం చేసే విధంగా మనదేశంనుంచి రెండులక్షల బేళ్ళపత్తిని ఎగుమతి చేస్తున్నామని నాటి జౌళి శాఖమంత్రి ఖుర్షీద్ ఆలంఖాన్‌గారు డిసెంబర్ 1985న తెలియజేశారు. ఈ అంశంపైన 1985 డిసెంబర్ 18న నేను లోక్‌సభలో అరగంట చర్చలో ప్రస్తావించిన అంశాలకు ఆయన డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్సు ఎం.బి.లాల్ గారిని పంపి రాష్ట్రంలో సి.సి.ఐ. పత్తి కొనుగోళ్ళ విషయాన్ని విశదీకరింపజేశారు.

1986లో సెనగపచ్చ పురుగువల్ల, తెల్లదోమవల్ల చాలా నష్టం చేకూర్చిన నేపధ్యంలో సాధారణ దిగుబడిలో 30శాతం కూడా రాని పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాక పత్తి రైతులు చాలా ఇక్కట్లపాలవుతూండగా సి.సి.ఐ. నందిగామ, కంచికచర్ల కేంద్రాల వద్ద కొనుగోళ్ళు ఆపిన విషయాన్ని మే 6, 1986న ఆయన దృష్టికి తీసుకువెళ్ళగా తెల్లదోమవల్ల పత్తి నాణ్యత తగ్గిందని, చాలా కేంద్రాల్లో ప్రత్తి రావడంలేదని, అయినప్పటికీ సుమారు నాణ్యతతో కూడిన ప్రత్తి అమ్మజూపితే కనీస మద్దతు ధర ఇచ్చి చివరి బేలు వరకు కొంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న స్పిన్నింగ్ మిల్లులకు ఆర్థిక సంస్థలనుండి సహకారాన్ని అందించవలసిన అవసరమున్నదని 1986 మే 7న జౌళిశాఖ మంత్రికి రాయగా, 7వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషన్ లక్ష్యం మేరకు, ఇదివరకే సరిపడా స్థాపించబడ్డాయని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ కూడా సానుకూలంగా స్పందించలేదని తెలియపరిచారు.

## <u>చేనేత కార్మికులను అదుకోవాలి</u>

లోక్‌సభలో కొత్త జౌళి విధానంపైన జరిగిన చర్చలో నేను పాల్గొన్నాను. ఆ సందర్భంగా నేను చేసిన ప్రసంగాన్ని తాను చదివానని, ఈ విధానంవల్ల చేనేతవృత్తిలో వున్న వారికి కొన్ని సమస్యలు తెలెత్తి వారి ఉపాధికి భంగం కలగవచ్చని నేను చెప్పిన అంశాలను అభినందిస్తూ ఆ విధానంలో చేనేత కార్మికులకు, ఖాదీలో పనిచేస్తున్న వారికి ఉపాధికి రక్షణ కలిగేలా తగు మార్పులు చేయడానికి తగిన కృషి చేయవలసిందిగా పూనం ముత్రేజా (కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి) 1985 ఆగస్టు 26న నాకు లేఖ రాశారు.



మన రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశంజిల్లాలలో లుంగీలు మున్నగు ఉత్పత్తులు చేనేత కార్మికుల వద్ద పెద్ద యెత్తున నిల్వ ఉండిపోయి వారు ఇబ్బంది పడుతున్న సందర్భంలో నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ వారి చేత వాటిని కొనుగోలు చేయించాలని 1988 డిసెంబరు 24న నాటి జౌళి శాఖామంత్రి రామ్‌నివాస్ మిర్ధాగారిని కోరాను. వాస్తవానికి లుంగీలు హాండ్‌లూమ్ సెక్టర్‌కు రిజర్వుచేయబడినప్పటికీ పెద్ద యెత్తున పవర్‌లూమ్ సెక్టర్‌లో ఉత్పత్తి అవుతున్నాయని, ఇది నూతన జౌళి విధానానికి వ్యతిరేకమని, జౌళిశాఖ అధికారులు పవర్‌లూమ్ యజమానులపైన చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా దుర్బర దారిద్ర్యంవల్ల పైమూడు జిల్లాల్లో చేనేత కార్మికులు నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తెలియపరిచిందని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి చీరాల, మరికొన్ని ప్రదేశాల్లోని వీవర్స్ సంస్థలకు, ఎగుమతికి ఉపయోగపడే చేనేత కార్మికులకు సహాయపడేందుకు 60లక్షల రూపాయలు స్పెషల్ అడ్వాన్సుగా విడుదల చేశామని తెలియపరిచారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్(ఐ) కమిటీ అధ్యక్షులుగా ఉన్న ఎన్. జనార్ధనరెడ్డిగారు, మాజీ మంత్రి రోశయ్యగారు ఈ మూడు జిల్లాలోని చేనేత కార్మికులపట్ల రాష్ట్రప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడంలేదని, ఈపూరుపాలెంలో 1988 డిసెంబర్ 30 నుంచి ధర్నా చేపట్టనున్నామని పత్రిక ప్రకటన చేశారు. దానిపైన ప్రగడకోటయ్య మరికొందరు నాయకులు ప్రధానమంత్రిగా ఉన్న రాజీవ్‌గాంధీ గారిని ఈ అంశంపైన, కలసినా ఇప్పటికీ స్పందించలేదని, కేంద్రప్రభుత్వ

జౌళి విధానంలోని అంశాన్ని సంక్రమంగా అమలు చేయనందువల్లనే ఈ సమస్య తీవ్రతరమయ్యిందని, ఎన్.టి. రామారావుగారి ప్రభుత్వం సగంధరకే జనతావస్త్రాల కార్యక్రమాన్ని అమలుచేస్తూ ఉండడంవల్ల చేనేత కార్మికులకు ఊరట లభించడమేగాక పేద వినియోగదారులకు కూడా మేలు చేకూరిందని, కనుక ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుని ఆ నాయకులు ఇక్కడ ధర్నా చేయటం కాక కేంద్రప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకుండడం సముచితంగా ఉంటుందని 1988 డిసెంబరు 23న ప్రకటించాను.

***<u>పంటల భీమా పథకంనకు సూచనలు</u>***

ఖరీఫ్ 1985నుంచి సమగ్ర పంటల భీమా పథకాన్ని ప్రవేశ పెట్టినందుకు కేంద్ర వ్యవసాయ మంత్రి బూటా సింగ్ గారిని అభినందిస్తూ తాలుకా/బ్లాకు కాకుండా రెవిన్యూ గ్రామాన్ని డిఫైండ్ ఏరియా గా పరిగణించాలని కోరాను. గ్రామస్థాయిలో వివిధ పంటల దిగుబడి అంచనాలు లభ్యమయితే ఆ విధంగా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరం లేదని, 1986 మే 20న ఆయన తెలియపర్చారు. ఈ అంశం పైన నేను లోక్‌సభలో 1986 ఏప్రియల్ 23న 377 నిబంధన కింద సమగ్ర పంటల భీమా పథకం గురించి మాట్లాడాను. వివిధ పంటల దిగుబడి అంచనాలు రాష్ట్రాలనుంచి లభించనందువల్ల గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోలేకపోతున్నామని, పత్తి, చెరకు, పండ్ల తోటల్ని పంటల భీమా పథకంలో చేర్చడం గురించి చర్చలు జరుగుతున్నాయని 1986 మే 29న మంత్రిగారు తెలియపర్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పత్తిపంట, పొగాకు పంటలపైన సింథటిక్ పైరిథ్రాయిడ్స్‌ను వాడుతూ వున్న కారణంగా తెల్లదోమ ఉధృతి పెరిగి రైతులకు తీవ్రమైన నష్టం కలుగజేస్తూ వున్నందువల్ల కొంతకాలంపాటు మనదేశంలో సింథటిక్ పైరిథ్రాయిడ్స్ వినియోగాన్ని నిషేధించాల్సిందిగా 1985 డిసెంబర్ 18న ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశాను.

***<u>ప్రత్తి రైతుల రుణాలను ఎందుకు రద్దు చేయరు?</u>***

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పత్తి రైతులకు తెల్లదోమ, శనగపచ్చ పురుగువల్ల తీవ్రమైన నష్టం సంభవించినప్పుడు నేను ప్రకాశం జిల్లాలో జె. పంగులూరు మున్నగు గ్రామాలను సందర్శించి పత్తిరైతులను వెంటనే ఆదుకోవాలని 1988 జూలై 27న లోక్‌సభలో 377 నిబంధన కింద నేను ప్రస్తావించగా, డాక్టర్ పి.డి.ఓజా కమిటీ సిఫార్సులను దృష్టిలో పెట్టుకుని రైతులు చెల్లించాల్సిన బకాయిని రెండు సంవత్సరాల పాటు వాయిదా వేయడానికి, కాంపౌండ్ వడ్డీ వసూలు చేయకుండా ఉండడానికి రైతులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల్ని వేలం వెయ్యరాదని నిర్ణయించినట్లు 1988 ఆగస్టు

30న ఆర్థికశాఖ సహాయ మంత్రి ఫెలీరియో నాకు తెలియజేశారు. అయితే రుణాల్ని రద్దు చెయ్యడంగానీ, వడ్డీ తగ్గించడంగానీ సాధ్యపడదని, అలాచేస్తే బ్యాంకుల ఫైనాన్షియల్ స్టెబిలిటీపై ప్రభావం పడుతుందని రాశారు. బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు చెల్లించాల్సిన వేలకోట్ల రూపాయల బకాయిల్ని చడీచప్పుడు లేకుండా రద్దు చేస్తూవున్న బ్యాంకులు రైతులపట్ల మాత్రం సానుకూలతను చూపక పోవడం రైతుల దౌర్భాగ్యం. మన దేశంలో ప్రత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నేను ప్రతిపాదించిన సావధాన తీర్మనంపై 1988 డిసెంబరు 16న చర్చ జరిగింది. అందులో ప్రతి సంవత్సరం విధిగా ప్రత్తి ఎగుమతులను అనుమతించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పత్తికి తగిన స్థానం లభించగలదని, నాసిరకం విత్తనాల సరఫరాను నిరోధించాలని, కల్తి పురుగుమందుల చలామణిని అరికట్టాలని సి.సి.ఐలో రైతులకు ప్రాతినిధ్యం కల్పించాలని రైతుల రుణాలను మాఫీ చెయ్యాలని విజ్ఞాప్తి చేశాను.

పోలవరం ప్రాజెక్ట్ క్లియరెన్స్ సందర్భంగా పరిష్కరించవలసిన అంశాల గురించి నాటి జలవనరుల శాఖమంత్రి శంకరానంద్‌గారు పంపిన లేఖను నాటి ముఖ్యమంత్రి యన్.టి. రామారావుగారికి అందజేసి, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా కోరాను.

గొల్లపూడి వద్ద నుంచి వెళ్లే ముస్తాబాద ఛానల్ లిఫ్ట్ స్కీం నీటిని తమ గ్రామాలకు కూడా అందించాలని మున్నంగి కోటిరెడ్డి, కారుమూడి నాగిరెడ్డి, పాతపాడు, కుందావారి కండ్రిక గ్రామాల రైతులు చేసిన విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని యన్.టి. రామారావుగారి దృష్టికి తీసుకుని వెళ్లి అందుకు అనుమతిని సాధించడం జరిగింది.

1986 ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదలవల్ల పంటలు, ఆస్తులు నష్టపోయిన సందర్భంలో నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు విజయవాడ వచ్చిన సందర్భంలో మిత్రాకమిటీ సూచించిన విధంగా బుడమేరు పైప్రాంతంలో ఒక స్టోరేజ్ రిజర్వాయర్‌ను నిర్మించాలని, కృష్ణానదిలోకి మరొక డైవర్షన్ ఛానల్‌ను ఏర్పాటుచెయ్యాలని, మునేరు-వైరా నదులకట్టలు ఎత్తుతక్కువగా ఉన్నచోట్ల బలపరచాలని 1986 సెప్టెంబర్ 26న విజ్ఞప్తిచేశాను.

1989 జూన్ 8వ తేదీన బుడమేరు గురించి ఎన్.టి.రామారావుగారికి వినతి పత్రాన్ని అందజేశాను.

***<u>మన రాష్ట్ర ప్రాజెక్టుల పట్ల కేంద్రం పక్షపాత వైఖరి తగదు</u>***

పోలవరం ప్రాజెక్టు, వంశధార రెండవదశ, శ్రీశైలం ఎడమగట్టు కాలువ, శ్రీరామ్ సాగర్ రెండవదశ, ఇంచంపల్లి ప్రాజెక్టుకు జాయింట్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు, తెలుగుగంగ

ప్రాజెక్టు, కాకినాడ పోర్టు అభివృద్ధి, హైదరాబాద్‌లో సర్క్యులర్‌లైను, మున్నగు పలు అభివృద్ధి పథకాలకు అనుమతులు మంజూరు చేయడంలో చాలా జాప్యం జరుగుతూ ఉన్నదని, ప్రతి ఒక్క అంశంపైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారు మూడు పర్యాయములు ప్రధానమంత్రిని కలిసినా స్పందన లేకుండడంపట్ల రాష్ట్ర ప్రజల్లో కావాలని కేంద్రం పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని భావించవలసి వస్తున్నదని అందుకు నిరసనగా పార్లమెంటు సభ్యులం 1985 డిసెంబరు 16న రాజీవ్‌గాంధీకి లేఖరాశాం.

***<u>పంజాబ్‌లో ఇస్తున్న బియ్యం సేకరణ ధరను ఆంధ్రలో కూడ ఇవ్వాలి</u>***

మన రాష్ట్రంలో భారత ఆహార సంస్థ ధాన్యం కొనుగోలు చేయడం లేదని, మన బియ్యం ఎగుమతిపై నిషేధం ఉన్నదని, పంజాబ్‌లో కొనుగోలు చేసే బియ్యానికి ఎక్కువ ధరను యఫ్.సి.ఐ. ఇస్తున్నదని, 1985 ఏప్రియల్ 29న లోక్‌సభలో 377 నిబంధన కింద ప్రస్తావించాను. దానిపైన తగినంత బియ్యం మిగులు నిల్వలు లేవని, బాసుమతి బియ్యాన్ని మాంత్రం ఎగుమతి చేస్తున్నామని, పంజాబ్‌లో కొన్ని స్థానిక పన్నులు ఉండడంవల్ల ఆంధ్రప్రదేశ్‌లో కంటే అక్కడ అధికధరను యఫ్.సి.ఐ. చెల్లిస్తూవుంటుందని ఆనాటి ఆహార,



పౌర సరఫరాల శాఖమంత్రి రావు బీరేంద్రసింగ్ తెలియజేశారు. ఈ విషయం తెలిసిన తరువాత నేను పంజాబ్ వెళ్లి మండీను సందర్శించి అక్కడ ధాన్యం కొనుగోళ్లను , ఎఫ్‌సీఐ చెల్లించు ధర, రూరల్ డెవలప్‌మెంట్ సెస్‌ల గురించి వాకబు చేసి ఎన్టీ రామారావుగారికి చెప్పాను. అనంతరం అందుకు అవసరమైన చర్యలు తీసుకొనుట వలన మన రాష్ట్రానికి ఆర్డీఎస్ గణనీయంగా చేకూరింది.

దాళ్వాధాన్యం కొనుగోలు నిమిత్తం తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయమని 1985 ఏప్రియల్ 1న నేను లేఖ రాయగా యఫ్.సి.ఐ.కి అందుకు అవసరమైన ఉత్తర్వులిచ్చామని 1985 ఏప్రిల్ 27న తెలియ జేశారు.

విశాఖపట్నంలో రూ. 15కోట్ల రూపాయల ఖర్చుతో ఎక్స్‌పోర్టు ప్రాసెసింగ్ జోన్‌ను ఏర్పాటుచేయడానికి కేంద్రప్రభుత్వం సూత్ర ప్రాయంగా అంగీకరించిందని 1987జూన్ 9వ తేదీన జరిగిన సంప్రదింపుల సంఘం సమావేశంలో కేంద్రవాణిజ్యశాఖమంత్రి

తెలియజేసినట్లుగా ఈ విషయాన్ని నేను అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారికి 1987 జూన్ 10న ఒక లేఖలో తెలియజేశాను. హైదరాబాద్‌లో కష్టమ్స్ ఆఫీస్‌ను నెలకొల్పవలసిన ఆవశ్యకతను కేంద్రప్రభుత్వానికి తెలియపరచ వలసిందిగా కోరాను.

కేంద్ర బృందం అనువుగావుంటుందని భావించిన భూమిని కేంద్ర ప్రభుత్వానికి అందజేయగలమని తెలియజేశామని, అలాగే కష్టమ్స్ కార్యాలయాన్ని నెలకొల్పవలసిన ఆవశ్యకత గురించి కూడా రాయనున్నామని పరిశ్రమలశాఖ కార్యదర్శి బి.యన్. యుగంధర్ 1987 జూన్ 15న నాకు ఒక లేఖలో తెలియజేశారు.

నాటి కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి భజన్ లాల్ గారికి 1988 మార్చి 7న లేఖ రాయగా రుణమాఫి, వడ్డి మాఫి చేయడం సాధ్యపడదని, బ్యాంకులు బలహీనపడతాయని, రెండు సంవత్సరాలపాటు/తర్వాత సాధారణ పంట వచ్చే వరకు అసలు, అప్పటికైన వడ్డీ వాయిదా వేయడం జరుగుతున్నదని తెలియజేశారు. అసలు కంటే వడ్డీ మించరాదని సౌకర్యం సన్నకారు చిన్న రైతులకు మాత్రమే వర్తిస్తుందని కూడా తెలియజేశారు.

1988 ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల నష్టం కలిగిన సందర్భంలో భజన్‌లాల్ పర్యటించినప్పుడు అధిక వర్షపు నీరు త్వరగా పోవడానికి వీలుగా డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తూ వున్న కృషికి కేంద్రం కూడా నిధులు అందించాలని, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ చేపట్టవలసిన అవసరం ఉన్నదని, రసాయనిక క్రిమి సంహారక మందులను, ఎరువులను నిత్యవసర వస్తువుల చట్టం పరిధిలోని సెక్షన్ 3 కింద కంట్రోల్ ఆర్డర్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలు ఆమోదించాలని 1988 ఆగస్టు 28న కోరాను.

విశాఖపట్టణంలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్‌లో మత్యకారుల పిల్లలకు కూడా కొన్ని సీట్లు రిజర్వు చెయ్యాలని నాటి వ్యవసాయ శాఖమంత్రి జి.యస్. థిల్లాన్ గారికి 1987 డిసెంబరు 15న వ్రాయగా ఇతరులతో సమానంగా మార్కులు వచ్చిన సందర్భంలో మత్సకారుల పిల్లలకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఇవ్వగలమని ఆయన 1988 ఫిబ్రవరి 12 ఫిబ్రవరి 1988న తెలియజేశారు.

దుగ్గిరాల పసుపు వ్యాపారానికి ప్రసిద్ధి చెందింది. అక్కడ నుంచి జంపాల కృష్ణారావు పసుపు పంటకు సంబంధించి వ్యాగన్ల రవాణాకు సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు నా దృష్టికి తీసుకురావడం, వాటి పైన సంబంధిత అధికారులకు వ్రాయడం జరుగుతూండేది.

## *పట్టణ భూపరిమితి చట్టంలో కొన్ని మార్పులు చేయాలి*

పట్టణ భూపరిమతి చట్టం అమలు విషయాన్ని పరిశీలించడానికి ఏర్పాటు చేయబడిన చల్లా కొండయ్య కమీషన్ వారిని 1988 డిసెంబరు 18న కలసి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. అర్బన్ ఎగ్లామిరేషన్ పరిధిలోని రైతులు తమ పిల్లల చదువులు, వివాహాది శుభ కార్యాలు అవసరమైనప్పుడు తమ భూముల్ని అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, ఆ విషయాన్ని ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారి దృష్టికి తీసుకువెళ్ళగా, దాన్ని ఆయన పరిశీలించి అర్బన్ ఎగ్లామిరేషన్ పరిధిలో 5 ఎకరముల వరకు వ్యవసాయ భూమిని వ్యవసాయ అవసరాలకు అమ్ముకొనేందుకు అనుమతిని ఇస్తూ 1988 అక్టోబరు 31న జీ.ఓ.యమ్.యస్. 733ను జారీ చేశారు. కొంత మేరకు ఈ ఉత్తర్వు రైతుల ఇబ్బందులను తగ్గిస్తూ ఉన్నప్పటికీ ఇంకనూ ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రంలో మైనర్ పిల్లలకు కూడా హక్కు ఉండేలా ఉన్న విధంగా మన రాష్ట్ర అర్బన్ సీలింగ్ యాక్ట్‌లో ఫ్యామిలీ నిర్వచనంలో మార్పులు తీసుకు రావలసిన అవసరం ఉన్నదని, గృహం ప్లిన్త్ ఏరియాను 1500 చదరపు మీటర్ల సీలింగ్ లిమిట్‌లో కలపరాదని, తమిళనాడులో ఆ విధంగా ఉన్నదని మన రాష్టంలోకూడా ఆ విధంగా ప్రభుత్వానికి సూచించవలసిందిగా జస్టిస్ కొండయ్యగారిని నేను, డాక్టర్ తూమాటి ప్రేమనాథ్, బొప్పన రాఘవేంద్రరావు, కోనేరు రామచంద్రరావు కలసి విజ్ఞప్తి చేశాం.

కృష్ణా, గోదావరి డెల్టాల డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రపంచబ్యాంకు నిధులు అందించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మిత్రా కమిటీ, శ్రీరామకృష్ణయ్య కమిటీలు చేసిన అనేక సూచనలు ఆధునీకరణ పథకంలో ఉన్నప్పటికీ రెండు ప్రధానమైన అంశాలు, 1) వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కృష్ణానదిలోకి రెండవ డైవర్షన్ ఛానల్, 2) విజయవాడ నగరంలోని ముత్యాలంపాడు నుంచి నిడమానూరు వరకు బుడమేరు వెడల్పు చాలా తక్కువగా ఉండటంవల్ల పాయకాపురం నుంచి ఈలప్రోలు వరకు వరద ఎగదట్టుతున్నదని, కనుక ఈ భాగంలోని మేటను తొలగిస్తూ కొంత వెడల్పు చెయ్యాల్సిన అవసరమున్నదని నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారికి విజ్ఞప్తి చేశాను.

## *శబరిమలై యాత్ర*


నేను అయ్యప్పస్వామి దీక్షలో ఉండి జనవరి 14, 1986న శబరిమలై మణికంఠుని దర్శనానికి నా చిరకాల మిత్రుడు కిలారు విద్యాసాగరవర్మ, గొంది వెంకట్రాయుడులతో వెళ్ళాను. నాతోపాటు ఆనాడు రాష్ట్ర హోంమంత్రిగావున్న వసంత నాగేశ్వరరావుగారు

కూడా వచ్చివున్నారు. దేవాలయానికి సమీపంలో భక్తులకు సదుపాయాలు చాలా స్వల్పంగా ఉన్నాయి. లక్షలాదిమంది భక్తులు సందర్శించే దేవాలయం వద్ద కనీస అవసరాలైన సదుపాయాలు లేకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. దాని గురించి నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీగారికి దేవస్థానం బోర్డు అభ్యర్థించిన విధంగా వంద హెక్టార్ల అటవీభూమిని అక్కడ భక్తుల సౌకర్యార్థం తగిన వసతులు సమకూర్చడానికి అనుమతినివ్వాలని, ఇందుకు బదులుగా అవసరమైన విస్తీర్ణంలో కేరళ ప్రభుత్వం అటవీ విస్తీర్ణాన్ని పెంచుతుందని 1986 డిసెంబర్ 2వ తేదీన లేఖ రాశాను. ఈ విషయాన్ని అంగీకరించినట్లుగా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ తెలియపరిచారు. వనయాత్ర చేసిన తర్వాత పంపానదిలో స్నానం చేసినప్పుడు ఎంతో ఆనందం కలిగింది.

***<u>విజయవాడ నగర అభివృద్ధి:</u>***

అజిత్ సింగ్‌నగర్‌లో మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మించాలని, హైస్కూలుగా అప్‌గ్రేడ్ చెయ్యాలని కమీషనర్ రాజీవ్‌శర్మకు 1989 సెప్టెంబర్ 6న లేఖ రాశాను. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి అధ్యక్షుడు నరసింహారెడ్డితో మాట్లాడి నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేయించడం జరిగింది.

రూ. 67.5 లక్షల వ్యయంతో సూవేజ్ ప్లాంటును నెలకొల్పాలని పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీర్‌కు 1988 ఫిబ్రవరి 24న లేఖ రాశాను.



*బందరు కాలువపై యనమలకుదురు వద్ద వంతెన*

న్యూ జోజినగర్‌లో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించవలసిన ఆవశ్యకతను మున్సిపల్ కమిషనర్ ఊర్మిళా సుబ్బారావుగారి దృష్టికి తీసుకువెళ్ళాను. విజయవాడలో టూరిజం ఆఫీసును ప్రారభించవలసిన ఆవశ్యకత గురించి రాష్ట్ర ఛీఫ్ సెక్రటరీ శ్రావణ్‌కుమార్ గారిని 1985 జూన్ 5న అభ్యర్థించాను.

అన్నపూర్ణాదేవి మున్సిపల్ గరల్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో అదనపుగదుల నిర్మించాల్సిన ఆవశ్యకత గురించి కమిషనర్ ఊర్మిళా సుబ్బారావుగారికి ఒక లేఖలో తెలియజేశాను.

బందరు కాలువపైన చింతల తోట వద్ద వంతెన నిర్మించి పక్కనే ఉన్న యనమలకుదురు గ్రామ వాసులకు సౌకర్యంగా ఉండడానికి వీలుగా వంతెన నిర్మించాలని అప్పటి ఉడా వైస్ ఛైర్మన్, యం.డి. అయిన చక్రధరరావుగారికి 1989 ఏప్రియల్ 18న, తర్వాత వచ్చిన దానం గారికి 1989 జూలై 9న, విజయవాడ మున్సిపల్ కమిషనర్ రాజీవ్ శర్మగారికి 1988 అక్టోబరు 9న, జిల్లా పరిషత్ అధ్యక్షులు పిన్నమనేని కోటేశ్వరరావుగారికి 1989 ఏప్రియల్ 23న లేఖలు రాశాను. పైమూడు సంస్థలు, గ్రామ పంచాయితీ సమానంగా వ్యయభారం భరించే విధంగా ఒప్పించి బ్రిడ్జినిర్మాణం చేయించడానికి నావంతు కృషి చేశాను.

నిర్మలా కాన్వెంటు సమీపంలో వర్క్‌మెన్ పేట బలహీన వర్గాలవారు పక్కా గృహాలు నిర్మించుకునే విషయంలో సహకారాన్ని అందించవలసిందిగా ఉడా వీ.సి. అండ్ ఎం.డి. ప్రశాంత్ మహాపాత్రను, ఆటోనగర్‌లోని స్టేట్‌బ్యాంకు అధికారులను కోరాను.

***<u>విస్సన్నపేట మండలం</u>***

1. 8వ లోక్‌సభలో సభ్యుడిగా ఉండగా విస్సన్నపేటలో ఫైర్‌స్టేషన్ ఆవశ్యకత గురించి జిల్లా కలెక్టర్‌కు 1986 డిసెంబరు 24న లేఖ రాయగా ఆయన 1987 జనవరి 7న అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా ఫైర్ ఆఫీసరుకి రాశారు. మండల కేంద్రమైన విస్సన్నపేటలో ఆర్.టి.సి. బస్సుస్టేషన్‌ను నిర్మంచాలని 1989 అక్టోబరు 3న అప్పటి ఆర్.టి.సి. వీ.సి.& ఎం.డి. హెచ్.జె. దొర గారిని కోరాను. జిల్లా కలెక్టర్ భట్టాచార్యగారి సహకారంతో బస్సు స్టేషన్‌కు గ్రామం నడిబొడ్డున ఉన్న స్థలాన్ని ఇప్పించాను.

చంద్రుపట్ల, మిట్టగూడెం, తాతకుంట్ల, వేమిరెడ్డి పల్లి గ్రామాలకు త్రాగునీటి పథకాలను మంజూరు చెయ్యాలని కోరాను.

కొర్లమండ, వేమిరెడ్డిపల్లి, పుట్రేల మున్నగు గ్రామాలకు నాగార్జునసాగర్ ఎడమకాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును మంజూరు చేయాలని 1985 మే 1న మంత్రి కె.ఇ.

కృష్ణమూర్తి, ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గారికి, యస్.ఇ. కె.వి.యల్. నారాయణరావుగారికి 1986 ఏప్రియల్ 17న లేఖలు రాయడం జరిగింది. తర్వాత యస్.ఇ. చెరుకూరి వీరయ్యగారు వచ్చి ఆ ప్రాంత పరిస్థితుల్ని పరిశీలించి నూతిపాడు వద్ద లిఫ్ట్‌స్కీము ఉపయోగకరంగా ఉంటుందని అయితే ఇబ్రహీంపట్నం సమీపంలో తారకరామ లిఫ్ట్‌స్కీము మంజూరైతే ఎన్.యస్.పి. ఆయుకట్టు కొంత ఆ స్కీముకిందకు వెళ్తుంది కాబట్టి అప్పుడు ఈ స్కీముకు అనుమతి లభిస్తుందని చెప్పారు.

నందమూరి మధుసూధనరావుగారి కోరిక మేరకు నరసాపురం గ్రామ పంచాయితీ నుంచి మారేమండ గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయితీగా ఏర్పాటు చేయడానికి నా వంతు కృషి చేశాను.

***<u>చాట్రాయి మండలం</u>***

ఆరుగొలను పేట, సోమవరం, జనార్థనవరం గ్రామాల్లో మినీ పి.డబ్యూ.యస్. స్కీములు మంజూరు చెయ్యాలని, చనుబండలో మెడికల్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చెయ్యాలని, ఉప్పువాగుపైన లిఫ్ట్ స్కీమును మంజూరు చెయ్యాలని, పోతానపల్లి వరకు, పోలవరం వరకు ఆర్టిసీ సర్వీసులను పొడిగించాలని పోలవరంలో వెటర్నరీ హాస్పటల్‌ను నిర్మించాలని కోరాను. మండలకేంద్రమైన చాట్రాయిలో జిల్లా పరిషత్ హైస్కూలు అభివృద్ధి కోసం జెడ్.పి. చైర్మన్‌గా ఉన్న సుంకర సత్యనారాయణగారు ఎంతగానో సహకారాన్ని అందించారు. కోటపాడు శివారు మర్రిబంధం గ్రామంలో ప్రైమరీ స్కూలును ఏర్పాటుచేయడానికి నావంతు కృషి చేశాను.

***<u>గంపలగూడెం మండలం</u>***

కొణిజర్ల గ్రామంలో వెటర్నరీ డిస్పెన్సరీని చేయాలని, ఊటుకూరులో రక్షిత నీటి సరఫరా పథకాన్ని, గోసవీడు, తునికిపాడు గ్రామంలో రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్ల ఏర్పాటుకు నావంతు కృషిచేశాను.

మండల కేంద్రమైన గంపలగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని 1993 జూలై 23న నాటి ముఖ్యమంత్రి ఎన్. జనార్దన్‌రెడ్డిగారిని కోరాను.

ఊట్కూరు–ఆత్కూరు, కోటపాడు–కాకర్ల రహదారులు చనుమోలు వెంకట్రావుగారు ఆర్ & బి మంత్రిగా ఉండగా అప్పట్లో తిరువూరు పంచాయితీ సమితి అధ్యక్షుడుగా ఉన్న కొల్లిపావని వీరరాఘవరావు గారి సూచన మేరకు జిల్లా పరిషత్ నుంచి ఆర్ అండ్ బి శాఖ ఆధీనంలోకి తీసుకోవడం జరిగింది. కొన్నిచోట్ల వాగులపైన అవసరమైన

వంతెనల నిర్మాణం, రోడ్లు అభివృద్ధి జరిగి వుండలేదు. అనేకసార్లు సంబంధిత అధికారులతో మాట్లాడటం, జిల్లా సమీక్షా సమావేశాల్లో ప్రస్తావించడం ద్వారా వాటి అభివృద్ధికి నావంతు కృషిచేశాను.

## తిరువూరు మండలం

కట్టలేరు అనకట్ట దెబ్బతిన్న పరిస్థితుల్లో దానిని పునర్మిణాం చేయించాలని 1992 జూలై 6న నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్థనరెడ్డిగారికి విజ్ఞాప్తి చేయడం జరిగింది.

తిరువూరులో మండల రెవెన్యూ కార్యాలయ స్థలంలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు స్థలాన్ని మంజూరు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌శర్మగారిని కోరడం జరిగింది.

తిరువూరులో విశాలమైన ప్రాంగణంలో యన్.యస్.పి. క్వార్టర్స్ ఉన్నాయి. యన్.యస్.పి. కాలువల నిర్మాణ సమయంలో ఇవి నిర్మించబడ్డాయి. కాలువల నిర్మాణం పూర్తి కావడంలో తగినంత స్టాఫ్ లేక చాలా క్వార్టర్లు ఖాళీగా ఉంటున్నాయి. అపరిస్థితుల్లో ఆ ప్రాంగణంలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభింప జేయుటకు ప్రయత్నం చేశాను. అవి అనువుగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ జాయిట్ సెక్రటరీ నవోదయ విద్యాలయ డైరెక్టర్ అయిన కె.యస్. శర్మగారికి తిరువూరును సూచిస్తూ 1987 సెప్టెంబరు10న లేఖ రాశాను. 1988 జూన్ 8న నాటి మానవనరుల శాఖ మంత్రి పి.వి. నరసింహారావుగారికి కూడా ఒక లేఖ రాయడం జరిగింది. అయితే నాడు బందరు పార్లమెంటు సభ్యులుగా ఉన్న కావూరి సాంబశివరావుగారు వేలేరు సమీపంలో గురునాథం దంపతులు అందజేసిన భూమిలో ఈ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయించుకున్నారు.

## చందర్లపాడు మండలం

బొబ్బిళ్ళపాడు చెరువు అలుగు నుంచి వెళ్ళే నీటిని ఊస్తేపల్లి పంపింగ్ స్కీము కింద ఉన్న ఆయుకట్టునకు పొక్కునూరు మైనర్ ద్వారా కలపాలన్న రైతుల కోర్కెమేరకు ప్రయత్నించడం జరిగింది. 1985 ఆగస్టు 26న ఇరిగేషన్ శాఖ యస్.ఇ. రాధాకృష్ణమూర్తి గారికి యార్లగడ్డ రామనరసింహం, తొండేపు గోపాలరావు, మున్నగు వారితో కలసి విజ్ఞాప్తి చేశాను.

చందర్లపాడు ప్రాంతంలో లోవోల్టేజి సమస్యను అధిగమించడానికి సబ్‌స్టేషన్‌ను శాంక్షన్ చేయవలసిన ఆవశ్యకత గురించి 1985 జూన్ 3న జిల్లా కలెక్టర్ ఆర్.పి. అగర్వాల్ గారిని కోరడం జరిగింది.

**పెనమలూరు మండలం**

ఇరిగేషన్ డిపార్ట్‌మెంటుకు చెందిన 60సెంట్లు భూమిని చోడవరం గ్రామంలో హరిజనులకు స్మశాన వాటిక నిమిత్తం ఇవ్వాలని కోరాను. మచిలీపట్నం-విజయవాడ రోడ్డునుంచి గంగూరు మీదుగా లక్ష్మీపురం గ్రామానికి రహదారిని అభివృద్ధి చెయ్యాలని, గంగూరుకు ఆర్.టి.సి. బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామసర్పంచ్ అబ్దుల్ లతీఫ్ కోరిక మేరకు ప్రయత్నించాను.

గంగూరు ఛానల్ చివరి భాగంలో వున్న ఆయుకట్టుకు సరిపడగా నీరు వచ్చేందుకు సైఫన్ ఏర్పాటు చేయించేందుకు కృషిచేశాను.

గోసాల, వణుకూరు గ్రామాల భూములనుంచి పోయే పుల్లేరు డ్రైయిన్‌ను మెరుగుపరచడానికి నా వంతు కృషి చేశాను.

సిరీస్ వద్ద బందరురోడ్డు ప్రక్కన రోడ్‌సైడ్ డ్రెయిన్‌ను నిర్మించడానికి, కానూరు గ్రామంలో పి.డబ్ల్యు.యస్. పథకాన్ని కానూరు సర్పంచ్ దేవభక్తుని వెంకటేశ్వరరావుగారి సూచనపై మంజూరు చేయించడానికి కృషి చేశాను.

పోరంకి గ్రామంలో పి.డబ్ల్యు.యస్. స్కీము కోసం, జిల్లా గ్రంధాలయ సంస్థ బ్రాంచీని పోరంకిలో ఏర్పాటు చేయాడానికి తోటకూర కాశీ విశ్వేశ్వరరావు మున్నగు వారు కోరగా నావంతు కృషి చేశాను.

కిలారు వర్మగారి సూచనపై తాడిగడప నుంచి యలమలకుదురు గ్రామానికి రోడ్డు అభివృద్ధికి కృషిచేశాను.

**ఇబ్రహీంపట్నం మండలం**

తారకరామ ఎత్తిపోతల పథకాన్ని రూ. 22.71 కోట్లతో 2003 జూన్ 13న జి.ఓ.యం.యస్.6 ద్వారా ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో నాబోర్డు నుంచి ఋణసదుపాయంగా రూ.21.03 కోట్ల ఆర్.ఐ.డి.యఫ్ 8 కింద కోటి నలభై లక్షలు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ముందుకు తీసుకు వెళ్ళడం జరిగింది.

కొండపల్లిలో డాక్టర్ కొండవీటి చంద్రమౌళి నాతో సన్నిహితంగా ఉండేవారు. కొండపల్లి చరిత్రను రచించగా ఆర్కిలాజికల్ డిపార్ట్‌మెంటు వారిచే కొత్తపుస్తకాన్ని ముద్రింపజేయడం జరిగింది. కొండపల్లిలో ముఖ్యమంత్రి ఎన్టీరామారావుగారు దీనిని ఆవిష్కరించారు.

కేతనకొండ గ్రామానికి మంచినీటి సదుపాయం, పంచాయితీ కార్యాలయం, ఇబ్రహీంపట్నం మండలంలోని 12గ్రామాల్ని నూజివీడు సబ్ కోర్టు పరిధినుంచి విజయవాడ సబ్‌కోర్టు పరిధిలోకి మార్పించడం జరిగింది.

దాములూరు పంపింగ్ స్కీమ్ నుంచి కొటికలపూడికి సాగునీటి సౌకర్యం విస్తరింపజేయడం జరిగింది.

కొండపల్లిలో ముందడుగు పౌల్ట్రీ కాంప్లెక్స్ వారికి, కుమ్మర్లకు సహకారాన్ని అందించడం జరిగింది.

కొటికల పూడి గ్రామంలో ఇండ్లస్థలాన్ని ఇప్పించడం జరిగింది.

***<u>ఎ కొండూరు మండలం</u>***

రామచంద్రపురం గ్రామరైతు గుంటక లక్ష్మారెడ్డి భూమిని యన్.యస్.పి. సేకరించి కాలువ తవ్విన సందర్భంగా నష్టపరిహారాన్ని రాజర్షి భట్టాచార్యగారి దృష్టికి తీసుకెళ్ళగా ఆయన వెంటనే స్పందించి వడ్డీతో సహా లక్ష్మారెడ్డికి వెళ్ళవలసిన మొత్తానికి చెక్ తయారు చేయించి ఆయన క్యాంపు ఆఫీసులో నాతో ఇప్పించారు.

కుమ్మరికుంట్ల, సమీప గ్రామాలకు యన్.యస్.పి. మెయిన్ బ్రాంచి కెనాల్‌నుంచి గానీ, జమలాపురం మేజర్ కాలువనుంచి గానీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము శాంక్షన్ చెయమని యన్.యస్.లెఫ్ట్ కెనాల్స్ యస్.ఇ. గారికి 1987 జూన్ 28న లేఖరాయగా ఇబ్రహీంపట్నం వద్ద తారకరామ స్కీమ్‌ను టేకప్ చేసిన తర్వాత ఈ విషయం పరిశీలించబడుతుందని 1987 జూలై 27న సమాధానమిచ్చారు.

ఎ. కొండూరులో మండల కార్యాలయ భవనానికి అవసరమైన స్థలాన్ని విడగొట్టవలసిందిగా నూజివీడు ఆర్డిఓకి లేఖ రాశాను.

1986 సెప్టెంబర్‌లో వరదలవల్ల నష్టపోయిన ప్రాంతాల్ని పరిశీలించడానికి నాటి ప్రధాని రాజీవ్‌గాంధీగారు అక్టోబర్ 3 తేదీన విజయవాడ వచ్చిన సందర్భంగా నష్టపోయిన రైతులకు సహాయం చేయడంతోపాటు, దెబ్బతిన్న పొగాకు బ్యారన్లను పునరుద్ధరించాలని, అజిత్ సింగ్‌నగర్, ప్రకాష్ నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బుడమేరు కరకట్టను ఎత్తు పెంచి బలపరచాలని, మిత్రా కమిటీ సిఫార్సులను అమలుచెయ్యాలని, ఇంకా అనేక సూచనలతో నరసరావుపేట ఎం.పి. కాటూరి నారాయణస్వామిగారు, నెల్లూరు ఎం.పి. పెంచలయ్యగారు, నేను ఆయనకు వినతిపత్రం సమర్పించాం.

గంపలగూడెం మండలం కొణిజెర్ల గ్రామంలో యస్.సి. యస్.టి. బి.సి. కాలనీలకు, ఏ. కొండూరు మండలం కృష్ణారావు పాలెం హరిజనవాడకు వీధి దీపాల సదుపాయం కల్పించాలని, చందర్లపాడు ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్యను అధికమించడానికి సబ్ స్టేషన్ నెలకొల్పాలని, రెడ్డిగూడెంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పరచాలని జొన్నలగడ్డ, మర్లపాలెం, ఊటుకూరు, మల్లెల, తూర్పు మాధవరం, ముండ్లపాడు దాసుళ్ళపాలెం, కొటికలపూడి, మిట్టగూడెం, చంద్రుపట్ల, పుట్రేల, గాదేవారి గూడెం, అనుమలంక, చింతలనెర్వ, రెడ్డిగూడెం, రుద్రవరం, కొత్త నాగలూరు, కంచికచర్ల, గొట్టెముక్కల, చెరువుకొమ్ముపాలెం, వల్లంపట్ల, కాకర్ల, వేమిరెడ్డిపల్లి, నరసింహరావుపాలెం, మొగులూరు గ్రామములలోని యస్.సి. బి.సి. యస్.టి. కాలనీలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని, విజయవాడ ముత్యాలంపాడు ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరాను. విజయవాడలో యస్.సి.గా ఉన్న గోపాలకృష్ణమూర్తిగారు డి.ఇ. శేషగిరిరావుగారు బాగా సహకారమిస్తూండేవారు. వి.టి.పి.యస్ యాష్ పాండ్ గండి పడినప్పుడు పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేశాను. పలు గ్రామాలలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కలెక్షన్లు మంజూరు చేయించేందుకు నా వంతు సహకారాన్ని ఇస్తూ ఉండేవాడిని.




*ఆల్ ఇండియా గార్డ్స్ సమావేశంలో*

ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ నాయకులు యస్.పి. సింగ్, వారి సహచరులు గార్డ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు అసోసియేషన్ నాయకుడు

రామారావుగారు, వారి సంఘసభ్యులు వారి సమస్యల గురించి చెప్పినప్పుడు వాటిని కేంద్ర ప్రభుత్వ దృష్టిలోకి తీసుకువెళ్ళి ప్రశ్నలు, లేఖల రూపంలో వివరించి, వాటి పరిష్కారంకోసం కృషి చేశాను.

## గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకై కృషి

కృష్ణాజిల్లాలో కనకదుర్గా గ్రామీణబ్యాంకును, తూర్పుగోదావరిజిల్లాలో గోదావరి గ్రామీణబ్యాంకును ఏర్పాటు చేయాలని నాటి పార్లమెంటు సభ్యులు బోళ్ల బులిరామయ్య, విజయకుమార్‌రాజు, చంద్రు శ్రీహరి, టి.గోపాలకృష్ణ, ఎ.జె.వి.బి.మహేశ్వరరావు, డాక్టర్ విజయరామారావు, రఘుమారెడ్డి, నేను కలసి ఆనాడు ఆర్థికమంత్రిగా ఉన్న వి.పి.సింగ్‌గారికి, సహాయమంత్రి జనార్దన్ పూజారిగారికి 1985 జనవరి 30న ప్రతిపాదించడం జరిగింది.

కృష్ణాజిల్లాలో కనకదుర్గా గ్రామీణబ్యాంకు బ్రాంచీలు నెలకొల్పవలసిన ఆవశ్యకత గురించి నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీగారికి 1987 జనవరి 28న లేఖ రాయగా, ఆయన ఆర్థికమంత్రిత్వశాఖకు పరిశీలన నిమిత్తం పంపామని 1987 ఫిబ్రవరి 2న తెలియజేశారు. జవహర్ రోజ్‌గార్‌యోజన పథకం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచడానికి, సమాజానికి ఉపయోగపడే నిమిత్తం కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం గురించి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీగారికి 1989 జూన్ 9న లేఖ రాశాను. 8వ పంచవర్ష ప్రణాళిక రూపుదిద్దుకుంటున్న సమయంలో ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడుగా ఉన్న ప్రణబ్ ముఖర్జీగారికి 1991 నవంబర్ 10న వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి ఏమేరకు నిధులు అవసరమో ఇంతవరకు ప్రణాళికా సంఘం అంచనా వేయకపోవడం ఆశ్చర్యకరమని, రుణపరపతిని పెంచాలని, మార్కెటింగ్ వ్యవస్థలో రైతులకు అనుకూలంగా మార్పులు చెయ్యాలని, వ్యవసాయ పరిశోధనలకు కేటాయింపుల్ని రెట్టింపు చెయ్యాలని, ఇంకా ఇటువంటి అనేక అంశాల్ని సూచించాను. నూతన పారిశ్రామిక విధానం గతానికి భిన్నంగా ఉండాలని, ఉపాధి అవకాశాల్ని ఎక్కువగా కల్పిస్తూ శీఘ్రగతిన పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి మనదేశ పరిస్థితులకు అనుగుణమైన సాంకేతికతను అభివృద్ధి పరచి, అనుసరించడం అవసరమని, వ్యవసాయ ఉత్పత్తులను ఉపయోగించుకునే గ్రామీణ పరిశ్రమలకు ఎక్కువ ప్రోత్సాహం కల్పించాలని, చేనేత రంగం వారి ప్రయోజనాల్ని కాపాడే విధంగా రూపొందించాలని ప్రణబ్ ముఖర్జీగారిని కోరాను.

## అమానుషంగా రంగా హత్య - బాధాకరంగా అనంతర పరిణామాలు

1989లో పార్లమెంటు ఎన్నికలొచ్చాయి. శాసనసభ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ పార్లమెంటుతో పాటు శాసనసభకు కూడా ఎన్నికలు నిర్వహించమని రామారావుగారు ఎన్నికల కమీషనర్‌ను కోరారు. పర్యవసానంగా లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించారు. 1988లో విజయవాడ నగర కాంగ్రెస్ నాయకుడు, శాసనసభ్యుడు అయిన వంగవీటి మోహనరంగారావు తన ప్రాణానికి ముప్పువున్నదని భావించి, ఉభయగోదావరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి వచ్చిన తర్వాత విజయవాడలో తన ఇంటిముందు నిరాహారదీక్ష చేస్తూవుండగా దారుణహత్యకు గురవ్వడం అత్యంత దురదృష్టకరం. ఈ కారణంగా ప్రజల్లో విపరీతమైన సానుభూతి పెరిగింది. ఫలితంగా తెలుగుదేశం పార్టీ శాసనసభ ఎన్నికల్లోను, పార్లమెంటు ఎన్నికల్లోను అపజయం పాలైంది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో పార్లమెంటు స్థానం నుంచి నేను ఓటమి పాలైతే, చెన్నుపాటి విద్యగారు గెలుపొందారు.

వంగవీటి మోహనరంగారావు హత్యానంతరం పోలీస్‌శాఖ సరైన సమయంలో తగిన చర్యలు తీసుకొనకపోవడం వల్ల అల్లరిమూకలు విజృంభించి విజయవాడ నగరంలోని బీసెంటురోడ్డు, బందరురోడ్డు, ఏలూరురోడ్డు, పటమట, గాంధీనగరం, మున్నగు ప్రాంతాల్లో అనేక దుకాణాల్ని ధ్వంసం చేసి, లూటీ చేసి, దారుణమైన దహనకాండకు పాల్పడ్డారు. ఇక్కడ విజయవాడలో జరుగుతున్న విధ్వంసాన్ని స్ఫూర్తిగా తీసుకుని గుంటూరు, ఉయ్యూరు ఇంకా అనేక పట్టణాల్లోని ఆస్తుల్నికూడా ధ్వంసం చేశారు. విజయవాడలోని సూర్యారావుపేటలో మా మేనత్త భర్త అయిన డాక్టర్ ఉప్పలపాటి శ్రీహరిరావు గారిల్లు ఉండేది. డాక్టర్ శ్రీహరిరావుగారికి పోలీస్‌శాఖవారు చాలా సన్నిహితంగా ఉండేవారు, వారికి ఆయన ఉచిత వైద్య సేవలందిస్తూండేవారు. ఆయన ఇంటి ప్రహరీ వెలుపల ఒక పాలబూత్ ఉంది. అక్కడ ఒక వ్యక్తి పాల బూత్ వద్దకు వచ్చే మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని డాక్టర్ గారికి చెప్పడంతో ఆయన ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఆ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. రంగా హత్య జరిగిన రోజున ఆ వ్యక్తిని పోలీసులు కస్టడీనుంచి విడుదల చేశారు. తనను అరెస్టు చేయించారనే కోపంతో ఆ వ్యక్తి కత్తితో డాక్టర్‌గారిని ఆయన ఇంటివద్దే దారుణంగా హత్యచేశాడు. ఎప్పుడూ నవ్వుతూ, ఎవరికైనా సహాయం చేసే మనస్తత్వంగల డాక్టర్‌గారి మృతితో భూదేవిలాంటి మా మేనత్త చిట్టెమ్మగారికి, వారి

కుటుంబానికి జరిగిన ఈ దురదృష్టకర సంఘటన జీవితంలో మరచిపోలేనిది.

కోడూరు మండలంలో జయపురం అనే గ్రామం ఉంది. అవనిగడ్డ బస్సు డిపో నుంచి ఆర్.టి.సి. బస్సులో కొంతమంది వ్యక్తులు జయపురం గ్రామం వెళ్ళి, అక్కడ ముగ్గురు వ్యక్తుల్ని సజీవంగా దహనం చేశారు. వారికి నెహ్రూ ఎవరో తెలియదు, రంగా ఎవరో తెలియదు. వారు చేసిన పాపమల్లా కమ్మకులంలో పుట్టడమే.

***విజయవాడ మరిచిపోలేని రాజర్షి భట్టాచార్య***

కేవలం రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వైషమ్యం చివరికి రెండు కులాల మధ్య చిచ్చుపెట్టడానికి దారితీసింది. అమాయకులైన ఎందరో వ్యక్తులకు తీవ్రమైన నష్టం జరిగింది. ఆ సమయంలో కృష్ణాజిల్లా కలెక్టర్‌గా రాజర్షి భట్టాచార్య, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా బాలసుబ్రహ్మణ్యంగారు ఉన్నారు. నేను విజయవాడ నగరంలోనే ఉన్నా మా ఇంటికి ఎవరూ వచ్చి అల్లరి చెయ్యలేదు. ముందునుంచి నేను అసమంజస, దౌర్జన్యకర విధానాలకు వ్యతిరేకమని అందరికీ తెలుసు. కులాలకు, పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ తోడ్పాటును అందించే వ్యక్తినని అంతా భావించేవారు. నష్టపోయిన



షాపుల్ని సందర్శించి, తిరిగి వారు తమ వ్యాపారాన్ని కొనసాగించుకోగలగడానికి బ్యాంకులనుంచి ఏ విధమైన సహకారం కావలసివుంటుందనే విషయాన్ని గురించి పరిశీలించాం. షాపు యజమానికి ఏమీ సంబంధం లేకుండానే వేరే కారణాలవల్ల షాపుల్లోని ఆస్తి ధ్వంసమైనందువల్ల ఇన్సూరెన్స్ కంపెనీలు ఉదారంగా వ్యవహరించాయి. నష్టపోయిన వ్యాపారులకు, ఇంకా వ్యక్తులకు తోడ్పాటును అందించడంకోసం తగిన విధంగా జిల్లా కలెక్టర్ రాజర్షి భట్టాచార్య, పి.డి. డి.ఆర్.డి.ఎ. బాలసుబ్రహ్మణ్యంల సహకారంతో ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారికి డ్రాఫ్ట్ జీవోలను పంపడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో జీవో లిచ్చి వారందరూ కోలుకోవడానికి తోడ్పాటును అందించింది. కనీవినీ ఎరుగనిరీతిలో ప్రైవేట్, పబ్లిక్ ఆస్తులకు విజయవాడ నగరం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో నష్టం చేకూరిందని, సినిమా థియేటర్లు, గృహాలు, బట్టల దుకాణాలు, వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, ఫ్యాన్సీ

షాపుల వంటి వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, సూపర్‌బజార్, ఆర్‌టిసి బస్సులు, ప్రభుత్వ కార్యాలయాలు మున్నగునవి విధ్వంసానికి గురయ్యాయని, ఈ పరిస్థితుల్లో నష్టపోయిన సంస్థలు, వ్యక్తులు జరిగిన నష్టం నుంచి కోలుకుని తిరిగి సాధారణ స్థితిని పొందగలగడానికి ఇన్స్యూరెన్స్ సంస్థల సహకారం, బ్యాంకుల సహకారం అత్యంత అవసరమని, అందు నిమిత్తం అవసరమైన ఆదేశాల్ని సంబంధిత సంస్థలకు కేంద్రప్రభుత్వం వెంటనే పంపించాలని 1988 డిసెంబర్ 31న అభ్యర్థించాను. వంగవీటి మోహనరంగారావు హత్యానంతరం జరిగిన అల్లర్లలో ఈవిధంగా నష్టపోయిన వ్యాపార సంస్థలకు త్వరగా ఇన్స్యూరెన్సు క్లెయిమ్స్‌ను సెటిల్ చేయవలసిందిగా జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ హెచ్.బి.దేశాయ్‌ని 1989 ఫిబ్రవరి 8న కోరాను. ఇదే అంశంపైన పార్లమెంటులో నేను వేసిన ప్రశ్నకు 1989 మార్చి 31న కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి సమాధానం రూపంలోను, 1989 ఏప్రిల్ 6న లేఖరూపంలోనూ కేంద్రప్రభుత్వం ఇన్స్యూరెన్స్ కంపెనీలకు, బ్యాంకులకు పంపిన ఆదేశాల వివరాల్ని నాకు పంపారు. ఆ సమయంలో భట్టాచార్యగారు, బాలసుబ్రమ్మణ్యంగారు, రాత్రనక పగలనక శ్రమించారు. ఫలితంగా కొద్దినెల్లల్లోనే మరుభూమిని తలపించిన ఆ ప్రాంతాలు తిరిగి కళకళలాడాయి.

1989 మార్చి 2న లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగం పైన ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై చర్చ సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో 1988 డిసెంబరు నెలలో జరిగిన కనీవినీ ఎరుగని విధ్వసం, ఆస్తినష్టం గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ఒక్కమాట కూడా లేకపోవడం శోచనీయమని అన్నాను. 1984 నవంబర్‌లో శ్రీమతి ఇందిరాగాంధి హత్య అనంతరం ఢిల్లీలో జరిగిన విధ్వంసం కన్నా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విధ్వసం చాలా ఎక్కువని, ఢిల్లీలో అల్లర్లలో నష్టపోయిన వాణిజ్య సంస్థలకు బ్యాంకు రుణాలు ఇన్సూరెన్స్ క్లయిమ్‌ల పరిష్కారంలో ఏ విధమైన చర్యలు తీసుకున్నారో ఆ విధంగానే ఆంధ్రప్రదేశ్‌లో నష్ట పోయిన వారికి కూడా సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశాను.

## సోనియా గాంధీ పాపానికి మూల్యం చెల్లించిన రాజీవ్‌గాంధీ

నేను 8వ లోక్‌సభ సభ్యునిగా ఉండగా రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళాలని, ఆధునికతను జోడించి శాస్త్ర , సాంకేతిక రంగాల సహకారంతో భారతదేశాన్ని ముందుకు నడిపించాలని కోరుకున్న వ్యక్తి. శ్యాం పిట్రోడా గొప్ప మేధావి. టెలికమ్యూనికేషన్స్ రంగానికి భవిష్యత్‌లో ప్రాముఖ్యతను గుర్తించి నూతన టెలికాం విధానాన్ని తీసుకువచ్చారు. అప్పటివరకు రక్షణ శాఖ కొనుగోళ్లలో



*నాటి ప్రధాని రాజీవ్‌గాంధి గారితో వడ్డే, బాపిరాజు*

కమీషన్లు ఉంటూ వచ్చాయి. రాజీవ్‌గాంధీనే అలా ఉండరాదని విధాన నిర్ణయం తీసుకున్నారు. అయినా ముడుపులు ముట్టాయని హిందూ పత్రికకు చెందిన చిత్రా రామచంద్రన్ పరిశోధనలో స్పష్టంగా తెలిసింది. వాస్తవానికి ఈ వ్యవహారంలో ఖత్రోచి ప్రధాన సూత్రధారుడని పలువురు భావిస్తున్నారు. ఈ విషయం సోనియాగాంధీకి తెలుసు. బోఫార్స్ కుంభకోణంలో సోనియా గాంధీకి సన్నిహితుడైన ఖత్రోచి వలన రాజీవ్‌గాంధీకి నష్టం చేకూరింది. భారతదేశంలో సంస్కరణలు కొద్ది స్థాయిలో ప్రారంభమయ్యింది రాజీవ్ కాలంలోనే.

పార్లమెంటు ఎన్నికల్లో అపజయం పాలైనప్పటికీ, అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిని కొనసాగించాను. ఢిల్లీలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. నేషనల్ ఫ్రంట్ తరపున ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల్లో ఎక్కువమంది ప్రధానమంత్రిగా దేవీలాల్ ఉండాలని కోరారు. వారి అభ్యర్థనను దేవీలాల్‌గారు సున్నితంగా తిరస్కరించి, విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారిని ప్రధానమంత్రిగా తానే ప్రతిపాదించారు. దేవీలాల్ వ్యవసాయమంత్రి గానూ, ఉపప్రధానిగానూ బాధ్యతలు తీసుకున్నారు. ఆ సమయంలో వ్యవసాయ విధానాలు, వ్యవసాయరంగానికి సంబంధించిన విధానాలు, కార్యక్రమాల్ని సమీక్షించడానికి ప్రముఖ రైతునాయకులు, జనతా ప్రభుత్వంలో ఆహారశాఖ మంత్రిగా పనిచేసిన భానుప్రతాప్ సింగ్‌గారి అధ్యక్షతన కమిటీ ఏర్పాటయ్యింది.

__*వరదలు, తుఫాన్లు వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలి*__

కృష్ణాజిల్లాలో ఖరీఫ్‌లో వరదల బీభత్సాన్ని అంచనా వేయడానికి డాక్టర్ బి.సి. శర్మ నేతృత్వంలో వచ్చిన కేంద్ర బృందానికి రైతుల పంటలకు చేకూరిన నష్టాన్ని, భవిష్యత్తులో ఇటువంటి నష్టాల్ని నివారించడానికి మునేరు, వైరా, బుడమేరు, తమ్మిలేరు, రామిలేరులపై చేపట్టవలసిన పనుల గురించి 1989 ఆగస్టు 24న వినతిపత్రాన్ని అందజేశాను.

1990 మే లో సంభవించిన తుఫాన్ వల్ల కలిగిన నష్టాలను మదింపు జేయడానికి వచ్చిన కేంద్రబృందానికి 1990 మే 14న, తుఫాను ప్రభావ కోస్తా జిల్లాల్లో ఇరిగేషన్ అంశాన్ని పరిశీలించడానికి వచ్చిన వరల్డ్ బ్యాంకు బృందం వారికి 1990 జూన్ 22న నేను, రాజ్యసభ సభ్యులు డాక్టర్ వై.శివాజీ కలసి వినతిపత్రాలను అందజేశాం.

ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనెసంచులను సరఫరా చేయడంలో జరుగుతున్న జాప్యం వల్ల, రంగు మారిన గింజల శాతాన్ని 10శాతం వరకే కోత లేకుండా నిర్ణయించడంవల్ల తుఫాను కారణంగా మోకాలు లోతు నీటిలో తడిసిన ధాన్యం కొనుగోలుకు



*ప్రధాని వి.పి. సింగ్*



*ఉపప్రధాని దేవిలాల్*

ఇబ్బంది కలుగుతూ ఉన్న అంశాన్ని అప్పటి ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదూరాం మీర్ధా గారికి ఢిల్లీలో 1990 జూన్ 13న కలసి విజ్ఞప్తి చేశాను.

తుఫాను వల్ల దెబ్బ తిన్న దాన్యం / బియ్యం ఇంకా రైతులనుంచి యఫ్.సి.ఐ. తీసుకోవాల్సిన నిల్వలు ఉన్నందువల్ల 1990 జూన్ 30 నుంచి 1991 జూలై 31 వరకు

పొడిగించి కొనుగోలు చేయించాలని, ఉప్పునీరు ప్రవహించిన భూములకు విశాఖపట్నం నుంచి జిప్సమ్ సరఫరా చేయించాలని, పంటలు కోల్పోయిన రైతులకు, పౌల్ట్రీ యూనిట్లకు, ఫిష్ బోట్ల వారికి భీమా పథకం ద్వారా సత్వరమే సహాయం అందించాలని నాటి ఉప ప్రధాని దేవీలాల్ గారిని 1990 జూన్ 25న కోరాను.

నాగాయలంక, కోడూరు, బందరు సమీప ప్రాంతాల్లో కోతకోసి పనలమీద వున్న ధాన్యం పంట సముద్రపు కెరటాల వెంట సముద్రంలోకి వెళ్ళిపోయిన సందర్భాన్ని విశదీకరిస్తూ, అప్పటికి వున్న పంటల బీమాపథకం నిబంధనలను సడలించి అయినా నష్టపోయిన రైతులకు సహాయం చెయ్యాల్సిన ఆవశ్యకత గురించి 1990 డిసెంబరు 27న దేవీలాల్ గారిని కోరాను.

కోస్తా జిల్లాల్లో 1990 మే 9 తుఫానువల్ల నష్టపోయిన కార్యక్రమాలకు పక్కా గృహాలు నిర్మించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని 1990 మే 24న దేవీలాల్ గారిని కోరగా మత్స్యకారులకు 1540 ఇళ్ళను నిర్మించే నిమిత్తం కేంద్రప్రభుత్వం 50 శాతం సబ్సిడీగా కోటి రూపాయలు మంజూరు చేసినట్లు 1990 జూలై 31న తెలియజేశారు.

శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ఏరియాలో ప్రజలు త్రాగునీటి విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందిని కేంద్ర వ్యవసాయశాఖమంత్రి భజన్‌లాల్ గారికి 1989 మే 9న తెలియపరిచాను.

### ***భానూప్రతాప్‌సింగ్ కమిటీ నివేదిక***

ఈ కమిటీలో కుంభారామ్ ఆర్య(రాజస్థాన్), హరిదేవ్‌సింగ్ సంగా(పంజాబ్), ఎం.జి. దేవసహాయం (రిటైర్డ్ ఐ.ఏ.యస్. అధికారి, తమిళనాడు) వడ్డే శోభనాద్రీశ్వరరావు (మాజీ పార్లమెంటు సభ్యులు, ఆంధ్రప్రదేశ్), సూరజ్‌భాన్ (మాజీ పార్లమెంటు సభ్యులు) ప్రొఫెసర్ వి.ఎం.రావు (ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనమిక్ ఛేంజ్, బెంగుళూరు), డాక్టర్ జి.ఆర్. సయామి (వ్యవసాయ, సహకారశాఖ ఆర్థిక, గణాంక సలహాదారు), సభ్యులుగా ఉన్నారు. మెంబర్ సెక్రటరీగా డి.సి. మిశ్రా (వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి) ఉన్నారు.

వ్యవసాయ రంగ ప్రగతికి, ముఖ్యంగా మనదేశం నుంచి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు అవసరమైన మిగులును సాధించడానికి అప్పటివరకు అనుసరిస్తున్న విధానాలను, కార్యక్రమాలను సమీక్షించడానికి, పరిశ్రమతోపాటు వ్యవసాయానికి సమాన



*భాను ప్రతాప్ సింగ్ గారితో*

హోదా లేదా కొన్ని సౌకర్యాలను/రాయితీలను కల్పించడానికి, వ్యవసాయాన్ని పరిశ్రమతో సమానంగా పరిగణించాలా అనే అంశాన్ని పరిశీలించి నివేదికను ఇవ్వడానికి వ్యవసాయరంగంపైన సమగ్రమైన అవగాహన కలిగిన భాను ప్రతాప్‌సింగ్ గారి అధ్యక్షతన ఈ కమిటీని 1990 ఫిబ్రవరి 6న కేంద్ర ప్రభుత్వం నియమించింది. కమిటీ అనేక సార్లు సమావేశమై వ్యవసాయరంగానికి సంబంధించిన అనేక సమస్యలను చర్చించి, 1990 జూలై 30న అప్పటి ఉపప్రధాని, వ్యవసాయశాఖమంత్రి అయిన దేవీలాల్ గారికి నివేదికను అందించింది.

అప్పటివరకు వ్యవసాయరంగంలో అనుసరించిన వ్యూహం ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి తప్ప గ్రామీణ ప్రజల సౌభాగ్యాన్ని పెంపొందించడానికి దోహదం చేయలేదని, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో సగటు తలసరి ఆదాయ నిష్పత్తి 1970-71లో 1:.2 గా ఉండగా, అది 1988-89 నాటికి 1:4.2 గా పెరిగింది. ప్రపంచంలో వ్యవసాయ రంగంలో అగ్రభాగాన నిలబడడానికి మనదేశానికి అవకాశం ఉన్నప్పటికీ, ఇప్పటికీ చాలా వెనుకబడి వుండడం విచారించవలసిన విషయం. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో ఉత్పత్తి చేయగల సామర్థ్యం (ప్రొటెన్షియల్) ఉన్న మేరకు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకుంటే జాతీయాదాయం ఇంకా 50శాతం పెరిగేదానికి అవకాశముంది.

భారత వ్యవసాయ రంగ ప్రగతి నత్తనడక నడుస్తూ తక్కువ ఉత్పాదకతను కలిగివుండడానికి కారణం తగినన్ని ఆర్థిక వనరులను సమకూర్చక పోవడమే. వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘంతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించినట్లయితే ఒక సృష్టమైన, శాస్త్రీయ పరమైన ఆధారాలు లేకుండా నిర్ణయిస్తున్నట్లు అభిప్రాయపడింది.

1970–'71 నాటి ధరల సూచికతో అనుబంధం చేసి అందుకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తుల మద్దతుధరల్ని నిర్ణయించాలని, అవసరం–సరఫరాలను దృష్టిలో ఉంచుకుని మధ్యమధ్యలో మార్పులు చేసుకోవచ్చని, భారత వ్యవసాయ రంగానికి ఉన్న సామర్థ్యాన్ని (పొటెన్షియల్) సంపూర్ణంగా సాధించగలిగితే అత్యంత వేగంగా, ఖచ్చితంగా తక్కువ వ్యయంతో దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని, అంతరాలను నిర్మూలించవచ్చని అభిప్రాయపడింది.

అధికోత్పత్తికి దోహదం చేసే నూతన నైపుణ్యాలను అనుసరించని పక్షంలో, అందుకు అవసరమైన ఆర్థిక వనరులను, రుణాలను అందజేయనంతకాలం, పండించిన పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయనంతకాలం గ్రామీణ భారతంలో దారిద్ర్యం కొనసాగుతూనే వుంటుందని అభిప్రాయపడింది. అయిదు వందల జనాభాకు ఒక పదెకరాల లోపు భూమి గల చిన్న రైతును ఆదర్శరైతుగా ప్రతి గ్రామంలోనూ ప్రతిభ ఆధారంగా ఎన్నికచేసి, ప్రభుత్వ ఖర్చుతో పరిశోధనా కేంద్రాల్లో శిక్షణనిచ్చి అతడికి కావలసిన పరికరాలను వడ్డీరాయితీతో సమకూర్చాలని సూచించింది.

1. యాంత్రీకరణను, బిందు సేద్యాన్ని పెద్దయెత్తున ప్రోత్సహించాలని, 2. వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల విషయంలో ఇతర దేశాలతో పోలిస్తేమనదేశంలో అనేకరకాల పంటలు, పశు, మత్స్య రంగ ఉత్పత్తులు, మసాలా దినుసులు, ఔషధ మొక్కలు ఉండడం. 3. రవాణా చార్జీల తక్కువయ్యే విధంగా దిగుమతి చేసుకునే అనేక దేశాలు మనదేశానికి దగ్గరగా ఉండడం. 4. మనదేశంలో వీటి ధరలు తక్కువగా ఉండడం వల్ల మనదేశం నుంచి ఎగుమతులకు చాలా చక్కని అవకాశాలు ఉండికూడా ఉపయోగించబడడంలేదు. ఏ ప్రాంతంలో ఏ ఉత్పత్తిని ఎగుమతి చేయడానికి ఎక్కువ అవకాశాలున్నాయనే విషయాన్ని పరిశీలించి, అందుకు కొంత ప్రాంతాన్ని/జోన్‌ను కేటాయించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, గ్రేడింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాల్ని సహకార లేక రైతు సంఘాల ద్వారా రైతులకు అందించి ప్రోత్సహించాలి.

వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంతో సమానంగా ప్రధాన ఆర్థిక, వాణిజ్య వ్యవస్థగా గుర్తిస్తూ, ముఖ్యావసరాలైన అన్ని సౌకర్యాలను, సహకారాలను, ప్రోత్సాహకాలను కల్పించినట్లయితే త్వరితగతిన వ్యవసాయరంగం అభివృద్ధి చెందడానికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడానికి దారితీయగలదని, దీనివల్ల గ్రామీణ ప్రజల ఆదాయం మరింతగా పెరిగి, వారి కొనుగోలు శక్తి పెరిగి మొత్తం మీద జాతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు ప్రేరణకాగలదని భావించాలి.

పరిశ్రమలకు ఇస్తున్న విధంగా వ్యవసాయానికి కూడా అవేరకమైన సౌకర్యాలు, ప్రోత్సాహకాలను కల్పించనంత కాలం ధరల నిర్ధారణ, బడ్జెట్ కేటాయింపులు, ఋణపరిమితి, విద్యుత్తు రవాణా, ఎగుమతి సౌకర్యాలవంటి విషయాల్లో పరిశ్రమలకు అనుసరించే విధానాలు, ప్రమాణాలు, పద్ధతులు పాటించనట్లయితే వ్యవసాయ రంగానికి నామమాత్రమైన స్థాయి కల్పించినా, కల్పించక పోయినా ఒకటేననిపిస్తుంది.

అయితే వ్యవసాయరంగానికి కూడా పారిశ్రామిరంగం మాదిరిగానే స్థాయిని కల్పిస్తే తప్ప వ్యవసాయరంగంపట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాల్ని ప్రభుత్వ నిర్ణయాలు, కార్యక్రమాల ద్వారా సరిచేయలేక పోయిన పక్షంలో వ్యవసాయాన్ని పరిశ్రమగా ప్రకటించాలని ఈ కమిటీ సిఫారసు చేస్తోంది.

1948లోనే జాతీయ పారిశ్రామిక విధానాన్ని రూపొందించిన ప్రభుత్వం ఇప్పటి వరకు వ్యవసాయ విధాన పత్రం ఆవశ్యకతను కూడా పరిశీలించకపోవడం వ్యవసాయరంగంపట్ల ప్రభుత్వానికి గల నిర్లక్ష్యానికి తార్కాణం.

కమిటీ సూచించిన కొత్త అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, విధానాలతో కూడిన సమగ్ర జాతీయ వ్యవసాయ విధాన పత్రాన్ని రూపొందించాలని కమిటీ సిఫారసు చేసింది.

కమిటీ మరెన్నో విలువైన సూచనలు చేసింది. కానీ స్థలాభావం వల్ల కొన్ని అంశాలను మాత్రమే ఇందులో పేర్కొనడం జరిగింది.

## ***శరద్ జోషి కమిటీ సిఫార్సులు***

కొద్దిరోజుల తర్వాత షేట్కారీ సంఘటన నాయకుడు శరద్‌జోషిగారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ ఆన్ అగ్రికల్చర్‌ను ఏర్పాటుచేశారు. దానిలోకూడా నన్ను సభ్యుడిగా నియమించారు. మద్దతు ధరలు, ప్రత్తి ఎగుమతులు, పంటల బీమా, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల వంటి అనేక అంశాలపైన ఈ కమిటీలో కూడా చర్చించారు.

వ్యవసాయ పంటలకు మద్ధతు ధరలను నిర్ణయించడంలో కొన్ని అంశాలను ప్రఖ్యాత ఆర్థిక వేత్త సి. హెచ్. హనుమంతరావు కమిటీకి కేంద్రప్రభుత్వం నివేదించింది. వ్యవసాయ పంటలసాగు ఖర్చుకు అదనంగా ఎరువులు, కూలీల వేతనాలు, ఇంకా రైతు తన జేబునుంచి ఖర్చు చేసే మొత్తంలో పదిశాతాన్ని యాజమాన్య ఖర్చులుగా కలపాలని హనుమంతరావు కమిటీ సిఫారసు చేసింది. (సి2+సి1+10% ఆఫ్ పైడ్ అవుట్ కాస్ట్)



మాస్టాండింగ్ కమిటీ ముందుకు ఈ అంశం వచ్చినప్పుడు రైతు కుటుంబం తాము చేసిన శ్రమ విలువను కూడా లెక్కలోకి తీసుకుని రైతులకైన మొత్తం ఖర్చులో 10శాతాన్ని సాగు ఖర్చుకు కలిపి మద్దతు ధరను నిర్ణయించాలని సూచించాం. (సి2+సి1+10% ఆఫ్ టోటల్ కాస్ట్) అలాగే వ్యవసాయ కార్మికులకు ఇచ్చే వేతనాలను ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించేటప్పుడు రైతులు వాస్తవంగా ఎంతకూలీ ఇస్తున్నారు? అది ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనం కన్నా తక్కువగా ఉందా? దానినే పరిగణనలోకి తీసుకోవాలని హనుమంతరావు కమిటీ సూచించింది. అలాకాదు, ఇచ్చిన వాస్తవ కూలీలేక ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనం ఏది ఎక్కువగా ఉంటే దానిని పరిగణలోకి తీసుకోవాలని మా కమిటీ సూచించింది. ఈ రెండు అంశాలపైన మా వ్యవసాయ స్థాయీ సంఘం (శరద్ జోషి కమిటీ) నిర్ణయం వల్ల కనీస మద్దతు ధరను లెక్కించే విధానంలో మార్పువల్ల కొద్దిమేరకు రైతులకు ప్రయోజనం చేకూరిందనే సంతృప్తి నాకుంది.

పత్తి ఎగుమతుల విషయంలో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానం లోపభూయిష్టంగా వుంది. ఏ యేటికాయేడు పత్తి మార్కెట్‌లోకి వచ్చే సమయంలో దేశంలో పత్తి ఉత్పత్తి ఎంతయ్యింది, మిల్లుల అవసరాలకు పోను ఎంత మిగులుతుంది? ఏటా ఎంత ఎగుమతి చేయాలనే దీర్ఘకాలిక నిర్ణయం చేసుకుని, దేశంలోపల పత్తి ఉత్పత్తి పరిమాణాన్ని దృష్టిలో పెట్టుకుని, ఎక్కువగా వుంటే ఇంకా కొంత అదనంగా ఎగుమతి చేయడం, తక్కువగా వుంటే బయటినుంచి దిగుమతి చేసుకోవడం సమంజసమని కమిటీ సూచించింది. పంటల బీమాతో సహా అనేక ఇతర అంశాల గురించి కమిటీ చర్చించి ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది.

## దేవీలాల్ - రైతు రుణమాఫీ - శివాజీ

ఒకరోజు శరద్‌జోషి కమిటీ సమావేశం జరుగుతుండగా ఆయన మధ్యలో కేబినేట్ సమావేశానికి వెళ్లి తిరిగివచ్చి నేషనల్‌ఫ్రంట్ ప్రభుత్వం పదివేల రూపాయలవరకు రైతుల రుణాన్ని మాఫీ చెయ్యడానికి నిర్ణయం తీసుకోనున్నదని చెప్పారు. రైతులు తాకట్టుపెట్టిన బంగారు నగల తనఖా మీద ఇచ్చిన రుణాల్ని కూడా మాఫీ చెయ్యాలనే సూచన కేబినేట్‌లో చర్చకు వచ్చిందన్నారు. ఇది సమంజసం కాదుగదా! బంగారునగలు పెద్దపెద్ద వాళ్ల దగ్గరే ఉంటాయిగదా! ఆ సూచన అనుసరణీయం కాదేమోనని శరద్ జోషి అన్నారు. అప్పుడు నేను బంగారు నగలు కేవలం పెద్ద రైతుల వద్దేకాదు, భారతదేశంలో ప్రతి కుటుంబంలోనూ ఉంటాయి. బ్యాంకులు పంటరుణాలు మంజూరు చేసినప్పుడు 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్'ను అనుసరిస్తూ ఇస్తుండడంవల్ల, వాస్తవ వ్యయం కంటే అది తక్కువగా ఉండడంతో రైతులు తమ ఇంట్లోని బంగారు వస్తువుల్ని కూడా తాకట్టు పెట్టి అప్పుతీసుకుని పంటలు పండిస్తూ ఉంటారన్నాను. కాబట్టి ఆ సూచన సమంజసమేనని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ విధంగా లక్షలాదిమంది రైతులు నగలు తాకట్టుపెట్టి వ్యవసాయ రుణం తీసుకోవడం సాధారణమని చెప్పాను. ఆయన మళ్ళీ కేబినెట్ సమావేశానికి వెళ్లి, దానిలో ఈ అంశాన్ని కూడా చేర్చడం మంచిదని చెప్పారు. ఈ సూచన నా చిరకాల మిత్రుడు, రంగాజీ శిష్యుడు అయిన డాక్టర్ యలమంచిలి శివాజీ చేసినట్లు తెలిసింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అనేక బ్యాంకులు రైతులకు రుణ మాఫీ చేసే సందర్భాలలో డాక్టర్ శివాజీ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని రైతులకు చాలా తోడ్పాటును అందించారు. ఈ రెండు కమిటీల సమావేశాలకు వెళ్లివస్తూ, మధ్యమధ్య నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించేవాణ్ని. ప్రజలు తెలియజేసిన సమస్యల్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తుండేవాణ్ని.

## ఆర్థిక సంస్కరణలు - ఎరువుల ధరల పెంపు

నేను పదవ లోక్‌సభలో సభ్యుడిగా ఉండగా పి.వి.నరసింహారావుగారు ప్రధానమంత్రిగా, డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ ఆర్థికశాఖ మంత్రిగా ఆర్థిక సంస్కరణలను చేపట్టారు. ఎరువులపై సబ్సిడీని తగ్గించి, వాటి ధరలు పెంచడంవల్ల సన్నకారు, చిన్నరైతులు అవసరమైన మేరకు కొనుగోలు చెయ్యలేని పరిస్థితుల్లో ఉత్పత్తి తగ్గి, అనుకున్న లక్ష్యాల్ని సాధించలేని పరిస్థితి ఏర్పడుతుందని, పాకిస్తాన్, బంగ్లాదేశ్, కొరియా, జపాన్ వంటి దేశాలతో పోల్చుకున్నా ఒక కిలో ఎరువు కొనుగోలు నిమిత్తం ఎక్కువ కిలోల ధాన్యం/

గోధుములను మన రైతులు వెచ్చించవలసి ఉంటుందని, రానున్న ఖరీఫ్ కాలంలో దీనివల్ల రైతులకు చాలా ఇబ్బంది కలుగుతుందని, కనుక ఎరువుల ధరల్ని తగ్గించవలసిన అవసరం ఉందని లేఖ రాశాను. ఈ అంశంపై లోక్‌సభలో 1995 నవంబరు 25న ప్రసంగించాను. రైతాంగంలో నిరసనను గమనించి ప్రభుత్వం నత్రజని ఎరువుల ధరల్ని మాత్రం కొంతమేరకు తగ్గించింది. ఫాస్ఫాటిక్ ఎరువులు, పొటాషియం ఎరువుల ధరలు ఎక్కువుగా వుండి నత్రజని ఎరువుల ధరలు తక్కువుగా ఉండడం వల్ల 4:2:1గా ఉండవలసిన నిష్పత్తి మారిపోయి వ్యవసాయ రంగానికి కొంతచేటు కలిగింది. కొబ్బరి కార్మికుల సంక్షేమంకోసం ప్రమాదబీమా, ఇంకా సాంఘిక సంక్షేమ చర్యలు చేపట్టాలని మన్మోహన్‌సింగ్‌గారికి 1993 డిసెంబర్ 31న లేఖ రాశాను.

***<u>ఫ్లాట్ రేట్‌నకు వ్యవసాయ విద్యుత్</u>***

1989లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అయిదు హార్స్ పవర్‌లోపు వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్తునిస్తూ పది లేక పదికన్నా ఎక్కువ హార్స్‌పవర్ ఉన్న మోటార్లకు చాలా ఎక్కువ భారం వేశారు. హనుమాన్‌జంక్షన్, నూజివీడు, విజయరాయి మున్నగు ప్రాంతాల్లో మెట్టపైర్లు, తోటలు ఉన్న రైతాంగానికి ఎంతో అధికంగా భారం పడుతూవుందని చెన్నారెడ్డి గారికి విన్నవించడానికి వెళ్ళాం. నన్ను చూడగానే “శోభనాద్రీశ్వర్రావ్! లోగడ విద్యుత్ టారీఫ్ పైన అప్పుడు కమిటీలో నువ్వుకూడా సభ్యుడిగా ఉన్నావుగదా!” అన్నారు. అది ఆయన జ్ఞాపకశక్తికి నిదర్శనం. ఆయన మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉండగా నేను ఉయ్యూరు శాసనసభ్యుడిగా ఉన్నాను. ఆ సమయంలో చిత్తూరు ఎం.పి.గా వున్న పి. రాజగోపాలనాయుడు గారిని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాల్వాయి గోవర్థనరెడ్డి గారిని, నన్ను వ్యవసాయరంగానికి సరఫరా చేసున్న విద్యుత్తును యూనిట్ రేటు చొప్పున ఇవ్వాలా లేక ఫ్లాట్‌రేటు చొప్పున ఇవ్వాలా అని సూచించడానికి కమిటీ ఏర్పాటైన విషయం గుర్తుకు వచ్చి ఆయన ఆమాట అన్నారు. అంతకు ముందు వ్యవసాయ కరెంటుకు యూనిట్‌కు 18పైసలు పడుతూ వుండేది. చాలామంది రైతులు కట్టలేక డిస్కనెక్షన్లు అవుతూవుండేవి. మా కమిటీ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను సందర్శించిన తర్వాత మన రాష్ట్రంలో ఒక హార్స్‌పవర్‌కు సంవత్సరానికి 50 రూపాయలను ఫ్లాట్‌రేటుగా పెడితే బాగుంటుందని సూచించాం. 1984 శాసనసభ ఎన్నికలకు ముందు కోట్ల విజయభాస్కరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా నాటి ప్రభుత్వం ప్రజల్లో కాంగ్రెస్‌పట్ల పెల్లుబుకుతున్న వ్యతిరేకతను, తెలుగుదేశంపట్ల పెరుగుతున్న ఆదరణను గమనించి

కరెంటు హార్స్‌పవర్ 50 రూపాయలకు ఇస్తామని, జీవోలు జారీచేసింది. కానీ ప్రజలు ఎన్.టి. రామారావుగారికి పట్టం కట్టారు. 50 రూపాయలకు హార్స్‌పవర్ పథకాన్ని రామారావుగారు అమలుపరిచారు. ఫలితంగా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో లక్షలాది కొత్త విద్యుత్ కనెక్షన్లను రైతులు ఉపయోగించుకోవడం ప్రారంభించారు.

విజయరాయి, హనుమాన్‌జంక్షన్ మున్నగు ప్రాంతాల్లో భూగర్భజలాలు చాలా లోతున ఉంటాయిగనుక, భూవిస్తరం తక్కువైనా పది హార్స్‌పవర్ మోటార్ పెట్టవలసి వస్తున్నదని, ఇప్పుడీ ప్రభుత్వ నిర్ణయంవల్ల వారిపైన విపరీతమైన భారం పడుతుందని, కావున ఈ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని విజ్ఞప్తి చెయ్యగా స్పందించారు.

***<u>కృష్ణ డెల్టా ఆధునీకరణ - పులిచింతల ప్రాజెక్టులను చేపట్టాలి</u>***

అప్పట్లోనే చెన్నారెడ్డిగారిని 1990 మే 7వ తేదీన కలసి 140 సంవత్సరాలనుంచి సాగులోవున్న కృష్ణాడెల్టా సాగు విస్తీర్ణం పెరిగినందువల్ల చిట్టచివరి భూములకు నీరందాలంటే, కృష్ణాడెల్టా ఆధునీకరణను చేపట్టాల్సిన అవసరం ఉందని, 1978లో వంద కోట్లతో కూడిన అంచనా 1985 నాటికి 425 కోట్లకు పెరిగిందని, 1990 నాటికి 650 కోట్లకు పెరిగిందని, ఇప్పటికైనా ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని, అందులో కైకలూరు, మచిలీపట్నం, దివిసీమలోని చివరి ప్రాంతాల్లో మాత్రమే కాలువలకు లైనింగ్ చేయడం అవసరం తప్ప మిగిలిన భాగాలకు లైనింగ్ అవసరం లేదని విజ్ఞప్తి చేశాను.

పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా శంకుస్థాపన చేసివున్నారని, సత్తెనపల్లిలోను, జగ్గయ్యపేటలోను అప్పుడు పనిచేస్తూవున్న డివిజన్ కార్యాలయాన్ని మూసివెయ్యడానికి నిర్ణయం జరిగినట్లుగా పత్రికల్లో వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, పైన అప్పర్ కృష్ణ, ఇతర ప్రాజెక్ట్‌లు వస్తున్నందువల్ల పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పథకాన్ని తప్పనిసరిగా ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చెయ్యడం జరిగింది.

చెన్నారెడ్డిగారు ఆరోగ్యం సరిగాలేక అమెరికాలో వైద్యం నిమిత్తం కొద్దికాలంపాటు అక్కడవుంటూ ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో మాట్లాడి డెల్టా డ్రెయినేజ్ అభివృద్ధికోసం నిధులు మంజూరుచేయించారు. ఆ తర్వాత నేదురుమల్లి జనార్దనరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా విజయవాడ వచ్చినప్పుడు కలసి పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ డివిజన్‌ను కంటిన్యూ చేస్తూ నిర్మాణం చేపట్టాలని 1991 మార్చి రెండవ తేదీన ఆయనకు విజ్ఞప్తి చేశాం.

***ఆపదలో ఆదుకునేలా పంటల భీమా పథకం ఉండాలి***

1990 మే 9వ తేదీన తుఫాను, ఉప్పెనలవల్ల బందరునుంచి నాగాయలంక మండలంలోని గుల్లలమోద వరకు చేలల్లో వున్న ఖరీఫ్ కుప్పలు, దాళ్వాపనలు సముద్రపు అలల్లో కొట్టుకుపోయాయి. ప్రధానమంత్రి వి.పి.సింగ్, ఉప ప్రధాని దేవీలాల్ ఉభయులు కూడా మచిలీపట్నం వచ్చారు. అప్పట్లో శరద్ జోషి గారిని కూడా తీసుకువచ్చి ఈ దెబ్బతిన్న ప్రాంతాల్ని, గుంటూరుజిల్లా వడ్లమూడి సమీపంలో దెబ్బతిన్న తోటల్ని సందర్శించే ఏర్పాటు చేశాం. అప్పటికి అమల్లో వున్న సమగ్ర పంటల బీమా పథకంలో పంటకోత సమయం వరకు మాత్రమే క్రాప్ ఇన్సూరెన్స్ పథకం వర్తించే పరిస్థితి వుంది. దానివల్ల వాస్తవంగా ఉప్పెనలో పంట కొట్టుకుపోయి తీవ్రమైన నష్టం రైతులకు సంభవించినప్పటికీ, పంటల బీమా పథకం ఆనాడు ఆదుకోలేదు. కోస్తా తీర ప్రాంతంలో అప్పుడప్పుడు సంభవించే తుపాన్లు, ఉప్పెనల వల్ల కోత కోసి పనల మీదవున్న, కుప్పలు వేసివున్న వరిపైరు మున్నగు పంటల్ని రైతు పూర్తిగా కోల్పోతాడు కాబట్టి పంటల భీమా పథకంలో తగిన మార్పులు చేసి ఇటువంటి నష్టాన్ని కూడా పంటల భీమా పరిహారానికి అర్హత కలిగించాలని నేను అనేక సందర్భాల్లో పదవ లోకసభ సభ్యుడిగా ఉన్నప్పుడు నాటి వ్యవసాయ శాఖమంత్రి బలరామ్ జక్కర్‌గారిని 1992 మార్చి 17న లేఖ ద్వారా కోరాను. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, పంట రైతు చేతికి వచ్చేంత వరకు పథకాన్ని వర్తించాలని, పత్తి, మిర్చి, పసుపు పంటలను కూడా పంటల భీమా పథకం పరిధిలోకి తీసుకురావాలని కూడా విజ్ఞప్తి చేయడం జరిగింది. నేను వ్యవసాయమంత్రిగా వున్న సమయంలో కూడా కేంద్రప్రభుత్వానికి ఈ అంశాల్ని సూచించాను. ఇటీవల సవరించిన పంటల భీమా పథకంలో గ్రామాన్ని యూనిట్ గానూ, పంటకోత అనంతరం 15రోజుల వరకు భీమా సౌకర్యాన్ని కేంద్రప్రభుత్వం విస్తరింపజేయడం నాకు సంతోషాన్ని కలిగించింది.

పండ్లతోటలకు కూడా ప్రయోగాత్మకంగా బీమా పథకాన్ని రూపొందించాలని, లక్షలాది కోళ్లు చనిపోయినందువల్ల పౌల్ట్రీ యజమానులకు సహకారాన్నందించాలని విజ్ఞప్తి చేశాను. జపాన్‌లో పండ్ల తోటలకు చాలా కాలంగా చెట్లకు, పండ్లకు భీమా సౌకర్యం ఉన్న విషయాన్ని స్కీం లిటరేచర్‌తో సహా అందించాను.

***పౌల్ట్రీ రంగానికి చేయూత నివ్వాలి***

ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ సుందరనాయుడుగారు, విజయవాడలో హేచరీస్ యజమాని సోమిరెడ్డిగారు నాకు పౌల్ట్రీ ఫార్మర్స్ సమస్యల గురించి విజ్ఞప్తులు

అందజేస్తుండేవారు. నేను 1991 ఆగస్టు 13న పౌల్ట్రీరంగాన్ని అభివృద్ధి చెయ్యాల్సిన ఆవశ్యకత గురించి లేఖ రాశాను. పౌల్ట్రీ రాష్ట్రప్రభుత్వం పరిధిలో ఉన్నందువల్ల విద్యుత్ ధర, కార్మికులు, భూమికి సంబంధించిన చట్టాలు, సంఘటితరంగంనుంచి రుణపరపతి, సేల్స్‌టాక్స్, ఆక్ట్రాయ్ మున్నగు అంశాలపైన వ్యవసాయరంగానికి ఏవిధమైన వెసులుబాట్లు కల్పించారో అదేవిధంగా పౌల్ట్రీరంగానికి కూడా వర్తింపజేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని, బాలబాలికలకు అందించే మధ్యాహ్నభోజన పథకంలో కోడిగుడ్లను కూడా చేర్చాలని మహిళా శిశుసంక్షేమశాఖవారికి, విద్యాశాఖవారికి ఉత్తర్వులు జారీచేసినట్లుగా నాటి వ్యవసాయశాఖ సహాయమంత్రి కానూచరణ్ లెంకాగారు 1992 జనవరి 23న నాకు తెలియజేశారు.

***<u>బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించాలి</u>***

మనదేశానికి సుమారు ఏడువేల కిలోమీటర్ల పొడవైన సముద్రతీరం ఉంది. దాదాపు లక్ష హెక్టార్ల ఉప్పు నీటి కయ్యల భూమి ఉంది. మన రాష్ట్రంలోని సముద్రతీరప్రాంతంలోనూ, సముద్రంలో నదులు, ఉపనదులు, పెద్ద పెద్ద డ్రెయిన్ల పక్కనవుండే భూముల్లో బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్‌ను పెద్దయెత్తున చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఒక సంస్థ దాఖలు చేసిన పిటీషన్‌పైన సుప్రీంకోర్టు స్పందిస్తూ, సముద్రతీరం దగ్గర్లోగల రొయ్యల చెరువుల్ని ధ్వంసం చేయించాలని రాష్ట్రప్రభుత్వాల ద్వారా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దానిపైన ఆక్వారైతులు చాలా భయాందోళనలకు గురయ్యారు.




మచిలీపట్నంలో కలెక్టర్ కార్యాలయంవద్ద జరిగిన ధర్నాలో నేను కూడా పాల్గొన్నాను. అనంతరం అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారితో సుప్రీంకోర్టు తీర్పును యథాతథంగా అమలుచేస్తే ఆక్వారంగం తీవ్రంగా నష్టపోతుందని, అప్పటికే వేలాదికోట్ల రూపాయల విలువైన విదేశీమారకద్రవ్యాన్ని ఆర్జిస్తూ తీరప్రాంతంలోని మత్స్యకారులు, ఇతర పేదవర్గాలవారికి ఉపాధిని కలుగచేస్తూవున్న ఆక్వారంగంపట్ల వాస్తవిక దృక్పథంతో ఆలోచన చేయాల్సిన అవసరమున్నదని చెప్పాను. దీనిగురించి 1996 డిసెంబర్‌లో ఆయన ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో ఆనాడు ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న రంగాచారిగారు రొయ్యల చెరువుల్ని తీసెయ్యవలసిందేనని వాదించినప్పుడు కోస్టల్ రెగ్యులేటరీజోన్ వెలుపలగల రొయ్యల చెరువుల్ని ధ్వంసం చెయ్యరాదని ఒప్పించాం. 1997 జనవరిలో ముఖ్యమంత్రిని కలసి ఆక్వాసమస్యల్ని చెప్పి వివరించి, రాష్ట్ర ప్రభుత్వపక్షంగా సుప్రీంకోర్టులో అప్పీలు చెయ్యాలని కోరాం. ఆవిధంగానే రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేసింది. ఆ సమయంలో ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల్లో రొయ్యల చెరువుల్ని అక్కడి ప్రభుత్వాలు ధ్వంసం చేయించాయి. మన రాష్ట్రంలో మేమందరం చేసిన కృషివల్ల ఇక్కడ ధ్వంసం చేయబడలేదు. ఈ అంశంపైన భీమవరానికి చెందిన యు.కె. విశ్వనాథరాజు, ఒంగోలుకు చెందిన కొండల్రాయుడు, భాస్కరరావు, విశాఖపట్నానికి చెందిన తపోవర్ధన్ మున్నగువారు తోడ్పడ్డారు. ఆక్వారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సుప్రీంకోర్టు తీర్పు పర్యవసానాలు, ఆక్వాకల్చర్ అభివృద్ధి ద్వారా దేశప్రయోజనాలు, రైతాంగ ప్రయోజనాలు మెరుగుపరచగల అవకాశాలు మున్నగు వాటన్నింటినీ సవివరంగా పేర్కొంటూ, ఆక్వాకల్చర్ అథారిటీ ఆఫ్ ఇండియా బిల్లులో ఇందుకు అవసరమైన సవరణలు చేసి పాస్ చెయ్యాలని వ్యవసాయశాఖమంత్రి సోంపాల్‌గారిని, పర్యావరణ, అటవీశాఖమంత్రి సురేష్ ప్రభుగారిని కలసి నేను, కొండల్రాయుడు, డాక్టర్ యు.వెంకట్రావ్, రాధాకృష్ణారెడ్డిగార్లు 1998 డిసెంబర్ 20న వినతిపత్రాన్ని అందజేశాం.

రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించడానికి తీసుకోవలసిన చర్యల గురించి వాణిజ్య మంత్రి రామకృష్ణ హెగ్డేగారికి 1998 ఏప్రిల్ 14న కోరాను.

విజయవాడలో 1992 జూలై 2వ తేదీన ష్రింప్ ఆక్వాకల్చర్ పైన నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్నాను. టి.కె.నాయర్, శక్తివేల్, వి.వెంకటేశన్, పొన్నుస్వామిల సహకారంతో ఉత్సాహవంతులైన రైతులు, పారిశ్రామికవేత్తలు ముందుకువచ్చి పెట్టుబడులు పెట్టడంవల్ల దేశంలోనే మన రాష్ట్రం ఆక్వాకల్చర్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

ఢిల్లీలో మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు, మీడియాకు బ్రాకిష్ వాటర్ రొయ్యల సాగు గురించి వాస్తవాలు తెలియజేసే ఒక చిన్న పుస్తకాన్ని, 'ఫ్యాక్ట్స్ ఎబౌట్ బ్రాకిష్‌వాటర్ ఆక్వా కల్చర్ (ఉప్పునీటి కయ్యలలో రొయ్యలసాగు– వాస్తవాలు) అనే పుస్తకాన్ని ప్రచురించి ఢిల్లీలో అందజేశాం. భారతదేశానికి 6,800 కిలో మీటర్ల సముద్రతీర ప్రాంతము ఉన్నదని, బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్‌నకు 12 లక్షల హెక్టార్ల భూమి అనుకూలంగా ఉంటుదని, తీర ప్రాంతంలోని రైతులు బలహీన వర్గాల పేదలకు ఆదాయం సమకూర్చడంలోను, వేలాది కోట్ల




రూపాయల విదేశి మారక ద్రవ్యాన్ని అర్జించటానికి చక్కని అవకాశాలు ఉన్నాయని అందులో వివరించటం జరిగింది. అంతేకాక తీరప్రాంతంలో రహదారులు, విద్యుత్, మంచినీరు సౌకర్యాలతో ఒనగూడటంతో పాటు ప్రజల సామాజిక అభివృద్ధి కూడ వేగంగా జరిగేదానికి వీలుంటుదని, పెరుగుతూ వున్న జనాభాకు ఆహార అవసరాలు తీర్చేదానికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుందని అందు వలన ఈ రంగాన్ని ప్రోత్సహించ వలసిన అవసరం ఎంతోఉందని అందులో వివరించటం జరిగింది. ఆ సందర్భంలో నేను, యు.కె. విశ్వనాధరాజుగారు రైల్లో వెళ్ళి ఢిల్లీలో భారతీయ విధ్యాభవన్ గెస్ట్‌హౌస్‌లో వున్నాం. అక్కడే మొట్టమొదటిసారి నాకు స్వల్పంగా హార్ట్‌ఎటాక్ వచ్చింది. వెంటనే సమీపంలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో జేర్చారు. కొద్ది రోజుల తర్వాత ఆల్‌ఇండియా ఇన్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో యాంజియోగ్రామ్ పరీక్ష చేయగా గుండెలోని రక్తనాళాల్లో సమస్య ఏర్పడిందని తెలిపారు. వెంటనే కాకపోయినా తర్వాత అయినా ఆపరేషన్ చేయించుకోవలసిన అవసరం ఉన్నదని చెప్పారు. కానీ అనంతర కాలంలో ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగానూ, అనంతరం మైలవరం శాసన సభ్యుడిగానూ, రాష్ట్ర వ్యవసాయ మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తూ తీరిక లేకుండా ప్రజాసేవా రంగంలో ఉన్నందువల్ల ఆపరేషన్ చేయించుకోవడంలో అశ్రద్ధ చేశాను. 2004లో హైదరాబాదులోని కేర్ హాస్పిటల్‌కు వెళ్ళి యాంజియోగ్రామ్ పరీక్ష చేయించగా వెంటనే ఆపరేషన్ చెయ్యాల్సిన అవసరమున్నదన్నారు. ప్రముఖ సర్జన్ డా॥ మన్నం గోపిచంద్‌గారు ఆపరేషన్ చేశారు. 5 వెస్సల్స్‌కు బైపాస్ చేశారు. డాక్టర్ గోపీచంద్ చాలా మంచి వ్యక్తి. ప్రతి వారంలో ఒకరోజు ఒంగోలు జిల్లా వెళ్లి పేదలకు వైద్య

పరీక్షలు, సహాయమును చేసివస్తూ వుంటారు. డా॥ సోమరాజు, డా॥ డి.ఎన్. కుమార్ గార్లు నాపట్ల చాలా అభిమానం చూపుతూ ఉండేవారు. నా భార్య బసవరాజ్యంకు డి.ఎన్. కుమార్ గారు 2006లో స్టంట్ వేశారు.

1990 మే నెల 9వ తేదీన ఉప్పెన సంభవించగా ఆనాడు ప్రధానమంత్రిగా ఉన్న వి.పి.సింగ్‌గారు 12వ తేదీన ఒకసారి, 19వ తేదీన మరొకసారి తుఫాను ప్రాంతాల్లో పర్యటించారు. ఉపప్రధాని దేవీలాల్‌గారు కూడా ప్రత్యేకంగా తుఫానువల్ల నష్టపోయిన ప్రాంతాల్ని సందర్శించారు. 12వ తేదీన వి.పి.సింగ్‌గారికి యలమంచిలి శివాజీ, విజయకుమార్‌రాజు, నేను, తుపాను, ఉప్పెనలవల్ల సంభవించిన నష్టాన్ని సోదాహరణంగా వివరించి, తొమ్మిదవ ప్రణాళికా సంఘం సూచనల్ని అమలు చెయ్యాలని, జాతీయ విపత్తుగా గుర్తించి, బాధితులకు సత్వరమే సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశాం. నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డిగారికి కూడా దాళ్వాలో పనలు కొట్టుకుపోయిన రైతులకు కూడా నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా కేంద్రప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరాం.

1991 మార్చి 2వ తేదీన నేదురుమల్లి జనార్ధనరెడ్డిగారు ముఖ్యమంత్రిగా విజయవాడ సందర్శించినప్పుడు పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పథకం డివిజన్ కార్యాలయాన్ని కొనసాగించాలని, డ్రెయినేజీ పనుల్ని త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశాను.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రమైన దుర్భిక్షం సంభవించిన నేపథ్యంలో సహాయపునరావాస కార్యక్రమాన్ని త్వరితంగా చేపట్టాలని కేంద్ర వ్యవసాయశాఖమంత్రి బలరామ్ జక్కర్‌గారికి 1992 నవంబర్ 11న విజ్ఞప్తి చేశాను.

***<u>కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ - రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు</u>***

రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన బోఫోర్స్ కుంభకోణాన్ని పురస్కరించుకుని ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా పెద్ద యెత్తున ఆందోళనలు చేపట్టాయి. రాజీవ్‌గాంధీ మంత్రి వర్గంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన వి.పి.సింగ్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. దాదాపు 90 మంది పార్లమెంటు సభ్యులం ముందుగా రాజీనామాలు చేశాం. రాష్ట్ర మంత్రివర్గంలో మొత్తం 30 మందిని బర్తరఫ్ చేసి ఐదు రోజులపాటు కేబినెట్ అనేది లేకుండా ఉన్న స్థితిని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు హర్షించలేకపోయారు. అప్పటికే వందల సినిమాల్లో నటించివున్న రామారావుగారు ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చి చక్కని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూవున్నప్పటికీ, ఏ కారణం వల్లనో

విశ్వామిత్ర సినిమా తీయడమేగాక, ఆయనే అందులో నటించడాన్నికూడా చాలామంది సముచితమైనదిగా భావించలేదు. కాంగ్రెస్ శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగారావు హత్యగావించబడడం మున్నగు కారణాలవల్ల తెలుగుదేశం పార్టీకి తీవ్రనష్టం కలిగింది. శాసనసభ ఎన్నికలకు ఇంకా గడువున్నప్పటికీ రామారావు పార్లమెంటు ఎన్నికలతో పాటు శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహింపచేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి లాభించి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో వి.పి.సింగ్ నాయకత్వంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. నేను ఓడిపోయి శ్రీమతి చెన్నుపాటి విద్యగారు గెలుపొందారు. 1989 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ పార్లమెంటు నియోజకవర్గంలోని గ్రామాల్ని తరచుగా సందర్శిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వచ్చాను.

కొద్దినెలల తర్వాత ప్రధాని వి.పి.సింగ్‌కు, దేవీలాల్‌కు మధ్యన భేదాభిప్రాయాలు పొడచూపాయి. వి.పి.సింగ్ ప్రభుత్వ విధానాల వల్ల లాభం చేకూరని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దేవీలాల్ వద్ద సహాయకుడుగా ఉండే వ్యక్తిద్వారా ఈ విభేదాల్ని మరింత పెంచగలిగారు. వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కొన్ని వ్యాపారశక్తులు అస్థిరత్వంపాలు చేశాయి. ఫలితంగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో వి.పి.సింగ్ తర్వాత దేవేగౌడ, ఐ.కె.గుజ్రాల్, చంద్రశేఖర్ కొన్ని నెలలు ప్రధానులుగా ప్రభుత్వాలు నడిపినప్పటికీ, చివరికి వారు వైదొలగాల్సివచ్చింది.



*ఎనిమిదవ లోక్‌సభలో టి.డి.పి. ఎమ్.పి.లతో అన్నగారు*

## మనకెందుకీ శ్రమ

పార్లమెంటులో ప్రసంగించడమేగాక విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర అవసరాల నిమిత్తం ప్రజలిచ్చిన అర్జీలను తత్సంబంధిత అధికారులకు నా కవరింగ్ లెటర్‌తో పంపుతూ ఫాలోఅప్ కోసం గ్రామస్తులకు పంపుతుండేవాడిని. టి.డి.పి.పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో నేను ప్రజల అర్జీలకు కవరింగ్ లెటర్‌లను తయారు చేయిస్తున్నప్పుడు ఒకసారి మా నాయకుడు సి. మాధవరెడ్డిగారు 'శోభనాద్రీశ్వరరావు గారూ! మీరు ఎప్పుడూ టైప్ చేయిస్తుంటారు, ఏమిటది?' అని అడిగారు. ఇదీ విషయం అని చెప్పగా, 'మనకెందుకీ శ్రమ, అక్కడి స్థానిక నాయకులు చూసుకుంటారు గదా !' అని అన్నారు. దానికి నేను, 'మనకు ఎన్నికల్లో కృషి చేసి, ఓట్లు వేసిన ప్రజలు వారి సమస్యల పరిష్కారం విషయంలో మన తోడ్పాటును కోరుతూ అర్జీలు ఇచ్చినప్పుడు దానిపైన పార్లమెంటు సభ్యుడిగా మన కవరింగ్ లెటర్‌తో పంపితే, అధికారి ఫైలును ఓపెన్ చేసి ఏచర్య చేపట్టనున్నారో మనకు తెలియచేస్తారుగదా! మనం కొంత సమయాన్నీ శక్తినీ వినియోగించాల్సి వస్తుందిగానీ మన తోడ్పాటువల్ల ఆ సమస్యలు కొంత వేగంగా పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందిగదా!' అని బదులిచ్చాను.

ఫలితంగా 1991లో పార్లమెంటు ఎన్నికలొచ్చాయి. తెలుగుదేశం అభ్యర్థిగా విజయవాడ పార్లమెంటు స్థానంలో శ్రీమతి చెన్నుపాటి విద్యగారిపై విజయం సాధించాను. 1985 లోగాని, 1989లోగాని, 1991 లోగాని ఎన్నికల సమయంలో ఎన్.టి.రామారావుగారు పొద్దు పోయేవరకు గ్రామగ్రామాన ప్రచారంలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతి మరువలేనిది. తెలుగుదేశం పార్టీ పక్షంగా రూపొందించబడిన పాటలు ఎంతో మధురంగాను, ఉత్తేజపూర్వకంగానూ కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తుండేవి. రామారావుగారు పర్యటించగా, మిగిలిన గ్రామాల్లో నేను తిరిగేవాడ్ని. గ్రామ పొలిమేరల్లో తెలుగుదేశం పార్టీ కేసెట్ పెడితే గ్రామంలోకి ప్రవేశించి ప్రధాన వీధుల్లో వ్యాను తిరిగేటప్పటికి అర్ధరాత్రి సమయమయ్యినా మహిళలతో సహా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేవారు. తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్.టి.రామారావుగారికి ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇది తార్కాణం.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న సమయంలో కె.ఇ.బి. కెనాల్ మీద లంకపల్లి, గురివిందపల్లి గ్రామాల వద్ద వంతెనలను అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నాటి ఇరిగేషన్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సంప్రదించి మంజూరు చేయించాను. తుమ్మల నాగేశ్వరరావు శంఖుస్థాపన చేయగా నేను, బాబూరావు గారు పాల్గొన్నాము. లంకపల్లి గ్రామంలో ఘంటా రామచంద్రరావు, కొడాలి అచ్చయ్య, కొడాలి రంగారావు మున్నగువారు గురివిందపల్లి గ్రామంలో బసవకోటి, మస్తాన్‌రావు మున్నగువారు గ్రామ సమస్యల గురించి నా దృష్టికి తెచ్చేవారు.

# పదవ లోక్‌సభలో సభ్యునిగా

**కే**ంద్రంలో పి.వి.నరసింహారావుగారు ప్రధానిగా మంత్రివర్గమేర్పడింది. పార్లమెంటులో విశ్వాసపరీక్షను ఎదుర్కోవడానికి సరిపడిన సంఖ్యాబలం లేకపోయింది. తెలుగుదేశం పార్టీ తరఫున 13 మంది సభ్యులం ఎన్నికయ్యాం. లోక్‌సభలో భూపతిరాజు విజయకుమార్‌రాజు నాయకుడిగాను, నేను ఉపనాయకుడిగాను ఎన్నికయ్యాం. పర్వతనేని ఉపేంద్ర, రాజ్యసభసభ్యుడు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కూడా. ఉపేంద్ర, విజయకుమార్‌రాజు కలసి పి.వి.గారితో మంతనాలు నెరపి తెలుగుదేశం పార్టీని చీల్చారు. లోక్‌సభ సభ్యుల్లో నా ఒక్కడితో మాత్రం వారు కాంగ్రెస్‌లో చేరే విషయం గురించి మాట్లాడలేదు. ఎందుకంటే నేను ఎట్టి పరిస్థితుల్లోను కాంగ్రెస్‌లో చేరడానికి అంగీకరించని వ్యక్తినని వారికి తెలుసు. నాకు విషయం తెలిసినట్లయితే వెంటనే రామారావు గారికి తెలియపరుస్తాననే ఉద్దేశంతో నన్ను వదిలేశారు. ఈ విషయం ఆలస్యంగా నాకు తెలిసిన వెంటనే నేను హైదరాబాదులో అన్నగారికి, చంద్రబాబునాయుడుగారికి తెలియజేశాను. హైదరాబాదు నుంచి చంద్రబాబునాయుడు ఢిల్లీ వచ్చారు. భూపతిరాజు విజయకుమార్‌రాజు, కె.పి.రెడ్డయ్య, డాక్టర్ కె.వి.ఆర్.చౌదరి, కేశిపల్లి గంగారెడ్డి, ఇంద్రకిరణ్‌రెడ్డి, తోట సుబ్బారావులు తెలుగుదేశం నుంచి వెళ్ళిపోయారు. చివరికి మేం ఏడుగురు సభ్యులం లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ తరఫున మిగిలాం. కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు పార్లమెంటు సభ్యులకు పెద్ద మొత్తంలో ధనాన్ని, కాంట్రాక్టులను, మరికొన్ని ప్రయోజనాల్ని కూడా పి.వి.నరసింహారావుగారి ప్రభుత్వం కలుగచేసింది. ఒకరికి రైల్వే కాంట్రాక్టును, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ను అంగీకరించడం ద్వారా పెద్ద మొత్తంలో లబ్ధి చేకూర్చింది.

***పార్లమెంటరీ పార్టీ నాయకునిగా***

చీలిక తర్వాత లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ నాయకుడిగాను, పార్లమెంటరీ పార్టీ నాయకుడిగాను నన్ను రామారావుగారు నియమించారు. పార్లమెంటులో పార్టీల సంఖ్యాబలాన్ని బట్టి బిల్లులపైనగాని, చర్చలలో గాని సమయాన్ని కేటాయిస్తారు. తక్కువ సంఖ్యాబలం ఉన్న పార్టీలకు అవకాశాలు పెద్దగా రావు. లోక్‌సభ స్పీకర్ శివరాజ్‌పాటిల్‌ది కన్సర్వేటివ్ మైండ్. మీ పార్టీకి సంఖ్యాబలం తక్కువ గనుక మీ పార్టీకి ప్రతి చర్చలోనూ సమయం కేటాయించడం సాధ్యం కాదన్నారు. మేమిక్కడికి వచ్చింది కేవలం జీతభత్యాలు

తీసుకోడానికీ, పార్లమెంటు సభ్యులుగా కొన్ని సౌకర్యాలు వినియోగించుకోడానికీ కాదు. ప్రజల సమస్యలపైన మాపార్టీ ఆలోచనా విధానాన్ని, ప్రజల వాణిని వినిపించాల్సిన బాధ్యత మా మీద ఉంది గనుక ఎన్ని నిమిషాలు మాకు దామాషాగా వస్తే అన్ని నిమిషాలు మా పార్టీకి ఇచ్చి తీరవలసిందేనని వాదించాను. ఈ విధంగా రెండు, మూడు పర్యాయాలు నాకూ స్పీకర్‌కు మధ్య తర్కం జరిగింది. శోభనాద్రీశ్వరరావు మొండి మనిషని గ్రహించి చివరికి ప్రతి చర్చలోనూ మా పార్టీకి అవకాశమిచ్చేవారు. మా సహచరులైన దగ్గుబాటి వెంకటేశ్వరరావుగారు, బోళ్ళ బుల్లిరామయ్యగారు, ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఝాన్సీలక్ష్మి, లాల్‌జాన్‌బాషా గారలు, నేను చాలా అన్యోన్యంగా ఉంటుండేవాళ్ళం. డంకెల్ డ్రాఫ్టుపైన చర్చ జరిగినప్పుడు మా పార్టీకి కేటాయించింది కేవలం రెండు నిమిషాలైనా నేను మాట్లాడేదాంట్లో ముఖ్యమైన అంశాలు ఉండడంవల్ల శివరాజ్‌పాటిల్ ఇరువైఎనిమిది నిమిషాలు అనుమతించారు. పదో లోక్‌సభలో వందలాది ప్రశ్నలు వేయడమేగాక వ్యవసాయ రంగం, సామాజిక రంగం, ప్రభుత్వ విధానాలు, చట్టాలు, శాంతిభద్రతలు, మతసామరస్యం, ఆర్థిక కుంభకోణాలు మొదలైన అంశాలపై 72 పర్యాయాలు ప్రసంగించాననే తృప్తినాకున్నది. ఆంగ్లంలో చేసిన ఈ ప్రసంగాలను తెలుగులోకి అనువదించి "రైతువాణి" పేరుతో ఒక పుస్తకంగా ప్రచురించి, దాన్ని నా షష్టిపూర్తి సందర్భంగా విజయవాడ లయోలా కాలేజీలోని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకాన్ని రూపొందించడంలో కూడా మిత్రుడు చల్లగుళ్ల నరసింహారావు ఎంతో విలువైన సహకారాన్ని అందించారు.

ఎనిమిదో లోక్‌సభలో వందలాది ప్రశ్నలతో పాటు 377 నిబంధన కింద ప్రాముఖ్యత గల అంశాల్ని ప్రస్తావించడమే గాక 55 పర్యాయాలు చర్చల్లో ప్రసంగించాను. 10వ లోక్‌సభ కాలంలో 377 నిబంధన క్రింద ప్రస్తావనలతో సహా మొత్తం 72 సార్లు ప్రసంగించాను. నాకంటే ముందు మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన గౌరవ పార్లమెంటు సభ్యులు ఇంతకంటే ఎక్కువసార్లు ప్రసంగించిన వారున్నారేమో నాకు తెలియదు గానీ 8వ లోక్‌సభ అనంతరం ఏ ఒక్క సభ్యుడు అయిదు సంవత్సరాల వ్యవధిలో అన్ని పర్యాయాలు మాట్లాడివుండరని ఖచ్చితంగా చెప్పగలను. పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తర్వాత పార్లమెంటులో మొదట్లో మాట్లాడవలసి వచ్చినప్పుడు ఇంగ్లీషులో మాట్లాడటమా, తెలుగులో మాట్లాడటమా అనే మీమాంసలో పడ్డాను. మనసులో ఉన్న భావనను ఇంగ్లీషులో సరిగ్గా వ్యక్తీకరించగలమా లేదా అనే సంశయం కలిగింది. ధైర్యం చేసి

ఇంగ్లీషులో మాట్లాడటం మొదలుపెట్టాను. మొదట్లో కొంత తడబడినప్పటికీ తర్వాత ఇంగ్లీషులో అనర్గళంగా ఉపన్యసించగలిగాను.

పి.వి.నరసింహారావుగారి ప్రభుత్వం చివరి సంవత్సరంలో ప్రతి పార్లమెంటు సభ్యుడికి ఒక కోటి రూపాయలు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధుల్ని కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలో ఈ నిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించినప్పుడు ప్రతి ఒక్క పనిలోను, స్థానిక ప్రజల, పంచాయతీల కంట్రిబ్యూషన్ ఉండేటట్లుగానూ, శాసనసభ్యుని, మండల పరిషత్ నిధుల నుంచి కొంత మేరకు, కడియాల రాఘవరావు ఛైర్మన్‌గావున్న జిల్లా పరిషత్ నుంచి కొంత మేరకు నిధుల్ని జతచేసి దాదాపు రెండు కోట్ల డెబ్బై అయిదు లక్షల రూపాయల విలువైన పనులు పూర్తిచేయడం జరిగింది. అలాగే గ్రామాల్లో సన్నకారు, చిన్నరైతులు, ఇంకా భూమిలేని వ్యవసాయ కార్మికులకు కొంత మేరకు పాడిపరిశ్రమ ఊతమిస్తూవుంది. చాలా చోట్ల సహకార పాలసొసైటీలకు సొంత భవనాలు లేవు. ప్రాథమిక సహకార పాలసొసైటీల నుంచి కొంత, మండవ జానకిరామయ్యగారు అధ్యక్షుడిగావున్న కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్య నుంచి కొంత, ఎం.పి.లాడ్స్ నిధుల నుంచి నేను కొంత సహకారాన్నందించి 80 గ్రామాల్లో పాలసొసైటీలకు సొంత భవనాల్ని సమకూర్చగలిగాం. ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడికి ఏటా రెండు కోట్ల రూపాయల వంతున ఎం.పి.లాడ్స్ నిధుల్ని కేటాయిస్తూ వచ్చింది (ప్రస్తుతం అయిదుకోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు). అయినప్పటికీ ఆనాటికీ, ఈనాటికీ ఏ ఒక్క పార్లమెంటు సభ్యుడు ఆనాడు నేను ఒక కోటిరూపాయలతో ఒక సంవత్సరంలో చేయించినన్ని పనుల్ని ఈనాడు అయిదు సంవత్సరాల వ్యవధిలో పదికోట్ల నిధులతో కూడా చేయించలేదని ఘంటాపథంగా చెప్పగలను. (వివరాలు అనుబంధంలో)

***<u>గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి</u>***

పదో లోక్‌సభలో సభ్యుడిగా ఉన్న సమయంలో అమలు చేయించిన అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో నాకు బాగా సంతోషాన్ని కలిగించింది విజయవాడలో టీవీ స్టూడియో– దూరదర్శన్ కేంద్ర నిర్మాణాన్ని, గన్నవరంలో విమానాశ్రయం అభివృద్ధిని ముందుకు తీసుకుపోవడం. ఎనిమిదో లోక్‌సభలో సభ్యుడిగా ఉన్నప్పుడు గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి పనుల్ని కొంత మేరకు ముందుకు తీసుకెళ్ళాను. మధ్యలో ఆ పనులతో పాటు విమాన సర్వీసులు నిలిచిపోయిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వంతోను, నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గారి ప్రభుత్వంతోనూ సంప్రదించి సుమారు 70 ఎకరాల భూమిని ఎయిర్‌ఫోర్స్ అథారిటీకి ఇప్పించడం ద్వారా పురోగతి సాధించగలిగాను.



*గన్నవరం విమానాశ్రయం*

హైదరాబాద్ రాజధానీ నగరం తర్వాత రాష్ట్రంలో విజయవాడకు అత్యంత కీలకమైన స్థానం ఉంది. ప్రత్యేకించి చుట్టుప్రక్కల జిల్లాల్లో 150 సంవత్సరాలకు పూర్వమే కాటన్ మహాశయుడి పుణ్యమా అని గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల వల్ల సాధించబడిన వ్యవసాయ, ఆర్థిక, సామాజిక, విద్యాభివృద్ధివల్ల విజయవాడ నగరానికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. ఈ ప్రాంతంనుంచి వేలాదిమంది అప్పటికే అమెరికాలోనూ, ఇంగ్లండ్ తదితర దేశాల్లోనూ పనిచేస్తూవున్నారు. నేను 8వ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యేనాటికి హైదరాబాద్ నుంచి ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి ఆవ్రో విమాన సర్వీసు ఉంటూ వుంది. గన్నవరం ఎయిర్‌పోర్టును బ్రిటిష్‌వారి కాలంలో ఏర్పాటుచేశారు. దీన్ని అభివృద్ధి పరచి బోయింగ్ విమానాలు నడిపితే బాగుంటుందనే అభిప్రాయం నాకు కలిగింది. దానిపైన విజయవాడ ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ పెరుగుతూవుందా? అయితే ఏ మేరకు పెరుగుతుంది? పెరుగుతూవున్న ప్రయాణికుల అవసరానికి తగినవిధంగా ఇప్పుడున్న సదుపాయాలు సరిపోతున్నాయా? ఈ ఎయిర్‌పోర్టును పెరుగుతూవున్న ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిపరిచే పథకాలను రూపొందించారా? అని నేను వేసిన ప్రశ్నకు 1985 ఆగస్టు 22వ తేదీన సమాధానమిచ్చారు. 1983-84లో 40 శాతం వంతున 1984-85లో 38 శాతం వంతున ప్రయాణీకుల సంఖ్య పెరిగిందని, 7వ ప్రణాళికా

కాలంలో బోయింగ్ 737 విమానాల్ని నడపడానికి వీలుగా విజయవాడ విమానాశ్రయాన్ని అభివృద్ధి చెయ్యాలనే ప్రతిపాదన ఉందని, 7వ పంచవర్షప్రణాళిక డ్రాఫ్టులో రన్‌వే, ఇంకా ఇతర పేవ్‌మెంట్స్‌ను పొడిగించి బలపరచడానికి, కొత్త టెర్మినల్ భవనాన్ని, కార్‌పార్క్, ఇంకా అప్రోచ్‌రోడ్డును అభివృద్ధిచెయ్యడానికి, నీరు, విద్యుత్ సదుపాయం, వసతులు పెంచడానికి, చుట్టూ గోడను నిర్మించడానికి పనులు చేపట్టడం కోసం నిధులు కేటాయించడానికి తగినచర్యలు తీసుకుంటామని పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్ గెహ్లోట్ తెలియజేశారు. కొన్ని పనులు ప్రారంభించారు. 1989 ఎన్నికల్లో నేను ఓడిపోయాను. చెన్నుపాటి విద్యగారు గెలిచారు. ఆ తర్వాత ఆవ్రో విమానాలు కాకుండా వాయుదూత్ విమానాలు నడిపారు. అవి రెగ్యులర్‌గా నిర్ణయించబడిన షెడ్యూల్ ప్రకారం నడపబడకపోవడంవల్ల క్రమంగా ప్రయాణీకుల సంఖ్య తగ్గిపోయింది. హైదరాబాద్ వెళ్ళవలసినవారు కార్లలో వెళ్ళిపోతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని లోక్‌సభలో 377 నిబంధన కింద అంతకుముందు నాకిచ్చిన సమాధానం, అనంతర పరిణామాలు ప్రస్తావిస్తూ, విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి రెగ్యులర్‌గా విమాన సర్వీసులు నిర్వహించాలని కోరాను. హై ఇంటెన్సిటీ రన్‌వే లైటింగ్ సిస్టమ్, టాక్సీవే మొదలైన పనుల్ని చేపట్టనున్నామని మాధవరావు సింధియాగారు 1991 ఆగస్టు 10న నాకు లేఖ రాశారు. దానిపైన నేను 1991 ఆగస్టు 21న విజయవాడ విమానాశ్రయాన్ని అభివృద్ధి చెయ్యడానికి అదనంగా భూమి సమకూర్చబడిందని, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేశారని, రాత్రిపూట విమానాలు దిగడానికి (నైట్ ల్యాండింగ్) అవసరమైన లైటింగ్ సౌకర్యాలపనులు జరుగనున్నాయని, కనుక రన్‌వేను పొడిగించి బలపరచడానికి అవసరమయిన నిధులు మంజూరుచేయడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని నేను, 12మంది నా సహచర పార్లమెంటు సభ్యులతో మాధవరావు సింధియాగారిని కోరాం. దానిపైన రూ. 15.92 కోట్లతో విజయవాడ ఎయిర్‌పోర్టును అప్‌గ్రేడ్ చేయడానికి నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిర్ణయం తీసుకున్నదని 1992 ఏప్రిల్ 30 న నాకు తెలియజేశారు. నేను తిరిగి మాధవరావు సింధియాగారికి 1992 ఆగస్టు 6న రాసిన లేఖకు సమాధానంగా 1992 ఆగస్టు 25న ఆర్.ఐ.టి.ఇ.ఎస్. వారు ప్రాజెక్టు ప్రతిపాదనను తయారుచేశారని, బోయింగ్ 737/ ఎయిర్‌బస్ 320లను నడపడానికి 7500 అడుగుల నిడివి మేరకు రన్‌వే ఉండేవిధంగా అభివృద్ధి చేయడానికి యాప్రాన్‌ను బలపరచడానికి, కొత్త టెర్మినల్ భవనాన్ని నిర్మించడానికి 12 కోట్ల రూపాయలు వ్యయం కాగలదని, అయితే నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీవారివద్ద నిధులకొరత వల్ల చేపట్టలేకపోతున్నామని, ఆర్థికపరిస్థితి మెరుగుపడిన తర్వాత తిరిగి చేపట్టగలమని సమాధానమిచ్చారు.

1993 ఆగస్టు 21న అప్పటి పౌరవిమానయాన శాఖ మంత్రి గులాం నబీ అజాద్ గారిని తిరిగి కలసి ఈ విషయాలన్నీ పేర్కొంటూ వినతిపత్రాన్ని అందజేశాను. 1993 సెప్టెంబర్ 17న అంతకుముందు మాధవరావు సింధియాగారు ఇచ్చిన సమాధానాన్ని ఉటంకిస్తూ ఆజాద్‌గారు మళ్లీ నాకు లేఖ రాశారు. తిరిగి 1993 డిసెంబర్ 9న లోక్‌సభలో 377 నిబంధన కింద మళ్లీ ఈ అంశాన్ని ప్రస్తావించాను. దానిపైన 1994 జూలై 20న గులాం నబీ అజాద్‌గారు అంతకుముందు ప్రస్తావించిన అంశాల్ని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టుకు అయ్యే 22 కోట్ల రూపాయల్లో 50 శాతం నిధుల్ని నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీకి అందజేస్తే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లగలమని రాష్ట్రప్రభుత్వానికి తెలియపరచగా రాష్ట్రప్రభుత్వం 8 కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణంగా నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీకి ఇవ్వడానికి అంగీకరించిందని, ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారు ట్రాఫిక్ పొటెన్షియల్‌ను అంచనావేస్తున్నారని తెలిపారు. నేను వేసిన ప్రశ్నకు 1994 ఆగస్టు 5న గులాం నబీ అజాద్‌గారు లోక్‌సభలో సమాధానమిస్తూ, రాష్ట్రప్రభుత్వం విమానాశ్రయ అభివృద్ధికి 79 ఎకరాల భూమిని సమకూర్చిందని, లేఖలో పేర్కొన్న అంశాల్నే తిరిగి ప్రస్తావిస్తూ సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తానన్న 8 కోట్ల రూపాయల్లో మొదటి వాయిదాగా నాలుగు కోట్ల రూపాయలు అందజేయడానికి అంగీకరించిందని, అంతేగాక ఇప్పటికే విమానాశ్రయానికి అందజేసిన భూమిసేకరణ నిమిత్తం 50 లక్షల రూపాయలు ఖర్చు చేయడమే గాక రన్‌వేను విస్తరించడంవల్ల గతంలోవున్న రహదారిని మూసివేయవలసివున్న కారణంగా ప్రత్యామ్నాయంగా రోడ్డు అభివృద్ధికోసం 20 లక్షల రూపాయలు ఖర్చుచేసిందని తెలియజేశాను. 1995 మే 5న 377 నిబంధన కింద తిరిగి విజయవాడ విమానాశ్రయ అభివృద్ధి సమస్యను పార్లమెంటులో ప్రస్తావించగా, దానికి సమాధానంగా 1995 జూలై 7న విమానాశ్రయ అభివృద్ధి పథకాన్ని చేపట్టి ముందుకు తీసుకువెళ్ళవలసిందిగా తాను నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీవారికి ఉత్తర్వులిచ్చినట్లుగా గులాం నబీ అజాద్‌గారు నాకు తెలియపరిచారు.

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీకి గన్నవరం ఎయిర్‌పోర్టు అభివృద్ధి నిమిత్తం ఇస్తామన్న ఆఫర్‌ను తిరిగి రీకన్ఫర్మ్ చేస్తే పని ప్రారంభిస్తామని గులాం నబీ అజాద్‌గారు 1995 ఆగస్టు 26న నాకు రాసిన లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి దృష్టికి తీసుకువెళ్ళి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రీకన్ఫర్మేషన్ లేఖను పౌర విమానయాన మంత్రిత్వశాఖకు పంపించాలని కలసి ఇచ్చాను. దానిపైన

చంద్రబాబునాయుడుగారు స్పందిస్తూ 1994 ఏప్రిల్ 6న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవ్వడానికి అంగీకరించిన 8 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాన్ని తన ప్రభుత్వం రీకన్ఫర్మ్ చేస్తున్నదని 1995 సెప్టెంబర్ 19న గులాం నబీ అజాద్‌గారికి లేఖ రాశారు. నేను కోరిన విధంగా కేంద్ర ప్రభుత్వానికి 8 కోట్ల రూపాయల్ని వడ్డీలేని రుణంగా ఇవ్వడానికి అంగీకరిస్తూ లేఖ రాసినట్లుగా చంద్రబాబు నాయుడుగారు నాకు 1995 సెప్టెంబర్ 23న లేఖ రాశారు. తిరిగి ఈ విషయాన్ని నేను గులాం నబీ అజాద్‌గారికి 1995 అక్టోబర్ 17న తెలియజేస్తూ, పనులు వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవలసిందిగా కోరాను. అనంతరం అనంత్‌కుమార్ గారు పౌర విమానయానశాఖమంత్రిగా ఉండగా, 1999 మార్చి 30న ఉత్తరం వైపున 5వ నంబరు జాతీయ రహదారి ఉన్నందువల్ల దక్షిణం వైపునకు 1300 అడుగులు రన్‌వేను పొడిగించడానికి కొత్తగా శాశ్వత టెర్మినల్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవలసిందిగా కోరాను. ఈ విధంగా అనేక సందర్భాల్లో అనేక విధాలుగా ప్రయత్నించి విజయవాడ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయడానికి నావంతు కృషి చేశాననే సంతృప్తి వుంది. ఈనాడు ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై నగరాలకు విమాన సర్వీసులు నిర్వహించబడుతూవుండడం నాకెంతో ఆనందాన్ని కలిగించే అంశం. రానున్న కాలంలో ప్రవాస భారతీయులు విజయవాడ ఎయిర్‌పోర్టుకు నేరుగా వచ్చే సౌకర్యం, మన ప్రాంతంలో పండే మామిడి పండ్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర దేశాలకు ఎగుమతి కావడానికి ప్యాసింజర్, కార్గో విమాన సర్వీసులు కూడా ప్రారంభమవుతాయనే ఆశ నాకుంది. 9 సంవత్సరాలు గడచిపోతూవున్నా ఇప్పటికీ రన్‌వే పొడగింపు జరగకపోవడం, సేకరించవలసిన భూమిని తీసుకొలేకపోవడం, ప్లాన్‌లో ప్రతిపాదించిన విధంగా ఎయిర్‌ఫోర్ట్ అభివృద్ధి జరగకపోవడం అత్యంత దురదృష్టకరం.

విజయవాడ ఎయిర్‌పోర్టుకు చెందిన 92 సెంట్ల భూమిని లింకు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి విజిటి ఉడా వారికి అనుమతినివ్వాలని కోరాను. రోడ్డు అభివృద్ధి చెందింది.

## ***<u>విజయవాడలో టి.వి. స్టుడియో</u>***

శ్రీమతి ఇందిరాగాంధీగారు 1984 మార్చి 23న విజయవాడ టీవీ రిలేస్టేషన్‌ను అప్పటికి కొండపల్లి కొండపైన నిర్మాణం పూర్తి కానందువల్ల తాత్కాలికంగా గాంధీ పర్వతం మీద నెలకొల్పారు. కొండపల్లి కొండపైన టీవీ రిలేస్టేషన్ నిర్మాణం చాలా నెమ్మదిగా జరుగుతున్న పరిస్థితుల్లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీగారికి 1985 మార్చి

19న త్వరగా ఈ నిర్మాణం పూర్తి చేయాలని కోరాను. ఏడవ పంచవర్ష ప్రణాళికలో విజయవాడలో టీవీ స్టూడియో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందు ఉన్నప్పటికీ తర్వాత దాన్ని తొలగించినట్లుగా పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి వెంటనే ఈ సమాచారం కృష్ణాజిల్లా ఇంకా సమీప జిల్లాల్లోని ప్రజలందరినీ తీవ్రమైన నిరాశా నిస్పృహలకు గురిచేసిందని, హైదరాబాద్ రాజధానీ నగరం తర్వాత విజయవాడ నగరం అత్యంత ప్రాధాన్యత కలిగిన నగరమని, టీవీ స్టూడియో నిర్మాణానికి ఆలిండియా రేడియో సమీపంలోనే నగరం నడిబోడ్డులో అత్యంత విలువైన రెండు ఎకరాల భూమిని ఇందుకోసం కేటాయించారని, ఈ ప్రాంతం కూచిపూడి నృత్యానికి పుట్టినిల్లని, ఎందరో ప్రముఖ కళాకారులున్నారని, జానపద కళారూపాలు ప్రదర్శించే సాంస్కృతిక బృందాలు ఉన్నాయని, వ్యవసాయకంగా, ఆర్థికంగా, సామాజికంగా, పారిశ్రామికంగా, విద్యావిషయంగా అభివృద్ధి చెందివున్న ప్రాంతమని, కొండపల్లి కొండపైన పది కిలోవాట్ టీవీ రిలేస్టేషన్ నిర్మాణమయ్యిందని, దాదాపు 140 కిలోమీటర్ల వ్యాసార్థంలో కవరేజీ ఉండగలదని, కావున తప్పనిసరిగా విజయవాడ నగరంలో మొదట్లో తలపెట్టిన విధంగా టీవీ స్టూడియో నిర్మాణం చేపట్టాలని నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీగారిని, సమాచార ప్రసారశాఖమంత్రి వి.ఎన్.గాడ్గిల్‌గారిని కోరాను. తర్వాత 1987 జనవరి 14న నాటి సమాచార ప్రసారశాఖమంత్రి అజిత్‌కుమార్ పాంజాగారికి కూడా టీవీ స్టూడియో నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తూ విజయవాడ నగరంలో ఇంద్రకీలాద్రి పర్వతశ్రేణివల్ల కొన్ని ప్రాంతాల్లో (షాడో జోన్స్) టీవీ కవరేజీ సంతృప్తికరంగా లేదని, అందువల్ల దానిని సరిచేయడానికి ట్రాన్స్‌పోజర్ ఎక్విప్‌మెంటును ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని పాంజాగారిని కోరాను. దానిపైన 1987 ఫిబ్రవరి 24న విజయవాడ నగరంలో షాడోజోన్స్‌ను కవర్ చేయడానికి మనదేశంలోనే మొట్టమొదటిసారిగా ట్రాన్స్‌పోజర్ ఎక్విప్‌మెంటును తయారుచేసి ఏడవ ప్రణాళికాంతం లోపల అమర్చడానికి నిర్ణయం తీసుకోబడిందని 1987 ఫిబ్రవరి 24న అజిత్‌కుమార్ పాంజాగారు తెలిపారు.

పార్లమెంటులో 377 నిబంధన కింద ఈ టీవీ స్టూడియో, ట్రాన్స్‌పోజర్‌ల ఆవశ్యకత గురించి 1987 ఫిబ్రవరి 25న ప్రస్తావించాను. నాటి సమాచార, ప్రసారశాఖ సహాయమంత్రి పూర్ణో సంగ్మా మార్చి 3వ తేదీన అంతకుముందు పాంజా తెలియపరచిన విషయాలతోనే లేఖ రాశారు. అనంతరం కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. నాడు సమాచార, ప్రసారశాఖమంత్రిగా వున్న పర్వతనేని ఉపేంద్రగారిని వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి

అంశాలకు దూరదర్శన్‌లో మరికొంత ఎక్కువ సమయం కేటాయించాలని కోరాను. అంతకుముందు నేను పార్లమెంటులో వేసిన ప్రశ్నకు 1988 ఏప్రిల్ 25న ఇచ్చిన సమాధానంలో 1987లో వ్యవసాయ కార్యక్రమాలకు 98 గంటల 47 నిమిషాలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు 1267 గంటల, 24 నిమిషాలు, క్రీడా కార్యక్రమాలకు 95 గంటల 28 నిముషాలు, ఇతర కార్యక్రమాలకు 949 గంటల సమయాన్ని కేటాయించినట్లు తెలిపారు. దేశంలో అత్యంత ప్రాముఖ్యతగల వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయించాలని, వ్యవసాయ



ఉత్పాదకతస్థాయిపైనే వ్యవసాయదారుల, గ్రామీణ ప్రజల సామాజిక, ఆర్థిక ప్రమాణాలు ఆధారపడ్డాయని, దేశంలోని జనాభాలో దాదాపు 70 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా గ్రామీణ ప్రజల సామాజిక, ఆర్థికాభివృద్ధిని పెంచడంలో దూరదర్శన్ గణనీయమైన పాత్ర వహించాలని కోరాను. అందువల్ల వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరాను.

టీవీ స్టూడియోకు తొమ్మిదో లోక్‌సభ కాలంలో వి.పి.సింగ్ ప్రభుత్వంలో సమాచార మంత్రిగా ఉన్న పి. ఉపేంద్ర గారు జనవరి 7, 1990న శంకుస్థాపన చేసినా, అందుకు అవసరమైన నిధుల్ని కేటాయించలేదు. పి.వి.నరసింహారావుగారి ప్రభుత్వంలో అజిత్‌కుమార్ పాంజాగారు తిరిగి సమాచార, ప్రసారశాఖమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పర్వతనేని ఉపేంద్ర శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభించబడలేదని, కనుక నిర్మాణాన్ని ప్రారంభించేలా చేయాలని, విజయవాడలో టెక్నికల్‌నగర్, పోస్టల్ కాలనీ, బ్యాంకు కాలనీ, శ్రీనగర్ కాలనీ, భారతీనగర్, వెటర్నరీ కాలనీ, క్రీస్తురాజపురం మొదలైన ప్రాంతాల్లో టీవీ ట్రాన్స్‌మిషన్ సరిగ్గా రావడం లేదని, దానిపైన తగిన చర్యలు తీసుకోవలసిందిగా 1991 జూలై 31న కోరాను. 1991 డిసెంబర్ 17న నేను, నాతోపాటు మన రాష్ట్రానికి చెందిన మరికొందరు పార్లమెంటు సభ్యులతో ఈ అంశాల గురించి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుగారికి వినతి పత్రాన్ని అందజేశాం. 1992 జనవరి 4న పాంజాగారు హైదరాబాద్ వచ్చిన సందర్భంలో స్వయంగా కలసి మళ్లీ టీవీ స్టూడియో నిర్మాణం గురించి, టీవీ కెమెరా యూనిట్ మంజూరు గురించి, ఎ.ఐ.ఆర్.లో పనిచేసే ఉద్యోగులకు బహుళ అంతస్తుల నివాస భవన సముదాయాన్ని కృష్ణలంకలో నిర్మించడం




*విజయవాడలో దూరదర్శన్ కేంద్రం*

గురించి వినతి పత్రాన్ని సమర్పించాను. అంతకుముందు దానిపైన అజిత్‌కుమార్ పాంజాగారు విజయవాడ నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా టీవీ స్టూడియో నిర్మాణం చేపట్టాలని ఇటీవల నిర్ణయం తీసుకున్నామని 1992 మార్చి 18న తెలియజేశారు. కె.పి.సింగ్‌దేవ్ ప్రసార, సమాచారశాఖ మంత్రిగా ఉన్నారు. ఒరిస్సా రాష్ట్రంలో ఆయన మామ ఆర్.ఎన్.సింగ్‌దేవ్‌గారు గతంలో స్వతంత్ర పార్టీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1967 ప్రాంతంలో విజయవాడలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఎన్.జి.రంగాగారు, గౌతులచ్చన్నగారు ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ధాన్యపు ఉత్పత్తిదారుల సమావేశానికి ఆర్.ఎన్.సింగ్‌దేవ్‌గారు, ఆయన మంత్రివర్గ సభ్యుడు నూతక్కి రామశేషయ్యగారు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ చదువు ముగించుకుని ఉయ్యూరులో వ్యవసాయం చేసుకుంటున్న నేను ఆ సభలో పాల్గొన్నాను. ఈ విషయాన్ని కె.పి.సింగ్‌దేవ్ గారితో చెప్పినప్పటి నుంచి ఆయన నా పట్ల ప్రత్యేకాభిమానాన్ని చూపుతుండేవారు. ఆయన టి.వి.స్టూడియో నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడమే గాక 14 జనవరి, 1995న తనకు వేరే క్రికెట్ ఆటకు సంబంధించిన కార్యక్రమానికి హాజరు కావాల్సివుండటంవల్ల నన్నే భూమి పూజ చేయమన్నారు. ఆ తర్వాత నిర్మాణం పూర్తయ్యి, 1999లో ప్రారంభమయ్యింది.

## అంతర్జాతీయ కబడ్డీ పోటీలు

విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ కబడ్డీ పోటీలు నిర్వహిస్తే బాగుంటుందని నా మిత్రుడు, కబడ్డీ అసోసియేషన్ నాయకుడు కె.పి.రావు అన్నారు. దానిపైన ఢిల్లీలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఎ.ఎస్.వి. ప్రసాద్‌గారితో సమాలోచన జరిపి 1993 ఏప్రిల్ 6 నుంచి 9 వరకు ఈ పోటీలు నిర్వహించాలని తలపెట్టి అందుకు దూరదర్శన్ వారిచే లైవ్ కవరేజ్ ఇవ్వడం ద్వారా కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలని కోరగా, సింగ్‌దేవ్‌గారు అందుకు సహకరించి ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయించారు. ఈ అంతర్జాతీయ కబడ్డీ పోటీలను ఏ.ఆర్.యమ్. ఇండస్ట్రీస్ అధినేత కృష్ణాజిల్లాకు చెందిన పాతూరి రామారావుగారు స్పాన్సర్ చేశారు. బాల్యం నుంచి కబడ్డీ క్రీడపట్ల ప్రత్యేకమైన ఆసక్తి కె.పి.రావులో వుంది. చెడుగుడు, కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికీ, అందులోనూ కృష్ణాజిల్లాకు ప్రముఖ స్థానం ఉంది. ఎంతమాత్రమూ పరికరాలపై ఖర్చులేకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఆడుకోవడానికి వీలున్న ఆట కబడ్డీ ఈ కబడ్డీ క్రీడను అంతర్జాతీయ క్రీడారంగంలోకి తీసుకువెళ్ళాలనే





*కె.పి. రావు కబడ్డీ కోర్టు*

సంకల్పంతోనే కె.పి.రావు ఈ ప్రయత్నం చేపట్టారు. దీనికి భారతకబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కె.సహా కూడా తోడ్పాటును అందించారు. 1994లో నిర్వహించబడిన ఆసియా క్రీడోత్సవాలలో కబడ్డీ క్రీడను ప్రవేశపెట్టడానికి విజయవాడలో జరిగిన

అంతర్జాతీయ కబడ్డీ పోటీలు తొలిమెట్టుగా ఉపయోగపడ్డాయి. ఇందులో భారత్‌తో పాటు శ్రీలంక, నేపాల్, చైనా, మలేషియా దేశాలు పాల్గొన్నాయి.

ఆలిండియా రేడియోలోనూ, దూరదర్శన్‌లోనూ వ్యవసాయ కార్యక్రమాలను వ్యవసాయశాస్త్రంలో పట్టభద్రులు, పోస్టుగ్రాడ్యు యేట్లతో నిర్వహిస్తే బాగుంటుందని 1998 జూలై 23న సమాచార, ప్రసారశాఖ సహాయమంత్రి ముక్తార్ నక్వీని, 1998 జూన్ 29న సమాచార, ప్రసారశాఖమంత్రి సుష్మాస్వరాజ్‌ను కోరాను. విజయవాడ నగరానికి వున్న ప్రాధాన్యత దృష్ట్యా పది కిలోవాట్ ఎఫ్.ఎం రేడియో స్టేషన్‌ను విజయవాడకు కేటాయించాలని 1998 జూన్ 8న సుష్మాస్వరాజ్‌గారిని కోరాను.

### సైన్స్ మ్యూజియం ఏర్పాటునకు కృషి

విజయవాడలో గాంధీపర్వతంపైన కె.యల్.రావుగారు ఒక లైబ్రరీ భవనాన్ని నిర్మింపజేశారు. పైన నగరమంతటినీ చూడడానికిగాను చిన్న రైలు సదుపాయాన్ని కూడా ఏర్పాటుచేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో 7వ నెంబర్ ప్లాట్‌ఫారం వైపు నుంచి గాంధీహిల్ చక్కగా కనిపిస్తుంది. అక్కడ గాంధీహిల్ దిగువభాగాన కె.యల్.రావుగారు టెలిస్కోపిక్ అబ్జర్వేటరీని కూడా ఏర్పాటు చేసివున్నారు. ప్రజల్లో ముఖ్యంగా యువతలో, విద్యార్థినీ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తినీ, అవగాహననూ పెంపొందించే లక్ష్యంతో సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేయించడానికి తీవ్రంగా కృషి చేశాను. గాంధీ పర్వతంపైన సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేస్తే బాగుంటుందని నేను 1987 జూలై 10న, తిరిగి 1988 జూన్ 10న నాటి మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి పి.వి.నరసింహారావుగారికి విజ్ఞప్తి చేశాను. దానిపైన ఈవిషయం పరిశీలనలో ఉన్నదని, 1988 అక్టోబర్ 19న మానవ వనరులశాఖ సహాయమంత్రి ఎన్.పి.షాహి తెలియజేశారు. అనంతరం వి.పి.సింగ్‌గారి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, ఆ తర్వాత పి.వి.నరసింహారావుగారి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాయి. నేను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నాను. నేను వేసిన ప్రశ్నకు 1992 ఆగస్టు 11న మానవ వనరులశాఖలో డిప్యూటీ మంత్రి కుమారి షెల్జా, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్, కలకత్తావారి నుంచి విజయవాడలో సైన్స్ సెంటర్‌ను నెలకొల్పడానికి ప్రతిపాదన అందిందని, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ప్రతిపాదన వచ్చిందని, అది ఆమోదించబడిందని, ఎన్.సి.ఎస్.ఎం. గవర్నింగ్ బాడీలో అది ఆమోదించబడిందని, 18 మాసాల్లో అది కార్యరూపం దాలుస్తుందని తెలియపరిచారు. అనంతరం 1992 జూలై 21న విజయవాడలో



*విజయవాడలో రిజినల్ సైన్సు సెంటర్*

ఈ అంశంపైన చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశాము. దానిలో ఎన్.సి.ఎస్.ఎమ్. డైరెక్టర్ జనరల్ డాక్టర్ సరోజ్ ఘోష్, సెంట్రల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ సంస్థ డైరెక్టర్ ఐ.కె.ముఖర్జీ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి వీరచంద్రరావు, నేను, గాంధీ హిల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి.పి మూర్తిరాజుగారు, కార్యదర్శి వై.రామచంద్రరావుగారు, సిరీస్ రాజుగారు, డాక్టర్ జంధ్యాల శంకర్‌గారు, కె.యల్,రావు గారి కుమార్తె శ్రీమతి నిర్మలా గోపాలకృష్ణన్‌గారు, మునిసిపల్ కమిషనర్ సమీర్‌శర్మ, అడిషనల్ కమిషనర్ ఆదిత్యనాథ్‌దాస్ కలసి సుదీర్ఘంగా చర్చించాం. హెచ్.ఆర్.డి. డిపార్టుమెంటు వారికి 1993 డిసెంబర్ 21న నేను రాసిన లేఖకు సమాధానంగా గాంధీహిల్ ఫౌండేషన్ వారి నుంచి ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎ.పి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి భూమి ట్రాన్స్‌ఫర్ కావలసి ఉందని, ఆ ప్రాసెస్ జరుగుతూవున్నదని, అది పూర్తవగానే నిర్మాణం చేపట్టడం జరుగుతుందని డిప్యూటీ సెక్రటరీ సేన్‌గుప్తాగారు తెలియజేశారు. అంతకుముందు హైదరాబాద్‌లో సుల్తాన్‌బజార్ సమీపంలోని గాంధీ స్మారకనిధి కార్యాలయంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కోదాటి నారాయణరావుగారు, మూర్తిరాజుగారు చంద్రమౌళీశ్వరరావుగారు, మున్నగు వారందరినీ కూడా ఈ విషయమై సంప్రదించడం, వారు అంగీకరించడం జరిగింది. అయితే ఆ తర్వాత కార్యదర్శి వై. రామచంద్రరావు అమెరికా వెళ్లిన సమయంలో విజయవాడ లోని ప్రముఖ పారిశ్రామికవేత్త గోకరాజు

గంగరాజుగారు గాంధీ హిల్ ఫౌండేషన్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దరిమిలా ఈ ప్రతిపాదనను ముందుకు సాగనీయకుండా అడ్డుపడడం దురదృష్టకరం. దీనిపైన నేను వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు ఈ సైన్స్ సెంటర్‌ను గాంధీ హిల్‌పైన ఏర్పాటు చేయించాలన్న ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి చెప్పగా, ఆయన ఇంటి వద్ద 2002 జనవరి 24న సమీక్షా సమావేశం జరిగింది. ఎ.పి.సి.ఓ.ఎస్.టి. మెంబర్ సెక్రటరీగా వున్న రామ్మూర్తినాయుడుగారిని గాంధీ హిల్ ఫౌండేషన్‌వారితో స్థలం ట్రాన్స్‌ఫర్ గురించి మాట్లాడమని చెప్పారు. అంతకుముందు గాంధీహిల్ ఫౌండేషన్ భూమిని, ట్రైయిన్‌ను, అబ్జర్వేటరీలను ఎ.పి.కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారికి సైన్స్ మ్యూజియం సెంటర్‌ను అభివృద్ధి చేయడానికి ఇవ్వాలని, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌వారు భవానీపురంలో కేటాయించిన 5 ఎకరాల స్థలంలో సైన్స్‌పార్క్‌ను అభివృద్ధి చెయ్యాలని 1995 మార్చి 8న అంగీకారం కుదిరింది. ఇందుకుగాను గాంధీహిల్ ప్రవేశద్వారానికి సమీపంలో 8 వేల చదరపు అడుగుల భవనాన్ని కట్టించి గాంధీహిల్ ఫౌండేషన్ వారికి అందజేయడానికి, గాంధీ హిల్ ఫౌండేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రిట్రెంచ్ చేయడానికి 34 వేల రూపాయలు అందజేయడానికి ఎన్.సి.ఎస్.ఎమ్. అంగీకరించింది. గాంధీహిల్‌పైనా సైన్స్ సెంటర్ ఏర్పడివుంటే విజయవాడ రైల్వేస్టేషన్‌లో వేలాది మంది ప్రజలకు, ప్రయాణికులకు కనిపిస్తూవుండేది. ఆ విధంగా పరిసర జిల్లాల్లో బహుళ ప్రాచుర్యం పొంది వుండేది. గాంధీహిల్ ఫౌండేషన్ వారు సహకరించక పోవడంతో భవానీపురంలో సైన్స్ పార్క్ కోసం కేటాయించబడిన స్థలంలోనే సైన్స్ సెంటర్ ఏర్పడడంవల్ల చాలామందికి దాని గురించి తెలియడం లేదు. ఆ సందర్భంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ నుంచి ముఖర్జీగారు, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి రామ్మూర్తినాయుడు గారు, ఇంకా నాడు మంత్రిగావున్న మర్రి శశిధర్‌రెడ్డి గారు, గాంధీహిల్ కార్యదర్శి యలమంచిలి రామచంద్రరావుగారు చక్కని సహకారాన్ని అందించారు. చాలా పెద్ద ఎత్తున ఆస్తులను కూడబెట్టుకున్నప్పటికీ సంతృప్తి చెందక సమాజపు ఆస్తులను కూడా ఆక్రమించుకోవాలనే దురాలోచనకు ఇది ఒక తార్కాణం.

## ***రైల్వే సంబంధ అంశాలు***

విజయవాడ రైల్వేడివిజన్‌లో వేలాదిమంది ఉద్యోగులు పనిచేస్తూవున్నారు. భారతరైల్వేలకు బాగా ఆదాయాన్ని సమకూర్చే డివిజన్లలో విజయవాడ రైల్వేడివిజన్‌కూడా ఒకటి. రైల్వే ఉద్యోగుల పిల్లల విద్యాభివృద్ధికోసం రైల్వే జూనియర్ కళాశాలను మంజూరుచేయించాను. అప్పటికే తక్కువ ప్రాముఖ్యతగల ఖాజీపేట డివిజన్‌లో రైల్వే



*విజయవాడ రైల్వే స్టేషన్*

జూనియర్ కళాశాల ఏర్పాటైవుంది. అంతకన్నా ఎక్కువ ఆదాయవనరులు, ఉద్యోగులు ఉన్న విజయవాడ డివిజన్‌లో రైల్వే జూనియర్ కళాశాల అవసరం ఎంతగానో ఉందని రైల్వేశాఖను ఒప్పించి మంజూరు చేయించాను. లోక్‌సభలో 1993 ఫిబ్రవరి 23న వేసిన ప్రశ్నకు, ఆ తర్వాత 1993 ఫిబ్రవరి 26న నేను రాసిన లేఖకు సమాధానంగా నాటి రైల్వేమంత్రి జాఫర్‌షరీఫ్, సహాయమంత్రి కానూచరణ్‌లెంకా 1993 సెప్టెంబర్ 14న మంజూరు చేసినట్లుగా లేఖలు రాశారు.

విజయవాడ నగరానికి సమీపంలో అజిత్‌సింగ్‌నగర్ దగ్గరనుంచి విజయవాడ రైల్వేస్టేషన్‌కు బైపాస్ నిర్మించారు. ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్ళు బైపాస్ లైన్లో వెళ్తుండగా, ప్యాసింజర్ రైళ్ళను సత్యనారాయణపురం స్టేషన్ మీదుగా నడుపుతుండేవారు. దీని వల్ల అయిదుచోట్ల లెవల్‌క్రాసింగ్ గేట్లు ఉండి నగర పౌరులు చాలా ఇబ్బందులు పడుతూ ఉండేవారు. అటువంటి పరిస్థితుల్లో సత్యనారాయణపురం మీదుగా ఉన్న రైల్వే ట్రాక్‌ను తొలగించి దాన్ని రహదారిగా అభివృద్ధి చెయ్యాలనే ప్రతిపాదనలు టి.వెంకటేశ్వరరావుగారు మేయర్‌గా ఉండగా ముందుకు వచ్చాయి. లక్షమంది ప్రజల సంతకాలతో కూడిన విజ్ఞప్తి పత్రాన్ని 1985 మే ఏడో తేదీన నాటి రైల్వే మంత్రి బన్సీలాల్ గారికి ఢిల్లీలో ఇవ్వడం జరిగింది. ఈ ట్రాక్ తొలగించడానికి రూ.3.52 కోట్లు ఖర్చవుతాయని ఆ మొత్తాన్ని కార్పొరేషన్ చెల్లించాలని, 10.25 హెక్టార్ల భూమిని

తమకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీన పరచాలని రైల్వే శాఖ కోరింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్  ఆర్ధిక స్థోమత బలహీనంగావున్న దృష్ట్యా డబ్బు చెల్లించడం సాధ్యం కాదని, 10.25 హెక్టార్ల భూమిని మాత్రం విజయవాడ నగర కార్పొరేషన్ వారు రైల్వేకు ఇవ్వగలరని చెప్పి ఆ ప్రతిపాదనను చివరికి రైల్వే శాఖ చేత అంగీకరింపచేయడం జరిగింది. అందుకు అనుగుణంగా సత్యనారాయణపురం మీదుగా ఉన్న ట్రాక్‌ను రైల్వే శాఖ తొలగించింది. రైళ్ళన్నీ బైపాస్ లైన్‌లో వెళ్ళడంవల్ల విజయవాడ నగర ప్రజలకు ఇక్కట్లు తప్పాయి. బి.ఆర్.టి.యస్.రోడ్డు నిర్మాణానికి ఈ భూమి ఉపయోగపడింది.

విజయవాడ నుంచి నూజివీడు వెళ్ళే రహదారిలో అజిత్‌సింగ్‌నగర్ వద్ద రైల్వే గేటు ఉండటం వల్ల ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతూ ఉండేది. ఈ లెవల్‌క్రాసింగ్ స్థానంలో రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మించడం అవసరమని రైల్వే శాఖమంత్రులుగా ఉన్న బన్సీలాల్, అనంతరం మొహిసినా కిద్వాయ్, ఆ తర్వాత మాధవరావు సింధియా గార్లకు, దక్షిణ మధ్య రైల్వే అధికారులకు అనేక సార్లు విజ్ఞప్తులు చేయడం జరిగింది. చాలా సుదీర్ఘంగా ప్రయత్నాలు చేయడం పర్యవసానంగా రోడ్డు అండర్ బ్రిడ్జిగా పనులు మంజూరయ్యాయి. ఎలైన్‌మెంట్ ఫైనలైజ్ చేసే దశలో రాష్ట్రప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ రాఘవన్‌గారు పరిశీలించి రోడ్డు ఓవర్ బ్రిడ్జిగా మార్పు చేసిన కారణంగా అది రోడ్డు ఓవర్‌బ్రిడ్జిగా నిర్మించారు. వాహనదారులకు ఇబ్బంది లేదుగానీ నూజివీడు ప్రాంతంనుంచి కేదారేశ్వరపేట మామిడిపండ్ల మార్కెట్ యార్డుకు పండ్లను ఎడ్లబండ్ల మీద తీసుకువచ్చేవారు అనేక అవస్థలు పడేవారు. ఓవర్‌బ్రిడ్జి కారణంగా ఆ బండ్లను లాగే ఎడ్లు అమితంగా ప్రయాసపడేవి. అనంతరకాలంలో నేను వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు నున్న సమీపంలో మామిడిపండ్ల మార్కెట్‌యార్డును విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటుచేయడంవల్ల ఈ ఇబ్బంది తొలగింది.

రంగాగారి అనుచరుల్లో సుంకర సత్యనారాయణ,  బాపట్లకు చెందిన పసుపులేటి కోటేశ్వరరావు, గుంటూరుకు చెందిన ఎన్.వీరాచారి చాలా గొప్పవక్తలు. వీరాచారిగారి సోదరులు రత్నాచారి ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఉత్తర భారతదేశయాత్రను నిర్వహిస్తుండేవారు. రైల్వే క్యారేజీలు బుక్‌చేసి పర్యాటకులకు సౌకర్యాలు జాగ్రత్తగా సమకూరుస్తూ, తద్వారా కొంత ఆదాయాన్ని పొందుతుండేవారు. మాధవరావు సింధియాగారు రైల్వేమంత్రిగా ఉన్న కాలంలో దక్షిణ మధ్య రైల్వేకు టూర్ల నిమిత్తం

కేటాయించే బోగీల సంఖ్యను పది నుంచి 14కు పెంచడానికి, పెంచిన డిటెన్షన్ ఛార్జీలు తగ్గించడానికి అంగీకరించారు.

విజయవాడ రైల్వేస్టేషన్ అత్యంత రద్దీగా ఉంటూ, హెచ్చు మొత్తంలో ఆదాయం సమకూరుస్తున్నది. విజయవాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరచి 5,6,7 ప్లాట్‌ఫారాల పైన రూఫ్‌కవర్‌ను పొడిగించి వర్షాకాలం, వేసవి కాలంలో ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, తూర్పు మెయిన్ వెయిటింగ్ హాలులో చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్ధం ఎస్కలేటర్‌ను 1వ నెంబర్ ప్లాట్ ఫారం వద్ద ఏర్పరచాలని కోరాను. ఈ రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ అంగీకరించింది. ఆవిధంగానే హైదరాబాదు నుంచి విశాఖపట్నానికి వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాదులో డిన్నర్‌కు రైల్వేశాఖ కేటరింగ్ శాఖ చేసే భోజన ఏర్పాట్లను అల్యూమినియం కేసరోల్స్‌లో సరఫరా చేయాలని నేను చేసిన సూచనను రైల్వే వారు అంగీకరించారు.

విజయవాడ నుంచి తిరుపతి వెళ్ళే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి తిరుగుప్రయాణం రిజర్వేషన్ సదుపాయాన్ని, అలాగే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు సికింద్రాబాదు నుంచి విజయవాడకు తిరుగు ప్రయాణంలో కూడా రిజర్వేషన్ సదుపాయాన్ని కూడా కల్పించాలని కోరాను. న్యూఢిల్లీ నుంచి మద్రాసు వెళ్ళే జి.టి.ఎక్స్‌ప్రెస్‌లో సెకండ్‌క్లాసులో అప్పటికి కోటా అనేది లేదు. కనీసం పది బెర్తుల్ని అయినా కోటాగా కేటాయించాలని కోరాను. మద్రాసు, సికింద్రాబాదు రైల్వేస్టేషన్లలో ఆనాటికి ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులను ప్రయాణికుల సౌకర్యార్ధం విజయవాడలో కూడా ఏర్పాటుచేయాలని రైల్వే శాఖను కోరాను.

### ***<u>తెరవబడిన నిడమానూరు రైల్వేగేటు</u>***

నిడమానూరు వద్ద ఉన్న రైల్వే లెవల్‌క్రాసింగ్‌ను మూసివేసి జాతీయ రహదారుల సంస్థ వారు రైల్వే లైన్, రైవస్ కాలువ మీదుగా వంతెన నిర్మించారు. అందులో కొంత భాగం రైల్వేవారు భరించారు. ఈ వంతెన నిర్మాణం జరగడం వల్ల రైల్వే గేటును మూసివేశారు. ఫలితంగా నిడమానూరు గ్రామరైతులు తమ భూములకు ఎరువును తీసుకువెళ్ళడానికి, భూముల నుంచి పండిన పంటను తీసుకురావడానికి చాలా ఎత్తుగా ఉన్న ఈ వంతెన పైనుంచి రావలసివచ్చేది. ఈ పరిస్థితి ఎడ్లకు చాలా ఇబ్బందిగా ఉండేది. గ్రామస్తుల సౌకర్యార్ధం దీనిని తిరిగి తెరిపించాలని గ్రామసర్పంచిగా ఉన్న

పరిమి హనుమంతరావు కోరారు. రైల్వే శాఖకు విజ్ఞప్తి చేయగా, అంతకు ముందు వంతెనను కట్టిన దానిలో రైల్వే శాఖ ఇచ్చిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించడానికి అంగీకరిస్తే, రైల్వే గేటును తిరిగి తెరిచే విషయాన్ని పరిశీలిస్తామని 1987 జూన్ ఒకటో తేదీన మాధవరావు సింధియాగారు నాకు తెలియచేశారు. అయితే పరిమి హనుమంతరావు ఏ విధంగానైనా దీనిని సాధించాలని గట్టిగా పట్టుపట్టారు. ఓవర్ బ్రిడ్జి, గ్రామం, రైల్వే గేటు, పరిసర ప్రాంతాల్ని చూపిస్తూ ఒక స్కెచ్ తయారుచేసి ఢిల్లీలో మాధవరావు సింధియా గారిని 1988 నవంబరు 29 వ తేదీన కలసి విషయాన్నంతా చక్కగా విశదీకరించాను. ఆయన 1989 మార్చి ఆరో తేదీన ఈ రైల్వే గేటు విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని తెరవడానికి అంగీకరిస్తున్నామని, దీనికోసం రైల్వే కాపలాదారుడు ఉండటానికి ఒక ప్రత్యేక క్యాబిన్‌ను ఏర్పాటుచేయగలమని, దానికయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం గాని గ్రామ పంచాయతీగాని భరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి పంచాయతీ వారు అంగీకరించి గేటును తెరిచే ఏర్పాటుచేశారు.

నిడమానూరు రైల్వేస్టేషన్ వద్ద రైల్‌హెడ్ నిర్మాణం చేసినందువల్ల సమీపంలో 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల సెంట్రల్ వేర్‌హౌసింగ్ గోడౌన్స్‌కు బియ్యాన్ని చేర్చడానికి, ఇంకా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియావారు ఏర్పాటు చేసే స్టాక్‌యార్డుకు ఉక్కు కర్మాగారం నుంచి స్టీలును అందించడానికి ఉపయోగకరంగా ఉంటుందని నామిత్రుడు వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్ సూచించగా, రైల్వేమంత్రి మాధవరావు సింధియాగారికి 1988 మార్చి 18న విజ్ఞప్తిచేశాను. ఆ తర్వాత రైల్‌హెడ్‌ను ఏర్పాటుచేశారు.

***<u>వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు ఉద్యోగులకు సీ.సీ.ఏ.</u>***

విజయవాడలో నివాసముంటూ, గుంటుపల్లిలోని వ్యాగన్ రిపేర్ వర్క్ షాపులో పనిచేస్తూవున్న ఉద్యోగులకు సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్ ఇవ్వాలని 1988 సెప్టెంబర్ 26న ఆర్థికశాఖ సహాయమంత్రి బి.కె ఘఢ్వీగారికి విజ్ఞప్తి చేశాను. ముందు ఆయన ఇవ్వడానికి అవకాశం లేదని తెలియపరిచారు. అయితే ఆ సమస్యను వదలిపెట్టకుండా దాన్ని ఫాలోఅప్ చేసి గుంటుపల్లి వేగన్ వర్క్ షాపులో సుమారుగా 3400 మంది ఉద్యోగులు ఉండగా 1020 మందికి మాత్రమే రెసిడెన్షియల్ క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వారందరూ విజయవాడ నుంచే రావాల్సి వస్తున్నదని, సమీపంలో ఉన్న సెంట్రల్ వేర్‌హౌసింగ్ గోడౌన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా సి.సి.ఎ. ఇస్తూవున్నందువల్ల ఈ రైల్వే ఉద్యోగులకు కూడా ఇవ్వవలసిందేనని 1988 మార్చి 1న

377వ నిబంధన కింద, 1988 మే 6న ప్రశ్న రూపంలోను, ఈ విషయాన్ని లేవనెత్తి చివరికి సాధించాను.

విజయవాడ పరిసర ప్రాంతాల్లో చాలా అధిక సంఖ్యలో లారీలు, బస్సులు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో సకాలంలో డీసెల్ రాకపోవడంవల్ల ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు ఇబ్బంది పడుతూ వున్న విషయాన్ని నాటి రైల్వేశాఖమంత్రి జాఫర్‌షరీఫ్, అలాగే పెట్రోలియం శాఖమంత్రి రామమూర్తిల దృష్టికి తీసుకువెళ్ళి విజయవాడ నగరానికి ప్రతిరోజూ ఒక రేక్ వచ్చేటట్లుగా ఏర్పాటు చేయమని కోరాను. రాజమండ్రిలో ఓఎన్‌జిసి రీజినల్ ఆఫీసులో భవన నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి త్వరగా భవన నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరాను.

వ్యాగన్ వర్క్‌షాపు సమీపంలో ఈలప్రోలు వెళ్ళే రహదారిలో రైల్వేట్రాక్ అవతలివైపున వున్న మసీదుకు ఎల్.టి.సప్లై ఇప్పించమని ఆప్రాంత ముస్లిం సోదరులు విజ్ఞప్తి చేసిన మీదట రైల్వేమంత్రిగారికి, ఇతర అధికారులకు తెలియజేసి మంజూరు చేయించాను. ఈ విషయంపై రైల్వేమంత్రి జాఫర్‌షరీఫ్ 1993 జనవరి 31న అనుమతించినట్లు తెలియజేశారు.

గుంటుపల్లిలో వ్యాగన్ రిపేరు వర్కు షాపు ఉంది. వందలాది మంది అందులో పనిచేస్తూవుంటారు. వారి పిల్లల విద్యావసరాల కోసం అక్కడొక స్కూలు వుంది. ఆ పాఠశాలలో అదనంగా తరగతులు నిర్వహిస్తూ, నాణ్యతతో కూడిన విద్యను అందించాలని రైల్వే మంత్రిగారికి 1987 జూలై 30వ తేదీన విజ్ఞప్తి చేయగా, ఆయన వ్యాగన్ రిపేరు వర్కుషాపు స్కూలులో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసినట్లుగా తెలియచేశారు.

### ***అమరావతి ఎక్స్‌ప్రెస్‌తో అనుబంధం***

ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి, నామిత్రుడు యలమంచిలి రామచంద్రరావుగారు హౌరా నుంచి వాస్కోకు విజయవాడ మీదుగా రైలు నడపాల్సిన ఆవశ్యకత ఉందని కోరినప్పుడు మాధవరావు సింధియాగారికి తెలియపరిచాను. మొత్తం లైను బ్రాడ్‌గేజిగా మారిన తర్వాత ఈ అంశం పరిశీలించబడుతుందని ఆయన తెలిపారు. మొదట్లో విజయవాడ నుంచి హుబ్లీ వరకు నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్ బొగ్గు ఇంజన్‌తో ఫాస్ట్‌ప్యాసింజర్‌గా నడుస్తూవుండేది. ఈ రైలుకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా దీనిని డీజిల్ ఇంజన్‌తో నడిపించాలని కోరాను. రైల్వేశాఖ ఆ విధంగానే ఏర్పాట్లు చేసింది. మమతా బెనర్జీ రైల్వే శాఖ మంత్రిగా ఉండగా

విజయవాడ నుంచి హుబ్లీ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను వారానికి మూడు రోజులు హౌరా నుంచి వాస్కోకు నడిపే విధంగా ఏర్పాట్లుచేశారు. గత దశాబ్ద కాలంలో బళ్ళారి–హోస్పేట ప్రాంతంలో అనేక స్టీలు ఫ్యాక్టరీలు ఏర్పాటు కావడం వల్ల వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులు బీహార్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందినవారు పనిచేస్తూవున్నందువల్ల హౌరా–వాస్కో ట్రెయిన్‌లో గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ప్రయాణం చేసేవారు పడుతున్న ఇబ్బంది వర్ణనాతీతం. కొద్ది కాలం క్రితం ఢిల్లీ వెళ్లినప్పుడు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు నామా నాగేశ్వరరావు గారితో రైల్వేమంత్రికి హౌరా–వాస్కో ట్రెయిన్‌ను ప్రస్తుతం నడుపుతున్న టైమింగ్స్‌లోనే నడుపుతూ విజయవాడ–హుబ్లీ మధ్య టైమింగ్స్ మార్చి ప్రతిరోజూ నడిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, రైల్వేశాఖకు అదనంగా ఆదాయం సమకూరుతుందని 21 మే 2012న కోరడం జరిగింది. ఇటీవల రైల్వే బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను డైలీ చేయనున్నట్టు రైల్వే మంత్రి ప్రకటించటం ఎంతో సంతోషాన్ని కల్గించింది.

దొడ్డదేవరపాడు గ్రామస్తుల సౌకర్యార్థం యర్రబాలెం, మీనవోలు గ్రామాల మధ్యన రైల్వే లెవెల్ క్రాసింగ్ నిర్వహించాలని నేను చేసిన విజ్ఞప్తిని అంగీకరించినట్లు 20–9–92 రైల్వే డి.ఆర్.యమ్. తెలియపర్చారు.

రైల్వేశాఖలో పనిచేసిన ఇతర మంత్రుల కన్నా మాధవరావు సింధియా సమర్ధవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూ, నా ప్రయత్నాలకు చాలావరకు సహకారాన్నందించారు.



కొంతకాలంపాటు ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ జనరల్ ఛైర్మన్‌గా నేను ఉండడంవల్ల నా దృష్టిలోకి తెచ్చిన సమస్యల్ని పరిష్కరించడానికి పార్లమెంటు సభ్యుడిగా నా వంతు కృషి చేశాను. ఎస్.పి.సింగ్, ఎన్.వి. రమణ మున్నగు గార్డ్స్, అలాగే రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శంకరరావుగారు, వారి సహచరులు, ఎలక్ట్రానిక్ డేటా ప్రాసెసింగ్ అసోసియేషన్ కార్యదర్శి రామారావుగారు, వారి సహచరులు విజయవాడ రైల్వేడివిజన్‌లోనేగాక దక్షిణమధ్య రైల్వేజోన్ పరిధిలో నూతనంగా ప్రవేశపెట్టవలసిన రైళ్లు, నడుస్తూవున్న రైళ్లకు ఎ.సి.టూటైర్/ఎ.సి.చైర్‌కార్ బోగీలను కలపడం, విజయవాడ, విశాఖపట్నం

ఎలక్ట్రిఫికేషన్, విజయవాడ రైల్వేస్టేషన్‌లో పెరుగుతూవున్న ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బుకింగ్ కౌంటర్లను పెంచవలసిన ఆవశ్యకత, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాల్సిన ఆవశ్యకతల గురించి నాకు తెలియజేస్తుండేవారు. రైల్వేమంత్రిగారు, దక్షిణమధ్య రైల్వేజోన్ పరిధిలోని పార్లమెంటు సభ్యులతో నిర్వహించే సమీక్షా సమావేశాలు, విజయవాడ రైల్వేడివిజన్ స్థాయిలో జరిగే సమీక్షా సమావేశాలకు తప్పనిసరిగా హాజరై, నా దృష్టిలోకి తెచ్చిన సమస్యల్ని మంత్రిగారు/రైల్వేఅధికారుల దృష్టికి తీసుకువెళ్తుండేవాణ్ని. అలాగే ఎలక్ట్రానిక్ డేటా ప్రోసెసింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వారి సమస్యల పరిష్కారానికి నా వంతు సహకారాన్ని అందించాను.

రైల్వేస్టేషన్ సమీపంలోవున్న బొగ్గుకాలనీలో చాలాకాలం క్రితం నిర్మించబడిన రైల్వేక్వార్టర్స్ శిథిలావస్థకు చేరిన విషయాన్ని, వాటి స్థానంలో కొత్తగా భవననిర్మాణాలను చేపట్టవలసిన ఆవశ్యకతను దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్, విజయవాడ డివిజనల్ మేనేజర్ల దృష్టికి తీసుకువెళ్ళడమేగాక పార్లమెంటులో 1994-95 రైల్వే గ్రాంట్లకు ఓటింగ్ సందర్భంగా కట్‌మోషన్‌ను ప్రతిపాదించడంద్వారా కూడా ప్రయత్నంచేసిన పర్యవసానంగా 1995 - 96 వర్క్స్ ప్రోగ్రాంలో చేర్చినట్లు తెలియచేశారు.

విజయవాడ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని డి.ఆర్.ఎం. కార్యాలయం సమీపంలోవున్న రైల్వే ఆడిటోరియంను ఆధునీకరించాలని, విజయవాడ తూర్పురైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-1 వద్ద వృద్ధులకు, అంగవికలురకు సౌకర్యంగా వుండే నిమిత్తం లిఫ్ట్‌గానీ, ఎస్కలేటర్‌గానీ ఏర్పాటుచేయాలని కట్‌మోషన్ ద్వారా రైల్వేశాఖ దృష్టికి తీసుకురావడం, అనంతర కాలంలో ఎస్కలేటర్‌ను ఏర్పాటుచేయడం జరిగింది.

విజయవాడనగరంలో నైజాంగేటుకు సమీపంలో గల రైల్వేయార్డులో రైల్వేట్రాక్ కిందుగా డ్రెయిన్ కల్వర్టులో పేరుకుపోయిన మురుగును తొలగించవలసిన ఆవశ్యకత గురించి అప్పటి విజయవాడ మునిసిపల్ కమీషనర్ రజిత్ భార్గవ్‌గారికి, ప్రజారోగ్యశాఖ చీఫ్‌ఇంజనీర్‌గారికి, రైల్వేడివిజనల్ మేనేజర్ డి.బి.ఎస్.రావుగారికి తెలియపరిచాను.

వర్షాలకు అధికంగా కురిసిన వర్షపునీరు, మురుగునీరు కొంత భాగం తారాపేట గూడ్స్‌షెడ్ సమీపం నుండి ఏలూరు కాలువలో కలుస్తుందని మరి కొంత భాగం నైజాంగేటు సమీపంలో వున్న డ్రెయిన్ ద్వారా రైల్వేయార్డులోని రైల్వేట్రాక్ కిందుగా ప్రవహిస్తుందని, ఇవి పూడిపోవడం వలన ఇంద్రకీలాద్రి నుంచి రైల్వేయార్డు వరకు గల ప్రదేశంలో కురిసిన వర్షపునీరు, ఇంకా మురుగునీరు నిలబడిపోయి, వర్షాలు కురిసినప్పుడు సమస్యగా

మారుతుందని వారికి తెలియజేశాను. ఈ విషయం గురించి రైల్వే డి.ఆర్.ఎం.శ్యామ్‌కుమార్‌తో కూడా చర్చించగా, అవసరమైన పరికరాలతో కొంతవరకు మురుగును తొలగించగలమని, దీనిగురించి గట్టిగా ప్రయత్నించగలమని ఆయన చెప్పారు. అనంతరం విజజయవాడ మున్సిపల్ కమీషనర్‌గా వచ్చిన రాజీవ్ శర్మ, జి.యస్. రావు గారిని ఈ డ్రెయిన్లు రైల్వేశాఖస్థలంలో ఉన్నందువల్ల మునిసిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకోలేకపోతున్నదని, కనుక రైల్వేశాఖ ఈ మురుగుకాలువల్లోని మురుగును తొలగించే ఏర్పాటు చేయవలసిందని కోరారు. మురుగును తొలగించేపనులు వర్షాకాలం ప్రారంభానికి ముందే జరగాలని కోరాను. మురుగునీటి తొలగింపు పనులకు అవసరమైన పనివారిని, పనిముట్లను సమకూర్చి రైల్వేఅధికారులకు సహకరించవలసిందిగా కూడా ఆ లేఖలో మునిసిపల్ కమీషనర్‌కు విజ్ఞప్తి చేశాను. రైల్వేలైను పక్కగా మురుగుకాలువ నిర్మాణం గురించి పరిశీలించగలమని దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ డి.సి.మిశ్రా 1994 ఫిబ్రవరి 11న ఒక లేఖలో నాకు తెలియజేశారు. ఇప్పటికి కూడా ఆ డ్రెయిన్లను సంపూర్ణంగా క్లియర్ చేయకపోవడంవల్ల ఒకమాదిరి వర్షాలు కురిసినప్పుడు కూడా విజయవాడ పశ్చిమప్రాంతంలోని ప్రజలు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటూనే వున్నారు.

అలాగే విజయవాడ పశ్చిమప్రాంతంనుంచి అజిత్‌సింగ్‌నగర్ స్యూయరేజ్ ప్లాంటుకు మురుగునీటిని తరలించడానికి 67.35 లక్షల రూపాయల ఖర్చుతో రూపొందిన మురుగునీటి పథకాన్ని మంజూరుచేయవలసిందిగా ప్రజారోగ్యశాఖ చీఫ్ ఇంజనీర్‌గారిని 1987 డిసెంబరు 10న ఒక లేఖలో కోరాను.

హైదరాబాద్ నుంచి బోంబే వి.టి.కి నడపబడుతున్న హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌ను రాజమండ్రివరకుగాని, విజయవాడ వరకుగాని పొడిగించాల్సిన ఆవశ్యకత గురించి తెలియపరచినప్పుడు, సికిందరాబాద్ – భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను బొంబాయి వరకు పొడిగించడం ద్వారా ఈ సూచనను ఆమోదించడం జరిగింది. ఆవిధంగానే నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను వారానికి నాలుగురోజుల నుంచి ఆరురోజులకు పెంచడం, విజయవాడ – విశాఖపట్నం మధ్య 1994 అక్టోబరు 2 నుంచి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టడం మున్నగు సమస్యల్ని పరిష్కరింపజేయడం జరిగింది.

అలాగే విజయవాడ – సికిందరాబాద్‌ల మధ్య నడిపే శాతవాహన ఎక్స్‌ప్రెస్, విజయవాడ – చెన్నైల మధ్యన నడిపే పినాకిని ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభించిన మొదట్లో ఎ.సి. చైర్‌కార్ బోగీలలో ప్రయాణికులనుండి ఫస్ట్‌క్లాస్ చార్జీలు వసూలు

చేస్తుండేవారు. దానిపైన ఇది చాలా అన్యాయం, అసమంజసం, ఎ.సి.చైర్‌కార్ ఛార్జీలు వసూలు చేయాలిగానీ ఫస్ట్‌క్లాస్ ఛార్జీలు వసూలు చేయడం తగదని 1992 సెప్టెంబరు 6న లోక్‌సభలో ఈ విషయాన్ని ప్రస్తావించాను. 1993 ఆగస్టు 10న నిర్వహించబడిన దక్షిణమధ్యరైల్వే కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో నేను అభ్యంతరం వ్యక్తం చేశాను. ఈ విషయంపై 1993 డిసెంబర్ 15న రైల్వేశాఖ సహాయమంత్రి కానూచరణ్ లెంకా గారు ఎ.సి. చైర్‌కార్ ఛార్జీలు మాత్రమే వసూలుచేయాలని ఉత్తర్వులిచ్చినట్లుగా నాకు తెలియపరిచారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో స్టేషన్ అభివృద్ధికి, చెరువు మాధవరం గ్రామం వద్ద నూతనంగా రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయించడానికి కృషి చేశాను.

విజయవాడలోని డాక్టర్ ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఒక హాలు నిర్మాణానికి ఎం.పి.లాడ్స్ నిధులనుంచి కొంత మొత్తాన్ని ఇవ్వడమేగాక ఆ కళాశాలకు కేంద్రప్రభుత్వం నుంచి నిధులు పొందడానికి, రసశాస్త్ర, ద్రవ్యగుణ విభాగాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభించడానికి నావంతు ప్రయత్నంచేశాను.

తొమ్మిదవ నంబరు జాతీయరహదారిలో కీసరవద్ద మున్నేరుపై వున్న వంతెన 1991లో వరదలకు దెబ్బతిన్నప్పుడు కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి జగదీష్ టైట్లర్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు గారి దృష్టికి తీసుకువెళ్లాను. విజయవాడలో కృష్ణానదిపైన వారధి నిర్మించిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ బ్రిడ్జి కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ వారిచేత ఈ బ్రిడ్జీని కూడా నిర్మింపజేయటం జరిగింది. ఈ బ్రిడ్జిపైన మంచినీటి పైపును వేయడానికి కేంద్రం నుండి అనుమతి కొరకు వ్రాసి, ఇప్పించాను.

అలాగే అయిదవ నంబరు జాతీయరహదారిలో బొమ్ములూరు సమీపంలోగల రామిలేరుపై వున్న పురాతన వంతెన దెబ్బతిన్నప్పుడు వాటి స్థానంలో నూతనంగా వంతెన నిర్మించాలని కోరాను. హనుమాన్‌జంక్షన్ సమీపంలోని వీరవల్లి వద్ద రైతులు పడే ఇబ్బందుల్ని నా మిత్రుడు గుండపనేని ఉమావరప్రసాద్ (బుజ్జి) తెలియపరచగా, నేషనల్ హైవే అథారిటీవారిని అంగీకరింపజేసి అండర్‌పాస్ నిర్మింపజేశాను.

తొమ్మిదవ నంబరు జాతీయరహదారిలో విజయవాడ నుంచి నందిగామవరకు, అలాగే అయిదవ నంబరు జాతీయరహదారిలో విజయవాడ నుంచి ఏలూరు వరకు జాతీయరహదారుల్ని వెడల్పుచేసి, పటిష్టపరచాలని కోరాను. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో ఈ పనుల్ని చేపట్టగలమని తెలియపరిచారు.

విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో టెలిఫోన్ సౌకర్యాల మెరుగుదలకు గానూ టెలిఫోన్ ఎక్స్ఛేంజీల విస్తరణ ఆవశ్యకతను సంబంధిత అధికారులకు తెలియపరుస్తూ నావంతు కృషిచేశాను.

పెరిగిపోతున్న జనాభా అవసరాల్ని దృష్టిలో వుంచుకొని పౌల్ట్రీ, ఆక్వా రంగాలకు ప్రభుత్వ పక్షంగా బ్యాంకుల నుంచి సహకారాన్ని అందించాలని కోరుతూ వచ్చాను. పశ్చిమగోదావరిజిల్లా పెదవేగిలో ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నేను, మరికొందరు పార్లమెంటు సభ్యులం కలిసి నాటి ప్రధాని పి.వి.నరసింహారావుగారికి 1992 డిసెంబరు 4వ తేదీన విజ్ఞప్తి చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ నిధులతో అభివృద్ధి పరచబడిన పామాయిల్ తోటల రైతులకు ప్రయోజనకారిగా ఉండుటకై పామాయిల్ ప్రోసెసింగ్ యూనిట్‌ను పశ్చిమగోదావరి జిల్లాలో పెదవేగిలో నెలకొల్పాలని నేను మరికొందరు పార్లమెంట్ సభ్యులు, పామాయిల్ రైతులు చేసిన అభ్యర్థనను పి.వి. నరసింహారావుగారు డి.బి.టి. మంత్రి కుమార మంగళంగారు ఆమోదించి రైతులకు మేలు చేకూర్చారు. 17 అక్టోబర్ 92న ఏలూరులో ఆయల్‌పామ్ రైతుల సమావేశానికి కేంద్ర వ్యవసాయ సహాయమంత్రి యమ్. రామచంద్రన్‌గారు పాల్గొన్నారు.

దేశంలో సాగుకు వినియోగించుకోదగిన నీటిలో 48 శాతం మాత్రమే ఇప్పటికి అందుబాటులోకి వచ్చిందని, రాష్ట్రప్రభుత్వం ఆర్థిక స్తోమత బలంగా లేనందువల్ల ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో చాలా జాప్యం జరుగుతున్నదని, శీఘ్రగతిన ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కోసం ఇరిగేషన్ బాండ్లను జారీ చేయడానికి రాష్ట్రప్రభుత్వాలకు అనుమతిని ఇవ్వాలని 1993 జనవరి 21న ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేయడం జరిగింది.

***<u>పులిచింతల ప్రాజెక్టు సాధనకు కృషి</u>***

కృష్ణానది పైన ప్రఖ్యాత ఇంజనీరు సర్ ఆర్థర్ కాటన్ గారి ఆధ్వర్యంలో కెప్టెన్ ఓ.ఆర్.ఆర్. పర్యవేక్షణలో విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మించబడింది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లోని సుమారు 6లక్షల ఎకరాలకు సాగునీరు అందుతూ వుండేది. సుమారు వంద సంవత్సరాలు సమీపిస్తున్న తరుణంలో కృష్ణానదికి భారీ స్థాయిలో వరదలు వచ్చి ఆనకట్టకు స్వల్ప ప్రమాదం జరిగిన స్థితిలో ఎంతో నిబద్ధత కలిగిన నిజాయితీపరుడు, కార్యదీక్షాపరుడైన సూపరింటెండింగ్ ఇంజనీర్ వేపా

కృష్ణమూర్తిగారు దుర్మరణం పాలయ్యారు. ప్రకాశం బ్యారేజీని 1955లో నిర్మించారు. దాదాపు 13లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. కృష్ణా డెల్టా ప్రయోజనాల్ని పరిరక్షించడానికి పులిచింతల ప్రాజెక్ట్ చాలా అవసరమని డాక్టర్ కె.యల్. రావుగారు చెబుతూవుండేవారు. ముక్త్యాల రాజాగారు చాలా ధనం ఖర్చు చేసి ఆ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలతో కరపత్రములను, చిన్న పుస్తకాలను ప్రచురింపచేసి విస్తృతంగా ప్రజాభిప్రాయాన్ని మొబిలైజ్ చేశారు. విజయవాడలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కె.యల్.రావు భవనంలో పులిచింతల ప్రాజెక్ట్‌ను నిర్మించాల్సిన ఆవశ్యకతను గురించి చర్చించి తగిన చర్యలు చేపట్టడంకోసం 1992 ఆగస్టు 2న ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. పిన్నమనేని కోటేశ్వరరావు గారు అధ్యక్షత వహించగా, చనుమోలు వెంకట్రావు, సుంకర సత్యనారాయణ, చంద్ర రాజేశ్వరరావు, మోటూరు హనుమంతరావు, యలమంచిలి శివాజీ, యడ్లపాటి వెంకట్రావు, కోనేరు బసవేశ్వరరావు, అక్కినేని భవానీ ప్రసాద్, అంకెం ప్రభాకరరావు ప్రభృతులతో సహా పెద్దయెత్తున రైతులు హాజరయ్యారు. అయిదు సంవత్సరాలపాటు ఎకరానికి ఒక బస్తా వంతున పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు కోసం సహకారాన్నందించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ రకమైన సహకారంతో పులిచింతల ప్రాజెక్ట్‌ను నిర్మింపజేయాలని తీర్మానించారు. స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు పులిచింతల ప్రాజెక్ట్‌కు 1988 ఆగస్టు 31వ తేదీన శంకుస్థాపన చేశారు. సత్తెనపల్లిలోనూ, జగ్గయ్యపేటలోనూ పులిచింతల ప్రాజెక్ట్ డివిజనల్ కార్యాలయాల్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1989నుండి 94వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పులిచింతల నిర్మాణం అడుగు ముందుకు వేయలేదు తర్వాత నారా చంద్రబాబు నాయుడుగారు నిర్మాణ కార్యక్రమాన్ని తలపెట్టినప్పటికీ, నల్గొండ జిల్లాలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కాలేదు. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నడుంకట్టారు. గతంలో మాదిరిగానే దీన్ని కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ లెక్కచేయకుండా వారిని తరిమివేసి నిర్మాణ కార్యక్రమాలు ముందుకు సాగేలా చేశారు. రూ. 640 కోట్ల వ్యయంతో 2005లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ నిర్మాణ వ్యయం రూ.1780 కోట్లుగా పెరిగినా, ఇంతకాలం జరిగినా, ఇప్పటికీ పూర్తిగాక పోవడం వల్ల డెల్టా ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం జరిగింది. 2012 మే నెల నాటికి పూర్తయ్యి ఉన్నట్లయితే క్రిందటి ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఇంత ఇబ్బంది ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడి వుండేది కాదు. కాంట్రాక్టును

చేజిక్కుంచుకున్న శానయ్య కంపెనీ మితిమీరిన స్వార్థం వల్ల ఈ ప్రాజెక్ట్‌కు ఇలాంటి పరిస్థితి దాపురించింది. పలు పర్యాయములు పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణం త్వరగా పూర్తి చెయ్యాలని కోరుతూ జరిగిన సమావేశాలు, పులిచింతల ప్రాజెక్ట్ వద్దకు పర్యటన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిగారిని కొద్ది నెలల క్రితం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో నేను, డాక్టర్ శివాజీ, యెర్నేని నాగేంద్రనాథ్, కొల్లి నాగేశ్వరరావు, మంత్రులు, ఎం.పి.లు, ఎం.యల్.ఏ.లు మున్నగు వారందరం కలసినప్పుడు ఎట్టి పరిస్థితిలోనూ 2013 ఆగష్టు నెలాఖరుకు ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తి చేయడానికి నిర్దుష్టమైన చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. సొంతం పనులు పూర్తికాకుండానే ఇటీవల ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు ప్రారంభించడం ఆశ్చర్యకరం.




*విజయవాడ కె.యల్. రావు భవనంలో ఇరిగేషన్ సదస్సులో కోనూరి కన్నయ్య, శ్రీమతి ఇందిరా దత్, చెరుకూరి వీరయ్య, ప్రసాద్‌లతో*

10 డిశెంబర్ 2006న డా॥ కె.ఎల్ రావు భవన్‌లో నాగార్జున సాగర్ డ్యాం శంఖుస్థాపన స్వరోత్సవ ముగింపు సభ మరియు రాజ శ్రీ వాసిరెడ్డి రామగోపాల కృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాలరాజు) వారి సార్మకోపన్యాస కార్యక్రమములో శ్రీమతి వెలగపూడి ఇందిర దత్, నేను చెరూకూరి వీరయ్య మున్నగు వారు పాల్గొనగా స్వాతంత్ర్య సమరయోధులు కోనూరి కన్నయ్య, శ్రీమతి వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ గార్లకు సన్మానం జరిగింది.

## *మెరిటోరియస్ ప్రొడక్టివిటీ రివార్డ్‌ను ఆదాయపు పన్ను నుండి మినహాయించాలి*

ఇబ్రహీంపట్నం వద్ద డాక్టర్ కె.యల్.రావు గారి సూచనతో జలగం వెంగళరావు గారు ముఖ్యమంత్రిగా ఉం డగా విజయవాడ థర్మల్ స్టేషన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి దీనికి శంకుస్థాపన చేశారు. స్థల సేకరణలోనూ, నిర్మాణ కార్యక్రమాల్లోనూ ఇబ్రహీంపట్నం సర్పంచ్ మల్లెల పద్మనాభరావుగారు అప్పటి నుంచి ఇప్పటి వరకు తోడ్పాటును అందిస్తూనే ఉన్నారు. నార్ల తాతారావుగారు ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. అందుకే దీనికి కొంతకాలం క్రితం నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం అని నామకరణం చేశారు. కృష్ణానదినుంచి గ్రావిటీ ఫ్లోలో నీటిని తీసుకుని కేంద్రంలో వాడుక తర్వాత వేడినీటిని తిరిగి కృష్ణానదిలోకే పంపించే ఏర్పాటు ఈ కేంద్రం ప్రత్యేకత.

దేశంలో సత్వర సమగ్ర అభివృద్ధిలో విద్యుచ్ఛక్తికి ఎంతో ప్రాధాన్యత ఉంది. విద్యుత్ కేంద్రాల్లో బాగా కష్టపడి విద్యుత్ ఉత్పత్తిలో ఉత్తమ ఫలితాల్ని సాధిస్తూన్న థర్మల్ కేంద్రాల ఉద్యోగులకు మెరిటోరియస్ ప్రోడక్టివిటీ రివార్డును ఎనర్జీ శాఖవారు అందజేస్తూ వున్నారు. ఈ ప్రోత్సాహకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత అఖిల భారతస్థాయిలో 1983-84లో ప్లాంట్‌లోడ్ ఫ్యాక్టర్ 47.9 శాతం నుంచి 1987-88 నాటికి 56.4 శాతానికి పెరిగింది. ప్రారంభంనుంచి క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహించబడుతూ అనేక సంవత్సరాలు



*విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్*

వరుసగా దేశంలో విద్యుత్తు ఉత్పత్తిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, అవార్డులు పొందుతూ వస్తున్నందువల్ల దానిలో పనిచేసే కార్మికులకు కేంద్రప్రభుత్వం ఇచ్చే మెరిటోరియస్ ప్రొడక్టివిటీ రివార్డ్‌ను వి.టి. పి.యస్‌లో పనిచేస్తూ వున్న రామసుబ్బయ్య, నారాయణరావు ప్రభృతులు నా దృష్టికి తీసుకురాగా, సగటున విజయవాడ వి.టి.పి.ఎస్‌లో పనిచేసేవారికి సంవత్సరానికి 1600 రూపాయలు వస్తాయని, ఈ మొత్తానికి ఇన్‌కమ్‌టాక్స్ పరిధి నుంచి మినహాయింపు నివ్వాలని కోరుతూ ఆర్థిక శాఖా మంత్రికి లేఖ రాశాను. దానితోపాటు ఎనర్జీశాఖమంత్రి వసంత్ సాథేగారి లేఖ, అంతకుముందు ఆర్థికశాఖమంత్రిగా వున్న ఎన్.డి.తివారీగారి లేఖ కూడా జతపరిచాను. దానిపైన 1989 మే 9వ తేదీన ఈ మెరిటోరియస్ ప్రొడక్టివిటీ రివార్డును ఇన్‌కంటాక్స్ పరిధి నుంచి మినహాయింపు నిచ్చినట్లుగా ఆర్థికశాఖమంత్రి ఎస్.బి.చవాన్ తెలియజేశారు.

నేను మైలవరం నియోజకవర్గం నుంచి ఎన్నికై వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు తుమ్మలపాలెం గ్రామం వద్ద కూలింగ్‌కెనాల్‌పైన వంతెన నిర్మించినట్లయితే ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని నల్లబాబు, జానకిరామయ్య, శ్రీనివాసరావు మున్నగు గ్రామస్తులు కోరారు. అందువల్ల వి.టి.పి.యస్. అధికారులతో చర్చించి, వారిని ఒప్పించి, వారితో వంతెనను నిర్మింపజేశాను.

## ***డాక్టర్ కె.యల్.రావు అసమాన కృషి***

విజయవాడ నుంచి లోక్‌సభ సభ్యుడిగా, కేంద్ర జలవనరులు, విద్యుత్‌శాఖ మంత్రిగా విజయవాడ నగరానికి, గ్రామీణ ప్రాంతాలకు కె.యల్.రావు గారు విశేషమైన సేవలందించారు. తరచుగా కృష్ణానది వరదలకు గురయ్యే కృష్ణలంక ప్రాంతాన్ని వరదల బారినుంచి రక్షించడంకోసం కరకట్టను నిర్మింపజేశారు. కృష్ణానది వెంట కొన్నిచోట్ల పంపింగ్ స్కీముల్ని ఏర్పాటు చేసి సాగునీటి సౌకర్యాన్ని విస్తరింపజేశారు. దాములూరు వద్ద పంటుపైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును ఏర్పరచడంలో ఒక ప్రత్యేకత ఉంది. నదీ ప్రవాహం తగ్గినప్పుడు నది కొద్దిగా లోపలికి జరుగుతూవుంటుంది గనుక అలాంటి పరిస్థితుల్లో కూడా నీటిని లిఫ్ట్‌చేసే సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నందిగామ నుంచి మధిర వెళ్లే రహదారితోపాటు అనేక గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని, తాగునీటి సౌకర్యాన్ని, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. కేంద్ర జలవనరులు, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేస్తూ, దేశంలో వ్యవసాయాభివృద్ధికి కీలకమైన ఇరిగేషన్ వనరుల అభివృద్ధికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి అత్యంత ఆవశ్యకమైన విద్యుచ్ఛక్తి అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్థల పరిశీలనకు ఖోస్లా కమిటీ వచ్చిన సందర్భంలో ఆచార్య రంగా గారు, వారి అనుచరులు, ముక్త్యాల రాజా గారు కె.యల్ రావుగారులు కీలకమైన పాత్రను నిర్వర్తించారు. నాగార్జున సాగర్ డామ్‌నకు క్రెస్ట్ గేట్లు అమర్చడంలో రావు గారి పాత్ర ఎంతో ఉంది. సరిహద్దు రాష్ట్రాలైన మహరాష్ట్ర, కర్నాటక రాజకీయ నాయకులు కె.యల్.రావుగారు తమకు అన్యాయం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూర్చుతున్నారని నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిగారి వద్ద ఫిర్యాదులు చేసిన పర్యావసానంగా కె.యల్. రావుగారు మంత్రి వర్గం నుండి తప్పుకొనవలసి వచ్చింది. ఆయన నా పట్ల ప్రేమతో తన ఆత్మకథ 'క్యూసెక్స్ క్యాండిడేట్' నాకు బహూకరించారు.

## *అపరభగీరధుడు డా॥ కె.యల్. రావు*

వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించాము. క్యూసెక్స్ క్యాండిడేట్‌ను తెలుగులోకి ముక్కామల వెంకటేశ్వరరావు అనువదించగా 'అపరభగీరధుడు డాక్టర్ కె.యల్.రావు' పేరుతో నేను ప్రచురించి ఆ సమావేశములో ఆవిష్కరించాము. ప్రకాశం బ్యారేజి సమీపంలో ఇరిగేషన్ కాంపౌండ్‌లో డాక్టర్ కె.ఎల్.రావుగారి కాంస్య విగ్రహంను ఏర్పాటుచేసి సెంట్రల్ వాటర్ కమిషన్ అధ్యక్షుడు డి.యస్. రెడ్డి గారిచే ఆవిష్కరింపచేశాము. రూ. 25 వేల వ్యయంతో



*కె.యల్. రావు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇరిగేషన్ కాంపౌండ్‌లో రావుగారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సి.డబ్ల్యూ.సి. ఛైర్మన్ డి.ఎస్. రెడ్డి, విద్య గార్లతో వడ్డే*

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు చెందిన ప్రఖ్యాత శిల్పి రామారావుచే ఈ విగ్రహాన్ని చేయించాను. ఆ నేపథ్యంలో అటువంటి గొప్పవ్యక్తి ప్రాతినిధ్యం వహించిన విజయవాడ లోక్‌సభ నియోజకవర్గంనుంచి రెండుసార్లు పార్లమెంటుకు ఎన్నిక కావడం నేను అదృష్టంగా

భావిస్తూవుండేవాణ్ని. కె.యల్.రావు గారి కుమారులు విజయ్ రావు, అశోక్ రావు గార్లు నాకు మిత్రులు.

జగ్గయ్యపేట ప్రాంతంలోని గరికపాడువద్ద 9వ నంబరు జాతీయరహదారిని ఆనుకుని పాలేరునది సమీపంలో గల 60ఎకరాల ప్రభుత్వభూమిలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి అనేక సార్లు పలు రూపాల్లో విజ్ఞప్తి చేశాను. నేను వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రాష్ట్రంలో అప్పటకి కృషి విజ్ఞాన కేంద్రం లేని కృష్ణాజిల్లాలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి మంజూరు చేయించాను. ఈ గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రానికి డాక్టర్ కె.యల్,రావు గారి పేరు పెట్టాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి చెప్పగా, ఆయన మంచి ఆలోచన, ఆ విధంగానే చెయ్యండన్నారు. నా హయాంలోనే డాక్టర్ ఐ.వి.సుబ్బారావుగారు వైస్ చాన్సలర్‌గా వుండగా ఈ కె.వి.కె.ను, నేను ప్రారంభించాను.

రెడ్డిగూడెం మండలంలోని కోతులవాగుపైన గ్రోయిన్ నిర్మాణం, ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, విజయవాడ రూరల్ మండలంలోని పాతపాడు, కండ్రిక మొదలైన గ్రామాలకు గొల్లపూడినుంచి ముస్తాబాద వరకు కాకాని వెంకటరత్నంగారి హయాంలో నిర్మించబడిన గొల్లపూడి సప్లయ్ ఛానల్ నుంచి లిఫ్ట్ స్కీమును ఏర్పాటు చేయించడం, కంచికచర్ల మండలంలో మొగులూరు ఛానల్ నిర్మాణం వంటి పనులకోసం కృషిచేశాను.

నందిగామ మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో మేడా అచ్చయ్యగారు మంచి వ్యక్తి. వైరానదిపైన ఆ గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము, కమ్మవారిపాలెం గ్రామం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కోసం కృషి చేశాను. చందర్లపాడు గ్రామంలోని ఆళ్ళవాగుపై చెక్‌డామ్ నిర్మాణం చేయించాను.

## ***కృషి విజ్ఞాన కేంద్రంల ఏర్పాటు***

కృష్ణాజిల్లాలో రైతులకు వ్యవసాయ అనుబంధ వ్యాపకాలకు సంబంధించిన సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రాల్ని ఏర్పాటు చేస్తూవుంది. అందులో భాగంగా జగ్గయ్యపేట సమీపంలోని గరికపాడు వద్ద ఒక కృషి విజ్ఞానకేంద్రాన్ని నేను వ్యవసాయ మంత్రిగా ఉండగా ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్.రావుగారి పేరుతో ప్రారంభించాను. ఇటీవల జిల్లాలో రెండవ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటుచేసే అవకాశం కలిగింది.




*కృష్ణ జిల్లా గరికపాడులో కృషి విజ్ఞాన కేంద్ర భవన శంకుస్థాపన*

**<u>ఘంటసాలలో రెండవ కె.వి.కె. ఏర్పాటుచేయాలి</u>**

కృష్ణాజిల్లాలో ఘంటసాలగ్రామం ప్రసిద్ధి చెందిన గ్రామం. ఈనాడు ఆ గ్రామానికి సముద్రం అనేక మైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ ఒకానొకప్పుడు ఆ గ్రామానికి దగ్గరగా ఉండేది. ఆ గ్రామంలో ఉన్న జలదీశ్వరా ఆలయంలో విదేశీ యాత్రికులు పూజలు నిర్వహించుకుని వెళ్తూ ఉండేవారు. ఆ రోజుల్లో మన దేశం నుంచి చక్కని వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు తదితర వస్తువులు విదేశాలకు ఎగుమతి అవుతూ ఉండేవి. అందువల్లనే ఈ గ్రామంలో చేనేత కార్మికులు కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ప్రముఖ కాంగ్రెస్ నాయకులు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు ఆ గ్రామ వాస్తవ్యులే. రంగాగారికి ఒకానొక సమయంలో చల్లపల్లి జమీందారుగారు గ్రామంలో దాదాపు వంద ఎకరాల విస్తీర్ణం గల ఘోటకంను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు గ్రామస్తులు ప్రతిఘటించి ఆ ప్రయత్నాన్ని నిరోధించగలిగారు. గొర్రెపాటి వెంకట సుబ్బయ్య (బ్యాంకు సుబ్బయ్య) ఆంధ్రాబ్యాంకులో పనిచేసేవారు. ఉయ్యూరులో చాలాకాలం పనిచేసినప్పుడు నాతో చాలా సన్నిహితంగా ఉంటూవుండేవారు. ఘంటసాలలో బౌద్ధ స్తూపాన్ని పరిరక్షించాలని, ఆ గ్రామంలో త్రవ్వకాల్లో లభించిన వస్తువులతో మ్యూజియంను ఏర్పాటుచేసి, భద్రపరచడానికి ఆయన చాలా కృషి చేశారు. పార్లమెంటు సభ్యుడిగా ఉండగా నేను కూడా ఆయన ప్రయత్నానికి తోడ్పాటునందించాను. ఆ తర్వాత స్తూపం అభివృద్ధి, మ్యూజియంల ఏర్పాటు జరగడం నాకెంతో సంతృప్తినిచ్చింది. గొట్టిపాటి బ్రహ్మయ్య, కిసాన్ వెంకటసుబ్బయ్య, గొర్రెపాటి వెంకట్రాయలుగార్లతో పాటు పండిత

వెంకట సుబ్బయ్య గారితో కూడా మా తాతగారు వడ్డె శోభనాద్రిగారికి మంచి అనుబంధం ఉంటూవచ్చింది. వెంకట్రాయలు గారి కుమారుడు రంగనాథ్ బాబు వారి సోదరులు రూ. 50లక్షలు ఖర్చుతో గుండేరుపైన చెక్‌డామ్ కట్టడం వలన ఘంటసాల పరిసర గ్రామాలకు కొంత మేలు చేకూరింది.

ఐ.సి.ఎ.ఆర్.లో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న వెంకట సుబ్రహ్మణ్యం గారితో ఈ కేంద్రాన్ని ఘంటసాలలో ఏర్పాటుచేస్తే బాగుంటుందని, వరి, అపరాలు, మత్స్య సంపదకు సంబంధించి కార్యక్రమాల్ని నిర్వహించవచ్చని చెప్పాను. ఆ గ్రామానికే సంబంధించి సమర్థత, నిజాయితీ కలిగిన ఐ.ఎ.ఎస్.అధికారిణి శ్రీమతి ఉషారాణి వ్యవసాయ కమీషనర్‌గా ఉండి, ఆమె కూడా ఆ ప్రతిపాదనను సమర్ధించడం వల్ల ఇటీవల ఘంటసాలకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు కావడం చాలా సంతోషాన్ని కలిగించింది. జిల్లా పరిషత్ చైర్మన్ కుక్కల నాగేశ్వరరావు కూడా సహకరించారు. ఇటీవల ఆయన అకస్మాత్తుగా స్వర్గస్తులవడం దురదృష్టం.

***<u>క్రీడల అభివృద్ధి - అయ్యదేవర కాళేశ్వరరావు - సి.కె. నాయుడు గ్యాలరీలు</u>***

విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో రెండు గ్యాలరీల నిర్మాణానికిగాను ఎం.పి. లాడ్స్ నుంచి 10లక్షల రూపాయిలు అందజేశాను. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, త్యాగధనుడైన అయ్యదేవర కాళేశ్వరరావుగారి పేరుతో ఒక గ్యాలరీకి, భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక గుర్తింపుగల సి.కె.నాయుడుగారి పేరుతో



*విజయవాడలోని ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియం*

ఒక గ్యాలరీకి నామకరణం చేయించాను. ఆ స్టేడియంలో ఎం.పి. లాడ్స్‌తోగానీ, ఎం.ఎల్.ఏ నిధులతో గానీ నిర్మించిన గ్యాలరీలకు ఆయా ప్రజా ప్రతినిధులు తమ పేర్లు పెట్టుకున్నారు. వెటర్నరీ కాలనీలో మినీ స్టేడియం కోసం ఒకటిన్నర లక్షలు, ఆర్టీసీ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో జిమ్ ఏర్పాటుకు 1.35 లక్షల రూపాయలు ఎం.పి.లాడ్స్ నిధులనుంచి అందించాను.

## సాంస్కృతిక రంగం

ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు ప్రభుత్వం దుర్గాపురంలో భూమిని కేటాయించింది. ఈ స్థలం మీదుగా కొత్తవంతెన నుంచి రైల్వే గేటు మీదుగా సింగ్‌నగర్ వెళ్లే రహదారి ఉంది. రహదారికి పడమర పక్కనున్న సంగీత కళాశాలకు చెందిన భూమిని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డువారు తీసుకునే ప్రతిపాదన నడుస్తూవుంది. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు నుంచి సంగీత కళాశాలకు నిధులు లభించే విధంగా నా వంతు కృషి చేశాను. రోడ్డుకు తూర్పు పక్కనున్న విశాలమైన ప్రాంగణంలో భారత సంగీత ప్రపంచంలో మన కొక ప్రత్యేక స్థానం కల్పించిన ద్వారం వెంకటస్వామి నాయుడు గారి పేరు మీద బెంగుళూరు నగరంలో ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు చౌడయ్య గారి స్మారకార్థం కర్నాటక ప్రభుత్వం వయొలిన్ ఆకారంలో నిర్మించిన చౌడయ్య మెమోరియల్ హాలు రూపంలో ఇక్కడ నిర్మింపజేయాలని సంకల్పించి, అందుకోసం ఎం.పి. లాడ్స్ నుంచి 10లక్షల రూపాయల నిధులు కేటాయించాను. అప్పటి మేయర్ టి. వెంకటేశ్వరరావుగారు, విజయవాడ నగరంలో సంగీత, నృత్యాలతో సంబంధంగల కె.వి. రెడ్డి, ఈడ్పుగంటి లక్ష్మణరావు మున్నగు పలువురు ప్రముఖులతో సమావేశం జరిపి ఒక కమిటీని ఏర్పాటు చేసి కొంతమంది వదాన్యుల నుంచి సహకారానికి వాగ్దానం తీసుకున్నాము. సంగీత కళాశాలకు కేటాయించిన ఈ స్థలం దాదాపు ఏడు అడుగుల లోతుంది. మునిసిపల్ కార్పొరేషన్ వారు గార్బేజీ వేయడానికి దీన్ని ఉపయోగిస్తూ వచ్చారు. ఆ సంవత్సరం అప్పటికున్న కొద్ది వ్యవధిలో ఈ పని ప్రారంభించడానికి అవకాశం లేకపోయింది. అనంతరకాలంలో కళాశాల భవనాలు నిర్మించబడ్డాయి. ఓపెన్ ఆడిటోరియంను గంగరాజుగారు నిర్మించారు.

ప్రఖ్యాత గాయనీమణి శ్రీమతి రావు బాలసరస్వతిగారికి కర్నాటి లక్ష్మీనరసయ్య, ఈడ్పుగంటి లక్ష్మణరావు ప్రభృతులు వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాలులో చక్కని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నాటి లక్ష్మీనరసయ్యగారు జానపద కళారూపాల అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. సాధారణంగా ఇటువంటి కార్యక్రమాలకు

ప్రముఖ జర్నలిస్టు తుర్లపాటి కుటుంబరావుగారు అధ్యక్షత వహిస్తూ, సభల్ని ఎంతో జనరంజకంగా నిర్వహించేవారు. కుటుంబరావు గారు ఆంధ్రజ్యోతిలో చిరకాలం పనిచేసిన సమయంలో మా తాత గారు వడ్డే శోభనాద్రిగారితో గాఢమైన అనుబంధం ఉంటూ ఉండేది. నా పట్లకూడా ఆయన ఆ విధంగానే అభిమానాన్ని చూపుతూ ఉండేవారు.

***<u>డంకెల్ ముసాయిదాను తిరస్కరించాలి</u>***


పదో లోక్‌సభలో సభ్యుడిగా ఉండగానే, డంకెల్ ముసాయిదాకు భారతప్రభుత్వం ఆమోదం తెలియజేయవచ్చుననే అంశం ప్రచారంలోకి వచ్చింది. మొట్టమొదట ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో మహేంద్రసింగ్ తికాయత్ ఆధ్వర్యంలో జరిగిన డంకెల్ వ్యతిరేక రైతు సదస్సులో పాల్గొన్నాను. ఆ సందర్భంగానే ప్రముఖ జన్యుశాస్త్రవేత్త డాక్టర్ సుమన్ సహాయ్‌తో పరిచయం ఏర్పడింది. వారిని తీసుకువచ్చి 93 మే 7,8,9 తేదీలలో హైదరాబాదు, విజయవాడ, పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి



*మోహన్ ప్రకాష్*



*సుమన్ సహాయ్*



*కె. అశోక్‌రావు*

గూడెంలలో సమావేశాలు ఏర్పాటుచేశాను. 8వ తేదిన జరిగిన విజయవాడ సభలో డాక్టర్ సుమన్ సహాయ్, డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు యం.పి. మోహన్ ప్రకాష్, కె. అశోక్‌రావు (కె.యల్. రావు గారి కుమారుడు) డాక్టర్ కె.యస్. చలపతిరావు, నేను పాల్గొన్నాము. డంకెల్ ముసాయిదా వల్ల భారతదేశ ప్రయోజనాలకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ఏ విధంగా నష్టం వాటిల్లబోతోందో ఆ సమావేశాల్లో తెలియజెప్పడం జరిగింది. ఈ అంశంపై నేను రాసిన అనేక వ్యాసాల్ని ఈనాడు దినపత్రికలో ప్రచురించారు. పార్లమెంటులో నాతో పాటు సి.పి.ఎం.సభ్యుడు రూప్‌చంద్‌పాల్, జనతాదళ్ సభ్యుడు నితీష్‌కుమార్‌తో సహా పలువురం కలసి డంకెల్ ముసాయిదా (గాట్ ఒప్పందం)పై భారత్ సంతకం చేయడం సరైన నిర్ణయం కాదని చెప్పాం. అయినప్పటికీ అప్పటి

వాణిజ్యమంత్రి ప్రణబ్‌ముఖర్జీ గాట్ ఒప్పందం వల్ల ధనిక దేశాలు ఇస్తున్న వ్యవసాయ సబ్సిడీలు తగ్గుతాయని, అందువల్ల ప్రపంచ మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలు పెరిగి, మనదేశం నుంచి ఎగుమతులు పెరగడం వల్ల రైతులకు లాభాలు చేకూరుతాయని నమ్మబలికారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాటల్లోని డొల్లతనం బయటపడింది.

గాట్ ఎనిమిదవ రౌండ్ చర్చలని పిలుస్తారు. అనేక సంవత్సరాలపాటు చర్చలు కొనసాగాయి. అంతకు పూర్వం వ్యవసాయానికి సంబంధించిన అంశాలు గాట్ పరిధిలో లేవు. సభ్యదేశాల మధ్య అభిప్రాయ భేదాలు ఉండడం వల్ల గాట్ అధ్యక్షుడుగా వున్న ఆర్థర్ డంకెల్ ఒక ముసాయిదాను తయారు చేశారు. దీనిని డంకెల్ ముసాయిదా అంటారు. ధనిక దేశాలకు ప్రయోజనకారిగానూ, వర్ధమాన దేశాల్లోని వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగాను రూపొందించ బడింది. ఉరుగ్వే చర్చలు కొనసాగుతున్న సమయంలోనే అమెరికా, యురోపియన్ యూనియన్, జపాన్, కెనడా మున్నగు దేశాల్లో వ్యవసాయం, డెయిరీ రంగాలకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇచ్చారు. వర్థమాన దేశాల్లో నుంచి అభివృద్ధి చెందిన దేశాల్లోకి ఎగుమతి కావడానికి అవకాశం ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై భారీగా కస్టమ్స్ సుంకాలు విధించారు. డంకెల్ ముసాయిదాను ఆమోదించిన తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటయ్యింది. డంకెల్ ముసాయిదాను భారత దేశంతో సహా ఇతర వర్థమాన దేశాలు సరిగ్గా అంచనా వేయలేక పోయాయి. ఎందుకంటే ధనిక దేశాల్లో వ్యవసాయ రంగానికి వారిస్తున్న సబ్సిడీల్లో 20శాతం తగ్గించినా, ఇంకా 80శాతం కొనసాగుతూనే వుంటాయి. అలాగే కస్టమ్స్ డ్యూటీలలో 24శాతం తగ్గినా ఇంకా 76శాతం సుంకాలు కొనసాగుతూనే ఉంటాయి. పైగా ధనిక దేశాల్లో ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాల్సిన అవసరం లేనివి బ్లూబాక్స్, గ్రీన్ బాక్స్ వంటివి కొన్ని ఉన్నాయి. ధనిక దేశాలు వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలు వారి స్థూల దేశీయ ఉత్పత్తిలో (జి.డి.పి.) ఒకటి నుంచి రెండు శాతంగా మాత్రమే ఉంటాయి. వర్థమాన దేశాలు చాలా తక్కువ స్థాయిలో సబ్సిడీలు ఇస్తున్నాయి. నిబంధనల ప్రకారం సబ్సిడీలను ఇంకా ఎక్కువగా ఇవ్వడానికి అవకాశం ఉన్నా వారి దేశాల ఆర్థిక పరిస్థితులు అందుకు అనుకూలించవు. డబ్ల్యూ.టి.వో. అవిర్భావం తర్వాత ఇండియా, బ్రెజిల్‌తో సహా అనేక వర్థమాన దేశాలు జరిగిన పొరపాటును గ్రహించాయి. దోహారౌండ్ చర్చలలో ధనిక దేశాలు వ్యవసాయరంగానికి ఇస్తూ వున్న ఎగుమతి సబ్సిడీలు పూర్తిగా ఆపివేయాలని, ఇతర సబ్సిడీలను బాగా తగ్గించాలని పట్టుబట్టినప్పటికీ ఇప్పటికీ ధనిక దేశాలు అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోలేదు. దురదృష్టకరమైన విషయమేమిటంటే

భారత ప్రభుత్వం ధనిక దేశాల్లోని మల్టీ నేషనల్ కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తూ మనదేశంలో రైతుల ప్రయోజనాలకు గండి కొట్టే విధంగా నిర్ణయాలు చేస్తోంది. అనేక వ్యవసాయ ఉత్పత్తులను సున్నా డ్యూటీతో పామాయిల్, పప్పు ధాన్యాలు, బియ్యం, గోధుమల దిగుమతులను అనుమతించడంతో ఆపంటలు పండించే రైతులకు మన దేశంలో గిట్టుబాటు ధరలు లభించక నష్టపోతున్నారు.

ధనిక దేశాల్లో సబ్సిడీలు తగ్గకపోగా, ఇంకా భారీగా పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గడం, భారత్‌తో సహా ఇతర వర్ధమానదేశాల నుంచి అమెరికా, యూరప్, జపాన్ మొదలైన దేశాలకు ఎగుమతయ్యే వ్యవసాయోత్పత్తుల పైన, ప్రాసెస్ చేయబడిన ఆహారోత్పత్తులపైన హెచ్చుస్థాయిలో సుంకాల విధింపు, శానిటరీ, ఫైటోశానిటరీ ప్రమాణాల పేరిట అడ్డంకులు కలిగించడంవల్ల వర్ధమానదేశాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో డబ్ల్యూ.టి.ఓ. వలన మన భారతదేశం ఇతర వర్ధమాన దేశాలకు అందులోని షరతులు నష్టపరచే విధంగా ఉన్నాయో సవివరంగా ఈనాడు లోనూ, 'వార్త' దినపత్రికలోనూ వ్యాసాలద్వారా తెలియపరచాను.

***<u>తెలుగుదేశంలో చీలిక - కాంగ్రెసుకు లాభం</u>***

రాజ్యసభలో సభ్యుడిగా వున్న ఉపేంద్ర తనకు లభించిన పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధుల్ని పశ్చిమ గోదావరి జిల్లాలో వినియోగించారు. ముందు ఏలూరు పార్లమెంటు స్థానానికి పోటీచేద్దామనే సంకల్పంతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీలో చీలిక సంభవించిన తర్వాత, నేను చంద్రబాబునాయుడితోవున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో, ఉపేంద్ర ఎన్.టి.రామారావు గారి నేతృత్వంలో వున్న తెలుగుదేశం పార్టీ తరఫున దేవినేని నెహ్రూను పోటీ చేయించడానికి అవగాహన కుదుర్చుకుని, విజయవాడ లోక్‌సభ స్థానానికి పోటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలిచారు. తెలుగుదేశం పార్టీ ఓట్ల చీలిక వల్లను, భారీగా ధన వ్యయం చేసిన కారణంగానూ ఉపేంద్ర విజయం సాధించారు. ఆ ఎన్నికల సమయంలో పోలింగ్ రోజున నందిగామలో జరిగిన సంఘటన మరచిపోలేనిది. ఒక పోలింగ్ కేంద్రం సమీపంలో నేను, ఇంకా అప్పటి నందిగామ శాసనసభ్యుడు దేవినేని వెంకటరమణ ఉన్నాం. ఎటువంటి కారణం లేకుండా రమణ అనుచరుడైన గోపాలరెడ్డిని నెహ్రూ అనుచరులు అన్యాయంగా, దారుణంగా హత్యచేశారు. 1996 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వచ్చాను.

# రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా..

**మ**న రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయాన్ని కొనసాగించడానికి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నన్ను చంద్రబాబు ప్రభుత్వం నియమించింది. పది సంవత్సరాల పాటు లోక్‌సభలో చురుగ్గా పాల్గొనివుండడం, ప్రజల సమస్యల విషయంలో తరచుగా మంత్రుల్ని కలసి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి కారణాల వల్లను, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబునాయుడు గారి దీక్షాదక్షతలు, గౌరవం వంటి కారణాల వల్ల కేంద్ర మంత్రుల నుంచి చాలా అంశాల్లో అనుకూలంగా స్పందన వస్తూ వుండేది. ఆర్థిక సంక్షోభంలో



న్యూ ఢిల్లీలో ఎ.పి. భవన్



న్యూ ఢిల్లీలో హైదరాబాద్ హౌస్

పీకలలోతు కూరుకుపోయిన సింగరేణి కాలరీస్‌ను కొంత వరకు దరిచేర్చడం, మన రాష్ట్రం నుంచి బియ్యం సేకరణ, స్వర్ణరకాన్ని ఫైన్ వెరైటీగా కొనుగోలు చేయించడం జరిగాయి.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లోనే ఏర్పాటు చెయ్యటానికి కనీసం పదివేల చదరపు అడుగుల కార్యాలయ భవన సముదాయం, నాలుగు రెసిడెన్షియల్ క్వార్టర్స్ (స్టాఫ్ కోసం) అవసరమని యుజిసి నుంచి అందుకున్న సమాచారాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి దృష్టికి తీసుకువెళ్ళి, అందుకు అవసరమైన చర్యలు తీసుకునేటట్లు చేశాను.

కేంద్రప్రభుత్వంలో వివిధ శాఖల వద్ద అమలుచేయ సంకల్పించిన పథకాలద్వారా మన రాష్ట్రానికి అదనంగా నిధులు రాబడుతూ ఆయా పథకాలద్వారా రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ప్రగతికి దోహదపడేటట్లుగా న్యూఢిల్లీ సమాచారాన్ని రాష్ట్రప్రభుత్వానికి తెలియపరచి, అక్కడినుంచి ప్రతిపాదనలు కేంద్రప్రభుత్వ శాఖలకు వచ్చేటట్లుగా నావంతు కృషిచేశాను.



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద టెయిల్‌పాండ్ డ్యామ్ నిర్మాణం చేసి, అక్కడినుంచి నీటిని తిరిగి సాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసే సందర్భంలో రాజీవ్‌గాంధీ వైల్డ్‌లైఫ్ శాంచ్యోరీకి చెందిన 81 హెక్టార్ల విస్తీర్ణానికి అనుమతి ఇవ్వాల్సిందని నాటి ప్రధాని వాజ్‌పేయిగారిని, పర్యావరణ, అటవీశాఖలమంత్రి సురేష్‌ప్రభుగారిని కోరాను.

చెన్నై నుంచి ఆవడి, తిరువళ్లూర్, తిరుత్తణి, నగరి, రేణిగుంట రహదారిని జాతీయరహదారిగా తీసుకోవాలని ఉపరితల రవాణాశాఖ మంత్రి తంబిదొరైగారిని కోరాను.

చర్ల నుంచి గోదావరి నదిపైన రాజమండ్రి వరకు కాకినాడ – చెన్నై కాలువను, గోదావరి, కృష్ణా (బకింగ్‌హామ్) కెనాల్‌ను అభివృద్ధి చెయ్యాలని కోరాను.

విశాఖపట్నం పోర్టులో ఎ.పి.ఎస్.ఇ.బి., హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల రిఫైనరీ రెసిడ్యూ బేస్డ్ పవర్‌ప్లాంటుకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. నితీష్‌కుమార్ రైల్వేమంత్రిగా ఉండగా కొవ్వూరు–భద్రాచలం రైల్వేలైనును నిర్మించాలని, ముత్కేరీ నుంచి నిజామాబాద్ రైల్వేలైనును బ్రాడ్‌గేజిగా అభివృద్ధిచెయ్యాలని, పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ నూతన రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితంగా పూర్తిచెయ్యాలని, రేణిగుంటనుంచి తిరుపతికి రైల్వేలైనును ప్రయాణికుల సౌకర్యార్థం డబ్లింగ్ చెయ్యాలని, హైదరాబాద్–సికిందరాబాద్ జంటనగరాల సబర్బన్ రైల్వేసర్వీసును విస్తృతపరచాలని, గద్వాల్ నుంచి రాయచూరుకు నూతన రైల్వేలైనును వెయ్యాలని, ధర్మవరం నుంచి పాకాలకు మీటర్‌గేజిగా ఉన్న లైనును

బ్రాడ్‌గేజిగా మార్చడంవల్ల ఎంతగానో ఉపయోగంగా ఉం టుందని 1998 మే 13వ తేదీన నేను, పార్లమెంటరీపార్టీ నాయకుడుగావున్న ఎర్రంనాయుడుగారు, ఎం.పి.పైడితల్లి నాయుడు, స్పెషలాఫీసర్ ఎ.ఎ. రావు కలసి రైల్వేమంత్రి నితీష్‌కుమార్ గారితో సంప్రదించాం. మన రాష్ట్రానికి సంబంధించి రైల్వేశాఖలో పెండింగ్‌లోవున్న సమస్యల గురించి వివరంగా చర్చించాం. వైజాగ్‌నుంచి బెంగుళూరుకు ఒక ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టడానికి, హౌరా – మద్రాసు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు, ఇంకా హౌరా–మద్రాసు మెయిల్‌కు మూడు అదనపు బోగీల్ని కలపడానికి రైల్వే అధికారులు అంగీకరించారు. కుప్పం వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి, పెద్దపల్లి–కరీంనగర్ రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు, కాట్పాడి–పాకాల లైనును అభివృద్ధి చెయ్యడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కుప్పం వద్ద లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్‌ను నిలపడానికి, నౌపడా – గున్‌పూర్ లైనును అభివృద్ధి చెయ్యడానికి కూడా అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిని లభింపజేస్తే బాలయోగిగారు కోరుతూవున్న కాకినాడ–కోటిపల్లి లైనును పునరుద్ధరిస్తామని నితీష్‌కుమార్ హామీ ఇచ్చారు.

## *కష్టాల కడలి నుండి బయటపడ్డ విశాఖ ఉక్కు*

నేను, పార్లమెంటరీ పార్టీ నాయకుడు ఎర్రంనాయుడుగారు 1998 మే3న ఉక్కుశాఖ మంత్రి నవీన్ పట్నాయక్‌గారిని కలసి విశాఖపట్నం ఉక్కుఫ్యాక్టరీకి గతంలో కేంద్రప్రభుత్వం అందించిన రుణాన్ని ఈక్విటీగా మార్చాలని, రుణంపైన వడ్డీని మాఫీ చేసి బి.ఐ.ఎఫ్.ఆర్. వద్దకు వెళ్ళకుండా తప్పించాలని, రెండవ స్టీల్ మెల్టింగ్ షాపును ఏర్పాటు చేసి స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని కోరాం. దానిపైన నవీన్ పట్నాయక్‌గారు ఆర్థికశాఖ మంత్రితో మాట్లాడి, తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఉక్కు ఫ్యాక్టరీ కింద ఉన్న భూమిలో 1100 ఎకరాలను గంగవరం మైనర్‌పోర్టు అభివృద్ధికి కేటాయించాలని కోరాం. నవీన్ పట్నాయక్‌గారు 1998 ఆగస్టు 11న జవాబు రాస్తూ, రూ.1333 కోట్ల రుణాన్ని ఈక్విటీగా మార్చినట్లు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సమగ్ర అభివృద్ధి పథకాన్ని రూపొందించడానికి కన్సల్టెంటును ఏర్పాటుచేసినట్లు తెలియజేశారు.



## పత్తిరైతులకు ఎక్స్‌గ్రేషియో

రాష్ట్రంలో పత్తిపంట కరవువల్ల, దుర్భిక్షంవల్ల, చీడపీడల కారణంగా దెబ్బతినడం, గిట్టుబాటుధరలు లేకపోవడం, అప్పుల భారంవల్ల ఎంతోమంది రైతులు 1997వ సంవత్సరంలో ఆత్మహత్యలు చేసుకోవడం ప్రారంభమయ్యింది. మన రాష్ట్రప్రభుత్వం నేరుగా ఇటువంటి దురదృష్టకర పరిస్థితికి కారణం కాకపోయినప్పటికీ రైతుల సంక్షేమంకోసం కట్టుబడివున్న ప్రభుత్వం కనుక ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు సహాయం చేయడం సముచితంగా ఉంటుందని 1997 డిసెంబర్ 20న పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఫారం ఫౌండేషన్ డైరెక్టర్ చెంగలరెడ్డి లేఖను కూడా జతపరచి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి పంపించాం. కేంద్రప్రభుత్వం 50 వేల రూపాయలు, రాష్ట్రప్రభుత్వం 50 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహకారాన్ని అందించడమేగాక ఋణభారాన్ని వాయిదా వేయించడం జరిగింది. చీడపీడలవల్ల చేకూరిన నష్టం కూడా ప్రకృతి వైపరీత్యాలవల్ల సంభవించే నష్టం మాదిరిగానే పంటల బీమా కింద పరిహారం పొందడానికి అర్హత కలిగేవిధంగా కృషిచేయడం జరిగింది.

హైదరాబాద్‌కు సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందుకు అవసరమయిన భూమిని సమకూర్చివున్నందు వల్ల 'నేషనల్ రీసెర్చి సెంటర్ ఆన్ మీట్'ను వెంటనే ఏర్పరచాలని వ్యవసాయశాఖ మంత్రి సోంపాల్‌గారిని అభ్యర్థించాను.

ఆలిండియా రేడియోలోనూ, దూరదర్శన్ కేంద్రంలోనూ వ్యవసాయరంగానికి సంబంధించిన కార్యక్రమాల్ని రూపొందించడానికి వ్యవసాయశాస్త్రంలో డిగ్రీగానీ, డిప్లమోగానీ చేసినవారిని నియమించాలని కోరగా, సమాచార, ప్రసారాలశాఖ సహాయమంత్రిగా ఉన్న ముక్తియార్ అబ్బాస్ నక్వీ కొంతకాలంగా యు.పి.ఎస్.సి. ద్వారా ఫారమ్ రేడియో ఆఫీసర్స్ కేడర్‌కు సంబంధించి రిక్రూట్‌మెంటు జరగలేదని, అందువల్ల కొరతవున్న మాట వాస్తమేనని అంగీకరిస్తూ, ప్రసారభారతి ఈ విషయమై చర్యలు చేపట్టే సమయంలో నేను చేసిన సూచనను పరిగణనలోకి తీసుకుంటుందని 1998 అక్టోబర్ 27న తెలియపరిచారు.

నెల్లూరు సమీపంలో ఇఫ్‌కో వారి చేత నిర్మించ తలపెట్టిన యూరియ ఫర్టిలైజర్ ప్రాజెక్ట్‌కు పబ్లిక్ ఇన్‌వెస్ట్‌మెంట్ బోర్డు నుంచి త్వరగా క్లియరెన్స్ ఇవ్వాలని 30 ఏప్రిల్ 1998న ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి సూర్జిత్‌సింగ్ బర్నాలా గారిని కోరాను. నూతనంగా దేశంలోపల ఎరువుల ఉత్పత్తిని పెంచడానికి తీసుకోవలసిన విధాన పరమైన

చర్యలు రూపొందించిన దరిమిలా ఈ అంశంపైన తగిన చర్యలు తీసుకుంటామని 1998 జూలై 22న జాయింట్ సెక్రటరీ ఫర్టిలైజర్స్ కె.కె. జైస్వాల్ తెలియజేశారు. దాదాపు 15 సంవత్సరాలు గడచిపోతున్న ఈనాటికి నెల్లూరు సమీపంలో ఇఫ్కో యూరియా ప్లాంట్ రాకపోవడం భారత వ్యవసాయ రంగ అవసరాలపట్ల కేంద్రంలోని పాలకుల నిర్లక్ష్య వైఖరికి ప్రబల తార్కాణం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేకరించిన ధాన్యం / బియ్యంనకు గోధుమ సేకరణకు ఇస్తూవున్న మాదిరిగా బోనస్‌ను ఇవ్వాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి బర్నాలాగారిని కలసి విజ్ఞప్తి చేశాను.

1966 సీడ్‌బిల్లు (విత్తనచట్టం) రైతుల ప్రయోజనాల్ని పరిరక్షించడానికి అనుగుణంగాలేదని, డాక్టర్ ఎం.వి.రావు కమిటీ సిఫార్సులను దృష్టిలో వుంచుకుని సీడ్‌యాక్టుకు సవరణలు తీసుకురావాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి ప్రభుత్వం కోరుతున్న విషయాన్ని, 1968 ఇన్‌సెక్టిసైడ్ యాక్టుకు సవరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకతను 1998 జూలై 20న వ్యవసాయశాఖ మంత్రి సోంపాల్‌ను కలసి చర్చించాను. వ్యవసాయరంగంలో ఉపయోగించే వ్యవసాయ పరికరాలపై దిగుమతి సుంకాన్ని ముఖ్యంగా చెరకు నరికే యంత్రాలపై దిగుమతి సుంకాన్ని బాగా తగ్గించి వాటి ధరలు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయిగారిని కోరాను. వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి కె.ఎం. చడ్డాగారు ఈ అంశాన్ని వ్యవసాయశాఖలో చర్చించి షుగర్‌కేన్ హార్వెస్టర్ పైన దిగుమతి సుంకాన్ని 25 శాతానికి తగ్గించాలని ఆర్థికమంత్రిత్వశాఖ రాసినట్లుగా 1997 మార్చి 21న నాకు తెలియపరిచారు.

పొగాకు రైతులకు సంబంధించిన సమస్యలపైన చంద్రబాబునాయుడుగారు రాసిన లేఖను జతపరుస్తూ సత్వరమే దానిపైన చర్యలు తీసుకోవాలని నాటి వాణిజ్యశాఖమంత్రి రామకృష్ణ హెగ్డేగారిని కోరాను.

నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో రైతులకు మేలు కలిగేలా ప్రీమియం భారం తగ్గించాలని, పంటనూర్పిడి వరకు బీమాపథకం వర్తించాలని, ఇంకా ఇటువంటి అనేక సూచనలతో వ్యవసాయమంత్రి సోంపాల్‌గారిని 1999 జూలై 2న కోరడం జరిగింది.

మనదేశం ప్రపంచంలో గుడ్ల ఉత్పత్తిలో 5వ స్థానంలోను, బ్రాయిలర్ కోడిమాంసం ఉత్పత్తిలో 22వ స్థానంలో ఉన్నప్పటికీ, తలసరి గుడ్ల వినియోగం సాలుకు 60, కోడిమాంసం వినియోగం చాలా తక్కువ ఉండి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐ.సి.ఎం.ఆర్) పేర్కొన్న సంవత్సరానికి 180 గుడ్లు, 11 కేజీల మాంసం కాగా, పౌల్ట్రీరంగాన్ని బాగా

ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత దృష్ట్యా ప్రీమియం ఫ్రాంచైజ్ ఫర్టైల్ కోడిగుడ్లను దిగుమతి చేసుకోవడానికి వెస్టర్న్ హేచరీస్ వారికి దిగుమతి లైసెన్సును మంజూరుచేయవలసిందిగా సోంపాల్‌గారిని కోరాను.

కడపజిల్లాలోని మైదుకూరు, కర్నూలు జిల్లాలోని చాగలమర్రి ప్రాంతాల్లో రైతాంగం పండించే కె.పి. ఉల్లి పాయల్ని 'నాఫెడ్' ద్వారా కొనుగోలు చేయించి, ఎగుమతి చేసి రైతుల్ని ఆదుకోవాలని 1998 డిసెంబర్ 28న సోంపాల్‌గారికి విజ్ఞప్తి చేశాను.

***<u>పాడిపరిశ్రమకు కావలసిన మోలసిస్‌పై డ్యూటీ తీయండి</u>***

మనదేశంలోనే ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ పదిలక్షలమంది సభ్యులతో రెండవ అతిపెద్ద సంస్థ. పాలను ఆరునెలల వరకు నిల్వ ఉంచి వాటిని ఈశాన్య ప్రాంతాలకు, సైన్యం అవసరాలకు అందించడానికి, విదేశాలకు ఎగుమతి చేయడానికి HPST స్టెబిలైజర్, ప్యాకింగ్ ప్లాంటును ఇండో్‌ఫ్రెంచ్ ప్రొటోకాల్ కింద ప్రత్యేకమైన విషయంగా పరిగణించి దిగుమతి సుంకాన్ని మినహాయించి ఈ పరికరాల్ని దిగుమతి చేసుకోవడానికి వీలు కలిగించాలని ఆర్థికమంత్రి జస్వంత్‌సిన్హాగారిని 1998 మార్చి 26న కోరాను. గుత్తా సుఖేందర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదన నడిచింది. మద్రాసు పోర్టులో దిగుమతి అయిన తర్వాత దీర్ఘకాలంపాటు పోర్టులోనే ఉండి పోయింది. మొదట్లో హైదరాబాద్‌లో ఎ.పి.డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ సామాగ్రి అక్కడ తగినంత పాల లభ్యత లేనందువల్ల ఒంగోలులోని కో ఆపరేటివ్ డెయిరీవారికి పంపబడింది. అక్కడకూడా అది చాలాకాలంపాటు బాక్సులలోనే ఉండిపోయిందన్నది నా సమాచారం. సరైన అవగాహన లేకుండా ఆర్డర్ ఇచ్చినందువల్ల ఎ.పి.డెయిరీకి లక్షలరూపాయల విలువచేసే ఎక్విప్‌మెంటు ఉపయోగం లేకుండాపోయింది. డెయిరీ రంగాన్ని ప్రోత్సహించడంకోసం పశువుల దాణాలో ఉపయోగించే మొలాసిస్‌పైన ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని జస్వంత్ సిన్హాగారిని కోరాను.

హనుమాన్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీవారు రైతులకు సరఫరా చేసిన చెరకునకు పైకం చెల్లించడానికి 1999 ఏప్రిల్, మే నెలల్లో విడుదల చేయాల్సిన పంచదారకు తోడు అదనంగా రెండు వేల టన్నుల పంచదారను అమ్ముకునేందుకు అనుమతినివ్వాలని, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి బర్నాలాగారిని 1999 మార్చి 10న కలసి అభ్యర్థించాను.

మామిడిపండ్ల ఉత్పత్తిలో భారతదేశానిదే మొట్టమొదటి స్థానం. మనదేశం నుంచి యు.కె. యూరప్, దూరప్రాచ్య, గల్ఫ్ దేశాలకు మన మామిడిపండ్లను ఎక్కువరోజులు నిల్వ ఉండేవిధంగా చేయడానికి అవసరమయ్యే ఇథలిన్ అబ్జార్బెంట్ ప్యాడ్స్, హైటెక్ ఫ్రూట్‌కోటింగ్స్, కంట్రోల్డ్ ఎట్మాస్పెరిక్ రీఫర్స్‌లకు అయ్యే వ్యయంలో 50 శాతాన్ని సబ్సిడీగా ఇచ్చి, మామిడిపండ్ల ఎగుమతికి ఇతోధికంగా మద్దతునివ్వాలని కోరాను. ఈ పండ్ల ఎగుమతి విషయంలో నిత్వ ఉండే కాలం పొడగించబడడానికి కంట్రోల్డ్ ఎట్మాస్ఫిరిక్ రీఫర్స్‌ను వినియోగించడానికి రైతులకు సబ్సిడీని అందించాలని వాణిజ్య శాఖ మంత్రి రామకృష్ణ హెగ్డే గారిని 98 జూన్ 12న కోరాను.

ఎగుమతులను ప్రోత్సహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలను కూడా ఇన్‌వాల్వ్ చేసేవిధంగా అదనపు ఎగుమతులలో 20శాతాన్ని రాష్ట్రాలకు అందించే విధంగా న్యూ ఎగ్జిమ్ పాలసీలో పొందుపరిస్తే బాగుంటుందని రామకృష్ణ హెగ్దే గారికి విజ్ఞాప్తి చేశాను.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో కోల్డ్ స్టోరేజ్ మున్నగు ఇతర వసతులు సమకూర్చే అంశం, శంషాబాద్ వద్ద ఇంటర్‌నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి, తాడేపల్లిగూడెం వద్ద ఒక కోటి రూపాయలు రక్షణ శాఖకు ఇచ్చి కొంత భూమిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, తిరుపతిలో మంజూరు అయిన పాస్‌పోర్ట్ ఆఫీసునిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని చూపడం, నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ డ్యామ్ నిర్మాణం విషయంలో వైల్డ్ లైఫ్ కమిటీనుంచి అనుమతి పొందడానికి గానూ ప్రధానమంత్రికి లేఖ రాయవలసిన ఆవశ్యకత, గంగవరం మైనర్ పోర్టు అభివృద్ధి కోసం విశాఖ స్టీల్ ప్లాంట్ వారికిచ్చిన భూమిలో 1100 ఎకరాలు తీసుకునే నిమిత్తం విశాఖపట్నం నగరానికి సమీపంలో నాలుగువందల ఎకరాలు స్టీల్ ప్లాంట్ వారికి ఇవ్వాల్సిన అంశాలపైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారిని 1999 ఏప్రియల్ 13న హైదరాబాదులో కలసి కోరడం జరిగింది.

విజయవాడ యస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కాలేజీలో జూనియర్ ఇంటర్‌మీడియట్‌లో ఉర్దూ మీడియం తరగతులు మంజూరు చెయ్యాలని 1999 ఏప్రియల్ 4న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారిని కోరాను.

వ్యవసాయ ఉత్పాదకాల ధరలు చాలా ఎక్కువగా పెరిగినందువల్ల కేంద్రప్రభుత్వం ప్రకటించిన యమ్.యస్.పి. పైన క్వింటాల్ ధాన్యానికి 60రూపాయలు బోనస్‌గా ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు కోరిన అంశాన్ని 1998 మే 13న ప్రదానమంత్రి వాజ్‌పేయిగారికి విజ్ఞాప్తి చేశాను.

మన రాష్ట్రానికి సంబంధించిన కొన్నిఅంశాలపై చర్చించడానికి 5 ఆగష్టు 98న కేంద్ర ఎన్విరాన్‌మెంట్, అండ్ ఫారెస్ట్ మినిష్టర్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఇతర పనుల ఒత్తిడివల్ల ముఖ్యమంత్రిగారు రాలేని పరిస్థితుల్లో నేను ఆ సమావేశంలో పాల్గొని ఫారెస్ట్ క్లియరెన్స్ కు సంబంధించిన అంశాలపై చర్చించాం.

రాజమండ్రి సమీపంలో అప్పటి లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి గారి చొరవవల్ల ప్రాంతీయ కార్యాలయ భవన నిర్మాణం ప్లింత్ దశ వరకు వచ్చివున్నదని, దానికి అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరితంగా ఆ భవన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి తగిన చర్యలుతీసుకోవాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి రామమూర్తిగారిని కోరాను.

చర్ల–రాజమండ్రి మరియు కాకినాడ–చెన్నైలను జాతీయ జలమార్గంగా తీసుకోవలసిన ఆవశ్యకతను గురించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని 1996 ఫిబ్రవరి 20న కోరిన విషయాన్ని గుర్తు చేస్తూ దీనిపైన త్వరగా నిర్ణయం తీసుకోవలసిందిగా 1998 అక్టోబరు 9న కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి తంబిదురైగారికి విజ్ఞప్తి చేశాను.

కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోగానీ, అనంతరం వాజ్‌పేయిగారి ప్రభుత్వంగానీ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వాన్ని అభిమానిస్తూ, సహకారాన్ని అందిస్తూవచ్చారు. కొన్ని సందర్భాల్లో అంతకుముందు కేంద్రం తీసుకున్న నిర్ణయాల విషయంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేఖలు రాయడం, ఢిల్లీ వచ్చినప్పుడు మంత్రుల్ని కలవడం, వారితోపాటు నేను ఉంటూ ఆ సమస్యల్ని విడవకుండా ఫాలోఅప్ చేయడంవల్ల అనేక విషయాల్లో మన రాష్ట్రానికి ఉపయోగం చేకూరింది. ఉదాహరణకు 1. కేంద్రీకృత స్పాన్సర్డ్ స్కీమ్‌కు ప్రాథమిక విద్యను కూడా చేర్చాలన్న విషయంలోనూ, 2. అలాగే మంచినీటి సరఫరాకు విడుదలచేసే నిధుల విషయంలో నార్మెటివ్ అప్రోచ్ నుంచి పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ క్రైటీరియాను ఆధారంగా చేసుకోవడం, 3. రాష్ట్ర ప్రభుత్వాలకు లక్డావాలా మెథడాలజీని అనుసరించడంవల్ల నిధుల పంపిణీలో రాష్ట్రాలకు చేకూరే నష్టాన్ని బాగా తగ్గించే విధానాన్ని ఆమోదించడం, **4. బి.ఐ.ఎఫ్.ఆర్.కు వెళ్ళకుండా విశాఖపట్నం స్టీలుప్లాంటుకు సహాయంచేయడం, 5. అత్యంత గడ్డుస్థితిలోఉన్న సింగరేణి కాలరీస్ సంస్థకు ఉన్న 633 కోట్ల రూపాయల బకాయిని సింగరేణి కాలరీస్‌కు ప్రయోజనకరంగా ఉండేవిధంగా మారటోరియం ప్రకటింపచేయడం,** 6. నెల్లూరులో ఇఫ్కో ఫెర్టిలైజర్ ప్లాంటు స్థాపనకు అంగీకరింపజేయడం, 7. విశాఖపట్నంలోని ఎన్.టి.పి.సి.ప్లాంటులో ఉత్పత్తయ్యే విద్యుత్తు మొత్తాన్ని మన

రాష్ట్రానికే కేటాయించడం, 8. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ స్కీము విషయంలో పర్యావరణశాఖ పున:పరిశీలనకు అంగీకరింపజేయడం,

ఇవిగాక 1. పులిచింతల ప్రాజెక్టు, కృష్ణాడెల్టా ఆధునీకరణ, భీమా ఎత్తిపోతల పథకం, ఎస్.ఆర్.ఎస్.పి. రెండవదశ, ఫ్లడ్‌ఫ్లో కెనాల్ పథకాలకు టెక్నో ఎకనామిక్ క్లియరెన్స్‌లు సాధించడం జరిగింది. 2. 1971 ఇన్‌సెక్టిసైడ్ రూల్స్ సవరించబడినందువల్ల చీడపీడలవల్ల కలిగే నష్టాన్ని ప్రకృతి వైపరీత్యంగా అంగీకరింపజేయడం, 3. తీవ్రమైన రుణభారంతో కుంగిపోతూవున్న రైతుల రుణగ్రస్తత అంశాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేయడానికి అంగీకరింపజేయడం, 4. పత్తి, మిర్చి వంటి వాణిజ్యపంటలకు క్రాప్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని విస్తరింపజేయడం. 5. 23 వేస్ట్‌లాండ్ డెవలప్‌మెంటు ప్రాజెక్టులు, 896 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు మన రాష్ట్రానికి మంజూరుచేయించడం. 6. కొత్తగా 50వేల డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయించడం, 7. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అంతకుముందున్న 2945 కిలోమీటర్ల జాతీయ రహదార్లకు అదనంగా 1034 కిలోమీటర్ల నిడివిగల అయిదు జాతీయ రహదార్లను మన రాష్ట్రానికి మంజూరు చేయించడం, 8. గద్వాల్–రాయచూర్, నంద్యాల–ఎర్రగుంట్ల, కాకినాడ–పిఠాపురం కొత్త రైల్వేలైన్లు అనేకచోట్ల రైల్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయి. 9. వైజాగ్ – బెంగుళూరు, తెనాలి – హైదరాబాద్, న్యూఢిల్లీ – సికిందరాబాద్ రాజధాని, రాజమండ్రి – సికిందరాబాద్ శతాబ్ది రైళ్ళు ప్రవేశపెట్టబడ్డాయి. 10. హైదరాబాద్ సమీపాన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మించబడడానికి, తిరుపతి, విజయవాడ, వైజాగ్ ఎయిర్‌పోర్టులను అప్‌గ్రేడ్ చేయడానికి నిర్ణయం తీసుకోబడింది. 11. ఆధునికీకరించబడిన హైదరాబాద్ డొమెస్టిక్ టెర్మినల్‌కు ఎన్.టి.రామారావు గారి పేరు పెట్టబడింది. 12. గ్రామీణ పేద మహిళలకు 10 లక్షల ఎల్.పి.జి గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. 13. వైజాగ్ స్టీలుప్లాంటువద్ద అదనంగా ఉన్న భూమిని గంగవరం పోర్టు అభివృద్ధికి కేటాయించారు. 14. ఐ.డి.పి.ఎల్. రివైవల్ ప్లాను పరిశీలనకు తీసుకోబడింది. 15. స్వర్ణమసూరి ధాన్యం రకాన్ని ఫైన్ వెరైటీగా ప్రకటింపచేయడం, 16. రాష్ట్రంలో వరదలు, అధికవర్షాలు సంభవించినప్పుడు ధాన్యం/బియ్యం సేకరణ ప్రమాణాల్ని సడలింపజేయడం, 17. రాష్ట్ర అవసరాలకు సరిపడా ఎరువుల్ని కేంద్రంనుంచి పొందడం, 18. కె.పి. ఉల్లిపాయల్ని కొలుగోలు చేయించడం, 19. ఎకనామిక్ రీస్ట్రక్చరింగ్ పథకం కింద 1300 కోట్ల రూపాయల నిధులు పంచడం, 20. సంవత్సరానికి 150 కోట్ల రూపాయలు అదనంగా గ్రామీణాభివృద్ధి కోసం సాధించడం మొదలైన అనేక అంశాల్లో రాష్ట్రానికి

మేలు చేకూరేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నా వంతు కృషి చేశాననే సంతృప్తి నాకుంది.

పరిపాలనా వ్యవస్థలో సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ప్రతిజిల్లాలోనూ కలెక్టర్ కార్యాలయాల వరకు విస్తరించడానికి 'సీడా' (కెనడియన్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు) అనుమతికి, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ప్రమోట్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖమంత్రి జగ్‌మోహన్‌కు విజ్ఞప్తి చేసి, సహాయమంత్రి కబీంద్ర పురకాయిస్తాతో 1998 మే 13న సమావేశం కావడం జరిగింది. ఈ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ పనిని నా మిత్రులు తోట్లవల్లూరు వాస్తవ్యులు పొట్లూరి కృష్ణారావు కుమారుడు రాజమోహనరావు అమలు చేశారు. రాజమోహనరావు అధిక లాభాన్ని ఆశించే వ్యక్తి కాదు. ఇతర పోటీదారులతో పోలిస్తే చాలా తక్కువ రేటుకే ఈ పనిని చేపట్టారు.

భారతదేశంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసే నిమిత్తం భారత ప్రభుత్వం తరఫున వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ చేపట్టిన అధ్యయనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విస్మరించడం సమంజసం కాదని, ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నగరంలో పర్యాటకపరంగా చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఫలక్‌నుమా ప్యాలెస్, చౌమహల్ ప్యాలెస్, గోల్కొండ ఫోర్ట్ మున్నగు పలు ప్రసిద్ధి చెందిన ప్రదేశాలు ఉన్నాయని తెలిపాను.

గుర్విందపల్లిలో బాసంశెట్టి మస్తాన్‌రావు, బసవకోటి మున్నగువారి అభ్యర్థనపై గుర్విందపల్లి వద్ద, ఘంటా రామచంద్రరావు, కొడాలి రంగారావు, ఘంటా మల్లేశ్వరరావు మున్నగు వారి అభ్యర్థనపై కె.ఇ.బి.కెనాల్‌పైన లంకపల్లి వద్ద వంతెనలను నిర్మింపజేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిని, ఇరిగేషన్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని ఒప్పించి మంజూరు చేయించాను. ఈ రెండు వంతెనలకు తుమ్మల నాగేశ్వరరావుగారు శంఖుస్థాపన చేయగా, నేను అన్నే బాబూరావుగారు పాల్గొన్నాము. ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు వారిని ఒప్పించి పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంటు వారి చేత ఈ నిర్మాణ కార్యక్రమాలను చేయించాను.

పార్లమెంటులో పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వున్న సమయం నుంచి పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగాను. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న కె.ఎస్.బోస్, కె.వి.సురేష్, పద్మనాభన్‌లు ఢిల్లీలో నా కార్యాలయ సిబ్బందిగా నాకు మంచి తోడ్పాటునందించారు.

కె.యస్. బోస్‌ది నెప్పల్లి గ్రామం. నిజాయితీతో, నిబద్ధతతో తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూండేవాడు. కె.వి. సురేష్ నేను ఎం.పి.గా ఉండగా విజయవాడలో సిద్దార్ధ కాలేజీలో చదువుతూ 10వ లోక్‌సభ ఎన్నికల్లో నాకు సన్నిహితుడై మా ఇంట్లోనే ఉంటూ కుటుంబసభ్యుడిగా మెలుగుతూ వచ్చాడు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నాకున్న పట్టుదలను అర్థం చేసుకుని నేను చేపట్టిన పనులు / పథకాలను సురేష్ ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తూ చాలా చక్కని కృషి చేశాడు. ఎ.పి. భవన్‌లో ఏ.ఏ. రావు చాలా తోడ్పాటును అందిస్తూ ఉండేవారు. అప్పట్లో లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న జి.యం.సి. బాలయోగి గారు కూడా అవసరమైన సందర్భములలో ఎంతో సహకారాన్ని అందించారు. బాలయోగి గారు మంచి హృదయమున్న వ్యక్తి. అతి పిన్న వయస్సులో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోవడం మన రాష్ట్రానికి ప్రత్యేకంగా తెలుగుదేశం పార్టీకి తీవ్రమైన నష్టం. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు యర్రంనాయుడు కూడా చాలా మంచి సహకారాన్ని ఇచ్చారు.

1999 శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. నేను మధ్య మధ్యలో ఢిల్లీ నుంచి హైదరాబాదు, ఉయ్యూరు వచ్చి వెళ్తుండేవాడిని. ఉయ్యూరు శాసనసభ్యుడు అన్నే బాబూరావుది యలమర్రుగ్రామం. నేను ఉయ్యూరు శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో అన్నే బాబూరావు గారు కూడా ఇంజనీరింగ్ పట్టభద్రుడైనప్పటికీ ఆయన తండ్రిగారు అన్నే వెంకట కృష్ణయ్యగారు వృద్ధాప్యంలో ఉన్న కారణంగా రైస్‌మిల్లును నిర్వహిస్తూండేవారు. బాబూరావు సాధుస్వభావులు. ఉయ్యూరు మేజర్ పంచాయతీగా ఉండేది. అన్నే బాబూరావు వంటి విద్యావంతుడు, మంచి వ్యక్తి సర్పంచిగా వుంటే గ్రామం బాగా అభివృద్ధి చెందుతుందని నేను అభిప్రాయ పడ్డాను. బాబూరావుగారికి ఇష్టం లేదు. చింతా కోటేశ్వరరావు, గెల్లి మల్లిఖార్జునరావు, కోనేరు భాను ప్రసాద్ మున్నగు వారితో నేను ముందుగా చెప్పి గ్రామ కార్యకర్తల సమావేశములో ఆయన పేరును ప్రతిపాదింపజేసి ఆయనకు ఇష్టం లేకున్నా ఒప్పించి గెలిపించడం జరిగింది.

నేను విజయవాడ పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన తర్వాత ఉయ్యూరు శాసనసభ స్థానం నుంచి బాబూరావు అభ్యర్థి అయితే బావుంటుందని రామారావుగారికి చెప్పడం, 1985 అసెంబ్లీ ఎన్నికల్లో బాబూరావు గారు గెలుపొందడం జరిగాయి. 1989 ఎన్నికల్లో వంగవీటి చలపతిరావు గెలుపొందగా, 1994 ఎన్నికల్లో తిరిగి బాబూరావు గారు గెలిచారు. 1999 శాసనసభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు బాబూరావుగారు నన్ను కలసి రానున్న ఎన్నికల్లో తనకు పోటీ చేయడం ఇష్టం లేదని చెబుతూ, ఉయ్యూరు

నుంచి నన్ను పోటీ చేయాల్సిందిగా కోరారు. ఎందుకు మీకా అభిప్రాయం కలిగిందని అడిగాను. తన ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. మరి నాకు కూడా 1996లో మైల్డ్‌గా హార్ట్‌ప్రాబ్లం వచ్చింది కదా అని అన్నాను. దానికి సమాధానంగా ఆయన 'మీ అబ్బాయి ప్రసాద్‌ని పోటీ చేయించండి' అని అన్నారు. అతడికి రాజకీయాలంటే ఆసక్తి లేదని చెప్పి సంభాషణను అక్కడితో ముగించాను. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాబోతోంది. అప్పటికి నా సతీమణి ఏదో పనిమీద వచ్చి ఉయ్యూరులో ఉన్నందువల్ల ఉయ్యూరులోని మా ఇంటికి వచ్చాను. మధ్యాహ్నం సమయంలో బాబూరావుగారొచ్చి మళ్ళీ తాను పోటీ చేయనని, నన్ను పోటీ చేయమని అడిగారు. 'ఈసారి నేను ఆలోచిద్దాం లెండి' అని చెప్పి పంపించివేశాను. అప్పటికి గతంలో దేవినేని నెహ్రూ అనుచరుడిగా ఉన్న చలసాని వెంకటేశ్వరరావు (పండు) ఉయ్యూరు సెంటర్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, బాగా డబ్బు ఖర్చుచేస్తూ, యువతను బాగా ఆకట్టుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందినవారు కూడా కొంతమంది అతడి వైపు వెళ్లిపోయారు. ఈ పర్యాయం బాబూరావుగారు ఎన్నికల్లో పోటీచేస్తే గెలుపొందటం కష్టం కావచ్చునే అభిప్రాయాన్ని పలువురు మిత్రులు వ్యక్తం చేశారు. నేను పోటీ చేస్తే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. 1972లో కాకాని వెంకటరత్నంగారి మీద పోటీ చేసినప్పటి నుంచి, ఉయ్యూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ, పల్లెలోనూ అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాల్ని నెలకొల్పుకున్నాను. ఆయా గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల సామాజిక, వ్యక్తిగత అవసరాల విషయంలో నా శాయశక్తులా సహకారాన్ని అందిస్తూ వచ్చాను. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చేయూతను అందించాను. గ్రామాల్లో శాంతియుత వాతావరణం తప్ప ఘర్షణకు తావివ్వకుండా రాజకీయాలు నడుపుకుంటూ వచ్చాను. ఈ నేపథ్యంలో నా చిరకాల మిత్రుడు కిలారు విద్యాసాగర్‌వర్మను వెంటబెట్టుకుని విజయవాడలో ఉన్న సుంకర సత్యనారాయణగారిని కలిశాను. బాబూరావుగారొచ్చి కలసిన విషయం చెప్పి ఏం చేయమంటారని అడిగాను. 'నాతో కూడా చాలా మంది చెబుతున్నారు, బాబూరావుగారైతే కష్టం, నువ్వయితే మెరుగ్గా ఉండొచ్చు కాబట్టి, ఆయనే నీతో రెండుసార్లు చెప్పారు కాబట్టి పోటీ చెయ్యి శోభనాద్రీ' అని చెప్పారు. ఆ రాత్రి బయలుదేరి హైదరాబాదు వెళ్ళిపోయాను.

## బాధ కలిగించిన అన్నే - సింహాద్రిల వైఖరి

మరుసటి రోజు ఉయ్యూరు సర్పంచిగా, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న వై.వి.బి.రాజేంద్రప్రసాద్ హైదరాబాదులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో

నేను పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు గారి గదిలోకి వెళ్ళేముందు కనిపించారు. 'ఏమిటిలా వచ్చావ్ రాజేంద్రప్రసాద్?' అని అడిగితే తాను  తెలుగుదేశంలో చేరాలనే సంకల్పంతో చంద్రబాబును కలవాలని వచ్చానన్నారు. లోపల పార్టీ పోలిట్‌బ్యూరో సమావేశం అయిన తర్వాత నేను బాబూగారితో గది బయట రాజేంద్రప్రసాద్ ఉన్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చాను. ఆయన వై.వి.బి.రాజేంద్రప్రసాద్‌ను లోనికి పిలిపించారు. బాబుగారు మంచి పథకాల్ని అమలు చేస్తుండడంవల్ల తాను కూడా తెలుగుదేశం పార్టీలో చేరాలను కుంటున్నానని చెప్పి పుష్పగుచ్ఛం అందించారు. బాబుగారు అతడిని సాదరంగా చేర్చుకున్నారు. రాజేంద్రప్రసాద్ బాబుగారికి పుష్పగుచ్ఛం ఇస్తున్నపుడు తీసిన ఫొటోలో మధ్యలో నేను కూడా వున్నాను. మరుసటి రోజు పత్రికలో ఫోటోతో సహా వార్త ఉయ్యూరులో తెలియడంతో తెలుగుదేశం పార్టీలో చురుగ్గా ఉండే కొందరు యువకులు వారికి రాజేంద్రప్రసాద్‌తో వైరుధ్యం ఉండడం వల్ల తీవ్రంగా స్పందించారు. బాబూరావు గారింటి వద్ద తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేసి వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు రాజేంద్రప్రసాద్‌ను ఎందుకు చేర్చాలి? తాను ఎన్నికల్లో పోటీ చేసే సంకల్పంతో రాజేంద్రప్రసాద్‌ను చేర్చివుంటారని విమర్శించారు. ఆ సందర్భంగా బాబూరావుగారు మొదటిసారి నన్ను పోటీ చెయ్యమన్నప్పుడు 'నేను చెయ్యను, మీరే చెయ్యండి' అని చెప్పిన విషయం చెబుతూ, 'శోభనాద్రీశ్వరరావుగారు కావాలంటే నేను కాదంటానా!' అన్నారట. రెండోసారి రెండు రోజుల ముందు తాను స్వయంగా నన్ను కలసి మాట్లాడిన విషయం ఆ సమావేశంలో తెలియపరచకపోవడం చాలా విచారకరం. అందువల్ల నేనే కావాలని రాజేంద్రప్రసాద్‌ను పార్టీలో చేర్చినట్లు ప్రజలలో అపోహ కలగడానికి ఆయన ఆస్కారం కల్గించారు. బాబూరావుగారికి ఎంతో ఆప్యాయతతో మంచిగా ఆయన ఎదుగుదలకు నా వంతు సహకారాన్ని అందించినాగానీ ఆయన ఆ విధంగా చెయ్యడం నాకు చాలా బాధ కలిగించింది.

అంతకుముందు మరొకసారి కూడా ఆయన ప్రవర్తన నాకు ఖేదాన్ని కలిగించింది. 1998లో రాజ్యసభ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ తరపున ముగ్గురు సభ్యుల్ని ఎన్నుకునే అవకాశం ఉంది. అప్పట్లో చంద్రబాబుగారు నన్ను, సి.రామచంద్రయ్యను, ఎస్.రామచంద్రారెడ్డిని ముగ్గురినీ ఎంపిక చెయ్యాలనే అభిప్రాయంతో ఉన్నారు. 1997 పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో నేను పోటీ చేయలేదు. అప్పటికే ఎన్నికల వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్థికసంపత్తి పుష్కలంగా గల పి.

ఉపేంద్ర పోటీ చేస్తారు కాబట్టి నేను తప్పుకున్నాను. విజయ ఎలక్ట్రికల్స్ అధినేత దాసరి జయరమేష్ పోటీ చేశారు. మళ్ళీ ఉపేంద్ర గెలిచారు. ఈ 1997 పార్లమెంటు ఎన్నికల్లో టి.డి.పి.తరఫున విజయవాడ, నరసరావుపేట, ఒంగోలు మొదలైన చోట్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు పోటీ చేసి ఓటమి చెందారు. దాదాపు వారిలో ప్రతి ఒక్కరూ రాజ్యసభ అవకాశాన్ని ఆశించారు. ఆ పరిస్థితుల్లో 1997 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వారి పేర్లను పరిగణనలోకి తీసుకోరాదనే విధాన నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ కృష్ణాజిల్లాకు చెందిన ఒక మహిళా శాసనసభ్యురాలితో పాటు మరికొంతమంది శోభనాద్రీశ్వరరావు గారికి ఇవ్వొద్దు, జయరమేష్ గారికే ఇవ్వాలని చంద్రబాబు గారిపై ఒత్తిడి తెచ్చారు. ఆ సమయంలో అన్నే బాబూరావుగారితోనూ, సింహాద్రి సత్యనారాయణ గారితోనూ మీరు వెళ్ళి బాబుగారితో మాట్లాడండని నేను కోరాను. అయితే వారిద్దరూ ఆ విధంగా చెయ్యలేదు. ఈ విషయం కూడా నాకు చాలాబాధ కలిగించింది. ఎందుకంటే 1994 శాసన సభ ఎన్నికల్లో వీరిద్దరి స్థానాల్లో వేరే వాళ్ళని నిలబెట్టాలని రామారావుగారు ఒక అభిప్రాయానికి వచ్చి వున్నారు. నేను అప్పుడు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నాను. బాబూరావుగారికి అప్పుడు సీటు రావడం అనుమానంగా ఉంది. పెద్దాయనతో మీరు మాట్లాడాలని ఉయ్యూరు ప్రాంత ముఖ్యులు చెప్పగా, అప్పుడు నేను రామారావు గారితో 'ఉయ్యూరు టిక్కెట్‌ను బాబూరావుగారికే ఇవ్వండన్నగారూ' అన్నాను. 'బ్రదర్ బాబూరావు మంచివాడేగానీ అక్కడ మన కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందట. చలపతిరావు మనుషులు మనవాళ్లని బాగా ఇబ్బంది పెడుతున్నారట' అని అన్నారు. 'కాదన్నగారూ, నామినేషన్ల రోజున చలపతిరావుకు మద్దతుగా వచ్చిన మనుషులు మన పార్టీ కార్యకర్తల మీద దురుసుగా ప్రవర్తించిన మాట వాస్తవమేగానీ, అటు తర్వాత అటువంటి సంఘటనలు పెద్దగా ఏమీ జరగలేదు. పైగా చలపతిరావు కుమారులు వారి సామాజిక వర్గం ప్రజలపైనే భౌతికదాడులకు దిగుతూ, ప్రజాదరణను కోల్పోతున్నారు' అని చెప్పాను. 'బ్రదర్, మన వాళ్ళ తాలూకు మహిళలు సినిమాలకు వెళ్ళడానికి కూడా భయపడుతున్నారట' అని రామారావుగారన్నారు. 'అది వాస్తవం కాదన్నగారూ, మీకెవరో తప్పుడు సమాచారం ఇస్తున్నారు' అని అన్నాను. దానికి ఆయన స్పందిస్తూ, 'బ్రదర్, నాకు బాగా తెలుసు, మావూరు అక్కడికి 13 మైళ్ళేగదా' అని అన్నారు. 'అన్నగారూ, నా ఇళ్ళు, పొలాలు అన్నీ ఉయ్యూరులోనే ఉన్నాయిగదా' అని చెప్పాను. తిరిగి ఆయన మన వాళ్ళకు రక్షణలేకుండా పోయిందన్నప్పుడు నేను 'అన్నగారూ,

మీరు ముఖ్యమంత్రిగా ఉండగానే నా మేనత్త గారి భర్త డాక్టర్ ఉప్పలపాటి శ్రీహరిరావుగారు రంగా హత్యానంతరం జరిగిన అల్లర్లలో విజయవాడలో అమానుషంగా హత్యకు గురయ్యారు' అని అన్నాను. అన్నగారు నిర్ఘాంతపోయారు అయినా తమాయించుకుని సరే బ్రదర్, తప్పకుండా ఆలోచిస్తానన్నారు.

అప్పట్లో నేను హైదరాబాదులో దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో ఉండేవాణ్ని. మరుసటి రోజు దివిసీమ నుంచి చల్లపల్లి ప్రాంతం నుంచి ఏడెనిమిది కార్లలో టి.డి.పి. ముఖ్యులు వచ్చారు. ఏమిటిలా వచ్చారని అడిగితే 'సింహాద్రి సత్యనారాయణ గారిని ఒప్పించి అంబటి బ్రాహ్మణయ్యగారికి టిక్కెట్ ఇవ్వాలని రామారావుగారు నిర్ణయించుకున్నారట' అని అన్నారు. బ్రాహ్మణయ్య గారు కూడా మంచివారేగా, మీ కొచ్చిన ఇబ్బందేమిటని అడిగాను. బ్రాహ్మణయ్య గారు మంచివారేగానీ, ఆయన అన్నగారి కుమారుడు, మరికొంతమంది బంధువులతోనూ ఇబ్బంది కలుగుతుంది. సింహాద్రి గారికిచ్చినా, సైకం అర్జునరావుగారికిచ్చినా మాకిబ్బంది ఉండదు. కనుక రామారావుగారితో మాట్లాడి సరైన నిర్ణయం జరగాలని కోరారు. దాని గురించి వల్లభనేని బాబూరావుగారు, మండవ జానకీరామయ్యగారు, కడియాల రాఘవరావుగారు, తదితరులను వెంటబెట్టుకుని రామారావు గారిని కలిశాను. సింహాద్రిగారే పోటీ చేయనంటున్నారటగదా, అందుకే బ్రాహ్మణయ్యగారిని పోటీకి నిలబెడదామని అనుకొంటున్నానని రామారావుగారన్నారు. మాకా విషయం తెలియదు, తెలుసుకుని మళ్లీ కలుస్తామన్నగారూ అని చెప్పి బయటకు వచ్చేశాం. సింహాద్రిగారి నడిగితే, తాను లిఖిత పూర్వకంగా గానీ, మాట పూర్వకంగా గానీ పోటీ చేయనని ఎవరికీ చెప్పలేదన్నారు. ఈ విషయంపై అందరం కలసి రామారావుగారి వద్దకు వెళ్ళి, మీకు పొరపాటు సమాచారం ఇచ్చారు, ఆయన పోటీ చేయడానికి సుముఖమేనని, ఆ ప్రాంతపు ముఖ్యులు వచ్చి కలసిన విషయాన్ని చెప్పి సింహాద్రి గారికే టికెట్టు ఇవ్వవలసిందిగా అన్నగారిని కోరడం జరిగింది. సరే బ్రదర్, కానీ ఇకపైన ఏ ఒక్క విషయంలోనూ మార్పులు కోరవద్దని ఆదేశించారు. అప్పటికే బ్రాహ్మణయ్యగారికి చెప్పివున్నందువల్ల ఆయనను మచిలీపట్నం నుంచి శాసనసభకు పోటీ చేయించారు. ఈ విధంగా నేను బాబూరావుగారికి, సింహాద్రి గారికి బాసటగా నిలబడి, రామారావుగారికి కోపం వచ్చినా సరేనని ధైర్యంగా వారి పక్షాన కృషిచేస్తే, నాకు రాజ్యసభ స్థానం విషయంలో బాబుగారితో మాట్లాడకుండా అన్యాయం చేశారు.

నాకు ఉయ్యూరులో అన్నే బాబూరావు గారి ఇంటివద్ద జరిగిన సమావేశంలో రాజేంద్రప్రసాద్ పార్టీలో చేరిన విషయంపై చేసిన విమర్శలు తెలిసిన తర్వాత ఉయ్యూరులో మా ఇంటివద్ద ఉయ్యూరు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం

నిర్వహించాను. ఉయ్యూరు నుంచి నేను విజయవాడ పార్లమెంటు సభ్యుడిగా వెళ్ళినప్పటి నుంచి అప్పటివరకు జరిగిన విషయాలన్నింటినీ తెలియజేశాను. రాజేంద్రప్రసాద్ పార్టీలో చేరిన విషయంలో నా పాత్ర ఏమీలేదని, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు పార్టీలో చేరతానంటే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాదని ఎలా అనగలరని వివరించాను.

హైదరాబాద్‌లో నామినేషన్ల చివరితేదీకి ముందురోజు సాయంత్రం చంద్రబాబుగారు నన్ను, బాబూరావుగారిని ఇద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడారు. జరిగిన విషయాల్ని ఇద్దరం ఆయన దృష్టికి తీసుకువచ్చిన తర్వాత శోభనాద్రీశ్వరరావుగారు పోటీ చేస్తారు, మీరు ఆగండని బాబూరావుగారికి చెప్పారు. నాకు బి.ఫారం అందజేశారు. నేను ఉయ్యూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి పార్టీ నిర్ణయించిందనే సమాచారం ఉయ్యూరుకు చేరింది. రాత్రికి బయలుదేరి ఉయ్యూరు వచ్చాను. ఉదయానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఉయ్యూరు వచ్చేశారు. ముందుగా శివాలయానికి వెళ్ళి పూజ ముగించుకుని నామినేషన్ వేయడానికి వెళ్ళాలని అనుకున్నాం. శివాలయంలో పూజ ముగించుకుని వెలుపలకు వచ్చిన సమయంలో చంద్రబాబు నాతో మాట్లాడాలని ఫోన్ చేశారని చెప్పారు. దాని గురించి మళ్ళీ ఇంటికి వెనక్కి వెళ్ళడం ఎందుకనే అభిప్రాయంతో బాబూరావు గారింటికి వెళ్ళి చంద్రబాబుగారింటికి ఫోన్ చేశాను. అప్పటికే ఆయన హెలికాప్టర్ ఎక్కి ప్రచార కార్యక్రమాలకు వెళ్ళారు. బాబూరావుగారిని ఉయ్యూరులో నామినేషన్ వేయించి, నన్ను మైలవరంలో నామినేషన్ వేయాల్సిందిగా చంద్రబాబుగారు చెప్పారని పి.ప్రభాకరరెడ్డి గారు నాతో చెప్పారు. ఇప్పటికింకా బి ఫారం పూర్తి చేయలేదు కాబట్టి ఇబ్బందేమీ లేదు, బాబూరావుగారితో  దగ్గరుండి నామినేషన్ వేయిస్తానని వెంటనే చెప్పాను. బాబూరావు ఇంటి వద్దనుంచి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్ళి ఆయనతో నామినేషన్ వేయించాం. ఆ ఎన్నికలలో బాబూరావుగారు ప్రతి రోజూ తన వాహనంలో రాజేంద్రప్రసాద్‌ను కూడా వెంటబెట్టుకుని ప్రచారం కొనసాగించారు.

ఆ తర్వాత నాకు తెలిసిన విషయమేమిటంటే బాబూరావు గారింటి వద్దనుంచి అప్పుడు పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న కాగిత వెంకట్రావుకు, ప్రభాకరరెడ్డికి, మరికొంతమంది నాయకులకు ఫోన్ చేసి శోభనాద్రీశ్వరరావు గారు పోటీ చేస్తే యువకులు సరిగ్గా పనిచేయరని, గెలుపొందడం కష్టమవుతుందని కొందరు నాయకులు చెప్పారట. వారు చంద్రబాబుతో చెప్పారు. నామినేషన్ల రోజు ఉదయం చంద్రబాబు గారి నుంచి ఫోన్ రావడం, నేను వెళ్ళి మాట్లాడడం జరగక ముందు బాబూరావుగారికి అత్యంత సన్నిహితంగా మెలిగిన కోటరీ సభ్యులు వెనుకబడిన వర్గానికి చెందిన ఒక వ్యక్తితో ఇండిపెండెంటుగా పోటీ చేయించాలనే ఆలోచన చేసి నామినేషన్ పత్రాలను తెప్పించారట.

# మైలవరం శాసన సభ్యునిగా - వ్యవసాయ మంత్రిగా

నేను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు మొదటిసారి చనుమోలు వెంకట్రావుగారు, రెండోసారి కొంతకాలంపాటు కోమటి భాస్కరరావుగారు మైలవరం శాసనసభ్యులుగా ఉన్నారు. తిరువూరులో కోనేరు రంగారావు గారు ఎమ్మెల్యేగాను, మంత్రిగాను ఉన్నారు. తెలుగుదేశం కార్యకర్తలకు మద్దతునిస్తూ, కాంగ్రెస్ పార్టీ వారు పెట్టే ఇబ్బందుల్ని ఎదుర్కోవడం కోసం, ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం ఆ రెండు నియోజక వర్గాల్లో ఎక్కువ పర్యాయాలు పర్యటిస్తుండేవాణ్ని. జగ్గయ్యపేటలో నెట్టెం రఘురాం, నందిగామలో వసంత నాగేశ్వరరావు, తర్వాత దేవినేని వెంకటరమణ ఉండటం వల్ల ఆ నియోజక వర్గాలకు అప్పుడప్పుడూ వెళ్లి వస్తుండేవాడిని. ఆ నాలుగు గ్రామీణ నియోజక వర్గాల్లోని గ్రామసమస్యలతో పోల్చితే దేవినేని నెహ్రూ శాసనసభ్యుడిగా ఉన్న కంకిపాడు నియోజకవర్గంలో పెద్దగా పనుల గురించి అడిగేవారు కాదు. 1999 ఎన్నికల సమయంలో మైలవరం నియోజక వర్గంలోని అయిదు మండలాల్లోని ముఖ్యులైన నాయకులు తెలుగుదేశం శాసనసభ్యుడు జ్యేష్ఠ రమేష్‌బాబు తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆయనను మార్చి శోభనాద్రీశ్వరరావుగారిని నిలబెడితే ఆయన గెలుపుకోసం గట్టిగా ప్రయత్నిస్తామనే ధోరణిలో చంద్రబాబు గారి దగ్గర వత్తిడి తెచ్చారట. నేను మైలవరం నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేసే సమయంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పది సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు, మధ్యలో లేనప్పుడు ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల సుమారు 9,600 ఓట్ల మెజారిటీతో గెలుపొందాను. ఉయ్యూరులో అన్నే బాబూరావు సుమారు 1100 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

***<u>రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా</u>***

తెలుగుదేశం పార్టీ మంచి మెజారిటీతో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. మొదట్లో 9 మందితో ఏర్పాటుచేసిన మంత్రివర్గంలో నాకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల్ని కేటాయించారు. ముందునుంచి వ్యవసాయం పట్ల, వ్యవసాయరంగంలోని సమస్యలు, మన దేశంలోను, ఇతర దేశాల్లోను వ్యవసాయరంగానికి లభిస్తున్న మద్దతు వంటి అంశాల గురించి లోతుగా అధ్యయనం చేసే అలవాటు వచ్చింది. దాదాపు సస్యవిప్లవం ప్రారంభదశలో వ్యవసాయ శాఖలో మంజూరైన పోస్టులలో ఏఇఒలు, ఎఒల పోస్టులు ఖాళీగా ఉన్నవాటిని భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి సస్యవిప్లవం తర్వాత అధిక మోతాదులో రసాయనిక



*వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం*

ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడబడుతూ సమస్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో పోస్టులను పెంచాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో కంటే తక్కువ సాగు విస్తీర్ణం ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్రల్లో, దామాషాగా చూస్తే ఎక్కువ మంది ఉన్నారని చెప్పినా సరే చంద్రబాబుగారు పెద్దగా పట్టించుకోలేదు. చివరికి తాత్కాలిక ప్రాదిపదికన ఎం.పి.ఇ.ఒ.లను నియమించడం జరిగింది. వ్యవసాయ విస్తరణ సమర్ధవంతంగా ఉన్న సిబ్బందితోనే కొనసాగించడానికి పొలంబడి కార్యక్రమాన్ని పెద్దయెత్తున నిర్వహించాం. తేజ టి.వి.లో ప్రతి రోజు ఒక గంట వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు, సమాచారం అందించడానికి రైతుల నుంచి సలహాలు, ప్రశ్నలకు సమాధానాలు చెప్పించడానికి కృషి చేశాం. పంట దిగుబడుల పెరుగుదల లేకుండా పోవడానికి భూసారం తగ్గిపోవడం ఒక ప్రధాన కారణం. అందువల్ల భూసారం పెరుగుదలకుగాను జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చి రొట్ట ఎరువులను భారీ పరిమాణంలో రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు అందజేశాం. పంటల దిగుబడులను పెంచడానికి వనరులను సమర్థవంతంగా వినియోగించడానికి మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికలను తయారుచేయించాము. భూగర్భజలాల లభ్యత, నేల స్వభావము ఏ పంటల సాగుకు అనుకూలము వంటి వివరాలతో "థీమాటిక్ సాయిల్ మ్యాపులను" 23 జిల్లాలకు తయారు చేయించాము.

రాయలసీమలో ప్రధాన పంట అయిన వేరుసెనగకు విశాఖపట్నం నుంచి ప్రభుత్వమే రవాణాచార్జీలు భరించి జిప్సంను అందించడం జరిగింది. చాలా పంటల్లో జింక్ లోపం సరిజేయడానికిగాను జింక్ సల్ఫేట్‌ను కూడా సబ్సిడీతో అందించాం. మండల స్థాయిలో అక్కడ భూమి, నీరు, వాతావరణ పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకుని దిగుబడుల్ని పెంచడానికి మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికను రూపొందింపజేశాం. దాదాపు నాలుగు సంవత్సరాల్లో మూడేళ్లు కరవు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో ప్రత్తి రైతుల ఆత్మహత్యలు 1997-98 సంవత్సరం నుంచి పెరిగాయి. చెలక, దుబ్బ, తేలిక నేలల్లో వర్షాధార భూముల్లో అధిక పెట్టుబడి అవసరమయ్యే హైబ్రీడ్ కాటన్ కాకుండా నరసింహవంటి వెరైటీ రకాల్ని సాగు చేయడం ఉత్తమమని పెద్ద యెత్తున ఆ ప్రాంతాల్లో ప్రచారం చేయించాం.

***<u>తేలిక నేలలో బి.టి. పత్తి వద్దు</u>***

నేను వ్యవసాయ మంత్రిగా ఉండగానే కేంద్రంలోని 'జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ (జిఇఎసి) అమెరికాలోని మోన్‌శాంటో కంపెనీ భారతదేశంలోని మహికోతో కలసి రూపొందించిన బి.టి.పత్తివిత్తనాల్ని వాణిజ్యపరంగా అమ్ముకోడానికి అనుమతినిచ్చింది. హైదరాబాదులోని హాకా భవనంలో మోన్‌శాంటో ప్రతినిధులతో సహా బి.టి.ప్రత్తి విత్తనాల విడుదల గురించి ప్రెస్‌మీట్ పెట్టాం. బి.టి.ప్రత్తి దిగుబడులు సాధారణ ప్రత్తి దిగుబడుల కంటే ఎంత అధికంగా ఉండవచ్చని నేను అడిగినప్పుడు వారు పదిహేను శాతం దిగుబడి అధికంగా ఉండవచ్చని చెప్పారు. మరైతే దీనివల్ల రైతులకు ప్రత్యేకంగా లాభమేమిటని ప్రశ్నించినప్పుడు సస్య రక్షణ ఖర్చు గుణనీయంగా తగ్గుతుందని చెప్పారు. బి.టి.ప్రత్తి ఎక్కువకాలం పాటు సెనగపచ్చ పురుగు, పింక్‌బోల్‌వర్మ్‌లను తట్టుకోవాలంటే బి.టి.ప్రత్తివేసిన భూమిచుట్టూ రెఫ్యూజీ క్రాప్ అంటే సాధారణ ప్రత్తిరకాన్ని 20 శాతం విస్తీర్ణంలో వేయవలసి వుంటుందని కూడా చెప్పారు. అమెరికా, కెనడా మొదలైన దేశాల్లో భూకమతాలు చాల పెద్దవిగా ఉంటాయి. కనుచూపుమేర ఒకే పైరు ఉంటుంది. వందమంది ప్రజల్లో కేవలం ఇద్దరు మాత్రమే వ్యవసాయరంగంలో జీవిస్తున్నారు. అందువల్ల కలుపుమొక్కల్నే గాక కావాల్సిన పంట మినహా మిగతా మొక్కలన్నింటినీ చంపే విధంగా హెర్బిసైడ్స్ వాడుతుంటారు. అందువల్ల ఆ దేశంలో అక్కడి పరిస్థితుల్లో వారికి ఆ టెక్నాలజీ అవసరమయ్యింది. కానీ మన దేశంలో సగటు కమతం విస్తీర్ణం 1.6 హెక్టార్లు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినప్పటికీ నేటికీ నూటికి అరవైమంది ప్రజలు గ్రామసీమల్లో నివసిస్తున్నారు. మన

దేశంలో పనిచేసేవారిలో నూటికి 70 శాతం మంది వ్యవసాయ రంగంలోనే పనిచేస్తున్నారు. మన దేశంలో బి.టి.ప్రత్తి వేసిన భూముల చుట్టూ నాన్ బిటి ప్రత్తిసాగు దాదాపుగా జరగనట్టే. ఇటీవల కాలంలో కంపెనీలు నాన్ బి.టి. కాటన్ విత్తనాల స్థానంలో కంది విత్తనాల్ని ఇస్తూ వున్నాయి. రాను రాను బి.టి.కాటన్ కూడా ముందు చెప్పినట్లుగా బోల్‌వర్మ్‌ను నిరోధించగల శక్తిని క్రమేపీ కోల్పోతూ వున్నదని శాస్త్రవేత్తలే అంగీకరిస్తున్నారు. ఇప్పుడు బి.టి.-2, బి.టి.-3 రకాల్ని కూడా మోన్‌శాంటో కంపెనీ తీసుకువస్తూవుంది.

***<u>బి.టి.- హైబ్రీడ్ పత్తిని చలకా - తేలిక నేలల్లో సాగు చేయవద్దు</u>***

బి.టి.ప్రత్తిని తీసివేసిన తర్వాత పశువులు ఆ ఆకుల్ని, కాండాన్ని భుజిస్తే వాటి ఆరోగ్యానికి భంగం కలుగుతోందని, కొన్ని చనిపోయాయని సెంటర్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్‌తో సహా కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ముందు ప్రభుత్వ సంస్థలు ఇవన్నీ అసత్యాలని బుకాయించినప్పటికీ, చివరికి బి.టి.ప్రత్తి మోడు, ఆకులు పశువుల మేతకు ఉపయోగించరాదని పశుసంవర్ధక శాఖ సర్క్యులర్‌ను జారీ చేసింది.

హైబ్రీడ్ ప్రత్తి మాత్రమే కాకుండా బి.టి.ప్రత్తిని కూడా వర్షాధార, తేలికపాటి నేలల్లో సాగు చేయడం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు దిగుబడులు బాగా తగ్గి, రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాక తీవ్ర నష్టానికి లోనవుతారు. దేశంలో 1997 నుండి ఇప్పటికీ దాదాపు 2 లక్షల 60 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది పత్తిపంట పండించిన సన్నకారు, చిన్నరైతులు, కౌలు రైతులు, బలహీన వర్గములకు చెందినవారు.

2002 జనవరి 31న హైదరాబాద్‌లోని హోమ్ సైన్స్ కాలేజీలో 'ఎర్ర, చలక, దుబ్బ భూముల్లో పత్తి సాగు సమస్యలు, అవకాశాలు' అనే అంశంపై సదస్సును నిర్వహించాం. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఉద్యానవన శాఖమంత్రి నారాయణస్వామి నాయుడు, శాసనసభ్యుడు ముత్యంరెడ్డి, వ్యవసాయ కమిషనర్ రాజీవ్‌శర్మ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ప్రకృతి అనుకూలించకపోతే ఎర్ర, చలక, దుబ్బ నేలల్లో పత్తిసాగువల్ల రైతులు పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోతారని, 1984-'85 ప్రాంతంలో ప్రకాశంజిల్లాలో పత్తి రైతులు సెనగ మున్నగు వేరే పంటల్ని చేపట్టడంవల్ల నిలబడగలిగారని వివరించాం.

రైతుల శ్రేయస్సుకోసం జన్మభూమి, నీరు–మీరు, మార్కెట్ కమిటీల్లో శిక్షణ తరగతుల కార్యక్రమాలద్వారా ఉత్పాదకతను పెంచడానికి కృషిచేస్తూన్నామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం పంటలసాగు విస్తీర్ణంలో 9శాతం మాత్రమే ఉన్న పత్తి పంటపైన 60శాతం క్రిమిసంహారక మందుల్ని వాడుతున్నారని, పర్యవసానంగా దేశంలో పత్తి ఉత్పత్తి వ్యయం మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉందని తెలిపాను. సారవంతత తక్కువగా ఉండే ఈ నేలల్లో నరసింహలాంటి వెరైటీ పత్తిని సాగుచేస్తే రైతు ఎక్కువగా నష్టపోడని కూడా తెలిపాము. 2002 జూలై 1న వరంగల్‌లో కూడా ఇదే అంశంపై రైతులతో అవగాహన సదస్సును ఏర్పాటుచేశాం. పెద్దయెత్తున కరపత్రాలు కూడా పంపిణీ చేయించాం.




*బి.టి. వంగ, ఆహార పంటలకు వ్యతిరేకంగా*

**బి.టి. వంకాయ వద్దు**

బహుళ జాతి విత్తన సంస్థలు మనదేశంలో పండించే ఆహార పంటలలోనికి కూడ బి.టి. సంకేతికతను ప్రవేశపెట్టాలని, అందుకు క్షేత్ర స్థాయి అనుమతులను పొందేదానికి కృషి చేసి తొలుతగా బి.టి. వంకాయను సాగు చేసేదానికి జి.ఇ.ఎ.సి. నుండి అనుమతిని పొందటం జరిగింది. దీనిపైన దేశవ్యాప్తంగా పర్యావరణ వేత్తలు వ్యవసాయ శాస్త్రజ్ఞులు రైతులు తీవ్రమైన నిరసనలు వ్యక్తం చేశారు. హైదరాబాదులో క్రీడాలో కేంద్ర పర్యావరణ మంత్రి జైరాం రమేష్ సారధ్యంలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనేందుకు 2010 జనవరి 31 సమావేశం నిర్వహించబడింది. దానికి నేను, కొల్లి నాగేశ్వర రావు, ఎమ్. కొదండ

రెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి, కిసాన్ సంఘ్ సౌరియ్య, తెలుగు రైతు నల్లమల వెంకటేశ్వర రావు మున్నగు వారితో సహా పలురైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం నుండి డా॥ జి.వి. రామాంజనేయులు కవితా, రవి, కిరణ్ లతో పాటు శాస్త్రజ్ఞులు డా॥ కె.ఆర్. చౌదరి, అల్దాస్ జానయ్య మున్నగు వారు తమ వాదనలను వినిపించారు. ఐ.టి.సి. మోనోశాంటో, కార్గిల్ మున్నగు సంస్థలు కొంత మంది రైతులను వారి పక్షంగా తీసుకువచ్చి బి.టి. కాటన్ వలన ఎంతో లాభం చేకూరుతువుందని కావున బి.టి. పంటలన్నిటిని ఆహ్వానించాలని మాట్లాడింప చేశారు. అత్యధికులు బి.టి. ఆహార పంటలకు అనుమతి ఇవ్వవద్దని చెప్పారు. దేశ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తం కావడంతో జైరాం రమేష్ బి.టి. ఆహార పంటల క్షేత్ర స్థాయి ప్రయోగాలకు మారుటోరియం విధించారు.

ఈ అంశం పైన వాసుదేవ్ ఆచార్య అధ్యక్షతన వ్యవసాయ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ కూడ జన్యు మార్పిడి ఆహార పంటల ప్రయోగాలను నిలిపివేయమని కోరింది. జైరాం రమేష్ తరువాత శ్రీమతి జయంతి నటరాజన్ కూడ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఇటీవల కేంద్ర మంత్రి వీరప్పమొయిలీ అనుమతిని ఇవ్వడం బహుళ జాతి సంస్థలకు యు.పి.ఏ. ప్రభుత్వం దాసోహమయ్యిందనే దానికి తిరుగులేని నిదర్శనం.

***<u>పంటల బీమా పథకం రైతుకు భీమా కల్పించాలి</u>***

2001 ఆగస్టులో, 2002 డిశెంబర్ 11న కేంద్ర వ్యవసాయశాఖమంత్రి అజిత్‌సింగ్‌గారికి జాతీయ పంటల బీమా పథకంలో నష్టపరిహారం స్థాయి (ఇండెమ్నిటీ)ని పెంచాలని, పత్తి పంటకు ప్రీమియం తగ్గించాలని, అలాగే బ్యాంకు రుణంతో పాటు పంటల బీమా తప్పనిసరిగా ఉన్న విధానంతో పాటు స్వచ్ఛందంగా కూడా చేరే విధంగా మార్చాలని కోరాను.

2000 సంవత్సరంలో జాతీయ వ్యవసాయ బీమా పథకాన్ని ప్రారంభించినప్పుడు మూడు సంవత్సరాల్లో ఈ పథకాన్ని గ్రామం/పంచాయతీ యూనిట్‌గా అమలు చేయాలని ప్రకటన జరిగినప్పటికీ ఆ విధంగా అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని, సన్నకారు, చిన్నరైతులకు వారు చెల్లించవలసిన ప్రీమియం సబ్సిడీని 50 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలనే ప్రతిపాదన సమంజసం కాదని రాజ్‌నాథ్‌సింగ్‌గారిని 2003 జూలై 15న కోరాను.

జాతీయ వ్యవసాయ బీమా పథకం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలపైన ఆర్థిక భారాన్ని 33 శాతం నుంచి 50 శాతానికి పెంచడం, కార్పస్‌ఫండ్‌ను డిపాజిట్ చేయడం, జి.ఐ.సి అడ్మినిస్ట్రేషన్ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని కోరడం సమంజసం కాదని ప్రీమియం రేట్లు కొన్ని వాణిజ్య పంటల విషయంలో ప్రీమియం చాలా అధికంగా ఉన్నందు వల్ల అప్పు తీసుకున్నవారిని తప్పనిసరిగా ఇన్యూరెన్స్‌లోకి చేరాలని నిర్బంధించడం సమంజసం కాదని, ప్రీమియంను తగ్గించాలని అయిదు సంవత్సరాల తర్వాత ప్రీమియం సబ్సిడీని పూర్తిగా ఉపసంహరించాలని నిర్ణయం తీసుకోవడం రైతు సంక్షేమానికి విరుద్ధమని, డబ్ల్యు.టి.వో నిబంధనల ప్రకారం ఇన్యూరెన్స్ ప్రత్యేకంగా సన్నకారు, చిన్నరైతుల విషయంలో గ్రీన్‌బాక్స్‌లో ఉన్నందువల్ల ఈ నిర్ణయం తగదని, కటాఫ్‌డేట్స్‌ను మార్చవలసిన అవసరం ఉన్నదని, మిర్చి, పసుపు, పొగాకు, ఉల్లి పంటలను కూడా జాతీయ వ్యవసాయ బీమా పథకంలోకి తీసుకు రావాలని వ్యవసాయమంత్రి నితీష్‌కుమార్ ను కోరాను. ప్రపంచవాణిజ్య సంస్థ ఒప్పందంపైన రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు కోరినప్పుడు 2000 సెప్టెంబర్ 12న అనేక సూచనలు చేయడం జరిగినది.

***ఇతర దేశాల్లో వ్యవసాయ బీమా :***

అమెరికా, కెనడా, జపాన్, ఫిలిఫిన్స్ మున్నగు పలు దేశాలలో రైతులకు అనుకూలమైన వ్యవసాయ భీమా పథకాలు అమలు చేయబడుతున్నాయి. అమెరికాలో పంటల భీమా పథకాల పైన అయ్యే మొత్తం వ్యయంలో 75 శాతం ఫెడరల్ గవర్నమెంటు భరించుతుంది. సగటున 38 నుండి 67 శాతం ప్రీమియం సబ్సిడీ ఉంటుంది కానీ మన దేశంలో సవరించిన పంటల భీమా పథకంలో వివిధ పంటలకు రైతులు చెల్లించవలసిన ప్రీమియం మొత్తాలను కేంద్రప్రభుత్వం భారీగా పెంచింది.

భారత రైతులు ఇతర దేశాల్లో రైతులతో పోటీ పడాలంటే సాగునీటి వసతి, రవాణా, సమాచారం, విస్తరణ సేవల్ని సమర్థవంతంగా అందించవలసిన అవసరమున్నదని, మనదేశం నుంచి ఎగుమతికి అవకాశం ఉన్న పంచదార, బియ్యం, పత్తి, మిర్చి, పసుపు, సుగంధ ద్రవ్యాలవంటి పంటల్ని ప్రోత్సహిస్తూ నాణ్యతను కూడా మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరాను.

కోస్తా తీర ప్రాంతంలో కొబ్బరిచెట్లకు ఇరియోఫిట్‌మైట్ పెద్ద యెత్తున నష్టం కలిగించినప్పుడు కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా కొబ్బరి రైతులకు సహకారాన్ని అందించాలని వ్యవసాయశాఖ సహాయమంత్రి శ్రీపద్ నాయక్‌కు 2000 అక్టోబర్‌లో కోరాను.

హైదరాబాద్ వద్ద నేషనల్ రీసెర్చి సెంటర్ ఆన్‌మీట్ (మాంసంపై జాతీయ పరిశోధనా సంస్థ)ను నెలకొల్పడానికి కేంద్రం నిర్ణయం తీసుకున్నదని 1999 ఏప్రిల్ 20న తెలియపరిచారు.

బయోఫర్టిలైజర్స్‌లో నాణ్యత ప్రమాణాల్ని చట్టబద్ధంగా నిర్దేశించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌గారిని 2003 జూలై 15న కోరాను.

పొగాకు ధర మార్కెట్లో బాగా తగ్గినందువల్ల వెంటనే మార్కెట్ ఇంటర్‌వెన్షన్ చేపట్టాలని, ప్రైస్ స్టెబిలైజేసన్ ఫండ్‌ను ఏర్పరచాలని, వాణిజ్యశాఖమంత్రి అరుణ్‌జైట్లీగారిని 2003 మార్చి 6న కోరాను. ఒంగోలులో చుంచు శేషయ్య గారి ఆధ్వర్యములో ఉన్న పొగాకు రైతుల సహకార సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కొంత మేరకు నిధులను అందించి రైతులనుండి మెరుగైన ధరలకు పొగాకు కొనుగోలు చేయటకు సహకారాన్ని లభింపజేయడంలో కొంత పాత్రను నిర్వర్తించాను.

2000-01లో యలమంచిలి శివాజీ ఆధ్వర్యంలో వర్జీనియా పొగాకు రైతులు మన రాష్ట్రంలో క్రాప్ట్ హాలిడే పాటించినప్పుడు రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ పంటగా శెనగపంటను పెద్ద యెత్తున ప్రోత్సహించాము.

***<u>రాష్ట్ర వ్యవసాయ విధానం</u>***

కేంద్ర ప్రభుత్వం 2000 జూలై 28న జాతీయ వ్యవసాయ విధాన ప్రకటన చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతకు కొద్దిగా ముందుగానే రాష్ట్రస్థాయిలో వ్యవసాయ విధానాన్ని ప్రకటించిందని, విజన్ 20-20 పత్రంలో వ్యవసాయం, అనుబంధరంగాల్లో శీఘ్రంగా పురోగతిని సాధించాలని, బియ్యం, ఉద్యానవనపంటలు, పాడి పరిశ్రమ, మత్స్యపరిశ్రమ, విత్తనాలు, అగ్రోప్రొసెసింగ్‌లను ప్రగతిచోదకాలుగా భావించామని, వాటర్ షెడ్‌డెవలప్‌మెంట్ పథకాలను పెద్దయెత్తున అమలుచేస్తున్నామని, సాగునీటి సంఘాలను ఏర్పాటుచేసి, సాగునీటి వినియోగంలోనూ, నిర్వహణలోనూ సమర్థతను పెంచడానికి చర్యలు తీసుకున్నామని, పచ్చిరొట్ట ఎరువుల్ని వర్మికంపోస్టును పెద్దయెత్తున ప్రోత్సహిస్తున్నామని, కార్యాచరణ ప్రణాళికను రూపొందించి మైక్రోమేనేజిమెంట్, యాంత్రీకరణలను ప్రోత్సహిస్తున్నామని, తెలియపరిచాం. కౌలు రైతులకు బ్యాంకుల

నుండి రుణ పరపతి లభించడం లేదు. స్వయం సహాయక బృందాలకు బ్యాంకులు రుణాలు అందిస్తున్న విధంగానే కౌలు రైతులను "రైతుమిత్ర" గ్రూపులుగా రూపొందించి పంట రుణాలు లభింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తూ వుంది.

## *అజయ్ కల్లాం - విత్తన అవగాహనా ఒప్పందం*

నేను వ్యవసాయశాఖ మంత్రిగా ఉండగా అజయ్ కల్లాం వ్యవసాయ కమిషనర్‌గా ఉన్నారు. వ్యవసాయరంగం పట్ల ఆసక్తి, సమస్యలపట్ల అవగాహన కలిగిన వ్యక్తి. 1966 విత్తన చట్టానికి కేంద్ర ప్రభుత్వం సవరణలు తీసుకురావడంలో జాప్యం జరుగుతూవున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాల్ని పరిరక్షించడానికి విత్తనాల కంపెనీలతో చర్చించి, వారిని ఒప్పించి విత్తన అవగాహన ఒప్పందాన్ని రూపొందించారు. దానివల్లనే విత్తనాల కంపెనీలు సరఫరా చేసిన విత్తనాల్లో నాణ్యత లోపించి రైతులకు పంటనష్టం చేకూరిన సందర్భంలో ఈ విత్తన అవగాహన ఒప్పందంవల్ల రైతులకు నష్టపరిహారాన్ని



ఇప్పించగలిగాం. వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఎక్సెల్ కంపెనీవారు సరఫరా చేసిన పత్తి విత్తనాలవల్ల సరైన దిగుబడిరాని సందర్భంలో వ్యవసాయశాఖ ఉద్యోగిని, రెవిన్యూ ఉద్యోగిని, చేను ఆసామీని, కంపెనీ ప్రతినిధిని నలుగురు ఉండి పంటనష్టం అంచనా వేసే విధంగా పకడ్బందీగా రికార్డును తయారుచేయించాం. దానిపైన కంపెనీవారితో చర్చించి, ఒప్పించి రెండుకోట్ల రూపాయల నష్టపరిహారాన్ని ఇప్పించాం. నాకు తెలిసినంతవరకు ఇంత పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని అంతకుముందు కాని తరువాత కాని ఇచ్చిన సందర్భం ఏదీలేదు. మా ప్రభుత్వం తర్వాత వచ్చిన ప్రభుత్వం ఎం.ఓ.యు.ను రద్దుచేసింది. బహుళజాతి విత్తన సంస్థల ఒత్తిడివల్ల కేంద్ర ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలు గడిచిపోతున్నా విత్తన సవరణ చట్టాన్ని ఇంతవరకు తీసుకురాలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తామే విత్తన సవరణ చట్టాన్ని తీసుకొస్తామని అనేకసార్లు ప్రకటించికూడా ఇప్పటికీ తీసుకురాకపోవడం రైతుల దురదృష్టం.

కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్ బహుళజాతి విత్తన కంపెనీల స్వార్థ ప్రయోజనాలను పరిరక్షించుటకై విత్తన సవరణ బిల్లు 2004 ను ఇంతవరకు పాస్ చేయించటం లేదు. రాష్ట్ర వ్యవసాయ మంత్రులుగా రఘువీరా రెడ్డి, కన్నా లక్ష్మీనారాయణలు ఉండగా మన రాష్ట్రం నుండి కేంద్రంలో ఉన్న మంత్రులను, ఎమ్.పి.లను కలుపుకుని అన్ని రైతు సంఘాల నాయకులతోను కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్రం వ్యవసాయ మంత్రిని శరద్

పవర్‌ను ఆయన సానుకూలంగా స్పందించక పోగా మీ రాష్ట్రంలో వ్యవసాయ మంత్రి మారినప్పుడెల్లా ఇలా వస్తారా అని నిష్ఠూరం ఆడటం కంటే దౌర్భగ్యం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విత్తన బిల్లును తీసుకువస్తామని కన్నా లక్ష్మీనారాయణ గారు పలు పర్యాయములు ప్రకటించినా ఇంతవరకు అమలు కాలేదు.

***<u>వెల్లటూరులో అదర్శ ఉద్యాన క్షేత్రం</u>***

మైలవరం, రెడ్డిగూడెం గ్రామాల్లో వ్యవసాయాధికారి కార్యాలయ భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో మిగులుభూమిగా ప్రభుత్వ పరమైన 18 ఎకరాల భూమిని జిల్లా కలెక్టర్





అధ్యక్షుడుగా ఉన్న కృష్ణా అగ్రికల్చరల్, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ వారికి ఒక ఆదర్శ ఉద్యానవన క్షేత్రాన్ని ఏర్పాటుచేయడానికి అందజేసే ఏర్పాటుచేయించాను. దానిలో వారు చాలా చక్కగా వివిధ రకాల పండ్ల మొక్కల్ని పెంచారు. చలసాని సుబ్బారావు, మలినేని నారాయణ ప్రసాద్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీన్ని మరింత సమర్ధవంతంగా ఉద్యానశాఖ శ్రద్ధ తీసుకుని ఉద్యానవన సంబంధిత విస్తరణను, అంటుమొక్కల్ని పరిసర ప్రాంతాల్లోని రైతులకు అందించే విధంగా కృషి చేయడం అవసరం. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, ఈలప్రోలు, కనుమూరు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనాల్ని నిర్మింపచేయడం జరిగింది. నేల స్వభావము, భూసారము, వాతావరణము, భూగర్భజలాల లభ్యత మున్నగు అంశాలను దృష్టిలో వుంచుకొని ఏఏ పంటలకు అనుకూలమో తెలియపరుచు 'థిమాటిక్ సాయిల్ మ్యాప్స్' అన్ని జిల్లాలకు తయారు చేయించాము. దేశంలోనే మొట్టమొదటి పర్యాయం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రతిరోజూ ఉదయము, సాయంత్రం ఒక గంటపాటు తేజ టీవీలో శాస్త్రజ్ఞులు రైతుల ప్రశ్నలకు సమాధానాలు, సమాచారాన్ని ఇచ్చేలా ఏర్పాటు చేశాము.

## ***కేంద్ర ముసాయిదా వ్యవసాయ విధానమునకు సూచనలు***

కేంద్రప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయవిధానం గురించి దేశసమగ్ర అభివృద్ధిలో భాగంగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని, వ్యవసాయపరిశ్రమల్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాల్ని అందించాలని, వ్యవసాయరంగంలో ప్రభుత్వ, ప్రయివేట్ పెట్టుబడుల్ని పెంచాలని, వర్షాధారప్రాంతాల్లో రుణపరిమితిని పెంచవలసిన అవసరం చాలా ఎక్కువగా ఉందని, 1966 విత్తన బిల్లు ఈనాటి అవసరాలకు అనుగుణంగాలేదని, దాన్ని సవరించాలని, మార్కెట్ సమాచారాన్ని పెంచాలని, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయవిస్తరణ, పరిశోధనలకు ఎక్కువ మొత్తాల్ని కేటాయించాలని, ఎరువులు, పెస్టిసైడ్స్ కంట్రోల్ ఆర్డర్లను సమర్ధవంతంగా అమలుచేయాలని, ఇంకా అనేక సూచనలతో 2000 సెప్టెంబరు 12న వినతిపత్రాన్ని అందజేశాం. 3.7 కోట్ల రూపాయలు ఇరియోఫిడ్‌మైట్ నివారణకు, తుఫానువల్ల శ్రీకాకుళం జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరితోటలకు సహాయం చేయడానికి 5.15 కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విడుదల చేస్తున్నట్లుగా శ్రీపద్‌నాయక్ 2001 మార్చి 20న తెలియపరిచారు.

**<u>చేజారిన అవకాశం</u>**

2000 జూన్, 10న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్ పర్సన్ అమృతా పటేల్ హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలసి రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల గురించి చర్చించడం జరిగింది. ఆ సమయంలో నేను, ఎం.పి. డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మండవ జానకీరామయ్య, అధికారులు పాల్గొన్నాం. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సమీపంలో భూమిని అందజేస్తే ఢిల్లీలోవలె పెద్ద కాంప్లెక్స్‌ను రైతుల ప్రయోజనాల నిమిత్తం ఏర్పాటు చేయగలమని అన్నారు. అయినా ఎందువల్లనో చంద్రబాబు ఆ విషయం పట్ల ఆసక్తి కనబరచలేదు. దరిమిలా కర్నాటక రాష్ట్రం ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. బెంగుళూరు సమీపంలో వైట్ ఫీల్డ్ వద్ద యన్.డి.డి.బి. కూరగాయలు, పండ్లు నిల్వజేయడానికి రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వీలుగా చక్కని సదుపాయాల్ని ఏర్పాటు చేసింది.

**<u>మలేషియా పర్యటన కన్నా ఆయిల్‌పామ్ రైతులే మిన్న</u>**

2001 మే 3న మలేషియాలో 'ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పెట్టుబడులకు అవకాశం' అనే అంశంపైన జరిగిన సమావేశంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. నాడు ప్రధానమంత్రిగా ఉన్న వాజ్‌పాయ్‌గారు అంతకు ముందు మలేషియా వెళ్ళినప్పుడు పామ్‌టెక్ అనే సంస్థ వారికి ఒక వినతి పత్రాన్ని ఇవ్వగా ఆయన దాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబుగారికి తగిన చర్యల నిమిత్తం పంపారు. ముఖ్యమంత్రిగారి నుంచి దీని గురించి పరిశీలించి తగిన చర్యలు



తీసుకోవలసిందిగా నాకు పంపారు. పామ్‌టెక్ సంస్థ పెద్ద స్థాయిలో పామాయిల్ ప్లాంట్ నెలకొల్పి ఉంది, అయితే ఆ ప్లాంట్ కు సరిపడా పామాయిల్ తోటలు లేవు అందువల్ల తాము రైతుల్ని ప్రోత్సహించి, ప్రోత్సాహకాలని అందించి, విస్తీర్ణాన్ని పెంచుకునే బదులు కేంద్ర ప్రభుత్వంలోని బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సహకారంతో రైతులు పెంచుకున్న పామాయిల్ తోటల్ని తమకు ఇవ్వాలని వారు కోరారు. నా సహచర మంత్రి కోటగిరి విద్యాధరరావు గారి సోదరుడు వేణుగోపాల్‌రావు నా వద్దకు రెండు, మూడు సార్లు వచ్చి పామ్‌టెక్‌కు అనుకూలంగా ఫైల్ రూపొందించాలని కోరారు. ఆ విధంగా చేస్తే పెదవేగిలోని

ప్రభుత్వ రంగంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీకి తగిన విస్తీర్ణం లేక ఆ ప్లాంట్ మూతపడితే ప్రైవేటు ఫ్యాక్టరీలు కుమ్మక్కై రైతులకు సరైన ధర ఇవ్వరనే అభిప్రాయంతో నేను అందుకు అంగీకరించకుండా తిరస్కరించాను. పామ్‌టెక్ ఫ్యాక్టరీకి అనుకూలమైన నిర్ణయం తీసుకుంటే నాకు మలేషియా పర్యటనకు వీసా వస్తుంది, లేకపోతే రాదు అనే సమాచారం చెప్పారు. మలేషియా పర్యటన కంటే మన ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమం ప్రధానం కాబట్టి నేను తిరస్కరించాను.

మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలల ధర గణనీయంగా తగ్గిపోయిన సమయంలో నేను కర్నాటక ఉద్యానవనశాఖమంత్రి అల్లం వీరభద్రప్ప గారిని కూడా వెంటబెట్టుకుని వెళ్ళి నితీష్‌కుమార్ గారిని కలసి, ఆయిల్‌పామ్ రైతుల్ని ఆదుకోవడానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకాన్ని చేపట్టాలని కోరాం. 2001 మార్చి 1 నుంచి 2001 అక్టోబర్ 31 వరకు లక్షా అయిదువేల మెట్రిక్ టన్నుల పామోయిల్ గెలల్ని కొనుగోలు చేయడానికి అనుమతించినట్లు 2001 మే 16న తెలిపారు.


దేశంలో దాదాపు 25 శాతానికి పైగా పండ్లు, కూరగాయలు అవసరమైనంతవరకు నిల్వ, రవాణాసదుపాయాలు లేనందువల్ల వృథాగా పోతున్నాయని కేంద్రప్రభుత్వ అంచనాలున్నాయి గనుక, కోల్డ్‌స్టోరేజీలకు జాతీయబ్యాంకులు గానీ, స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్‌గానీ ఎవరు అందించినప్పటికీ కూడా కేపిటల్ ఇన్‌వెస్ట్‌మెంటు సబ్సిడీ పథకాలు వర్తింపజేయాలని 2000 డిసెంబర్ 2న నితీష్‌కుమార్‌గారిని కోరాను.

## ముందుకుసాగిన తారకరామ పథకం

మైలవరం నియోజకవర్గంలో వి.టి.పి.ఎస్.నుంచి కృష్ణానదిలోకి కలిసే నీటి నుంచి కొంత నీటిని సాగునీటి అవసరాలకు ఉపయోగించి, జి.కొండూరు మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీటి వసతి కల్పించాలని ఆ ప్రాంత రైతాంగం ఎప్పటినుంచో కోరుకుంటోంది. నేను ఎనిమిదో లోక్‌సభలో సభ్యుడిగా ఉండగా నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు 1998లో తారకరామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. జ్యేష్ఠ రమేష్‌బాబు శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో పాలనాపరమైన అనుమతిని ఇప్పించారు. కాని పథక నిర్మాణం ప్రారంభించనే లేదు. నేను మైలవరం శాసనసభ్యుడిగాను, వ్యవసాయ మంత్రిగాను ఉన్న సమయంలో ఈ అంశంపై దృష్టి సారించాను. వి.టి.పి.ఎస్. నుంచి కృష్ణానదిలోకి కలిసే నీటి నుంచి తారకరామ ఎత్తిపోతల పథకానికి నీటిని సమకూర్చాలంటే ఇంటర్‌స్టేట్ వాటర్ అథారిటీ వరకు అనుమతి కోసం ఫైలు



*తారక రామ ఎత్తిపోతల పథకం*




వెళ్లాల్సివుంటుంది. అప్పటికే కృష్ణానదీ జలాల్లో మన రాష్ట్ర వాటాకు కేటాయించిన 811 టి.ఎం.సి.ల నీటి వినియోగం పూర్తిగా వివిధ ప్రాజెక్టులకు కేటాయించబడింది. అటువంటి స్థితిలో ఈ పథకానికి నీటి కేటాయింపు అధికారికంగా ఇవ్వడం సాధ్యం కాదు. ఆర్థిక సహకారం లభించడం కష్టం. అందువల్ల తారకరామ ఎత్తిపోతల పథకం కార్యనిర్వాహక ఇంజనీర్ శర్మగారితో బుడమేరులో నీటి లభ్యత గణాంక వివరాల్ని సేకరించి, బుడమేరు నుంచి లభ్యమయ్యే నీటితో తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును చేపట్టవచ్చుననే విధంగా రిపోర్టును తయారుచేయించి, ప్రభుత్వ ఆమోదాన్ని పొంది, నాబార్డు నుంచి ఈ స్కీమును చేపట్టడానికి కావాల్సిన ఆర్థిక సహకారాన్ని నాబార్డు అధికారులైన పుల్లయ్యగారు, మోహనయ్యగార్ల తోడ్పాటుతో చేపట్టి అమలుచేశాం. నా హయాంలోనే రూ.27 కోట్ల వ్యయంతో స్కీమును అమలుచేస్తూ మొదటి దశలో కుడి కాలువ కింద 100 ఎకరాలు,

ఎడమ కాలువ కింద 7 వేల ఎకరాలకు నీరు వదిలే విధంగా ఏర్పాట్లు సాగాయి. స్కీము నిర్మాణం జరిగి, మొదటి దశ కాలువ నిర్మాణం కూడా జరిగింది. ఆ తర్వాత శాసనసభ్యుడిగా ఎన్నుకోబడిన చనుమోలు వెంకట్రావుగారు ఏ కారణాల వల్లనో ఈ పథకం తర్వాత దశల అమలు పట్ల శ్రద్ధ వహించకపోవడం జరిగింది. మంజూరైన నిధులు కూడా పూర్తిగా వినియోగించబడక పోవడం దురదృష్టకరం. ఈ తారకరామ పథకం వల్ల మైలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లోనేగాక కంకిపాడు, గన్నవరం నియోజక వర్గాలలోని కొన్ని గ్రామాలతో సహా 56 వేల ఎకరాలకు నీరు అందించబడే విధంగా రూపొందించబడింది.

***<u>ఇబ్రహీంపట్నం మంచినీటి పథకం</u>***

కృష్ణానది నుంచి నీటిని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం మండలాల్లోని 90 ఆవాసాలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే నిమిత్తం రూ. 27 కోట్ల రూపాయలతో పథకాన్ని మంజూరు చేయించి ప్రారంభించాం. రూ. 1.60 కోట్లతో మూలపాడు, ఇంకా



*ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించబడిన మైలవరం మంచినీటి పథకం*

6 గ్రామాలకు కూడా ఈ శుద్ధి చేసిన కృష్ణానీటిని అందించే పథకాన్ని మంజూరు చేయించినా ఇప్పటి వరకు ఈ గ్రామాలకు ఆ సౌకర్యాన్ని విస్తరింపచేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వైఫల్యం చెందడం బాధాకరం.

***<u>యన్.యస్.పి. కాల్వలపైన లిఫ్ట్ స్కీములు</u>***

నేను పార్లమెంటు సభ్యుడిగా ఉండగా విస్సన్నపేట ప్రాంతంలోని నూతిపాడు వద్ద నాగార్జునసాగర్ ఎడమకాలువపైన లిఫ్ట్‌స్కీము మంజూరు చేయించాలని నందమూరి వెంకట్రామయ్యగారు, ఆ ప్రాంత రైతులు కోరారు. అప్పట్లో ఎన్.ఎస్.పి.ఎడమ కాలువలపైన

సూపరింటెండింగ్ ఇంజనీరుగా ఉన్న చెరుకూరు వీరయ్యగారిని ఈ విషయమై పరిశీలించడానికి రమ్మని కోరగా, ఆయన వచ్చి చూసి, తారకరామ ఎత్తిపోతల పథకం అమలైతే నాగార్జునసాగర్ ఎడమకాలువల కింద ఆయకట్టులో కొంతభాగం తారక రామపథకం కిందకు వెళ్తుంది కాబట్టి ఆ మేరకు నాగార్జునసాగర్ కాలువల నుంచి లిఫ్ట్ చేయడానికి వీలుకలుగుతుందని నాకు తెలియపరిచారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఎ.కొండూరు మండలంలో కృష్ణారావుపాలెం గ్రామం వద్ద 1,456 ఎకరాలకు 154 లక్షల రూపాయల వ్యయంతోను, పడమర మాధవరం వద్ద 656 ఎకరాలకు 35లక్షల రూపాయల వ్యయంతోను ఎత్తిపోతల పథకాల్ని మంజూరు చేయించాను. గౌవిర్నేని జగన్మోహనరావు (ఆలీబాబా), నాగేశ్వరరావులు చెప్పగా చాలా కాలంగా ముందుకు సాగని జూపూడి లిఫ్ట్ స్కీమును రూ.12 లక్షల రూపాయలతో ప్రారంభింపజేశాను. 1500 ఎకరాలకు నీరందించే పడమర మాధవరం-2 ఎత్తిపోతల పథకాన్ని నాబార్డు ఆమోదం కోసం పంపించడం జరిగింది. అత్తనూరి చెన్నారెడ్డి మున్నగువారి కోరికపై గంపలగూడెం మండలంలో కనుమూరు ఎత్తిపోతల పథకాన్ని 70 లక్షల రూపాయలతో మంజూరు చేయించాను. 2004 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోనేరు రంగారావుగారు నూతిపాడు వద్ద లిఫ్ట్‌స్కీమ్‌ను ఏర్పాటు చేయించారు.

***<u>నీరు - మీరు</u>***

వర్షపు నీటిని వృధాగా పోనివ్వకుండా వీలైనంత వరకు చెరువుల్లోకి, కాంటూరు కందకాలు, చెక్‌డ్యాములు, ఇంకుడు గుంటలు వంటి కార్యక్రమాలు చేపట్టి, అడుగంటి పోతున్న భూగర్భ జలాల్ని రీచార్జి చేయడం లక్ష్యంగా నీరు-మీరు కార్యక్రమాల్ని చేపట్టాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన చేశారు. కేబినెట్‌లో ఈ విషయం



*కుంటముక్కలలో నీరు-మీరు కార్యక్రమం వద్ద*



*నీరు-మీరు కార్యక్రమంలో ఎమ్.సి. ఛైర్మన్  కుమార్ రెడ్డితో*

చర్చకు వచ్చినప్పుడు చెరువుల్లో మట్టిని తవ్వడానికి ఉపయోగించే ప్రొక్లెయినర్ల అద్దెను రాష్ట్ర ప్రభుత్వం పక్షాన భరించినట్లయితే సారవంతమైన చెరువు మట్టిని రైతులు తమస్వంత ఖర్చులతో చేలల్లోకి తోలుకుంటారని కొన్ని గ్రామాల్లో పేదవారికిచ్చిన ఇళ్ళ స్థలాల్ని బరంతుచేయడానికి కూడా ఉపయోగించుకోవచ్చని నేను సూచించాను. రైతులు తమ ఖర్చుతో మట్టిని తీసుకెళ్ళడానికి ముందుకు రారని కొందరు మంత్రులన్నారు. అయితే నా సూచనను పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డి బలపరిచారు. రాష్ట్ర స్థాయిలో నీరు–మీరు కార్యక్రమం ప్రారంభానికి ఒక రోజు ముందే 22 మార్చి 2000న మైలవరం నియోజక వర్గంలోని కుంటముక్కల గ్రామంలోని చెరువు నుంచి నేను చెప్పిన విధంగా చెరువులు లోతు చేసే కార్యక్రమం చేపట్టాం. హెలికాప్టర్‌లో చంద్రబాబు నాయుడు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రం మొత్తం మీద వందలాది చెరువుల్లో ఈ విధంగా పూడికను కొంత మేరకు తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచగలగడం సాధ్యపడింది. సాధారణంగా నీటిపారుదల శాఖవారు ఇదే కార్యక్రమాన్ని అమలు చేయ్యాలంటే కనీసం నాలుగైదు రెట్లు అధికంగా ఖర్చుపెడితే తప్ప అంత మట్టిని తీయడం సాధ్యమైవుండేది కాదు. ఈ కార్యక్రమం వల్ల అధికారులకేమీ లాభం చేకూరనందువల్ల వారు ముఖ్యమంత్రికి సాగునీటి సంఘాల అధ్యక్షులు కొంతమేరకు ఈ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నారని తప్పుడు సమాచారం అందించారు. ఆయన ప్రజాప్రతినిధుల కంటే అధికారుల మాటకే ఎక్కువ విలువను ఇచ్చిన కారణంగా

ఈ పథకం మరింత సమర్ధవంతంగా ముందుకు కొనసాగలేదు. వాస్తవానికి ఈ చెరువుల పూడిక తీత కార్యక్రమంలో లొసుగులకు తావులేని విధంగా మార్గదర్శక సూత్రాల్ని రూపొందించారు. క్యూబిక్ మీటర్‌కు 8 రూపాయల చొప్పున ప్రొక్లెయిన్లు పనిచేసిన గంటలు, తొలగించబడిన మట్టి పరిమాణం సరిపోవాల్సి వుంటుంది. ఆ తర్వాత సంవత్సరాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని పెద్దయెత్తున నిర్వహించి వుండివుంటే వర్షాధార ప్రాంతాల్లో చెరువుల కింద ఆయకట్టుకు ఎంతో ప్రయోజనం చేకూరివుండేది. దేవంలోనే కాక మన రాష్ట్రంలో కూడా చెరువుల కింద విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిన నేపథ్యంలో ఈ పథకాన్ని ఎంత సమర్థవంతంగా అమలు చేయగలిగితే రైతులకు అంత మేలు చేకూరుతుంది.

నీరు–మీరు కార్యక్రమం కింద మైలవరం నియోజకవర్గంలో భూగర్భ జల పెంపుదల కోసం ఎ.కొండూరు మండలంలో 71 పనులకు 55 లక్షలు, జి.కొండూరు మండలంలో 18 పనులకు 49 లక్షలు, మైలవరం మండలంలో 26 పనులకు 82.5 లక్షలు, రెడ్డిగూడెం మండలంలో 90 పనులకు 72.4 లక్షలతో 115 చెక్‌డ్యాముల నిర్మాణం, 48 ఊటచెరువులు, 20 చెరువులకు పూడిక తీయడం జరిగింది. 57 వాటర్ షెడ్‌లను 51 లక్షల ఖర్చుతో చేసి పూర్తిచేయించాం.

995 ఫిబ్రవరిలో జలచైతన్య ఉద్యమ స్ఫూర్తిధాత అన్నా హజారే స్వగ్రామమైన రాలేగాం సిద్ధిని సందర్శించాను. కేంద్ర జలవనరుల శాఖామంత్రి శీష్‌రాం ఓలాను వొప్పించి 1998లో రాష్ట్రానికి 110 కోట్లు మంజూరు చేయించాను. ఆ నిధులలో కొన్ని కోట్ల రూపాయలను కృష్ణా డెల్టాలోని పంటకాలువల పూడిక తీయడానికి వినియోగించారు.

## ***2003 ఖరీఫ్‌లో కృష్ణ డెల్టాకు సాగు నీటి విడుదలలో జాప్యం***

నేను అమెరికాలో వరల్డ్ అగ్రికల్చర్ ఫోరం సమావేశానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి కృష్ణా డెల్టా రైతాంగంలో తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉంది. ఆ సంవత్సరం వర్షాలు అప్పటి వరకు సరిపడనందున సాగర్‌లో మట్టం కొంత తక్కువగా ఉంది. ఆ నాటి ఇరిగేషన్ మంత్రి కడియం శ్రీహరి గారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో ఇప్పుడు మనం డెల్టాకు నీరు వదిలితే హైదరాబాద్ నగరానికి రానున్న మాసాలలో త్రాగు నీరు ఇవ్వడానికి ఇబ్బంది కలుగవచ్చు అని చెప్పారట! అందువలన నీరు విడుదల జరిగి ఉండలేదు. నేను విషయములు తెలుసుకుని 2003 జూలై 23న కృష్ణ డెల్టాకు

నీరు ఇప్పటి వరకు వదలక పోవడం సరికాదు. డెల్టాలో సమలెవెల్‌గా నల్లరేగడి భూమి ఉంటుంది. సార్వాలో వరి, చెరకు తప్ప వేరే పంటలకు అవకాశం ఉండదు. రానున్న నెలలలో ఎగువ రాష్ట్రాలలో వర్షాలు పడి మనకు తప్పనిసరిగా నీరు వచ్చి తీరుతాయి. కాబట్టి ఇప్పటి నుండి నారుమళ్ళు పెంచుకోవడానికి తగిన విధంగా సాగునీరు అందిస్తు వెళితే దరిమిలా సాగుకు నీరు వదలవచ్చు అని ముఖ్యమంత్రి గారికి తెలియజేయగా మరుసటి రోజున ఆయన ఛాంబర్‌లో నన్ను, డా॥ కోడెలను, శ్రీహరి గారిని సమావేశ పరిచారు. 140 సంవత్సరాల నుండి రైపేరియన్ హక్కు ఉన్న కృష్ణ డెల్టాకు నీరు ఎలా ఆపుతారు? నవంబర్, డిసెంబర్ మాసాలలో తుఫాన్‌ల ప్రమాదం ఉంటుందని గట్టిగా వాదించగా అప్పుడు నీరు వదిలేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది.

***విద్యుత్ సౌకర్యం***

సమాజ ప్రగతికి నాణ్యమైన విద్యుత్తు చాలా ముఖ్యం. లోవోల్టేజిని నివారించి నాణ్యమైన విద్యుత్తును అందించడానికి గాను ఎ.కొండూరు మండలంలోని కంభంపాడులో 132/11 కె.వి.సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగి, ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్యను అధిగమించే విధంగా చర్యలు తీసుకోవాలని చాలా కాలంగా డిమాండ్ ఉంటూ వచ్చింది. విద్యుత్‌శాఖ అధికారుల్ని ఒప్పించి 132/11 కె.వి.సబ్‌స్టేషన్‌ను 8 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మింపచేశాను. రెడ్డిగూడెం మండలం రంగాపురంలోను, ఇబ్రహీంపట్నం మండలం దొనబండలోను 33/11 కె.వి.సబ్‌స్టేషన్లను నిర్మింపచేశాను. ఎ.కొండూరు మండలం



*ఎ. కొండూరు మండలం కంభంపాడు లో 132/11 కె.వి. సబ్ స్టేషన్*

చీమలపాడులోను, ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోను 33/11 కె.వి.సబ్‌స్టేషన్లను నిర్మింపచేశాను. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో మూడు వందల పదహారు లక్షల రూపాయల ఖర్చుతో 219 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయడం జరిగింది.

***<u>రహదారులు</u>***

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద కొటికలపూడి ప్రధాన రహదారికి రూ.14 లక్షలు, ఐ.టి.రోడ్డు–గుర్రాజుపాలెం రహదారికి రూ.18లక్షలు, వి.వి.రోడ్డు –చేగిరెడ్డిపాడు రహదారికి రూ.7లక్షలు, వి.వి.రోడ్డు– కంద్రిక రహదారికి రూ.10లక్షలు, ఐ.టి.రోడ్డు–దాసుళ్ళపాలెం రహదారికి రూ.9లక్షలు, ఐ.టి.రోడ్డు–జంగాలపల్లి రహదారికి రూ.15లక్షలు, వి.వి.రోడ్డు–రెడ్డికుంట రహదారికి రూ.11లక్షలు, ఎం.ఎన్.కె.రోడ్డు–పాతకొండూరు రహదారికి రూ.10లక్షలు, ఐ.టి.రోడ్డు–కోమటిగుంట రహదారికి రూ.43 లక్షలు, ఎం.ఎన్.కె.–జీళ్ళకుంట రహదారికి రూ.25 లక్షలు ఖర్చుచేసి పక్కాగా తారురోడ్లను నిర్మించడం జరిగింది. పినపాక నుంచి జి.కొండూరు లింక్‌రోడ్డును రూ.10లక్షలతోను, గుర్రాజుపాలెం–కుంటముక్కల రహదారిని రూ.12 లక్షలతోను అభివృద్ధిచేయడం జరిగింది.

రహదారులు, భవనాల శాఖ పరిధిలో వున్న మూలపాడు–గడ్డమణుగురోడ్డును రూ.11లక్షలు, ఇబ్రహీపంట్నం– జి.కొండూరు రోడ్డును రూ.65 లక్షలు, పైడూరుపాడు–కట్టుబడిపాలెం రోడ్డును రూ.27లక్షలు, కంభంపాడు – గొల్లమందల రోడ్డును రూ.13 లక్షలు, విజయవాడ–విస్సన్నపేట రహదారిని రూ.113 లక్షలు, ఎం.ఎన్.కె.రోడ్డు–వెదురుబీడెంరోడ్డును రూ.25లక్షలతోను, రుద్రవరం–రెడ్డిగూడెం రోడ్డును రూ.24 లక్షలతోను, జి.కొండూరు, వెంకటాపురం రోడ్డును రూ.30 లక్షల రూపాయలతోను ప్రత్యేక మరమ్మతుల కార్యక్రమం కింద ఈ రహదారుల్ని అభివృద్ధి చేయడం జరిగింది.

ఐ.టి.రోడ్డు నుంచి ఈలప్రోలు రహదారి అభివృద్ధికి రూ.80లక్షలు మంజూరు చేయడం జరిగింది. కాకర్ల–కోటపాడు రహదారికి వల్లంపట్ల వద్ద రూ.25 లక్షల రూపాయలతో కాజ్‌వే నిర్మాణాన్ని మంజూరు చేయించాను.

***<u>విద్య</u>***

లక్కిరెడ్డి బాలిరెడ్డి గారి కుటుంబం అమెరికాలో స్థిరపడి ఆర్థికంగా బలపడ్డారు. మన రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలను పలువురు ప్రారంభిస్తూవున్న తరుణంలో



*లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజి*

వీరు కూడా ఒక ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పేందుకు ప్రయత్నించారు. లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను మైలవరంలో తాత్కాలిక ప్రాతి పదికన కొనసాగే విధంగా జేష్ఠ రమేష్‌బాబు ఎమ్.ఎల్.ఏ. గా ఉండగా అనుమతి మంజూరు చేయించారు. నేను మంత్రిగా వుండగా దీనిని శాశ్వతంగా మైలవరంలోనే కొనసాగే విధంగా అనుమతిని ఇప్పించాను. జిల్లా కలెక్టర్ బి.ఆర్.మీనాను కూడా అంగీకరింపజేసి, ఈ కళాశాలలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకే గాక మైలవరం పరిసర గ్రామాల ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉండే విధంగా చక్కని పార్కును అభివృద్ధి చేయడానికి ఏడు ఎకరాల భూమిని లీజుకు అందించడం జరిగింది. ఈ పార్క్‌ను ఇంజనీరింగ్ కళాశాల వారు అభివృద్ధి చేశారు. దేవుని చెరువులో ఎనిమిదిన్నర ఎకరాల స్థలంలో లక్కిరెడ్డి హనిమిరెడ్డి అందించిన పదిలక్షల రూపాయలతోను, జన్మభూమి గ్రాంటుకింద 20 లక్షల రూపాయలతోను స్టేడియం నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. సూరానేని సూరిబాబు గారు చాలా మంచి వ్యక్తి. తెలుగుదేశం పార్టీ సమావేశాలు వారి ఇంటి వద్దనే జరుగుతూ ఉండేవి. స్టేడియానికి ఎదురుగా ఉన్న పంచాయితీ పార్కుకు సూరానేని సూరిబాబుగారి పేరుపెట్టి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం జరిగింది. ఇబ్రహీపట్నం– తిరువూరు రోడ్డులో ఇంజనీరింగ్ కళాశాలకు ఎదురుగా ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్.రావుగారి విగ్రహాన్ని నెలకొల్పాలని నేను చేసిన సూచనతో కళాశాల యాజమాన్యం ఏర్పాటుచేసింది. ఇటీవల కాలంలో ఈ కళాశాలలో కూడా క్యాంపస్ సెలక్షన్స్ జరుగుతూ వుండడం నాకు సంతోషాన్ని కలిగించింది.

మైలవరంలో ఎస్.వి. సుధాకరరావుగారి కుమారుడు తలపెట్టిన ప్రైవేటు డిగ్రీ కళాశాలకు పర్మిషన్ ఇప్పించాను. ఎ.కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయించి రూ.24 లక్షలతో భవన నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. రెడ్డిగూడెంలో ప్రయివేటు యాజమాన్యంలో జూనియర్ కళాశాల స్థాపన జరిగింది. 34 కొత్త పాఠశాలల్ని ప్రారంభించాం. ఆరు ప్రాథమికోన్నత పాఠశాలల్ని ఉన్నత పాఠశాలలుగాను, 25 ప్రాథమిక పాఠశాలల్ని ప్రాథమికోన్నత పాఠశాలలుగాను అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. రూ.54.5 లక్షలు ఖర్చుచేసి మూడు పాఠశాల భవనాలు, 20 పాఠశాలలకు 56 అదనపు గదుల వసతిని సమకూర్చాం. ఎ.కొండూరులో గిరిజన ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి రూ.32 లక్షలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు 57లక్షల రూపాయలు మంజూరు చేయించి, అసంపూర్తిగా వున్న భవనాన్ని పూర్తిచేయించాం. రెడ్డిగూడెం మండలం రంగాపురంలో రూ.1.07 కోట్లతో వెలుగు పథకం కింద బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయించాం.





*మైలవరం మార్కెట్ యార్డులో రైతు కేంద్రం, గోదాముల కాంప్లెక్స్*

***<u>మార్కెటింగ్ - రైతుబంధు పథకం</u>***

ప్రత్తి రైతులకు సాంకేతిక సలహాలను అందించడానికి, పండించిన పత్తిని అమ్ముకోడానికి సౌలభ్యం కల్పించడం కోసం రూ.1.80 కోట్లతో భవనాల్ని మైలవరం మార్కెట్ యార్డులో నిర్మించడం జరిగింది. పత్తి నాణ్యతను పరిశీలించే పరికరాలను కూడా ఏర్పాటు చేయించాము. నియోజకవర్గంలోని 30 గ్రామాలకు రూ.46 లక్షలతో లింక్‌రోడ్ల నిర్మాణం జరిగింది. 68లక్షల రూపాయలతో మైలవరంలో రెండు, ఎ.కొండూరులో ఒకటి, వెలగలేరులో ఒకటి, రెడ్డిగూడెంలో ఒకటి గోదాముల నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. 'రైతుబంధు' పథకం కింద రూ.2.53 కోట్లతో రైతులకు సహకారం అందించడం జరిగింది. పంట వచ్చిన కొత్తలో ధరలు తక్కువగా ఉంటాయి. మూడు

లేక నాలుగు నెలలు ఆపుకోగలిగితే మంచి ధరలు వస్తాయి. అందువలననే టి.డి.పి. ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దరిమిల రైతుబంధు పథకం మూలపడటం వలన రైతులు చాలా నష్టపోయారు. మైలవరం మార్కెట్ యార్డులో పశువుల సంత నిర్వహణకు పక్కా వసతి ఏర్పాటుచేయించాం.

***<u>రైతు బజార్ల ఏర్పాటు</u>***


నా ప్రజా జీవితంలో నాకు అత్యధికముగా సంతృప్తిని కలిగించినది రైతుబజార్ల ఏర్పాటు అంశం. ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా వుండగా చండీఘర్‌లో జాతీయ వ్యవసాయ - పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను సందర్శించాను. అంతకు మునుపే పంజాబ్‌లో 'అప్‌నీ మండీ' మార్కెట్ల గురించి విని వుండి ఆ రోజు ఒక అప్‌నీ మండీ వద్దకు వెళ్ళాను. పంజాబ్ సెక్రటేరియట్‌కు వెళ్ళి,



అధికారులతో మాట్లాడి అందుకు సంబంధించిన పుస్తకాలను సేకరించి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారితో మన రాష్ట్రంలో కూడా ఇటువంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తే వినియోగదారునకు సరసమైన ధరకే కూరగాయలు లభించడమేగాక మధ్య ళారి లేనందువలన వినియోగదారుడు చెల్లించే ప్రతి రూపాయి పండించిన రైతుకు లభిస్తుంది అని చెప్పాను. ఆయన మంచి ఆలోచన దీనిని మరింత మెరుగుగా అమలు చేద్దామన్నారు. పలు రైతుబజార్లలో మౌలిక వసతులు సమకూర్చడమేగాక వేకువజామునే రైతులు తాము పండించిన కూరగాయలను రైతు బజార్ల వద్దకు తీసుకు వచ్చు నిమిత్తం ఆర్.టి.సి. బస్సు సౌకర్యం కూడా కల్పించబడింది. ముఖ్యమంత్రి గారి కార్యదర్శి డాక్టర్ ఎమ్. సాంబశివరావుగారు ఈ అంశంపైన ప్రత్యేక శ్రద్ధ వహించారు. రాష్ట్రం మొత్తంమీద దాదాపు 103 రైతుబజార్లు ఏర్పాటయ్యాయి. రూ. 13 కోట్లు వెచ్చించి 34 రైతు బజార్లలో పక్కా భవనములు నిర్మించబడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబజార్ల నిర్వహణపైన అజమాయిషీ తగ్గటం వలన లోగడ అంత సమర్థవంతంగా పనిచేస్తూ వుండకపోయినా ఇప్పటికీ కూడా ఇవి ఉండటం వలనే కూరగాయలు పేదవర్గాలకు కొంత సరసమైన ధరలకు అందుతూవున్నాయనే భావన పలువుర్లో వుంది. విజయవాడలో స్వరాజ్యమైదాన్‌లో రైతుబజార్‌ను ప్రారంభించాము.

**<u>వైద్యం</u>**

ఎ.కొండూరు, జి.కొండూరు, రెడ్డిగూడెం, కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.88 లక్షలతో భవన నిర్మాణాలు జరిగాయి. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటలూ పనిచేసే విధంగా రిఫరల్ ఆసుపత్రిగా మార్పు చేయడం జరిగింది. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించి, భవన నిర్మాణానికి 22 లక్షల రూపాయలను మంజూరు చేయించాం. కొండపల్లిలో దేవినేని కిషోర్, ఇంకా లయన్స్ సభ్యుల సహకారంతో కంటి ఆసుపత్రిని నిర్మిస్తామని ముందుకు వచ్చిన సందర్భంలో అందుకోసం ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించడం జరిగింది. ఇటీవలే ఆ ఆస్పత్రి భవనం సర్వహంగులతో సుందరంగా రూపుదిద్దుకుని ప్రారంభం జరగడం, అందులో నేను పాల్గొనడం ఎంతో తృప్తినిచ్చింది.




*కొండపల్లిలో ఆర్.&బి స్థలంలో లయన్స్ కంటి ఆసుపత్రి*

ఉయ్యూరులో రోటరీ కంటి ఆస్పత్రి పాలడుగు నాగేశ్వరదాసు, మరికొందరు వదాన్యుల సహకారంతోను, కె.సి.పి.సంస్థ సహకారంతోను, అందులో పనిచేసే వైద్యులు డాక్టర్ రత్నకుమార్, ఆయన అర్ధాంగి డాక్టర్ ఉమ ఆధ్వర్యంలో చక్కని సేవలందించింది. మైలవరం ప్రాంతంలోని ప్రజలకు కూడా ఉయ్యూరు రోటరీ కంటి ఆస్పత్రి వారి సేవలు లభింపచేయాలనే ఆలోచన నాకు కలిగింది. ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డిగారు, చక్కని భవనాన్ని నిర్మించివున్నారు. అధికారుల అలక్ష్యం వల్ల ఆ భవనం నిరుపయోగంగా ఉంది. అటువంటి స్థితిలో ఉన్న ఆ భవనాన్ని ప్రభుత్వ

ఆస్పత్రి అధీనంలోకి తీసుకోవడం జరిగింది. అందులో కొంత భాగంలో వారం వారం ఉయ్యూరు రోటరీ కంటి ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య పరీక్షల్ని నిర్వహించి, అవసరమైన ఔషధాల్ని, కళ్ళద్దాల్ని ఇవ్వడం జరిగే పద్ధతిని ఏర్పరచాము. ఆనాటి నుంచి ఈనాటి వరకు అది కొనసాగుతూ వేలాది మంది పేద ప్రజలకు మేలుచేకూరింది. గత దశాబ్దకాలంలో దాదాపు రెండులక్షల మందికి పరీక్షలు నిర్వహించగా, 12వేల మందికి కంటి ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఎల్.బి.ఆర్.ఇంజనీరింగ్ కళాశాల వారు తమ బస్సులలో ఉయ్యూరు కంటి ఆసుపత్రికి తీసుకువచ్చి, తిరిగి తీసుకువెళ్ళే పద్ధతి ఈనాటికీ కొనసాగుతూ వుంది. ఈ అంశం నాకు ఇప్పటికీ ఎంతో ఆనందాన్నీ, సంతృప్తినీ కలిగిస్తుంది.




*కృష్ణ జిల్లా రంగాపురంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల*

## సాంఘిక సంక్షేమం

మైలవరం గ్రామంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం, జి.కొండూరులో బి.సి.బాలికల వసతిగృహం, కొండపల్లిలో ఎస్.సి., ఎస్.టి., బి.సి. బాలుర వసతి గృహాలు, రెడ్డిగూడెంలో ఎస్.సి.బాలికల వసతి గృహాల్ని మంజూరు చేయించాం.



ఎ. కొండూరులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కార్యక్రమంలో

## మైనారిటీల సంక్షేమం

కొండపల్లి, మైలవరం గ్రామాల్లో రూ. 25 లక్షలతో షాదీఖానాలు నిర్మింపచేశాం. కృష్ణారావుపాలెం, కుదప, కొండపల్లి గ్రామాల్లో మసీదులు, కవులూరు గ్రామంలో చర్చి నిర్మించడం జరిగింది.



కొండపల్లిలో షాదీఖానకు శంకుస్థాపన సందర్భంగా

**మహిళా సంక్షేమం**

21,242 మంది సభ్యులకు 1634 డ్వాక్రాగ్రూపులు ఏర్పాటుచేయబడి, 2.35 కోట్ల రూపాయలు పొదుపు జరిగింది. బ్యాంకులు, ప్రభుత్వం ద్వారా రూ.3.46 కోట్ల మంజూరు కాబడి మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించారు. 25 అంగన్‌వాడి, ఆరు మహిళా మండళ్ల భవనాలు నిర్మించడం జరిగింది. ముఖ్యమంత్రి యువశక్తి పథకం కింద 47గ్రూపులకు 47లక్షల రూపాయలు, 2988 వృద్ధాప్య పెన్షన్లు, 257 వితంతు పెన్షన్లు, 117 వికలాంగ పెన్షన్లు, 11,016 దీపం కనెక్షన్లు మంజూరయ్యాయి.



*కొండపల్లిలో ఖిల్లా*

**పర్యాటకం**

కొండపల్లి ఖిల్లా అభివృద్ధికి 59 లక్షల రూపాయలు మంజూరు చేయించి, రూ.10లక్షలతో పనులు ప్రారంభించడం జరిగింది. కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామాలు, వి.టి.పి.ఎస్., ఎ.పి.హెవీ మెషనరీ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్, ల్యాంకో, ఇండస్ట్రియల్ ఎస్టేట్ మొదలైన పరిశ్రమలతో వేగంగా అభివృద్ధి చెందుతూ ఉన్న నేపథ్యంలో కొండపల్లి గజపతి చెరువును 35 లక్షల రూపాయలతో అభివృద్ధి పరచి, బోట్ షికారుకు వీలుగా నిర్వహించడం కోసం అభివృద్ధి చేయడం జరిగింది. కొండపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయించాను.

**కృత్తివెంటి పేర్రాజుపంతులు మల్టీపర్పస్ వ్యవసాయ పాలిటెక్నిక్**

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మునిసిపల్ ఛైర్మన్‌గా, ప్రముఖ

న్యాయవాదిగా పనిచేసిన కృత్తివెంటి పేర్రాజు పంతులుగారు స్వాతంత్ర్య పోరాట కాలంలో మచిలీపట్నంలో కోపల్లె హనుమంతరావుగారు ప్రభృతులు స్థాపించిన ఆంధ్ర జాతీయ కళాశాలను స్ఫూర్తిగా తీసుకుని ఒక జాతీయ వ్యవసాయ పాఠశాలను రామచంద్రాపురంలో ఏర్పాటు చేయడానికి మంచి సాగునీటి వసతిగల సుసంపన్నమైన వంద ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలకు అనేకమంది పెద్ద యెత్తున ఆస్తుల రూపంలోను, నగదు రూపంలోను ఆరోజుల్లో విరాళాలు అందచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశ సత్వర ప్రగతి కోసం అనుసరించాల్సిన విద్య, ఉపాధి వంటి అంశాలపైన ఉత్తమమైన శిక్షణ ఇవ్వడానికి ఈ కళాశాలను ఏర్పాటుచేశారు. బందరు ప్రాంతంతో సంబంధం కలిగిన పేర్రాజు పంతులుగారు రామచంద్రపురంలో నెలకొల్పవలసిన జాతీయ వ్యవసాయ పాఠశాలలో వ్యవసాయాభివృద్ధికి అవసరమైన అంశాల్ని బోధించడంతోపాటు చక్కని క్రమశిక్షణను, లౌకికతత్వాన్ని, దేశభక్తిని పెంపొందించే విధంగా ఆ పాఠశాలలో విద్యావ్యాసంగం కొనసాగించాలని అభిలషించారు. ఆ పాఠశాలకు తన పేరు పెట్టమని ఆయన కోరలేదు. ఆయనకు పిల్లలు ఉన్నప్పటికీ ఇంత పెద్దయెత్తున తన భూమిని దేశాభివృద్ధి కోసం, సమాజ కల్యాణం కోసం దానం చేయడం గొప్ప విశేషం.



*కృత్తివెంటి పేర్రాజు పంతులు గారి ప్రస్తుత కుటుంబ సభ్యులు*

రామచంద్రపురం తెలుగుదేశం శాసనసభ్యుడు తోట త్రిమూర్తులు, వాజ్‌పేయిగారి ప్రభుత్వంలో వ్యవసాయ సహాయమంత్రిగా పనిచేసిన ఎస్.బి.పి.బి.కె.

సత్యనారాయణరావుగారు హైదరాబాదులో నన్ను కలసి కొన్ని దశాబ్దాల క్రితం పే(్రాజు పంతులుగారు జాతీయ వ్యవసాయ పాఠశాల కోసం దానంగా ఇచ్చిన విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. దీని గురించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అప్పుడు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐ.వి.సుబ్బారావుగారిని, రిజిస్ట్రార్ రఘువర్ధనరెడ్డిగారిని, మరికొందరు యూనివర్సిటీ అధికారుల్ని తీసుకుని, రామచంద్రపురం వెళ్ళి అక్కడి భూముల పరిస్థితులన్నింటినీ పరిశీలించి వ్యవసాయ పాలిటెక్నిక్‌ను ఏర్పాటుచేస్తే బావుంటుందని భావించాము. దీని విషయమై నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో మాట్లాడి, 'కృత్తివెంటి పే(్రాజుపంతులు మల్టీపర్పస్ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్'ను ఏర్పాటుచేశాం. ఆ పాలిటెక్నిక్‌ను నా స్వహస్తాలతో ప్రారంభించడం నా జీవితంలో ఎంతో తృప్తిని కలిగించిన అంశం. కొద్ది సంవత్సరాల తర్వాత మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో పే(్రాజు పంతులు గారి మనవడు తన కుటుంబంతో కనిపించారు. ఆయన పేరు కూడా పే(్రాజు పంతులుగారే. మీ కుటుంబ సభ్యులున్నాసరే అంత పెద్ద భూరి విరాళాన్ని విద్యాసంస్థకు అందజేయడం గురించి మీరేమనుకుంటున్నారని అడిగాం. మా తాతగారు ఆ విధంగా చేయడం మాకెంతో గర్వకారణంగా ఉందని ఆయన అన్నప్పుడు నాకెంతో ఆనందం కలిగింది.



*వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చౌదరి చరణ్ సింగ్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సెంటర్ భవనమును ప్రారంభిస్తున్న అజీత్ సింగ్, చంద్రబాబు నాయుడులతో*

## చరణ్‌సింగ్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ & కమ్యూనికేషన్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్

చరణ్‌సింగ్‌గారు మరణించిన తర్వాత నేను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా కూడా

ఉన్నాను. చరణ్‌సింగ్ గారి పేరున ఒక ఎండోమెంటును ఏర్పాటుచేయడానికి కొంతమొత్తాన్ని యూనివర్శిటీకి అందచేశాను. దానిపైన వచ్చే వడ్డీని అగ్రికల్చరల్ ఎకనామిక్స్‌లో అత్యుత్తమ ఫలితాన్ని సాధించిన వ్యక్తికి ఆ మొత్తాన్ని అందచేస్తారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపైన, శాస్త్రజ్ఞులు జరిపిన పరిశోధనల ఫలితాల్ని రైతులకు చేరవేయడానికి 'చౌదరి చరణ్‌సింగ్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్' ను నెలకొల్పాం. దీనికి అనుబంధంగానే పబ్లిషింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటుచేశాం.

***కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలాన్ని ఇవ్వకూడదు***

విజయవాడ నగరంలోని బందరురోడ్డులో కెనాల్ గెస్ట్‌హౌస్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఏ ప్రధానమంత్రి లేక ముఖ్యమంత్రి వచ్చినా, అందులో బసచేసేవారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమం సందర్భంగా ప్రజానాయకుడు కాకాని వెంటకరత్నంగారు అక్కడనే అశువులు బాశారు. ఆ భూమిలో గోకరాజు గంగరాజుగారు పర్యాటక అభివృద్ధి కోసం మల్టిప్లెక్స్ నిర్మాణం చేయడానికిగాను లీజు పద్ధతిపై తనకు కావాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెట్టారు. ఈ విషయం నాకు తెలిసింది. జిల్లా కలెక్టర్ బి.ఆర్.మీనాగారితో ఈ స్థలం ఇవ్వడం సరైన నిర్ణయం కాదు, భవిష్యత్తులో భారీస్థాయి ప్రభుత్వ భవన సముదాయం నిర్మించడానికి ఈ స్థలం ఉపయోగంగా ఉంటుంది కావున కృష్ణానది ప్రక్కన వారధికి పడమర వైపున కృష్ణలంకలోని ఆర్ & బి డిపార్టుమెంటు పరిధిలో ఖాళీగావున్న భూమిని ఇవ్వడం సముచితంగా ఉంటుందని చెప్పగా మీనాగారు కూడా అదే బాగుంటుందని




*దశాబ్ద కాలం దాటిపోతూవున్నా పూర్తికాని వినియోగంలోకి రాని మల్టీప్లెక్స్*

అన్నారు. అంతకుముందు హనుమాన్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, నిజాం షుగర్ ఫ్యాక్టరీలను గంగరాజుగారు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన సందర్భంలో వారికి రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో వున్న పెద్దలతో, కొంతమంది అధికారులతో ప్రత్యేకమైన ఆర్థిక అనుబంధం పెంపొంది వుండడం వల్ల హైదరాబాద్‌లోని సి.ఎం. కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ మీనాగారికి "ఏమిటి, మీరింకా అనుకూలంగా ఫైలు పంపలేదేమిటి?" అని ఫోన్లు మీద ఫోన్లు వచ్చిన తర్వాత మీనాగారు కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలాన్ని గంగరాజుగారికి లీజుకు ఇవ్వడానికి అనుకూలంగా ఫైలును పంపడం, ఆఘమేఘాల మీద వారికి లీజును మంజూరు చేయడం జరిగాయి. అప్పటికప్పుడే వెంటనే ఈ ప్రాజెక్టు ప్రతిపాదన కార్యరూపం ధరించకపోతే బెజవాడ ప్రాంతంలో టూరిజం అభివృద్ధే జరగదనే దృక్పథంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు వ్యవహరించారు. ఇప్పటికి పది సంవత్సరాలు దాటిపోయినా ఈనాటికీ ఆ మల్టిప్లెక్స్ ప్రాజెక్టు కాంప్లెక్సు పూర్తికాకపోగా దాన్ని ఎవరికో అమ్మారని, దానిపైన అమ్మడానికి గంగరాజుగారికి హక్కులేదని, కోర్టులో పిటీషన్ దాఖలు చేయబడిందని నాకు తర్వాత తెలిసింది. బందరురోడ్డు వెంట ప్రయాణించినప్పుడల్లా నాకు గతంలో జరిగిన ఈ అంశం గుర్తుకు వస్తూ, బాధ కలుగుతూనే ఉంటుంది. చాలా పెద్ద యెత్తున ఆస్తులు సంపాదించినప్పటికీ, సంతృప్తి లేకుండా ప్రభుత్వ / ప్రజల ఉమ్మడి సంపదను హస్తగతం చేసుకోవాలనే ఆలోచనలు ఈనాడు మనకు ఎందరిలోనో కనిపిస్తూవుండడం బాధాకరం.

## ట్రక్ టెర్మినల్

విజయవాడ నగరంలో రానురాను ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతూవుంది. ఫలితంగా నగర ప్రజలకు, పట్టణాన్ని సందర్శించేవారికి చాలా ఇబ్బంది కలుగుతూవుంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలోకి సరకుల్ని తీసుకువచ్చే భారీ వాహనాలకు ఇబ్రహీంపట్నం సమీపంలోనే ఒక ట్రక్ టెర్నినల్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని ఆలోచించి, స్థానిక పెద్దలు మల్లెల పద్మనాభరావుగారితో వి.టి.పి.ఎస్., విజిటి ఉడా వారితో మాట్లాడి కలెక్టర్‌గారి ద్వారా ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపి, 21 కోట్ల రూపాయలతో విజిటి వుడా, ఇంకా ఎపిఐఐసి సంయుక్త భాగస్వామ్యంలో అభివృద్ధి చేయించడం జరిగింది. 78 ఎకరాల స్థలాన్ని విటిపిఎస్ వారు ఉదారంగా నామమాత్రపు లీజు ధరకు అందించి సహకరించారు. చంద్రబాబునాయుడుగారు దీనిని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో దీనిపట్ల ఆసక్తి చూపకపోవడం వల్ల చక్కని మౌలిక వసతులు



*ఇబ్రహీంపట్నం వద్ద ట్రక్ టెర్మినల్ కాంప్లెక్స్*

కల్పించబడినప్పటికీ ఉపయోగించుకోకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ఆ ట్రక్ టెర్నినల్‌ను సరిగ్గా వినియోగించుకుంటే విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలా వరకు నివారించబడుతుంది. విజయవాడలో భవానీపురం వద్ద లారీస్టాండ్ నుండీ లారీలను తొలగించాలని మున్సిపల్ కమీషనర్ ఉషారాణీ గారు ఆదేశించగా ఇంటర్‌ట్రిప్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి అన్నే అప్పారావు (చిట్టిబాబు), వారి సంఘ సభ్యులు చెప్పగా కమీషనర్‌తో మాట్లాడి ఆపు చేయించి లారీ స్టాండ్‌లో మీటింగ్ కూడా పెట్టించాను.

***<u>తుమ్మలపాలెంవద్ద టోల్‌గేటు వద్దు</u>***

తొమ్మిదోనంబరు జాతీయరహదారి పైన కీసర వద్ద ఒక టోల్ గేటుంది. చాలా హెచ్చుస్థాయిలో టోల్‌గేటు వసూలు చేస్తూ వున్నారు. హైదరాబాదు-విజయవాడ రోడ్డు ఆ రోజుల్లో నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చెందివుండలేదు. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఈ టోల్ పాడుకున్న సంస్థ వారి ప్రమేయం లేకుండానే ప్రభుత్వ ఖర్చుతో అభివృద్ధి చేయబడింది. ఈ స్థితిలో తుమ్మలపాలెం వద్ద మరొక టోల్‌గేటు నిర్మించి తిరువూరు వైపు వెళ్ళే వాహనాల నుంచి, ట్రక్ టెర్మినల్‌కు వెళ్ళే వాహనాల నుంచి టోల్ వసూలు చేయడానికి ఆ సంస్థ ప్రయత్నం ప్రారంభించి, టోల్‌గేటు నిర్మాణం ప్రారంభించింది. ఇది చాలా అన్యాయమని, ఎంత మాత్రం సమర్ధనీయంకాదని నేను భావించాను. కీసరకు 60 కిలోమీటర్ల లోపలే ఈ టోల్‌గేటు నెలకొల్పే స్థలం ఉన్నదని,



*ఎన్. హెచ్. 9లో తుమ్మలపాలెం వద్ద ఆపుచేసిన టోల్ సముదాయం*

విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ప్రభుత్వ వ్యయంతోనే రహదారి అభివృద్ధి చేయబడివున్నందువల్ల ఇక్కడ మరొక టోల్‌గేటు నిర్మాణం సక్రమం కాదని నేను భావించాను.

నెల్లూరుజిల్లా నాయుడుపేట సమీపంలో ఎం.వెంకయ్యనాయుడుగారి కుమార్తె ఆధ్వర్యంలో నడుస్తూవున్న ట్రస్ట్ కార్యక్రమంలో పాల్గొనడానకి, నాలుగులైన్ల రహదారిగా విస్తరించబడిన ఎన్.హెచ్.5 భాగాన్ని ప్రారంభించడానికి ఆనాడు భారత ఉప ప్రధానిగా వున్న ఎల్.కె. అద్వానీగారు, ఉపరితల రవాణాశాఖ మంత్రి భువనేష్ కందూరీగారు వచ్చిన సందర్భంలో అక్కడికి వెళ్ళి వారికి తుమ్మలపాలెం వద్ద టోల్‌గేట్ నిర్మాణాన్ని ఆపుచేయించాలని వినతి పత్రం ఇచ్చాను అంతటితో ఆగకుండా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుగారు ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆయనతో పాటు వెళ్ళి భువనేష్ కందూరీగారికి ముఖ్యమంత్రి గారితో కూడా చెప్పించాను. పర్యవసానంగా ఈ టోల్‌గేటు నిర్మాణం ఆగిపోయింది. ఆ రోడ్డుమీద ప్రయాణం చేసినప్పుడల్లా ఈ ఉదంతం గుర్తుకొస్తూ ఉంటుంది. ఇప్పటికీ కాంక్రీట్ మొండి పిల్లర్లు సాక్షిభూతంగా నిలచివున్నాయి.

### <u>ప్రజాప్రతినిధులకన్నా ఐ.ఏ.ఎస్.లే ముద్దు</u>

నేను వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో బి.ఆర్.మీనా కలెక్టర్‌గా ఉన్నారు. సమర్ధతతో జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఆయన అర్ధాంగికి వ్యవసాయమంటే చాలా ఆసక్తి ఉండేది. మచిలీపట్నం కలెక్టర్ బంగళాలో పలురకాల కూరగాయలు పండించేవారు. ఆ సమయంలో విజయవాడ నగర మున్సిపల్ కార్పొరేషన్



కమిషనర్‌గా ప్రవీణ్ ప్రకాష్ పనిచేశారు. నగర అభివృద్ధికి ఇక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం జరిగింది. ఆ చర్చల్లో నేను కూడా అప్పుడప్పుడూ పాల్గొంటూవుండేవాణ్ణి. నగరంలో ప్రధానమైన రహదారులు బందరురోడ్డు, ఏలూరురోడ్డులను 120 అడుగుల వెడల్పున అభివృద్ధి చెయ్యాలని ప్రతిపాదించారు. దానిపై నేను నైజాం కాలం నుంచి బందరు నుంచి హైదరాబాదు వరకు రోడ్డు 100 అడుగుల వెడల్పు మాత్రమే ఉండివున్నదని, నగరంలోని హద్దుల మధ్య అక్కడక్కడ కొన్ని చోట్ల ఎన్‌క్రోచ్‌మెంట్లు ఉండివుండవచ్చని, లారీల ట్రాఫిక్ కృష్ణలంక కరకట్ట మీదుగా వెళ్ళిపోతూవున్నందువల్ల బెంజిసర్కిల్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు 100 అడుగుల వెడల్పు ఉంటే సరిపోతుందన్నాను. అందుకోసం భవన యజమానులతో చర్చించి, వారి నుంచి సానుకూలమైన స్పందనను రాబట్టి, కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తే బాగుంటుందని సూచించాను. కొందరు అనేక వ్యయప్రయాసలకోర్చి సమకూర్చుకున్న ధనంతో భవన నిర్మాణం చేసుకున్న తర్వాత ప్రజాప్రయోజనం నిమిత్తం తన భవనాన్ని కూలగొట్టాలంటే సహజంగా చాలా బాధపడతారు. కానీ కొంత వ్యవధి తర్వాత, తప్పదని, కొంతమేరకు త్యాగం చేయాల్సివుంటుందని, ప్రభుత్వానికి సహకరించి, తగిన నష్టపరిహారం పొందవచ్చులే అని మానసికంగా సంసిద్ధులవు తారు. ఇందుకు కొంత సమయం పడుతుంది. ప్రవీణ్ ప్రకాష్ చాలా తొందరపాటుతో, కొంత మూర్ఖత్వంతో వ్యవహరించేవ్యక్తి. ముఖ్యమంత్రితో టెలీకాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సుల సందర్భాల్లో మేం రోడ్లను అభివృద్ధి చేద్దామనుకుంటూ ఉంటే మంత్రిగారే అడ్డం పడుతున్నారనే భావనను కల్పిస్తూవుండేవాడు. భవన యజమానులతో మాట్లాడిన తర్వాత వారందరూ 100 అడుగుల మేరకు వెడల్పు చేయడానికి అంగీకరించారు. రోడ్లు అభివృద్ధి చెందాయి.

వన్‌టౌన్‌లో రథం వద్ద నుంచి పాతశివాలయానికి వెళ్లే బ్రాహ్మణవీధిని వెడల్పు చేయాలని ప్రవీణ్ ప్రకాష్ అనుకున్నదే తడవుగా ప్రొక్లెయిన్లు పంపి భవనాల్ని కూల్చడానికి రంగం సిద్ధం చేశాడు. ఆరోజు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న బి.వి.మోహనరెడ్డిగారు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఉన్నారు. నేను విజయవాడలో ఉన్నప్పుడల్లా స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఉంటూవుండేవాణ్ణి. బ్రాహ్మణవీధిలోని భవనాలవారు తగినంత వ్యవధిలేకుండా వేరే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడానికి అవకాశం లేకుండానే

మా ఇళ్ళు, దుకాణాల్ని కూల్చివేయడానికి కమిషనర్‌గారు ఏర్పాట్లు చేశారని చెప్పగా, బి.వి. మోహనరెడ్డిగారు కమిషనర్‌తో మాట్లాడటానికి ఫోన్‌పై ప్రయత్నం చేసినా అతడు అందుబాటులోకి రాలేదు. ఆరోజుల్లో అధికారులు, ముఖ్యంగా ఐ.ఏ.యస్., ఐ.పి.యస్. అధికారులు ముఖ్యమంత్రి గారితో తరచుగా నేరుగా ముఖాముఖి సంభాషించే అవకాశాలు కలిగినందువల్ల మంత్రుల్నిగానీ, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల్నిగానీ నిర్లక్ష్యం చేయగలిగే పరిస్థితి కొనసాగింది. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐ.ఎ.యస్, ఐ.పి.యస్. అధికారులకు తానంటే ఎంతో అభిమానమని, వారి మాటలకే ఎక్కువ విలువనిస్తూ తాను ఒంటి చేత్తో రాష్ట్రాన్ని పరిపాలించగలననే భావనలో ఉంటూవచ్చారు. ఆయన కొందరు ఐ.ఏ.యస్. అధికారులు తనపట్ల విశ్వాసంగా ఉన్నారని నమ్మారు. అయితే ఆ అధికారులే ఆయన తర్వాత రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగా నియమ నిబంధనల్ని పక్కనబెట్టి వై.యస్. చెప్పినట్లు అడ్డగోలుగా చేశారు.

***<u>కనకదుర్గ ఆలయం వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి:</u>***

కనకదుర్గమ్మ ఆలయం ప్రవేశద్వారం వద్ద తొమ్మిదవ నంబర్ జాతీయరహదారి పైన చాలా తరచుగా ట్రాఫిక్‌జామ్ అవుతూ వుంటుంది. ఇబ్రహీంపట్నంనుంచి భవానీపురం వరకు రహదారిని అభివృద్ధి చేసినప్పటికీ కనకదుర్గమ్మ ఆలయం ప్రవేశద్వారం ప్రక్కన రహదారి తగినంత వెడల్పులేకపోవడంవల్ల ప్రయాణీకులు చాలా ఇబ్బందిపడుతున్నారు. అందువల్ల నదిలో పిల్లర్లు వేసి వాటర్‌వర్క్స్ దగ్గరనుంచి బ్యారేజ్‌వరకు రోడ్డును వెడల్పు చేయాలని నేషనల్ హైవేస్ వారి మీద ఒత్తిడి తెచ్చాను. బ్యారేజ్‌ప్రక్కనే ఇరిగేషన్‌శాఖ కాంపౌండ్‌లో మోడల్‌హౌస్ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించారు. దానిపైన మొదటి అంతస్తు వేయడానికి టెండర్లు పిలిచి వర్క్ చేయడానికి సిద్ధంగా ఉన్న సంగతి తెలిసింది. ఆ విధంగా కట్టినట్లయితే నదిలో పిల్లర్లు వేసి రోడ్డును వెడల్పుచేసే పనికి ఆటంకం కలుగుతుంది. అందువల్ల ఆ పని ముందుకు సాగనివ్వకుండా ఆపడం జరిగింది. 2004 ఎన్నికలైన తర్వాత ప్రభుత్వం మారడం, ఆ భవనం మొదటి అంతస్తు నిర్మాణం జరిగిపోయింది. అప్పటికీ ఇప్పటికీ రోడ్డు వెడల్పుచేసే పనులు జరగక, ప్రయాణీకులు తీవ్రమైన ఇబ్బందులకు లోనుకావడం జరుగుతూనేవుంది.

గతంలో 1977 పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైనా ఆ ఏడు నియోజకవర్గాల్లోని గ్రామాలన్నిటికీ వెళ్ళివుండడం, తర్వాత విజయవాడ ఎం.పి.గా రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఉండడం వలన దాదాపుగా జిల్లాలోని అన్ని గ్రామాలతో, ముఖ్యమైన నాయకులతో పరిచయాలు కొనసాగాయి. సైకం అర్జునరావు, సింహాద్రి

సత్యనారాయణ, అంబటి బ్రాహ్మణయ్యగార్లతో స్నేహంతో దివితాలూకాతోను సన్నిహితమైన సంబంధాలేర్పడ్డాయి. కృష్ణాజిల్లాలోని అన్ని ప్రాంతాలనుంచి ప్రజలు వారికి సమస్యలెదురైనప్పుడు నన్ను కలవడం, వారు చెప్పింది సావధానంగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత వరకు వారు నాదృష్టికి తెచ్చిన ప్రజాసమస్యల పరిష్కారానికి సహకారాన్ని అందిస్తూవుండేవాణ్ణి. జిల్లాపరిషత్ సమావేశాలు, జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశాలు, జిల్లా ఇరిగేషన్ బోర్డు మీటింగులు, మొదలైన సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతువుండేవాణ్ని. 1978నుంచి ఆ విధంగానే ఆయా సమావేశాలకు హాజరవుతుండడం అలవాటయింది. ఎందుకంటే జిల్లాలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, అవి జరగకపోవడానికి, జాప్యానికి కారణాలు, అవి అమలు చేయబడుతూవున్న తీరుతెన్నులు వంటి అంశాలపై చక్కని అవగాహన ఏర్పడుతుంది. అధికారుల్ని నిలదీసి ఆయా మంజూరైన పనులు ఎందుకు అమలు కావడంలేదని అడగడానికి అవకాశాలు లభిస్తాయి. నేను మంత్రిగా ఉండగా వివిధ జిల్లా స్థాయి సమావేశాల్లో కొందరు సభ్యులు, ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉన్న సభ్యులు వితండవాదనలు చేసినా ఓర్పుగా వాటికి అధికారులతో సమాధానాలినిప్పిస్తూ సమావేశాలు అర్థవంతంగా, హుందాగా జరగడానికి నావంతు కృషి చేస్తూవుండేవాణ్ని.

***పులిగడ్డ వారధికి ఔట్ ఫాల్ షెట్టర్లు పెడితే ఉపయోగం***

పులిగడ్డ వద్ద కృష్ణానదికి గుంటూరుజిల్లాను కలుపుతూ వంతెన నిర్మాణం మంజూరయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో ఆ నిర్మించబోయే వంతెనకు ఔట్ ఫాల్ షట్టర్లు ఏర్పాటుచేస్తే సముద్రం నుంచి పులిగడ్డ మీదుగా శ్రీకాకుళం, తోట్లవల్లూరు మొదలైన ప్రాంతాలకు కృష్ణానదిలోకి ఉప్పునీరు రావడంగానీ, భూగర్భజలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకురావడంగానీ ఆగిపోతుందని ఆయనకు చెప్పడమేగాక, బహిరంగసభలో కూడా చెప్పాను. చాలా మంచి సూచన, తప్పకుండా చేయిద్దామన్నారు. కానీ తీరా 2004 ఎన్నికలు సమీపిస్తుండడంతో ఔట్‌ఫాల్ షట్టర్ల ఏర్పాటు లేకుండానే పులిగడ్డ-పెనుమూడి వంతెన నిర్మాణం ప్రారంభమయ్యింది. నవయుగ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చింతా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో వంతెన నిర్మాణం చక్కగా జరిగింది. ఆ కంపెనీ గతంలో జి.ఎం.సి. బాలయోగిగారు స్పీకర్‌గా ఉండగా యానాం-ఎదుర్లంక వంతెన నిర్మాణం చేసింది. ఈ వారధి రేపల్లె ప్రాంతం వారు కృష్ణ జిల్లాలోకి రావడానికి ఎంతో ఉపయోగంగా ఉంది.

## ధన్యజీవి బాలయోగి

జి.ఎం.సి. బాలయోగి నాకు పదవలోక్‌సభలో సహచరుడు. చాలామంచి హృదయమున్న వ్యక్తి. తనను కలసిన వారికెవరి కైనా వీలైనంతమేరకు సహకారాన్ని అందించాలనే పాజిటివ్ దృక్పథంతో ఉండేవారు. ఎం.పి.గా ఉండగా రైల్వేశాఖకు సంబంధించిన ప్రతి సమావేశం సందర్భంలోనూ, రెండవ ప్రపంచయుద్ధం సమయంలో తొలగించబడిన కాకినాడ-కోటిపల్లి రైల్వేలైనును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూవుండేవారు. అలాగే యానాం - ఎదుర్లంక వంతెన ఆవశ్యకత గురించి కూడా అనేకసార్లు ప్రస్తావిస్తూవుండే వారు. అనంతరకాలంలో ఆయన లోక్‌సభ స్పీకర్ కావడం, తన మంచితనంతో ప్రధానమంత్రిగారి నుంచి అందర్నీ ఆకట్టుకున్నారు. దాదాపు అసాధ్యమనిపించే ఆ రెండు పనులనూ ఆయన సాధించగలిగారు. చిన్నవయసులో హెలికాప్టర్ ప్రమాదంలో కాలధర్మం చెందడం ఆయన్ని అభిమానించే వారందరికీ తీరనిలోటు. ప్రతి వ్యక్తీ జన్మిస్తారు, మరణిస్తారు. కానీ చాలా కొద్దిమందికి మాత్రమే అత్యంతఘనంగా కొన్ని గౌరవాలు అంతిమ సమయంలో లభిస్తాయి. అటువంటి భాగ్యం పొందిన వారిలో కాకాని వెంకటరత్నం గారు, పుచ్చలపల్లి సుందరయ్యగారు, జి.ఎం.సి. బాలయోగి గారు ముఖ్యులు. ప్రధానమంత్రిగారి నుంచి ఎంతోమంది ప్రముఖులు దాదాపు అన్ని రాజకీయ పక్షాల నేతలు, వేలాదిమంది ప్రజల సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి నేను కూడ హాజరై శ్రద్ధాంజలి ఘటించాను.



*నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నాటి ప్రధాని వాజ్‌పాయి, స్పీకర్ బాలయోగి, ఎర్రన్నాయుడు లతో వడ్డే*

బాలయోగిగారు స్పీకర్‌గా ఉండగా కింజరపు ఎర్రంనాయుడు తెలుగుదేశం పార్లమెంటరీపార్టీ నాయకుడుగా ఉన్నారు. ఎర్రంనాయుడు కుటుంబం ముందునుండి గౌతులచ్చన్నగారి నాయకత్వంలో వుంటూ వుంది. ఎర్రంనాయుడు మంచి వక్త. అందరితో సత్ సంబంధాలు కొనసాగిస్తూవుండేవారు. నేను రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా న్యూఢిల్లీలో బాధ్యతలు నిర్వర్తిస్తు వుండగా ఎర్రన్నాయుడు, బాలయోగి గార్లు చాలా సహకారం ఇస్తూ వుండేవారు. కేంద్రప్రభుత్వం వద్ద మన రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లోవున్న అనేక పథకాల క్లియరెన్స్‌లకు కృషి చేస్తుండేవాణ్ని. ఆ ప్రయత్నంలో అప్పుడప్పుడు అవసరమనుకున్నప్పుడు బాలయోగిగారి సహకారాన్నికూడా తీసుకుంటుండేవాణ్ని. అంతకు ముందు నేను రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఉండడం, చురుకుగా చర్చల్లో పాల్గొంటూ బలంగా ప్రజల వాణిని వినిపిస్తుండడంతో దాదాపు అందరు మంత్రుల నుంచి సహకారం పొందుతూవుండేవాణ్ని.

కింజరపు ఎర్రంనాయుడు టి.డి.పి. పార్లమెంటరీ పార్టీ నాయకునిగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖమంత్రిగా పనిచేశారు. చక్కని వక్త, చిన్ననాటి నుండి కాంగ్రెస్ వ్యతిరేక భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం తెలుగుదేశం పార్టీకి తీరని నష్టం. ఆయన అంత్యక్రియాలకు హాజరై శ్రద్ధాంజలి ఘటించాను.

## స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్ మంజూరు

నేను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో నందిగామ వెళ్లినప్పుడు బండి ఫకీరయ్య అనే వ్యక్తికి స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పెన్షన్ వచ్చివుండలేదు. కొంతమందిని విచారించగా ఆయన వాస్తవంగానే పరిటాలలో కొనసాగిన స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వ్యక్తి అని, చాలామందికి వచ్చినప్పటికీ ఇతడికి రాకపోవడం అన్యాయమని చెప్పారు. దానిపైన నేను పార్లమెంటు సమావేశానికి వెళ్లేటప్పుడు బండి ఫకీరయ్యగారిని నావెంట తీసుకువెళ్ళి అప్పటి ప్రధానమంత్రి పి.వి.నరసింహరావు గారిని స్వయంగా కలసి జరిగిన విషయాన్ని ఆయనకు విడమరచి చెప్పి, ఆయనకు అర్జీని అందజేశాను. పి.వి.నరసింహరావుగారు ఫకీరయ్యగారికి సమరయోధుల పెన్షన్‌ను వెంటనే మంజూరుచేయడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

గుంటూరు జిల్లాకు చెందిన రావిపాటి ఆంజనేయులు గారికి, వాడపల్లి మురహరిరావుగారి భార్య శ్రీమతి విజయ లక్ష్మమ్మగారికి, కృష్ణాజిల్లా పామర్రు మండలం

కొరిమెర్ల గ్రామానికి చెందిన సూరపనేని వెంకటేశ్వరరావుగారికి, ఒంగోలుకు చెందిన నాదెళ్ళ వెంకటేశ్వరరావు గారికి, కంచికచర్లకు చెందిన దొడ్డపనేని రామారావుగారికి, పమిడి ముక్కల మండలం మేడూరుకు చెందిన యలమంచిలి దశరథ రామయ్యగారికి స్వాతంత్ర్య సమరయోధుల ఫెన్షన్‌ను మంజూరు చేయించాననే సంతృప్తి నాకుంది. ప్రముఖ కవి గరిమెళ్ళ సత్యనారాయణ గారి శత జయంతి సందర్భంగా పోస్టల్ శాఖను ఆయన స్మారక తపాలా బిళ్ళను విడుదల చెయ్యాలని కోరాను. శ్రీకాకుళం జిల్లాలో పుట్టి రంగాగారి శిష్యుడిగా గుంటూరులో స్థిరపడిన అప్పలనాయుడు గురించి నాటి హోం మంత్రి ఇంద్రజిత్ గుప్తాగారి దృష్టికి తీసుకువెళ్ళినప్పటికీ రికార్డ్ సంపూర్ణంగా లభించకపోవడంతో మంజూరు కాలేదు. గుంటూరు ఎం.పి. రాయపాటి సాంబశివరావుగారి సహకారంతో గుంటూరు సమీపంలోని వృద్ధాశ్రమంలో ఆయన కాలం వెళ్ళబుచ్చారు. కొద్దికాలం క్రితమే మరణించారు. ఇంకా కొంతమంది స్వాతంత్రయోధులకు నేను ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉండగా స్వాతంత్ర సమరయోధుల కమిటీలో ఉన్న పెద్దలకు చెప్పి పెన్షన్ శాంక్షన్ చేయడం జరిగింది.

***<u>ఆదర్శప్రాయమైన విజయవాడ లారీ ఓనర్స్ అసోషియేషన్</u>***

విజయవాడలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన వారు ఉన్నప్పటికీ, సంస్థను చక్కగా నడుపుతూ వచ్చారు. బెంజిసర్కిల్ సమీపంలో ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించారు. పెనమకూరు కేశవరావుగారు, చెన్నుపాటి శేషగిరిరావుగారు పాలడుగు వీరభద్రరావు గారు, ఈశ్వరరావు, కొడాలి బాబూరావు, పొట్లూరి రాఘవేంద్రరావు బొప్పన రాఘవేంద్రరావు మున్నగు వారు వారికి సంఘపరంగా సమస్యలు ఎదురైనప్పుడు



నాతో చెప్పడం, వాటి పరిష్కారానికి హైదరాబాద్‌లోగానీ, ఢిల్లీలోగానీ నా వంతు సహకారాన్ని అందిస్తూవుండేవాణ్ని. రానురాను నైపుణ్యత కలిగిన డ్రైవర్ల కొరత రానున్నదని ముందే భావించి, గూడవల్లి సమీపంలో లారీ డ్రైవర్లకు శిక్షణ కేంద్రాన్ని ఈ అసోసియేషన్ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత అంపాపురం వద్ద 25ఎకరాల విశాలమైన ప్రాంగణంలో ఆదర్శప్రాయమైన రీతిలో డ్రైవింగ్ స్కూలును నిర్వహిస్తూవుంది. ఆ సంస్థ కార్యక్రమానికి

కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి రాజశేఖరమూర్తిగారు వచ్చారు. అప్పుడు ఆయనకు నేషనల్ హైవే-5నుంచి ఎనికేపాడు, ప్రసాదంపాడు మధ్యలో వందడుగుల పొలిమేర రోడ్డును అభివృద్ధి చేస్తూ, తాడిగడపవద్ద బందరు కాలువపైన, కృష్ణానదిపైన వంతెన నిర్మించి, తొమ్మిదవనంబరు జాతీయ రహదారిని కలుపుతూ, విజయవాడ క్లబ్‌కు అవతల ఎన్.హెచ్.5ను కలిపితే బాగుంటుందని డ్రాయింగ్ కూడా గీయించి వినతి పత్రాన్ని ఇచ్చాను. మంత్రిగారు దాన్ని పరిశీలింపజేశారు. ఇది చాలా చక్కని ప్రతిపాదన అని అభిప్రాయం వ్యక్తం చేస్తూ, అయితే అప్పటికే రామవరప్పాడు రింగ్‌సెంటర్ నుంచి బందరుకాలువ పైన స్క్యూ బ్రిడ్జీ వరకు రింగ్‌రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభమైనందువల్ల ప్రస్తుతం ఈ ప్రతిపాదనపై ఏమీచేయలేకపోతున్నామని తెలియజేశారు. అనంతరం నేను వ్యవసాయమంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ నగరమేయర్ పంచుమర్తి అనురాధ, ఉడా చైర్మన్ శ్రీమతి డాక్టర్ కొల్లి శారద, కలెక్టర్ బి.ఆర్.మీనా, వైస్ చైర్మన్ మున్నగు వారి సహకారంతో వంద అడుగుల రహదారిగా చక్కని రూపుదిద్దుకున్నందుకు నాకు ఎప్పుడూ సంతోషం కలుగుతుంటుంది.

***<u>రంగాజీ-రాజన్నలతో అనుబంధం</u>***

1995 జూన్10వ తేదీన ప్రపంచ ప్రఖ్యాత రైతాంగనేత ఆచార్య రంగాగారి అంత్యక్రియలు నిడుబ్రోలు సమీపంలోని భారతీదేవినగర్‌లో నిర్వహించారు. నా విద్యార్థి దశనుంచి నేను ఆరాధించిన ఆచార్య ఎన్.జి. రంగాగారితోపాటు ఎనిమిదవ లోక్‌సభలో



*ఆచార్య ఎన్.జి. రంగా, స్వాతంత్ర్యయోధుడు పావులూరి శివరామ కృష్ణయ్య గార్లతో*

సభ్యుడిగా ఉండే అదృష్టం నాకు లభించింది. ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ డిప్యూటీ లీడర్‌గా ఉన్నారు. నేను తెలుగుదేశం లోక్‌సభ పక్షానికి చీఫ్‌విప్‌గా ఉన్నాను. పార్లమెంటులో నేను ప్రసంగించిన తర్వాత లాబీలో ఆయన కనిపించినప్పుడు, "బాగా మాట్లాడావ్ శోభనాద్రీశ్వర్రావ్! నువ్వు రిక్వెస్ట్ అన్నమాట అనొద్దు, అపోజిషన్‌లో వున్నావు కాబట్టి డిమాండ్ అని అను" అంటూ నాకు సలహా ఇచ్చేవారు. నాతోపాటు నా కుమారుడు వెంకట అంకినీడు ప్రసాద్ ఎప్పుడైనా వారి వద్దకు వెళ్లినప్పుడు ఎంతో ఆప్యాయతతో పలకరిస్తూండేవారు. ఒకసారి నా కుమారుడు వెంకట అంకినీడు ప్రసాద్ రంగాగారితో కాంగ్రెస్ పార్టీలో చేరాలనుందని అంటే, "తప్పు ప్రసాద్! మీ నాన్నగారు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. నువ్వు కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకోవడం తప్పుబాబూ! అది నాన్నగారి ప్రతిష్టకు మంచిదికాదు" అని అన్నారట. రంగాగారి వద్ద పి.రాజగోపాలనాయుడుగారు ఉంటూవుండేవారు. రాజన్న నిష్కామ కర్మయోగి. గాంధీజీ ప్రవచించిన గ్రామీణాభివృద్ధి, బడుగుప్రజల సేవే లక్ష్యంగా నీతి నిజాయితీతో అనేక దశాబ్దాలపాటు తాను నమ్మిన





గురువైన ఆచార్య ఎన్.జి.రంగాగారికి తోడునీడగా మెలగిన మహనీయుడు రాజగోపాలనాయుడుగారు. రాజగోపాలనాయుడుగారి మరణవార్త విని ఆయన అంత్యక్రియలకు వారి స్వగ్రామమయిన దిగువమాఘం గ్రామానికి ప్రముఖ స్వాతంత్రయోధుడు పావులూరి శివరామకృష్ణయ్యగారిని వెంటబెట్టుకుని వెళ్లి కడసారిగా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించాను. ఆయన అల్లుడు గల్లా రామచంద్రనాయుడుగారు అమెరికాలో చాలాకాలంపాటు ఇంజనీరుగా పనిచేసి, స్వదేశానికి తిరిగివచ్చి, తిరుపతికి సమీపంలో అమర రాజా బ్యాటరీస్ సంస్థను నెలకొల్పి అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. 2013 మార్చి 20న విజయవాడలో ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీవారు గల్లా రామచంద్రనాయుడుగారికి ఎక్సలెన్సీ

అవార్డ్ - 2012ను నా చేతుల మీదుగా ప్రదానం చేయడం నాకెంతో సంతోషాన్ని కల్గించింది. వారి అబ్బాయి జయదేవ్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉన్నారు.

ఆచార్య ఎన్.జి.రంగా నవంబర్ 7, 1900న గుంటూరుజిల్లా నిడుబ్రోలులో జన్మించారు. 2000వ సంవత్సరంలో ఆయన శతజయంతి వస్తూవున్నది కనుక ఆయన స్మారకార్థం పోస్టల్ డిపార్టుమెంట్ చేత కమెమోరేటివ్ స్టాంపును విడుదల చేయవలసిందని కమ్యూనికేషన్స్‌శాఖ మంత్రిగావున్న రామ్‌విలాస్ పాశ్వాస్‌గారికి జనవరి 20, 2000 నాడు లేఖ రాయగా, ఆయన 2001 సంవత్సరంలో రంగాజీ స్మారక పోస్టేజీ స్టాంపును విడుదల చేయడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని సెప్టెంబర్ 14, 2000నాడు తెలియపరిచారు.

నేను 10వ లోక్‌సభ సభ్యుడిగా ఉండగా తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా జనరల్ పర్సస్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను. అప్పుడు పార్లమెంటు భవనంలో ఎన్.జి.రంగాగారి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా స్పీకర్ శివరాజ్ పాటిల్ ఆమోదించారు. దానిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి తెలియపరచగా, రాష్ట్రప్రభుత్వం రంగాజీ కాంస్య విగ్రహాన్ని తయారు చేయించింది. జి.ఎం.సి. బాలయోగిగారు స్పీకర్‌గా ఉండగా 1998 జూలై 28న ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్‌గారు ఆవిష్కరించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. పార్లమెంటు భవనానికి వెళ్లినప్పుడల్లా ఆ విగ్రహాన్ని చూసి వస్తూవుంటాను. 60 సంవత్సరాలకుపైగా పార్లమెంటులో సభ్యుడిగా ఉండి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అత్యంత సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగావున్న వ్యక్తిగా రికార్డు నెలకొల్పబడిన రంగాజీ జీవిత విశేషాల గురించి, ఆయన పార్లమెంటులో చేసిన ప్రసంగాల్లో కొన్నింటిని ఎన్నిక చేసి ఒక పుస్తకం రూపంలో తీసుకువచ్చి ఈనాటి తరానికి ముఖ్యంగా యువ పార్లమెంటు సభ్యులకు అవగాహనను, విజ్ఞానాన్ని అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని 2002 జనవరి 20న బాలయోగిగారిని కోరడం జరిగింది.

రాయలసీమ ప్రాంతంలో రాజగోపాలనాయుడు, పెద్దిరెడ్డి తిమారెడ్డి, అగరాల ఈశ్వరరెడ్డి, రాటకొండ నరసింహారెడ్డి, కడప కోటిరెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, కందుల ఓబులరెడ్డి, ఎన్వీ నాయుడు, కె.బి. సిద్ధయ్య మున్నగు రైతునాయకులనెందరినో ఆచార్య రంగాగారు తీర్చిదిద్దారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు ఆస్కారమివ్వకుండా రైతాంగ శ్రేయస్సు,

దేశాభివృద్ధి ధ్యేయంగా తన జీవితాంతం కృషిచేశారు. బిడ్డలు ఉంటే స్వార్థం ఏర్పడవచ్చనే అభిప్రాయంతో అర్థాంగి భారతీదేవిగారిని అంగీకరింపజేసి సంతానం కలుగకుండా ఆపరేషన్ చేయించుకున్న మహానుభావుడు. ఇదే విధంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు కూడా సంతానం కలుగకుండా చేసుకున్నారట.

***<u>కిసాన్‌నేతలు ఆచార్య రంగా - చౌధురి చరణ్‌సింగ్</u>***

ఇంజనీరింగ్‌లో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రాజాజీ ఆశీస్సులతో ఆచార్య ఎన్.జి.రంగాగారు అధ్యక్షుడుగా ఉన్న స్వతంత్ర పార్టీలో చేరి సభలకు, సమావేశాలకు హాజరవుతూవుండేవాణ్ని. రంగాగారు ఆరు దశాబ్దాలకు పైగా కేంద్ర శాసనసభలోగానీ, భారత పార్లమెంటులోగానీ సభ్యులుగా కొనసాగి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. నీతి నిజాయితీలకు నిలువెత్తురూపం ఆయన. అలాగే చౌదరి చరణ్‌సింగ్‌గారు కూడా అయిదు దశాబ్దాలకు పైగా ఉత్తరప్రదేశ్‌లోగానీ, కేంద్రంలోగానీ అనేక పదవులు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో అనేక కీలకశాఖల్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పదవిని నిర్వహించినా, కేంద్రంలో ఆర్థికమంత్రిగా, హోంమంత్రిగా, ఉపప్రధానిగా, ప్రధానిగా పదవులు నిర్వహించినా అత్యంత ఉన్నతమైన నైతికవిలువలు పాటించిన వ్యక్తి. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి భారతీయ క్రాంతిదళ్ పార్టీని నడిపినా, బి.కె.డి., స్వతంత్ర పార్టీలు కలసిపోయి భారతీయ లోక్‌దళ్‌గా ఏర్పడిన తర్వాత దాని అధ్యక్షుడిగా ఆ పార్టీని నడిపినా ఏనాడూ బడా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలనుంచి విరాళాలు తీసుకోవడం చేసివుండలేదు. చరణ్‌సింగ్ బహిరంగసభల్లో ప్రసంగించే సందర్భంలో ఆ ప్రాంతంలోని రైతులనుంచి, చిన్న వ్యాపారస్తులనుంచి పార్టీ ఫండ్ పోగుచేసి చరణ్‌సింగ్‌గారికిస్తే ఆయన కొంత మొత్తాన్ని జిల్లా పార్టీ నిర్వహణకు, కొంత మొత్తాన్ని రాష్ట్రస్థాయి పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జమిందారి రద్దు పకడ్బందిగా అమలు చేసి సాగుదారులను భూ యజమానులుగా చేశారు. రైతులు సమర్ధవంతముగా వ్యవసాయాన్ని నిర్వహించేందుకు భూకమతాలను సమీకృతం (Consolidation of Land Holdings) అమలు చేశారు. గ్రామాధికారులు సహకరించకపోతే వేలాదిమందిని తొలగించిన ధైర్యశీలి.

1980 మధ్యంతర ఎన్నికల సమయంలో ప్రధానమంత్రిగా ఉండి, ఎన్నికల్ని ఎదుర్కోవలసిన తరుణంలో కూడా టాటా, బిర్లా లాంటి బడా పారిశ్రామికవేత్తలు కోట్లాది రూపాయలు ఎన్నికల చందాలు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసినా సున్నితంగా తిరస్కరించిన గొప్ప వ్యక్తి. అటువంటి ఆ ఇద్దరు మహనీయుల ప్రభావం వల్ల నేను

కూడా నా మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరికి ఎంత సహకారాన్ని అందించినా, వారి సమస్యను పరిష్కరించడంలో ఎంతగానో తోడ్పడినా, ఉద్యోగ అవకాశాలు లభింపజేసినా ఎప్పుడూ ఎవరినుంచీ ఒక్క రూపాయికూడా ఆశించలేదు, ఆమోదించలేదు. నా నడవడిక, స్వభావం తెలిసినవారు కావడంవల్ల అనేకమంది సామాన్యులనుంచి ధనవంతులవరకు, చిన్న రైతులనుంచి పెద్ద రైతులవరకు నేను ఎన్నికల్లో నిలబడినప్పుడు ఎన్నికల వ్యయభారాన్ని నేను తట్టుకోగలగడానికి వీలుగా వారంతటవారు స్వచ్ఛందంగా వారికి తోచిన సహకారాన్ని అందిస్తూవచ్చారు. ఈ విధంగా జరగడంవల్ల నాపైన కొంతమేరకే ఎన్నికల వ్యయభారం పడుతూవుండేది. అందువల్లనే శాసనసభకుగానీ, పార్లమెంటుకుగానీ కలిపి మొత్తం పది పర్యాయాలు పోటీచేశాను. నాలుగుసార్లు మాత్రమే గెలిచాను. నేను కాంట్రాక్టుల్లో, కోటాలో, లైసెన్స్‌లో ఇప్పిస్తానని కాకుండా శోభనాద్రీశ్వరరావు మన రైతుబిడ్డ, మన తరపున శాసనసభలోగానీ, వెలుపలగానీ, పార్లమెంటు లోపలగానీ, వెలుపలగానీ మన సమస్యలపైన గట్టిగా మాట్లాడతాడు, పోరాడతాడు అనే అభిమానంతో వారు సహకారాన్ని అందిస్తూండేవారు. మొదటిసారి ఉయ్యూరు నియోజకవర్గంనుంచి శాసనసభకు ఎన్నికైనప్పుడు, విజయవాడ లోక్‌సభ స్థానంనుంచి రెండుసార్లు గెలుపొందినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి.

❖ ❖ ❖

# సహకరించిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు

**మొ**ట్టమొదటిసారి 1972 సార్వత్రిక ఎన్నికల్లో ఉయ్యూరు శాసనసభ నియోజక వర్గంనుంచి మిత్రపక్షాలు బలపరచిన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన నాటినుంచి 2004 సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం శాసనసభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశంఅభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయేవరకు మొత్తం 10 పర్యాయాల్లో అయిదు పర్యాయాలు పార్లమెంటుకు, 5 పర్యాయాలు శాసనసభకు పోటీచేయడం జరిగింది. ఒక్క 1999 నుంచి 2004 వరకు మాత్రమే అధికారిక పదవిలో ఉన్నాను. అంతకుముందు కాలమంతా దాదాపు ప్రతిపక్ష పాత్రే. నేను కాంట్రాక్టులు ఇప్పిస్తాననో, కోటాలు మంజూరు చేయిస్తాననో, ఆర్థిక లబ్ధి చేకూర్చుతాననో అని కాకుండా శోభనాద్రీశ్వరరావు మన రైతుబిడ్డ. రైతులు, గ్రామీణ ప్రజల సమస్యలపైన దృఢంగా మాట్లాడుతూ పోరాడే వ్యక్తి. అక్రమ పద్ధతుల్లో సంపాదించిన వ్యక్తికాదు. తాత, తండ్రి ఇచ్చిన ఆస్తినే కొంత కరగించిన మనిషి. మన సమస్యలమీద పోరాటంచేసినా, సాధించినా, ఉద్యోగావకాశాలు కల్పించినా, ట్రాన్స్‌ఫర్ విషయాల్లో సహకరించినా ఒక్క రూపాయికూడా ఆశించే మనిషికాదు, ఆమోదించే మనిషికాదు. కావున అటువంటి వ్యక్తికి ఎన్నికల సందర్భంలో మనం చేయగలిగిన మేరకు మనవంతు సహకారం అందించాలనే భావంతో వందలాదిమంది సహకారాన్ని స్వచ్ఛందంగా అందిస్తూవచ్చారు. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో నిలబడినది తామే అనుకుని వ్యయప్రయాసలకు, కష్టనష్టాలకు ఓర్చి కృషిచేసినవారున్నారు. వారందరి కృషి, తోడ్పాటు ఫలితంగానే ఈరోజుకు కొంత ఆస్తి కరిగినా మిగిలిన కొంతతో గౌరవప్రదమైన స్థితిలో నేను, నా కుటుంబసభ్యులు నిలబడగలుగుతున్నాం. అందువల్ల అటువంటివారిని స్మరించుకుని, వారికి కృతజ్ఞతలు తెలియజెప్పడం నా కనీసధర్మంగా భావిస్తూ, కొన్ని పేర్లను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. స్థలాభావం కారణంగాగానీ, మరేకారణంవల్లగానీ కొన్ని పేర్లు ఉదహరించలేకపోతున్నందుకు క్షంతవ్యుణ్ని.

**న్యూఢిల్లీ:** అట్లూరి కోటేశ్వరరావు, అలపాటి వెంకటేశ్వరరావు, ఈశ్వర ప్రసాద్.

**ముంబాయి:** బోంబే ఆఫ్‌సెట్ ప్రెస్ కొమ్మూరు సత్యనారాయణ.

**చెన్నై:** డాక్టర్ వి.ఎల్.దత్, అట్లూరి మల్లేష్‌రావు, అనుమోలు రామకృష్ణ, ఎ.ఎస్.ఆర్.చౌదరి, ఆనంద్, కోనేరు ప్రసాద్.

**బెంగుళూరు:** పొట్లూరి రాజమోహనరావు, తుమ్మూరు సత్యనారాయణరెడ్డి, గాద్రేజ్, భరత్ టాండన్, వెల్లంకి సుబ్రమణ్యం.

**తిరుపతి:** గల్లా రామచంద్ర నాయుడు

**తణుకు:** ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, బోళ్ల బులిరామయ్య.

**హైదరాబాద్:** వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, పాతూరి రామారావు, రావెళ్ల జగన్మోహనరావు, కట్టా వెంకటేశ్వర్లు, వెలగపూడి శివరామకృష్ణారావు, కిలారు మాధవరావు, ఈశ్వర్ చంద్, సి.కె. రావు, కొడాలి కేశవరావు, సి.వి.రావు, పరుచూరి హనుమంతరావు, దాసరి జయరమేష్, బొప్పన గంగాధరచౌదరి, పిన్నమనేని లక్ష్మణరావు, డి. రామానాయుడు, కె.పి. కిషోర్, వెల్లంకి వెంకటేశ్వరరావు, చల్లా రాజేంద్రప్రసాద్, నాదెళ్ల వెంకట సుబ్బారావు, కొడాలి మల్లికార్జునరావు, అజేంద్ర, అజయ్, కె.ఎన్.రావు, వల్లూరుపల్లి నాగేశ్వరరావు, సుజిత్‌రెడ్డి, కామినేని సూర్యనారాయణ, సిరిపురపు కుటుంబరావు, జాస్తి రవిచంద్ర, విజయ్, వి.సి. జనార్ధనరావు, పి. బాబుల్‌రెడ్డి, నవభారత్ పున్నయ్య, దేవినేని సీతారామయ్య, పిన్నమనేని తిరుమలరావు, యార్లగడ్డ రాజశేఖర్, బ్రహ్మారెడ్డి, జి.రామరాజు, బిల్డర్ రాజశేఖర్, జాస్తి రవిచంద్ర, లక్ష్మణరావు (కెమికల్స్), యలమంచిలి మనోహర్, జె.ఎస్. కృష్ణమూర్తి, సుంకర అప్పారావు, డాక్టర్ చలసాని రాధాకృష్ణ, కిలారు ప్రసాద్, కోటపాటి మురహరిరావు, వై.యోగేశ్వరరావు, మండవ ప్రభాకర్, పరుచూరి విద్యాసాగర్, యమ్.వి.సుబ్బయ్య, వై. రవికుమార్, చింతా విశ్వేశ్వరరావు, ఆర్.టి. రవి, దేసు అశోక్‌కుమార్, లెఫ్టినెంట్ జనరల్ ఎ.ఎస్. రావు, కాకతీయ పి.ఆర్.లక్ష్మణరావు, పల్లెంపాటి వెంకటేశ్వర్లు, అడుసుమిల్లి కృష్ణమూర్తి, టి.ఎల్. ప్రసాద్, మాగంటి రమణారావు, కొడాలి రాజారావు, కొడాలి గాంధీరాజు, బొల్లినేని కృష్ణయ్య, కిన్నెరస్టీల్స్ రామారావు, గుళ్లపల్లి రామకృష్ణ, విఠల్ చరణ్ దాస్, స్వామినాధన్, పిన్నమనేని రాఘవేంద్ర రావు కోనేరు వెంకటక్రిష్ణ, కి.వి. సురేష్, అడుసుమిల్లి సీతారామారావు, భిమయ్య ప్రభృతులు.

**ఏలూరు:** వి.వి. గోపాలకృష్ణ, అవిర్నేని సోమేశ్వరరావు, కొమ్మన రత్నాకరరావు, కాసరనేని గోపాలకృష్ణయ్య, మాగంటి భూపతిరావు, డాక్టర్ ఎం.ఎన్.బి. సీతారామస్వామి, యనమదల రామదాసు.

**ఒంగోలు:** ఆళ్ళ వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటసుబ్బయ్య, చుండూరు రంగారావు, ఎన్.వి. సుబ్బయ్యచౌదరి, దశరథరామయ్య, కొండ్రాయుడు, చుంచు శేషయ్య ప్రభృతులు.

**గుంటూరు:** డాక్టర్ వై.శివాజీ, బొమ్మిడాల కృష్ణమూర్తి, పావులూరి కృష్ణకుమార్, మాదల సుధాకర్, రమేష్‌బాబు, జంపాల కృష్ణారావు, గుళ్లపల్లి రామారాయుడు, వడ్డే శివరామప్రసాద్, జాగర్లమూడి నరేంద్ర, జి. అరుణచలం, యు. వెంకట్రావు ప్రభృతులు.

**విశాఖపట్టణం:** వి. తపోవర్ధన్, సుదర్శనస్వామి, కంభంపాటి హరిబాబు, వల్సరాజ్, అన్నే బాలాజీ, రాధాకృష్ణ, ఎ.వి.ఎల్. నరసింహారావు ప్రభృతులు

**భీమవరం:** యు.కె. విశ్వనాథరాజు

**మండపేట:** పాలచర్ల శ్రీనివాస్

**తొర్రేడు:** కాట్రగడ్డ సత్యనారాయణ

**విజయవాడ:** ముమ్మనేని సుబ్బారావు, సిద్ధార్థ అకాడమీ, ఈడ్పుగంటి బాలవీరరాఘవయ్య, పాలడుగు లక్ష్మణరావు, మొక్కపాటి లక్ష్మీనారాయణ, ధనేకుల రవీంద్రనాథ్ టాగూర్, కట్నేని కృష్ణమూర్తి, బొమ్మారెడ్డి సీతారెడ్డి, వల్లభనేని వెంకట్రామయ్య, కాజ వెంకటేశ్వరరావు, వల్లభనేని వెంకటాద్రి, తుమ్మల రంగారావు, మలినేని రాజయ్య, గారపాటి వెంకటేశ్వరరావు, అచ్చయ్య, పాండు, యలమంచిలి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ ఓంకార్, ఎం. ఆంథోనీరాజు, చిగురుపాటి బాలనాగేశ్వరరావు, పర్వతనేని మాధవరావు, వల్లూరిపల్లి కేశవరావు, ప్రభుకిషోర్, సూరెడ్డి వెంకటేశ్వరరావు (ఎర్రబాబు), చలసాని అజాద్‌కుమార్, జి.ఎస్.రాజు, మేజర్ సూర్యదేవర సురేష్ బాబు, కడియాల వెంకటేశ్వరరావు, సి.ఎస్.ఎస్.రావు, మెకానిక్ ఆంజనేయులు, నందమూరి సుభాష్‌చంద్రబోస్, ఉప్పలపాటి సూర్యనారాయణబాబు, పుట్టగుంట సత్యనారాయణ, చిగురుపాటి చౌదరి, పోలవరపు మోహన్, నరసింహారావు, జి.ఎస్.ఎన్. బెనర్జీ, గుళ్లపల్లి మాధవరావు, తుమ్మల వెంకటకృష్ణారావు, తుమ్మల శ్రీకృష్ణమూర్తి, ముత్తవరపు వెంకటేశ్వరరావు, ముత్తవరపు మురళీకృష్ణ, కాట్రగడ్డ నరసయ్య, నార్ల వినయ్, జాస్తి రవి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, పర్వతనేని ప్రభాస్, కాళేశ్వరి కృష్ణారావు, చలసాని రవి, ఫైనాన్సియర్ సుంకర సత్యనారాయణ, పర్వతనేని సుభాస్‌చంద్రబోస్, పర్వతనేని కోటేశ్వరరావు, జాలాది రాఘవేంద్రరావు, చెరుకూరి రామారావు, అజీజ్, మలినేని నారాయణప్రసాద్, వై. రాధాకృష్ణ, ఐలా రాజేంద్రప్రసాద్, డాక్టర్ కాట్రగడ్డ నందకుమార్, కోనేరు మధుసూదనరావు, నల్లూరు వెంకటరత్నం, రామినేని నాగేంద్రబాబు, డాక్టర్ వై.వి.రావు, డాక్టర్ లక్ష్మీ సలీమ్, డాక్టర్ సి.పి. రావు, డాక్టర్ కొడాలి రామకృష్ణ, డాక్టర్ సూరపనేని వేణుగోపాలరావు, డాక్టర్ కిలారు బుచ్చిబాబు, డాక్టర్ కొల్లి ప్రసాద్‌రావు, వై.వి. రావు (స్వాతంత్ర్య సమరయోధుడు), పొట్లూరి సాయిబాబు, పాలడుగు వీరభద్రరావు, కొల్లి రామమోహనరావు, మేడికొండ మురళి, యలమంచిలి ఈశ్వరరావు, పొట్లూరి రాఘవేంద్రరావు, కొడాలి బాబూరావు, యలమంచిలి గౌరంగబాబు, బొప్పన రాఘవేంద్రరావు, పోలీసు మోహనరావు, కేశినేని నాని, యార్లగడ్డ పాపారావు, చిగురుపాటి

మృత్యుంజయరావు, వెలగపూడి శంకరబాబు, చిగురుపాటి వరప్రసాద్, ఎన్. తులసీప్రసాద్, ఇ.ఎస్.ఎస్.ప్రసాద్, డాక్టర్ కొడాలి వెంకటసుబ్బారావు, అక్కినేని బలరాం, పి.వి. చలపతిరావు, కానూరి జగదీష్ప్రసాద్, కానూరి వెంకటరత్నం, మలినేని రంగాప్రసాద్, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, ఫ్రూట్‌స్టాల్ అజాద్, కోగంటి సారథి, కోగంటి సాంబశివరావు, పెద్దు బలరాం, టి.టి. ప్రకాశరావు, కృష్ణమూర్తి, కోడూరు నాగేశ్వరరావు, కడియాల బాబు, పి.ఆర్.సిమెంట్స్ కె.ఎస్.ఎన్ ప్రసాద్, రవి, పొట్లూరి సాయిబాబు, మాగంటి అవధాన్లు, డి.టి.సి. బాలకృష్ణనాయుడు, ఆర్.టి.ఓ. వెంకటేశ్వర్లు, ఎమ్.వి.ఐ. పెరుమాళ్ళు చనుమోలు రామారావు, చనుమోలు నరసింహారావు, వి.వి. కృష్ణారావు, శ్రీమతి కోటేశ్వరమ్మ, ఎస్.గణేష్, వాసిరెడ్డి భూపాల్‌ప్రసాద్, భోగినేని రవి, తమ్మా వినోద్‌రెడ్డి, ఆర్. ధర్మారావు, కిలారు విద్యాసాగరవర్మ, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, దండమూడి స్టాలిన్‌బాబు, ఆలీఖాన్, రామినేని సాంబశివరావు, యలమంచిలి పాపారావు, బలుసు నాగేశ్వరరావు, లింగం శివరామకృష్ణ, నాదెళ్ళ మాధవరావు, పోతిన ప్రకాశరావు, వీరమాచినేని గోపాలరావు, యార్లగడ్డ రవికిరణ్, శ్రీనివాస హాచరీస్ డాక్టర్ సోమిరెడ్డి, పర్వతనేని ప్రసాదరావు, సుంకర వెంకట బసవారావు, వేములూరి వెంకటరత్నం, పోసాని భాస్కరరావు, చుక్కపల్లి కుశలవ, మండవ జానకిరామయ్య, ముసునూరి శివాజీ, రావెళ్ళ సుబ్బయ్య, స్వాతి బలరాం, చలసాని వెంకటనారాయణరావు, లింగం వీరరాఘవరావు, ఆర్.వి.చౌదరి, పెరవలి చంద్రం, చుక్కపల్లి పిచ్చయ్య, ముక్కామల రామచంద్రరావు, చాగర్లమూడి వెంకటేశ్వరరావు, గొర్రెని జగన్మోహనరావు, వడ్డే కిశోర్, సుంకర శివరామకృష్ణ, పిన్నమనేని రామకృష్ణబాబు, ఆలూరి బుచ్చయ్యచౌదరి, గుమ్మడి వెంకటేశ్వరరావు, బిల్డర్ యమ్.ఆర్.కె. చౌదరి, తిరుమల రోడ్‌వేస్ ప్రసాద్, పరిమి హనుమంతరావు, లక్కిరెడ్డి బాలిరెడ్డి, మల్లెల పద్మనాభరావు, మాదల కాశీవిశ్వేశ్వరరావు, డి. కృష్ణప్రసాద్, మండవ రత్తయ్య చలసాని రవిబాబు, ఒ.కె. భీమారావు, గడ్డం సుబ్బారావు, కనకమేడల వెంకటేశ్వరరావు మున్నగువారు.

సిటీబస్ ఓనర్స్ అసోసియేషన్, ఆర్.టి.సి. అండర్‌టేకింగ్ బస్ ఓనర్స్ అసోసియేషన్, విజయవాడ ఫైనాన్సియర్స్ అసోసియేషన్, విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ అసోసియేషన్, బిల్డర్స్ అసోసియేషన్, కోల్ డీలర్స్ అసోసియేషన్, క్రషర్ ఓనర్స్ అసోసియేషన్, మ్యాంగో మర్చంట్స్ అసోసియేషన్, ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్, ఫిల్మ్ చాంబర్, ఆర్.టి.సి. కాలనీ రెసిడెంట్స్, బ్యాంక్ కాలనీ రెసిడెంట్స్, రైస్ మిల్లర్ అసోసియేషన్స్.

*కృష్ణాజిల్లా గ్రామీణ ప్రాంతం*

యార్లగడ్డ రామశేషగిరిరావు, దండమూడి శేషగిరి, చింతమనేని కమలాకర్ మున్నగు పెనుమత్స గ్రామస్తులు.

అలూరి సాంబశివరావు, అన్నె శివరామకృష్ణ, రామకోటయ్య, తుమ్మల రామలింగయ్య, మలినేని నాగేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య మున్నగు ముదునూరు గ్రామస్తులు.

ఉప్పలపాటి చిట్టియ్య, శోభనాద్రీశ్వరావు మున్నగు పామర్రు గ్రామస్తులు.

గొంది వెంకట్రాయుడు, రావి రాజారావు, యనమదల సుబ్బారావు, వల్లభని కోటయ్య మున్నగు మద్దూరు గ్రామస్తులు.

ముసునూరి సాంబశివరావు, పెద్దు వెంకటనారాయణ మున్నగు కాసరనేనివారి పాలెం గ్రామస్తులు.

కాకర్ల సత్యనారాయణ, మన్నే భాస్కరరావు మున్నగు చోడవరం గ్రామస్తులు.

యర్రా శేషగిరిరావు, బుచ్చిబాబు, అంకయ్య మున్నగు పోలవరం గ్రామస్తులు.

ఎన్.టి. వెంకటేశ్వరరావు మున్నగు తాతకుంట్ల వాస్తవ్యులు.

వల్లభనేని వెంకట్రావు, మాదల వెంకటేశ్వరరావు, మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, వల్లభనేని వెంకట్రామ్, వల్లభనేని కృష్ణదాస్, అన్నే ప్రసాద్, నాదెళ్ళ రామమోహనరావు, దండమూడి సుబ్బారావు అట్లూరి కుటుంబరావు, మోటూరి వెంకటేశ్వర రావు, చిన్నారి మున్నగు గండిగుంట వాస్తవ్యులు.

పాలడుగు సుబ్బారావు, పాలడుగు సాంబశివరావు, పాలడుగు రామకృష్ణ బాబు, పాలడుగు శివ రామకృష్ణ, అక్కినేని రాంమోహనరావు, మున్నగు చిన ఓగిరాల గ్రామస్తులు.

బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డి, భీమవరపు పిచ్చిరెడ్డి, మాదల వెంకటరామయ్య, ఎర్రబ్బాయి వెమారెడ్డి, రాధాకృష్ణ రెడ్డి మున్నగు పెదఓగిరాల గ్రామస్తులు.

అరవపల్లి విష్ణు, కిలారు వెంకటరత్నం, కిలారు విశ్వేశ్వరరావు, కిలారు విష్ణు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కిలారు అనీల్ మున్నగు పెనలూరు గ్రామస్తులు.

వడ్డే అన్నపూర్ణమ్మ, వెల్లంకి కుటుంబ భాస్కరరావు, యలమంచి నరసింహరావు, వెల్లంకి సురేంద్ర, వెల్లంకి సీతారామదాస్, రాజా మున్నగు కలవపాముల వాస్తవ్యులు.

సూరపనేని కృష్ణారావు, రాధాకృష్ణ, పెద్దు పిచ్చేశ్వరరావు, కనకమేడ సత్యనారాయణ మున్నగు పెనమకూరు వాస్తవ్యులు.

డా॥ పిన్నమనేని చంద్రమోహన్ డా॥ పండా ద్విజేంద్రబాబు, బొప్పన శ్రీహరి, అన్నే బాబురావు, నర్ర రామకోటయ్య, వడ్డే వెంకట్రామయ్య, కోనేరు భానుప్రసాద్, జంపాన పూర్ణ, బుడే కాలేజీ లెక్చర్‌ల బృందం మున్నగు ఉయ్యూరు వాస్తవ్యులు

యార్లగడ్డ నాగేశ్వరారవు, సుంకర చలపతిరావు, నాదెండ్ల రంగారావు, మైనేని సాయిబాబు, యార్లగడ్డ దత్తుడు మున్నగు వీరంకిలాకు వాస్తవ్యులు.

**గన్నవరం ప్రాంతం:** గోగినేని రంగబాబు, క్రిష్ణబాబు, అమలోద్భవి పెదబాబు, కడియాల రాఘవరావు, మూల్పూరి బాలకృష్ణారావు, జాస్తి విజయభూషణ కుమార్, వీరపనేని శ్రీరామమూర్తి, మొవ్వ హనుమంతరావు, గుండపనేని ఉమావరప్రసాద్, కాసరనేని సుబ్బారావు, అక్కినేని శ్రీకృష్ణ ప్రభృతులు

**గుడివాడ ప్రాంతం:** పిన్నమనేని భూపతిరాయుడు, యార్లగడ్డ వెంకటేశ్వరప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, టి.కె. మూర్తి, పుట్టగుంట సుబ్బరావు మున్నగువారు.

1984 పార్లమెంటు ఎన్నికల నుండి 2004 ఎన్నికల వరకు ఎన్నికలలో నాకు ఎంతో చేదోడు వాదోడుగా సహకరించిన కిలారు విద్యాసాగర్ వర్మకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకోవాల్సి ఉంది. నర్రా వెంకటరత్నం (టీచర్) గారు ప్రతి ఎన్నికలలోనూ నాతో ఉంటూ చాలా పేపర్ వర్క్ చేస్తూ సహకారం ఇచ్చారు. కనకమేడల వెంకట క్రిష్ణారావు, కె.వి. సురేష్ కూడా ఎంతో సహకారం ఇస్తూ ఉండేవారు. స్థలభావం వలన పేర్లు ఉదహరించలేకపోయినా నాకు ఎంతో పట్టుదలతో శారీరక, ఆర్థిక వ్యయప్రయాసలకు లోనై నా విజయమే తమ గెలుపుగా భావించి కృషి చేసిన ప్రతి ఒక్క నాయకునికి తెలుగుదేశం కార్యకర్తలకు, మిత్ర పక్షాల వారికి, ప్రజాస్వామ్య ప్రియులందరికి పేరు పేరున హృదయ పూర్వక ధన్యావాదలు తెలియజేస్తున్నాను.

❖❖❖

# విదేశీ పర్యటనలు

## ఇండోనేషియా పర్యటన

ఎనిమిదవ లోక్‌సభలో సభ్యుడిగా ఉండగా నాటి లోక్‌సభ స్పీకర్ బలరామ్ జక్కర్‌గారి నాయకత్వంలో ఇండోనేషియా పర్యటనకు వెళ్లాం. ముస్లిం ప్రజలు అధికంగా ఉన్న ఆ దేశంలో కుటుంబ నియంత్రణ ఆవశ్యకత, జనాభా పెరుగుదలను అరికట్టవలసిన ఆవశ్యకతల గురించి ప్రజల్లో అవగాహనను పెంపొందించడానికి ఆ దేశ అధ్యక్షుడు సుహార్తో సతీమణి అధ్యక్షురాలిగా కమిటీ పనిచేస్తోందని తెలిసి ఎంతో ఆనందం కలిగింది. ఇండోనేషియాలో ఇప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడినప్పుడు రామాయణం, మహాభారతంలోని కొన్ని భాగాలను ప్రదర్శిస్తూవుండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. బోరోబదుర్ అనే ప్రదేశంలో చాలా పెద్ద బౌద్ధస్తూపం ఉంది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆలయాలున్నాయి.

ఇండోనేషియా పర్యటనలో "మా భారతదేశంలో నాణ్యమైన పొడుగు పింజ పత్తి లభిస్తుందిగదా! మీరెందుకు దిగుమతి చేసుకోవడంలేదు" అని మా ప్రతినిధి వర్గం అడగ్గా, భారతదేశంనుంచి ఖచ్చితంగా ప్రతి సంవత్సరం ఇంత పరిమాణంలో పత్తి మా దేశానికి ఎగుమతి అవుతుందనే నమ్మకం లేకపోవడంవల్ల మేం మీ దేశం నుంచి పత్తి దిగుమతి చేసుకోవడంలేదని వారు చెప్పారు.

ఆ టూర్‌లోనే సింగపూర్‌ను కూడా సందర్శించాం. సింగపూర్ చిన్న ద్వీపం. పరిశుభ్రతకు, ప్రజల్లో నెలకొనివున్న క్రమశిక్షణకు సింగపూర్ ప్రసిద్ధిచెందింది. సింగపూర్ ద్వీపం భౌగోళికంగా చాలా చిన్నది. ఆ దేశంలో లభించే ముడివస్తువులు బహుస్వల్పం. అనేక వస్తువుల్ని ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకుని అసెంబుల్ చేసి ఎగుమతి చేస్తూ ఆర్థికాభివృద్ధిని ఆ దేశం సాధించింది. సింగపూర్ నగరం పరిశుభ్రతకు మారుపేరు. ఆ దేశ అభివృద్ధిలో అధ్యక్షుడు లీ కాన్ యూ గణనీయమైన పాత్రను నిర్వర్తించారు.

## పలుదేశాల పర్యటన

8వ లోక్‌సభలో సభ్యుడిగా ఉండగానే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడిగా అన్నగారు ఎన్.టి. రామారావుగారు నన్ను నియమించారు. నాతోపాటు పార్లమెంటు సభ్యులుగా ఉన్న మద్దూరు సుబ్బారెడ్డిగారు, శాసనసభ్యుడిగా ఉన్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అల్లు భానుమతి, శాస్త్రవేత్త మొవ్వా రామారావు, రైతు నాయకుడు మల్లెల పద్మనాభరావులను బోర్డు సభ్యులుగా నియమించారు. బోర్టు



*మద్దూరి సుబ్బారెడ్డి ఎమ్.పి., శాసన సభ్యులు డా॥ ఉమారెడ్డి, భానుమతి గార్లతో*

సభ్యులం మా స్వంతఖర్చులతో కొన్ని దేశాల్లో వ్యవసాయరంగం ప్రగతి, రైతుల స్థితిగతులు తెలుసుకుందామని భావించాం. నార్త్ వెస్ట్ అనే అమెరికన్ విమానయాన సంస్థతో మల్లెల పద్మనాభరావుగారు సంప్రదించి, పర్యటన ఏర్పాట్లు చేశారు. 69 రోజులపాటు 8 దేశాల్లో పర్యటనకు మాకైన ఖర్చు తలకు కేవలం విమాన చార్జీల నిమిత్తం 25,500 రూపాయలు మాత్రమే.

ఫిలిప్పీన్స్ దేశంలో అంతర్జాతీయ వరి పరిశోధనాసంస్థకు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ గారు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. మా బోర్డు సభ్యుల్ని ఆ సంస్థను సందర్శించమని వారు ఆహ్వానించారు. వారు వారి సతీమణి ఎంతో ఆదరాభిమానాలను చూపించారు. ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త అయినప్పటికీ స్వామినాథన్‌గారు ఏమాత్రము గర్వంగానీ, అతిశయముగానీ లేని వ్యక్తి. మనీలాలో ఉండగా అక్కడ ఫిష్ కేజ్ కల్చర్ సందర్శించాము. నైలాన్ వలను నీటిలో గెడలతో కట్టి చేపలను పెంచడం చూశాము. ఇదే విధానాన్ని కొల్లేరు సరస్సులో అమలుపరిస్తే ఎంతో ఉపయోగం ఉంటుంది. కొల్లేరు సరస్సులో వేలకు వేలు ఎకరాలలో ఎత్తుగా మట్టికట్టలతో చెరువులు నిర్మించడం వలన కృష్ణాజిల్లా మరియు పశ్చిమగోదావరి జిల్లాల నుండి భారీగా చేరు నీరు ఉప్పుటేరునుండి త్వరగా సముద్రములోకి పోవుటకు ఆటంకము కలుగుతూవున్నది. కేజ్ కల్చర్‌ను అనుసరిస్తే మట్టికట్టలు తొలగించవచ్చు. చేపల పెంపకమునకు వీలుగా ఉంటుంది. ఈ ఇరి సంస్థనుండి తైచుంగ్ నెటివ్ 1, ఐ.ఆర్. 8, ఐ.ఆర్.64 మున్నగు అనేక అధిక దిగుబడి వరి వంగడాలు మన భారతదేశంతోపాటు పలు వర్ధమాన దేశాలకు అందించబడి వరి దిగుబడులు రెండు, మూడు రెట్లకు పెరిగాయి.

హాంకాంగ్‌లో ఎఫ్.ఎ.ఓ. రీజనల్ ఆఫీస్‌ను, నేషనల్ ఇన్‌లాండ్ ఫిషరీస్ ఇన్స్టిట్యూట్‌ను, రైస్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించాము. ప్రసిద్ధి చెందిన ఎమరాల్డ్ బుద్ధ క్షేత్రాన్ని చూశాము. అమెరికాలో న్యూయార్క్, వాషింగ్‌టన్ డి.సి., కాన్సస్ యూనివర్శిటీ, లాస్ ఏంజిల్స్ యూనివర్సల్ స్టుడియో, కాలిఫోర్నియాలో పండ్ల తోటలను, డిస్నిలాండ్‌ను, డెట్రాయిట్, సెయింట్ లూయిస్, నయాగరా జలపాతము మొన్నగు వాటిని సందర్శించాము. దక్షిణ కొరియా రాజధాని సియోల్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్టిట్యూట్‌ను సందర్శించాము. టోక్యోలో ఎగ్రికల్చరల్ యూనివర్శిటీకి వెళ్ళాము. అక్కడ వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్న యంత్ర పరికరాలను చూశాము. బ్యాంకాక్‌లో వ్యయసాయ యూనివర్శిటీ మరియు వాణిజ్య సరళిలో పూలను ఉత్పత్తి చేస్తున్న కేంద్రాన్ని సందర్శించాము.

10వ లోక్‌సభకు ఎన్నికైన తర్వాత రాజ్యసభ సభ్యుడు సత్యపాల్ మిట్టల్ నాయకత్వంలో పార్లమెంటు సభ్యుల బృందం చైనాను సందర్శించాము. చైనాలో జనాభా నియంత్రణ కార్యక్రమాలను మరియు ఆర్థిక ప్రగతిని పరిశీలించుటకు వెళ్ళాము. కుటుంబమునకు ఒక్క బిడ్డ విధానం అక్కడ ఉంది. కొన్ని ప్రాంతాలలో, కొన్ని వర్గాలలో మొదటి బిడ్డ ఆడపిల్ల అయితే మరొక బిడ్డను అనుమతించారు. గువాంగ్ డాంగ్, బీజింగ్, షాంగే,



*బీజింగ్‌లో ఫర్‌బిడెన్ సిటీ*

గిలిన్ మున్నగు నగరాలు సందర్శించాము. బీజింగ్‌లో తియామిన్ స్కేర్, ఫర్‌బిడెన్ సిటీ (ఎర్రకోట), చైనా గ్రేట్ వాల్, గిలిన్‌లో పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన గుహలను చూశాము.

ఎంతో విశాలమైన రహదారుల నిర్మాణం మౌలిక వసతుల కల్పన మమ్మల్ని ఎంతో ఆకర్షించాయి. విదేశీ పెట్టుబడులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించుతూ పెద్ద ఎత్తున కన్స్యూమర్ గూడ్స్‌ను ఉత్పత్తిచేస్తూ తక్కువ ధరలకు విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తూ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతూ అదే సమయంలో కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యం కొనసాగించుకుంటున్న విధానాన్ని గమనించాము.

ఇంగ్లాండులోని బర్మింగ్‌హాంలో ఉగాది వేడుకల సందర్భంగా యూరోపియన్ తెలుగు అసోసియేషన్ (ఈటా) ఆహ్వానంపై 2003లో ఇంగ్లాండు వెళ్లాను. నాతోపాటు కళారంగంపట్ల విశేషమైన ఆసక్తి కలిగిన రమణమూర్తి, నటులు ఉదయ్‌కిరణ్, రాజేంద్రప్రసాద్ ప్రభృతులుకూడా పాల్గొన్నారు. ఆ సందర్భంలో లండన్‌లో డాక్టర్ సోమేశ్వరరావు వారి ఇంటివద్ద ఆతిథ్యం తీసుకుని అనంతరం బర్మింగ్‌హాం వెళ్లాను. బర్మింగ్‌హాంలో డాక్టర్ చాపరాల బాబూరావుగారి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి.

## ప్రపంచ వ్యవసాయ సదస్సు-2003

2003 మే 18 నుంచి 20వ తేదీవరకు అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన వరల్డ్ అగ్రికల్చరల్ ఫోరమ్ సమావేశానికి హాజరయ్యాను. 'ద మోస్ట్ క్రిటికల్ బ్యారియర్స్ టు అడ్వాన్సింగ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్స్ గ్లోబల్లీ' (ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ప్రగతికి కీలకమైన అవరోధాలు) అనే అంశంపైన జరిగిన ఆ సమావేశంలో భారతదేశంలో సాధించబడిన వ్యవసాయ ప్రగతి, భూసారం, సాగునీటి వనరులు, ప్రపంచ విస్తీర్ణంలో కేవలం 2.3 శాతం భూవిస్తీర్ణం కలిగివుండి భారతదేశం ప్రపంచ జనాభాలో 16 శాతం మందికి ఆహారభద్రతను సమకూర్చవలసిన ఆవశ్యకత ఉందని, వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకోవడానికి ఉప్పునీటిలో కూడా పంట పండించడానికి అవసరమైన రకాల విత్తనాల్ని బయోటెక్నాలజీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందించవలసిన అవసరం ఉందని చెప్పాను. ప్రపంచ వాణిజ్య సంస్థ విధి విధానాలు వర్ధమాన దేశాల ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నాయని, డబ్ల్యూ.టి.ఓ. నియమాల్ని ధనికదేశాలు అమలుచేసిప్పటికీ ఆ దేశాల్లో వ్యవసాయరంగానికి సబ్సిడీలు హెచ్చుస్థాయిలో కొనసాగుతూనే ఉంటాయని, దిగుమతి సుంకాలు హెచ్చుస్థాయిలోనే విధించబడుతూనే ఉంటాయని, ఎగుమతి సబ్సిడీలను పూర్తిగా ఉపసంహరించాలని, వర్ధమాన దేశాలనుంచి అభివృద్ధి చెందిన దేశాల్లోకి ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై కఠినమైన



*వరల్డ్ అగ్రికల్చర్ ఫోరమ్ హెడ్ క్వార్టర్స్ సెయింట్ లూయిస్*

నాణ్యతా ప్రమాణాల్ని విధిస్తున్నారని, ఇది న్యాయం కాదని చెప్పాను. కనుక అభివృద్ధి చెందిన దేశాల్లో బ్లూ బాక్స్ సబ్సిడీలను ఉపసంహరించాలని డిమాండ్ చేశాను. వర్ధమాన దేశాల్లో అధిక జనాభాగా ఉన్న చిన్న రైతుల ప్రగతికోసం అభివృద్ధి చెందిన దేశాలు సాంకేతికతను, ఆర్థిక వనరుల్ని అందించవలసిన విషయంలో వరల్డ్ అగ్రికల్చరల్ ఫోరం చురుకైన పాత్ర నిర్వర్తించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశాను. వాషింగ్‌టన్ డి.సి.లో ఇంటర్‌నేషనల్ ఫుడ్‌పాలసీ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఇఫ్రీ) లో జరిగిన సమావేశంలో పాల్గొన్నాను. అందులో పనిచేస్తున్న సురేష్‌బాబు చాలా చక్కటి సహకారాన్ని అందించారు. అప్పట్లో ఇఫ్రీ డైరెక్టర్ జనరల్‌గా వున్న అశోక్ గులాటీ ఇప్పుడు మన దేశంలో వ్యవసాయ ధరల కమిషన్ చైర్మన్‌గా వున్నారు.

ఒకరోజు ఆ పర్యటనలో సెయింట్ లూయిస్‌లో మోన్‌శాంటో సంస్థ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించాను. ఆ రోజు సెలవు. కానీ ఇద్దరు శాస్త్రవేత్తల్ని నాతో మాట్లాడటానికి ఏర్పాటుచేశారు. ఆ శాస్త్రజ్ఞులతో నేను బి.టి. పరిజ్ఞానాన్ని రకాల్లోకి ఎందుకు ప్రవేశపెట్టడంలేదు, హైబ్రీడ్ విత్తనాల్లోకి మాత్రమే ప్రవేశపెడుతున్నారని అడిగాను. మేం ఈ పరిశోధనలపైన చాలా అధిక పెట్టుబడి పెట్టడం జరిగింది, మా వ్యాపార ప్రయోజనాల నిమిత్తం హైబ్రీడ్ రకాల్లో మాత్రమే మేం బి.టి. టెక్నాలజీని వినియోగిస్తున్నామని వారు చెప్పారు. రకాల్లో బి.టి. పరిజ్ఞానాన్ని చొప్పిస్తే ప్రతి సంవత్సరం విత్తనాలు కొనుగోలు చెయ్యాల్సిన అవసరం రైతులకు ఉండదు. సెయింట్ లూయిస్‌లో మిత్రులు డా॥ కాజా రామారావు గారు, నల్లబాబు గార్లు కలిసారు.

తిరుగు ప్రయాణంలో నెదర్లాండ్స్‌లోని వ్యాంగింగిన్ యూనివర్శిటీని మే 27-29 సందర్శించాను. వైస్ ఛాన్సలర్ బి.యఫ్. వ్యానాంగ్ వి.ఆర్.ను కలిశాను. సాగునీటిని సమర్థవంతంగా మొక్కలకు అందజేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని మన వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా బాపట్ల మున్నగు ప్రాంతాల్లో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇక్కడ కూడా శాస్త్రవేత్తలతో డబ్ల్యూ.టి.ఓ,జన్యు మార్పిడి ఆహార పంటలు అంశాలపైన చర్చించడం జరిగింది. అక్కడ శాస్త్రవేత్తలు జన్యుమార్పిడి ఆహార పంటలపట్ల వైముఖ్యతను వ్యక్తం చేశారు. శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించబడుతూ ఉన్న డైరీ ఫారమ్‌ను సందర్శించాము.

నెదర్లాండ్స్‌లో పుష్పములను పెద్ద ఎత్తున పండిస్తూ ఉంటారు. సముద్రమట్టము కన్నా కొంత భూభాగం పల్లంగా ఉండుట వలన విండ్‌మిల్స్‌తో నీటిని పంప్ చేస్తూ ఉంటారు.

అక్కడనుంచి జర్మనీలోని బెర్లిన్ నగరం వెళ్ళాను. నేను 1978-'83లో శానససభ్యుడిగా ఉండగా సి.పి.ఐ. పక్ష నాయకుడు, తర్వాత తెలుగుదేశం శాసనసభ్యుడిగా ఉన్న ప్రముఖ నాయకుడు చెన్నమనేని రాజేశ్వరావుగారి కుమారుడు చెన్నమనేని రమేష్‌గారి ఇంటిలో అతిథిగా ఉన్నాను. చెన్నమనేని రమేష్ వారి స్వస్థానంలో స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి తెలుగుదేశం శాసనసభ్యునిగా ఎన్నికై అనంతర పరిణామాల్లో టి.ఆర్.ఎస్.లోకి వెళ్ళారు. బెర్లిన్ గోడ ఆనవాళ్లను చూశాను. బెర్లిన్ యూనివర్శిటీని సందర్శించాను. ప్రముఖ కమ్యూనిష్టు సిద్ధాంతకారుడు ఎంగెల్స్ ఆ యూనివర్శిటీలో పనిచేసివున్నారు. ఆయన కాంశ్య విగ్రహం సందర్శకుల్ని ఆకర్షిస్తూవుంటుంది.

2002 సెప్టెంబర్ 15న చైనాలోని బీజింగ్‌లో జరిగిన 2002 అంతర్జాతీయ వరి కాంగ్రెస్ సమావేశంలో పాల్గొనవలసినదిగా ఆహ్వానించారు. ప్రపంచంలో మూడువందల కోట్లమంది ప్రజల ఆహారమైన వరి పంట ఆహార భద్రత విషయంలో అత్యంత ప్రాముఖ్యత గల పంట అని, భారత ఆర్థిక వ్యవస్థలో వరి పంట పాత్ర అనేక ఆధునిక రకాల రూపకల్పన, అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గణనీయమైన పాత్ర, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లు, నూతన ఆవిష్కరణలు మున్నగు అంశాల గురించి చిన్న పుస్తకాలను రూపొందించి వెళ్ళబోతూ ఉండగా అకస్మాత్తుగా తీవ్రమైన నడుంనొప్పి వచ్చి ప్రయాణం ఆపుకోవలసి వచ్చింది.

## డబ్ల్యూ.టి.ఓ.లో చైనా - భారత్ సహకారం

2003 నవంబర్ 26నుంచి 28వరకు షెంగ్జెన్‌లో డబ్ల్యూ.టి.ఓ. పరిధిలో చైనా-భారత్ ఆర్థిక సహకారం, అభివృద్ధి' అనే అంశంపై జరిగిన సమావేశంలో స్వాగతోపన్యాసం చేశాను. చైనా డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ వారి సంయుక్త భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహించబడింది. సాంస్కృతికపరంగా ప్రాచీన కాలంనుంచి భారత్, చైనా దేశాల మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయని, హ్యూయన్సాంగ్ భారతయాత్ర ఇరుదేశాలమధ్య శతాబ్దాలక్రితం నుంచి పెనవేసుకున్న సంబంధాలకు ఒక ఉదాహరణ అని, ఉభయదేశాలు పరాయిపాలన నుంచి స్వాతంత్ర్యం పొంది అభివృద్ధి పథంలో సంస్కరణలు చేపట్టి ముందుకు వెళ్తూవున్నాయని పేర్కొన్నాను. ధనిక దేశాల్లో చాలా అత్యధిక స్థాయిలో వారి దేశాలనుంచి ఎగుమతులకు సబ్సిడీలు అందిస్తూ, ఇండియా, చైనాలాంటి వర్ధమాన దేశాలు ఎగుమతుల సబ్సిడీలు ఇవ్వరాదని ఆంక్షలు విధించడం ఎంతమాత్రమూ సమంజసంకాదని, ధనిక దేశాలు గ్రీన్‌బాక్స్, బ్లూబాక్స్ పేరిట చాలా హెచ్చుస్థాయిలో సబ్సిడీలు కొనసాగిస్తూండడంవల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఆ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువస్థాయిలో ఉండి వర్ధమాన దేశాలనుంచి ఎగుమతులకు అవరోధంగా పరిణమించి రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని, దీని విషయంలో సమిష్టిగా పోరాడాలని పేర్కొన్నాను. చైనా జనాభా పెరుగుదలను జయప్రదంగా అరికట్టగలిగిందని అభినందించాను.




2005 అక్టోబర్‌లో పారిస్‌లో 'ప్రపంచ వాణిజ్యసంస్థ నేపథ్యంలో లబ్ధిదారులు అనుసరించాల్సిన వ్యూహాలు, నిర్వహణ విధివిధానాలు' అనే విషయంపై జరిగిన చర్చలో పాల్గొన్నాను. నేను, హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్.గోపాల్ పాల్గొన్నాం. 2005 డిసెంబర్‌లో జరగనున్న ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాల మంత్రుల సమావేశంలో లేవనెత్తవలసిన అంశాల గురించి, భారత రైతుల ఆలోచనల్ని ఈ సమావేశంలో ప్రస్తావించాను. వర్ధమాన దేశాల్లోని రైతుల ప్రయోజనాలకు భంగకరంగాను, వారు పండిస్తూవున్న వ్యవసాయోత్పత్తుల ధరల్ని పరోక్షంగా దెబ్బతీస్తూవున్న, ధనికదేశాల్లో



*ప్యారిస్‌లో డబ్లూ.టి.ఓ. హాంగ్‌కాంగ్ సమావేశ వ్యూహంపై చర్చ*

వ్యవసాయ రంగానికి ఇస్తున్న బ్లూబాక్స్ సబ్సిడీలను సంపూర్ణంగా ఉప సంహరించాలి, లేదా యాంబర్‌బాక్స్‌లో కలపాలని పేర్కొన్నాను.

ఎగుమతి సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేయాలని, అమెరికా దేశంలో డీకపుల్డ్ ఇన్‌కమ్ సపోర్ట్, పంట వేయకుండా వదలివేసిన భూములకు ఇచ్చే మొత్తాన్ని యాంబర్‌బాక్స్ సబ్సిడీల్లో కలపాలని, ప్రత్యేకంగా పంటలకు ఇచ్చే సబ్సిడీని ఎరువులు, రుణపరపతి, సాగునీరు మున్నగు అంశాలపై ఇచ్చే సబ్సిడీలతో కలపాలని, ధనిక దేశాల్లో దిగుమతి సుంకాల స్థాయిని తగ్గించాలని, అభివృద్ధి చెందిన దేశాల్లో దిగుమతులపైన 'కోడెక్స్ ఆలిమెంటారిస్' నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలకన్నా ఇంకా కఠినంగా నిర్ణయిస్తూండడంవల్ల వర్ధమాన దేశాలనుంచి ఎగుమతులకు ఆటంకం కలుగుతూందని, ధనిక దేశాలకు ఉన్న మాదిరిగానే వర్ధమాన దేశాలకు కూడా స్పెషల్ అండ్ డిఫరెన్షియేట్ ట్రీట్‌మెంట్‌కు అవకాశం ఉండాలని, కేవలం 36 దేశాలకు మాత్రమే ఉన్న స్పెషల్ సేఫ్‌గార్డ్ క్లాజుకు గల అవకాశాలు, సభ్యదేశాలన్నింటికీ వీలుండాలని, వర్ధమాన దేశాల్లో అత్యధిక శాతం ప్రజానీకం వ్యవసాయమే జీవనాధారంగా ఉంటూ, అందులోనూ అత్యధికశాతం సన్నకారు, చిన్నరైతులు, వ్యవసాయ కార్మికులు అయినందువల్ల వారికి ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి అవకాశాల్ని పరిరక్షించడానికి 'లైవ్‌లీహుడ్ సెక్యూరిటీ బాక్స్'ను ఏర్పరచాలని సూచించాను. లేబర్ స్టాండర్డ్స్‌ను ఐ.ఎల్.ఓ.లో చర్చించాలి తప్ప డబ్ల్యూ.టి.ఓ.లో లేవనెత్తడానికి వీలులేదని సవివరంగా ప్రసంగించాను.

***కొన్ని కీలక సమావేశాలు***

దోహా రౌండ్ డబ్ల్యూ.టి.ఓ.చర్చల్లో 'భారత వైఖరి, యూరోపియన్ యూనియన్ –

భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' అనే అంశాలపైన స్పష్టతను కల్గించడానికి, విధానపరమైన చర్చకు న్యూఢిల్లీలోని నెదర్లాండ్స్ ఎంబసీవారు, రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఫర్ డెవలప్‌మెంట్ కంట్రీస్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్.ఐ.ఎస్.) 2010 ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలోని ఇండియా హేబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నాను.

ప్రపంచంలో వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో అమెరికా తర్వాత స్థానంలో ఉన్న నెదర్లాండ్స్ భారతదేశంలో పర్యావరణానికి హాని కలిగించని రీతిలో వ్యవసాయ దిగుబడుల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రగతిని సాధించడానికి, ఆహార భద్రతను పటిష్టపరచడానికి సహకారాన్ని అందించగలుగుతుంది. "దోహా డెవలప్‌మెంట్ ఎజెండా, యూరప్‌తో వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి అవగాహన" అనే అంశాలపైన జరిగిన చర్చలో నెదర్లాండ్స్‌కు చెందిన వ్యవసాయశాఖ ప్రతినిధులు, వ్యాంగింగిన్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు కూడా పాల్గొన్నారు.

విజయవాడలో అగ్రికల్చరల్ అండ్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ వారు "ప్రపంచవాణిజ్య సంస్థ–వ్యవసాయము అనుబంధ విభాగాలపై ప్రభావము" అను అంశంపై నిర్వహించిన సెమినార్‌లో నేను, డాక్టర్ శివాజీ, వ్యవసాయ కమిషనర్ అజయ్‌కల్లాం, ఎర్రంరాజు, జిల్లా కలెక్టర్ మీనా, మండవ జానకిరామయ్య పాల్గొన్నాము. డబ్ల్యూ.టి.ఓ. నిబంధనల వలన వ్యవసాయము, డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీ మున్నగు రంగాలపైన భవిష్యత్తులో సంభవించగల పరిణామాలు, అధిగమించటానికి అనుసరించవలసిన వ్యూహాల గురించి వివరించాను.

సమస్యలమీద చట్టసభల్లోగానీ, జిల్లా సమీక్షా సమావేశాల్లోగానీ గట్టిగా మాట్లాడుతూ ఉండేవాణ్ని. అధికారులతోగానీ ఇతర పార్టీలకు చెందిన నాయకులతోగానీ వ్యక్తిగత రాగద్వేషాలకు ఆస్కారమివ్వలేదు. అందువల్ల ప్రజాసమస్యల పరిష్కారంలో రహదారులు, కాలువలు, డ్రెయిన్లు, స్కూలు భవనాలు, హాస్పిటల్ భవనాలు మున్నగు సౌకర్యాలను కల్పించడంలోనూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ అందరినుంచి సహకారం లభిస్తూండేది. అనుచితమైన, అన్యాయమైన డిమాండ్లను ఎప్పుడూ అధికారుల ముందు ఉంచేవాణ్నికాదు. అందువల్లనే ఎ.వి.యస్.రెడ్డి, సి.యస్.రావు, రాజర్షి భట్టాచార్య, రాజీవ్‌శర్మ, బి.ఆర్. మీనా లాంటి కృష్ణాజిల్లా కలెక్టర్లు వారి వంతు సహకారాన్ని అందించడం వల్లనే అనేక గ్రామాల్లోనూ, విజయవాడ నగరంలోనూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయించగలిగాను, ఎందరికో ఉద్యో గావకాశాలు కల్పించాననే తృప్తి ఉంది.

❖❖❖

# సామాజిక సేవ

## <u>వెల్లంకి కుటుంబయ్య స్మారక భవనం</u>

**మ**నకున్నంతలో మనం పుట్టి పెరిగిన గ్రామానికిగానీ, సమాజానికిగానీ ఎంతో కొంతమేరకు మన తోడ్పాటును అందించాలనే భావన నాలో ముందునుంచీ కలిగింది. 1970లో ఉయ్యూరులో నేను ఇల్లు నిర్మించిన తర్వాత 1971లో నేను చిన్నప్పటినుంచి పెరిగిన మాతామహుని గ్రామం కలవపాములలో 'శ్రీ వెల్లంకి కుటుంబయ్య స్మారక భవనం' పేరుతో పశువుల ఆస్పత్రి, పాలకేంద్రం, యువక మండలిలకు ఉ పయోగపడేవిధంగా భవన సముదాయాన్ని కట్టించాము. 1971 జూలై 31న పశువుల ఆస్పత్రిని నాటి జిల్లా పరిషత్ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావుగారు అధ్యక్షత వహించగా ప్రజానాయకుడు కాకాని వెంకటరత్నంగారు ప్రారంభించారు.

బెంగుళూరులో ఇంజనీరింగ్ చదువు పూర్తయినతర్వాత వ్యవసాయం చేస్తూవుండగా గండిగుంట గ్రామంలో గణపతి సచ్చిదానందస్వామిగారి ఆధ్వర్యంలో దత్త దేవాలయ నిర్మాణానికి కొద్ది సహకారాన్ని నా భార్య అందించింది. కళ్యాణమందిరం క్రింది అంతస్తు ఫ్లోరింగ్‌లో సగభాగానికి సహకారాన్ని అందించాను. ఉయ్యూరులోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఫ్లోరింగ్‌ను నా అర్ధాంగి బసవరాజ్యం వేయించింది.



*కలవపాముల గ్రామంలో నిర్మించిన పశువుల ఆసుపత్రి మరియు పాలకేంద్రము*

***వడ్డే శోభనాద్రి హాల్:***

గండిగుంటలోని దత్తాశ్రమ ప్రాంగణంలో కార్యక్రమాలు ట్రస్ట్ సభ్యులు నాదెండ్ల సుబ్బారావు, అక్కినేని రామమోహనరావు మున్నగువారు చాలా చక్కగా నిర్వహిస్తూండడాన్ని



గమనించిన నా అర్ధాంగి బసవరాజ్యం "పైన అంతస్తుకూడా వేస్తే పై అంతస్తులో పెళ్లి, కింది అంతస్తులో భోజనాలకు అనుకూలంగా ఉంటుందిగదా! మనం ఎన్నాళ్లు ఉంటామో తెలియదు, పై అంతస్తులో కళ్యాణమంటపం నిర్మాణానికి మన సహకారాన్నిస్తే



*గండిగుంట దత్తాశ్రమంలో వడ్డే శోభనాద్రిహాల్‌ని ప్రారంభిస్తున్న సచ్చిదానంద స్వామీజీ, చిన్న స్వామీ, గోపాలకృష్ణ ప్రసాద్ నాదెండ్ల సుబ్బారావు అక్కినేని రామ్ మోహన్ రావు*

బాగుంటుందిగదా” అని అనగా నేను కూడా సరేనన్నాను. తర్వాత గణపతి సచ్చిదానందస్వామిజీ ఆశ్రమానికి వచ్చినప్పుడు పై అంతస్తు నిర్మాణానికి మా తాతగారు వడ్డే శోభనాద్రిగారి పేరున మేము పది లక్షల రూపాయల సహకారాన్ని ఇవ్వగలమని స్వామీజీకి తెలిపాను. నా మిత్రుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ అయిదు లక్షల రూపాయలు, మాదల సుబ్రమణ్యేశ్వర రావు మరికొందరు లక్ష రూపాయల వంతున సహకారాన్నందించారు. ట్రస్టీలు నాదెండ్ల సుబ్బారావు, అక్కినేని రామమోహన్ రావు మున్నగు వారి పర్యవేక్షణలో పై అంతస్తు నిర్మాణం పూర్తయి, జనవరి 16, 2009 తేదీన స్వామీజీ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అమెరికాలో ఉండే స్వామీజీ భక్తులు పటేల్‌గారు కూడా హాజరయ్యారు. ప్రారంభోత్సవ సభలో స్వామీజీ ఈ హాలుకు ఏ.సి. కూడా ఉంటే బాగుంటుందని అనగా హరీస్ ఎమ్. పటేల్‌గారు వెంటనే ఎ.సి. చేయించడానికి తన వంతుగా ఏడు లక్షల రూపాయల సహకారాన్ని ప్రకటించారు. వెలగపూడి వీర ప్రకాశ్ రావు, మోతుకూరు వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ రామకోటేశ్వరరావు, వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్,లతో సహా పలువురు సహకారం అందించారు. ఎ.సి. కళ్యాణమంటపానికి ‘వడ్డే శోభనాద్రి హాలు’ అని స్వామీజీ నామకరణం చేశారు. అప్పటినుంచి ఉయ్యూరు ప్రాంత పౌరులకు వివాహాది శుభకార్యాలకు ఈ హాలు ఎంతో ఉపయోగపడుతూవుంది.

## *వడ్డే శోభనాద్రి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం*

విజయవాడ ఎం.పి.గా ఉన్న సమయంలో ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో వీణ ఆకారంలో ఆడిటోరియంను నిర్మింపజేయాలనే కోరిక నెరవేరకపోయినప్పటికీ ఆ భావన నా మనసులో కొనసాగుతూనేవచ్చింది. క్రియాశీలక రాజకీయాలనుంచి విరమించి ఉయ్యూరులో వ్యవసాయం చూసుకుంటూ ఉండగా మా ఇంటికి సమీపంలోనే ఉన్న అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరకు రైతుల కళాశాలకు నాకు లయోలా కళాశాలలో గురువుగారైన యార్లగడ్డ రాజగోపాలరావుగారు కన్వీనర్‌గా ఉన్నారు. ఆయన ఎయిడెడ్ కళాశాల టీచర్స్ అసోసియేషన్‌కు గతంలో అధ్యక్షుడిగా చేసివున్న అనుభవం, విద్యారంగానికి సంబంధించిన లోతుపాతులు క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి. వారి సూచనలతో కాలేజీ చక్కని ప్రగతిని సాధిస్తూవుంది. కాలేజీలో ఇండోర్ స్టేడియం నిర్మించడానికి ప్రతిపాదనను ఒకదాన్ని రూపొందించి యు.జి.సి.కి పంపివున్నారు. అప్పుడు నేను వారితో మా పితామహులు వడ్డే శోభనాద్రిగారి పేరున ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పదిలక్షల రూపాయల విరాళాన్ని ఇవ్వగలనని



*ఉయ్యూరులోని ఎ.జి.ఎస్.జి. సిద్దార్థ కళాశాలలో శ్రీ వడ్డే శోభనాద్రి ఇండోర్ స్టేడియం*

తెలియజేశాను. వారు ఈ విషయాన్ని అకాడమీ పెద్దలు నల్లూరి వెంకటేశ్వర్లు, పాలడుగు లక్ష్మణరావు ప్రభృతులకు తెలియపరచగా, "చాలా సంతోషం! చాలా మంచి వ్యక్తి, గొప్ప వ్యక్తి శోభనాద్రిగారు" అని ఆమోదం తెలిపారు. హైదరాబాదులో ఆర్కిటెక్ట్ ధనుంజయ్‌తో ఈ స్టేడియం రూపకల్పనకు సంబంధించిన చర్చల సందర్భంగా బెంగుళూరులోని చౌదయ్య




*ఉయ్యూరులోని ఎ.జి.ఎస్.జి. సిద్దార్థ కళాశాలలో శ్రీ వడ్డే శోభనాద్రి ఇండోర్ స్టేడియం శంఖుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రిణి గౌ. పురంధేశ్వరి, రాజగోపాల రావు, ప్రభృతులు*

మెమోరియల్ హాలు సంగీత కచేరీలకు, నాటకాలకు, సభలకు ఉద్దేశించినది. మన ఉయ్యూరులో నిర్మిస్తున్నది స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం కాబట్టి బ్యాట్ ఆకారాన్నిస్తే బాగుంటుందని ఆయన అనగా ఆ సూచన బాగుందని భావించి ఆ ఆకారంలోనే డిజైన్ చేసి నిర్మించడం జరిగింది.

జగ్గయ్యపేట సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సురేష్‌బాబుగారి ఆధ్వర్యంలోని పారమౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్‌వారు నిర్మాణాన్ని చేపట్టి పూర్తిచేశారు. ఈ ఇండోర్ స్టేడియం ఎప్పుడైనా కళాశాల వార్షికోత్సవాల సందర్భంలో గానీ, ఎవరైనా ప్రముఖ విద్యావేత్త ఎక్కువమంది విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించడానికి అనుకూలంగా ఉండడానికి రీసౌండ్ రాకుండా లోపల గోడలకు, పైన శబ్దాన్ని గ్రహించే వాల్ క్లాడింగ్ చేయించాం. ఫలితంగా రీసౌండ్ చాలావరకు తగ్గి సభలు, సమావేశాలు జరపడానికి ఉపయుక్తంగా తయారయ్యింది. 24 ఏప్రిల్ 2004న కేంద్ర మానవ వనరుల సహాయమంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధరేశ్వరి శంకుస్థాపన చేశారు. 2012 డిసెంబరు 30న కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి శ్రీమతి పురంధరేశ్వరి ప్రారంభించవలసి ఉన్నప్పటికీ కారణాంతరాలవల్ల ఆమె రాలేకపోయినందువల్ల 'శ్రీ వడ్డే శోభనాద్రి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం'ను మచిలీపట్నం పార్లమెంటుసభ్యుడు కొనకళ్ళ నారాయణరావుగారు




*ఉయ్యూరు కాలేజీలో వడ్డే శోభనాద్రి ఇండోర్ స్టేడియం ప్రారంభం సందర్భంగా*


ప్రారంభించారు. ఈ స్టేడియానికి కొనకళ్ల నారాయణరావుగారు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులనుంచి అయిదు లక్షల రూపాయల సహకారాన్ని అందించారు. రాజ్యసభ సభ్యుడు శ్రీ జె.డి.శీలం, ఐ.ఎ.యస్. తన పార్లమెంటు నిధులనుండి మూడులక్షల రూపాయలు అందించారు.

ఉయ్యూరులోని శివాలయం బజారులో యాదవుల రామాలయం ఉంది. నేను చదువు పూర్తయిన తర్వాత ఉయ్యూరులో వ్యవసాయం చూసుకుంటూవుండగా ఆ ఆలయాన్ని చూస్తూవుండే గౌరిపర్తి పోతురాజు ఆలయ ప్రహరీగోడకు పశువులు లోనికిరాకుండా గేటు అమర్చడానికి సహకారం అందించమని కోరారు. ఉయ్యూరులో మా నాన్నగారు వ్యవసాయం చేస్తూవున్న సమయంలో మేకల పరశురామయ్య, మేకల సర్వేసు, గౌరిపర్తి జగన్నాథం వంటి యాదవ కుటుంబాలు సన్నిహితంగా ఉండేవారట. నేను మా నాన్నగారు వడ్డే అంకయ్యగారి పేరున గేటును అమర్చేవిధంగా చేశాను. అనంతరకాలంలో ఆ రామాలయం పల్లంగామారి పునర్నిర్మాణం చేసిన సందర్భంలో ద్వారకాతిరుమల దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ మైలవరం జమీందారు యస్.వి. సుధాకరరావుగారితో మాట్లాడి ద్వారకాతిరుమల దేవస్థానం నుండి రెండున్నర లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందేటట్లు చేశాను. అప్పుడు నేను వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నాను. ఈ రామాలయంలోనే సాయిబాబా ఆలయాన్నికూడా ఏర్పాటుచేశారు. సాయిబాబా పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌నుంచి జయరాజ్‌గారి ద్వారా తెప్పించి సాయిబాబా ఆలయానికి నా భార్య బసవరాజ్యం అందించింది.

ఆచార్య ఎన్.జి. రంగా శిష్యుడు, ఉపన్యాసకులు సుంకర సత్యనారాయణ, సర్దార్ గౌతు లచ్చన్న అనుయాయి అయిన కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం పొనుకుమాడు గ్రామానికి చెందిన సుంకర సత్యనారాయణగారు నాకు కొంత దూరపు బంధువేగాక, రాజకీయాల్లో వివిధ సందర్భాల్లో మార్గనిర్దేశకులుగా వ్యవహరిస్తూండేవారు. సుంకరగారు మంచి వ్యవసాయకుడు. పొనుకుమాడు గ్రామంలో తనకున్న వ్యవసాయానికితోడు సత్తుపల్లి గ్రామానికి సమీపంలో రెండువందల ఇరవై ఎకరాల విస్తీర్ణంలో మామిడితోటను పెంచిన ఆదర్శరైతు. అన్న ఎన్.టి.రామారావుగారు ప్రజల చెంతకు పాలన తీసుకువెళ్ళాలనే ఆశయంతో మండల వ్యవస్థకు శ్రీకారం చుట్టినప్పుడు సుంకరగారు అన్నగారిని ఒప్పించి ఉంగుటూరు మండలం ఏర్పడడానికి కారకులయ్యారు. సుంకరగారు బందరులో చదువుతూ ఉండగానే రంగాగారిపట్ల ఆకర్షితులై విద్యార్థి కాంగ్రెస్ నాయకుడుగా, గొప్ప వక్తగా, రాష్ట్రమంతటా మంచి నాయకుడుగా గుర్తింపుపొందారు.

నేను శాసనసభ్యుడుగా ఉండగా కృష్ణాజిల్లాలో స్థానికసంస్థలనుంచి ఇద్దరు సభ్యుల్ని ఎన్నుకునే అవకాశం కలిగింది. సుదీర్ఘ అనుభవం, జిల్లావ్యాప్తంగా పరిచయాలున్న సుంకర సత్యనారాయణగారిని శాసనమండలికి పోటీచేయిస్తే ఒక స్థానాన్ని ప్రతిపక్షం గెలుచుకోవడానికి వీలుంటుందని భావించి ప్రతిపక్షాల సంయుక్త అభ్యర్థిగా ఆయనను

నిలబెట్టాం. ఆయన విజయం సాధించారు. అన్నగారు శాసనమండలిని రద్దుచేసిన తర్వాత సుంకరగారిని జిల్లాపరిషత్ చైర్మన్‌గా చేస్తే బాగుంటుందని భావించాం. చిత్తూరు పార్లమెంటు సభ్యులు, సుంకరగారికి అత్యంత ఆప్తమిత్రులు, ఆదర్శ ప్రజానాయకుడు అయిన పి. రాజగోపాలనాయుడు, గుంటూరుజిల్లా గోవాడ గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పావులూరి శివరామకృష్ణయ్యగారు పిన్నమనేని



*కృష్ణ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు*

కోటేశ్వరరావుగారితో మాట్లాడారు. అప్పట్లో కోటేశ్వరరావుగారు శాసనసభ్యుడిగాకూడా ఉన్నారు. శాసనసభ్యత్వంగానీ, జిల్లాపరిషత్ చైర్మన్ పదవిగానీ ఏదో ఒకటి మాత్రమే ఉండాలనే నిబంధన ఉండడంవల్ల ఆయన శాసనసభ్యత్వాన్ని ఉంచుకుని, జిల్లాపరిషత్ చైర్మన్ పదవికి రాజీనామాను సమర్పించారు. ఆ స్థానంలో సుంకర సత్యనారాయణగారు



*కృష్ణ జిల్లా పరిషత్ సభ్యులు*


జిల్లాపరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. జిల్లాపరిషత్ చైర్మన్‌గా కృష్ణాజిల్లాలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన ఎంతో తోడ్పాటును అందించారు. చిత్తశుద్ధితో గ్రామ సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి పాటుపడే వ్యక్తులకు సంపూర్ణ సహకారం అందించడానికి సిద్ధపడడమేగాక మంజూరైన పనుల పురోగతిని కూడా తెలుసుకుంటూవుండేవారు. కృష్ణాజిల్లాలోని మెట్టప్రాంత గ్రామాలు సుంకరగారి హయాంలో రహదారులు, పాఠశాలలు, మంచినీటి పథకాలు మున్నగు అంశాల్లో గణనీయమైన పురోభివృద్ధిని సాధించాయి. ఆయన కాలంచేసిన తర్వాత ఉంగుటూరు సమీపంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయించాం. సుంకరగారితో చిరకాల అనుబంధం ఉన్న నేను, కిలారు విద్యాసాగరవర్మ, సుంకర రాజ్‌కుమార్, పిన్నమనేని భూపతిరాయుడు, గుత్తా అప్పారావు, డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, వల్లభనేని రమేష్‌చంద్, మలిరెడ్డి, శ్రీశైలరెడ్డి, శ్రీమతి సుంకర విశాలాక్షి, గోగినేని కృష్ణబాబు మున్నగువారు అందరం కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. 2011 జూలై 10వ తేదీన ఈ కాంస్య విగ్రహాన్ని ఎం. వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించారు. నా అధ్యక్షతన జరిగిన సభలో కె.ఎర్రంనాయుడు, కొనకళ్ల నారాయణరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, యలమంచిలి శివాజీ, డాక్టర్ బాలవర్ధనరావు, అంబటి బ్రాహ్మణయ్య, డి.ఉమామహేశ్వరరావు, దాడి వీరభద్రరావు, గద్దె రామ్మోహన్, మూల్పూరి బాలకృష్ణారావు, కడియాల రాఘవరావు, చేకూరి కాశయ్య, ఇంకా ఎందరో ప్రముఖులు పాల్గొన్నారు. నా మిత్రుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ సుంకరగారి విగ్రహాన్ని తయారు చేయించారు.

❖❖❖

# ప్రచురించిన పుస్తకములు

***ప్రజల ఎదురుతెన్నులు పాలకుల తీరుతెన్నులు - రామోజీరావుగారి అభిమానం***

ఎనిమిదో లోక్‌సభలో నేను ఇంగ్లీషులో చేసిన ప్రసంగాలను అనువదించి 'ప్రజల ఎదురుతెన్నులు-పాలకుల తీరుతెన్నులు' అనే పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఈనాడు చీఫ్ ఎడిటర్ చెరుకూరి రామోజీరావుగారు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 1989 అక్టోబరు 19న జరిగిన సభలో దాన్ని ఆవిష్కరించారు. రామోజీరావుగారి స్వగ్రామం పెదపారపూడి. నా భార్య మేనమామగారి ఇంటిపక్కనే వారి ఇల్లు. నా పట్ల చాలా అభిమానం చూపుతూ ఉండేవారు. 1996 పార్లమెంటు ఎన్నికల్లో ఈనాడు ఎడిట్ పేజీలో 'సైద్ధాంతిక నిబద్ధతగల రాజకీయవేత్త' అను వ్యాసంను ప్రచురించి నాకు కొండంత మద్దతును అందించారు. నేను విశ్వసించిన నైతిక విలువలు, నిబద్ధతో కూడిన నడవడికను ఆ విధంగా ఆయన ఆశీర్వదించారు. నా మిత్రుడు చల్లగుళ్ల నరసింహారావుగారు ఈ పుస్తకానికి టైటిల్‌ను సూచించడమేగాక, పుస్తకంలో సబ్ హెడ్డింగ్‌లను సూచించగా, మరో చిరకాల మిత్రుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నా ఆంగ్ల ప్రసంగాలను తెలుగులోకి అనువదించి పుస్తక రూపకల్పనలో ఎంతగానో సహకరించారు. మిత్రులు మండవ రత్తయ్యగారు పుస్తకాన్ని ప్రచురించారు.





వ్యవసాయ రంగంపైన 15, పారిశ్రామిక రంగంపైన 6, అంతరంగిక వ్యవహారాల పైన 7, సామాజిక సమస్యల పైన 4, అవినీతి భాగోతాలు పైన 6, కేంద్ర రాష్ట్ర సంబంధాల పైన 2, వివిధ విషయాలపైన 15 పర్యాయములు ప్రసంగించాను. ఇవికాక 377 నిబంధన క్రింద 33 ప్రజా ప్రాముఖ్యత కల అంశములను సభ దృష్టికి తీసుకువెళ్లాను.

రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేయు అంశములు, రైతు సమస్యలు, పారిశ్రామిక ప్రగతి జనాభా పెరుగుదల, ఉపాధి కల్పన వంటి పల అంశములతో పాటు బోఫర్స్‌తో సహా రక్షణ కొనుగోళ్ళలో అవినీతితో సహా అనేక అంశాలపైన ప్రజలవాణిని తెలుగుదేశం పార్టీ దృక్పథాన్ని స్పష్టంగా వినిపించాననే సంతృప్తి ఉంది.


***<u>రైతువాణి</u>***


పదవ లోక్‌సభలో నేను పార్లమెంటులో చేసిన ప్రసంగాల్ని తెలుగులోకి తర్జుమా చేసి పుస్తకంగా "రైతువాణి" పేరుతో చల్లగుళ్ల నరసింహారావుగారు తీర్చిదిద్దారు. హైదరాబాదులోని కళాజ్యోతి ప్రెస్ అధినేత ఆలపాటి బాపన్నగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని పుస్తకాన్ని చాలా అందంగా ప్రచురించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన అంశాలపైన 25 పర్యాయాలు, సామాజికరంగానికి సంబంధించిన అంశాలపైన 14 పర్యాయాలు, ప్రభుత్వ విధానాలు- చట్టాలు అనే అంశంపైన 13 పర్యాయాలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపైన 7 పర్యాయాలు, మతసామరస్యం ఆవశ్యకతపైన 4 పర్యాయాలు, అవినీతి- కుంభకోణాలపైన 9 పర్యాయాలు - మొత్తం 72 పర్యాయాలు 10వ లోక్‌సభలో ప్రసంగించాననే తృప్తి నాకుంది. (వివరాలు అనుబంధం-లో).




***<u>1978 మార్చి నుండి 1981 మార్చి వరకు రాష్ట్ర శాసనసభలో</u>***


55 ప్రశ్నలు సంధించటంతో పాటు వివిధ అంశములపైన 53 పర్యాయములు ప్రసంగించాను. "ఆంధ్రరైతు ఆవేదన", "దగాపడిన ఆంధ్రరైతు" పుస్తకముల రూపంలో వీటిని ప్రచురించటం జరిగింది.







## దేశంకోసం రైతు-రైతుకోసం ఎవరు?

1967లో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ఉయ్యూరులో నివాసముంటూ స్వతంత్రపార్టీని అభిమానిస్తూ సమావేశాలకు వెళ్తూవుండేవాణ్ని. రాజగోపాలాచారిగారి ఆశీస్సులతో ప్రచురించబడిన స్వరాజ్య పత్రికలో ప్రతి సంచికలోనూ రాజాజీ వ్యాఖ్యలుండేవి. కె. సంతానం, మినూ మసానీ, వి.యం.దండేఖర్, పీలూమోడి, నానీ పాల్కీవాలా లాంటి ఎందరో ప్రముఖుల వ్యాసాలు ఉంటూవుండేవి. స్వరాజ్య వార్షిక సంచిక చాలా సమాచారాన్ని అందిస్తూండేది. అప్పటినుంచి వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, పరిశ్రమలు మున్నగు అంశాలపైన ఆసక్తితో నిశితంగా అధ్యయనం చేయడం అలవాటయ్యింది. చరణ్‌సింగ్‌గారి "గాంధేయపథం"లో, "ఎకనమిక్ నైట్‌మేర్ ఆఫ్ ఇండియా" పుస్తకాల పఠనంవల్ల గణాంక వివరాల్ని గుర్తుంచుకునే అలవాటు ఏర్పడింది. నేను గ్రహించిన విషయాల్ని, సమాచారాన్ని నా సాటి గ్రామీణ ప్రజలకు అందించడానికి పత్రికలకు వ్యాసాలు రాసి పంపడం ఒక సాధనంగా భావించాను. పార్లమెంటు సభ్యుడిగా ఉండగా పార్లమెంటు




లైబ్రరీలో రిఫరెన్స్ అండ్ ఎనాలిసిస్ వింగ్ వారు సభ్యుడు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంతవరకు అందజేసే సౌకర్యం ఉంది. అలాగే పార్లమెంటు లైబ్రరీలో ఎన్నో పత్రికలు వస్తూవుంటాయి. పుస్తకాలనుంచి నాకు ఆసక్తివున్న సమాచారంగల పేజీల్ని జిరాక్స్ తీసి నా అవగాహనను పెంపొందించుకుని పత్రికలకు అనేక అంశాలపైన వ్యాసాలు రాసి పంపుతూండేవాణ్ని. ఈనాడు రాకముందు ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో అవి ప్రచురితమయ్యాయి. ఈనాడు వచ్చిన తర్వాత అత్యధికమైన సర్క్యులేషన్ ఉండడంవల్ల అధిక సంఖ్యలో పాఠకులకు సమాచారాన్ని అందించవచ్చనే ఉద్దేశంతో ఈనాడు పత్రికకు వ్యాసాలు పంపేవాణ్ని. వ్యవసాయ విధానాల గురించి 14 వ్యాసాలు, డంకెల్ ప్రతిపాదనలు-ఎగుమతులు, దిగుమతులపైన 8 వ్యాసాలు, వరి, చెరకు, పత్తి మున్నగు పంటలపైన 11 వ్యాసాలు, కూరగాయలు, పండ్లు, రైతుబజార్, ఆక్వా మున్నగు అంశాలపైన 8 వ్యాసాలు, వ్యవసాయ రుణపరపతి, పంటల బీమా, ఎరువులు, విస్తరణ, విత్తనాలు మున్నగు అంశాలపైన 14 వ్యాసాలు, ఇరిగేషన్ రంగంపైన 7 వ్యాసాలు, విద్యుత్ సంస్కరణల గురించి 5 వ్యాసాలు, ఆహార భద్రత, ఉపాధి కల్పన, వ్యవసాయ




పరిశ్రమలకు సంబంధించి 6 వ్యాసాలు, జన్మభూమి, ఎన్నికల సంస్కరణలు, జనాభా, ఇతర అంశాలపైన 10 వ్యాసాలు ప్రచురితమయ్యాయి. పలు రాజకీయ పక్షాలు రైతుల ప్రయోజనాలకు తక్కువ ప్రాధాన్యతనిస్తూ ఓట్ల సంపాదనే లక్ష్యంగా అనుసరిస్తూన్న/ ప్రవేశపెడుతూన్న విధానాలతో వ్యవసాయరంగంలో సంక్షోభం నానాటికీ తీవ్రతరమవుతూవుంది. నాయీ ఆవేదనను దృష్టిలో పెట్టుకుని ఈ పుస్తకానికి చిరకాల మిత్రుడు చల్లగుళ్ల నరసింహారావు 'దేశంకోసం రైతు-రైతుకోసం ఎవరు?' అనే చక్కని టైటిల్‌ను కూడా సూచించారు. నీతి నిజాయితీ, నిబద్ధతతో కూడిన ప్రజాసేవ చెయ్యడానికి, వ్యవసాయరంగంపైన సమగ్ర అధ్యయనం చెయ్యడానికి నాకు స్ఫూర్తిని ప్రసాదించిన భారత రైతాంగ ముద్దుబిడ్డలు ఆచార్య ఎన్.జి. రంగా, చౌధురి చరణ్‌సింగ్ గార్లకు ఈ పుస్తకాన్ని అంకితమిచ్చాను. హైదరాబాద్‌లోని కళాజ్యోతి ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బాపన్నగారు అందంగా ప్రచురించారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబ్లీహాల్‌లో 2012 జూన్ 17న జరిగిన సభలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి చౌదరి అజిత్‌సింగ్‌గారు ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రిణి శ్రీమతి దగ్గుబాటి పురంధరేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేను రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా అత్యున్నతమైన చట్టసభలో ప్రజా వాణిని వినిపించడానికి నన్ను ఆశీర్వదించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ ఎన్.టి. రామారావుగారి


కుమార్తెగా చక్కని అవగాహనతో, హుందాగా పార్లమెంటులో ప్రతిపక్షం వారుకూడా మెచ్చుకునే రీతిలో ప్రజాసమస్యల్ని ప్రస్తావించిన పురంధరేశ్వరిగారంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. రాష్ట్ర సివిల్ సర్వీసులో నిబద్ధతతో పనిచెయ్యడమే గాక ప్రజారంగాన్ని ప్రక్షాళన చెయ్యాలనే ఉన్నతాశయంతో తన పదవికి రాజీనామా చేసి లోక్‌సత్తా సంస్థను స్థాపించి పత్రికల ద్వారా ప్రజల హక్కులు, బాధ్యతలపైన అవగాహన, సంస్కరణలు మున్నగు అనేక విషయాలపైన ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి కృషిచేసిన లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఎన్. జయప్రకాష్ నారాయణ్ ఈ గ్రంథాన్ని సమీక్షించారు. వ్యవసాయ కమీషనర్‌గా రైతు సంక్షేమం కొరకు పాటుపడిన అజయ్ కల్లమ్ గారు పాల్గొన్నారు. చిరకాల మిత్రుడు డా॥ యలమంచిలి శివాజి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.


***<u>రైతు స్వరాజ్య యాత్ర ఎందుకు?</u>***


హైదరాబాద్ కేంద్రంగా డా॥ రామాంజనేయులు, కవితాకురుగంటి, రవి మున్నగు వారి అధ్వర్యంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం పనిచేస్తూ వుంది. మితిమీరిన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వలన భూసారం తగ్గడం, పర్యావరణానికి నష్టం, ప్రజల ఆరోగ్యానికి భంగం కలుగుతున్నాయని ప్రజలలో అవగాహనను పెంపొందించటానికి ఈ సంస్థ చక్కని కృషి చేస్తూవుంది. జన్యుమార్పిడి పంటల వలన దీర్ఘకాలంలో మన విత్తన జన్యు సంపద ప్రమాదంలో పడటమే కాక మనం మనరైతులు బహుళ జాతి సంస్థల విత్తనాల పైన అధారపడే పరిస్థితి రావచ్చని ముఖ్యంగా ఆహార పంటల విషయంలో జన్యుమార్పిడి సాంకేతిక పరిజ్ఞానం అవశ్యకత లేదని ప్రజలను చైతన్యపరిచేందుకు తీవ్రమైన కృషి చేస్తూవుంది. కొద్ది కాలం క్రితం హైదరాబాదులో హైటెక్స్‌లో 2012 అక్టోబర్ 12 నుండి 15ను వరకు జన్యు మార్పిడి ఆహార పంటలు – ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించబడిన సందర్భంలో సైడ్‌లాన్స్‌లో "పీపుల్స్ బయోడైవర్సిటీ ఫెస్టివల్" నిర్వహించారు. నవంబర్ 6 నుండి 9 వరకు రైతు స్వరాజ్య యాత్రను నిర్వహించ




తలపెట్టగా విజయవాడలో 9న ఒక సమావేశం నిర్వహించబడింది. అందుకై రైతు స్వరాజ్య యాత్ర ఎందుకు అని ఒక పుస్తకమును నేను రూపొందించగా సుస్థిర వ్యవసాయ కేంద్రం వారు ప్రచురించారు.



## 'వ్యవసాయ సంక్షోభం రైతుల ఆత్మహత్యలు' జాతీయ సెమినార్

2005 ఫిబ్రవరి 24 నుండి 26 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 'వ్యవసాయ సంక్షోభం రైతుల ఆత్మహత్యలు' జాతీయ సెమినార్ నిర్వహించబడింది. సన్నకారు, చిన్న రైతులకు సంస్థాగత పంట రుణాలు లభించకపోవటం, హెచ్చువడ్డీలకు ప్రైవేటు రుణాలపైన ఆధారపడటం, ప్రకృతి వైపరీత్యాలు, రైతులను ఆదుకునే సరైన పంటల భీమా పథకం లేకపోవటం, సరైన మద్దతు ధరలు లేకపోవటం వంటి కారణల వలన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించాను. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ఇతోధికంగా నిధులు కేటాయించి ఇరిగేషన్, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలపరచనదే సంక్షోభానికి పరిష్కారం లభించదని చెప్పాను. ఆ సందర్భంలోనే నా అభిప్రాయాలను వ్యక్తీకరిస్తూ ఇంగ్లీషులో "నేషనల్ సెమినార్ ఆన్ అగ్రేరియన్ డిస్ట్రెస్ & ఫార్మర్స్ ఇన్ ఇండియా" అను పుస్తకాన్ని అందరికీ అందజేశాను.

## వడ్డేకు 2010 ఫార్మింగ్ లీడర్‌షిప్ అవార్డు

న్యూ ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్, పూసా కన్వెషన్ హాలులో 2010 సెప్టెంబర్ 29న అగ్రికల్చరల్ టుడే ఆధ్వర్యంలో 2010 ఫార్మింగ్ లీడర్‌షిప్ అవార్డును నాకు ప్రసాదించారు. ప్రొఫెసర్ యం.యస్. స్వామినాథన్ అధ్యక్షుడిగా




*2010 ఫార్మింగ్ లీడర్‌షిప్ అవార్డు ప్రధానం సందర్భంగా శివరాజ్ పాటిల్ ఎమ్.స్వామినాధన్ , ప్రేమ్ కుమార్ ధుమాల్, ఎం.జె. ఖాన్*

వ్యవసాయ రంగంలో పలువురు ప్రఖ్యాతి చెందిన శాస్త్రజ్ఞులు, నిపుణులు సభ్యులుగా ఉండిన అవార్డు కమిటి ఈ అవార్డుకు నన్ను ఎంపికచేయడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. పంజాబ్ గవర్నర్ మరియు మాజీ లోక్‌సభ స్పీకర్ శివరాజ్ పాటిల్ మరియు డాక్టర్ ఎం.యస్. స్వామినాథన్‌గారి చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. హిమాచల్ ముఖ్యమంత్రి ప్రేమ్‌కుమార్ ధుమాల్ కూడా పాల్గొన్నారు. అగ్రికల్చరల్ టుడే మ్యాగజైన్ పబ్లిషర్, ఎడిటర్ ఎం.జె.ఖాన్ వ్యవసాయ రంగంపట్ల దృఢమైన ఆసక్తి కలిగిన వ్యక్తి. ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలలో ప్రచురించబడుతూ ఉన్న ఈ మ్యాగజైన్ రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆ సందర్భంగా ప్రస్తావించబడిన అనులేఖనం (సైటేషన్) ఇలా ఉంది.

"ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లాలోని ఒక గ్రామంలో 1943లో జన్మించిన శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు రైతాంగం సంక్షేమానికి, వ్యవసాయరంగం అభివృద్ధికి తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారు. ఇంజనీరింగ్ చదివిన ఆయన ఆనక్తులు, ఆలోచనలు యాంత్రిక పరమైనవికావు. అవి పూర్తిగా సహజమైనవి. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత వ్యవసాయాన్ని చేపట్టడానికి దారి తీశాయి. 8వ లోక్‌సభ సభ్యుడుగా, 10వ లోక్‌సభ సభ్యుడుగాను ఆయన పార్లమెంటులో జరిగిన చర్చల్లో చురుగ్గా పాల్గొని, రైతుల సమస్యలపై తన గళాన్ని వినిపించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన తీసుకున్న ప్రభావపూరిత నిర్ణయాలు రాష్ట్రంలో రైతుబజార్లను ఏర్పాటుచేయడానికి మార్గాన్ని సుగమం చేశాయి. వీటివల్ల రైతులు తమ ఉత్పత్తులకు నూరుశాతం విలువను పొందడానికి వీలు కలిగింది. రైతులు తమవద్దగల పంటలను తక్కువ ధరకు అమ్ముతూ నష్టపోయే పరిస్థితిని నివారించడంకోసం పంటనిల్వపై 70శాతం రుణాన్ని రైతులు పొందడానికి వీలుగా ఆయన "రైతుబంధు" పథకాన్ని ప్రాంభించారు. అలాగే కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందడానికి సహాయపడే విధంగా "రైతుమిత్ర" గ్రూపులను ప్రారంభించారు. ఆయన పదవీకాలంలో మండల స్థాయి కార్యచరణ ప్రణాళికలను, విత్తనాభివృద్ధి పథకాలను, రైతుల క్షేత్రస్థాయి పాఠశాలలను, రైతుమిత్ర పేరుతో టీవీ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. స్వతహాగా వ్యవసాయదారుడు కావడంతో ఆయన రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యలపట్ల అవగాహన కలిగివున్నారు. రైతుల స్థితిగతులను వెలుగులోకి తెచ్చి విధాన నిర్ణయాలకు వీలు కలిగించడంకోసం ఆయన ప్రతి విషయంలోనూ గట్టిగా కృషిచేశారు. మంచి ఆలోచనా పరుడు, రచయిత, చదువరి. ఆయన డంకెల్‌డ్రాఫ్ట్ ప్రతిపాదనల్ని వ్యతిరేకించే

విషయంలోగానీ, చెరకు ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పంటరుణాలపై వడ్డీరేట్లు, నాణ్యతలేని వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి రైతుల సమస్యల పరిష్కారం విషయాల్లో ఎల్లప్పుడూ ముందుంటారు. రైతుల అభ్యున్నతికి ఆయన అంకితం కావడానికి ఆచార్య ఎన్.జి.రంగా, చౌధురి చరణ్‌సింగ్‌ల నుంచి స్ఫూర్తిపొందడం ఒక కారణం."



*నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారితో చెరుకు రైతుల బృందం*



*నాటి జనతా ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రి బర్నలా గారితో*



విజయవాడలో సర్ అర్థర్ కాటన్ మనుమడిని సత్కరిస్తున్న సందర్భంగా

<u>**స్వామినాథన్ సిఫార్సుల అమలుతోనే వ్యవసాయ సంక్షోభంను అధిగమించగలం**</u>

1968 నుండి మన దేశంలో సస్యవిప్లవం కొనసాగింది. వరి, గోధుమ పంటల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. 1996 ప్రాంతంనుండి భారత వ్యవసాయ రంగంలో వ్యవసాయ అభివృద్ధి వేగం మందగిస్తూ వచ్చింది. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల



డా॥ ఎమ్.ఎస్ స్వామినాథన్ గారితో

ఉద్ధృతి, ఋణ పరపతి రైతులందరికీ తగినంతగా లభించక, సరైన పంటల భీమా పథకం లేక, మార్కెటింగ్‌లో లోపాలు రైతుల పాలిట శాపమయ్యాయి. ఫలితంగా అప్పటినుండి ఇప్పటికీ దాదాపు 2 లక్షల 60 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతు కుటుంబాలలో యువకులు వ్యవసాయం పట్ల ఆసక్తిగా లేరు. మన దేశంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉంది. ఈ పరిస్థితులను అన్నిటిని సమీక్షించి సంక్షోభాన్ని అధిగమించడానికి, వ్యవసాయం లాభసాటి వ్యాపకంగా మనగలగటానికి అవసరమైన సూచనలను ఇచ్చేందుకు ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ యం.యస్. స్వామినాథన్ అధ్యక్షతన రైతు కమీషన్‌ను 2004 లో కేంద్ర ప్రభుత్వం నియమించింది.

2006లో కమీషన్ తుది రిపోర్టును అందించినా ఇప్పటికీ ఈ రిపోర్టును పార్లమెంటులో చర్చించడం గానీ, అందులో చేసిన ముఖ్యమైన సిఫార్సులను ఆమోదించి, అమలుచేయకపోవడం భారత రైతుల దురదృష్టం. ఈ సిఫార్సులను అమలు చేస్తే ఈనాడు మన దేశంలో రైతాంగం ఎదుర్కొంటూ ఉన్న అనేక సమస్యలు పరిష్కరించబడతాయి. స్థూలంగా సంక్షిప్తంగా ఆ సిఫార్సులలో కొన్ని ఇలా ఉన్నాయి.

1. పంటల దిగుబడులు, ఉత్పత్తి అంకెల పెరుగుదలకన్నా రైతుల శ్రేయస్సు పట్ల ప్రభుత్వం ఎక్కువగా దృష్టిని సారించాలి. రైతుల నికర ఆదాయం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు సమానంగా ఉండాలి.
2. సారవంతమైన భూములను ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు కానీ, పరిశ్రమలకు కానీ ఇవ్వరాదు.
3. గ్రామాలలో ఉండే చెరువులు, కుంటలలోని మత్స్య సంపదపైన భూమిలేని పేదలకు హక్కు ఉండేలా ఆక్వేరియన్ సంస్కరణలు తీసుకురావాలి.
4. రైతులు ప్రత్యేకంగా సన్నకారు, చిన్న రైతులు భూమిలేని వ్యవసాయ కార్మికులకు జీవన భద్రత కల్పించేలా జాతీయ సామాజిక భద్రతా పథకాన్ని రూపొందించాలి.
5. ఎగుమతులు, దిగుమతులలో దేశీయ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత వాణిజ్య సంస్థను ఏర్పరచాలి. వాణిజ్యం న్యాయమైన రీతిలో నిర్వహించబడేందుకు జీవన భద్రత బాక్సును ఏర్పరచాలి.
6. దేశంలో పంట సగటు ఉత్పత్తి వ్యయమునకు 50 శాతం అదనంగా కలిపి కనీస

మద్దతు ధరలను నిర్ణయించాలి. ఖర్చులు పోనూ నికరంగా రైతులకు మిగిలే ఆదాయం ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయమునకు సుమారుగా సమానంగా ఉండాలి.

7. ప్రస్తుతం పంటల ఉత్పత్తి వ్యయాన్ని లెక్క కట్టడంలో ఉన్న లోపాన్ని సవరించాలంటే వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం యొక్క ఆదేశిక సూత్రాలు - స్థాయిని పునర్సమీక్షించి సరైన రీతిలో పునర్ నిర్వచించాలి.

8. జన్యుమార్పిడి పంటల విషయంలో లాభాలను, రిస్కులను సరైన పారదర్శకమైన రీతిలో అంచనా వేయుటకై సమర్థత కలిగిన సాంకేతిక నిపుణులతో జాతీయ బయోటెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పరచాలి.

9. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరియు ఆర్థిక సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో 'మార్కెట్ ధరల స్థిరీకరణ నిధిని' ఏర్పరిచి రైతులను ఆదుకోవాలి.

10. కరువు / తుఫానులు వంటి ప్రకృతి వైపరిత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకొనడానికి 'వ్యవసాయ రిస్కు ఫండ్'ను ఏర్పాటు చేయాలి.

11. చైనాలో పట్టణ , గ్రామీణ ఎంటర్‌ప్రైజెస్ (TVEs) తరహాలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వృత్తి నైపుణ్యమును పెంపొందించి గ్రామీణ వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయాలి.

12. రాష్ట్ర స్థాయిలో రైతు కమీషన్‌లను ఏర్పాటు చేయాలి.

13. వ్యవసాయమును రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలోకి చేర్చాలి.

ఇప్పటికే బీహార్, కర్ణాటక రాష్ట్రాలలో రైతు కమీషన్‌లు ఏర్పాటు అయినా మన రాష్ట్రంలో మాత్రం ఏర్పాటు కాలేదు. గత యేడెనిమిది సంవత్సరాలలో ఏటా దాదాపు 4.5 లక్షల కోట్ల రూపాయలు పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు వ్యాపార వేత్తలకు, ఎక్సైజ్, కస్టమ్స్, ఇన్‌కంటాక్స్ రాయితీలు ఇస్తూ ఉన్నా భారత వ్యవసాయ రంగానికి మాత్రం వ్యవసాయ జి.డి.పి.లో 2.4 శాతం కన్నా తక్కువే కేటాయిస్తూ ఉండటం వలననే కోట్లాది రైతులు, కౌలుదారుల పరిస్థితులు నానాటికి దిగజారుతూ ఉన్నాయి. రానున్న కాలంలో అన్ని రాజకీయ పక్షాలు డా॥ యం.యస్ స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేస్తామని తమ తమ ఎన్నికల ప్రణాళికలలో పేర్కొనడమే కాక చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే మన దేశంలో యువకులు వ్యవసాయం చేపట్టడానికి ముందుకు వస్తారు. వాస్తవానికి రైతులకు, కౌలుదారులకు అవసరమైన అన్ని వనరులను

సరిపడగా సకాలంలో అందజేస్తే ప్రపంచంలో వ్యవసాయ రంగంలో అగ్రస్థానంలో నిలవడానికి ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా రైతులు కష్టపడి కృషిచేస్తారు. అటువంటి శుభ సమయం కోసం ఎదురుచుద్దాం.

***<u>స్ఫూర్తినిచ్చిన లచ్చన్న</u>***



బెంగుళూరులో విద్యాభ్యాసం ముగించుకుని ఉయ్యూరులో నివాసముంటూ స్వతంత్రపార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూవుండేవాణ్ని. సర్దార్ గౌతు లచ్చన్న గారితో, సుంకర సత్యనారాయణ గారితో సన్నిహితంగా మెలిగే అవకాశం లభించింది. రైతుల సమస్యలపైన, గీత కార్మికుల సమస్యలపైన, వెనుకబడినవర్గాల అభివృద్ధికోసం లచ్చన్నగారు ఎడతెగని పోరాటం చేస్తూవచ్చారు. ఆయన శాసనసభలో మాట్లాడుతూ వుంటే పాలకపక్షం శ్రద్ధగా వింటూవుండేవారు. సి.యం. గానీ, మంత్రులుగానీ ఆయనంటే కొంత భయపడుతూవుండేవారు. ఆయన వెంట ఎప్పుడూ టైప్ మిషన్‌తో స్టెనోగ్రాఫర్ ఉండేవారు. ఎక్కడ ఎవరు రిప్రజెంటేషన్ ఇచ్చినా దానికి తన లెటర్‌హెడ్‌పైన కవరింగ్ లెటర్ తయారుచేసి అధికారులకు పంపుతూవుండే వారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేనుకూడా ఎం.పి.గా ఉండగా అలాగే చేస్తూవుండేవాణ్ని. సుంకర సత్యనారాయణగారు నాకు బంధువుకూడా అవుతారు. మంచి వ్యవసాయకుడు. కుప్పనూర్పిళ్ల సమయంలో పొనుకుమాడు గ్రామంలోనే ఉన్నా కుప్పలదగ్గరే ఉంటూండేవారు.

స్వతంత్రపార్టీలో ఎన్.వీరాచారి, పసుపులేటి కోటేశ్వరరావు, ఎన్. విజయరాజ్‌కుమార్ మున్నగువారు మంచి వక్తలు. విజయవాడలో నవరంగ్ టాకీస్ రోడ్డులో కార్యాలయం ఉంటుండేది. ప్రొద్దుటూరు వాస్తవ్యుడు బి. వెంకటేశ్వరరెడ్డిగారు జిల్లా కార్యదర్శిగా ఉండేవారు.

ఉయ్యూరు శాసనసభ్యుడిగా ఉండగా అయిదేళ్ళలో నలుగురు ముఖ్యమంత్రులు అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు సమర్థుడైన ముఖ్యమంత్రి. 1980లో మధ్యంతర ఎన్నికలు రావడం, హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ అధ్యక్షురాలికి 'కప్పం' పంపించడానికి వసూళ్లు విస్తృతంగా కొనసాగిన సందర్భంగా చెన్నారెడ్డిగారికి 'చందారెడ్డి' అనే పేరొచ్చింది.

టంగుటూరి అంజయ్యగారు నిరాడంబరంగా ఉంటూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేవారు. తనకు చేతనైనంతవరకు సామాన్యులకు సేవచేయాలనే

దృక్పథం కలిగివుండేవారు. ధైర్యంచేసి నాదెండ్ల భాస్కరరావును మంత్రి వర్గంనుంచి తొలగించారు. కాంగ్రెస్‌పట్ల ప్రజల్లో పెద్దయెత్తున వ్యతిరేకత ఉందని తెలిసికూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు.

కోట్ల విజయభాస్కరరెడ్డిగారు తన ప్రాంతానికి సంబంధించి మాత్రం ఫ్యాక్షన్ పోలిటిక్స్ నడుపుతూ ఉండేవారుగానీ, మిగతా వ్యవహారాల్లో పెద్దమనిషిగా పేరుగాంచిన వ్యక్తి. ఆయనకు అవినీతిపరుడనే ముద్రపడలేదు.

ఇందిరాగాంధీ మరణానంతరం ఎనిమిదవ లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అత్యధికమైన స్థానాలు లభించాయి. అంతకుముందు మనరాష్ట్రంలో గవర్నర్ రాంలాల్ వక్రమార్గంలో నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా చేయడం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం, రామారావుగారిని ముఖ్యమంత్రిగా తిరిగి నియమించడం, పర్యవసానంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక స్థానాలు తెలుగుదేశం, మిత్రపక్షాలు గెలుచుకున్నాయి. ఆ ఎన్నికల సందర్భంగా విజయవాడ నుంచి నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం మీదుగా బస్సులు, లారీలు, చిన్నకార్లు, మోటారు సైకిళ్లు మున్నగు వాహనాలతో బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారు. మహిళలుకూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అటువంటి ర్యాలీని నా జీవితంలో మళ్లీ ఏనాడూ చూడలేదు. నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజలు బ్రహ్మాండమైన స్పందనను వ్యక్తంచేశారు. విజయం ఖాయమని ఆనాడే నిర్ధారణయ్యింది.

సువిశాల భారతదేశంలో ఒక ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని పొందింది. బి.జె.పి. కి కేవలం రెండు సీట్లు మాత్రమే లభించాయి. అందులో ఒకటి తెలుగుదేశం సహకారంతో వరంగల్ స్థానంనుంచి సి. జంగారెడ్డి గెలుచుకున్నారు.

1984లో శ్రీమతి ఇందిరాగాంధీ హత్యగావించబడడం, అంతకు ముందే ఆయన సోదరుడు సంజయ్‌గాంధీ మరణించడం వంటి కారణాలవల్ల రాజీవ్‌గాంధీ తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావలసివచ్చింది. రాజకీయాల్లోకి వచ్చిన మొదట్లో ఆయన చాలా ఉత్సాహంగా, అందంగా, ఆకర్షణీయంగా కనిపించేవారు. అయిదేళ్ళ తర్వాత అంటే 1990 ప్రాంతంలో రాజకీయ ఒత్తిళ్లు, పదవీబాధ్యతల కారణంగా ఆకర్షణ తగ్గిపోయింది. బోఫోర్స్ తుపాకుల కొనుగోలులో ఇటలీ వ్యాపారి ఖత్రోచీ ముడుపులు తీసుకోవడం సోనియాగాంధీకి కూడా తెలుసు. ఈ వ్యవహారంలో రాజీవ్‌గాంధీకి తెలిసినా

తెలియకపోయినా రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సివచ్చింది. వాస్తవానికి రాజీవ్ ప్రభుత్వానికి ముందువరకు రక్షణ కొనుగోళ్ళలో కమీషన్లు సాధారణంగా ఉంటూవుండేవి. రాజీవ్ ప్రభుత్వం కమీషన్లు ఉండడానికి వీల్లేదనే నిర్ణయం తీసుకుంది.

***<u>మతము - రాజకీయాలు</u>***

రాజీవ్ ప్రధానిగా ఉండగా షహభాను విడాకులకేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మతఛాందసవాదులు హర్షించలేదు. ప్రజాస్వామ్యవాదులు, మహిళాసంఘాలు తీర్పును హర్షించాయి. ఢిల్లీ జుమ్మామసీదు బుఖారీ సయ్యద్ అబ్దుల్ బుఖారీ ఢిల్లీలో పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేసి చాలా అపసవ్యంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ మాట్లాడాడు. దాంతో రాజీవ్‌గాంధీ భయపడి షహభాను కేసు తీర్పును వమ్ముచేసేవిధంగా సవరణలు తీసుకువచ్చారు.

విశ్వహిందూపరిషత్ వారు అయోధ్యలో రామజన్మభూమి ప్రదేశంలో కరసేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సమయంలో అరుణ్ నెహ్రూ హోమ్‌శాఖ సహాయమంత్రిగా ఉన్నారు. వి.హెచ్.పి., ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి.లు 'శిలాన్యాస' కార్యక్రమం ద్వారా హిందువుల మనోభావాలను ఆకర్షించి లబ్ధిపొందుతాయి కనుక, కాంగ్రెస్ పార్టీకూడా హిందువుల అభిమానాన్ని పొందాలంటే ఏదో ఒకటి చెయ్యాలని భావించి అప్పటివరకు రామాలయానికి దశాబ్దాలుగా వేసివున్న తాళాన్ని అరుణ్ నెహ్రూ తీయించారు. ఆవిధంగా రామజన్మభూమి–బాబ్రీమసీదు వివాదం తాజాగా తెరపైకి రావడానికి, హిందువులు, ముస్లింల మధ్య తీవ్రమైన వైషమ్యాలు పెరగడానికి బి.జె.పి., కాంగ్రెస్‌లు రాజకీయ లబ్ధికోసం తీసుకున్న నిర్ణయాలే కారణం.

***<u>రాజీవ్ గాంధి దుర్మరణం</u>***

శ్రీమతి ఇందిరాగాంధీ భారత ప్రధానిగా ఉన్న సమయంలో శ్రీలంక అధ్యక్షురాలిగా శ్రీమతి సిరిమావో బండారు నాయకే పనిచేశారు. ఇందిరాగాంధీ హయాంలో కొన్ని కారణాలవల్ల శ్రీలంకలోని ఎల్.టి.టి.ఈ.కి భారత ప్రభుత్వం పరోక్షంగా సహకారాన్నందించింది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా శ్రీలంకతో సౌహార్ద్ర సంబంధాలు నెరపడానికిగాను, ఇండో–శ్రీలంక ఒప్పందం జరిగింది. శ్రీలంక సైన్యానికి తోడుగా భారత ప్రభుత్వ సైన్యాన్ని పంపడం దూరదృష్టి లేకుండా, పరిణామాల్ని ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయం. దీన్ని ఇండియన్ పీస్‌కీపింగ్ ఫోర్స్ అంటారు. అయితే శ్రీలంకలో తమిళులపై భారత సైన్యాన్ని అడ్డుపెట్టుకుని శ్రీలంక సైన్యం సాగించిన దారుణమైన

దమనకాండ కారణంగా శ్రీపెరంబుదూరులో రాజీవ్‌గాంధీని తమిళ ఈలంవారు హత్యగావించారు.

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోగల స్వర్ణదేవాలయంలో తిష్టవేసిన భింద్రన్‌వాలేను, అతని అనుచరులను వెలుపలకు రప్పించడానికి శ్రీమతి ఇందిరాగాంధీ చేపట్టిన ఆపరేషన్ బ్లూస్టార్ కార్యక్రమంవల్ల సిక్కు హృదయాలు తీవ్రంగా గాయపడ్డాయి. పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య సింధు నదీజలాల పంపిణీపై వివాదం కొనసాగుతూ వుంది. రాజీవ్‌గాంధీ పంజాబ్ ప్రజలకు కొంతమేరకు స్వాంతన కలిగించడానికి సిక్కు నాయకుడు సంత్ లోంగోవాల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

స్థానిక సంస్థలకు రాజ్యాంగ చట్టబద్ధ అధికారాలను కల్పిస్తూ రాజ్యాంగ సవరణలను తీసుకురావడం వికేంద్రీకరణకు ఎంతో దోహదంచేస్తుంది.

అప్పటికి కొన్ని దశాబ్దాలుగా కొన్ని నియోజకవర్గాల్లో ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్లను పునః పరిశీలించాలని, రొటేషన్ పద్ధతిలో మార్చాలని కోట్ల విజయభాస్కరరెడ్డిగారు న్యాయశాఖమంత్రిగా ఉండగా రాజ్యాంగ సవరణను ప్రతిపాదించారు. ఎస్.సి., ఎస్.టి. ఎంపీలు మూకుమ్మడిగా రాజీవ్‌గాంధీని కలసి, ఈవిధంగా చేస్తే మేం చాలా నష్టపోతాం, వేరే నియోజక వర్గాల్లోని ప్రజలు మమ్మల్ని ఆదరించకపోవచ్చు. అందువల్ల మా రాజకీయ భవిష్యత్తు సందేహాస్పదమవుతుంది. ఆ సవరణను ఉపసంహరించు కోవలసిందిగా కోరినమీదట ఆయన వారి ఒత్తిడికి తలొగ్గి ఆ సవరణను ఉపసంహరింపజేయడం జరిగింది. కొన్ని మంచి ఆదర్శాలు, ఆశయాలు కలిగివున్నప్పటికీ, ఒత్తిళ్ళకు తట్టుకుని నిర్ణయాలు తీసుకోవడం, తన మనసులోవున్న ఆలోచనల్ని కార్యరూపంలోకి తీసుకువెళ్ళడానికి ఆయన సిద్ధంకాలేకపోవడం దురదృష్టకరం.

పదవ లోక్‌సభలో సభ్యుడిగా ఉండగా పి.వి. నరసింహారావుగారు ప్రధానమంత్రి అయ్యారు. నంద్యాలలో పెండేకంటి వెంకటసుబ్బయ్యగారి మృతితో వచ్చిన ఉప ఎన్నికలో దేశప్రధానిగా ఉన్న తెలుగుబిడ్డకు పోటీపెట్టడం సమంజసంగా ఉండదని తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశంపార్టీ అభ్యర్థిని నిలపలేదు. పి.వి.నరసింహరావు గారు మంచి పరిపాలనాదక్షుడు. ప్రసిద్ధ ఆర్థికవేత్త మన్‌మోహన్‌సింగ్‌ను ఆర్థికశాఖ మంత్రిగా నియమించుకున్నారు. విదేశీమారక నిల్వలు గణనీయంగా తగ్గిపోయి మనదేశంనుంచి బంగారాన్ని విమానాల్లో లండన్ తీసుకువెళ్ళి కుదువబెట్టి అంతర్జాతీయ ద్రవ్యసంస్థ (ఐ.ఎం.ఎఫ్.) నుంచి స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ పేరుతో రుణసేకరణ చేసుకోవలసి వచ్చింది. ఆర్థిక సంస్కరణలను అమలుచేసిన ఫలితంగా



*ప్రధాని పి.వి. నరసింహారావు గారితో మదర్ థెరిస్సా*

క్రమేపీ పారిశ్రామికరంగాలు శీఘ్రగతిన పురోగతిని సాధించాయి. విదేశీ పెట్టుబడులు పెరిగాయి.

పి.వి.నరసింహారావుగారు బహుభాషాకోవిదుడు. ఆయనకంటూ అవినీతి ముద్ర పడకపోయినా ఆయన కుమార్తెకు పంచదార దిగుమతుల కుంభకోణంలో కొంత సంబంధముందని ప్రముఖంగా వినిపించింది. పార్లమెంటులో మెజారిటీని పొందడానికి తెలుగుదేశంపార్టీ, మరికొన్ని ఇతర పార్టీల్లోనూ చీలికలు తెచ్చి మెజారిటీని సాధించి పార్టీ ఫిరాయింపుల ద్వారా అయిదేళ్లు సుస్థిరమైన పాలనను అందించారు.

***<u>బాబ్రీమసీదు - రామజన్మభూమి - రాజకీయ చదరంగం</u>***

పి.వి.గారి హయాంలో విశ్వహిందూపరిషత్, బి.జె.పి.లు అయోధ్య లోని రామమందిరం వద్దకు కరసేవ కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు బాబ్రీ మసీదును కూలగొట్టే ప్రమాదముందని పసిగట్టలేకపోవడం దురదృష్టకరం. పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతుండగా రెండు, మూడు రోజులముందు నేను, సి.పి.ఐ.నాయకుడు ఇంద్రజిత్ గుప్తా, సి.పి.ఎం. నాయకుడు సోమనాథ్ ఛటర్జీ, శరద్ యాదవ్ మున్నగు వివిధ ప్రతిపక్షపార్టీల నాయకులం ప్రధాని పి.వి.నరసింహారావుగారిని కలసి డిసెంబరు 6వ తేదీన బి.జె.పి. తలపెట్టిన కరసేవ కార్యక్రమంవల్ల బాబ్రీ మసీదు విధ్వంసానికి గురైతే



దేశవ్యాప్తంగా తీవ్రమైన పరిణామాలు సంభవించే అవకాశాలుంటాయి గనుక మీరు అనుమతించడం సరికాదేమో అని చెప్పాం. దానికి ఆయన అటువంటిదేమీ జరగదు, బి.జె.పి., వి.హెచ్.పి., ఆర్.ఎస్.ఎస్. కరసేవకులు పూజలు నిర్వహించుకుని వెళ్ళిపోతారు. మీరేమీ ఆందోళన చెందనవసరంలేదు. ఒకవేళ వారు తమ హామీని ఉల్లంఘించి దుందుడుకు చర్యలకు పాల్పడితే కేంద్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. అందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధంచేసి ఉంచామని పేర్కొన్నారు. డిసెంబరు 6వ తేదీన బి.జె.పి. అగ్రనాయకులు ఎల్.కె. అద్వానీగారి సమక్షంలోనే వి.హెచ్.పి. భజరంగ్‌దళ్, బి.జె.పి. మున్నగు సంస్థలకు చెందినవారు ప్రపంచమంతా వీక్షిస్తూవుండగానే వివాదాస్పద బాబ్రీ మసీదు కట్టడాన్ని కూలగొట్టారు. భారతరాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఆవేదనతో ప్రధానికి ఫోన్‌చేసి, ఇంత విధ్వంసం జరుగుతుంటే చూస్తూ ఎలా ఊరుకున్నారని అడిగిన వెంటనే అప్పుడు చర్యలు తీసుకుని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిస్మిస్‌చేశారు.

అంతకు కొద్దిరోజులముందు రామజన్మభూమి - బాబ్రీమసీదు అంశంపైన లోక్‌సభలో చర్చ జరిగినప్పుడు ఎం.ఐ.ఎం. పార్టీ నాయకుడు, పార్లమెంటు సభ్యుడు సలావుద్దీన్ ఒవైసీ పార్లమెంటులో మాట్లాడుతూ వివాదాస్పదమైన ఈ అంశానికి సరైనరీతిలో పరిష్కారం కనుగొనాలని, ఈ అంశాన్ని సుప్రీంకోర్టుకు నివేదించినా లేక ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారిచే తవ్వకాలు జరిపి ఒకవేళ బాబ్రీ మసీదు పునాదులకింద రామాలయంగానీ, లేక ఏదైనా హిందూ దేవాలయంగానీ ఉండివున్నట్లయితే

బాబ్రీమసీదుపైన తమ హక్కును కోరబోమని స్పష్టంగా ప్రకటించివున్నారు. భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఇరుపక్షాలు తమ వాదనను వినిపించి పరిష్కారం దిశగా ప్రయత్నం చేసివుంటే బాగుండేది. కానీ అలా జరగకపోవడంవల్ల పలుచోట్ల మతఘర్షణలు, ఒక వర్గంవారి మనోభావాలు గాయపడడం జరిగాయి.

దేశప్రధానిగా అయిదు సంవత్సరాలు పరిపాలించి, ఆర్థిక సంస్కరణలు అమలుచేసి దేశాభివృద్ధిలో కీలకభూమిని పోషించిన పి.వి.నరసింహారావుగారికి ఆయన చనిపోయిన దరిమిలా ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకపోగా, ఆయన పార్థివదేహాన్ని ఎ.ఐ.సి.సి. కార్యాలయం వద్ద సందర్శకుల కడచూపులకోసం ఉంచడానికి అనుమతి నిరాకరించడం అత్యంత దురదృష్టకరం. సోనియాగాంధీకి పి.వి. గారిపట్ల వ్యతిరేకత, ఆగ్రహాలు ఎంతస్థాయిలో ఉన్నాయనడానికి ఇది ప్రబల తార్కాణం.

నేను పదవ లోక్‌సభలో ఉండగా కర్నూలులో కోట్ల విజయభాస్కరరెడ్డిగారి మృతివల్ల ఉప ఎన్నిక వచ్చింది. కాంగ్రెస్ పార్టీ తరఫున కోట్ల విజయభాస్కరరెడ్డిగారు, తెలుగుదేశంపార్టీ తరఫున ఎస్.వి.సుబ్బారెడ్డిగారు నిలిచారు. ఎస్.వి. సుబ్బారెడ్డిగారి ఇంట్లోనే మేడమీద గదిలో నేను, చంద్రబాబునాయుడుగారు ఉంటూ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించాం. ఎన్నికల్లో సూర్యప్రకాశరెడ్డిగారే గెలిచారు. ఆ ఎన్నికల సందర్భంగానే కర్నూలులోని ప్రభుత్వ అతిథిగృహంలో అన్నగారితోపాటు లక్ష్మీపార్వతిగారిని నేను మొట్టమొదటిసారి చూడడం సంభవించింది.

***తెలుగుజాతి రత్నం ఎన్టీఆర్***

ఎన్.టి. రామారావుగారు ఒక గంట, గంటన్నరో కార్యదర్శులతో డిస్కస్ చేసి ఫైళు క్లియర్ చేస్తూవుండేవారు. రాష్ట్రంలో సుదూర ప్రాంతాలనుంచి, నలువైపులనుంచి హైదరాబాద్‌కు వచ్చే నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఎక్కువ సమయం గడుపుతూవుండేవారు. ఆవిధంగా అన్నగారితో సంభాషించి వెనక్కువెళ్లే నాయకులు, కార్యకర్తలు ఎంతో సంతృప్తిచెందేవారు.

ఎన్.టి.రామారావుగారు పార్టీకి, తనకు విశ్వాసపాత్రులు అనుకున్న వ్యక్తులకు టిక్కెట్లు ఇస్తూవుండేవారు. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలన్నా, వ్యాపారవేత్తలన్నా పెద్దగా లెక్కచేసేవారుకాదు. ప్రొఫెసర్ లక్ష్మన్న, నాయక్, రుమాండ్ల రామచంద్రయ్యలాంటి సామాన్యులకు రాజ్యసభలో ప్రవేశం కల్పించారు.

జాతిపిత మహాత్మాగాంధీ కోరుకున్న ప్రతివ్యక్తికి కూడూ, గూడు, గుడ్డ కల్పించి



తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని పరిరక్షించాలనే ఆశయంతో తెలుగుదేశంపార్టీని ఎన్టీ రామారావుగారు స్థాపించారు. దేశంలోనే మొట్టమొదటిసారి పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం, తాటాకులపాకలు కాకుండా పక్కా ఇళ్లు, సగం ధరకే జనతా వస్త్రాలు అందించడం మున్నగు కార్యక్రమాలను ప్రారంభించారు. చేనేత కార్మికులకు కూడ మేలు చేకూరింది. పరిపాలనా సౌలభ్యము, సామాన్యుడికి అందుబాటులో వుండేందుకు మండల వ్యవస్థను ఏర్పరిచారు. మహిళలకు తండ్రి ఆస్థిలో మగబిడ్డలతోపాటు సమాన హక్కును కల్పిస్తూ చట్టాన్ని తెచ్చారు. దరమిలా కేంద్రప్రభుత్వమే ఇందుకనుగుణంగా చట్టాన్ని తెచ్చింది. దేశంలో మొట్టమొదటిసారి ఆదర్శ సహకార చట్టమును పాస్ చేసిన ఘనత ఎన్టీఆర్ ప్రభుత్వానిదే. సామాజికంగా విద్యవిషయకంగా వెనుకబడిన వర్గాలకు కూడా రిజర్వేషన్ సౌకర్యమును కల్పించాలని భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోరుకున్నా జరుగలేదు. పంచాయతీరాజ్ సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 30% రిజర్వేషన్‌ను కల్పించి పరిపాలనలో వారిని భాగస్వామ్యులను చేశారు. తెలంగాణ ప్రాంతంలో పటేల్ –పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా బలహీనవర్గాల సన్నకారు చిన్న రైతులకు, కౌలు రైతులకు రెండవసారి స్వాతంత్ర్యం లభించినంత ఆనందము చేకూర్చిన మహానుభావుడు.

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో లలిత కళా తోరణం, విజయవాడ, గుంటూరు మున్నగు పలు ముఖ్య పట్టణాలలో ఆర్టీసీ బస్టేషన్‌లను నిర్మింపజేశారు. క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమకు తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా సాగునీరు, త్రాగునీరు

అందించేందుకు చేసిన కృషి మరువలేనిది. కృష్ణ డెల్టా స్థిరీకరణకై పులిచింతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

సమర్థులైన, నిజాయితీపరులైన అధికారులను రామారావుగారు అభిమానిస్తూ వుండేవారు. ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్ పార్టీని తెలుగుదేశంలో విలీనం చేసిన తరువాత రామకృష్ణస్టూడియోలో రామారావుగారు పార్టీ ముఖ్యులను ఉద్దేశించుతూ చేసిన ప్రసంగంలో కృష్ణాజిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను, తుఫాను సహాయక చర్యలను అమలు చేసిన ఏవిఎస్‌రెడ్డి, మహారాష్ట్రలో సహకార చక్కెర ఫ్యాక్టరీల ప్రగతికి కృషి చేసిన బొబ్బా పద్మనాభయ్య, రాయలసీమలో నీటి వనరులపై అధ్యయనం చేసిన ప్రఖ్యాత ఇంజినీర్ కె.శ్రీరామకృష్ణయ్య గార్లను ప్రస్తావించుతూ అటువంటివారి సేవలను మన రాష్ట్రంనకు కూడా అందజేయాలనే భావన వ్యక్తం చేశారు.

ఒక పర్యాయం నేను ఢిల్లీలో పదవ లోకసభలో సభ్యునిగా ఉండగా రామారావుగారు ఢిల్లీ వచ్చారు. అన్నగారు మా ఇంటివద్ద లంచ్ చేసి వెళ్ళదురుగాని అని కోరగా సరే బ్రదర్ అన్నారు. సౌత్ ఎవెన్యూలో మా క్వార్టర్‌లో భోజనం చేస్తూ ఉండగా నేను నా అర్ధాంగిని ఉద్దేశించి నా అలవాటు ప్రకారం పాపాయి అని సంభోధిస్తూ ఉంటే ఆయన శోభనాద్రీశ్వరరావుగారు మీది పాత బంధుత్వమా అంత ఆప్యాయతగా పిలుస్తున్నారు అని అన్నారు. ఇప్పటికీ నేను నా భార్య ఆ సంఘటనను గుర్తుకు తెచ్చుకొంటూ ఉంటాము.

## దార్శనికుడు చంద్రబాబు

ఎన్.టి రామారావుగారు స్థాపించిన తెలుగుదేశంపార్టీలో చీలిక తర్వాత తెలుగుదేశంపార్టీ చెల్లాచెదురైపోకుండా నిలబెట్టిన ఘనత చంద్రబాబుదే. ఒకవైపు పార్టీ అధ్యక్షుడిగా, మరొకవైపు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చాలా కష్టపడ్డారు. పార్టీ కార్యాలయంలో రోజంతా ఎక్కువ సమయం గడిపే చంద్రబాబునాయుడు సుదూర ప్రాంతాలనుంచి తమ సమస్యల గురించి విన్నవించడానికి వచ్చే ప్రజానీకం విషయంలో తగినంత సమయాన్ని కేటాయించి వారి సాధకబాధకాలు తెలుసుకోక పోవడంవల్ల వారిలో తగిన సంతృప్తి కలుగలేదు. ఎన్.టి.ఆర్. భవన్‌లో ఆయన గదిలో సాధారణంగా ఎప్పుడూవుండే పది



పదిహేనుమంది నాయకులే ఎక్కువ సమయం ఉంటూవుంటారు. సుజనాచౌదరి, సి.ఎం. రమేష్, గరికిపాటి మోహనరావు మున్నగు పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు చంద్రబాబుగారు రాజ్యసభలో అవకాశం కల్పించారు.

చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి గురించి ముందుచూపు వున్న దార్శనికుడు. కేంద్రప్రభుత్వం విజన్-2020 రూపొందించకముందే మన రాష్ట్రంలో విజన్-2020 డాక్యుమెంటు తయారు చేయించారు. అలాగే కేంద్రప్రభుత్వం జాతీయ వ్యవసాయ విధానాన్ని ప్రకటించకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని ప్రకటించింది. మన రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలను అమలు చేసిన ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగింది. విద్యుత్ రంగంలో సంస్కరణలను అమలుచేసి ఉత్పత్తి, రవాణా, కోణాలలో సామర్ధ్యతను పెంచగలిగారు. ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ వంటి వాటన్నిటికి రాజధానిలో గాంధీ హాస్పిటల్‌తో సహా చక్కని భవనములను నిర్మింపజేశారు. రహదారుల వ్యవస్థను బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు. వేలాది స్కూలు భవనములను నిర్మింపచేశారు. చంద్రబాబునాయుడుగారు ప్రజలవద్దకు పాలన, జన్మభూమివంటి కార్యక్రమాలతో పరిపాలనలో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకుతీసుకువెళ్ళారు. నీరు-మీరు వంటి కార్యక్రమాలలో రైతుల్ని భాగస్వాముల్ని చేసి, సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి వందలాది చెరువుల్లోని, డ్రైన్లలోని పూడికను తొలగింపచేశారు. జన్మభూమి స్ఫూర్తితో ప్రజల సహకారంతో సిమెంట్‌రోడ్లను, గ్రామీణ రహదారుల్ని ఏర్పాటుచేసుకున్నారు. పంటకాలువలకు మరమ్మతులు చేసుకున్నారు.

## ఏపీలో ఐటీ - ఐటీఈఎస్‌ల ప్రగతి కారకుడు చంద్రబాబు

నేను ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న సమయంలో వాజ్‌పాయ్‌గారు ప్రధానమంత్రిగా ఉన్నారు. ప్రపంచ ప్రగతిలో, దేశాభివృద్ధిలో రాబోయేకాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చాలా ప్రముఖమైన పాత్రను నిర్వహించబోతున్నదని, గతంలో యూరప్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభమై అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారతదేశం తగినంతగా అందిపుచ్చుకోక, వెనుకబడడం జరిగిందని, ఇప్పుడు ఈ విషయంలోనైనా మనం ముందుకు అడుగువేయాలని చంద్రబాబు వివరించారు. వాజ్‌పాయ్‌గారు సావధానంగా విని, ఈ అంశాన్ని అధ్యయనం చేసి రిపోర్టు ఇవ్వడంకోసం కేంద్రమంత్రి జస్వంత్‌సింగ్‌గారిని కన్వీనర్‌గాను, నారా చంద్రబాబుగారిని కోకన్వీనర్‌గాను టాస్క్‌ఫోర్స్ కమిటీని



*మాదాపూర్‌లో హైటెక్ సిటీ భవనం*

ఏర్పాటుచేశారు. ఆ కమిటీ పలువురు నిపుణులు, శాస్త్రవేత్తలు, ఆర్థికరంగంలోని ప్రముఖులతో చర్చించి ఒక చక్కని రిపోర్టును కేంద్రానికి సమర్పించింది. కేంద్రం ఆ సిఫార్సులను ఆమోదించగా, మనరాష్ట్రంలో ముఖ్యమంత్రిగావున్న చంద్రబాబునాయుడుగారు గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్, టి.సి.ఎస్., ఇన్ఫోసిస్, డెల్, సత్యం మున్నగు ఎన్నో ఎన్నెన్నో సంస్థలకు స్పష్టమైన మార్గదర్శక సూత్రాలతో, ఉద్యోగ నియామక నిబంధనలతో భూములు అందజేసిన పర్యవసానంగా హైటెక్ సిటీ, సైబరాబాద్ బ్రహ్మాండంగా అభివృద్ధిచెందాయి. ఐటి దిగ్గజం మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ హైద్రాబాదుకు రప్పించడంతో మన రాష్ట్రంలో ఐటీ రంగానికి మంచి వూపు వచ్చింది. లక్షలాదిమంది యువతీయువకులు ఈనాడు మనదేశంలోపల, విదేశాల్లో ఐ.టి., ఐ.టి.ఇ.ఎస్., రంగాల్లో పనిచేస్తున్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే ఈనాడు ఐ.టి., ఐ.టి.ఇ.ఎస్., రంగాల్లో 55 వేల కోట్ల రూపాయలమేరకు కార్యకలాపాలు జరుగుతూవుండడం గర్వకారణం. ఖచ్చితంగా ఈ ప్రగతికి కారణం ప్రధానంగా చంద్రబాబునాయుడు అనే వాస్తవాన్ని విస్మరించలేం.

## 2004లో తెలుగుదేశం ఎందుకు ఓడిపోయింది?


అయినా 2004 ఎన్నికల్లో తెలుగుదేశం పరాజయంపాలయ్యింది. దాదాపు తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉండడంవల్ల సహజంగా ప్రజల్లో ఏర్పడే వ్యతిరేకభావానికితోడు ప్రతిపక్ష పార్టీలు మొత్తం ఏకంకావడం, తొమ్మిది సంవత్సరాల్లో ఏడేళ్లు వర్షాభావ పరిస్థితులవల్ల పంటలు కోల్పోయి రైతులు ఆగ్రహంతో ఉండడం, రామారావుగారు పెట్టిన 50 రూపాయల హార్స్‌పవర్ విద్యుత్ ఛార్జీలను పెంచడం, అన్నగారు పెట్టిన రెండురూపాయల కిలోబియ్యం ధరను 4.25 రూపాయలకు పెంచడంవంటి కారణాలు దోహదపడ్డాయి. ఇవిగాక, ఆయన వారానికి కనీసం 3,4 రోజులు వీడియో కాన్ఫరెన్సులు, టెలీ కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ పరిపాలనలో పారదర్శకతను తీసుకువచ్చి సమర్థవంతమైన పాలనను అందించాలనే ధ్యేయంతో రివ్యూ మీటింగులను నిర్వహిస్తూండేవారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోనే ఉన్నతాధికారులు పాల్గొంటున్నా, కిందిస్థాయి అధికారులు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లోనూ, మండల కార్యాలయాల్లోనూ పొద్దుపోయేవరకు ఉండవలసిన పరిస్థితులు ఉద్యోగుల్లో అసంతృప్తినీ, అసహనాన్ని పెంచాయి. కిందిస్థాయి ఉద్యోగులపైన ఎ.సి.బి. దాడులు వారి ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఎన్నికల్లో చాలా పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సిబ్బంది వృద్ధులు, కంటిచూపు తక్కువ ఉన్నవారితో కాంగ్రెస్‌కు ఓటువేయించడం, కాంగ్రెస్‌పార్టీకి సహకరించడం జరిగింది.

చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగమారి వ్యవహారం అని అన్నారని అదేపనిగా వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి నుంచి దిగువస్థాయి నాయకులవరకు అందరూ ప్రచారం చేశారు. కానీ అందులో వాస్తవం లేదు. కేవలం వ్యవసాయం మీదే ఆధారపడకుండా వ్యవసాయాధార ఇతర వ్యాపకాల పట్లకూడా రైతులు తమ దృష్టి కేంద్రీకరిస్తేనే మెరుగైన జీవనం సాధ్యపడుతుందనేది ఆయన అభిప్రాయం.

## రాజశేఖరరెడ్డిగారు ఒరగబెట్టింది ఏమీలేదు?

రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తర్వాత హరితాంధ్రప్రదేశ్ ఏర్పాటే తమ ధ్యేయమని, ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని రానివ్వమని పదేపదే చెబుతూవచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోకంటే రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వ హయాంలో రైతులకు పెద్దగా ఒరిగిందేమీలేదు. పైగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. కేంద్రప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులవల్లనే కనీస మద్దతుధర పెరిగినా, పంటల బీమాలో మార్పువచ్చినా, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ఇన్‌పుట్ సబ్సిడీ కొంత

పెరిగినా, పేదలకు వృద్ధాప్య పెన్షన్ పెరిగినా ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ విధాన పర్యవసానమే. వ్యవసాయరంగానికి సాగునీటి అవసరం ఎంతోవుంది. పంటల దిగుబడులు పెరగడానికి, వర్షాభావ పరిస్థితుల్లో నష్టాలను తగ్గించడానికి ఇరిగేషన్ సౌకర్యం ఉపయోగపడుతుంది. కానీ ఒక్కసారే సరైన ప్రణాళిక, పర్యావరణ అనుమతులు, పొరుగురాష్ట్రాల అంగీకారం, ప్లానింగ్ కమిషన్ ఆమోదం వంటి వాటిని పట్టించుకోకుండా అనేక ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది. ఈ మొబిలైజేషన్ అడ్వాన్స్‌లలో కొంతభాగం తిరిగి వై.ఎస్. కుటుంబానికి, సంబంధితశాఖ మంత్రులకు, అధికారులకు ముడుపులరూపంలో చేరిందనేది జనాభిప్రాయం. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులను తయారు చేయకుండానే, కాంట్రాక్టర్‌కే ఈ.పీ.సీ. పద్దతిలో పనులు అప్పగించిన ఫలితంగా చాలా పెద్దయెత్తున ప్రాజెక్టులను చేపట్టినా, పనుల నాణ్యతను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి అవసరమైన సిబ్బందిని నియమించక పోవడంవల్ల, పనుల్లో నాణ్యత లోపించడం, విపరీతమైన కాలయాపన జరగడం, అంచనాలు చాలా ఎక్కువ స్థాయికి పెరగడం మున్నగు కారణాలవల్ల జలయజ్ఞాన్ని 'ధనయజ్ఞం'గా ప్రజలు అభిప్రాయపడే పరిస్థితి వచ్చింది. దురాశా పరులైన కాంట్రాక్టర్లు, అధికారులు అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోచేస్తున్నా తెలుగుదేశంగానీ, ఇతర రాజకీయపక్షాలుగానీ ఈ దోపిడీని ఆపేందుకు సరైన చర్యల్ని తీసుకోలేకపోయాయి. పత్రికల్లో విమర్శలేతప్ప నిర్దుష్టంగా ఆధారాలతో, అంచనాలతో ఈ దోపిడీని అరికట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించలేదనేది వాస్తవం. వై.ఎస్. హయంలో అవినీతి అడ్డగోలుగా పెరిగి వ్యవస్థ భ్రష్టు పట్టింది.



***<u>చంద్రబాబుతో పెరిగిన దూరం</u>***

1999 ఎన్నికల దరిమిలా తొలిగా తొమ్మిదిమంది సభ్యులతో ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖమంత్రిగా బాధ్యతలు చేపట్టాను. ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగావున్న సమయంలో చండీఘర్‌లో అప్నేమండీ వ్యవస్థగురించి చంద్రబాబుగారితో చెప్పగా, రైతుబజార్ల ఏర్పాటు చేయడంతో తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రజల్లో, రైతులలో ఆదరణ పెరిగింది. ముందునుంచి నేను వ్యవసాయక సంబంధ విషయాలపైన చురుకుగా పార్లమెంటులోపల, వెలుపల పాల్గొంటూవుండడంవల్ల నాకు

ఆ శాఖల్ని కేటాయించారు. కొన్ని సందర్భాల్లో నేను తీసుకున్న నిర్ణయాలు చంద్రబాబుగారికి నచ్చివుండకపోవచ్చు. సాధారణంగా ముఖ్యమంత్రిగారి ఆలోచనకు అనుగుణంగానే మంత్రి ఫైల్‌మీద నోట్ చేస్తూవుంటారు. రైతుల శ్రేయస్సుకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడితే అందుకు భిన్నంగా నేను వ్యవహరించలేను. కొద్దిరోజులకు ఉద్యానవనశాఖను నానుంచి తీసి నారాయణస్వామి నాయుడుగారికి ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకున్నారు.

చిత్తూరు జిల్లాలో కుప్పం ప్రాజెక్టుకు సాంకేతిక సలహా ఇస్తూవచ్చిన బిల్లీరావు సంస్థకు తిరిగి గడువు పొడిగింపు వ్యవహారం నావద్దకు వచ్చినప్పుడు బిల్లీరావు సంస్థ చేస్తున్న విస్తరణ కార్యక్రమం పెద్దగా చెప్పుకోదగ్గదిగా లేదని, వారు చేస్తూవున్న పనికి మొదటి పర్యాయం ఇచ్చినంత రెమ్యూనరేషన్ మళ్లీ ఇవ్వవలసిన అవసరం లేదని, అయితే దానిపైన ముఖ్యమంత్రిగారే నిర్ణయం తీసుకోవచ్చునని ఫైల్‌మీద రాసిపంపడం జరిగింది.

డిబిటి సహకారంతో అభివృద్ధి చేయబడిన పామాయిల్ తోటలను పామ్‌టెక్ సంస్థకు అప్పగించటానికి అంగీకరించకపోవడం, విజయవాడలో కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలాన్ని గంగరాజుగారికి ఇవ్వడానికి వ్యతిరేకతను వ్యక్తం చేయడం, జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్న కడియాల రాఘవరావు స్థానంలో ఆయన నియమించదలచుకున్న వ్యక్తి నియామకానికి అభ్యంతరం వ్యక్తం చేయటం మున్నగు కారణాలవలన దూరం పెరిగి ఉండవచ్చు.

రసాయనిక ఎరువుల వాడకం పెరిగి చీడపీడల ఉధృతి నానాటికీ తీవ్రమవుతున్న తరుణంలో వ్యవసాయశాఖలో విస్తరణ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నవాటిని భర్తీచేసి అవసరానికి అనుగుణంగా పోస్టులను పెంచాల్సిన ఆవశ్యకత గురించి నేను, వ్యవసాయ కమీషనర్ అజయ్ కల్లాం పలుపర్యాయాలు చెప్పినా ఆయన ఆమోదించలేదు. పొరుగు రాష్ట్రాలలో వ్యవసాయసిబ్బంది వివరాలు అందించినా ఆయన స్పందించలేదు.

## ***క్రియాశీలక రాజకీయాలనుండి నిష్క్రమణ***

2004 ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం నుంచి బయటకు వెళ్ళిపోయిన మాజీ శాసనసభ్యుడి అనుచరులు పార్టీ కార్యాలయం వద్ద నాకు టిక్కెట్ ఇవ్వరాదంటూ గడబిడ సృష్టించారు. పార్టీ కార్యాలయంలో బాధ్యత కలిగిన వ్యక్తులు, ఉన్నతస్థాయిలో ఉన్న కొందరు తెలుగుదేశం నాయకుల ఎరుకతోనే ఈ గడబిడ జరిగింది. పార్టీలో లేనివారు పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించి ఇటువంటి నిరసన కార్యక్రమాన్ని ఎలా చేపడుతున్నారని నా అనుచరులు ప్రతిస్పందిచడం జరిగింది. నియోజకవర్గం నుండి ఎన్టీఆర్ భవన్‌కు వచ్చు నివేదికలను తారుమారు చేయడం, మైలవరం నియోజకవర్గంలో టీడీపీ

బలహీనముగా ఉన్నదని తప్పుడు రిపోర్టులను ఆయనకు ఇవ్వడం, ఆయన నమ్మడం వంటి కారణాల వలన మైలవరం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా అయిదవ లిస్టులో నాపేరును ప్రకటించారు.

ఎన్నికల్లో ఓటమి దరిమిలా పదిరోజుల తర్వాత పార్టీ కార్యాలయంలో చంద్రబాబునాయుడుగారిని కలిశాను. నేను మొట్టమొదట 1972లో కాకాని వెంకటరత్నంగారి పైన పోటీచేసినప్పుడు ఓడిపోతానని తెలిసే పోటీచేశాను. 1977 పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో కూడా బందరు పార్లమెంటు నియోజకవర్గంనుంచి ఓడిపోతానని తెలిసే పోటీ చేశాను. ఇంతకుముందు ఓడిపోయినప్పుడు ఎప్పుడూ బాధపడలేదు. ఈసారి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్ని దాదాపు 150 కోట్ల రూపాయలపైన ఖర్చుతో గ్రామగ్రామాన ప్రజోపయోగకరమైన అభివృద్ధి కార్యక్రమాల్ని చేయించినా ఓటమి పాలుకావడం నన్ను మనస్థాపానికి గురిచేసిందని చెప్పాను. ఎంతో నిబద్ధతతో, నీతి నిజాయితీలతో బాధ్యతల్ని నిర్వర్తించినా అయిదవ జాబితాలో నాపేరు ప్రకటించడంవల్ల మరింత ఎక్కువ మనస్థాపానికి గురయ్యానని, మీకు కొందరినుంచి తప్పుడు సమాచారం చేరడంవల్ల ఆవిధంగా చేశారని నా ఆవేదనను వ్యక్తంచేశాను. అయితే నాకు ప్రియమైన వ్యవసాయ శాఖకు మంత్రిగా లక్షలాదిమంది రైతులకు కొంతకాలం సేవచేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు, సెలవు తీసుకుంటున్నాను అని చెప్పి ఆయనతో కరచాలనం చేసి బయటకు వచ్చేశాను.

## ***క్రియాశీలక రాజకీయాలనుంచి నిష్క్రమణ***

ఏకారణాలవల్ల క్రియాశీలక రాజకీయాలనుంచి నిష్క్రమిస్తున్నానో అనే విషయాన్ని ఒక కరపత్రంలో వివరిస్తూ నా శ్రేయోభిలాషులకు, గతంలో సహకారాన్నిచ్చిన వారికి పంపాను. దాదాపు మూడునెలలు బళ్ళారిజిల్లా హగరి బొమ్మనహళ్లి తాలూకా కిచ్చెన్‌బండి గ్రామంలో మా కుటుంబానికి ఉన్న కొద్దిపాటి మామిడితోటవద్ద నేను, నా అర్ధాంగి ఉండడం జరిగింది. కృష్ణాజిల్లా, హైదరాబాద్ మున్నగు ప్రాంతాల్లో, కర్నాటకలో ఉన్నానని అంటే బెంగుళూరులో ఉన్నానని చాలా మంది భావించడం జరిగింది. సాధారణంగా రాజకీయాల్లో ఉన్నవారు అక్రమ సంపాదనతో బెంగుళూరులోనో పరిసరాలలోనే ఆస్తులను సమకూర్చుకుంటూవుంటారు. కర్నాటకలో ఉన్నానని అంటే నాకుకూడా బెంగుళూరులో ఆ విధంగా వందల ఎకరాల భూములు ఉన్నాయనే భావన ప్రచారం చేయబడింది. అది తెలిసి బళ్ళారిజిల్లాలో మామిడితోట ఉన్న విషయాన్నికూడా

కలిపి ఎందుకు క్రియాశీలక రాజకీయాలనుంచి నిష్క్రమించానో తెలియపరుస్తూ కరపత్రాలను పంపాను. (అనుబంధం 1-1)

***<u>నేను-నా సహచర పార్లమెంటు సభ్యులు</u>***

ఎనిమిదవ లోకసభలో మా పార్లమెంటరీ పార్టీ నాయకుడు సి. మాధవరెడ్డి సోషలిస్టు పార్టీ తరపున గతంలో పార్లమెంటు సభ్యునిగా పనిచేసి ఉన్నారు. సౌమ్యులు. ఉపనాయకుడు పి.ఆనందగజపతిరాజు మంచి వ్యక్తి, అల్పసంతోషి. ఆర్థిక అంశాలపైన మాట్లాడటానికి ఆసక్తి చూపేవారు. బోళ్ల బుల్లిరామయ్య, ఎం.వి.వి.ఎస్ మూర్తి గార్లు



*సహచర పార్లమెంటు సభ్యులు మాధవరెడ్డి, బుల్లిరామయ్య, మూర్తి, నరసింహాంలతో*

పదవ లోకసభలో కూడా సభ్యులుగా వుంటూ పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో ప్రముఖులై ఉండి కూడా పార్లమెంటుకు హాజరవుతూ ప్రశ్నలు వేయడం, చర్చలలో పాల్గొనటంలో ఉత్సాహం చూపుతుండేవారు. నాపట్ల చాలా అభిమానంతో ఉండేవారు.

ఏరాసు అయ్యప్పరెడ్డి, రామచంద్రారెడ్డి, భాట్టం శ్రీరామమూర్తి, నిశ్శంకరరావు వెంకటరత్నం, హెచ్.ఎ.దొర ప్రభృతులు రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అంశములపైన చర్చలలో పాల్గొంటూ వుండేవారు. రఘుమారెడ్డి, మద్దూరు సుబ్బారెడ్డి, నేను వ్యవసాయ సంబంధ అంశములపైన మాట్లాడుతూ ఉండేవారము.

నరసరావుపేటలో మాజీ ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డిగారిపైన విజయం సాధించిన కాటూరి నారాయణస్వామిగారికి పార్లమెంటులో ప్రశ్నలు, చర్చలు మున్నగు

వాటిపైన ఏ మాత్రము ఆసక్తి వుండేదికాదు. ఢిల్లీ వస్తూనే తిరిగి హైదరాబాదుకు వెళ్లేందుకు ఫ్లైట్ టిక్కెట్టు తీసుకొని వస్తుండేవారు. పొదిలి, దర్శి ప్రాంతాలనుండి వారివారి సమస్యలపైన హైదరాబాదు వచ్చే రైతాంగాన్ని సామాన్యప్రజానికాన్ని వెంటబెట్టుకొని దాదాపు కాలినడకనే హైదరాబాదులో సెక్రటేరియట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లుతుండేవారు. చంద్రు శ్రీహరి, తోట గోపాలకృష్ణ, అప్పల నరసింహం మున్నగు వారితో సహా మేమందరం చాలా స్నేహభావంతో కలిసికట్టుగా కృషిచేస్తూ ఉండేవాళ్లం.

ఎనిమిదవ లోక్‌సభలో టీడీపీ ప్రధానప్రతిపక్షం అవడం వలన ప్రతి చర్చను ప్రారంభించే అవకాశం మా పార్టీకే వస్తూ వుండేది. పదవ లోక్‌సభలో గెలిచింది పదముగ్గరం అయితే ఆరుగురు పార్టీ ఫిరాయించగా ఏడుగురం మిగిలితే స్పీకర్‌తో గట్టిగా మాట్లాడి ప్రతి చర్చపైన టీడీపీకి కూడా అవకాశం వచ్చేలా కృషి చేసిన ఫలితంగా ప్రతి బిల్లుపైన మా పార్టీ పక్షానకూడా ప్రజావాణిని వినపించగలిగాం.

పదవ లోక్‌సభలో సహచరుడు ఎస్.ఎం.లాల్ జాన్‌భాషా స్నేహపాత్రుడు. నిర్మొహమాటంగా తాను మంచిదీ అనుకున్న అంశాన్ని పార్టీ నాయకుడికి చెప్తూవుండేవాడు. వ్యవసాయ శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు లోక్‌సభ డిబేట్‌లలో పాల్గొనడంకన్నా హైదరాబాద్‌లో దిల్‌ఖుష్ గెస్ట్‌హౌస్‌లో ఉంటూ ప్రభుత్వ కార్యాలయాలలో పనులు చక్కబెడుతూ ఉండేవారు. డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుగారు ఒక అసిస్టెంట్‌ను పెట్టుకొని ప్రశ్నలు వేయిస్తూ వుండేవారు. తీరా లోక్‌సభలో ప్రశ్న వేయడానికి అవకాశం వచ్చినప్పుడు చాలా సందర్భాల్లో చల్లగా బయటికి జారుకుంటూ వుండేవారు. జి.యం.సి.బాలయోగి మరిచిపోలేని మంచి స్నేహితుడు. వీలైనంతవరకు తనవద్దకు వచ్చేవారికి సహాయం చేయాలనే ఆలోచనలో వుండేవారు. మేమందరమూ ఒకే కుటుంబంలాగా ఒకే మాటగా వ్యవహరిస్తూ ఉండేవారము.

***<u>సమైక్యతకు చిచ్చు</u>***


దేశంలో తొలి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాటుచేయబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు ఒక్క సి.పి.ఎం. పార్టీ మినహా అన్ని పార్టీలు ఎంతోకొంత మేరకు దోహదపడడం తెలుగుజాతి దౌర్భాగ్యం. కాంగ్రెస్, తెలుగుదేశం, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలు పరస్పరం ఒకరినొకరు విమర్శించుకోవడం తప్ప రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడంకోసం సరైన ప్రయత్నమే చేయలేదు. 2004లో తెలుగుదేశంపార్టీని అధికారంనుంచి తప్పించి కాంగ్రెస్ అధికారంలోకి రావడంకోసం వై.ఎస్.రాజశేఖరరెడ్డి తెలంగాణా కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ.

లతో ప్రారంభించిన ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ క్యాబినెట్‌మంత్రిగా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో అవకాశం లభించక, డిప్యూటీ స్పీకర్ పదవితో తృప్తిచెందక, టి.డి.పి. నుంచి బయటకు వచ్చిన కె.సి.ఆర్. ఏర్పాటుచేసిన టి.ఆర్.ఎస్. పార్టీ సపోర్టుతో బలంపుంజుకుంది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ నుంచి తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే లక్ష్యంతో తెలుగుదేశంపార్టీ మౌలిక సిద్ధాంతాన్ని విస్మరించి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపి టి.డి.పి. చారిత్రక తప్పిదాన్ని చేసింది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఉధృతమైన స్థాయిలో కొనసాగుతుండగా, ఎన్.టి. రామారావుగారు తల్లా–పెళ్ళామా అనే చిత్రాన్ని తీసి, అందులో 'తెలుగుజాతి మనది నిండుగ వెలుగుజాతి మనది' అనే పాటపెట్టిన ఉదంతాన్నికూడా పక్కనపెట్టి, స్వార్థ రాజకీయంకోసం ఆ నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం. అంతేకాకుండా కె.సి.ఆర్.తో పొత్తుపెట్టుకోవడం మరింత పెద్ద తప్పిదమయ్యింది. తెలుగుదేశంపార్టీకి బలమైన స్థానాల్ని తె.రా.స.కు వదలిపెట్టడం, కె.సి.ఆర్. డబ్బు తీసుకుని బలహీనులకు టిక్కెట్లు ఇవ్వడం జరిగింది. వారిలో చాలామంది ఓడిపోయి కాంగ్రెస్సు పార్టీకి లాభించింది.

***రాష్ట్రాన్ని ఎందుకు విభజించాలి? అడగని అన్ని పార్టీలు***

1956 నుంచి 2004 వరకు మధ్యమధ్యలో కొద్దికాలం మినహా ప్రశాంతమైన వాతావరణంలో రాష్ట్రం గణణీయమైన ప్రగతిని సాధించినా, ప్రత్యేక తెలంగాణా ఏర్పాటును డిమాండు చేస్తూవున్నవారిని, తెలుగు ప్రజలంతా కలసివున్న రాష్ట్రాన్ని ఎందుకు విభజించాలనే మౌలిక ప్రశ్నను ఏ రాజకీయపార్టీ కూడా అడగకపోవడం ఆశ్చర్యకరం. విభజన వాదాన్ని, విభజన డిమాండును, సమైక్యంగానే కొనసాగించాలనే డిమాండును పరిశీలించడానికి ఏర్పాటు చేయబడిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదికను అసెంబ్లీలోగానీ, పార్లమెంటులోగానీ చర్చించకపోవడం రాజకీయ పార్టీల బాధ్యతారాహిత్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఏ ఒక్క పార్టీకూడా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలకు చెందిన శాసనసభ్యులను గానీ, పార్లమెంటు సభ్యులనుగానీ సమావేశపరచి శ్రీకృష్ణ కమిటీ నివేదికపై చర్చించి విభజన అవసరమా లేదా ఒకవేళ విభజన అవసరమని భావిస్తే ఎటువంటి నిర్ణయాలు / ఏర్పాట్లు చేయడంద్వారా మూడు ప్రాంతాల్లోని ప్రజల మనోభావాలు గాయపడకుండా ఉంటాయి, ఒకరిపట్ల మరొకరికి విద్వేషాలు పెరగకుండా ఉంటాయి అనే విషయంపై ఎటువంటి చర్చ చేపట్టకపోవడం ప్రస్తుత రాజకీయ నాయకత్వ దివాళాకోరుతనానికి ప్రబల తార్కాణం.

సమైక్యాంధ్ర ఉద్యమం కొనసాగుతూవున్న సమయంలో ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు పూర్వాపరాలు, జై తెలంగాణా, జై ఆంధ్ర ఉద్యమాల పూర్వాపరాలు, శ్రీకృష్ణ కమిటీ నివేదిక విభజించబడితే కలిగే నష్టాలు వివరాలతో సమైక్యతతోనే 'తెలుగుజాతి ప్రగతి' అనే పుస్తకాన్ని నేను రూపొందించగా, మిత్రుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, ఉయ్యూరు రోటరీక్లబ్‌వారు ప్రచురించారు. సీమాంధ్ర నాయకుల మధ్య అనైక్యత, కాంగ్రెస్, బి.జె.పి.లు ఓట్లు, సీట్లకోసం కుమ్మక్కు కావడం, వై.ఎస్.ఆర్. సి.పి. ఆడిన డబుల్‌గేమ్, పైకి సమైక్యతంటూ లోపల రాష్ట్రం విడిపోయి తాను ముఖ్యమంత్రి కావాలని జగన్మోహనరెడ్డి చేసిన ప్రయత్నం, ఇరుప్రాంతాల్లో తెలుగుదేశంపార్టీ ప్రయోజనాల్ని కాపాడుకోవడంకోసం విభజనకు అనుకూలమేగానీ, సమన్యాయం జరగాలని కోరుతూ లోలోపల రాష్ట్రం సమైక్యంగానే ఉండాలని తద్వారా ముఖ్యమంత్రి కావాలని చంద్రబాబునాయుడు చేసిన ప్రయత్నం అన్నీ కలసి రాష్ట్ర విభజనకు దోహదంచేశాయి. కేవలం రాహుల్‌గాంధీ ప్రధాని కావడంకోసమో, వై.ఎస్. రాజశేఖరరెడ్డిగానీ, నారా చంద్రబాబునాయుడుగానీ, వై.ఎస్.జగన్మోహనరెడ్డి గానీ ముఖ్యమంత్రి కావడంకోసమో తెలుగుజాతి విభజించబడడం కోట్లాదిమంది ప్రజలు జీర్ణించుకోలేని కఠోరసత్యం. ప్రత్యేక తెలంగాణా అంశానికి రాజకీయపార్టీలు నిప్పు రాజేస్తే దానికి ఆయిల్ పోసి ప్రజ్వరిల్లే విధంగా చేసింది ఎలక్ట్రానిక్ మీడియా. శ్రీకృష్ణ కమిటీ రిపోర్టుపైన, అందులోని వాస్తవాలు, ఉచితానుచితాల వంటి అంశాలపై ఒక్కరోజు కూడ చర్చ చేపట్టని ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు కొన్ని మాసాలుగా దాదాపు ప్రతిరోజూ చర్చపెట్టి తెలంగాణా అంశాన్ని రావణాసురుడి కాష్టంలాగా మండించాయి.



ఆచార్య రంగాజీ స్ఫూర్తితో రాజకీయ ప్రస్థానం మొదలై, చౌదరి చరణ్‌సింగ్ స్ఫూర్తితో ప్రభావితం చెంది, వారి అడుగుజాడల్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, కార్మికులు, కర్షకుల శ్రేయస్సుకు నాకు సాధ్యమైనంతమేరకు కృషి సల్పుతూ వచ్చాను. నా నిబద్ధతపట్ల, నీతి నిజాయితీలపట్ల విశ్వాసం ఉంచి నాకు అన్నివేళల్లోనూ అన్ని సందర్భాల్లోనూ అండగా నిలచిన వందలాదిమంది బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నడిచానని సవినయంగా తెలియ పరుస్తున్నాను.

మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నా కుటుంబసభ్యులు ఏ ఒక్కరూ కూడా నా విధి నిర్వహణలో జోక్యం చేసుకోవడంగానీ, అపసవ్యమైన నిర్ణయం తీసుకోమని కోరివుండడంగానీ జరగలేదు. నేను సభ్యుడిగా ఉన్న పార్టీకి అంకితమై ప్రజలు నా దృష్టిలోకి తెచ్చిన సమస్యలు/ పనులు/ అభివృద్ధి కార్యక్రమాలు/ పథకాలు మున్నగువాటిని పార్టీలతో నిమిత్తంలేకుండా కృషి చేస్తూవచ్చాను. పార్టీలతో నిమిత్తంలేకుండానే దాదాపు మనరాష్ట్రంలోగానీ లేక కేంద్రంలోగానీ ఆయా సమయాల్లో అధికారంలోవున్న రాజకీయ నాయకులుగానీ, ఉన్నతాధికారులుగానీ నేను చేపట్టిన కార్యక్రమాలకు సహకారమిస్తూ వచ్చారు. వారందరికీకూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పది పర్యాయాలు శాసనసభ/ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన నాకు ఆర్థిక సహకారాన్నీ, మద్దతునూ అందించిన చిన్న పెద్ద యావన్మందికీ పునః పునః కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఏదైనా సందర్భంలో తెలిసీ తెలియక, ఎవరైనా పొరపాటు సమాచారం అందించటం వలన ఎవరికైనా కష్టం కలిగించినట్లయితే మన్నించ వలసిందిగాకూడా కోరుతున్నాను.

ఢిల్లీలో వ్యవసాయమంత్రులు అజిత్‌సింగ్, సోంపాల్, మరియు మంత్రులు నవీన్ పట్నాయక్, కె.పి.సింగ్‌దేవ్, అనంతకుమార్ మున్నగువారు చక్కని సహకారాన్నందించారు.

పార్లమెంటరీ నియోజక వర్గ అభివృద్ధి నిధులను వినియోగించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే కృషిలో పార్లమెంట్ సభ్యులు, శాసన – శాసన మండలి సభ్యులు ప్రజా సహకారమును, పంచాయితీ రాజ్ సంస్థల సహకారమును జోడించి గ్రామీణాభివృద్ధి మరియు పట్టణాభివృద్ధి కార్యక్రమాలను చేపడితే సమాజానికి ఎంతో మేలు చేకూరుతుంది. నిధులు సద్వినియోగం అవుతాయి.

ఈ కార్యక్రమాలకు తమ వంతు సహకారమును అందించిన జిల్లా డెయిరీ ఛైర్మన్ మండవ జానికిరామయ్య, పాల సొసైటీ అధ్యక్షులకు ధన్యవాదములు. అలాగే జిల్లా పరిషత్ ఛైర్మన్ కడియాల రాఘవరావు, గౌ. శాసన సభ్యలు, మండల పరిషత్ అధ్యక్షులు గ్రామ పంచాయితీల అధ్యక్షులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియపరుస్తున్నాను.

నా మూడు దశబ్దాల రాజకీయ జీవన ప్రస్థానంలో చేపట్టిన అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారమును అందించిన గౌరవ ముఖ్యమంత్రులు, మంత్రులు, తోటి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికార యంత్రాంగములో వివిధ స్థాయిలలో పనిచేసిన ఉద్యోగులు, పత్రిక రంగంలోని, ఎలక్ట్రానిక్ మీడియాలోని సభ్యులు యావన్మందికి నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

❖❖❖

# అనుబంధం (ఎ) శాసన సభ ప్రసంగాలు

## ఆంధ్ర రైతు ఆవేదన

| | |
|---|---|
| 1. | దగాపడిన ఆంధ్ర రైతు |
| 2. | బీదరికపు స్థాయిలో 40శాతం మంది |
| 3. | బడ్జెట్‌పై చర్చ |
| 4. | పరిస్థితి అధ్వాన్నమయింది |
| 5. | పంచాయతీ బిల్లుపై చర్చ |
| 6. | గవర్నరు ప్రసంగంపై చర్చ |
| 7. | ఎమర్జన్సీ అత్యాచారాలపై చర్చ |
| 8. | శాంతిభద్రతలపై చర్చ |
| 9. | 1979 మే తుఫానుమీద చర్చ |
| 10. | హరిజన విద్యార్థి వసతిగృహాల స్థితిపై చర్చ |
| 11. | సీతానగరం చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం నడిపించాలి |
| 12. | 50 శాతం మందికి వ్యవసాయమే అధారం |

# అనుబంధం (జి) ఎనిమిదవ లోక్‌సభలో ప్రసంగాలు

## ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరు తెన్నులు

| |
|---|
| ఎ. వ్యవసాయ రంగం |
| 1. ఎందుకీ జవహర్ రోజ్ గార్ యోజన? |
| 2. స్టేట్ ట్రేడింగ్ కార్పోరేషన్‌చే పొగాకు కొనుగోలు చేయించండి |
| 3. అవమానకరమైన దారిద్ర్యాన్ని జయించుదాం |
| 4. వ్యవసాయ ఉత్పత్తుల పట్ల నూతన దృక్పథం కావాలి |
| 5. పొగాకు రైతుపై పగ బూనకండి |
| 6. జన వనరులే జాతికి శ్రీరామరక్ష |
| 7. రైతన్నల కన్నీటి వరదలు |
| 8. రైతన్నల కన్నీటి వరదలు - 2 |
| 9. కొండల్లో, కోనల్లో సంపద సృష్టిద్దాం |
| 10. రైతన్నల ఆగ్రహానికి గురికావద్దు |
| 11. వ్యవసాయ పరిశ్రమలను గ్రామీణ సహకార రంగానికి కేటాయించండి |
| బి) పారిశ్రామిక రంగం |
| 12. ప్రభుత్వ పారిశ్రామిక ప్రాధాన్యతలు మార్చుకోవాలి |
| 13. చేనేత పనివారిని రక్షించండి |
| 14. చెంబూరు ఫ్యాక్టరీపై భోపాల్ విషవాయువు వూదకండి |
| 15. ఆరోగ్యానికే కాదు దేశానికే అలక్ష్యం చేయకండి |
| 16. విద్యుత్ రంగాన్ని అలక్ష్యం చేయకండి |
| 17. పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాతిపదికను మార్చాలి |

**సి) ఆంతరంగిక వ్యవహారాలు**

18. ప్రత్యేక రక్షణదళం శాశ్వతం కాగూడదు
19. పంజాబ్ ఒప్పందం అభినందనీయం
20. దేశ సమగ్రతకు భంగం వాటిల్ల నివ్వకండి
21. ఆయుధ గిడ్డంగిలో అసలేం జరిగింది?
22. శ్రీలంకలో తమిళులను రక్షించుకోవాలి
23. ఉగ్రవాదాన్ని నిర్మూలిందాం
24. మత సంస్థలను నిషేధించండి

**డి) సామాజిక సమస్యలు**

25. నిరుద్యోగ శాపమోచనం ఎప్పుడు కలుగుతుంది?
26. జనాభా పెరుగుదలను పరిమితం చేయాలి
27. రిజర్వేషన్ల పేరిట సమాజంలో వివక్షత సృష్టించవద్దు
28. వినియోగదారులను రక్షించండి

**ఇ) అవినీతి భాగోతాలు**

29. దేశ రక్షణను అవినీతికి ఆహుతి చేయవద్దు
30. కంటి తుడుపు కమీషను కాదు – కనికట్టు కమీషన్ ఇది
31. అస్థిరత్వం పేరుతో 'బోఫర్సు'పై నుండి ప్రజల దృష్టిని మళ్ళించే కుటిలయత్న
32. వాటర్ గేట్‌ను మించిన బోఫర్సు
33. రాష్ట్రాలకు కేంద్రం బంధనాలు
34. ఏకపక్షంగా రాష్ట్ర అధికారాలు కబళిస్తారా?

**ఎఫ్) కేంద్ర రాష్ట్ర సంబంధాలు**

35. ఓడిపోతామన్న భయంతో ఎన్నికలు వాయిదా వేస్తున్నారు
36. రైల్వేలలో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం

**జి) వివిధ విషయాలు**

37. లక్ష్యశుద్ధి లోపించిన 20 సూత్రాల కార్యక్రమము
38. అధ్వాన్నస్థితిలో జాతీయ రహదార్లు
39. తలదాచుకోవడానికి తలకో యిల్లు
40. ఆదాయపు పన్ను విధానాన్ని సవరించండి
41. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించండి
42. వ్యయంపై మరింత పన్ను
43. బొగ్గుగనుల జాతీయంలోని లక్ష్యాలను నెరవేర్చండి
44. మతకల్లోలాలను నివారించండి
45. గిరిజన ప్రాంతాలను త్వరగా అభివృద్ధి చేయండి
46. 1988 డిసెంబర్ విధ్వంసకాండ బాధితుల ప్రసక్తిలేని రాష్ట్రపతి ప్రసంగం
47. ప్రాంతీయ పార్టీల నిషేధమా?
48. అమలు చేయని పంజాబ్ ఒప్పందం
49. అసంఘటిత కార్మికుల ప్రయోజనాలు పరిరక్షించండి
50. చౌకధరల దుకాణాలు
51. బచావత్ అవార్డును అమలు చేయండి

**హెచ్) వ్యవసాయ రంగం - 2**

52. ప్రత్తి రైతులను ఆదుకోండి
53. అడవుల పరిరక్షణ చట్టానికి సమగ్రమైన సవరణలు తీసుకురండి
54. పొగాకు రైతులకు సరైన ప్రాతినిధ్యం
55. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు స్థాపించండి

గమనిక: ఇంగ్లీషులో చేసిన ప్రసంగాలను తెలుగులోకి అనువదించి
"ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరుతెన్నులు" ముద్రించటమైనది
ఇవికాక పలు ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలను 377 నిబంధన క్రింద
ప్రస్తావించటమే కాక కొన్ని వందల ప్రశ్నలను సంధించటం జరిగింది

# అనుబంధం (సి) పదవ లోక్‌సభలో ప్రసంగాలు

## (రైతు వాణి)

ఎ. వ్యసాయ రంగం

1. డంకెల్ బారి నుండి మన రైతుల ప్రయోజనాలు పరిరక్షించుకొందాం
2. వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకొనిపోదాం
3. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి
4. వ్యవసాయ రంగంలో ఎందుకు విఫలమవుతున్నాము?
5. వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి
6. ప్రపంచవాణిజ్య సంస్థకు భావితరాలను బలిచేయవద్దు
7. రైతులపట్ల ప్రభుత్వానికి సానుభూతిలేదు
8. భూ పరిమితి చట్టాలను ప్రభుత్వం నిజాయితీతో అమలుచేయాలి
9. ఎరువులపై రాయితీలు కొనసాగించాలి
10. జాతీయ వ్యవసాయ విధానాన్ని సరిగ్గా రూపొందించండి
11. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి
12. ప్రత్తి రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టావా?
13. రైతులను క్రుంగదీస్తున్న మద్దతు ధరలు
14. పొగాకు రైతులను ఆదుకోవాలి
15. వ్యవసాయానికి పెద్దపీట వేయాలి
16. మనకు సరియైన వ్యవసాయ విధానం లేదు
17. నూతన ఆర్థిక విధానములో వ్యవసాయాన్ని ఏం చేయబోతున్నాం?
18. ఎరువుల ఫ్యాక్టరీలకు 12% లాభం! విద్యుత్ కంపేనీలకి 16% లాభం! రైతుకు కనీస లాభం అక్కర్లేదా?

19. గ్రామీణ పేదరికాన్ని పారద్రోలటమెలా?

20. ఈ ప్రభుత్వం ఎవరికోసం? ఎందుకోసం?

21. కరువుకు శాశ్వత పరిష్కారం ఏది?

22. చెరుకు రైతుల ప్రయోజనాలను కాపాడండి

23. పులిచింతల ప్రాజెక్టు కట్టాలి

24. కరువు పరిస్థితులలో రైతును ఆదుకోవాలి

25. వరదలవచ్చే నష్టాలను ఎలా నివారించాలి?

**బి) సామాజిక రంగం**

26. సామాజిక అసమానతలను తగ్గించాలి

27. ఖనిజ సంపదను సద్వినియోగ పరుచుకొందాం

28. చిన్నతరహా పరిశ్రమలను దెబ్బతీయవద్దు, మహాత్ముని మరిచిపోవద్దు

29. స్థానిక సంస్థలను బలోపేతం చేద్దాం

30. సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

31. పారిశుధ్య కార్మికుల అభ్యున్నతికి కృషిచేద్దాం

32. విజయవాడ విమానాశ్రయం అభివృద్ధి పరచండి

33. నిరుద్యోగులకు ఉపాధికల్పన జరగాలి

34. గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయవద్దు

35. నిలువనీడ లేనివారిని పట్టించుకోరా?

36. జాతీయ గృహవిధానానికి ఆమోదం తెలపాలి

37. పేదలపై పెనుభారం పెరుగుతోంది

38. ఒకరు లేక ఇద్దరు చాలు

39. తల్లి బిడ్డల సంరక్షణ అతిప్రధానం

**సి).ప్రభుత్వ విధానాలు - చట్టాలు**

40. వినిమయదారుల పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి
41. వినియోగదారుల చట్టాల విషయంలో ప్రజల్ని చైతన్య పరచాలి
42. ఎగుమతి - దిగుమతి విధానం సవరించాలి
43. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ ఆర్డినెన్సు
45. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించవద్దు.
46. ఎన్నికల సంస్కరణల అవశ్యకత
47. పేదలకు అందుబాటులో మందుల ధరలు వుండాలి
48. వ్యన్యప్రాణుల సంరక్షణ చట్టంలో మార్పులు చేయాలి
49. పాస్‌పోర్టు జారీలో జాప్యంకూడదు
50. రైల్వేల పనితీరు నిరుత్సాహం కలిగిస్తోంది
51. విద్యుత్ రంగాన్ని సమర్ధవంతంగా తీర్చి దిద్దుకోవాలి
52. ఎన్.జి. రంగా, ఎన్.టి. రామారావు, మొరార్జీ దేశాయిగార్లకు నివాళలు

**డి). శాంతి భద్రతలు**

53. బలహీన వర్గాలపై దురాగతాలను అరికట్టాలి
54. మా నమ్మకాన్ని వమ్ముచేయవద్దు
55. జమ్మూ కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు ఏర్పడాలి
56. నిరంకుశ టాడా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాను
57. తీవ్రవాదుల ఆగడాలు అరికట్టాలి
58. చట్టానికి ఎవరూ అతీతులుకాదు
59. ప్రముఖులకు రక్షణ కల్పించాలి

**ఇ). మతసామరస్యం**

60. ఉమ్మడి పౌరస్మృతి ఇప్పుడే సాధ్యం కాదు

61. బాబ్రీమసీదు వివాదాన్ని పరిష్కరిద్దాం

62. మతసామరస్యం ప్రమాదంలో పడింది

63. మతాల మధ్య చిచ్చుపెట్టవద్దు

**ఎఫ్) కుంభకోణాలు**

64. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేవారిని ఏం చేస్తారు?

65. న్యాయమూర్తులే అక్రమాలకు పాల్పడితే ఎంచేయాలి?

66. బోఫోర్సు దర్యాప్తును ప్రక్కదోవ పట్టించవద్దు

67. నల్లధనాన్ని అరికట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి వుందా?

68. కుంభకోణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి

69. బ్యాంకింగ్ రంగం అవినీతికి ఆలవాలమయ్యింది

70. అవినీతి పరులకు ప్రభుత్వమే పెద్ద రక్షణ కవచం

71. బ్యాంకులలో జరిగే కుంభకోణాలను నివారించాలి

72. కోట్లరూపాయల ప్రజా ధనాన్ని దోచుకుతింటున్నారు

*గమనిక: ఇంగ్లీషులో చేసిన ప్రసంగాలను తెలుగులోకి అనువదించి "రైతు వాణి" ముద్రించటమైనది*

*ఇవికాక పలు ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలను 377 నిబంధన క్రింద ప్రస్తావించటమే కాక కొన్ని వందల ప్రశ్నలను సంధించటం జరిగింది*

❖❖❖

# అనుబంధం (డి) పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు

తమ సమస్యల పరిష్కారంలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజలు భాగస్వామ్యం వహించితేనే మనదేశం వేగాంగా పురోభివృద్ధి చెందుతుందని నా విశ్వాసం. కావున ప్రజలను, గ్రామపంచాయితీ, మండల ప్రజాపరిషత్తులను, జిల్లా ప్రజాపరిషత్‌ను మరియు గౌరవ శాసన సభ్యులు సహకారమునకు నా పార్లమెంటరీ నియోజక వర్గ అభివృద్ధి నిధులను జోడుచేసి యీ క్రింద పేర్కొన్న పనులను చేపట్టడం జరిగింది.

**1. పాలసేకరణ కేంద్రభవనముల నిర్మాణము**

గ్రామాలలో వ్యవసాయం తరువాత రైతులకు, కార్మికులకు అదనంగా ఉపాధిని, ఆదాయాన్ని సమాకూర్చి పెట్టేది పాడి పరిశ్రమ. నియోజక వర్గములో 77 గ్రామాలలో పాల సేకరణ కేంద్ర భవనాలు నిర్మించడానికి సహకారాన్ని అందించాను. గంపల గూడెం మండలంలో -15. తిరువూరు మండలములో -6, విస్సన్నపేట మండలంలో -6, చాట్రాయి మండలములో -10, రెడ్డిగూడెం మండలంలో -1, ఎ.కొండూరు మండలం -5, మైలవరం మండలం -1, జి. కొండూరు మండలం -1, వీరులపాడు మండలం -1, నందిగామ మండలం -11, చందర్లపాడు-4, పెనుగంచిప్రోలు - 6, జగ్గయ్య పేట మండలం -3, వత్సవాయి - 3, విజయవాడ రూరల్ -1, కంకిపాడు -1, గ్రామాలు ఇందువలన లబ్ధిపొందాయి.

**2. ఇరిగేషన్ వనరుల విస్తరణ**

రెడ్డిగూడెం మండలములో కోతులవాగుపై గ్రోయిన్ నిర్మాణం, ధర్మాచెరువుపై రిపేరు, రుద్రవరం ఛానల్ మరమ్మత్తులు, ఇబ్రహీంపట్నం మండలంలో జూపూడి గ్రామములో లిఫ్ట్ఇరిగేషన్ పథకం, విజయవాడ రూరల్ మండలంలోని పాతపాడు, కండ్రిక మున్నగు గ్రామాలకు, గొల్లపూడి సప్లై ఛానల్ నుండి లిఫ్ట్ స్కీం, కంచికచర్ల మండలములో మొగులూరు ఛానల్ నిర్మాణం, నందిగామ మండలములో ఐతవరంలో లిఫ్ట్ ఇరిగేషను పథకాలకు సహకారాన్ని అందించాను. చందర్లపాడు మండంలోని చందర్లపాడు గ్రామమలోని అల్లవాగుపై చెక్ డాం నిర్మాణానికి, వత్సవాయి మండలంలోని భీమవరం గ్రామంలో ఇసుకవాగు కట్టలు బలపర్చుటకు సహకారాన్నిచ్చాను.

**3. బోరువెల్స్ నిర్మాణము**

మెట్టప్రాంత గ్రామాలలో నిత్యం ప్రజానీకం ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు వివిధ గ్రామాలలో బోరువెల్స్ నిర్మాణమునకు నా నిధుల నుండి కొంత భాగము కేటాయించి ఏర్పాటు చేయడమైనది. చాట్రాయి మండలములో –5, విస్సన్నపేట మండలములో –6, నందిగామ మండలంలో –2, తిరువూరు మండలంలో –15, మైలవరం మండలంలో –2, చందర్లపాడు మండలంలో –3, ఎ. కొండూరు మండలములో –2, గంపలగూడెంలో –3, విజయవాడు రూరల్ –2, బోర్‌వేల్స్ వేయబడినవి.

**5. బస్ షెల్టర్ల నిర్మాణము**

వేమిరెడ్డిపల్లి, లింగ గూడెం, మాగల్లు, ఊటుకూరు, లక్ష్మీపురం, రామిరెడ్డిపల్లి, గొల్లగూడెం, నందిగామ, రోలుపడి మొదలగు గ్రామాలలో నిధులను కేటాయించి బస్ షెల్టర్లను నిర్మింపచేశాను.

**6. కమ్యూనిటీ హాల్స్, దోభీ ఖానాలు, లైబ్రరీ బిల్డింగ్స్ నిర్మాణము**

రాజుపాలెం, చిన్న మోదుగుపల్లి, తోటచర్ల, నవాబుపేట, గోళ్లమూడి, అనుముల్లంక, మొదలగు గ్రామాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణముకు సహకారం చేశాను. జి.కొండూరు, కుంటముక్కల, విస్సనపేట గ్రామలలో దోభీ ఖానాల నిర్మాణానికి, కంభంపాడు, మక్కపేట, కంచించర్లలో లైబ్రరీ బిల్డింగ్స్ నిర్మాణానికి సహకారం ఇచ్చాను.

**7. శ్మశాన వాటికలను కాంపౌండు వాల్స్ నిర్మాణము**

మరుసుమిల్లి, పెద్దవరం, నున్న, తాడిగడప, కోరంకి గ్రామాల్లోని శ్మశాన వాటికల అభివృద్ధి కాంపౌడ్ వాల్, షెల్టర్ కార్యక్రమాలు చేపట్టాటానికి సహకారం ఇచ్చాను.

**8. గ్రామ పంచాయితీ బిల్డింగ్స్ నిర్మాణము**

ఎ. కొండూరు –2, జి.కొండూరు –4, మైలవరం –3, పెనమలూరు –2, పెనుగంచిప్రోలు –3, వత్సవాయి –3, నందిగామ –1, జగ్గయ్యపేట –1, గంపలగూడెం –1, విస్సన్నపేట –4, తిరువూరు –1, చాట్రాయి –2, మండలములలోని గ్రామాలలో పంచాయితీ బిల్డింగ్స్ నిర్మాణానికి, విస్సన్నపేట మండల పరిషత్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నా సహకారాన్నిచ్చాను.

**9. స్కూలు బిల్డింగ్స్ నిర్మాణము**

తిరువూరు డిగ్రీ కళాశాలలో సైన్సు విభాగం భవన నిర్మాణానికి, ఎ. కొండూరు-4, వీరులపాడు - 1, కంచికచర్ల -1, మైలవరం -1, నందిగామ -1, పెనుగంచిప్రోలు -2, జగ్గయ్యపేట -1, వత్సవాయి -1, చాట్రాయి -1 మండలములోని పాఠశాలలో భవన నిర్మాణానికి, పటమటలో స్కూలు భవన నిర్మాణానికి సహకారం అందించాను. వీరులపాడు, పెనుగంచి ప్రోలు, ఉప్పులూరు మొదలగు గ్రామలో మహిళా మండలలు భవన నిర్మాణమునకు సహాకరాన్ని అందించాను.

**10. బ్రిడ్జీల నిర్మాణం**

పెదపులిపాక, ఎనికేపాడు, కాసరనేనివారి పాలెం గ్రామాల్లో కాల్వలపై వంతెలనలకు, జూపూడి, కొటికలపూడి, మోర్సుమిల్లి, కుమ్మరకుంట్ల, అట్ల ప్రగడ, శివాపురం, తోటచర్ల, వెంకటాపురం, మాగల్లు గ్రామాల్లో వాగులపై కాజ్‌వేల నిర్మాణమునకు నిధులను కేటాయించి ప్రజలను ప్రోత్సహించి వారు ఉత్సాహవంతంగా కలిసికట్టుగా పనిచేసుకొనుటకు స్ఫూర్తినిచ్చితిని.

**11. నీటిపంపుల విస్తరణ పథకం**

గంపలగూడెం -4, తిరువూరు-1, విస్సన్నపేట -3, ఇబ్రహీం పట్నం, కంచింకచర్ల, వీరులపాడు మండలాల్లోని ఒక్కొక్క గ్రామానికి నిధులనిచ్చి పైపు లైనుల విస్తరణ చేయించడం జరిగింది.

**12. రోడ్లు నిర్మాణం**

చాట్రాయి -2, వీరులపాడు -8, చందర్లపాడు -7, నందిగామ -17, కంచికచర్ల -10, విస్సన్నపేట -1, గంపలగూడెం -2, పెనుగంచిప్రోలు -9, మైలవరం -3, రెడ్డిగూడెం -3, ఎం. కొండూరు -1, జి. కొండూరు-1, వత్సవాయి 7, జగ్గయ్యపేట-1, ఇబ్రహీం పట్నం -1, పెనమలూరు -1, కంకిపాడు -1, మండలాలలో మొత్తం మీద 75 గ్రామాలకు రోడ్లను నిర్మింప చేయడానికి గాని, విస్తరింప చేయించడానికి గాని నా నిధులను నుండి కొంతమేరకు వాటికి కేటాయించి గ్రామీణాభివృద్ధికి నా వంతు కృషి చేయడం జరిగింది.

**13. ఆరోగ్య సంరక్షణ**

విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఒక బ్లాకు నిర్మాణమునకు, గంపలగూడెం మండలం ఊటుకూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి సల్పటమేగాక కొంత సహాకారాన్ని అందించాను.

వడ్డే శోభనాద్రీశ్వరరావు
B.Sc., B.E. (Mech)
మాజీ పార్లమెంటు సభ్యులు
మాజీ వ్యవసాయ శాఖామాత్యులు

# అనుబంధం - 1

డా.నెం. 8-3-677/57ఎ,
శ్రీ కృష్ణదేవరాయ నగర్,
హైద్రాబాద్ - 500 873
ఫోన్ 040-55506249
సెల్ 9849066249
వుయ్యూరు, ఫోన్ . 08676-233333

---

ప్రియమైన శ్రీ ............... ................ ..... .. . .

సుమారు మూడున్నర దశాబ్దముల నా రాజకీయ ప్రస్థానములో మీరు నా పట్ల చూపిన ప్రేమ, అభిమానములు ఏనాటికి మరువలేనివి. మీ లాంటి పలువురు శ్రేయోభిలాషులు, మిత్రులు, బంధువులు నేను శాసన సభకు కాని, పార్లమెంటుకు కాని పోటీ చేసిన సందర్భములలో అందించిన సహాయ, సహకారములకు నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియపరచుకొనుచున్నాను. మీ అమూల్యమైన ఆదరణ, భగవంతుని కృప వలన చట్ట సభలలో ప్రజల వాణిని వినిపించడంతోపాటు, ప్రజా జీవితంలో నైతిక విలువలకు కట్టుబడి పని చేస్తూ, సమాజ ప్రగతికి నా చేతనైనంత కృషి చేయగలిగాననే తృప్తి వుంది.

1978-83 శాసన సభలో పెద్దలు శ్రీ గౌతులచ్చన్న, కామ్రేడ్ సుందరయ్యగార్ల సహచర్యంలో పలురైతాంగ సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్ళడమే కాక ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షునిగా రైతాంగ ఉద్యమాల్లో పాల్గొనగలిగాను. ఆనాటి నా శాసనసభా ప్రసంగాలను "ఆంధ్రరైతు ఆవేదన", "దగాపడ్డ ఆంధ్ర రైతు" పుస్తకముల రూపములో ప్రచురించాను. కలెక్టర్, ఇతర అధికార్ల సహకారంతో ప్రతిపక్షంలో వున్నా యనమలకుదురు - బలూరు కృష్ణా ఎదమకరకట్ట అభివృద్ధి, మద్దూరు, దేవరపల్లి, కల్లెంవారి పాలెం గ్రామాల వద్ద కె.ఇ.బి. కెనాల్‌పై వంతెనల నిర్మాణం, ఉయ్యూరులో ఫైర్ స్టేషన్, బైపాస్ రోడ్డు, టెలిఫోన్ ఎక్చేంజికి స్థలంతో సహా పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించాను. వ్యవసాయ విద్యుత్‌కు స్లాబురేటుపై నివేదిక, చెరకు రైతులకు కొనుగోలు పన్ను నుండి అదనపు ధర యిప్పించడంలో నా వంతు పాత్రను నిర్వర్తించాను.

ఎనిమిదవ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర నిర్వర్తించిన తెలుగుదేశం పక్ష దీఫ్‌విప్‌గా తెలుగుతేజం శ్రీ యన్.టి.రామారావుగారి స్ఫూర్తితో మన రాష్ట్ర సమస్యలను, వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, భోఫోర్స్ కుంభకోణం వంటి పలు ప్రజా సమస్యలపై ప్రజల వాణిని పటిష్టంగా వినిపించాను. ఆ ప్రసంగాలను "ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరు తెన్నులు" పుస్తక రూపంలో ప్రచురించి ప్రజల ముందుంచాను. పదవ లోక్‌సభలో అర్జురు పార్టీ ఫిరాయించగా ఏడుగురు సభ్యులతో కూడిన తెలుగుదేశం పక్షనాయకునిగా "డంకెల్ డ్రాఫ్టు" వలన మన దేశ ప్రజానీకానికి ప్రత్యేకంగా రైతులకు చేకూరనున్న ప్రమాదం, సెక్యూరిటీల కుంభకోణం, పంటల ధరలతో సహా అనేక ప్రజా సమస్యలను సమర్థవంతంగా సభ దృష్టికి తీసుకువెళ్ళాననే సంతృప్తి మిగిలింది "రైతువాణి" పుస్తక రూపంలో ఈ ప్రసంగాలను పాఠకుల ముందుంచాను. పార్లమెంటు సభ్యునిగాను, 1989-91లో సభ్యునిగా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య, ప్రజల సమస్యల పరిష్కారానికి, మన ప్రాంత అభివృద్ధికి కృషి చేశాను. 95-96లో ఒక కోటి రూపాయల యం.పి.యల్.ఎ.డి. నిధులకు స్థానిక ప్రజలు, స్థానిక సంస్థల సహకారమును జోడించి, ప్రజా భాగస్వామ్యముతో 80 పాలకేంద్ర భవనములతో సహా పలు గ్రామాల్లో పంచాయితీ కార్యాలయాలు, రహదార్లు, స్కూలు భవనములు, కమ్యూనిటీ హాల్స్, బస్ షెల్టర్, కానరనేని వారి పాలెం, పెదపులిపాక గ్రామాల వద్ద వంతెనలు, కాజ్‌వేలు నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేయించాను. గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి, విజయవాడలో టి.వి. స్టూడియో నిర్మాణానికి, వి.టి.పి.యస్. ఉద్యోగుల ప్రొడక్టివిటీ రివార్డుకు ఆదాయపు పన్ను మినహాయింపుకు, వాగన్ వర్క్‌షాపు ఉద్యోగులకు సి.సి.ఎ. మంజూరుకు రైల్వే జూనియర్ కాలేజి ఏర్పాటుకు, మాధవరం రైల్వేస్టేషన్ నిర్మాణమునకు, సింగ్‌నగర్ వద్ద బ్రిడ్జి నిర్మాణమునకు, కొణతమాత్మకూరు, కమ్మవారిపాలెం, కొత్తపేట, జూపూడి, పాతపాడు - కంచికచర్ల మున్నగు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యము కల్పించుటకు, టెలి కమ్యూనికేషన్, విద్యుత్ త్రాగునీరు, రవాణా, వైద్య సౌకర్యములను గ్రామాలకు విస్తరింపచేయుటకు, కేంద్ర డి.బి.టి. నుండి పెదవేగి వద్ద ఆయిల్ పామ్ యూనిట్‌కు సహకారమునకై కృషిసల్పాను.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి ఆశీస్సులతో మన రాష్ట్రమునకు సంబంధించిన పలు పెండింగ్ పథకాల అనుమతులను సాధించడానికి కృషి చేయగలిగాను అనే సంతృప్తి వుంది. చండీఘర్‌లో "అప్నమండి" పనితీరును గమనించి మన రాష్ట్రంలో పండించే రైతుకు మెరుగైన ధర, వినియోగదారునకు సరసమైన ధరకు కూరగాయలు, పండ్లు అందించేందుకు ఉద్దేశించబడిన "రైతు బజార్ల" రూపకల్పనలో ముఖ్య భూమిక వహించడం నా జీవితంలో మరపురాని మధురానుభూతిని మిగిల్చింది. లంకపల్లి, గుర్విందపల్లి గ్రామాల వద్ద కె.ఇ.బి. కెనాల్‌పై వంతెనల నిర్మాణంతో సహా పలు ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించాను. విజయవాడలో సైన్సు మూజియం స్థాపనకు, ప్రకాశం బ్యారేజి అప్రాన్ మరమ్మత్తులు గేట్ల మార్పిడికి, పీఠాపురం వద్ద చెక్‌డాం నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనుల సాధనకై కృషి సల్పాను.

రాష్ట్ర ప్రభుత్వంలో వ్యవసాయ శాఖామంత్రిగా ఈ శాఖకు కేటాయించబడిన నిధులతోనే వ్యవసాయ విస్తరణను పటిష్టముగా నిర్వర్తించుటకై తేజ టి.వి.లో "రైతుమిత్ర" కార్యక్రమాన్ని ప్రారంభించడం, 22 జిల్లాలకు భూమి యొక్క విశేష అంశములను తెలియజేయు మ్యాప్‌ల రూపకల్పన, విత్తనముల లోపము వలన రైతులు నష్టపోకుండా వుండుటకై విత్తన అవగాహన ఒప్పందంలను దేశంలో ఏ రాష్ట్రములోనూ లేని విధంగా తయారు చేయించడం, భూసార పెంపుదలకు గతంలో ఏనాడూ లేని విధంగా పచ్చిరొట్ట విత్తనాలను, జిప్సం - జింక్ సల్ఫేట్‌లను సబ్సిడీతో అందించడం, ఖరీఫ్‌లో, రబీలో పలు పంటల విత్తనాలను సబ్సిడీతో అందించటం. రసాయనిక క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించి, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావ నేపథ్యంలో మన ఉత్పత్తుల నాణ్యతను మెరుగు పర్చుకోవలసిన ఆవశ్యకతను తెలియపరచడం, పలు పంటలకు కనీస మద్దతు ధరలు లభింపచేయడం, రైతు బంధు వంటి కార్యక్రమాలను రైతాంగ శ్రేయస్సు కొరకై అమలు చేయించడంలో నా వంతు పాత్రను నిర్వర్తించాను. నీటి వనరుల పెంపుదలకు ముఖ్యంగా చెరువుల పూడిక తీయుటకు ఎంతో దోహదం చేసిన "నీరు-మీరు" కార్యక్రమం కేబినెట్ ఆమోదంలో ముఖ్య భూమిక వహించాననే సంతోషం ఎప్పటికీ నాకు మిగులుతుంది. రామచంద్రాపురంలో "కృత్తివెంటి పేర్రాజు పంతులు మల్టీపర్పస్ పాలిటెక్నిక్", గరికపాడులో "కె.యల్.రావ్ కృషి విజ్ఞాన కేంద్రం" ఏర్పాటు నా జీవితంలో ఏ నాటికీ మరువలేని మధుర స్మృతులు. ఐతే ఒక్క 2001 సంవత్సరం మినహా మిగిలిన సంవత్సరాల్లో వరుసగా సంభవించిన దుర్భిక్షం వలన రైతాంగం చాలా నష్టపోవడం, నిరాశా, నిస్పృహలకులోనై నాలో ఆవేదనను మిగిల్చింది.

నియోజకవర్గంలో ఎన్నో దశాబ్దములుగా ప్రజలు కోరుకున్న తారకరామ ఎత్తిపోతల పథకం, మైలవరం మంచినీటి పథకం, కాటన్ కార్పొరేషను కొనుగోలు కేంద్ర మంజూరు - మార్కెట్‌యార్డు అభివృద్ధి, వెల్లటూరు, రేపూడి, వల్లంపట్ల గ్రామముల వద్ద బ్రిడ్జిలు, కంభంపాడులో 132 కె.వి. సబ్‌స్టేషన్‌లను సాకారం చేసి, యస్.యస్.పి. కాల్వ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మంజూరు చేయించడమేకాక రంగాపురంలో వెలుగు పాఠశాల, ఇబ్రహీంపట్నంలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు కావించి, మైలవరంలో శాశ్వత ప్రాతిపదికపై ఇంజనీరింగు కళాశాలకు అనుమతి, సుందరమైన స్టేడియం నిర్మాణం, పలుమండల కేంద్రాలలో మండలపరిషత్, మండల రెవెన్యూ కార్యాలయ భవనములు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనములు, పోలీస్ స్టేషన్ భవనములు, స్కూలు భవనములు, షాదీఖానాలు, సంక్షేమ వసతి గృహములు, ప్రతి గ్రామానికి రక్షిత నీటి సరఫరా, తారురోడ్లుతో సహా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను దాదాపు రూ. 150 కోట్లతో అమలు చేయించితిని, నా పేరును మొదటి లిస్టులో ప్రకటించక, పార్టీ కార్యాలయం వద్ద నియోజక వర్గ కార్యకర్తలు ఆగ్రహించిన అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోవడానికి పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. మీడియాను మానేజ్‌చేసి తప్పుడు వార్తల ద్వారా, పార్టీ కార్యాలయంలో తప్పుడు రిపోర్టుల ద్వారా వాస్తవాలను వక్రీకరించడం, పార్టీలో లేని వ్యక్తులతో పార్టీలో బాధ్యత గల నాయకులు కొందరు గూడుపుఠాణీ చేసిన పద్ధతులు నా మనసును తీవ్రంగా నొప్పించాయి. ఆచార్య రంగా, చౌదరి చరణ్‌సింగ్‌ల స్ఫూర్తితో రాజకీయాలలో కొనసాగుతూ వచ్చిన నేను కుల-మతాలతో, ధనిక-పేద తారతమ్యం లేకుండా నీతి-నిజాయితీతో నిర్విరామంగా ప్రజా సంక్షేమం కొరకు, సమాజ ప్రగతి కొరకు ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా నేను సల్పిన కృషికి గౌరవం లభించలేదు. నిగర్విగా, నిరాడంబరతతో తోటి మంత్రులు, ప్రజా ప్రతినిధులతో వైరుధ్యాలకు తావులేకుండా వ్యవహరించితే అది అసమర్థతగా భావించబడింది. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే తట్టుకొనే శక్తి నాకు లేదు.

ప్రజా సంక్షేమం కోసం, సమాజ ప్రగతికోసం సల్పిన కృషిని ప్రక్కన పెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకు, వ్యక్తుల మధ్య అనవసరమైన ఈర్ష్యా ద్వేషాలకు అధిక ప్రాధాన్యత యివ్వబడుతున్న ఈ నాటి రాజకీయాల్లో నేను కొనసాగటం కష్టమని భావించి నేనే స్వచ్ఛందముగా క్రియాశీల రాజకీయాల నుండి వైదొలగాలని భావించాను. నా ఆరోగ్య పరిస్థితి కూడా యిందుకు దోహదం చేసింది.

విద్యార్థి దశనుండి నాకు అత్యంత ప్రీతిపాత్రమైన రైతాంగ శ్రేయస్సు కొరకు, నాకు తెలిసిన సమాచారమును నా రైతు సోదరులకు సదస్సులు, సమావేశములు, వ్యాసముల ద్వారా తెలియపరుస్తూ పల్లెసీమలు సౌభాగ్యవంతమై గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆత్మ విశ్వాసంతో వ్యవసాయం లాభదాయక వృత్తిగా రూపొందుటకు నా వంతు కృషి అది ఎంత కొద్దిమేరకైనా కొనసాగించదలచుకొన్నానని తెలియపరచుకొంటున్నాను.

మీ గ్రామములో/ప్రాంతములో కొన్ని ప్రజా సమస్యలను నా దృష్టికి తెచ్చి వాటి పరిష్కార సాధనలో నాకు తోడ్పాటు నందించిన మీకు నా కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నాను.

ఇంతకాలం మీరందిస్తూ వచ్చిన సహాయ సహకారములు నాపట్ల చూపిన ఆదరాభిమానములకు మరొక పర్యాయం నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేసుకుంటూ భగవంతుడు మీకు, మీ కుటుంబ సభ్యులందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

భవదీయ మిత్రుడు

మ॥రా॥శ్రీ ..

వడ్డే శోభనాద్రీశ్వర రావు

గ్రామము ..

(వడ్డే శోభనాద్రీశ్వర రావు)

మండలము .. ..

అనుబంధం – 1-1

వడ్డే శోభనాద్రీశ్వరరావు
మాజీ పార్లమెంటు సభ్యులు
మాజీ వ్యవసాయ శాఖామాత్యులు

వుయ్యూరు : 08676 - 233333
కిచ్చెన బండి : 08397 - 270099
హైదరాబాద్ : 040 - 30956249
మొబైల్ · 9392959999

ప్రియమైన శ్రీ.........................................................

నమస్తే, మీరు మీ కుటుంబ సభ్యులందరు కుశలమని ఆశిస్తున్నాను. గత 33 సంవత్సరాల ప్రజాజీవనంలో అత్యధిక సమయం నేను నిర్వర్తించిన బాధ్యతలకే వెచ్చించిన విషయం మీకు తెలిసినదే. వుయ్యూరు శాసన సభ్యునిగా ఎనమల కుదురు నుండి పులిగడ్డ వరకు కృష్ణా నది ఎడమ కరకట్ట అభివృద్ధి ఆవశ్యకతను గుర్తింప జేసి నాటి జిల్లా కలెక్టర్ శ్రీ ఎ.వి.యస్. రెడ్డి సహకారంతో ఆ పనిని ప్రారంభింప చేశాను. పలు గ్రామాల్లో వంతెనలు, రహదార్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించాను. 1978 - 1983 వరకు శాసన సభలో పలు రైతాంగ సమస్యలను సభ దృష్టికి తెచ్చిన ప్రసంగాలను " ఆంధ్ర రైతు ఆవేదన ", " దగాపడ్డ ఆంధ్ర రైతు " పుస్తక రూపంలో ప్రజలకు అందించాను. చెరుకు రైతులకు కొనుగోలు పన్ను నుండి అదనపు ధరను యిప్పించడానికి కృషి చేశాను.

విజయవాడ పార్లమెంటు సభ్యునిగా ఎనిమిది మరియు పదవ లోకసభలో అనేక కీలక అంశాలపై ప్రజల వాణిని వినిపించి, ఆ ప్రసంగాలను " ప్రజల ఎదురుతెన్నులు - పాలకుల తీరు తెన్నులు " మరియు " రైతువాణి " పుస్తకముల రూపంలో అందించాను. నియోజక వర్గ ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరింపజేశాను. థర్మల్ విద్యుత్ కేంద్ర ఉద్యోగుల ఉత్పాదకతా బహుమానమును ఆదాయపు పన్ను నుండి మినహాయింపు, రైల్వే జూనియర్ కళాశాల ఏర్పాటు , టి.వి. స్టూడియో నిర్మాణం, గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి విద్యా, వైద్య సౌకర్యములు, రహదారులు, త్రాగునీరు, ఎత్తిపోతల పథకములు, పాలకేంద్ర భవనముల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేశాను.

మైలవరం శాసన సభ్యునిగా ఎన్నో దశాబ్దాలుగా అపరిష్కృతంగా వున్న తారకరామ ఎత్తిపోతల పథకం, మైలవరం మంచినీటి పథకం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనములు, పాఠశాల భవనములు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, మంచినీటి టాంకుల నిర్మాణం, రహదార్లు, వంతెనలు, క్రీడాప్రాంగణ ఏర్పాటు, చెక్‌డ్యామ్‌లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్రమ పాఠశాల భవనం నిర్మాణం, డిగ్రీ కళాశాల ఏర్పాటు, షాదీఖానాల నిర్మాణం, కొండపల్లి ఖిల్లా అభివృద్ధి, పార్కుల ఏర్పాటు, ట్రక్ టెర్మినల్ ఏర్పాటు, చెరువుల పూడిక తీత, మార్కెట్ యార్డ్ అభివృద్ధి, గోదాముల నిర్మాణం, పత్తి సాంకేతిక సంస్థ ఏర్పాటు, పంచాయితీ భవనముల నిర్మాణం వంటి ఎన్నో కార్యక్రమాలను సుమారు రూ. 150 కోట్ల అంచనాలతో అమలు చేయించాననే సంతృప్తి వుంది.

రైతుబజార్ల వ్యవస్థ ఏర్పాటు, 22 జిల్లాల్లో భూస్వభావ చిత్ర పటములు, వ్యవసాయ విస్తరణను పటిష్ట పరచేందుకు ఖాళీల భర్తీ, సబ్సిడీ పై విత్తనాల పంపిణీ, వ్యవసాయంలో జీవన ఎరువులు మరియు పచ్చిరొట్ట

ఎరువుల ప్రాధాన్యతను రైతులకు తెలియజేయడం, క్షేత్ర పాఠశాలల నిర్వహణ, రైతుమిత్ర టి.వి. కార్యక్రమం వంటి పథకాల ద్వారా రైతాంగానికి సేవలందించినా, వరుసగా నాలుగు సం॥ ల కరువు వలన రైతాంగం తీవ్రమైన కష్టనష్టాలకు లోనవడం బాధను మిగిల్చింది.

ప్రస్తుతం ఎక్కువ సమయం కృష్ణా జిల్లా పుయ్యూరులోని నా స్వగృహమునందు ప్రశాంత జీవనం గడుపుచున్నాను. 1994 సం॥ లో కర్ణాటక రాష్ట్రం, బళ్లారిజిల్లా హగరి బొమ్మన హళ్ళి తాలూకా కిచ్చన బండి గ్రామంలో కొన్న 50 ఎకరముల మామిడి తోట అభివృద్ధికై కొంత సమయం వెచ్చిస్తున్నాను. అప్పటి శాసన సభ ఎన్నికల తరుణంలో స్వర్గీయ ఎన్టీరామారావు గారు అభ్యర్థుల ఎంపికలో శ్రీమతి లక్ష్మీపార్వతి, ఇద్దరు అల్లుళ్ల జోక్యం సరిగాదని బహిరంగంగా నా అభిప్రాయమును వ్యక్తం చేయడం మీకు గుర్తుండే వుంటుంది. నేను బాల్యం నుండి కాంగ్రెస్ వ్యతిరేకిని, కావున ఎన్టిఆర్ ఆగ్రహాని గురై రాజకీయాల నుండి నిష్క్రమించే పరిస్థితి ఉత్పన్నమైతే స్వగ్రామమునకు సుదూరంగా నాకు ప్రీతిపాత్రమైన వ్యవసాయములో ప్రశాంతంగా గడుపవలెననే ఉద్దేశ్యంతో అప్పటికే నాలుగు సం॥ ల వయస్సు కలిగిన మామిడి తోటను కొనుగోలు చేయడం జరిగింది. బళ్ళారి జిల్లా కూడా అనంతపురం జిల్లా వలె వర్షాభావ ప్రాంతం. భూగర్భ జలాల లభ్యత తగ్గుతూ వుంది. గత నాలుగు సం॥లుగా అక్కడ కూడా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు వున్నాయి. ఈ సం॥ వాతావరణం పరవాలేదు.

మీరు గతంలో నాపట్ల చూపిన ప్రేమ, అభిమానం, అందించిన సహాయసహకారమును ఎన్నటికీ మరువలేను. నా రాజకీయ గురువులు ఆచార్య ఎన్.జి. రంగా, చౌదరి చరణ్ సింగ్ ల బాటలో మీ అందరి మద్దతుతో ఎన్ని ఆర్థికపరమైన ఒడిదుడుకులు ఎదురైనప్పటికి ఎటువంటి మచ్చలేని నీతివంతమైన రాజకీయ జీవితం గడిపాను. సమకాలీన సమాజంలో రాజకీయులందరూ అవినీతి పరులనే అపోహ వుంది. తోటి రైతుబిడ్డగా రైతువాణిని చట్టసభల్లో వినిపిస్తాననే అభిమానంతో నానుండి ఎటువంటి స్వార్థప్రయోజనాలను ఆశించకుండా నేను పోటీ చేసిన ప్రతి సందర్భంలో సహకారమును అందించిన మీకు ఈ వాస్తవం తెలియపరచడం ధర్మంగా భావిస్తున్నాను. మీ వంటి స్నేహితులు, బంధువులు, అభిమానులు, కార్యకర్తలు తెలియజేసిన న్యాయమైన సమస్యలకు నా చేతనైన మేరకు సహకారము అందించాను. కార్యభారము - సమయాభావం భావం వలన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా గడపలేక పోయినందుకు అన్యధా భావించవలదని కోరుతున్నాను. అంతే తప్ప ఎవరి పట్ల నిర్లక్ష్య భావంతో వ్యవహరించలేదని తెలియజేస్తున్నాను. వ్యవసాయ రంగమునకు సంబంధించి సమాచారమును, సమస్యల పై మీతో అభిప్రాయములను పంచుకోవడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధమే. అదేవిధంగా నాకు తెలియజేస్తే మీ సుఃదుఖాల్లో కూడా పాలు పంచుకుంటాను.

మీ కుటుంబ సభ్యులందరిని భగవంతుడు అన్ని విధాల చక్కగా చూడాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

" నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో "

ఇట్లు
మీ మిత్రుడు
వడ్డే శోభనాద్రీశ్వరరావు
(వడ్డే శోభనాద్రీశ్వరరావు)



# సైద్ధాంతిక నిబద్ధత గల రాజకీయవేత్త

**– ఈనాడు దినపత్రిక (ఆదివారం ఏప్రిల్ 21, 1996)**

స్వార్థమే పరమార్థమైన సమకాలీన రాజకీయరంగంలో సామాజిక స్పృహ, సేవాభావంతో పనిచేస్తున్న అతికొద్దిమంది రాజకీయవాదుల్లో వడ్డే శోభనాద్రీశ్వరరావు ఒకరు. రాజకీయస్పృహ కలిగిన నాటినుంచి కాంగ్రెస్ వ్యతిరేకి. తాను నమ్మిన సిద్ధాంతాలపట్ల ఎలాంటి రాజీలేకుండా రాజకీయాల్లో తనదైన ఒక పంథా ఆయన ఏర్పరచుకున్నారు. స్వయానా రైతు. రైతు సమస్యలపట్ల వాస్తవిక దృక్పథం, రైతు సమస్యల పరిష్కారానికి స్పష్టమైన అవగాహన ఆయనకు ఉన్నాయి. గూండాలు, మాఫియాలు, రిగ్గింగ్, పోలింగ్‌బూత్‌ల ఆక్రమణ, సారా ప్రవాహాలు, ధనబలం, కండబలం, పైరవీలు, పదవులు రాజకీయంగా చెలామణి అవుతున్న ఈ రోజుల్లో సిద్ధాంత రాజకీయాలనే ఆయన నమ్ముకున్నారు. కులాభిమానం, ప్రాంతీయాభిమానం వంటి దురభిమానాలతో విద్యావంతులు సైతం రౌడీల్లోనే తమ రాజకీయ హీరోలను చూస్తున్న నేపథ్యంలో వడ్డే ఒక ప్రత్యామ్నాయంగా నిలిచారు. ఆచార్య రంగా పార్లమెంటులో ఉంటే రైతు వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టాలంటే నెహ్రూ భయపడేవారట. నేడు పార్లమెంటులో ఆచార్య

రంగా వంటి నాయకులు లేనిలోటు తీర్చలేనిదే. రంగా ఆలోచనా విధానాన్ని వదలకుండా అనేక రైతాంగ సమస్యలపై వడ్డే అత్యున్నత చట్టసభలో అనేకమార్లు గళమెత్తారు. "భారతదేశం పల్లెల్లో జీవిస్తోంది. మన పల్లెల జీవితం వ్యవసాయం. వ్యవసాయరంగం బావుంటేనే ఈ దేశం ప్రగతి సాధిస్తుంది'' అన్న చౌధురీ చరణ్‌సింగ్ తాత్విక చింతన శోభనాద్రీశ్వరరావును బాగా ఆకర్షించింది. ఫలితం లోక్‌దళ్ నాయకుడిగా, జనతాపార్టీ నాయకుడిగా వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రజలకు పరిచయమయ్యారు. రాష్ట్ర శాసనసభలో ఆయన చేసిన ప్రసంగాలన్నింటినీ 'ఆంధ్రరైతు ఆవేదన', 'దగాపడ్డ ఆంధ్రరైతు' అనే రెండు పుస్తకాలుగా ప్రచురించారు. ఆ తర్వాత పార్లమెంటులో చేసిన ప్రసంగాలను 'ప్రజల ఎదురుతెన్నులు–పాలకుల తీరుతెన్నులు' పేరుతో మరోపుస్తకంగా ప్రచురించారు. ఈ ప్రయత్నాలతో ఆయన మార్గం అందరికీ అర్థమవుతోంది.

వరి, పొగాకు, చెరకు వంటి పంటల సమస్యలపై అవగాహన, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలు, రాష్ట్రంలో నదీజలాల సమస్య, పెండింగ్ ప్రాజెక్టులు, గాట్ ఒప్పందం ఇలా అనేక అంశాలపై అధ్యయనం చేసిన పార్లమెంటేరియన్‌గా వడ్డే శోభనాద్రీశ్వరరావు పేరు తెచ్చుకున్నారు. తండ్రి లేకపోవడంతో అమ్మగారి ఊరైన కృష్ణాజిల్లా కలవపాములలో తాతగారి వద్ద పెరిగిన వడ్డే స్కూల్లో చదివేరోజుల్లోనే ఆనాటి కాంగ్రెస్ నాయకుడు కాకాని వెంకటరత్నాన్ని వ్యతిరేకించి తనతోపాటే కాంగ్రెస్ వ్యతిరేకతనుకూడా పెంచుకున్నారు. 1962కల్లా గుడివాడలో బిఎస్‌సి పూర్తిచేసి బెంగుళూరులో ఇంజనీరింగ్‌లో చేరారు. 1962లో వివాహం చేసుకున్నప్పటికీ విద్య నాశనం చేసుకోకుండా ఇంజనీరింగ్ పూర్తిచేశారు. 1972 అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణాజిల్లా ఉయ్యూరు నియోజకవర్గంనుంచి ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు కాకాని వెంకటరత్నంపై పోటీచేయడంతో ఎన్నికల రాజకీయాల అరంగేట్రం చేశారు. ఆనాడు కాకానిపై 7 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. జై ఆంధ్రా ఉద్యమం, ఎమర్జెన్సీ, జయప్రకాష్ నారాయణ్ ఆందోళన వడ్డేకు రాజకీయ పాఠశాలలుగా మారాయి. 1975 జూన్ ఆరున జయప్రకాష్ ఆధ్వర్యంలో ఢిల్లీలో సాగిన పెద్ద ర్యాలీలో పాల్గొనడం ఒక అర్హతగా ఆయన భావిస్తారు. 1978లో ఉయ్యూరు నియోజకవర్గం నుంచి జనతాపార్టీ అభ్యర్థిగా ఎన్నికై మొదటిసారిగా ఆయన రాష్ట్ర శాసనసభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత జనతాపార్టీ చీలిపోగా వడ్డే శోభనాద్రీశ్వరరావు లోక్‌దళ్‌లో ఉండిపోయారు.

రాజకీయంగా చైతన్యవంతమైన కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాల్లో

చురుకైన పాత్ర నిర్వహిస్తూ, సీనియర్ నాయకులు సుంకర సత్యనారాయణ, గౌతు లచ్చన్నతో పనిచేస్తూవుండేవారు. ఆలిండియా లోక్‌దళ్‌తో విభేదించి ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్ ఏర్పాటైంది. ఆ పార్టీ తరఫున 1983 అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డే శోభనాద్రీశ్వరరావు ఉయ్యూరు నుంచి పోటీచేసి ఓడిపోయారు. చదువుకునే రోజుల్లోనే స్వతంత్రపార్టీ అభిమానిగా ఉండే వడ్డే 1962లో బెంగుళూరులో ఇంజనీరింగ్ చదివే రోజుల్లోనే ఆనాటి ఎన్నికలకోసం రూ. 500లను ఆయన పార్టీకి విరాళంగా పంపించారు. ఆనాటి నుంచి 1983 ఎన్నికల వరకు ఆయన సాగించిన ఎన్నికల రాజకీయాలకు ఉయ్యూరులో తమకున్న 11 ఎకరాల పొలం కరగిపోయింది. 1983 జనవరి 14న ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్‌ను రద్దుచేసి సుంకర సత్యనారాయణతో కలసి వడ్డే శోభనాద్రీశ్వరరావుకూడా తెలుగుదేశంలో చేరిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రభంజనంగా ఆవిర్భవించి కాంగ్రెస్‌కు ధీటైన ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం ముందుకురావడం వల్ల తన కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలకు విఘాతం కలగదని భావించి ఆయన తెలుగుదేశంలో చేరారు. 1983 వరకు సాగిన ఆయన రాజకీయజీవితం ఒకెత్తయితే, ఆ తర్వాత తెలుగుదేశం రాజకీయాలు మరో ఎత్తు. 1984 పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా విజయవాడ నియోజకవర్గంనుంచి ఎన్నికై పంచె, చొక్కా ధరించిన అచ్చమైన ఆంధ్రరైతుగా వడ్డే శోభనాద్రీశ్వరరావు లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆనాడు 8వ లోక్‌సభలో తెలుగుదేశంపార్టీ ఉపనాయకుడిగా ఉండేవారు. 1989 ఎన్నికల్లో రెండోసారి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా విజయవాడనుంచి పోటీచేసి ఓడిపోయారు. మూడోసారి 1991లో పోటీచేసి గెలుపొందారు.

రాజకీయాల్లో తాను నమ్మిన విలువలను ఆయన ఏనాడూ పణంగా పెట్టలేదు. తన వైఖరివల్ల తెలుగుదేశంపార్టీలో ఆయన కొన్ని కష్టాలు ఎదుర్కొన్నారు. ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలోకూడా ఆయన నమ్మిన విలువలకే ప్రాధాన్యం ఇచ్చేవారు. అభ్యర్థుల ఎంపికలో అధిష్టానవర్గం కొన్ని సందర్భాల్లో రాజీపడినప్పుడు ఆయన మాత్రం ఎంపికకు దూరంగా ఉండిపోయారు. దీనివల్ల పార్టీలో కొంత విమర్శ, వ్యతిరేకత, అధిష్టానవర్గం ఆగ్రహానికికూడా గురయ్యారు. 1994 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలుగుదేశంపార్టీ ఆగస్టు సంక్షోభంలో రెండుగా చీలిపోతే వడ్డే శోభనాద్రీశ్వరరావు నారా చంద్రబాబునాయుడు పక్షం నిలచి ఆనాటినుంచి ఆయనతో కలసి పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభలో తెలుగుదేశంపక్షం నాయకుడిగావున్న వడ్డే 11వ

లోక్‌సభ ఎన్నికల్లో 4వసారి విజయవాడనుంచి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో నిలిచారు. పార్టీలో ఆటుపోట్లకు తట్టుకుంటూనే తన విధానాలు, ఆదర్శాలు కొందరికి కష్టం కలిగించినా తాను మాత్రం ఎవరికీ నష్టం కలిగించకుండా వివాదరహితుడుగానే ఆయన తన రాజకీయప్రయాణం సాగిస్తున్నారు. 'ఆలోచనల్లో గానీ పోరాట పటిమలోగానీ మెత్తబడని 52 ఏళ్ల యువకుడు వడ్డే' అని ఆయనను బాగా ఎరిగినవారు వ్యాఖ్యానిస్తూవుంటారు.

భూమ్మీద ఏ ఒక్క వ్యక్తి పరిపూర్ణుడు కాడు. మహానాయకులకే విమర్శలు తప్పలేదు. రాజకీయాల్లో ఉన్నప్పుడు పట్టువిడుపులు అవసరం. అయితే అవి వడ్డేకి లేవని ఆయనకు బాగా సన్నిహితులు అంటారు. "లౌక్యం తెలీదు. తన చుట్టూవున్నవారి సలహాలు తీసుకుంటారు. వారు చెప్పేవి నమ్మేస్తారుతప్ప అందులో నిజానిజాలు ఎంత అన్న విషయంపై శ్రద్ధ చూపరు. ఒక రాజకీయపార్టీలో ఉన్నప్పుడు మొండితనం ఉంటే ఎలా? పార్టీలో మంచి చెడు రెండూ ఉంటాయి" అని వడ్డే గురించి బాగా ఎరిగిన సీనియర్లు వ్యాఖ్యానిస్తుంటారు. 1991 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధిష్టానంతో విభేదాలు వచ్చినప్పుడు ఆయన ఎన్నికలరంగాన్ని వదలి ఢిల్లీ వెళ్ళికూర్చున్నారనేది పార్టీలో ఆయనపై సాగిన విమర్శ. ఆ దశలో ఆయన అసలు రాజకీయాలనుంచే వైదొలగుదామనుకున్నారని, ఆ తర్వాత పార్టీ చీలికతో మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. పార్టీపరంగా ఇలాంటి చిక్కులు కొన్ని ఎదుర్కొన్నప్పటికీ రెండుసార్లు విజయవాడ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వడ్డే శోభనాద్రీశ్వరరావు నియోజకవర్గంలోని మొత్తం 460 గ్రామాల్లో వ్యక్తిగతంగా సంబంధాలు ఏర్పరచుకోగలిగారు. తనను ఎరగని గ్రామం లేదన్నది ఆయన ఆస్తిగా భావిస్తారు.

❖❖❖



లోంగోవాల్ మరణించిన సందర్భంగా వి.పి. సింగ్, చతురానంద్ మిశ్రా, లల్లూలతో



డి.ఎమ్.డి.కె. నాయకుడు వై. గోపాలస్వామితో




ఎ.ఎన్.ఆర్. కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా



ఎ.ఎన్.ఆర్. కళాశాలలో ఫౌండర్స్ డే సందర్భంగా




చంద్రబాబు నాయుడు, వాషింగ్టన్ ఇఫ్రీ సురేష్ బాబు, జానయ్యలతో




మంటాడ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సింహాద్రి, కైకాల, అన్నేలతో



కమ్మ విద్యార్థి సహాయ సంస్థ కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు, రాజయ్య, పద్మనాభరావు, కృష్ణారావు, ప్రభాస్, గౌరంగ బాబులతో



సన్నిహితులు కె.ఎస్. బోస్, సుధాకర్, కాట్రగడ్డ బాబులతో




గన్‌మెన్‌లు సాంబశివరావు, రాజులతో



# నేను - నా కుటుంబం

నా భార్య శ్రీమతి బసవరాజ్యం 'సహధర్మచారిణి' అనే పదానికి సజీవ నిదర్శనంగా, యాభై వసంతాల మా దాంపత్యాన్ని ఒక మధుర స్వప్నంగా తీర్చిదిద్దింది. గత 30 సంవత్సరాల నా రాజకీయ జీవితంలో మా ఇంటికి ప్రతిరోజూ, అన్ని సమయాల్లోనూ వచ్చే అనేకమంది సందర్శకులకు, అతిథులకు తన శక్తికి మించిన శ్రమకు లోనవుతూకూడా, ఏ క్షణంలోనూ విసుక్కోకుండా




అందరికీ ఆత్మీయంగా ఆతిథ్యం అందిస్తూ, నేను కొన్ని వేలమంది ప్రేమాభిమానాల్ని పొందడానికి కారణమయ్యింది. నా రాజకీయ జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎన్నడూ కించిత్తు అభద్రతా భావనకు లోనుకాకుండా, భవిష్యత్తును గురించి ఏమాత్రం ఆందోళన చెందకుండా, ఏమీ కూడబెట్టలేకపోయామని, వారసత్వంగా వచ్చిన ఆస్తులను కూడా నిలుపుకోలేకపోయామన్న నిస్పృహకు గురికాకుండా నా రాజకీయ జీవితాన్ని నిర్మలంగా, నిష్కళంకంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రత్యక్షంగా,





పరోక్షంగా సహకరించింది. నిరంతరం అంకితభావంతో నాకు అన్నీ సమకూర్చిపెడుతూ నేను ప్రజలకు అంకితభావంతో పనిచేయడానికి నా భార్య శ్రీమతి బసవరాజ్యం వీలుకల్పించింది. నీతి, నిజాయితీలతో నిర్విరామంగా ప్రజాసేవ చేయుగల్గటానికి ఆవిడ అందించిన సహకారం సాటిలేనిది.

మా కుమార్తె కొడాలి వెంకటలక్ష్మి అన్నపూర్ణగానీ, మా అల్లుడు కొడాలి మల్లికార్జునరావు (మల్లిబాబు) గానీ, మా కుమారుడు వెంకట అంకినీడు ప్రసాద్‌గానీ, కోడలు శ్రీవిద్య గాని నా విధి నిర్వహణలో ఏనాడూ జోక్యం చేసుకోలేదు. తాతగారి










నుండి నాకు సంక్రమించిన భూమిలో సగాన్ని అమ్మినా ఏనాడు వ్యతిరేకించడంగానీ, నన్ను విమర్శించడంగానీ చేసి ఉండలేదు.

2003 అక్టోబర్ 21న విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీ ఆడిటోరియంలో నా షష్టిపూర్తి ఉత్సవం జరిగింది. ఆ కార్యక్రమం నా జీవితంలో మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. నా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాకు అన్నివిధాలా అండదండలు అందించినవారు, మంత్రులు, ఎమ్.పి.లు, ఎమ్.ఎల్.ఏ.లు, అసంఖ్యాకమైన ప్రజాసమస్యలమీద, మౌలిక సదుపాయాల















కల్పనలో నానుంచి సహకారం పొందినవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అతి పెద్దదైన ఆ ఆడిటోరియం నిలబడడానికి ఖాళీ లేనంతగా నిండిపోయింది. ఆద్యంతం వందలాదిమంది బొకేనో, పూలదండనో, శాలువానో, జ్ఞాపికనో ఇస్తూ సాగిపోయింది.

నాకు నాలుగు సంవత్సరములు వయస్సు, మా తమ్ముడికి కుటుంబ భాస్కర్ రావునకు రెండు సంవత్సరముల వయస్సులో మా తండ్రిగారు వడ్డే అంకయ్య గారు



స్వర్గస్తులు అవడంతో, మా మాతామహునకు మా అమ్మగారు అన్నపూర్ణమ్మగారు ఒక్కతే సంతానం అవడం వలన మేము కలవపాములలోనే పెరిగాము. నేను 1967లో ఉయ్యూరులో కాపురం పెట్టేవరకు మా చదువుసంధ్యలు మాతామహులే చూస్తూ ఉండేవారు. మా అమ్మగారు మా ఇద్దరిని కళ్లల్లో పెట్టుకుని పెంచింది. మా అమ్మమ్మ నాగేశ్వరమ్మ గారి తల్లి వియ్యమ్మ గారు. భూమి శిస్తు సహాయనిరాకరణ సందర్భంగా భూమిని  కోల్పోయిన యలమంచిలి శోభనాద్రిగారు ఈవిడకు మరిదిగారే.

మా నాయనమ్మ శ్రీరామమ్మ చిన్నపారుపూడి మునసబు కొడాలి వీరభద్రరావు గారి తోబుట్టువ. మా మేనత్త అనసూర్యవతిని మేనమామ కొడాలి గోపాలరావు గారితో వివాహం జరిపారు.  మా తాత వడ్డే శోభనాద్రి గారు గ్రామాలలో తగాదా పరిష్కారాలకో, భార్యభర్తల విభేదాల పరిష్కారాలకో సమయం వెచ్చించుతూ ఉండేవారు.  మాతండ్రి అంకయ్య గారికి వ్యవసాయమంటే అమితమైన ఆసక్తి. మా పెదనాన్న శ్రీరాములు గారు పిల్లల చదువుల గురించి చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఆయనకు పోలీస్ డిపార్టుమెంట్‌లో, మిలటరీలో ఉన్నత స్థాయిలో వున్న వారితో మంచి స్నేహ సంబంధాలు ఉంటూ ఉండేవి.  మా నాన్నగారు చిన్న వయస్సులోనే టి.బి.తో కాలంచేయగా పెదనాన్న గారు గుంటూరులో మోటారు కారు ఎక్సిడెంట్‌లో కాలంచేశారు.



మా తమ్ముడు కుటుంబ భాస్కర్ రావును మాతామహులు దత్తత తీసుకున్నందున కలువపాములో ఉంటూ వ్యవసాయం చూసుకుంటూ ఉంటారు. వ్యవసాయం పట్ల మంచి ఆసక్తి ఉంది.

❖❖❖